

# తొలి పొద్దు

**442 కవుల కవిత్వం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ

సాహితీ చరిత్రలో అధిక సంఖ్యాక కవుల కవితా సంకలనం



తెలంగాణ అమరవీరులకు ...

# తొలి పొద్దు

రాష్ట్ర అవతరణోత్సవాలలో భాగంగా 2015 జూన్ 7వ తేదిన
రవీంద్రభారతిలో నిర్వహింపబడిన తెలంగాణా కవుల కవితా సంకలనం


సంపాదకులు

మామిడి హరికృష్ణ

సలహా మండలి

డా. నందిని సిధారెడ్డి · డా. బుక్కా బాలస్వామి · డా. గంటా జలంధర్ రెడ్డి · షాజహానా
డా. అమ్మంగి వేణుగోపాల్ · డా. నాళేశ్వరం శంకరం · జాజుల గౌరి · అయినంపూడి శ్రీలక్ష్మి





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ

**'TOLI PODDU'** Anthology of poems
*(Recitation of Poems by 442 poets on the eve of Telangana State Formation Celebrations - 2015)*

*Edited by*
**Mamidi Hari Krishna**, *Director*
Department of Language and Culture,
Telangana State.
© Department of Language and Culture

*First Edition*
2015 October
1500 Copies

*Layout & Design*
Barur Vishnu Vardhan Reddy
9985185133


*Publisher*
Department of Language and Culture,
Kalabhavan, Ravindra Bharathi,
Hyderabad.

*Printed at*
Keshava Graphics
Narayanguda, Hyderabad.

*For Copies*
O/o Director, Dept. of Language and Culture,
Kalabhavan, Ravindra Bharathi,
Hyderabad.

---

*Front Cover :* Masks of Cheriyal Paintings by Vaikuntam Naqash



సాగిపోవుటె బ్రతుకు
ఆగిపోవుటె చావు
సాగిపోదలచిన
ఆగరాదిచటెపుడు
ఆగిపోయిన ముందు
సాగనే లేవెపుడు
వేచియుండిన పోను
నోచుకోనే లేవు.
తొలగి తోవెవడిచ్చు
త్రోసుకొని పోవలయు.
బ్రతుకు పోరాటము
పడకు ఆరాటము.
బ్రతకదలచిన పోరు
సుతరాం తప్పదు.
చూపతలచిన జోరు
రేపనుట ఒప్పదు.

- కాళోజీ

*The woods are lovely, dark and deep*
*but I have promises to keep*
*miles to go before I sleep*
*and miles to go before I sleep*

*- Robert Frost*
*( from "Stopping by woods on a snowy evening" )*



# ఇది ప్రజల ఆకాంక్షల డాక్యుమెంట్!

ప్రతీ దేశానికీ ఓ నీతి ఉంటది. ప్రతీ జాతికీ ఓ రీతి ఉంటది. అలాగే తెలంగాణ మట్టికి ఉన్న గొప్ప లక్షణం ఏంటంటే కళలు, సాహిత్యం! తెలంగాణ నేల ఎందరో గొప్ప కవులను, సాహితీవేత్తలను కన్నది... కనుగొన్నది...! అందుకే పధ్నాలుగేళ్ళ మలిదశ ఉద్యమంలో ఏ ఒక్క తెలంగాణా కవి ఊరికెనే లేడు. ఏదో ఒక సందర్భంలో తన ఆవేదనను, నిరసనను, ప్రగాఢకాంక్షను తన కవిత్వంలో రాసాడు. పాఠకులను ఆలోచింపచేసాడు. దీనివల్ల తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సాహితీ, సాంస్కృతిక సైద్ధాంతిక పునాది బలంగా రూపొందగలిగింది. ఇలా తెలంగాణ ఉద్యమానికి మేధోపరమైన ధిక్కారపూరిత స్వరానికి ఆలంబనగా నిలిచినవారు కవులే!

ఇక స్పందించడం మనిషి లక్షణం! స్పందనని అక్షరాల రూపంలోకి తర్జుమా చేసి కవితలుగా రాయడం కవి లక్షణం! తెలంగాణ కవులందరూ ఆ పనే చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో సంభవించిన ప్రతీ ఘట్టాన్నీ, ప్రతీ మలుపునీ తమ కవితలలో రాసారు. ఇంకా చెప్పాలంటే, కొన్నిసార్లు ఆయా ఘట్టాలకి, మలుపులకీ కారణభూతమై నిలిచారు.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం అవతరించి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా, భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణా కవితా వస్తువుగా కవిసమ్మేళనాన్ని నిర్వహించింది. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చిన కవులు/కవయిత్రులు తెలంగాణా మీద తమ ఆకాంక్షలను, ఆశలను కవిత్వ రూపంలో ఈ కవి సమ్మేళనంలో వ్యక్తీకరించారు. దాదాపు 442 మంది కవులతో కవితాగానం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని రవీంద్రభారతి వేదికగా ఏర్పాటు చేసారు. కవి సమ్మేళనాన్ని నిర్వహించడమే కాక, ఆ కవితలతో ఓ పుస్తకాన్ని ముద్రించడం గొప్ప విషయంగానే నేను నమ్ముతున్నాను.

నేనెప్పుడూ అంటుంటాను. తెలంగాణాలో డాక్యుమెంటేషన్ చేయాల్సిన సాహితీ, సాంస్కృతిక కళారూపాలు ఎన్నో ఉన్నాయి అని. వాటన్నింటినీ ఒక్కసారే కాకపోయినా, క్రమక్రమంగా అక్షరాలలో, విజువల్‌గా డాక్యుమెంట్ చేయడం, పుస్తకాలను విస్తృతంగా ప్రింట్ చేయించడం ఇప్పటి చారిత్రక అవసరం!

ఆ అవసరంలోంచి పుట్టిన ఆకారమే ఇపుడు మన చేతుల్లో ఉన్న ఈ 'తొలిపొద్దు' కవితా సంకలనం. నాకు తెలిసి ఇంతమంది కవుల కవితలతో పుస్తకాన్ని తేవడం ఇదే మొదటిసారి అనుకుంటాను. ఒకవేళ అదే నిజమైతే, అలాంటి అరుదైన ఘనతను సాధించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖను అభినందిస్తున్నాను. సంచాలకుడిగా వచ్చిన నాటి నుండి నిత్యం ఏదో ఒక పనితో సాంస్కృతిక కార్యకలాపాలతో గొప్ప చైతన్యాన్ని తెచ్చిన మామిడి హరికృష్ణను నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. గతంలో "కొత్తసాలు" కవితా సంకలనాన్ని, ఇపుడు "తొలిపొద్దు" కవితా సంకలనాన్ని ఇంత సుందరంగా వెలువరించిన హరికృష్ణ, రాబోయే కాలంలో ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహించాలని, డాక్యుమెంటేషన్, పుస్తక ప్రచురణను విస్తృతపరచాలని సూచిస్తూ, కవులు/కవయిత్రులందరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

తేది : 10 అక్టోబరు, 2015

**అజ్మీరా చందూలాల్**
**మంత్రివర్యులు**
**గిరిజన సంక్షేమం, పర్యాటకం, సాంస్కృతిక శాఖ**
**తెలంగాణ ప్రభుత్వం**



# కావ్య ప్రస్థానంలో కొత్త మైలురాయి

**భా**రతీయ సాహిత్యంలో ఒక్కో భాషది ఒక్కోశైలి. "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"గా ప్రశంసించబడిన తెలుగు సాహిత్యానికి కూడా తనదైన ధోరణి, తీరు, ప్రయోగాత్మకత భాషా పరంగా, సాహిత్యపరంగా ఉన్నాయి. ప్రాక్ నన్నయ కాలంలో మౌఖిక సాహితీ ప్రక్రియలలోనూ, ఆ తర్వాత శాసనాలలోనూ ఎన్నెన్నో ప్రత్యేకతలతో అలరారిన తెలుగుభాష నన్నయ రాసిన మహాభారతంతో పూర్తి స్థాయి లిఖిత సాహితీ రూపాన్ని సంతరించుకున్నదనే విషయం మనకు తెలుసు. అయితే తెలుగు భాషలో 'అచ్చ తెనుగు తనాన్ని', ప్రజల భాషని తీసుకొచ్చి తెలుగు భాషకు తెలంగాణా భాష సొగసును అందించిన మహాకవి పాల్కురికి సోమనాథుడే! అలా మొదటి నుంచీ తెలుగు సాహిత్యానికి ఛందోబద్ధమైన పద్యం, ఆ తర్వాత వచన కవిత్వం, సాహితీ ప్రక్రియలుగా భావాభివ్యక్తికి అత్యంత ప్రభావవంతమైన అంశాలుగా అలరారుతున్నాయి. ఇదంతా దాదాపు వెయ్యేళ్ళ ప్రస్థానం.

ఇన్నేళ్ళ కాలంలో కవిత్వం పద్యం నుంచి వచనంలోకి ప్రక్రియా పరంగా పరిణామం చెందుతూ వచ్చింది. రీతి పరంగా, వస్తువు పరంగా అభ్యుదయం, విప్లవం, దిగంబరం, నవ్య సంప్రదాయం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, బహుజన వాదాలుగా ఇంకా మరెన్నో రూపాలను సొంతం చేసుకొని వెళుతోంది. ఈ ప్రస్థానంలో కవులు, వారు సృష్టించిన కవిత్వం ప్రజలలో చైతన్యాన్ని, సరికొత్త భావధారని సృష్టించగలిగాయి. ఈ అన్ని దశలలోనూ తెలంగాణా సాహిత్యం, కవిత్వం, కవులు తమదైన స్వరాన్ని వినిపించడంలో ఎప్పుడు ముందంజలోనే ఉన్నారు.

సాహిత్యం ప్రజాకాంక్షలని ప్రతిబింబిస్తుందా? లేదా ప్రజాకాంక్షలు సాహిత్యాన్ని ప్రభావితం చేస్తాయా? అనే ప్రశ్నలకోణం నుంచి ఆలోచిస్తే, దీని గురించి వివరించడానికి తెలంగాణ ఉద్యమాన్ని మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. దశాబ్దాల కాలం నుండి ఉన్న తెలంగాణ ప్రజల మనోగతాన్ని, జరుగుతున్న, జరిగిన సంఘటనల నేపథ్యంలో సాహితీసృష్టి, కవితాసృష్టి జరగాల్సిన అనివార్య స్థితిని ప్రజాఉద్యమం నిర్దేశించింది. ఉద్యమం విషయంలో కవుల స్పందన, సంవేదన ప్రజా ఉద్యమాన్ని మరింత ఉరకలెత్తించాయి. అలా తెలంగాణా ప్రజా ఉద్యమం అనన్య సామాన్యమైన కవితా సృష్టికి, కావ్య ప్రచురణలకు దారులు వేసింది.

ఆత్మగౌరవంతో బతకడం... అస్తిత్వ స్పృహతో మెలగడం తెలంగాణావాడి జీవనాడి. "మీ తెలంగాణాలో కవులు ఉన్నారా?" అనే ఒక్క ప్రశ్నకు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు గోల్కొండ కవుల ప్రత్యేక సంచికలో 354 మంది కవుల కవిత్వాన్ని సంకలనం చేసి సమాధానాన్ని చెప్పి, ఆధిపత్య, భావజాల .... అహంకారాన్ని అణగదొక్కారనేది సాహితీ చరిత్ర చెప్తున్న సత్యం. ఈ అనూహ్య అద్భుతానికి తెలంగాణా భావధార కారణం.

ఇక తెలుగు కవిత్వంలో వివిధ రకాల శైలీ సంప్రదాయాలు, వస్తు వైవిధ్యత, ప్రక్రియా విశిష్టతలతో ఎన్నెన్నో సంకలనాలు వచ్చాయి. అని ప్రధానంగా మనకు రెండు రకాలుగా కనిపిస్తాయి.

(1) ఒకే కవికి చెందిన సంపుటాలు (వేర్వేరు కవితలు, వస్తువులతో)

(2) వివిధ కవుల కవితలను ఒక్కచోట చేర్చిన సంకలనాలు (వస్తువులో ఏక సూత్రత కలిగినవి)

మొదటి కోవకు చెందిన సంపుటాలు, ఆయా కాలాలలో, ఆయా సందర్భాలలో, ఆయా సంఘటనలకు సంబంధించిన ఒక కవి స్పందనలను, ఆలోచనా వ్యూహాలను తెలియపరుస్తాయి. అంటే ఒక్క స్వరంలోని భిన్న రాగాలను ఇవి అందిస్తాయన్నమాట.

రెండో కోవకు చెందిన సంకలనాలు నిర్దిష్ట ప్రయోజనాన్ని ఆయా సంఘటనలకు సంబంధించి భిన్న స్వరాలలోని ఏకత్వ భావనని వెల్లడిస్తాయి.

ఈ రెండు రకాలకు చెందిన కవితా సంకలనాలను ఇటీవలి కాలంలో తెలుగు సాహితీ క్షేత్రంలో ఇబ్బడి ముబ్బడిగా పండించిన ఘనత మాత్రం తెలంగాణా ప్రజా ఉద్యమానిదే.. తెలంగాణా ప్రత్యేకరాష్ట్ర ఏర్పాటు కాంక్షలోని బహుకోణాలని వ్యక్తులుగాను, సమిష్టిగాను కవులు ఎన్నో సంకలనాలను తెచ్చారు. ఉద్యమకాంక్షని మరింత బలోపేతం చేసారు.

తెలంగాణ రాష్ట్రం సాకారమైన తర్వాత, తెలంగాణావాదాన్నే వేదంగా భావించి రేపటి ఆశల తెలంగాణాపై వచ్చిన కవితా సంకలనాలలో ఈసారి వ్యక్తులు, సంస్థల కన్నా ప్రభుత్వమే అధికంగా చొరవ తీసుకోవడం తెలంగాణా సమాజానికి శుభ సంకేతం. సాహితీ, సాంస్కృతిక కళారూపాల విశిష్టత గుర్తెరిగిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి కవిత్వం మీద ఉన్న మక్కువ. భాషా సాంస్కృతిక శాఖ ఆ దిశగా కార్యాచరణ చేసేందుకు పురికొల్పింది. దానిలోంచి మన్మథనామ ఉగాది కవిసమ్మేళన కవిత్వం 'కొత్తసాలు'గా జూన్ 2015లో పుస్తకంగా వచ్చింది. తాజాగా ఇప్పుడు మనముందు ఈ 'తొలిపొద్దు' సాక్షాత్కరించింది.

తెలంగాణా రాష్ట్ర అవతరణ ఉత్సవాలను రాష్ట్రమంతటా జూన్ 2 నుండి 7 వరకు వైభవంగా జరుపుకున్న తరుణంలో 400 మంది కవుల కవితాగానం' పేరిట తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ దాదాపు 14 గంటల పాటు నిర్విరామ కవితా పఠనాన్ని నిర్వహించడం కవిత్వ ప్రస్థానంలో ఓ చరిత్రాత్మక ఘట్టం. దానిని అంతటితోనే వదిలివేయకుండా, 442 కవుల కవితాగానానికి పుస్తకరూపం కల్పించి, ఇంత చక్కగా, అందంగా, కళాత్మకంగా పదికాలాలపాటు నిలిచేలా రూపొందించిన సంచాలకులు, ఈ 'తొలిపొద్దు'కు సంపాదకులు చిరంజీవి మామిడి హరికృష్ణను తెలుగు సాహితీ ప్రేమికులందరూ అభినందించాలి. కీ.శే.సురవరం ప్రతాపరెడ్డి గారి సంకలనం తర్వాత బహుశా ఈ 'తొలిపొద్దు'నే అతిపెద్ద సంకలనం అనుకుంటాను. ఆ మాటకొస్తే వెయ్యేళ్ళ తెలుగు కవితా చరిత్రలోనే ఇది అత్యధిక కవుల కవిత్వ సంకలనం అని భావిస్తాను.

ఇలాంటి అరుదైన, అద్భుతమైన, అనన్యసామాన్యమైన కవితా స్వప్నాన్ని నిజం చేసి, ఒక కొత్త మైలురాయిని తెలుగుసాహితీ రహదారిపై నిలిపిన కవులని, కవయిత్రులని, సహకరించిన సలహామండలి నిపుణులని అభినందిస్తూ...

హైద్రాబాద్
10-10-2015

**డా. కె.వి. రమణ**, ఐ.ఎ.ఎస్.(రి)
**ప్రభుత్వ సలహాదారు**
**దేవాదాయ, యువజనాభ్యుదయం,**
**పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ**
**తెలంగాణ ప్రభుత్వం**



# కొత్త సాహిత్యానికి 'తొలిపొద్దు'

తెలంగాణగడ్డ జానపదానికి పెట్టని కోట... కళలకు కొంగు బంగారం... సంస్కృతికి నిలువుటద్దం... పాటకు నిఖార్సైన బాట... కవిత్వానికి నిజమైన పట్టుకొమ్మ...

అందుకే గత 60 ఏండ్లుగా వలస పాలకులు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్నెన్ని ఎత్తుగడలు వేసినా తెలంగాణా పాట ఆగలేదు... తెలంగాణా కవిత్వం అణగలేదు.... తెలంగాణా కళలు వెనక్కి తగ్గలేదు....

ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం జరిగిన ప్రజాపోరులో పాట ప్రజలని ఉత్తేజపరిచింది... కవిత్వం చైతన్య పరిచింది... కళలు ముందుకు నడిపించాయి. అందుకే తెలంగాణా ఉద్యమం సాంస్కృతిక ఉద్యమంగా ఉప్పెనలా ఎగసి, ఉధృతమై కురిసి, ఎందరో యువతీయువకుల, అమరవీరుల ఆకాంక్షల స్ఫూర్తితో సకల జనుల సమిష్టి ప్రయత్నంతో తెలంగాణా కల నెరవేరింది.

ఈ నెరవేరిన స్వప్నానికి పునాదిగా నిలిచింది కవిత్వమే..! రాష్ట్ర అవతరణ తర్వాత 'బంగారు తెలంగాణా' సాధించే దిశగా మార్గ నిర్దేశం చేసే కొత్త బాధ్యతను ఇప్పుడు తీసుకొన్నది కూడా కవిత్వమే!! అలాంటి కవిత్వానికి నిలువెత్తు సంతకాలైన కవుల కవితలతో తెలంగాణ భాషా సాంస్కృతిశాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ చేసిన ఈ ప్రయత్నం తెలుగు సాహితీలోకంలోనే 'తొలిపొద్దు' అని అనుకుంటూ ఉన్నాను.

నేను సిద్దిపేటలో ఎంతో మంది కవుల కవితలను చదువుతూ వారితో తిరుగుతూ పెరిగినవాణ్నే...! కవిత్వాన్ని చదువుతూ స్వయంగా నేను కూడా పాటలు రాశాను. ప్రజాకళాకారుడిగా ఎదగడానికి నాకు ఉత్సాహాన్నిచ్చింది కవులే.... అలాంటి కవులందరూ గొప్ప వారే!

తెలంగాణా ఉద్యమాన్ని, ప్రజల ఆకాంక్షలని సామాన్య ప్రజానీకంలోకి తీసుకెళ్ళడంలో పాట బాటలు వేసింది. తెలంగాణ స్ఫూర్తిని మేధావుల, విద్యార్థుల గుండెల్లోకి తీస్కెళ్ళడంలో కవిత్వం ఎంతో ప్రభావవంతమైన పాత్రను పోషించింది. దీనికి అచ్చమైన ఉదాహరణగా ఈ కవితా సంకలనం నిలుస్తుంది.

మహాకవి దాశరథి చెప్పినట్లు 'గాయ పడిన కవి గుండెలలోని' ఆవేదనకు, ఆకాంక్షలకు ఈ సంకలనం అద్దం పట్టేలా ఉందనడంలో సందేహం లేదు.

సాధారణంగా వందమందితో కవితా సంకలనం అంటేనే గొప్ప అనిపిస్తది. అలాంటిది నాలుగు వందల మందికి పైగా కవుల కవితలతో ఈ 'తొలిపొద్దు' పొడవటం తెలుగు సాహిత్యంలోనే ఓ గొప్ప సంఘటనగా భావిస్తూ, కవులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

తేది : 10 అక్టోబరు, 2015

**రసమయి బాలకిషన్**
**ఛైర్మన్, సాంస్కృతిక సారథి**



# ప్రజల ఆకాంక్షలకు అద్దం

‘కళ కళ కోసమా, ప్రజల కోసమా’ అనే ప్రశ్న ప్రపంచం మొత్తం మీద ఉన్న అన్ని రకాల సాహితీ, సాంస్కృతిక అంశాలని తిరగరాసిన ప్రశ్న అని మనకు తెలుసు. అలాగే కవిత్వం, సాహిత్యం కవులు, మేధావుల కోసమా లేక అత్యధిక సంఖ్యాకులైన సామాన్యుల కోసమా అనే ప్రశ్న కూడా అంతర్జాతీయంగా అన్ని భాషలలోనూ గొప్ప మార్పును తీసుకువచ్చింది. ప్రజాస్వామ్య యుగంలో, ప్రజలే ప్రభువులు అయిన భారతదేశం లాంటి దేశాలలో కవిత్వం, సాహిత్యానికి ప్రేరణ, వస్తువు, కేంద్రము ప్రజలు, ప్రజల ఆకాంక్షలు, ప్రజల అభిప్రాయాలే అవుతాయని చెప్పవచ్చు.

అలాంటి ప్రజాస్వామిక కవిత్వం తెలంగాణా ఉద్యమం నేపథ్యంగా తెలుగులో విస్తృతంగా వచ్చింది. తెలుగు కవితా ప్రస్థానంలో వచ్చిన అన్ని రకాల సాహితీ ప్రక్రియలు, ధోరణులు, శైలీ సంప్రదాయాలు అన్నీ ప్రాచీన కాలంలో రాజులు, చక్రవర్తుల మనోభీష్టాలకి అనుగుణంగా రూపొందాయి. ఆధునిక కాలంలో మాత్రం కవి సామాన్యుల కోసం తన అక్షరాలని సైన్యంలాగా మోహరించాడు. మనుషులు ఆత్మగౌరవంతో హుందాగా జీవించే సమాజం వైపుగా తన కవిత్వాన్ని రచించాడు. అలాంటి కవిత్వాన్ని ప్రజలు తాము సొంతం చేసుకున్నారు. ఆ కవులను తమ గుండెల్లో ప్రతిష్ఠించుకున్నారు. వారి కవిత్వం కాలాలకు, తరాలకు అతీతంగా జీవిస్తూ ఉంది.

మరి కవిత్వం సజీవతత్వంతో, చైతన్యంతో, నిత్యం మనలో ఏదో ఒక సానుకూల ఆలోచనకి స్ఫూర్తిగా నిలుస్తుంది. అంటే కవిత్వం యొక్క ప్రయోజనం, ప్రజలను మార్పు దిశగా నడిపించినపుడు మాత్రమే నెరవేరుతుంది. ఇది చరిత్ర సాక్షిగా నిరూపించబడింది. దీనికి ఉదాహరణే స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారతీయ భాషలలో వచ్చిన కవిత్వం అని చెప్పాలి. ఒక్క ‘వందేమాతరం’, ఒక్క “జనగణమన” గీతం ఎన్నో వైరుధ్యాలున్న భారత జాతిని ఎలా సంఘటితం చేస్తూ వచ్చాయో, స్వాతంత్ర్యసాధనకు ఎంత కీలకంగా మారినాయో మనం గమనించాం. కవిత్వానికి, అక్షరానికి ఉండే శక్తి, ప్రయోజనం, పరమార్థం అది. ప్రజాకవి కాళోజీ తనది ‘అక్షరాధికారం’ అని అన్నది కూడా అందుకే.

తెలంగాణా రాష్ట్రం అవతరించిన తర్వాత, అంతకుముందు కూడా తెలంగాణాలో కవులెందరో తమ కవితలతో ప్రజల ‘గోస’ను తమ ‘గోస’గా చెప్పడమే కాదు, కర్తవ్య నిర్వహణ దిశగా వెళ్ళడం కోసం కావలసిన చైతన్యాన్ని కూడా అందించారు. రాష్ట్ర అవతరణ అనంతరం, ఈ కవులతో తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ కవి సమ్మేళనం నిర్వహించి, వారి కవిత్వాన్ని ఇపుడు పుస్తక రూపంలోకి తేవడం రేపటి కాలానికి ఒక మంచి రికార్డుగానూ, డాక్యుమెంటేషన్‌గానూ, ఉంటుందనడంలో సందేహం లేదు. అంతేగాక, ఇంత విస్తృత సంఖ్యలో 440పైగా కవులు ఈ ‘తొలిపొద్దు’ యజ్ఞంలో పాల్గొని “తెలంగాణా-కవుల ఖజానా” అని నిరూపించడం సంతోషకరం. దీన్ని నిరూపించడానికి ప్రయత్నించిన సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణని, కవులు, కవయిత్రులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**బుర్రా వెంకటేశం**, ఐ.ఏ.ఎస్.

తేది : 10 అక్టోబరు, 2015

**ప్రభుత్వ కార్యదర్శి**

**యువజనాభ్యుదయం, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ**



# ఒక్క తెలంగాణా -442 కోణాలు !

'I don't just record a dry history of events and facts, I am writing a history of human feelings' *-Svetlana Alexievich*

**2**015 సంవత్సరపు నోబెల్ సాహిత్య బహుమతిని సాధించిన బెలారష్యన్ రచయిత్రి చెప్పినట్లు, ఇప్పుడు అక్షరాలలో అక్షరాలా నమోదు చేయాల్సింది మానవుల భావోద్వేగాలనే! ఒక దుఃఖం, ఒక విషాదం, ఒక పోగొట్టుకున్న తనం, ఒక విధ్వంసం, ఒక తండ్లాట, ఒక పోరాటం, ఒక శూన్యం.... ఇలా జీవితంలోని, జీవనంలోని ఒకానొక అసంపూర్ణతని, దాని నుండి పుట్టిన భావోద్వేగాలని, నిట్టూర్పులని, నిర్లిప్తతలని, నిరాశలని, నిర్జీవత్వాన్ని ఉపమాన-ఉపమేయ దృష్టాంత అతిశయోక్త్యాది అలంకార రహితంగా, ఉన్నదున్నట్లుగా వాక్యాలలో పొదగాల్సిన తరుణమిది. ఇపుడు రియాలిటి అలంకారంతో పదాలకు పదును పెట్టాల్సిన సమయమిది. దీనికి Svetlana రాసిన "War's Unwomanly Face" (1985). "The last witnesses : The book of unchildlike stories", "Voices from Chernobyle" వంటి కాల్పనికేతర రచనలే ఉదాహరణలుగా నిలుస్తాయని ఇపుడు చాలా మంది సాహితీవేత్తలు చెప్తున్నారు. అయితే సృజనశీలత అనే సౌధానికి పునాది కాల్పనికత అని ఇంతకాలం చెప్పుకుంటూ వచ్చాం. కానీ ఈనాటి ప్రపంచావసరం నేటి ప్రపంచపు ఫీలింగ్స్ మరోలా ఉన్నాయి. వాటిని నమోదు చెయ్యాలి... ఈ పనిని మొదటి నుంచీ తెలంగాణా కవిత్వం నెరవేరుస్తుంది. మహాకవి దాశరథి అన్నట్లు "సముద్రగర్భంలో దాగిన బడబానలాన్ని, నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులని" తెలంగాణ కవిత్వం నెత్తికెత్తుకుంది.

అయితే "There is not a Particle of life which does not bear poetry within it" అని ఫ్రెంచ్ నవలా రచయిత Gustave Flaubert అన్నట్లు కవిత్వం లేని జీవితం లేదు.... మరో మాటలో చెప్పాలంటే దుఃఖం వచ్చినా కవిత్వమే... దూపైనా కవిత్వమే... దున్నేటప్పుడు, దుమ్ముదులిపేటపుడు, దూరాలు పయనించేటపుడు వెల్లువలా తన్నుకొచ్చిందికూడా కవిత్వమే! మరి ఇంతగా జీవితాలతో మమేకమైన కవిత్వం తెలంగాణాలో ఎలా ఉంది?

తెలుగు సాహిత్యం లిఖితరూపంలోకి వచ్చిన నాటి నుండి లోతుగా పరిశీలిస్తే తెలంగాణా సాహిత్యం మనిషి భావోద్వేగాలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ పోయిందని అర్థం అవుతుంది. శివ కవి యుగం నాటి పాల్కురికి సోమనాథుని రచనలలో కనిపించే ధిక్కారం, విధేయత, పోరాటం అన్నీ ఆయా కావ్యాలలో ప్రతిబింబితమయ్యాయి. అదే ఒరవడి తొలిదశ, మలిదశ, తెలంగాణ ఉద్యమ కాలంలో వచ్చిన కవిత్వంలో మనకు కన్పిస్తుంది. ఇంకా చెప్పాలంటే తెలంగాణలో కవిత్వం 14-ఎఫ్ మిలియన్ మార్చ్, సాగరహారం, సకల జనుల సమ్మె, 6-పాయింట్ ఫార్ములా వంటి ఎన్నో చారిత్రాత్మక సంఘటనల చుట్టూ అల్లుకున్న తెలంగాణ ప్రజల భావోద్వేగాలను అక్షరాలు అక్షరాలుగా రికార్డు చేసింది. "I turned silences and nights into words. What was unutterable, I wrote down. I made the whirling world stand still" అని చెప్పిన Arthur Rimbaud చెప్పిన మాటలకి సాక్షీ భూతంగా నిలిచింది. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే కవితా రచన మొదలుపెట్టి తన 20వ ఏటనే కవితా రచనకి పూర్తిగా స్వస్తి పలికి Symbolists ú Dadaistes ú Surrealists నీ ప్రభావితం చేసిన ఈ కవి మాటలని స్ఫురణకి తెచ్చుకునేలా చేసింది.

"Resist much, obey little" అని Walt Whitman తన "Leaves of Grass" లో ఒకచోట అంటారు. అస్తిత్వానికి ఆత్మ గౌరవానికి భంగం కలిగిస్తున్న శక్తులపై ధిక్కారంగా మొదలైన తెలంగాణా ఉద్యమంలో అన్ని వర్గాలు, తరాలు, స్థాయిల ప్రజల సహకారం ఎంత ఉందో కవుల పాత్రకూడా అంతే ఉంది అని చెప్పాలి, పత్రికలోని సాహితీ పేజీల ద్వారా, తమ కవిత్వ సంకలనాల ద్వారా, కవి సమ్మేళనాల ద్వారా, ఎప్పటికప్పుడు తెలంగాణకు జరిగిన, జరుగుతున్న అన్యాయం గురించి ఆ అన్యాయాన్ని ఎదుర్కోవలసిన ఆవశ్యకత గురించి కవితలు రాసి ప్రజలను జాగృతం చేశారు. అది చివరికి రాష్ట్ర ఏర్పాటు సాధనకు దోహదం చేసి, ఆరు దశాబ్దాల స్వప్నం సాకారమైంది. ప్రజల కల నెర వేరింది.

తెలంగాణ రాష్ట్ర తొలి అవతరణ ఉత్సవాలు జూన్ 2 నుంచి జూన్ 7, 2015 వరకు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా జరపాలని, అన్ని రకాల సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఒక పండుగ వాతావరణంలో వేడుకలు జరపాలని నిర్ణయించడంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి కవిత్వం పట్ల మక్కువ ఉండటం వల్ల కవి సమ్మేళనం కూడా జరపాలని ప్రత్యేకంగా ఆదేశించడం జరిగింది. ప్రభుత్వ సంకల్పాన్ని అనుసరించి తెలంగాణ భాషా సాంస్కృ తిక శాఖ ఏడు రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని మండల, జిల్లా కేంద్రాలలోను, రాజధాని నగరంలోని దాదాపు 32 వేదికల మీద (చౌమహల్లా ప్యాలెస్ నుండి శిల్ప కళా

వేదిక వరకు) రకరకాల సాంస్కృతిక, సాహితీ, కళాప్రదర్శనలు, కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. వీటితో పాటు జూన్ 7, 2015 నాడు రవీంద్రభారతిలో కవి సమ్మేళనం జరపాలని నిశ్చయించటం జరిగింది.

కవి సమ్మేళనం సరే, మరి దానిని ఒకింత విశిష్టంగా, ప్రత్యేకంగా ఎలా జరపాలని ఆలోచించి, రాష్ట్ర అవతరణ తొలి వేడుకల సందర్భంగా ఆ ఒక్క రోజుకు మాత్రమే కాక, పది కాలాలపాటు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ భావించింది. ఎన్నెన్నో ఆలోచలు, సమాలోచనల తర్వాత కవి సమ్మేళనంలో మారథాన్ చెయ్యాలని, దీనికి సాధ్యమైనంత అధిక సంఖ్యలో కవులను రప్పించాలని, కవితా పఠనం చేయించాలని నిర్ణయించి దానికి '400 మంది కవుల కవితాగానం' అని పేరు పెట్టి రవీంద్రభారతిలో ఈ కవిసమ్మేళన మహోత్సవాన్ని జరపాలని పథక రచన చేసింది.

ఇంత బృహత్కార్యాన్ని సక్రమంగా, సజావుగా నిర్వహించడానికి తెలంగాణా సాహితీలోకంలో ప్రఖ్యాతులైన 8 మంది కవులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. వారు

(1) డా. అమ్మంగి వేణుగోపాల్ (2) డా. నందిని సిధారెడ్డి (3) డా. నాళేశ్వరం శంకరం (4) డా. బుక్కా బాలస్వామి

(5) డా. జలంధర్ రెడ్డి గంటా (6) జాజుల గౌరి (7) డా. షాజహాన (8) అయినంపూడి శ్రీలక్ష్మి

ఈ నిపుణుల కమిటి ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ ఉత్సవాల ఆఖరి రోజైన జూన్ 7, 2015 నాడు ఉదయం 10.30ని॥లకు ప్రభుత్వ సలహాదారులు డా. కె.వి. రమణాచారి గారు ముఖ్య అతిథిగా కవి సమ్మేళనాన్ని ప్రారంభించడం జరిగింది. ఇలా మొదలైన కవిసమ్మేళనం నిరంతరాయంగా రాత్రి 11.30ని॥ల వరకు జరిగింది.

ఇలా పొడిచిన "తొలిపొద్దు" ఎన్నెన్నో విశిష్టతలను సాధించి గతంలో ఎన్నడూ లేని చరిత్రను సృష్టించింది.

1. దాదాపుగా 13 గం॥ల పాటు నిరంతరాయంగా జరిగిన కవిసమ్మేళనం ఇది. దీనికి నేను పెట్టిన పేరు "POETATION" (Poet + Marathon ల కలయిక నుండి )
2. **54 సం॥రాల రవీంద్రభారతి చరిత్రలో మెయిన్‌హాల్లో జరిగిన తొలి కవితా సమ్మేళనం ఇది.** కవి సమ్మేళనాలు, సాహితీ కార్యక్రమాలు సాధారణంగా కాన్ఫరెన్స్ హాల్‌లో జరగటం ఆనవాయితీ. కానీ ఈ చారిత్రాత్మక కవి సమ్మేళనం మెయిన్ హాల్లోను, కాన్ఫరెన్స్ హాల్లోనూ ఏకకాలంలో రెండు వేదికల మీద నిర్వహించటం జరిగింది.
3. ఈ కవి సమ్మేళనంను మొత్తం 13 సెషన్స్‌గా విభజించి, ఒక్కొక్క సెషన్‌కు ఒక కవిని సభాధ్యక్షుడిగా కొనసాగిస్తూ, నిర్వహించడం జరిగింది. అలా ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ, డా. తూర్పు మల్లారెడ్డి, డా. ననుమాస స్వామి, డా. కాసుల ప్రతాప్‌రెడ్డి, జూపాక సుభద్ర, జూలూరి గౌరీశంకర్, డా. గంద్ర లక్ష్మణ్‌రావ్, జాజుల గౌరీ లాంటి వారెందరో సభానిర్వాహకులుగా వ్యవహరించారు.
4. ఈ **తొలిపొద్దు** దాదాపు 1100 సం॥రాల తెలుగు సాహితీ చరిత్రలో అధిక సంఖ్యాక కవుల కవితా సంకలనంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ కవితా సంకలనంలో మొత్తం **442** మంది కవుల కవితలు చోటు చేసుకొని ఈ రికార్డు సుసాధ్యం చేయటం జరిగింది.
5. ఒకే కవితావస్తువుతో వచ్చిన కవితా సంకలనాలలో అతిపెద్ద సంకలనం ఇదే. 'తెలంగాణ' అనే థీమ్ మీదే ఈ తొలిపొద్దులోని కవితలన్నీ ఉండటం విశేషం.
6. **'తొలిపొద్దు'**లో మొత్తం **442** మంది కవుల కవితలు చోటు చేసుకోగా వాటిలో **366** మంది కవులు, **76** మంది కవయిత్రుల కవితలు ఉన్నాయి. ఇది కూడా ఓ అరుదైన రికార్డే -
7. కవితా పక్రియల పరంగా అత్యంత వైవిధ్యమైన, విభిన్నమైన కవితాసంకలనం కూడా ఇదే! ఈ **తొలిపొద్దు** లోని కవితలన్నిటిని ఒకసారి తరచి చూస్తే వస్తువు ఒకటే అయినప్పటికీ పక్రియలు, శైలిలు భిన్నంగా ఉన్న విషయాన్ని గమనించవచ్చు. దీనిలో సంప్రదాయ ఛందోబద్ధమైన కవితా పక్రియ నుండి 'ఫ్యూజన్‌షాయరీ' అనే నవ్య పక్రియ వరకు అన్ని రకాల పక్రియలు చోటు చేసుకున్నాయి.

పైన తెలిపిన విధంగా **'తొలిపొద్దు'** తెలుగు సాహితీ ప్రస్థానంలో ఓ మైలు రాయిగా నిలిచిపోదగిన స్థాయిని సాధించిందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. అయితే ఇంత అనితర సాధ్యము, క్లిష్టమూ అయిన లక్ష్యం నెరవేర్చిన ఘనత భాషా సాంస్కృతిక శాఖదో, సంచాలకుడిదో, నిపుణుల కమిటీదో కాదు...

ఇది తెలంగాణాది! తెలంగాణా కవులది!!

తెలంగాణా రాష్ట్రం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా జరుగుతున్న తొలి వార్షికోత్సవంలో మా స్వరం కూడా వినిపించాలి. మా అక్షరం కూడా పలకాలి అనే సంకల్పంతో రాష్ట్రం నలుమూల నుండి రవీంద్రభారతికి విచ్చేసి కవితా గానం చేసిన కవులందరిది...! ఆ కవులందరిని నడిపించిన తెలంగాణ స్ఫూర్తిది....!

ఇక నన్నయ కాలంలో తెలుగులో లిఖిత సాహిత్యం ప్రారంభమైన కాలం నుండి నేటి వరకు వివిధ సందర్భాలలో ఎన్నెన్నో కవితా సంకలనాలు వచ్చాయి. వాటిని ఈ క్రింది రకాలుగా చెప్పవచ్చు.

(1) కవితా వార్షిక సంకలనాలు

(2) ఒకే కవికి సంబంధించిన వ్యక్తిగత కవితా సంకలనాలు

(3) భిన్న కవుల కవితలతో ఒకే థీమ్‌తో కూడిన కవితా సంకలనాలు

(4) ఆయా కవి సంఘాలు తమ సభ్యుల కవితలతో ప్రచురించిన కవితా సంకలనాలు

(5) జిల్లాస్థాయి ప్రాతిపదికగా ప్రచురించిన కవితా సంకలనాలు

(6) ప్రత్యేక సందర్భం / సంఘటనకు సంబంధించి వివిధ కవుల కవితలతో కూడిన సంకలనాలు.

ఇదే సందర్భంలో తెలుగులో తెలంగాణా అంశంతో గతంలో వచ్చిన కవితా సంకలనాలను గుర్తు తెచ్చుకోవడం అవసరం. తెలంగాణ కవిత, పొక్కిలి, మత్తడి, జాగో జగావో, మునుం, కొత్తసాలు.... ఇంకా మరెన్నో ఈ కోవలో ఉన్నాయి. వీటిలో 'కొత్తసాలు' 'మన్మథనామ ఉగాది ప్రపంచ కవితా దినోత్సవం' సందర్భంగా తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ 21 మార్చి 2015 నాడు రవీంద్రభారతి ఆరుబయట ప్రాంగణంలో నిర్వహించిన కవిసమ్మేళనంలో వివిధ కవులు చదివిన 59 కవితల సంకలనంగా వచ్చింది.

అయితే కవితా సంకలనాలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న రికార్డు 'గోలకొండ కవుల సంచిక'దే అని చెప్పాలి. 81 ఏళ్ళ క్రితం 1934లో ఒక మహనీయుడు తెలంగాణాలో కవులున్నారా? అని వేసిన ప్రశ్నను సవాలుగా తీసుకొని, గోలకొండ పత్రిక సంపాదకుడు, సాహితీవేత్త అయిన సురవరం ప్రతాపరెడ్డి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తెలంగాణాలోని జిల్లా, తాలూకాలన్నీ తిరిగి సేకరించి, 'గోలకొండ కవుల సంచిక' పేరిట 354 మంది తెలంగాణా కవుల కవితలను ప్రచురించి తెలంగాణ ఆత్మగౌరవ బావుటాన్ని ఎగురవేశారు.

ఇదే తెలుగు కవిత్వ చరిత్రలో అతిపెద్ద కవితా సంకలనం. ఈ సంకలనం ఇచ్చిన స్ఫూర్తితో, అది వేసిన బాటలో ఇపుడు తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ 442 కవుల కవితలతో ఈ **'తొలిపొద్దు'**ను తీసుకువచ్చింది. కవిత్వం విషయంలో, సాహితీసేవ విషయంలో తెలంగాణా కవులకున్న నిబద్ధతని, నిజాయితీని మరోసారి నిరూపించింది. తెలంగాణ చుట్టూతా అల్లుకున్న కవుల మనోభావాలను, భావోద్వేగాలను, ఒక్కచోట ఒడిసిపట్టే ప్రయత్నం చేసింది. అందుకే ఈ 'తొలిపొద్దు' సంఖ్యాపరంగా కవుల కవితల విషయంలోనే కాక, ఆయా కవుల ఫీలింగ్స్‌కి వేదికగా మారి వాటిని నమోదు చేయడంలో విజయాన్ని సాధించిందని భావిస్తున్నాను.

అయితే ఇంత బృహత్ సంకలనంలో అన్ని కవితలు సమాన కాంతినే ప్రదర్శిస్తాయా? కవితా వస్తువు-శైలి-ప్రక్రియల పరంగా అన్ని కవితలు అద్భుతాలు సృష్టిస్తాయా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పలేము. కానీ ప్రతీ కవిత వైవిధ్యంగా ఉండి, పదం పదంలో నిజాయితీని ప్రదర్శించిందని చెప్పడంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. ప్రజాకవి కాళోజీ గారు అన్నట్లు

'కవికూడా నేతగాడే

బహుచక్కని సాలెగూడు అల్లువాడే' అని చెప్పిన మాటలకు ఉదాహరణలుగా నిలిచే కవితలే ఇవి అన్నీ అని చెప్పవచ్చు. అలాగే Pablo Neruda తన "100 Love sonnets" లో "I love you simply, without problems or pride. I love you in this way because I do not know any other way of loving but this, in which there is no I or you" అని చెప్పినట్లు కవి-కవిత్వం-తెలంగాణ మూడు మమేకమై ఒక్కటిగా నిలిచిన స్థితికి ఈ కవితలు అక్షరమెత్తు తార్కాణాలుగా ఉన్నాయని చెప్పవచ్చు.

ఇలా **'తొలిపొద్దు'** లోని కవిత్వం, సంఘటనలను రికార్డు చేసే స్థాయిని దాటేసి, ఆ సంఘటనలను అల్లుకొని ఉన్న ఫీలింగ్స్‌ని కవిత్వీకరించే ప్రయత్నం చేసి మన గుండెలని స్పృశిస్తాయని చెప్పవచ్చు.

ఎన్నెన్నో స్వప్నాలకు, మరెన్నో త్యాగాలకు నిలువెత్తు రూపమైన తెలంగాణ రాష్ట్ర అవతరణ తొలి వార్షికోత్సవ కానుకగా ఈ **'తొలిపొద్దు'** ఇలా ఉదయించేలా చేసేందుకు కావలసిన సంకల్పాన్ని, ఆలోచనని ప్రదానం చేసిన గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుగారికి మనసారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా తెలంగాణ భాష, సాహిత్యం, కళలు, కళాకారులు, కళారూపాల పరిరక్షణ, ప్రచారం, ప్రాబల్యం దిశగా నేను వేస్తున్న ప్రతి అడుగులోను నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్న, శ్రీ అజ్మీరా చందూలాల్ మంత్రివర్యులు గారికి, ప్రభుత్వ సలహాదారులు డా. కె.వి. రమణాచారి ఐ.ఎ.యస్ (రి.) గారికి, సాంస్కృతిక సారథి అధ్యక్షులు శ్రీ రసమయి బాలకిషన్ గారికి, ప్రభుత్వ కార్యదర్శి శ్రీ బుర్రా వెంకటేశం ఐ.ఎ.యస్ గారికి కృతజ్ఞతలు

భాషా సాంస్కృతిక శాఖ సిబ్బందికీ, రవీంద్రభారతి సిబ్బందికీ, తమ సూచనలతో కార్యక్రమ విజయానికి దోహదం చేసిన కమిటీ మెంబర్లందరికీ, ఈ మహాయజ్ఞంలో తమ కవితా సమిథలను అందించి యజ్ఞాన్ని దిగ్విజయం చేసిన కవులు, కవయిత్రులకి ఈ పుస్తకంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి వందనాలు...

అన్నిటిని మించి ఇన్ని అద్భుత కవితలకి, నాయకులు, ప్రేరకులు, ప్రధాన కారకులు అయిన తెలంగాణా ప్రజలందరికి ఆత్మగౌరవం కోసం, అస్తిత్వం కోసం వారు చేసిన నిరంతర పోరాటానికి వంద వందనాలు తెలియజేస్తూ...

తేది : 10 అక్టోబరు, 2015

**మామిడి హరికృష్ణ**

**సంచాలకులు**

**భాషా సాంస్కృతిక శాఖ**

# ఇవీ కిరణాలు


| | | | |
|---|---|---|---|
| 1. | అఫ్సర్ | కొన్ని నిమిషాలు | 1 |
| 2. | అనుముల ప్రభాకరాచారి | తెలంగాణ పండుగ ఇది | 2 |
| 3. | అన్వర్ | పోరాటమే కాదు సంబురమూ కావాలి | 3 |
| 4. | అన్నవరం దేవేందర్ | సొగసు | 5 |
| 5. | అన్వేషి | సంబురాలు | 6 |
| 6. | అనిశెట్టి రజిత | కనుపాపల కనురెప్ప కాళోజీ | 7 |
| 7. | అమరవాది కల్యాణ చక్రవర్తి | బతుకమ్మ | 8 |
| 8. | అంబటి నారాయణ | తెలంగాణ పల్లె | 9 |
| 9. | అంబటి వెంకన్న | మంది మాటలు నమ్మితె ఇల్లాగమైతది | 10 |
| 10. | అంబట్ల రవి | ప్రణమిల్లుతున్నది ఈ జగం | 11 |
| 11. | అమ్మంగి కృష్ణారావు | మన తెలంగాణ | 12 |
| 12. | అయినంపూడి శ్రీలక్ష్మి | పోరాట పతాక | 13 |
| 13. | ఆకుల సుష్మ | ఇగురంగా | 14 |
| 14. | ఆడెపు లక్ష్మణ్ | తెల్లంగి | 15 |
| 15. | ఏ. ఆంజనేయ ప్రసాద్ | తెలంగాణ సంబురం | 16 |
| 16. | ఆశారాజు | సరిగ్గా పదకొండు గంటల రాత్రి | 17 |
| 17. | ఎ.బి. జె. సత్యంసాగర్ | పోశమ్మ తల్లి | 18 |
| 18. | ఆనంద్ విరించి | ఎవడురా... ! | 19 |
| 19. | ఏ. జ్యోతి | నా రేపటి తెలంగాణ | 20 |
| 20. | ఎ. సూర్య ప్రకాష్ | మంత్రముగ్ధం! | 21 |
| 21. | ఆచార్య అనుమాండ్ల భూమయ్య | తెలంగాణ తల్లి | 22 |
| 22. | ఆచార్య ఎస్వీ సత్యనారాయణ | సమరగీతం | 23 |
| 23. | ఆచార్య బన్న అయిలయ్య | తొలి అడుగువేసాక | 24 |
| 24. | ఆచార్య సి. నారాయణరెడ్డి | క్రమ పరిణామాలు | 25 |
| 25. | ఆచార్య డి. యం. రవిప్రసాద్ | టాలెంటెడ్ తెలంగాణ | 26 |
| 26. | ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి | ఇంతకన్నా సంబురం యాడుంటది | 27 |
| 27. | ఆచార్య జ్యోతిరాణి | అక్షరాంజలి | 28 |

| | | | |
|---|---|---|---|
| 28. | ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య | నా తెలంగాణా తల్లి | 29 |
| 29. | ఆచార్య మసన చెన్నప్ప | అందుకో దండములు | 31 |
| 30. | ఆచార్య ఎన్.గోపి | మళ్ళీ విత్తనంలోకి | 32 |
| 31. | ఆచార్య ననుమాసస్వామి | తంగేటి పూలలో నా తెలంగాణ | 33 |
| 32. | ఆచార్య పి. లక్ష్మీనారాయణ | భువనగిరి ఖిల్లా | 34 |
| 33. | ఆచార్య రామా చంద్రమౌళి | తెలంగాణా ఇప్పుడు దూసుకుపోతున్న క్షిపణి | 35 |
| 34. | ఆచార్య రావికంటి వసునందన్ | మన తెలంగాణ తల్లి | 36 |
| 35. | ఆచార్య టి. మోహన్‌సింగ్ | పాలమూరు కవిత | 37 |
| 36. | ఆచార్య వెలుదండ నిత్యానందరావు | ఆనందాల హరివిల్లు | 38 |
| 37. | ఆచార్య ఫణీంద్ర | 'ప్రకృతికి' సీమంతము | 39 |
| 38. | బల్లా సరస్వతి | అభివృద్ధి | 40 |
| 39. | బూడిద అరుణ్‌గౌడ్ | తెలంగాణ వెలుగులు విరజిమ్మాలి | 41 |
| 40. | బండారి రాజ్‌కుమార్ | నా తెలంగాణ కోరిక | 42 |
| 41. | బండ అరుణారెడ్డి | విజయోత్సవాల స్ఫూర్తి | 43 |
| 42. | బండి ఉష | తెలం'గానం' | 44 |
| 43. | బి. కళాగోపాల్ | అడవిపూల ఆత్మసౌందర్యం | 45 |
| 44. | బి. నరసింగరావు | రాజర్షి దేహాంతం | 46 |
| 45. | బి. పద్మజ రమణ | ఆనందాలహేల | 47 |
| 46. | బిల్ల మహేందర్ | కొత్త చిగురు | 48 |
| 47. | బి. శ్రీమన్నారాయణచారి | పిడికిలి పొద్దు | 49 |
| 48. | బుర్రా తిరుపతి | పునాసలో అమాస బతుకు | 50 |
| 49. | బి. హరిరమణ | మేధోమథనం | 51 |
| 50. | బి. సత్యనారాయణ | తెలంగాణ ఉద్యమం | 52 |
| 51. | బూర రాజశేఖర్ రావు | పుడమి పుణ్యం | 53 |
| 52. | బూర్ల వెంకటేశ్వర్లు | జయం | 54 |
| 53. | బైరపాక స్వామి | నా తెలంగాణ కోటి కాంతుల వీణ | 56 |
| 54. | బోధనం నర్సిరెడ్డి | గుండెల్ల కొలిమి బుట్టె | 57 |
| 55. | బెంకి రాఘవేందర్ రెడ్డి | మనసు నిండా | 58 |
| 56. | బైరోజు శ్యాంసుందర్ | మగువల వరదాయి | 59 |

| | | | |
|---|---|---|---|
| 57. | బైరోజు చంద్రశేఖర్ | ఆనాటి జ్ఞాపకం | 60 |
| 58. | చరణ్‌దాస్ | కొత్త పొయి | 61 |
| 59. | చిక్కా రామదాసు | ఆకాంక్ష | 63 |
| 60. | చిక్కా శంకర్ | ఆశయమే మన బలం | 64 |
| 61. | చిలివేరి రాజారాం | ధీరుడు | 65 |
| 62. | చైతన్య ప్రకాశ్ | చిత్రం | 66 |
| 63. | సి.హెచ్. ఆంజనేయులు | తెలతెలవారిన తెలంగాణ | 68 |
| 64. | సి.హెచ్. ప్రకాశ్ | గుండెగోస | 69 |
| 65. | సి.హెచ్. మధు | ఇది శత్రువు నవ్వు | 70 |
| 66. | సి.హెచ్. ఉషారాణి | నిర్మల్ బొమ్మల కొలువు | 71 |
| 67. | చిందం ఆశన్న | నా తెలంగాణ | 72 |
| 68. | డప్పోల్ల రమేష్ | సోపతి తీపి గుర్తుల మోపు | 74 |
| 69. | డబ్బికార్ సురేందర్ | ఆత్మగౌరవం | 75 |
| 70. | డా. అగ్రహారం ఛందోజిరావు | ఎప్పట్లాగే అనుకున్నా | 76 |
| 71. | డా. అడువాల సుజాత | ఓ యువతా మేలుకో | 77 |
| 72. | డా. అమ్మంగి వేణుగోపాల్ | క్రాంతదర్శి | 78 |
| 73. | డా. అయాచితం నటేశ్వర శర్మ | తొలి వసంత ఫలం | 79 |
| 74. | డా. ఆర్. కమల | ఇల్లలుకంగనే పండుగ కాదురా! | 80 |
| 75. | డా. కపిలవాయి లింగమూర్తి | తెలంగాణ వైభవం | 81 |
| 76. | డా. కలువకుంట రామకృష్ణ | నేలమీది పూల సింగిడి | 82 |
| 77. | డా. ఎండ్లూరి సుధాకర్ | ఆత్మకథ | 83 |
| 78. | డా. ఎం. పురుషోత్తమాచార్య | రేపటి హరివిల్లు | 84 |
| 79. | డా. ఎ. జయంతి | బుద్ధిగా మసులుకోమంటున్నాం | 85 |
| 80. | డా. ఏనుగు నర్సింహారెడ్డి | గాయం | 86 |
| 81. | డా. కాసుల లింగారెడ్డి | ఇడుపు కాయితం | 87 |
| 82. | డా. కాసర్ల నరేశ్‌రావు | పోరాటం | 88 |
| 83. | డా. కాంచనపల్లి | కల ఇంకా మిగిలే ఉంది | 89 |
| 84. | డా. కూర్మాచలం శంకరస్వామి | కల సాకారమైన వేళ | 90 |
| 85. | డా. కూరెళ్ళ విఠలాచార్య | ఆశంస | 91 |

| | | | |
|---|---|---|---|
| 86. | డా. కె. జ్యోత్స్న ప్రభ | తొలి వేకువ పొద్దులు | 92 |
| 87. | డా. కొమర్రాజు రామలక్ష్మి | మా గుండెల్ల నీవు | 93 |
| 88. | డా. గంటా జలంధర్ రెడ్డి | నేను కలలు కంటున్న తెలంగాణ | 94 |
| 89. | డా. గంద్ర లక్ష్మణరావు | తెలంగాణ హేల! | 95 |
| 90. | డా. గుడికాడి ఆంజనేయులు | బంగారు తెలంగాణ | 97 |
| 91. | డా. చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ | రేపటి తెలంగాణ | 98 |
| 92. | డా. చింతల ప్రవీణ్‌కుమార్ | మరణంలేని మట్టి | 99 |
| 93. | డా. చెమన్ | స్వేచ్ఛా ఖడ్గధారి | 100 |
| 94. | డా. జనువాడ రామస్వామి | అంతరంగం | 101 |
| 95. | డా. జి. నరేందర్ రెడ్డి | తెలంగాణ తల్లి చిగురించిన ఆశ | 102 |
| 96. | డా. జె. బాపురెడ్డి | తెలంగాణ రాష్ట్ర పిత | 104 |
| 97. | డా. టి. గౌరీశంకర్ | బోన్సాయి పాపాయి | 105 |
| 98. | డా. టి.వి. భాస్కరాచార్య | మంచిరోజులు వచ్చాయమ్మా | 106 |
| 99. | డా. తక్కెళ్ళ బాలరాజు | భళారే! | 108 |
| 100. | డా. తాడూరి వెంకట నర్సయ్య | అందరి తెలంగాణ కావాలి | 109 |
| 101. | డా. తూర్పు మల్లారెడ్డి | వి'జయ' శిఖరం | 110 |
| 102. | డా. తిరునగరి | తంగేడు పువ్వంటే | 111 |
| 103. | డా. తిరుమల శ్రీనివాసాచార్య | ఓ తంగేడుపువ్వా! | 112 |
| 104. | డా. తండు కృష్ణ కౌండిన్య | పరమార్థం | 113 |
| 105. | డా. దామెర రాములు | తెలంగాణలో కాశ్మీరయానం | 114 |
| 106. | డా. దేవరాజు మహారాజు | క్షణాల వెంట దిగంతాలకు | 116 |
| 107. | డా. లింగంపల్లి రామచంద్ర | రేపటి తెలంగాణ | 117 |
| 108. | డా. నాళేశ్వరం శంకరం | తొలి తెలుగు జీవనది | 118 |
| 109. | డా. నందిని సిధారెడ్డి | ఊరి నెత్తురు | 119 |
| 110. | డా. నలిమెల భాస్కర్ | గది | 121 |
| 111 | డా. పత్తిపాక మోహన్ | 'యాది'రెడ్డి | 122 |
| 112. | డా. పసునూరి రవీందర్ | పేగు బంధం | 123 |
| 113. | డా. పులిపాటి గురుస్వామి | తీపి తపన | 124 |
| 114. | డా. పిల్లలమర్రి రాములు | మగ్గం | 125 |

115. డా. పి. సరళ — పల్లె తల్లి పసిడి నవ్వులు ..... 126
116. డా. పొరెడ్డి రంగయ్య — అసలు జాడ ..... 127
117. డా. మల్లేశ్ బలాస్తు — తెలంగాణ వెలిగిపోతది ..... 128
118. డా. బాణాల శ్రీనివాసరావు — ఫీనిక్స్ తెలంగాణ ..... 129
119. డా. బుక్కా బాలస్వామి — అమరవీరులకు కవితానీరాజనం ..... 130
120. డా. బండారు సుజాత శేఖర్ — బండ ప్రాణం ..... 131
121. డా. భీంపల్లి శ్రీకాంత్ — ఉద్యమగళం ..... 132
122. డా. బెల్లంకొండ సంపత్‌కుమార్ — కలల కౌగిలి ..... 133
123. డా. బెల్లి యాదయ్య — శాస్త్ర వాక్యం ..... 134
124. డా. బెజుగామ రామమూర్తి — ఒక సాకార స్వాప్నిక సంతకం ..... 135
125. డా. మడికొండ శ్యాంసుందర్ — ధ్యేయం ..... 137
126. డా. మడికొండ ప్రవీణ్‌కుమార్ — స్వేచ్ఛ ..... 138
127. డా. మల్ల అంజయ్య శతావధాని — నా తెలంగాణ ..... 139
128. డా. యస్. చెల్లప్ప — విజయచరిత్ర ..... 141
129. డా. ఎస్. రఘు — పునర్నిర్మాణం ..... 142
130. డా. యం. లక్ష్మణాచార్యులు — జయ్‌బోలో ..... 143
131. డా. పల్లా రత్నాకర్ — సంతోష సంబురాలు ..... 144
132. డా. రాపోలు సుదర్శన్ — ప్రక్షాళన ..... 145
133. డా. రూప్‌కుమార్ డబ్బీకార్ — ఇసుకదారుల్లో వెలుగురేఖలు ..... 146
134 డా. వడ్డేపల్లి కృష్ణ — కవిత-భవిత ..... 147
135. డా. వాణి దేవులపల్లి — మా వూరి చెరువు ..... 148
136. డా. వి.ఆర్. శర్మ — నేల వెన్నెల కాయని ..... 149
137. డా. విప్లవ్ దత్ శుక్లా — ఊరు యాదికొస్తది...! ..... 150
138. డా. వి. శంకర్ — అక్షర సైనికులం కావాలి ..... 151
139. డా. వి. త్రివేణి — తెలంగాణ తొలి కిరణం ..... 152
140. డా. వెలుదండ సత్యనారాయణ — చదువుకోకపోయినా సరే! ..... 153
141 డా. వెల్చాల కొండలరావు — మాటిద్దామా ఈ రోజు? ..... 154
142. డా. వెంకన్నగారి జ్యోతి — బీడు భూముల పూచు తంగేడు పూలు ..... 155
143. డా. శంకరమంచి శ్యాంప్రసాద్ — తెలంగాణ పరిమళం ..... 156

| | | | |
|---|---|---|---|
| 144. | డా. శాస్త్రులు రఘుపతి | అర్థప్రదాయిని | 157 |
| 145. | డా. సమ్మన్న ఈటెల | ప్రగతి కేతనం | 158 |
| 146. | డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి | ఉత్సవం | 159 |
| 147. | డా. సి.హెచ్. ఆంజనేయులు | మా తెలంగాణం మాగ్గావాలి | 160 |
| 148. | డా. యాకూబ్ | శాంతి ప్రవచనం | 161 |
| 149. | డా. యల్లంభట్ల నాగయ్య | చూస్తున్నాం ఆశగా | 162 |
| 150. | డా. దిలావర్ | ముల్కీ | 163 |
| 151. | దాసరాజు రామారావు | మనిషి కళ తప్పిండు | 164 |
| 152. | డి. నిఖిత | ఆకాంక్ష | 165 |
| 153. | డి. రమాదేవి | తెలంగాణ జెండా | 166 |
| 154. | దండ్రె రాజమౌళి | ఆశనే శ్వాసగా | 167 |
| 155 | దార్ల రామచంద్ర | వ్యవసాయమే మనిషి జీవననాదం..! | 168 |
| 156. | దాసరి వెంకటరమణ | బంగారుబాట | 169 |
| 157. | దాసరి రంగ | సర్వం తెలంగాణం | 170 |
| 158. | దాసోజు జ్ఞానేశ్వర్ | రైతులదే తెలంగాణ | 171 |
| 159. | ద్యావరి నరేందర్ రెడ్డి | ఊర చెరువు | 172 |
| 160. | దామరకుంట శంకరయ్య | కావాలి! మారాలి! రావాలి! | 173 |
| 161. | ధాత్రిక సాయి రఘునాథ్ చరణ్ | ఉషస్సు | 174 |
| 162. | దెంచనాల శ్రీనివాస్ | భస్మ సారంగి | 175 |
| 163. | దేవులపల్లి రమేష్ | పువ్వుల మహత్యమది | 177 |
| 164. | దేశపతి శ్రీనివాస్ | తెలంగాణ చెరువు తీరు | 178 |
| 165. | దోరవేటి | తల్లీ! నిన్ను దలంచి మ్రొక్కెదన్ | 179 |
| 166. | ఇరువెంటి వెంకటేశ్వర శర్మ | మన గొంతులు సవరించుకుందాం | 181 |
| 167. | ఇ. వెంకటేశ్ | మౌనం మాట్లాడుతోంది | 182 |
| 168. | ఎడవెల్లి అనిల్‌రెడ్డి | మన చెరువు | 183 |
| 169. | ఎడమ రాంరెడ్డి | ఆశీర్వాద పత్రం | 184 |
| 170. | ఎన్నవెల్లి రాజమౌళి | మన్ను మిన్ను ఏకమె | 185 |
| 171. | ఎలనాగ | అపురూప సామగ్రి | 186 |
| 172. | ఎలుగేటి దేవదాస్ | సుభాషితాలు | 187 |

| | | |
|---|---|---|
| 173. | ఏలేశ్వర నాగభూషణాచార్య | లోతైన జీవితం ........ 188 |
| 174. | ఏలేశ్వరం వెంకటేశ్ | బంధం తెర్లు కావద్దు ........ 190 |
| 175. | ఏనుగు సత్యనారాయణరెడ్డి | తెలంగాణ మహారథం ........ 191 |
| 176. | గడీల సుధాకర్ రెడ్డి | జెజ్జెనకరె జన తెలంగాణ ........ 192 |
| 177. | గజ్జెల శ్రీనివాస్ గౌడ్ | ధూంధాం - తెలంగాణ ........ 194 |
| 178. | గజవెల్లి నర్సయ్య | చొక్కమై అతిశయించే ........ 195 |
| 179. | గన్ను కృష్ణమూర్తి | బాగుండును! బాగుండును! ........ 196 |
| 180. | గరిశకుర్తి శ్యామల | నా తల్లి తెలంగాణ! ........ 197 |
| 181. | గరిశకుర్తి రాజేంద్ర | పర్యావరణ పరిరక్షణ కోసం ........ 198 |
| 182. | గసికంటి సంజీవ | ఆకాంక్షల తెలంగాణ ........ 199 |
| 183. | గాజుల శ్రీధర్ | వర్తమానం ........ 200 |
| 184. | గాజ్‌పూర్ నాగయ్య | తంగేడు పువ్వు ........ 201 |
| 185. | గాదె వెంకటేష్ | కవి - ప్రతిపక్షం ........ 202 |
| 186. | గుడిపల్లి నిరంజన్ | మట్టి స్వప్నం ........ 203 |
| 187. | గురిజాల రామశేషయ్య | విజయ గీతం ........ 204 |
| 188. | గుముడాల చక్రవర్తి గౌడ్ | నవ తెలంగాణ ........ 205 |
| 189. | గోరటి వెంకన్న | పాట ........ 206 |
| 190. | గోర్ల బుచ్చన్న | తెలంగాణొచ్చి ఏడాది ........ 207 |
| 191. | గోపగాని రవీందర్ | బతికించే తెలంగాణ ........ 208 |
| 192. | గోశిక్ నరహరి | నా భాష మంజీరనాదమై ........ 209 |
| 193. | జి. అనసూయ | మనసుకు చికిత్స ........ 210 |
| 194. | జి. అశ్విని | రైతు దుఃఖం ........ 211 |
| 195. | జి.ఆర్. కుర్మే | తెలంగాణ...మరో సింగపూర్! ........ 212 |
| 196. | జి. బాలసరస్వతి | విరిమాలిక ........ 213 |
| 197. | జి. విజయస్వామి | మబ్బులు తొలగిన చంద్రుడు ........ 214 |
| 198. | జి. నర్సింహస్వామి | నాలోకి చూసుకుంటూ... ........ 215 |
| 199. | జి. వెంకటేశ్వర్లు | వాళ్ళ మీద నాకు గురి ........ 216 |
| 200. | ఘనపురం దేవేందర్ | గిట్లజేద్దం ........ 217 |
| 201. | హలావత్ సీత్లానాయక్ | చైతన్యపు జెండా ........ 218 |

| | | | |
|---|---|---|---|
| 202. | హిమజ | సంధికాలం | 219 |
| 203. | ఐతా చంద్రయ్య | వేల సంవత్సరాల వెలుగు | 220 |
| 204. | జనజ్వాల | సంబరాలంటే...! | 221 |
| 205. | జలజం సత్యనారాయణ | వేయి పూలు వికసించనీ! | 222 |
| 206. | జ్వలిత | అవసరమైన ప్రశ్న | 223 |
| 207. | జాజుల గౌరి | చైతన్య తెలంగాణా | 224 |
| 208. | జీవనరాధ | నవప్రస్థానం | 225 |
| 209. | జూకంటి జగన్నాథం | సైబర్ ప్రయాణం | 226 |
| 210. | జూపాక సుభద్ర | దుక్కాల్ని దున్ని పోసుకున్న తొక్కుడు బండ మావ్వ | 227 |
| 211. | జూలూరు గౌరీశంకర్ | నా నేలమీద ప్రవహించవే గోదావరి | 228 |
| 212. | జూపూడి జిగీష | నమో! నమో! నవ తెలంగాణ | 230 |
| 213. | జె. రామకృష్ణరాజు | గజల్ | 231 |
| 214. | జోగు అంజయ్య | ముఖారవిందం | 232 |
| 215. | కనుకుంట్ల వెంకటేశ్వర్లు | బంగారు పన్నె | 233 |
| 216. | కట్టా భగవంతరెడ్డి | యుద్ధం | 234 |
| 217. | కపిలవాయి వెంకటేశ్వర్లు | సంకల్పం | 235 |
| 218. | కసువోజుల రాజేశ్వరి | స్వ తెలంగాణ స్వరం | 236 |
| 219. | కందాళై రాఘవాచార్య | చెరువు పూజ | 237 |
| 220. | కందుకూరి శ్రీరాములు | వ్యవకలనం | 238 |
| 221. | కంకణాల రాజేశ్వర్ | తెలంగాణ వైతాళికులు | 239 |
| 222. | కమలేకర్ నాగేశ్వర్‌రావు | 'విజయ' తెలంగాణ | 240 |
| 223. | కమలేకర్ రామచందర్‌జీ రావు | విజయోత్సవ హారతి | 241 |
| 224. | కమలేకర్ డాగోజీరావు | బంగారు తెలంగాణ | 242 |
| 225. | కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు | తెలంగాణ జయహో! | 243 |
| 226. | కరిపె రాజ్‌కుమార్ | స్మృతిగీతాలు | 244 |
| 227. | కాచాపురం పాపేశ్వర శర్మ | సమైక్యతా గీతం | 245 |
| 228. | కాల్వ వేణుగోపాల్ | వజ్రాల తెలంగాణ | 246 |
| 229. | కారం శంకర్ | మళ్ళీ వసంతంలోకి | 247 |
| 230. | కాసుల ప్రతాపరెడ్డి | ఇలాగే | 248 |

231. కాంచనపల్లి రాజేంద్రరాజు కొన్ని నినాదాలంతే ........ 249
232. కుమ్మరి భిక్షపతి తెలంగాణ ........ 250
233. కూకట్ల తిరుపతి ఎలిమి ........ 251
234. కూజ సుష్మ తెలంగాణం ........ 253
235. కూరపాటి మోహన్ సంబురంతోని కండ్లల్ల నీల్లు రావాలె ........ 254
236. కృష్ణ మణి సీటు మిక్సర్ ........ 256
237. కె.ఎ.ఎల్. సత్యవతి జల్దిన మన కండ్లు జూడాలె ........ 257
238. కె.ఎస్. అనంతాచార్య మహోపకారి ........ 258
239. కె. లక్ష్మణ్‌గౌడ్ తపోయజ్ఞం ........ 259
240. కె. ప్రభాకర్ అస్పష్ట మనోహరుడు ........ 260
241. కె. సిరిచందన మృగత్వం ........ 262
242. కే. విజయ నర్సింహారావు మా ధరణి తెలంగాణ ........ 263
243. కే.వి.యల్. ప్రపంచీకరణ నాగరికత ........ 264
244. కొత్తశంకర్ రెడ్డి జయహో తెలగాణ ........ 265
245. కొల్లాపురం విమల చెరువు ........ 266
246. కొలిపాక శోభారాణి తెలంగాణ కోటి రతనాల వీణ ........ 267
247. కొమరవెల్లి అంజయ్య తవ్వకం ........ 268
248. కోటం చంద్రశేఖర్ ఇదిగో నవలోకం ........ 269
249. కోట్ల వెంకటేశ్వర రెడ్డి ఒక్క అడుగుతోనే ........ 270
250. కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ధీరులకు మొగసాల ........ 271
251. కొండ రవీందర్ కనురెప్పల మాటున ........ 272
252. కొండపర్తి భాస్కరాచారి ఎగతాళి నెదిరించి ........ 273
253. కొండపల్లి నీహారిణి దీపశిఖ ........ 274
254. కొండి మల్లారెడ్డి చెరువుతల్లి........ 275
255. కోడూరి విజయ్‌కుమార్ ఒక ప్రేమలేఖ........ 276
256. లింగాల రాజ సమ్మయ్య సమ్మక్క తెలంగాణ ........ 277
257. లెనిన్ శ్రీనివాస్ రక్తం చిందని యుద్ధ విజయం........ 278
258. మడిపల్లి రాజ్‌కుమార్ మూడోకన్ను మూయొద్దు........ 279
259. మడిపల్లి హరిహరనాథ్ విజయ దుందుభి ........ 280

| | | | |
|---|---|---|---|
| 260. | మడిపల్లి భద్రయ్య | తెలంగాణ వైశిష్ట్యం | 282 |
| 261. | మధుకర్ వైద్యుల | భవిష్యత్ తెలంగాణ | 283 |
| 262. | మద్దికుంట లక్ష్మణ్ | నీటి కళ | 284 |
| 263. | మద్దెర్ల రమేశ్ | వర్ధిల్లు తెలంగాణ | 285 |
| 264. | మల్యాల మనోహరరావు | ఇక బేఫికర్ | 286 |
| 265. | మహ్మద్ కుర్షీద్ పాష | మల్లెలాంటి మనుషులం | 287 |
| 266. | మహ్మద్ ఖాజా మైనద్దీన్ | పునర్నిర్మాణం | 288 |
| 267. | మహమ్మద్ జాబర్ అలీ ఖాన్ | తెలంగాణ గీతం | 289 |
| 268. | మహమూద్ పాషా | ఆహార భద్రత కార్డు | 290 |
| 269. | మహ్మద్ వలి హుస్సేన్ | బాటల వైపు | 291 |
| 270. | మహ్మద్ హనీఫ్ అలీ | రచయిత | 292 |
| 271. | మడికొండ శ్రీనివాసారావు, యమ్. | 'మా ఊరే-ఈ కవులందరి చిరునామా!' | 293 |
| 272. | మరికంటి | తంగెడుపూలు! | 294 |
| 273. | మండల స్వామి | గుండె దరువు | 295 |
| 274. | మందుల పరమాత్మ | ఆత్మల సాక్షిగా | 296 |
| 275. | మణి కె. | నా కల బంగారు తెలంగాణ | 297 |
| 276. | మాడిశెట్టి గోపాల్ | శ్రీకారం చుడదాం | 298 |
| 277. | మామిడి కొండల్ రెడ్డి | నా తెలంగాణ | 299 |
| 278. | మామిడి హరికృష్ణ | ఫ్యూజన్ షాయరీ | 300 |
| 279. | మిట్టపల్లి పరశురాములు | విజయలక్ష్మి | 302 |
| 280. | మియాపురం శ్రీనివాస్ పూడూర్ | రేపటి తెలంగాణ | 303 |
| 281. | మిర్యాల లలిత | అమృత కలశాన్ని అందిద్దాం | 304 |
| 282. | ముక్కెర సంపత్‌కుమార్ | జాతిగీతం | 305 |
| 283. | మునాస వెంకట్ | పూడిక తీస్తే పుత్తడే | 306 |
| 284. | మెర్సీ మార్గరెట్ బోడ | నాన్న నవ్విన నవ్వు | 307 |
| 285. | మొగిలి వెంకట నర్సింహ్మారెడ్డి | బానిస బతుకులు వద్దు | 308 |
| 286. | మొగిలి శ్రీనివాసు | ఐదు | 309 |

287. మొగిలి స్వామిరాజ్ — అగ్రస్థానం ........ 310
288. మోత్కూరి అశోక్‌కుమార్ — నజర్ ........ 311
289. డా. మోత్కూరి మాణిక్యరావు — కవితాంజలి ........ 312
290. మోహన్ రుషి — సాల్ గిరా ముబారక్ ........ 313
291. మౌనశ్రీ మల్లిక్ — సుప్త చేతనత్వం నుండి ........ 314
292. ఎం. జలజారాణి — అమ్మకు నీరాజనం ........ 315
293. యం. శ్రీరాములు — పెరుగుతున్న ముప్పు ........ 316
294. యం. త్రివిక్రమ శర్మ — చిదిమేసినా చిరుప్రాణమా ........ 317
295. నక్క హరికృష్ణ — చిగురించిన చెట్టు తంగేటి చెట్టు ........ 318
296. నరాల సుధాకర్ — నైటింగేల్ ........ 319
297. నాగరాజు రామస్వామి — స్వర్ణ తెలంగాణ ........ 320
298. నాగారం వనిత — రైతు బ్రతుకు ........ 321
299. నాగవరం బాల్‌రాం — ఆశల ఇంద్రధనస్సు ........ 322
300. నన్నపురాజు విజయశ్రీ — అన్నయ్య ........ 323
301. నందిగామ నిర్మల కుమారి — అనుబంధం ........ 324
302. నామని సుజనాదేవి — ప్రభంజనం ........ 325
303. నారాయణస్వామి — బిడ్డలాలా ........ 326
304. నాంపల్లి సుజాత — మలినం ........ 327
305. ఎన్. నరసింహశర్మ — సింహగర్జన ........ 328
306. నిసార్ — చెరువులు - కుంటలు ........ 329
307. నిఖిలేశ్వర్ — కోల్పోయిన వాటి గురించి..! ........ 330
308. నెల్లుట్ల రమాదేవి — మీరే... ........ 331
309. నేరోజు రమేష్ — తెలంగాణ తొలి కర్తవ్యం ........ 332
310. ఎన్వీ రఘువీర్ ప్రతాప్ — విజయధ్వజం ........ 333
311. ఎన్. హరిప్రియా గిరిధర్ రావు — తెలంగాణ మధురఫలం ........ 334
312. ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ — నీటి జ్ఞాపకం ........ 335
313. ఓదెల వెంకటేశ్వర్లు — పచ్చని చెట్లు ........ 336

| | | | |
|---|---|---|---|
| 314. | ఓరుగంటి పురుషోత్తం | గర్జిస్తుండాలే | 337 |
| 315. | పట్టాల అశోక్ | తెలంగాణ సంస్కృతి చిహ్నాలు | 338 |
| 316. | పడాల రామారావు | హృదయం తిరగబడ్డది | 339 |
| 317. | పరమాత్మ | తంగెడు పూ కల | 340 |
| 318. | పర్కపెల్లి యాదగిరి | నవశిశువు | 341 |
| 319. | పలస వెంకటేశ్వర్లు | నా తెలంగాణ | 342 |
| 320. | పల్లి నల్లనయ్య | మంగలోళ్ళు | 343 |
| 321. | పిట్టల రవీందర్ | గోదావరి నదీలోయలో | 344 |
| 322. | పంజాల ఐలయ్య | తండేడు పూలు నవ్వులు విరజిల్లాయి | 345 |
| 323. | పిన్నంశెట్టి కిషన్ | తొలిపొద్దు పొడిచింది! పెనుచీకటి వదిలింది!! | 346 |
| 324. | పి. జగన్ మోహనరావు | తెలంగాణ చంద్రుని వెలుగులు | 347 |
| 325. | పి. పద్మ | కోటి నోముల బతకమ్మ | 348 |
| 326. | పున్న అంజయ్య | చేయూత | 349 |
| 327. | పులి జమున | తెలంగాణ నిత్య వసంతమై నిలవాలి | 350 |
| 328. | పెరుమాళ్ళ ఆనంద్ | ఇక ఆత్మ నిబ్బరమే | 351 |
| 329. | పెద్దూరి వెంకటదాసు | బ్రహ్మరథం | 352 |
| 330. | పెందోట వెంకటేశ్వర్లు | ఇక భవిత మనదే | 353 |
| 331. | పొట్లపల్లి శ్రీనివాసరావు | మానవీయ సంబురం | 354 |
| 332. | పొద్దుటూరి మాధవీలత | తడియారని జ్ఞాపకం | 355 |
| 333. | పోతన జ్యోతి | శిరసెత్తిన తెలంగాణం | 356 |
| 334. | పొన్నాల బాలయ్య | వైద్యం | 357 |
| 335. | పొన్నం రాజయ్య గౌడ్ | భాగ్యనగరం | 358 |
| 336. | పొన్నం రవిచంద్ర | దీవించవే దయతో | 359 |
| 337. | ఆర్. విద్యాసాగర్ రావు | మీరు పెద్దవారు | 360 |
| 338. | ఆర్. చెన్నయ్య | బతుకమ్మ పాట | 361 |
| 339. | రమాదేవి దేశ్‌ముఖ్ | రేపటి తెలంగాణ భవిష్యత్ | 362 |
| 340. | రమావత్ దస్రునాయక్ | బంగారు తెలంగాణ అవుతుంది | 363 |

| | | | |
|---|---|---|---|
| 341. | రవీణ చవాన్ | దశావతారం మా తెలంగాణా | 364 |
| 342. | రాజీవ | నువ్వొచ్చినావే! | 366 |
| 343. | రుద్రారం శ్రీనివాస్‌రెడ్డి | తంగేడుపువ్వు | 367 |
| 344. | రాంచందర్ భీంవంశీ | చెరసాల విముక్తి | 368 |
| 345. | రాజారాం ప్రకాశ్ | నేడే తెలంగాణ | 369 |
| 346. | రామాచారి బంగారు | ఆత్మలను అమ్ముకున్న వారు | 370 |
| 347. | రామడుగు నర్సింహాచార్యులు | తెలంగాణ రాష్ట్ర జెండా ప్రార్థన | 371 |
| 348. | రామానుజం సుజాత | రేపటి ఆవిష్కరణం | 372 |
| 349. | రేడియమ్ | వార్షికాభినందన | 373 |
| 350. | రేళ్ల శ్రీనివాస్ | మన తెలంగాణ | 374 |
| 351. | ఎస్. వేణుశ్రీ | ఎదురు నిలువు | 375 |
| 352. | యస్.పి. అన్నపూర్ణ | తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం | 376 |
| 353. | శారదా హన్మాండ్లు | బతుకు పుస్తకం | 377 |
| 354. | శిక గణేష్ | ఆ గాజులు మాకొద్దు | 378 |
| 355. | శ్రీపెరంబుదూరు నారాయణ రావు | జై తెలంగాణా శుభమస్తు | 379 |
| 356. | శ్రీనివాసు గద్దపాటి | కలవడ్డది | 380 |
| 357. | శేషం సుప్రసన్నాచార్యులు | తెలంగాణ రోడ్లు | 381 |
| 358. | శ్రీరామోజు హరగోపాల్ | ఐదు | 382 |
| 359. | సతీష్ అట్ల | ప్రగతిబాట పడదాం! | 383 |
| 360. | సబ్బని లక్ష్మీనారాయణ | జయహో తెలంగాణ జయజయహో తెలంగాణ | 384 |
| 361. | 'సమతశ్రీ' వల్లాల పరంధామ్ యాదవ్ | బంగారు తెలంగాణకు...! | 385 |
| 362. | సస్యశ్రీ | తెలంగాణ సూర్యుడు | 386 |
| 363. | సహచరి | స్వేచ్ఛాగీతం | 387 |
| 364. | సామ లక్ష్మారెడ్డి | తెలంగాణ చరిత | 388 |
| 365. | శ్రీరాములు | వీర కొమరం | 389 |
| 366. | సిద్దగౌని సుదర్శన్ | బంగారు తంగేడు | 390 |
| 367. | సిద్ధార్థ | నిద్ర కాంతి | 391 |

368. సిద్దినబోయిన వెంకట్ యాదవ్ పాలపిట్ట ........ 392
369. సిద్దెంకి యాదగిరి గెలిచిన కల ........ 393
370. సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గళమెపుడూ........ 394
371. సీతారాం డాక్టరు బాబు ........ 395
372. సుజాత ముదిరాజ్ ఆకాంక్ష........ 396
373. సుతారపు వెంకట నారాయణ చెరువు ........ 397
374. సుదర్శన రెడ్డి కట్టా ప్రేమ దీవెన (గజల్)........ 398
375. సుప్పని సత్యనారాయణ మాతృవందనం ........ 399
376. సుంకర రమేష్ గడప గడపకు గంగమ్మ........ 400
377. సూక్తిసాగర్ (సందాపురం బిచ్చయ్య) ప్రార్థన ........ 402
378. సూరారం శంకర్ కొత్తయుద్ధం ........ 403
379. సొన్నాయిల కృష్ణవేణి బంగారు తెలంగాణ........ 404
380. సంకెపల్లి నాగేంద్రశర్మ ఇయ్యాలటి తెలంగాణా! ........ 405
381. సంతపురి నారాయణరావు పట్టిందల్లా బంగారం కావాలె !........ 407
382. సంపటం దుర్గాప్రసాదరావు జయరథం........ 408
383. సృజామి బంగారు బ్రతుకమ్మ........ 409
384. సై్కబాబా ఐ........ 410
385. షాజహానా అలీఫ్ బే తే ........ 411
386. టి. నరేష్ తెలంగాణ........ 412
387. టి. లక్ష్మీ నారాయణ నేను కోరుకుంటున్న రేపటి తెలంగాణ ........ 413
388. టింగిరికార్ వెంకటేష్ జై తెలంగాణ........ 414
389. తాయమ్మ కరుణ బోనమెత్తాలి ........ 415
390. తాళ్ళూరి రాధ నవ తెలంగాణం........ 416
391. తిరుమల శ్రీనివాస్ ఆర్య పాకురు బండ ........ 417
392. తిరునగరి దేవకీ దేవి అభినవ ప్రసవ వేదన ........ 418
393. తిరునగరి సంధ్య బంగారు తెలంగాణ........ 419
394. సుజాత బండారి స్వప్నలోకం ........ 420

| | | | |
|---|---|---|---|
| 395. | తుడిమిళ్ళ భీష్మాచారి | తల్లీ నీకొందనం తెలంగాణ తల్లీ నీకొందనం | 421 |
| 396. | తెలంగాణ రమేష్‌బాబు | ఉద్యమ చంద్రుడు | 422 |
| 397. | తెలిదేవర భానుమూర్తి | లాపతా | 423 |
| 398. | తోడిశెట్టి పరమేశ్వర్ | రాష్ట్ర పునర్నిర్మాణ గీతం | 424 |
| 399. | తోటపల్లి భూమన్న | జయహే | 425 |
| 400. | తైదల అంజయ్య | నీటి గజ్జెల మోత | 426 |
| 401. | తంగెళ్ళపల్లి కనకాచారి | ఉప్పెన | 428 |
| 402. | ఉదారి నారాయణ | సొంత ఇల్లు | 429 |
| 403. | ఊడుగుల వేణు | కేషియో ఆరిక్యులేటా | 430 |
| 404. | ఉండ్రాల రాజేశం | తెలంగాణ సంబురాలు | 431 |
| 405. | వద్దిరాజు నాగేందరరావు | తెలంగాణ కవి ఆనంద బాష్పాలు | 432 |
| 406. | వఝుల శివకుమార్ | కల సాకారమయ్యే దాకా | 433 |
| 407. | వడ్డెబోయిన శ్రీనివాసు | లాంగ్ లివ్ తెలంగాణ | 435 |
| 408. | వనపట్ల సుబ్బయ్య | అమరవీరులకు గంధమెల్లాలి | 436 |
| 409. | వల్లందాసు వెంకటేశ్ | సర్వేంద్రియాలు | 437 |
| 410. | వరుకోలు లక్ష్మయ్య | చెరువు కల్పతరువు | 438 |
| 411. | వరంగల్ శ్రీనివాస్ | త్యాగాల పూల బత్కవ్వ | 439 |
| 412. | వారాల ఆనంద్ | పాట-పాటగాడు | 441 |
| 413. | వలస వెంకటేశ్వర్లు | నా తెలంగాణ | 442 |
| 414. | వల్స పైడి | ఇది సాధ్యమే | 443 |
| 415. | వల్లభాపురం జనార్దన | జయ జయహే తెలంగాణ తల్లీ | 444 |
| 416. | విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి | గానము | 445 |
| 417. | విజయ రాజం | నువ్వూ-నేను | 446 |
| 418. | విరజాజి రామిరెడ్డి | పండుగ రోజు | 447 |
| 419. | విలాసాగరం రవీందర్ | కృషి వీరుల ఖాందాన్ | 448 |
| 420. | వి. రాఘవరావు (రఘుశ్రీ) | హృద్భాష | 449 |
| 421. | వి.పి. చందన్‌రావు | లగ్గపిల్లు నా తెలంగాణ... | 450 |

422. వి.ఆర్. విద్యార్థి స్వాతంత్ర్యం సకల జనుల సంపద ........................................ 451
423. వెంకట్రామ నర్సయ్య కాజీపేట తంగేడు పూలు ........................................ 452
424. వి. భాస్కర్ అల్లుకున్న బంధం- హైదరాబాద్ !!........................................ 453
425. వి. తేజశ్రీ (మహతి) తల్లీ బతకమ్మ!........................................ 454
426. వీరేంద్ర కాపర్తి నాయనమ్మ కల ........................................ 455
427. వురిమళ్ల సునంద గెలుపు కేతనం ఎగిరిన రోజు ........................................ 456
428. వెంగలి నాగయ్య సాప విలాపం ........................................ 457
429. వేంకట రాణాప్రతాప్ అవతరణ ........................................ 458
430. వేణు సంకోజు ఇంగితాల సారం!........................................ 459
431. వేముల సత్యనారాయణ కదనానికి కాలుదువ్వు ........................................ 460
432. వేముగంటి మురళీకృష్ణ జలజాతర ........................................ 461
433. వేముల ప్రభాకర్ సర్దార్ పాపన్న ........................................ 462
434. వై. శివకుమార్ తెలంగాణ - ఘనకీర్తి ........................................ 463
435. వైద్యం భాస్కర్ నా యాస ........................................ 464
436. వంగర నరసింహారెడ్డి పునరంకితం ........................................ 465
437. యడవెల్లి సైదులు క్యాన్వాసు ........................................ 466
438. యడవల్లి శైలజ సంబరాల తెలంగాణ ........................................ 467
439. యనగందుల దేవయ్య త్యాగాలపంట ........................................ 468
440. యేరువ రత్నారెడ్డి జై... తెలంగాణ...జయహో తెలంగాణ... ........................................ 469
441. వై. రుక్మాంగద రెడ్డి పేద ప్రేమ ........................................ 470
442. జింబో తలమీద గౌరమ్మ ........................................ 471

అఫ్సర్ మొహమ్మద్
3600, నార్త్ హిల్స్ డ్రైవ్, 129
ఆస్టిన్, టెక్సాస్ 78731, యు.ఎస్.ఎ.

1

# కొన్ని నిమిషాలు

ఇప్పుడింక
అన్ని చావుల్నీ
రెండు నిమిషాలతోనే కొలుస్తున్నా
రెండు వందల మరణాలు రెండు నిమిషాల మౌనాలు
రెండు వందల తల్లి పేగులు
పెనవేసుకుంటున్న మానవహారాల రాస్తాలు
ఎవరికెవరు క్షమాపణ చెప్పాలి?
ఈ రెండువందల ఖూన్లకి మాఫీ ఏది?
ఎప్పటికప్పుడు చావు కొత్త అద్దం తొడుక్కుంటోంది
చొక్కా మార్చినంత తేలిగ్గా
మాటల్ని విడిచేస్తోంది
ఎవరి మాట ఎక్కడ కొలువు కుదురుతుందో
ఎక్కడ కొలువు తీరుతుందో
ఏ కొలువు మమ్మల్ని నిలువునా ముంచేస్తుందో
తెలియనే తెలియదు
అ..యి..నా..
రెండు నిమిషాల్లోకి
నీ/నా చావులన్నీ మడత పెట్టేస్తున్నా
ఎవరి కంటి నెత్తురు
ఎవరి ఇంటి వెల్తురు
రోజూ వచ్చి పలకరించే రావు
ఎవరి అంపకాల రాయబారం?

అమ్మా,
ఈ నేల చీలిపోకతప్పదింక
వొళ్లు కూడా చిమిడిపోయిన అన్నం వాసనేస్తుంది
దీని నెర్రెల నిండా ఆకలి గుహలు మొలుస్తున్నాయి
ఎప్పటికప్పుడు చావు కొత్త అర్థం తొడుక్కుంటోంది
కొన్ని నిమిషాలు నన్ను వెలివేస్తాయి
కొన్ని నిమిషాలు నన్ను శిలువేస్తాయి
కొన్ని నిమిషాలు నన్ను నీలోకి వొంపి
నీ శరీరపు వేడిని తాకి వస్తాయి
బతుకు వొక వాంఛ చావులానే
చావు వొక గడ్డిపోచ బతుకులానే
రెండిటి మధ్య
బహుశా రెండు క్షణాల దూరం
ఆ దూరాన్ని చెరిపి
నువ్వు జ్ఞాపకంలోకి జారిపోయావు చెప్పా పెట్టకుండా
రెండు నిమిషాలు నీ జ్ఞాపకం
ఆ తరువాత నువ్వు ప్రవహించే రాస్తా
ఎప్పుడూ పేగులో సలిపే గాయం
ఇప్పుడింక
ప్రతి చావునీ
రెండు నిమిషాలతోనే...
కొలుస్తున్నా






**అనుముల ప్రభాకరాచారి**
ఇంటి.నెం.4-6-38-40/302, శ్రీసాయితేజ అపార్ట్‌మెంట్స్,
సావర్‌కర్ నగర్, నాచారం, హైద్రాబాద్-500076.
చరవాణి : 9032689474


2

# తెలంగాణ పండుగ ఇది

తెలంగాణ పండుగ ఇది...
జనహృదయ సంబురమిది...
జయ జయహే ఘోష ఇది.
నిన్న మొన్న ఉదయించిన నవశిశువు
అచ్చెరువొందగ... జరిగెనెన్నొ అబ్బురంపు పనులు
ఊరూరున సంద్రమొకటి
ఊరవతల విడిది చేయ...
వాసనివాసులెల్ల కమ్మని
జలధారలు గ్రోల...
బడిలో పిల్లలు.., ఇంటిల్లిపాది ఇంట
కడుపు నిండుగ కమ్మని సన్నన్నము సయిచూడగ...,
పడతుల కళ్యాణమె జరగ
లక్ష్మీకళ కురియ..,
అనునిత్యము - ఆసాంతము ఈ నేల
విద్యుత్‌కాంతులీన.., ధగద్ధగేయమనమవగ..,
హాలికుల ఋణభారముల దింపి.,
బలహీన-కార్మికుల
సంక్షేమ కార్యక్రమములెన్నియో నెరుప..,
తల్లి కంఠమున హరిత హారమలంకరించి...
రాజమార్గములోలె రహదారుల తీర్చిదిద్ది..,
సమ్మతముగా మతములన్నింటి హితము కోరి...
భూదానములు చేసి... నిజవాసములకూర్చగ...
ఏడాది తెలంగాణ బాలున్ని
పనులెట్లు చేసెనని.., ముక్కున వేలేసుకొనక
ఇచ్చవచ్చినట్లు మాట్లాడు ముచ్చుల
నూళ్ళతప్పులు దాటగనే... నోటికి తాళమేయ...
గుండెలకత్తుకొని... 'భళి'రా అని మెచ్చుకొని...
ఆబాల గోపాలమెల్ల నేడు ప్రభుత
గుణగానముల చేయుచు..,
తెలంగాణ నేల ఎల్లెడల.. జనమెల్ల
చేసుకొనిచుంటిరి సంబురములు.
ఆహా!... జన్మధన్యమాయె కవి
తెలంగాణ తల్లి ప్రాభవాభివృద్ధి
కన్నులార కాంచగ
వర్ధిల్లవలె అమ్మ ఘనత... అవని యంత...
చదువులెల్ల చదివి - కొలువులెల్ల కొలిచి యువత
ఈ జాతి జవజీవము తానై...
పిల్లాపాపలు - జంతుజాలములు
చెట్టూ పుట్టలూ - జీవవైవిధ్యమిదియనగ...
వరమై - వర్ణమై - స్వచ్ఛమై - స్వర్ణమై
బంగరు తెలంగాణ విశ్వరాష్ట్రమై
భాసిల్లవలె ప్రజలెల్లరు బాగుపడగ.



అన్వర్
డిస్ట్రిక్ హెల్త్ ఎడ్యుకేటర్, మాస్ మీడియా సెక్షన్, డిఎమ్ ఈహెచ్ఓ ఆఫీస్,
వయా ఆటోనగర్, వరంగల్-2 చరవాణి: 9866089066
ఇ-మెయిల్: answawarangal@gmail.com

3

# పోరాటమే కాదు సంబురమూ కావాలి

చీకటిని చీల్చుకు బయటపడ్డవాళ్ళం
బురదలోంచి పైకి లేచినవాళ్లం
బానిసత్వం నుండి ఇప్పుడిప్పుడే స్థిరంగా
తలలెగరేస్తున్నవాళ్ళం
అన్నీ అనివార్యంగా సాధించుకున్నాకా
ఇప్పటికిప్పుడిక ఏ అనివార్యతా లేదు
సంబురాలు అనివార్యమే
పది జిల్లాల సంతోషాలు అనివార్యమే!

ఈ యేడాదిల ఈ నేలమీన జోరువాన కురువలేదేమో
భూకంపం రాలేదు కదా?
సూర్యుడు నిప్పుల సెగలు కక్కొచ్చు
అగ్నిపర్వతం బద్దలవ్వలేదుగా
ఆకాశం అందొచ్చిన స్వర్గం కాకపోవచ్చు
ఏమైనా కానీ
అమరవీరుల ఊపిరితో ఊపిరిపోసుకుని
ప్రాణాలతో ప్రాణం పోసుకున్న తెలంగాణ రాష్ట్రం
తంగేడుపూల వనం
పాలపిట్టల కనువిందు

నేల మాట్లాడుతుంది
చెరువులు పులకిస్తున్నయి
చారిత్రాత్మక కట్టడాలు కాంతులీనుతున్నవి
మట్టిలోనే కాదు రాళ్ళల్లో కూడా కొత్త జీవం కనిపిస్తున్నది
పడావుపడ్డ బతుకుల్లో
యాడాదంతా బతుకమ్మ పండుగైంది

నవమాసాలు మోసిన కన్నతల్లి
శిశువును గుండెలమీద ముద్దాడి మురిసిపోతుంది
అరవై ఏండ్లు ఆపసోపాలు పడి గెలిచి నిలిచినం
సంవత్సరమైనా సంబురమొద్దా?
పుట్టినంక నడవడానికే రెండేళ్ళు పడుతది
మాట్లాడ్డానికి నాలుగేళ్ళు పడుతది
పరిపాలించుడంటే పాలు తాగినంత సులువు కాదు
బిడ్డా
తల్లిపాల ఋణం తీర్చుకునే బంధం
పిచ్చికుక్కల మధ్య కదా సంసారం
సర్దుకోవాలే - కొంత ఓర్చుకోవాలే
జరసైసుండ్రి
మన పాణమెంతనుకున్నరు?
ఇప్పుడే సొంతంగా పాణం పడ్తానం
కాళ్ళల్ల పుల్లలేసుడు కాదు
బాటల వున్న ముళ్ళను తియ్యిండ్రి

దుఃఖమంతా అరవై ఏండ్లు ఎత్తిపోసినం
వెంటనే సంతోషం పొంగిపొర్లదు





ఉదయిస్తున్న సూర్యుణ్ణి ముద్దాడుతున్న
అంతశ్చేతనలోంచి మొలకెత్తుతున్న కొత్త చైతన్యం
మనది

ఊడ్చేద్దామని బయలుదేరినం
రోడ్డెక్కినం
ఎవ్వరికి ఊడ్సుడే వస్తలేదు
కొత్త కదా
పాలకులం అన్న స్పృహ ఒక్క పూటలో రాదు
తరాల పాలితులం బాధితులం కదా

జూన్ రెండు - సఫలీకృత ఆకాంక్ష
మన పోరాటాలు ఐడెంటిఫికేషన్
మన జాతి నిండు గౌరవం

ఇది ప్రారంభమే - ముగింపు చూపిస్తం
ఇది మొదలే - అంతు చూపిస్తం

పంటపైరుల మధ్య కలుపు మొక్కలుంటయ్
పండిన పంట కుప్పల కాడా గుంటనక్కలుంటయ్

ఈ సంబురాలు ఈ ఉత్సవాలు మనకోసమే
నువ్వు పోరాటంలో ఈవైపున లేనోనివేనాయే
నువ్వెప్పుడూ గోడమీద పిల్లివేకదా
నువ్వెప్పుడూ మూతులు నాకేటోనివే
నీ కండ్లు మండుతున్నాయ్
నీ కడుపుల దేవుతాంది
నీకు సంబురాలెక్కడివి?
ఉత్సవాలెక్కడివి?
నీ ఏడ్పే నీ సావు
మా సంబురమే మాకు గెలుపు

మొలకెత్తిన విత్తనం
పాణంపోసిన తల్లి లెక్క నిలబడ్డది
పోరాడి సాధించుకున్న ప్రజలు
అనంతమైన ఆనందాన్ని ఆత్మగౌరవం జెండాగా
ఎగరేస్తరు
తెలంగాణ కొత్త పంటతో మురిసిపోతున్నది.

**అన్నవరం దేవేందర్**
# ఫ్లాట్ నెం. 406, మారుతి హెవెన్స్, భగత్‌నగర్,
కరీంనగర్-505 01 చరవాణి: 9440763479
ఇ-మెయిల్: annavaramdev@gmail.com

4

# సొగసు

నేను నూరు పూల పరిమళాన్ని
వేల ఆకుల పత్రహరితాన్ని
ధిక్కరించి గద్రిచ్చే బొండిగను
గాలిల రెపరెపలాడే పతాకాన్ని
ఆంధ్ర వలస పీడనకు ఎదురునిల్చి
కరవాలాన్ని కొచ్చగ నూరినవాన్ని
తెలంగాణ వెలుగు రేఖను
తెలంగాణాకాశం మీద
వయ్యారంగా పొడిచిన సింగిడిని
దోప్కం ఎక్కడున్నా ఎదురు దొబ్బుతా
ఇగురం ఎర్కున్నవాన్ని
ఇకమతులు తెల్సినవాన్ని
తెగతెంపుల ధర్మయుద్ధంలో
గెలిచి నిలిచిన వాన్ని
కుట్రలు కుతంత్రాలు తెల్లగోలు చేసి
వెయ్యొక్క అమరుల
ఊపిరి నిలుపుకున్నవాన్ని
తొలి తెలంగాణ నేల పోరులో
నేలరాలి సాయుధ పాఠం నేర్పిన
బందగీ జిందగీ నా ఆత్మ
భూస్వామ్యం వెన్నువిరిచిన
అయిలమ్మ అమ్ముల పొదిని
కొమురయ్య చేతిల కొడవలిని
భీముదాదా అందకున్న విల్లును
అగో అక్కన్నుంచి పుట్టిందే
పోరాట ఇత్తునం ఇగురుపెట్టింది
తెలంగాణమంతా ఇడవారింది
నేను లేచి నిలిచిన తెలంగాణ మహోద్యమాన్ని
భూస్వామ్యం కోరలు పీకి
గడీల మెడలు ఇరిశిన వాన్ని
కలెబడి గెలిచిన వాన్ని విజయాన్నే వీరున్నే
హక్కులకోసం కలెబడి నిలబడి
గొడగొడ ఏడిచిన కాళన్న కన్నును
ఉద్యమ భాస్వరాన్ని
మరో తరానికి ఊది ఊది అందించిన
జయశంకరుని ఉపన్యాసాన్ని నా దేహానికి నేనే
పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న
శ్రీకాంతాచారి అమరత్వాన్ని
నేను లేచి నిలిచి గెలిచిన తెల తెలంగాణను
రణం చేసి రణం చేసి
గాయపడ్డవాన్ని తేరుకుంటున్నవాన్ని
నేల నేలంతా నెత్తురు పంచి
సాల్లుసాల్లుగా ఇత్తులు అలికినవాన్ని
నేను నూరుపుల సొగసుతీగను
దోప్కం ఎక్కడున్నా కత్తిదూస్తా
అగో అడివిల కాళ్ళ అచ్చులు
అట్లనే అగుపిస్తన్నయి.





అన్వేషి
బి-4-122 డి.కె.ఎన్‌క్లేవ్, మియాపూర్-500049
చరవాణి : 9676468372
ఇ-మెయిల్: anveshi.jd@gmai.com

# 5

# సంబురాలు

వలస రాబందుల దోపిడిలో
ఎటు చూసినా ఎండిపోయిన ఎముకల గూళ్ళే
చెట్టును కొట్టుకొనిపోతే కొన్నేండ్లకైనా చిగురిస్తుంది
కాని, వ్రేళ్ళతో సహా పెకిలించారు
ఏడు దశాబ్దాల పక్షపాత పాలనలో
ఎన్ని వినాశాలో కూడికకు కుదరని గుణింతాలవి
ఏదైతేనేం నయవంచకులు తలవంచక తప్పలేదు
నాటి సాయుధపోరాటం నుండి
నేటి నిరాయుధ విజయబాట దాకా
విశ్వరూపాన్ని ప్రదర్శించింది తెలంగాణ పోరాటం
ఇపుడు బేషజాలు ప్రక్కన బెట్టి
బేరీజు వేసుకోవాలి 'కిం కర్తవ్యాలను'
సమీక్షించుకోవాలి ధ్వంసీకరణ తదుపరి అంశాలను
సంకెళ్ళను త్రెంచుకొన్నది 'దోపిడి' నుండా? దోపిడి
దారుల నుండా? దోయబడేవాడు పేదోడైతే
దోచుకునే వారందరు దొరలే గెలిచిన తర్వాత
విజయోత్సవర్యాలీలు నదులైపారాల్సిందే
సంబురాలు అంబరాన్ని చుంబించాల్సిందే
కానీ... కొత్త జెండా క్రింద
పాత ఎజెండాతో శత్రు శేషాంకురాలను
మొలకెత్తనీయొద్దు
పోను పోనూ గెలుపు నలుపు పడుతుంది
గెలుపును నిలబెట్టుకొంటేనే విజయోత్సవాలకు అర్థం
తెలంగాణ విజయోత్సవాలను దిగ్విజయంగా చేసుకుందాము
ఘనంగా ఒక్కొక్క మైలు రాయిని దాటుకొంటూ
రైతన్నల ఆత్మగౌరవం ఆత్మహత్యల్ని హత్యించినపుడు
గ్రామాలు చెరువులు నడుమ దీవులై దీప్తించినపుడు
'అ' అంటే అమ్మ 'ఆ' అంటే ఆవు అని
ఊరూర ప్రభుత్వ పాఠశాలల్లో పసిగొంతులు పాటపాడాలి
ఫ్లోరోసిన్ బాధిత వనితల వంకరబోయిన నడుములు
ట్యాంక్ బండ్‌పై వృత్తాకారంలో బతుకమ్మ ఆడాలి
గూని ఎముకల యువకులు గోల్కొండలో
పోతరాజులవ్వాలి పాలనా యంత్రాంగం
పాలపిట్టలా ప్రజల గుమ్మం ముందు వాలినప్పుడు
గోదావరి కృష్ణమ్మలు ప్రతి పంటకాల్వలో ఇంటి కుండలో
గళగళధ్వనులను వినిపించినపుడు అప్పుడు
డప్పుదానయ్య చార్మినార్ దగ్గర తీన్మార్ దరువేస్తుంటే
లయ తప్పకుండ అడుగులేస్తూ
ఉస్మానియా యూనివర్సిటిలో
'ఉదయించిన గానమా వీరతెలంగాణమా' అంటూ
అలాయ్ బలాయ్ ఆడుకొంటూ ఏడాదికొక్క జిల్లా చొప్పున
అన్ని జిల్లాల్లో పంద్రాగస్టు జెండాకు వందనం చేద్దాం
బంగారు తెలంగాణ అంటే
బొంగురు పోయే దాకా ధ్వనించిన నినాదం కాదు
భవిష్యత్ తరాలకు బంగారు బాటలేసే
ప్రామాణిక విజయోత్సవాలను నిర్వహిద్దాము

**అనిశెట్టి రజిత**
ఇంటి.నెం.3-12-60, కుమార్‌పల్లి, హన్మకొండ,
వరంగల్ (తెలంగాణ) చరవాణి: 9849482462

6

## కనుపాపల కనురెప్ప కాళోజీ

**ఒ**క కంట కన్నీళ్ళు ఒక కంట మంటలూ
కాళోజీ హృదయం నిత్య కల్లోలితం
ఆవేదనల రగులు అంతరంగము తోడ
ప్రేమించు మనసుకూ కోపించుటయు తెలుసు ॥ఒక॥

కత్తితో కవితలను రాసిన కవి వీరుడూ
తన గొడవతో లోకాన్ని నిద్ర లేపేటి ఉదయుడూ
నిష్కల్మషతకు తాను నిలువెత్తు సంతకము
స్వచ్ఛమైన మనిషి తనమం నిండిన గాఢత్వం ॥ఒక॥

రాజ్యహింసలను నిరసిస్తు గళ గర్జనలు చేసె
లోక శ్రేయస్సుకై నడి సంద్రములు ఈదె
పుటక చావు తనదైనా బ్రతుకు దేశానిదయ్యె
యుగానికొక్కడే ఈ రీతి పుట్టి గిట్టుటయ్యె ॥ఒక॥

చెమటోడ్చు మనిషేగా మనిషంటే అన్నాడు
వాడు నవ్వినరోజే పండుగరా అన్నాడు
అన్యాయాన్నెదిరిస్తె ఆరాధ్యుడన్నాడు
తన మార్గ చోదకుడు కష్టజీవె ఎపుడు ॥ఒక॥

'తెలంగాణ దేశమ్ము' కాళోజి కలలనేల
మేల్కొల్పు వాక్యాలు కాళోజి కాహళీలు
తెలంగాణ ప్రాంతమూ విముక్తి కోసమై
రక్తపుష్పాలుగా రాలినా అమరులూ ॥ఒక॥

పౌరహక్కుల కోసం ఎలుగెత్తిన స్వరం
మానవ హక్కుల కోసం నినదించినా గళం
నిరాడంబరతయే ఆచరణీయంగ
మనిషే జెండాగ ఆవిష్కృతమయ్యె ॥ఒక॥

ప్రజాస్వామిక వాదిగా తానెల్లప్పుడూ
ఆధిపత్యాలను నిరసించినావాడు
అన్యాయాలను నిలదీసే ధిక్కార గీతమై
అప్రతిహతంగా పోరాడినావాడు ॥ఒక॥

కనుపాపలకు తాను కనురెప్పగ నిలిచి
తల్లి కోడిగ మారి ప్రజను కాపాడినాడు
ప్రహ్లాద చరితనూ పుక్కిటా పట్టినా
ఉగ్రనరసింహుడై ఇలకు తానొచ్చాడు ॥ఒక॥





**అమరవాది కళ్యాణ చక్రవర్తి**
7-175, పెంటాచారి హాస్పటల్ ప్రక్కన, గజ్వేల్,
మెదక్ జిల్లా. చరవాణి: 9866059921
ఇ-మెయిల్: amaravadi.kalyan@gmail.com

7

# బతుకమ్మ

**త**న హర్షం చూపిస్తూ ఆకాశం
ఘన వర్షం కురిపించెను నీకోసం
చిరు చినుకులు అందించిన సందేశం
నేలమ్మలో కలిగించెను సంతోషం
పులకింతలో పుడమి తల్లి దేహం
పుట్టించెను తనపై ఓ అంకురం
చిగురాకులు మొగ్గలయ్యె పుష్పం
తంగేడు గునుగు సొగసు వర్ణం
ఆడపడుచులంత చేరే వైనం
పిల్లలతో ప్రతి ఇల్లానందం
పసిడి పట్టు బట్టలతో సింగారం
పసుపు, కుంకుమలిడు సౌభాగ్యం
కనువిందుగ నిను పేర్చిన నీ రూపం
తల్లీ! గౌరమ్మకు నువు ప్రతిరూపం

ఆటగా నీ చుట్టు చేసే ప్రదక్షిణం
పాటగ నీ కీర్తి తెలిపే మా గానం
ఊరూరు సాయంత్రం నీ ధ్యానం
మురిసిపోయి మైమరచెను తెలంగాణం
ఉన్నంతలో నీకు చేసె నైవేద్యం
చెరువు గట్టు పైన తినె నీ ప్రసాదం
చద్దుల బతుకమ్మతో సాగనంపుతాం
వచ్చె యేడు నీ రాకకు ఎదురే చూస్తాం
చల్లని నీ దీవెనలతో వృద్ధి పొందుతాం
ముచ్చటైన ఈ సంస్కృతి మాదేనంటాం
ప్రకృతి ఆరాధనలో పరవశించుతాం
పునర్జన్మ ఉంటే ఈ గడ్డకే బిడ్డలమౌతాం
బతుకమ్మ బతుకమ్మ బతుకమ్మ
తెలంగాణ అంటేనే నువ్వమ్మా.



**అంబటి నారాయణ**
నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా.
చరవాణి: 9849326801

# 8
# తెలంగాణ పల్లె

నిత్యం వసంతాన్ని నింపే పసిడితల్లి పల్లె
పల్లె నడిచే పెద్ద బాలశిక్ష
సమస్తం తనలో నుండి చూపిస్తుంది
స్వచ్ఛమైన జీవన ఛాయలు అగుపిస్తాయి
ఎంతవారికైనా పల్లె అనుబంధం గొప్పది
జీవితంలో కొత్త కొత్త అనుభవాలు ఎన్ని ఉన్నా
పల్లె నుంచి నేర్చుకోవలసిన పాఠాలెన్నో
చెట్టు చెట్టుకో చరిత్ర నిలువెత్తుగా అగుపిస్తాయి
చెట్లపై రంగు రంగుల పక్షులు కనిపిస్తాయి
ఒక అద్భుత భావచిత్రం సజీవంగా చూపిస్తుంది
వసంత తరువు మొదట పల్లెలో అగుపిస్తుంది.
మధుర గానాల కోయిల కూజితాలు వినిపిస్తాయి
ప్రేమగా పలకరించే ఆత్మీయ నేస్తాలు పక్షులు
కాలాన్ని తమ కొమ్మలపైన నిలుపుకొని చిగురిస్తు
ఏరువాక సాగే జీవన తాత్త్విక నడకలైతయి
మోటల మోతలు నాట్లేసే చేతులు
చేను చెలక వాగువంకలు
మామిడి తోపులు ఈత ఈదులు
కారే కల్లు తాగే జోరు...
పల్లె నిండుగా కనిపిస్తుంది
తొలకరి చినుకులకు పులకరించిన మట్టి పరిమళం
చల్లని శీతల గాలులు పచ్చని పైరులు
పల్లె పచ్చని సౌందర్యంతో నిండుగా విరబూస్తుంది
నిత్యం ఆహ్లాదాన్ని పంచుతుంది
నమ్మకమనే కమ్మదనాన్ని గుండెలో దాచుకున్న
కల్మషం లేని అమాయక పల్లె ప్రజలు
ఇపుడు ప్రపంచీకరణ పల్లెను మింగేస్తుంది
పల్లె పల్లెలా లేదు ప్రకృతి తల్లిలా లేదు
పల్లె బతుకు చితికిపోయింది
చింపిన విస్తారిలా చీలికలు పడ్డాయి
కులవృత్తులన్నీ గంగలో కలిసిపోయినై
మోసగాళ్ళ చేతిలో నలిగిపోతుంది పల్లె
అనంతమైన శూన్యం అలుముకుంది
నిశ్శబ్దంలో నిదురపోతున్నది పల్లె
దీనావస్థలో దిగులు చెందుతున్నది పల్లె
పల్లెవాసులు వలస పక్షులై ఎగిరిపోతున్నరు.





అంబటి వెంకన్న
7-1-155 /డి 9 / 7, శ్రీనగర్ కాలని, పానగల్ రోడ్,
నల్లగొండ జిల్లా, చరవాణి 9966376072

9

# మందిమాటలు నమ్మితే ఇల్లాగమైతదది

యాసంగి పంట ఒక్కనాటి వంట
గాలిదుమారం - వడగండ్లు
ఆగాలపు ఆనలు
గాలికిపోతున్న గడ్డి
వాగులబోతున్న వడ్లు
తెలిసే కదా పొలం నాటుబెట్టింది
ప్రకృతి బీభత్సాన్ని పసిగట్టి
పరాఖత్‌గ బతికే రైతు
ప్రాణం తీసుకోవడం కుట్రలో భాగమే
ఏరుబడి ఏడాది నిండనే లేదు
సగం పొత్తులు తేలనే లేదు
ఎవని కొంపలు మునిగినయని
ఎలిసిన జెండాల ఎగురులాట
పోరాటం జరిగినంతకాలం
అడ్డుగోడలై నిలిచినోళ్ళే
ఇయ్యాల ఈ నేలని
ఆగం జెయ్యాలని సూస్తున్నరు
జనం లేని సంఘాలు ఏకమై
జజ్జనకరి జనారే అని
అమాయకుల బలి గోరుతున్నరు
రెండు కండ్లు
ఒకటి తూర్పు - ఇంకోటి పడమట జూస్తే
అది సూపు కాదని మొత్తుకున్నం
నోట్ల నాలికుందని ఇష్టం వచ్చినట్టు మళ్ళితె
ఇలపీటకు పనిజెప్పినం
మీ అహాల్ని పైశాచిక ఆనందాన్ని బంధించిన
నేర్పరితనానికి జేజేలు గొట్టినం
ఈ నేలను ఇక్కడి సంస్కృతిని
అవమానించినోళ్ళకు సంకెళ్ళు దొడిగినం
శిక్ష అనుభవించాలి తప్ప
ఎన్నాళ్ళు ఎన్నాళ్ళని ఎదురు ప్రశ్నించేదెక్కడిది
జనం తీర్పుని గౌరవించి
ముక్కు నేలకు రాసి ముడ్సుకొని పోవాలె తప్ప
వసపిట్టోలిగ వొర్లే దెక్కడిది?
పిచ్చికుక్క కర్సినట్టు పిచ్చిపిచ్చిగ మొరిగేదెక్కడిది?
సావుతిప్పలు బెట్టి బతుకు రోడ్లమీదికీడ్చి
నెత్తుటి జెండాలు గప్పిన యాది మరువనే లేదు
విశాఖ రచయితల సంఘంలో
విపల్వం పొడుచుకొచ్చినట్టు
పేరు మార్చితె
గుణం మార్తదా గాని
మనోడెవడొ మందోడెవడొ కనిపెట్టాలె
మంది మాటలు నమ్మితె
మల్లొచ్చేవరకు ఇల్లాగమైతది.



**అంబట్ల రవి**
1-60/1, గ్రా॥ ధర్మారం (బి), మం॥ డిచ్‌పల్లి,
జిల్లా నిజామాబాద్-503230 చరవాణి: 9849326711

10

# ప్రణమిల్లుతున్నది ఈ జగం

సాకి. ఎంత చక్కని దానవమ్మ
ఎంత చిక్కని జాణవమ్మ
అంతుచిక్కని కటిక చీకటి
కాలరాసి దారి చూపి
దశాబ్దాల పోరు జేసి
విజయబావుట ఎగురవేసి
మూడుకోట్ల ముచ్చటైన బిడ్డలను పొత్తిళ్ల దాచి
మురిసిపోయే తల్లి నీకూ వందనం
ప్రణమిల్లుతున్నది ఈ జగం
తెలంగాణ తల్లీ వందనం
ప్రణమిల్లుతున్నది ఈ జగం

పల్లవి పొద్దూ తిరుగుడు పువ్వోలె విచ్చుకుంది నేలంతా
సన్నజాజి తీగోలె సాగుతోంది బతుకంతా
ఊరువాడ దీపంగా
కొండాకోన ధూపంగా
పల్లెలన్నీ పచ్చంగా పచ్చాజీర నెయ్యంగా
పొడుస్తున్న పొద్దోలె మెరుస్తోంది తెలంగాణ
కురుస్తున్న చినుకోలె మురుస్తోంది తెలంగాణ
తెలంగాణ తెలంగాణ మా తల్లీ తెలంగాణ
తెలంగాణ తెలంగాణ రతనాల వీణ జాణ
॥పొద్దు తిరుగుడు పువ్వోలె॥

*చరణం : 1*
గోదావరి కృష్ణమ్మ ఉరకలెత్తి పారంగ
ఆ నీటి నురగల్లో ఈ మన్ను తడవంగ
వీరనారి రుద్రమ్మ పోరుబిడ్డ కొమురన్న
అమరులైన వీరులంత మిన్ను విడిచి రావాల
బంగారు తెలంగాణ నలుదిక్కుల ఎదగాల
నవ్వుకున్న నోళ్లన్నీ తలదించుకుపోవాల
॥పొద్దూ తిరుగుడు పువ్వోలె॥

*చరణం : 2*
తీరుతీరు పూలన్నీ ఒక్కచోట చేరంగ
ఆ పూల నవ్వుల్లో సుఖశాంతులు విరియాల
గంగమ్మ గౌరమ్మ శిరసెత్తి చూడంగ
బతుకమ్మ పాటల్లో ఆడబిడ్డలాడాల
నవకాంతుల తెలంగాణ కలలన్నీ పండాల
కళలున్న తెలంగాణ కలకాలం ఉండాల
॥ పొద్దూ తిరుగుడు పువ్వోలె॥





**అమ్మంగి కృష్ణారావు**
1-7-647/31/1, రాంనగర్,
చరవాణి: 9492857775

11

# మన తెలంగాణ

అమ్మా తెలంగాణ
నీకు వందనాలు
తెలంగాణ రావడం
మన అదృష్టం
తెలంగాణ రథసారధి కార్యదీక్ష
కఠోర పరిశ్రమ
సకల జనుల సమ్మె
అమరుల త్యాగఫలం ఈ తెలంగాణ
నేటి అంబరాన్ని అంటిన
ఈ తెలంగాణ ఆవిర్భావ సంబరాలు
తెలంగాణ ప్రతి గుండెలో
ఆనందమే ఆనందం

ఇక మన తెలంగాణ
మన ఆశలు ఆశయాలకు
అనుగుణంగా వికసించే
పరిమళభరితమైన
పూదోట కావాలి
మన హృదయాలలో
ప్రేమానురాగాలు
ప్రవహింపజేసే నదిలా
మన బతుకులను
కంటికి రెప్పలా కాపాడే
కాపలా కావాలి.

**అయినంపూడి శ్రీలక్ష్మి**
# ఫ్లాట్ నెం. 103, దుర్గా అపార్ట్‌మెంట్, దుర్గానగర్,
సోమాజిగూడ, హైదరాబాద్-86 చరవాణి: 9989928562
ఇ-మెయిల్: shreelaxmi.inampudi@gmail.com

12

## పోరాట పతాక

అన్యాయానికి అరవయ్యేళ్ళు
గెలిచిన న్యాయానికి వయసు ఏడాదే
అయితేనేం -
పదివేల ఏళ్ళ కోటి లింగాల చరిత్రని
ఇప్పుడు తవ్వి తీస్తున్నాం
మాది కాకుంట పోయిన కోహినూర్‌ని
ఇపుడు ఊరూరా సృష్టిస్తున్నాం
ఈ సంవత్సరం సందు మొదలున
అంతటా అంధేరా బాత్
కొసకు వచ్చిన ఈ క్షణం జగమంతటా సునారే గీత్
ఈ క్షణాన నేను తదేకంగా ఆ మనిషినే చూస్తున్నాను
మన గోసకు రందిపడి
మన యాదిల మనాది పడి
మనల్ని సకల విజయాలవైపు నడిపించిన
ఆ మనిషినే చూస్తున్నాను
కలని కళ్ళముందు నిలిపిన మనీషి అతడు
ఆ ఒక్కడు లక్షలాది గొంతుకలై నినదించాడు
కోట్లాది అడుగులై ప్రవహించాడు
మన కవాతుకు నేతగా
మన హాలత్‌కు కర్తగా నిలిచాడు
ఆ నడకకు తొలి అడుగు ఇది
ఆ పరుగుకు తొలి ఊపు ఇది
మొదటి మైలురాయి దగ్గర
ఆ మనిషి ఇంకా చెప్తూనే ఉన్నాడు
పిడికిలి ఇంకా బిగించే ఉన్నాడు
ఎత్తిన జెండాని ఎగరేసే ఉన్నాడు
పోరాటం ఇంకా ఉంది అన్నాడు
అదేంది, కల నిజమైంది కదా అని అందరు అడిగింద్రు
ఆ నిజం మళ్ళీ కల కాకుండా ఉండటానికే
యుద్ధం కొనసాగించాలన్నాడు
పాడే గొంతు ఆగకూడదన్నాడు
ఆ మనిషిది కొత్త కల
సకల జనాలకది రేపటి బంగారు వెన్నెల.





**ఆకుల సుష్మ**
ఇంటి. నెం. 6-3-84, గీతానగర్, సిరిసిల్ల. కరీంనగర్.
చరవాణి : 9908369954

13

# ఇగురంగా...

తెలంగాణా కోటి రతనాల వీణ
వినుతికెక్కిన విషయమే
తెలిసిన సంగతైనా
మల్లోసారి మదిలకుదెచ్చుకుందాం
కదం... కదం... కలిపి
పదం... పదం... కూర్చి
కదులుదాం ముందుకు
ఇన్ని రోజులు....
అణిచివేయబడిన దుర్మార్గాలకు
చెల్లుచీటిపాడిన రోజు
ప్రత్యేక రాష్ట్రాన్ని చూడకుండానే
ప్రాణాలర్పించిన యువత
త్యాగాన్ని యాదిలకు తెచ్చుకుందాం
మనకు అన్నం బెట్టే రైతును
ఇప్పుడు అప్పు-మిత్తి...
జమిలిగా మింగేస్తున్నాయి
వారికి దన్నుగా నిలుద్దాం
కలిసి విషయం తెలిసికొని
కలేబడైనాసరే నిలబెడుదాం!
తిండిపెట్టి జీవనం పోసేది రైతన్న
మనకు బట్టనిచ్చి
మర్యాదను మానాన్ని కాపాడే
నేతన్ననూ కాపాడుకోవాల్సే ఉంది
చావు శాశ్వత పరిష్కారం కాదు
అన్న ఎరుకను తెలియజెప్పి
ప్రాణాలకు పాణమై అడ్డుకుందాం
మనజాతిని... నీతిని మరువక
ఒకరికొకరంగా...
బతుకుదాం.. బతికిద్దాం.. బతుకునిద్దాం

**ఆడెపు లక్ష్మణ్**
8-6-71, నెహ్రూనగర్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా.
చరవాణి: 9849157752



# 14

# తెల్లంగి

తెల్లంగికి ఎంత
రుబాబు
వద్దంటే లేచి నిలబడుతుంది
ఖద్దర్ కడక్ అని
అందుకే అంటారేమో...!
రాజకీయానికి
తొడుగులు
తెల్లంగికే పరిమితం
మల్లెపూల మనసుమీద
వెండిమేఘాల
అలుకు పూత
ముఖం మరింత
నునుపు దేలినతనం
అందరిచూపు అంగిమీదే
ఎన్నడూ కాననోడు
తొడుక్కుంటే
చూడరా మరి...!
రోజంతా నల్లని
కందెన్ల మునిగి తేలినోడు
తళతళ మెరిసిపోతే
భార్యాబిడ్డలు మురిసిపోరు
కపోతవనం గుంపులోంచి
విడిపోయిన తెల్లని
ఈకలాంటి అంగి
ఎంత హుందాగా నడిపిస్తుంది
రోడ్డుపై మనుష్యుల మదిలోంచి
తప్పుకోవాలని
భూమికేసి చూస్తున్న చూపులు
మరింత పదునెక్కిన నడక
అందిరిలోంచి తరుముతున్న వైనం
నిలువనీడ లేనోడు
పాలనురగలాంటి
అంగిని తొడుక్కుంటే
అందరి దృష్టి వాడిపైనే
ఉండదా మరి!
లోన లొటారం
పైన పటారం
అందరిలో కల్సిపోవాలన్న జిజ్ఞాస
కుదురుగా కలువలేనితనం
తెల్లంగికి అంటిన మరక
ఉతికితే పోతుందేమో గానీ...
మనసులో ఏర్పడిన
ఇమడలేనితనం
ఎట్లపోతది.



ఏ. ఆంజనేయ ప్రసాద్

15

# తెలంగాణ సంబురం

తెలంగాణ అవతరణోత్సవ సంబురం!
తాకెను గదా అంబరం!!
అరవై ఏళ్ళ కల అది సాకారమాయెను ఈ వేళ!
సంతోషాలూ, ఆనందాలూ వెల్లివెరిసెర ఇవాళ!!
అమరవీరుల త్యాగం వట్టిపోదుర తమ్ముడా!
ప్రపంచాన ఇలాంటిది ఇక సాటిలేదు ఎక్కడా!!
నవజవాను కేసీయారు నడిపెనట మన ఉద్యమాన్ని!
విజయం ఇక తాకెనట మూలమూలనా దిక్కులన్నీ!!
ఆగిపోలేదుర ఉద్యమమిక ఈ రోజుతో!
బంగారు తెలంగాణ నిర్మించుదాం తగు
ఉత్సాహముతో!!
ఊరూ వాడా కలిసి అన్నదమ్ముల బలిమితో!
పేదా గొప్పా తేడా లేదు, కలగలిసిన కలిమితో!!
పేరు తెలంగాణ! ఇక నిలిచెనట ఇక జగాన!
సీమాంధ్రుల కిక ఉచ్చు బిగిసె సమరాన!!
ఊరూరా పండుగ!
తెలంగాణ జనుల గుండెల నిండుగా!!
జై తెలంగాణ!
జైజై తెలంగాణ!!

**ఆశారాజు**
# 596, పొయెట్స్ కార్నర్, 5-6-36 వైదేహినగర్,
వనస్థలిపురం -500070, 9392302245
ఇ-మెయిల్: asharaju.poet@gmail.com

16

# సరిగ్గా పదకొండు గంటల రాత్రి

**నా** గుండెల్లో ఖంజరు దించి
వరదలా హొయలు బోతూ
జ్వాలలా ఉసిగొలుపుతూ
కొరడాలా చర్మాన్ని చీరి
పొగలు పొగలుగా పగతో చెలరేగి
మొగలి రేకుల్లా గరుగ్గా గుచ్చుకొని
సుడిగాలిలో గిరగిరా తిప్పి
నిర్లక్ష్యంగా వెళ్ళిపోతావు

అప్పుడే కుబుసం విడిచిన
పడుచుపాము బుసలా
పడగ మీది దీపం పదునులా
వెన్నెల రేయంత రంపం కోతలా
పులిమచ్చుల రంగులంత కసిలా
ఎడారిలో తుఫాను రేపుతూ
లోన, మనసు కొసనెక్కడో
కాటు వేసి మతి పొగొడ్తావు

గాయపడిన దేహాన్ని
విషం నురగల అద్దంలో ముంచి
నెత్తుర్లోడే తీగల రాగాలను తెలిపి
రాయిమీద విసిరి కొట్టిన గాజు గ్లాసులా
ఆకాశాన్ని కోటాను కోట్ల ముక్కలు చేసి
గాలిలో తేలిపోతూ
నా ప్రాణాల మీద తూలిపోతూ
లోకాన్ని, అలవోకగా కురులతో ఎగరేస్తూ
సముద్రాల్ని ముప్పు తిప్పలు పెడ్తావు

ఖడ్గాలతో పోటీపడే
సుస్వర కెరటమా!
వన్నెల చిన్నెల చిరుతా!
రాగాల రంగుల నదీ!
'సునిధీ చౌహాన్'....!
నువ్వు ఏమి తాగి
సాధన చేస్తావో కాని,
సాంబ్రాణి ధూపంతో
వర్షం జల్లులా, ఉక్కిరిబిక్కిరి చేసి
నీ మధు గాత్ర మంత్రంతో ఒకే ఒక్క పాట పాడి
నన్ను
వెయ్యిముక్కలు చేశావు





ఎ.బి.జె. సత్యంసాగర్
చరవాణి: 9154466288

# 17

# పోశమ్మ తల్లి

ప్రకృతిలో సృష్టి మొదలైనప్పుడు
అమ్మ ప్రపంచంలో పెరిగి పెద్దగై పొర్లాడుతున్నప్పుడు
నవమాసాల నొప్పులకు, కేకలకు కాన్పులు చేసే
మంత్రసానివి
తొట్ట తొలిసారిగా భూమిపై పడ్డప్పుడు
గంగనుతల్లి కళ్ళు తెరిపించినప్పుడు
ఈ నరకంల నీవు నిజంగా స్వర్గధామానివి
పురుడుపోసి, మాగిముంతను ఇంటి ముందర
పాతినప్పుడు
ఊరికి నీ ఉనికి తెలిపిన ఊరబొడ్రాయివి
తట్టుతో తల్లడిల్లినప్పుడల్లా
సల్లకుండ నీళ్ళతో
యాపకొమ్మలు పూసుకున్నప్పుడల్లా
అమ్మ తల్లీ నీవు వెనుదిరిగిపోతివి
పొద్దతీడి మీ వేపపుల్ల రుద్దితే,
మా మూతిపండ్లు ముర్సిపోతవి
పోతురాజుల ఆటపాటలతో
సంచరించిన తత్వానివి
అమ్మా! నీ గురించి ఒక్క ముచ్చటలో చెప్పాలంటే
సర్వరోగాలకు నువ్వొక ఉపశమనం
అంతేకాదు సర్వజనులను సుఖ
సంతోషాలతో జీవించమన్న సర్వాంతర్యామివి
ఓ తల్లీ! నీ బోనంల బువ్వలు,
పచ్చిపులుసులు,
పొలావులు, సియ్యలు, బువ్వలు
తెలంగాణాకే కాదు ప్రపంచానికి
సింబల్‌గా మిగిలిపోతవి
అప్పటికీ ఇప్పటికీ, ఎప్పటికీ
నీకు నీవే సాటి
సృష్టికి ప్రతి సృష్టివి
నీ ప్రతి రూపానికి బోనాల పండుగ
ఓ అద్భుత దృశ్యమాలిక
అమ్మా! డొక్కరమ్మా! ఓ బోనాల
పండుగ పోశమ్మ
మా కాళ్ళు చేతులు ఒక్కటి చేసి మొక్కుతున్నాం
మొక్కులు తీర్చుకుంటున్నాం.
ఓ తెలంగాణ తల్లి! జైజై తెలంగాణ తల్లి!!

**ఆనంద్ విరించి**
ఇంటి.నెం. 2-7/1, బస్వాపూర్, సిరిసిల్లా, కరీంనగర్,
తెలంగాణ-505405 చరవాణి: 9573848282
ఇ-మెయిల్: anand.writer234@gmai.com

18

## ఎవడురా...!!

పల్లవి : ఎవడురా వాడెవడురా మన ఉనికి ముంచేటోడురా
అవనిలోన అమ్మ గోసకు ఆయువెట్లా వోసెరా

చ1: సరిహద్దులోని శత్రువల్లే పక్క రాజ్యాపోడు ఊళ్ళే
అమ్మనైనా తెలంగాణమ్మకే వీళ్ళెన్ను వొడిసే
ఇళ్ళ ఇళ్ళకు మనల ఇళ్ళకు గోస గోసోలచ్చెనా
రొమ్ములిరిహొసి రాజ్యకాంక్షకు దమ్ములెట్లా వచ్చెనా ॥ఎవడురా॥

చ2: పసివాల్ల గుండెల పగల బీజం బుసలు కొడుతూ ఉందిరా
విషపు వార్‌లో వీరులయ్యి కడుపుకోతను మిగిల్చిరా
లూటికొచ్చి మాదు బిడ్డల లాఠి చార్జీల సంపిరా....
విద్యార్థి లోకం కదులుతుంది విజయమో ఇక స్వర్గమంది
కలాల నుండి జాలువారిన అక్షరాలే ఆయుధాలు
ఎదురువస్తే మిగులుతాయి ఆరడుగుల సమాధులు
జిల్లా జిల్లాలన్ని కలిసెరా ముల్లె సదురుకు వెళ్ళరా....!! ॥ఎవడురా॥





ఎ. జ్యోతి

19

## నా రేపటి తెలంగాణ

అల్లర్లులేని
అలజడులు లేని
అరమరికలు లేని
నా రేపటి తెలంగాణ
పేదల పాలిటి పెన్నిధి
బడుగు వర్గాల బలమే
రాజు, పేదల అభేదమే
నా రేపటి తెలంగాణ
నిరక్షరాస్యత నిర్మూలనమే
అక్షరాస్యతకు ఆలయమే
ఆదర్శ గ్రామాల నిలయమే
నా రేపటి తెలంగాణ
ప్రకృతి సుందర మందిరమే
గల గలా పారే నదుల సంగమమే
పసిడి సిరుల మాగాణమే
నా రేపటి తెలంగాణ
కుట్రలు, కుతంత్రాలు లేని
కల్లా, కపటాలు లేని
కామాంధులసలే లేని
నా రేపటి తెలంగాణ
కళ్యాణ లక్ష్మి కాంతులతో
గ్రామ జ్యోతి వెలుగులతో
అవినీతి లేని ఆఫీసులతో
నా రేపటి తెలంగాణ
కోటి రతనాల వీణ
వజ్ర వైఢూర్యాల కోణ
ముత్యాలు పొదిగిన మేన
నా రేపటి తెలంగాణ





ఏ. సూర్య ప్రకాశ్
33, పివి ఎన్‌క్లేవ్, ఓల్డ్ బోయిన్‌పల్లి,
సమతానగర్, సికింద్రాబాద్.
చరవాణి: 9030017933, 9885664169

## 20

# మంత్రముగ్ధం!

సూర్యకాంతి అనే సింహాసనం ఆకాశం నుంచి
జారిపోయింది
కూలిపోయిన పర్వతం మళ్ళీ లేచి నిలిచినట్లు ఆకాశం
నవ్వింది!
నిశ్శబ్ద శూన్యంలోకి దీపధారిలా అడుగుపెట్టాను
పిల్లంగ్రోవి పాడుతున్నది పెదవి మరచిన రాగం
జీవితపు ప్రతి అంచునూ
సృష్టిస్తున్నాను నేను
జీవితమనే ముడిసరుకుతోనే
కలలు కంటున్నాను నేను

స్పందించే కన్నీళ్ళతో కళ్ళను నింపుకొంటున్నాను
కన్నీటి లోతును కొలిచే కొలమాపకం కవిత్వం
ప్రకృతిని అమృతీకరించే
మంత్రదండం నా లేఖిని
పద్యమనే సిల్కుదారం నన్నూ
చంద్రుడినీ కట్టి పడేస్తున్నది
రాత్రి మెల్ల మెల్లగా
కరిగిపోతున్నది సాగరంలో
అలలు చంద్రకాంతిని
సుష్టుగా తాగి తేన్చాయి





ఆచార్య అనుమాండ్ల భూమయ్య
చరవాణి: 0897073999

# 21
# తెలంగాణ తల్లి

తే.గీ. తేలికైన దానవటంచు తేల్చివేయ
మూలబడియున్న తెలుగు 'నమూల్య' మనుచు
తెలిపి, వేద భాషకు ప్రక్క నిలిపినట్టి
పాల్కురికినిచ్చి, తెలంగాణ పరువు నిలిపి
నట్టి తెలంగాణ తల్లికే నంజలి ఘటింతు.

తే.గీ. భక్తి మందార మకరంద భాగవతము
తెనుగుజేసి మా కందించి వినుతి గన్న
పోతన నొసంగె కరుణించి పుణ్యతల్లి
అట్టి తెలగాణ తల్లికే నంజలింతు.

తే.గీ. శక్తియనగ కేవలము స్త్రీ శక్తియే య
నంగ, సాహస విక్రమమ్మనగ స్త్రీయె
యని ప్రశంసింప రుద్రమ్మ నందజేసి
నట్టి తెలగాణ తల్లికే నంజలింతు.

తే.గీ. నా తెలంగాణ కోటి రత్నాల వీణ
యన్న కవి దాశరథిని మా కందజేసె,
నా తెలంగాణ గోడెల్ల నాదు గొడవ
యన్న ధీరుని కాళోజి నందజేసె;
అట్టి తెలగాణ తల్లికే నంజలింతు.

తే.గీ. నా తెలంగాణ ఎంతగా నష్టపోయె
దీని ఉనికిని కాపాడు తెరువులేవి?
అనుచు నొక్క సిద్ధాంతమ్ము నరసి విరిసి
నట్టి ఆ జయశంకరు నందజేసి
నట్టి తెలగాణ తల్లికే నంజలింతు.

తే.గీ. అరువదేండ్లుగా తెలగాణ అలమటించి
కన్న కలను కన్నుల ముందు కనగ జేయ
పంతమును బూని పోరాడి ఫలము గొనగ
కల్వకుంట్ల శ్రీ చంద్రశేఖరు నొసంగి
నట్టి తెలగాణ తల్లికే నంజలింతు.



ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ
SRT23, ఆజామాబాద్, రాంనగర్ దగ్గర,
హైదరాబాద్-500 020 చరవాణి: 9618032390

22

# సమర గీతం

ఉస్మానియా ప్రాంగణాన - అగ్గి రగులుతుందిరా!
తెలంగాణ సోదరా!
కాకతీయ క్యాంపస్‌లో - కదన భేరి మ్రోగెరా!
తెలంగాణ సోదరా!
విద్యాలయాలన్ని నేడు - యుద్ధ భూములాయెనే!
తెలంగాణ సోదరీ!
తుది సమరం మొదలైనది - పద పద పద
కదులుదాము
తెలంగాణ సోదరీ! ॥ఉస్మానియా॥

ఇది ఆఖరిపోరాటం - విశ్రాంతికి వీలులేదు
క్షణం విశ్రమిస్తే - ఒక యుగం వెనుకబడిపోతాం
ప్యాకేజీ ప్రయోగాలు - సయోధ్యలకు తావులేదు
రాజీమార్గాలకు ఇక - రానుపోను దారిలేదు
తెలంగాణ రాష్ట్రమొకటె - సర్వరోగ నివారిణి
కోట్లాది ప్రజలొక్కటై - కోరుతున్న డిమాండిదే
తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ
॥ఉస్మానియా॥

మా భూములు మాకేనని - పల్లె పల్లె ధ్వనిస్తుంది
మా నీళ్ళూ మాకేనని - పొలాలు నినదిస్తున్నయ్
మా అడవులు మాకేనని - చెట్లు బుసలు కొడ్తున్నాయ్
గనులు వనులు మావేనని - బొగ్గు పలవరిస్తున్నది
కొండలు గుట్టలు అడవులు - జెండాలై ఎగురుతుంటె
గుండె గుండె రగిలి అగ్ని గుండంగా మండుతుంది
తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ
॥ఉస్మానియా॥

ప్రజా ప్రతినిధులంతా - ప్రతిన బూని కదులుతున్రు
శాసన సభ్యులు పదవీ - త్యాగానికి పూనుకున్రు
మంత్రి పదవులను - కాలి ధూళిలాగ దులుపుతున్రు
పార్టీలన్నీ ఒకటే పాట పాడుకుంటున్నయ్
జెండాలన్నీ ఒకటే ఎజెండాగ లేస్తున్నయ్
తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ
॥ఉస్మానియా॥

ఇదే అదను కదులుదాము - ఢిల్లీ తలదించు వరకు
అధిష్ఠాన ధృతరాష్ట్రుల - కళ్ళను తెరిపించు వరకు
పాలకవర్గాల మెడలు వంచి - బిల్లు తెచ్చుదాక
పార్లమెంటులో బిల్లు - ఆమోదం పొందుదాక
ప్రతీఘాత ఉద్యమాల - ప్రతిఘటనల నధిగమిస్తూ
జన్మహక్కు తెలంగాణ - రాష్ట్రం సాధించుదాము
తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ - తెలంగాణ
॥ఉస్మానియా॥



**ఆచార్య బన్న అయిలయ్య**
తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం,
వరంగల్లు-9 చరవాణి: 9949106968

# 23

# తొలి అడుగువేసాక....

చరిత్ర పేజీల నిండా రక్తపు మరకలే
అరవదేండ్ల వ్యథ తల్చుకున్నప్పుడల్లా
కంటి మీద రెప్ప వాలదు
కడుపులోకి మెతుకు దిగదు
కలలో కూడా భయంకర దృశ్యాలే
కళ్ళు తెరిస్తే మాత్రం
జ్ఞాపకాల పొరల్లో దాగున్న
విషాద సన్నివేశాలు తోసుకొస్తాయి
ఒకటా రెండా అరువదేండ్ల బాధకదా!
కాలం మైపూతతో గాయం నయమైంది
మననేలపై మన జెండాను పాతాకా
గర్వంతో తలెత్తి ఆకాశం వైపుకు చూసాకా
సూర్యుడు మనవెంటే పయనిస్తున్నాడు
ఎప్పుడైనా నిశీథిలో నిరాశతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు
చంద్రుడు చల్లని వీచికలతో నేలకు
దిగినట్లే అన్పిస్తుంది వీరుల త్యాగం వృథాకాదని
ఆశయం పక్కలో బళ్ళెమై గుచ్చుకుంటుందని
అనుభవాలు గుణపాఠం చెప్పుతూనే ఉన్నాయి
వసంతం వేసే తొలి అడుగుతోనే
గ్రీష్మం పలాయనం చిత్తగిస్తుంది
ప్రణాళికల ప్రకటనను అపహాస్యం చేసే
వంకరనోళ్ళు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి.
ఒంటికంటిన సమైక్య మసితుడుచుకోనేలేదు
వాడు వేలుపెట్టి చూపుతూ నిందిస్తున్నాడు
దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తే ప్యాకేజీ ఉద్యమాలు
మొగ్గలోనే స్వప్నాన్ని చిదిమేయాలనుకుంటున్నాయి
అయినా అడుగు తడబడగూడదు
మాట తొణక కూడదు
జండా ఎగురుతూనే ఉండాలి
దొంగలుబడ్డ ఇంట్లో మిగిలిన వస్తువులేంటో వెదకాల్సి ఉంది
అవసరమైన ఇసిరెలుపోగు చేసుకొన్నాక
మళ్ళీపొయ్యి పెట్టి వంట మొదలెట్టాలి
ఉడికేదాకా ఆగినవాడు
దింపేదాకా ఆగితే తప్ప
రుచి చూడలేడు
మదపుటేనుగు పొర్లిన మడుగులు
తేట నీరు పేరుకోవాలి
కొంగలు తొక్కిన పొలం చూసి భీతిల్లకూడదు
రెక్కలు ముక్కలు చేసికొనైనా
మడిని మళ్ళీలాలించి బుజ్జగించి
నాలుగు గింజలు విత్తి
పదిమందికి ఫలితం పంచేదాక విశ్రమించకూడదు
ఇప్పుడు తెలంగాణ
తనబాటను విశాలం చేసుకుంటుంది
పునర్నిర్మాణంలో తలమునకలై
శాంతికపోతాలు ఎగరేసి అభివృద్ధి నమూనాని
సరిహద్దుల ఆవలికి బట్వాడ చెయ్యాలనుకుంటుంది

**అచార్య సి. నారాయణరెడ్డి**
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్,
బొగ్గులకుంట, హైదరాబాద్-1

# 24

## క్రమ పరిణామాలు

ఆ విత్తనం చిన్నదే కదా అని ఉపేక్షించొద్దు
పరిస్థితుల సముచిత దోహదంతో
ఆ విత్తనమే వృక్షమై నిలుస్తుంది
ఇది చినుకే కదా అని అనుకోవద్దు
ప్రకృతి రచించనున్న వర్షకావ్యానికి
ఈ చినుకే తొలి పలుకు
ఇప్పుడు ఒక మహాత్ముని గుండెలా
నిండుగా ప్రవహించే జీవనది
ఒకప్పుడు ఏ కొండకోనల్లోనో
సన్నటి నీటిపాయగా తప్పటడుగులు వేసిందే
ఏ చరిత్రయినా చిటికెలో తయారు కాలేదు
అది ఎన్నెన్ని సంఘర్షణలను తట్టుకుని
ఎందరి త్యాగాలను ఊతకర్రలుగా పట్టుకుని
తరతరాలుగా
కాలం విధించే అగ్నిపరీక్షలకు నిలిచి
మనదాకా తరలి వచ్చిందో

విడివిడిగా ఉన్నప్పుడు ఇటుకల విలువ
తెలియదు
అవే సంఘటితంగా రూపొందితే
మిద్దెలై మేడలై
మనల్ని విభ్రాంతుల్ని చేస్తాయి
ఎంతటి కొమ్ములు తిరిగిన విద్వన్మణియైనా
పసిప్రాయంలో
అఆల స్తన్యం అరగించిన వాడే
ఉలిదెబ్బలు పడందే
ఏ రాయీ రమణీయ శిల్పాకృతి పొందదు
ప్రాథమిక దశను బట్టి
దేని అస్తిత్వానికీ అంచనా కట్టలేం
కాలమనే బృహత్ గ్రంథం పుటలు విప్పి
చదువగలిగితే
అన్ని క్రమపరిణామాల ఆద్యంతాలు
అవగతమవుతాయి



**ఆచార్య డి.యం. రవిప్రసాద్**
బ్లాక్-బి2/105, సద్భావన టౌన్‌షిప్, పోచారం, జోడిమెట్ల క్రాస్‌రోడ్.
ఉప్పల్‌రోడ్, ఘటకేసర్, రంగారెడ్డి, హైద్రాబాద్.
చరవాణి: 9391070836

25

# టాలెంటెడ్ తెలంగాణ

జై తెలంగాణ
జైజై తెలంగాణ
డబుల్ 'టి' టాలెంటెడ్ తెలంగాణ
ట్రిపుల్ 'టి' తెలుగు టాలెంటెడ్ తెలంగాణ

పొద్దుపొద్దుకి 'టి'లు కావాలి
'టి'కు టాలెంట్ తోడౌతుంది
'టి' 'టి'లు కలిస్తే సృజన అవుతుంది
మూడు 'టి' లతో ముచ్చటగా ఉంటుంది.

త్రి 'టి' లు సృష్టి, స్థితి, లయ
ఆ స్థితప్రజ్ఞ నుండి సృజనకే సృష్టి
ఆ సృజనాత్మక శక్తియే తెలంగాణ 'టి'లు
విశిష్ట వ్యక్తిత్వం గల సృజనలు

అరవై కళలకు ఆరాధ్యులు
108 విద్యలకు నిలయాలు
ముక్కోటి ప్రజ్ఞ మూర్తిమత్వాలు
లెక్కలేనన్ని టాలెంట్ గల వ్యక్తిత్వాలు

'టి' కోటి రతనాల వీణ
కోటానుకోట్ల నైపుణ్యతల చిరునామా
చేతివృత్తుల కళల సృష్టికర్తలు
పరివర్తనలో బ్రతికే శ్రామికులు
ఉద్యమాల ఊపిరైన త్యాగధనులు
అభివృద్ధి లక్ష్యంగా ముందున్న మేధావులు
టాలెంట్‌తో తపిస్తున్న క్రియాశీలులు
'టి' 'టి'ల తెలుగునేల ధన్యజీవులు

ఒకొక్కరు ఒక సామాజిక సైనికుడు
ఊరు, మండలాలు కలిపి ఉద్యమాలు చేశారు
నైపుణ్యతల తెలంగాణకు బాటలు వేస్తున్నారు
ట్రిపుల్ 'టి' ఇదే తెలంగాణ తేజం

బంగారు తెలంగాణ అంటే ట్రిపుల్ 'టి'
ప్రజలు బంగారమైతే డబుల్ డబుల్ 'టి'
ప్రపంచంలోనే ఇది టాలెంటెడ్ తెలంగాణ
స్వరాష్ట్రంలోనే సాధ్యమౌతుంది విశిష్ట తెలంగాణ.

ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి
చరవాణి: 9492047027

26

## ఇంతకన్నా సంబురం యాడుంటది

అరవయ్యేళ్ళ సంది పోరుచేసి
తెలంగాణ తెచ్చుకుంటిమని ఏనుగెక్కినంత
సంబరపడిపోతుంటే ఆ సంబురాన్ని ఏకంగా
ఎవరెస్టు శిఖరమెక్కించిండ్రే మన పిల్లలు
ఇంతకన్న సంబురం యాడుంటది
సంబురంమీద సంబురమాయె
తెలంగాణ వొచ్చిన యాళ మంచిదేమో
ఎంత మంచి సుద్దులు వింటిమి
ఎంత సంబురాన్ని కంటిమి తెలంగాణ బతుకులల్ల
ఇన్ని సంబురాలు ఒక్కసారిగ ఎన్నడన్న వొచ్చెనా?
కోటి కోట్ల తంబురాలు మీటినట్లాయె
కోటి కోట్ల రంగురంగుల బతుకమ్మలను పేర్చి
నా తెలంగాణ తల్లులందరు ఆడినట్లాయె
కోటి రత్నాల వీణలు మోగంగా
కోటి కిన్నెరలు కోటి రాగాలు పాడినట్లాయె
నిన్న మొన్ననే తల్లుల ఒడుల నుంచి
బుడి బుడి అడుగులేసుకుంట బడికెళ్లిన
పసిపిల్లలే ప్రపంచాన ఎత్తయిన ఎవరెస్టునే ఎక్కిండంట్రే
తెలంగాణ కన్నులన్నీ బంగారు బొంగరాలై గిరగిరా
తిరిగినట్లు తెలంగాణ ఎదలన్నీ పతంగులై ఎవరెస్టు గిరి
మీదనే ఎగిరి ఆడినట్లు తెలంగాణ
సంకలన్నీ డప్పులై మోగంగా
ఆ మంచుకొండలన్నీ అదరిపోంగా
కరిగి నీరై ఆనందగంగలు పొంగి పొర్లినట్లు
అంబరమంత అబ్బురమైన సంబురమే ఇది
చిట్టితల్లి పూర్ణమ్మ రుద్రమ్మనే
చిట్టి తండ్రి ఆనంద్ కొమరం భీమే
టేన్సింగ్‌లైరి, కొదమ సింగాలైరి
వేలకొద్ది పోరుబిడ్డలను పోగొట్టుకున్న కడుపార్తిని
మంత్రమేసినట్లు మాయంజేసిండ్రే మన పిల్లలు
ఇంతకన్నా సంబురం యాడుంటది గిరిపుత్రులోయమ్మ
ఎవరెస్ట్ గిరిమీద సుక్కలై నిలిసిండ్రమ్మా
శూరులంటే శూరులోయమ్మా
అప్పుడే బంగారుతెలంగాణ మన వోకిలి
ముందుకొచ్చినట్లుందమ్మా
సమసమాజ తెలంగాణకు సడకేసినట్లున్నదమ్మా
మీసమైనా మొలవని పోరడు
తెలంగాణ తండ్రుల మీసాలు ఎగరేయించిండే
చీరనన్నా కట్టని చిన్ని పోరి
తెలంగాణ తల్లుల కడుపులను బంగారమే చేసిందే
ఇంతకన్నా సంబురం యాడుంటది
పూర్ణ ఆనంద్‌లు తెలంగాణ తల్లికి
సంపూర్ణానందమే కలిగించిండ్రే మన తెలంగాణ తేజాలకు
ఒక్క గొంతుకతో ఒక్కసారిగా జేజేలు
పలుకంగా, ఎవరెస్టు శిఖరమే దద్దరిల్లంగా
తెలంగాణ ప్రజలంతా రండి, రారండి.







**ఆచార్య జ్యోతిరాణి**
11-6-254, పోచమ్మబాగ్, సరూర్‌నగర్,
హైద్రాబాద్-500035 చరవాణి: 9951035235

27

# అక్షరాంజలి

అమ్మ ఒడి వంటిది తెలంగాణ!
అక్షయపాత్ర వంటిది తెలంగాణ!!
ప్రాణమిస్తుంది మంచితనానికి!
ప్రతీకవుతుంది మానవత్వానికి!!
హిమసానువంతటి వ్యక్తిత్వం
సాగరమంతటి గాంభీర్యం
ఆత్మీయతత్వం అమాయకత్వం
కల్లాకపటం లేని నిష్కళంక హృదయం
ముక్కుసూటితనం స్నేహహస్తం
నక్కజిత్తులు తెలియని భోళాతనం
ఇక్కడి ప్రత్యేకత!
మదినిండా మమత!!
అందరూ మనవారేనని
అక్కున చేర్చుకోవటమే తప్పయినట్లుంది
తిన్న ఇంటి వాసాలు లెక్కించిన ఘనులు కొందరు
తడిగుడ్డతో గొంతుకోసినా భరించింది
నోటితో పొగడి
నొసటితో వెక్కిరించటం న్యాయమా?
నోటిని వ్యంగ్య వాగ్బాణాల తూణీరంగా
మార్చుకోవటం ధర్మమా?
మితిమీరిన స్వార్థంతో ఆశ్రిత పక్షపాతంతో
అర్హులను అణగదొక్కి అందలాలెక్కి
మా భవితను కొల్లగొట్టటం సమంజసమా?
గోముఖ వ్యాఘ్రాలవలె ప్రవర్తించడం సబబా?
అన్యాయానికి గెలుపు కొంతవరకే
ఆదమరుపు స్వల్పకాలం కొంతవరకే
సహనం అవధులు దాటినవేళ!
చైతన్యం పెల్లుబికిన వేళ!!
విక్రమించి ఉద్యమించింది యువత!
తోడు నడిచింది సమస్త ప్రజ!!
తాడోపేడో! చావోరేవో!!
విజయమో! వీర స్వర్గమో!!
ప్రాణాలను ఫణంగా పెట్టిన
విప్లవ వీరులారా! అమరులారా! మీకు జోహార్
స్వప్నం సాకారమైన వేళ అయ్యో? మీరు లేరే?!
కాదు! కాదు! మీరున్నారు!
ధృవతారలై వెలుగుతున్నారు
తెలంగాణ తల్లి గర్భశుక్తి ముక్తాఫలాలు మీరు
జన్మభూమి ఋణం తీర్చుకున్న త్యాగధనులు మీరు.
మీకిదే అక్షరాంజలి!
ఇదే ఇదే అశ్రు నివాళి!!



ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య
హనుమకొండ, వరంగల్లు

28

## నా తెలంగాణ తల్లి

గౌతమబుద్ధుని గంభీర వాక్కులు
చెవుల నింపిరి నాడు తెలుగు వారు
శాతవాహన మహాసామ్రాజ్య చిహ్నాలు
కోటి లింగాలలో బైట పడగ
విష్ణుకుండిన రాజ్యవిభవంబు తెలంగాణ
మట్టి పెళ్లలలోన మనలియాడ
కాకతీయుల శౌర్య గంభీర నాదమ్ము
దిక్కు దిక్కుల వెంట పిక్కటిల్ల
అడుగడుగు నందు చెరువులు, అవనితల్లి
దాహమును తీర్చు ముంగిళ్లు మోహపెట్ట
నాటి తెలంగాణ మరచియున్నామొ? మనము
అల్పభావన క్రమ్ముకొన్నట్టి వేళ
సత్య దూరమ్మైన శపథమ్ము పుట్టిన
మున్న ఊడిగములు మోయవలనె
వైనతేయుని దాస్యభంగమ్ము కాద్రవే
యుల ప్రభుత్వ స్ఫూర్తి తొలగజేసె
ఎదుగల తమ బలమ్మొదిగి జీవించిన
భుజమెక్కి ప్రభువులై నిలిచినారు
ఆధిక్య భావన కడ్డుకట్టయు లేదు
కనుల ముందరె దోచుకొనుట చెలగి
అన్నిటిని మించి కుటిల రాజ్యాన మనల
చీల్చి, కీలుబొమ్మల వలె జేసినారు

నోటితో పల్కరించుచు నొసలితోడ
వెక్కిరించిన చందమై వెలసె బ్రతుకు
అరువ దేడుల దాస్యయాత్రలో నిట్టూర్పు
వేడి గాలులు ప్రసరించె చూడు
అరువదేడుల తొండియాటలో ప్రాణాల
ఆహుతుల్ దివ్యాగ్ని నావహిల్లె
అరువదేడుల మూగ దరువులో పాటల
సంద్రాలు పొంగెత్తి చదల నెక్కె
అరువ దేడుల జైత్రయాత్రలో నెత్తుటి
చుక్కరాలని రణ స్ఫూర్తి మిగిలె
వంచనలు మోసములు దాట వైచుటలు వృ
ధానువాదములున్ తుది వరకు కుటిల
తంత్రములు 'పెప్పరు స్ప్రేలు' తరలిపోయి
అరువదేండ్ల యుద్ధము విజయాభిముఖము
నింగి తెలంగాణ సూర్యుడు పొంగినపుడు
సోమన్న దేశి వాక్శోభా సమగ్రత
నాల్కలపై చింది నాట్యమాడ
పోతన్న కవి గుండె లోతుల ముట్టిన
మాధుర్య రస రమ్యమంజులతయు
వరదన్న కవి దీప్త వాగ్దేవతా రీతి
ఆత్మవిశ్వాస జీవాగ్ని నిలుప





పిడుగు పడ్డట్లు చెప్పిన దాశరథి పద్య
ఘోష శతాబ్దుల కొలదులణచ
అస్మదనంత విద్యాసారమగు వాక్కు
తరుణమై వహ్నికా ధార యగుత
ఈ తెలంగాణ తల్లి సాహిత్య దీప్తి
కత్తి వాదరయై భావ గంధమగుచు
తేనె వాకయై బ్రతుకుల తీర్చుగాక
అడుగడుగు పుల్కరించెడి సుడుల కీల
జనని భారతమాతృ సౌందర్య భావన
కొక కౌస్తుభమ్మయి ఒదుగు గాక
తెలంగాణ బిడ్డ లందించిన వెన్నెల
లావరించుత సమస్తావనిపయి
రోదసి మనుజుల స్వేదమ్ము పరిమళ
మై పరిశ్రమము సౌహార్దమగుత
నింగి మబ్బుల తోడ, నేల పంటల తోడ
లోకమ్ము సమరస శ్రీకమగుత
మరచిపోయిన బాస తొలిగిపోయిన పాట
రెల్లు పందిళ్లు కల్పించుగాక
అబ్జముగ దేశ మాతృ శీర్షాగ్రమందు
ప్రాణ రక్షానుదీప్తి విప్పారు గాక
నా తెలంగాణ జీవన నవ్యశోభ
అడుగడుగు నందు నూత్న ప్రభాప్తియగుత!

ఆచార్య మసన చెన్నప్ప
9-76/2, ప్లాట్ నెం.2, రోడ్ నెం. 1, ఉదయ్‌నగర్ కాలనీ,
బోడుప్పల్, హైదరాబాద్-39. చరవాణి: 9885654381

29

## అందుకో దండములు

సీ. తంగేడు పూలన్న తన్మయత్వము సూపు
        బతుకమ్మ తల్లికి ప్రణతులివిగో !
    గునుగుపూలన్నచో కోరిక గనబర్చు
        మముగన్న తల్లికి మాడలివిగో!
    ముత్యాల పూలన్న మురిపెంబు గురిపించు
        మా నేల తల్లికి మధువులివిగో!
    చేమంతి పూలన్న స్నేహంబు చేసెడి
        గొప్పింటి తల్లికి గుజ్జులివిగో!

తే.గీ. అడవి చేమంతి పూలతో నలరు తల్లి
    పట్టుకుచ్చుల పూలతో బరగు తల్లి
    బంతి పూలతో వెలుగొందు పసిడితల్లి
    అందుకోదండములు బతుకమ్మ తల్లి!

సీ. తెలంగాణ రాష్ట్రమై వెలుగు లీయాలన్న
        బతుకమ్మయే గదా బలమునిచ్చు
    ప్రజలెల్ల ఐక్యత పాటింపవలెనన్న
        బతుకమ్మయే గదా ప్రగతినిచ్చు
    బడుగులు సౌఖ్యముల్ బడయంగ వలెనన్న
        బతుకమ్మ యేగదా మెతుకు నిచ్చు
    కవులు కళాకారులవతరించాలన్న
        బతుకమ్మయే గదా ప్రతిభనిచ్చు

తే.గీ. భవ్యముగ శౌర్య ధైర్యసంపదలనిచ్చి
    సకల జనులకు గొప్ప సౌజన్యమిచ్చి
    కంటికిని రెప్ప వోలెను గాచుతల్లి
    అందుకో దండములు బతుకమ్మ తల్లి!



అచార్య ఎన్. గోపి
ఇంటినెం. 13-1-5బి , శ్రీనివాసపురం, రామంతపూర్,
హైద్రాబాద్-500013. చరవాణి: 040-27037585
ఇ-మెయిల్: s@gmail.com

# 30

# మళ్లీ విత్తనంలోకి

అప్పుడప్పుడు
మళ్లీ విత్తనంలోకి వెళ్ళిరావాలి
ఈనాటి ఆకుల నిగనిగలు
అర్థం కావాలంటే
ఆనాటి మూలాల్లోకి తొంగిచూడాలి
ఇప్పటి పువ్వులనూ
అప్పటి స్వప్నాలనూ బేరీజు వేసుకోవాలి
పురిటి కేకలను
మననం చేసుకుంటేనే
భాషలోని జీవన తాత్వికత
బోధపడుతుంది
ఉంగా ఉంగాల స్వారస్యం
బాలసాహిత్యానికి పునాది అవుతుంది
అందుకే ఒక్కసారైనా
విత్తనంలోకి వెళ్ళిరావాలి
చాలా దూరం గడిచాక
స్వార్థం సహజమై పోతుంది
నటనల అట్టడుగున
నైసర్గికం అణిగిపోతుంది
వేళ్ల సందుల్లోంచి
రాలిపోతున్న ఇసుకను
వొడిసిపట్టు కోవడానికైనా
వెనక్కి వెళ్ళక తప్పదు
కొత్త పుస్తకం
మనిషి వాసన వెయ్యాలి
వాసనలంటే జ్ఞాపకాలే!
జ్ఞాపకాలు వర్తమానం దాకా
వంతెనలు నిర్మించాలి
వంతెనలంటే
మానవ అనుబంధాలే!
కొత్త సందర్భాన్ని గుర్తించి
సరికొత్త విలువల్ని మేలుకొలపాలి
అవును
మూలాల్లోకి వెళ్ళి తీరాలి
మళ్ళీ మనం జన్మించాలంటే
విత్తనంలోకి వెళ్ళిరాక తప్పదు

ఆచార్య ననుమాసస్వామి
తెలుగుశాఖ, ఉ.వి.వి. హైదరాబాద్-07
చరవాణి: 9848545949, 8121814645

31

# తంగేటి పూలలో నా తెలంగాణ



తంగేటి పూలలో నా తెలంగాణ
పసుపు బతుకుల తల్లి నా తెలంగాణ
పసిడి వన్నెల రాణి నా తెలంగాణ...
ఆడపడుచుల సౌభాగ్యానికై తెలంగాణలో అవతరించిన
తంగేటి తరువా! గౌరీదేవి పసుపుపారాణి నుండి జారి
మా పుణ్యభూమిలో పడి మొలిచావా!
దేవతారూపంలో పెరిగి సాంస్కృతిక పర్వాలలో 'టోట'
మై నిలిచి పోయావా! పైరగాలికి ఊగుతూంటే పాము
పడగల పుట్టగొడుగు ఊగినట్టుంటుంది
వసంతంలో తనువంత పులకించి చిగురించే నునులేత
పసుపు పత్రాలు రాలేమంచు తుంపరలే చిత్తడిలో తడిసి
మెరిసిన ఉమా మేను అందాలు
పసుపు నీటిలో ఆరబోసుకొన్న సౌందర్యమే అన్ని
లోకాలకు ఆదర్శమైంది
కొమ్మకొమ్మకు ముత్తైదువుతనంగా పూసిన పూలకోసమే
కొప్పుల తండ్లాట తెలంగాణ పడతుల కొప్పుల్లోని
పూలను చూసి పార్వతికి ఎంత అసూయో
నిత్య సుమంగళి తెలంగాణా స్త్రీ నిండనూరేళ్లు తరగని
సౌశీల్యం ఆమెది
శ్రీకళతో మెరిసే అపురూపసుందరి గోరుమద్దలకే
త్రిమూర్తులు దిగొచ్చారు
తంగేటి లందలో దాక్కొని రేణుక నీ మూలంగానే
ప్రాణాలు దక్కించుకొంది
పుట్టిబోయే పిల్లలకు బతుకమ్మ పేరు పెట్టింది నీ
మహిమ జూసి కదా తల్లీ!
సరస్వతి జ్ఞానం శ్రీ లక్ష్మిసిరి గౌరీదేవి సౌభాగ్యాల
ప్రతీక బంగారు బతుకమ్మ
నవరాత్రులు నిను కొలుచి నిత్య సుమంగళిగా
నిలవాలనే విశ్వాసం స్త్రీలది
సద్దులనాడు నీళ్లలో నిను నిమజ్జనం చేస్తే మళ్ళీ
తెలంగాణ తల్లి చేతికెక్కావు
రాష్ట్ర పండుగగా, కనుల నిండుగా స్త్రీ జాతికి తరగని
వరమై నిలిచిపోయావు
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు
బతుకమ్మ ఉయ్యాలో మా గీతం
పద్మాక్షి గుడిలో ఆలపిస్తే బెజవాడ కనకదుర్గమ్మ
గుడిలో ప్రతిధ్వనిస్తుంది
ఖండాంతరాల్లో ఎక్కడున్నా మా ఆడపడుచులు
బతుకమ్మలను ఆడతారు
శత్రువు కండ్ల పడకుండా తంగేటి చెట్టుకింద
బాలుడిని పడేస్తే బతికించావు
వివస్త్రలజేసి బతకమ్మలాడించిన మా సెంటిమెంట్
చింతాకంత తరగతేలేదు
తెలంగాణ పోరులోస్ఫూర్తికోసం ఆడ పడుచులు
బతుకమ్మలను ఆడలేదా!
నిరసకు నీవే నీరాజనానికీ నీవే! నిను నిల్పుకొన్న
తెలంగాణ ఇలవేల్పు నీవే బతుకమ్మ ఉయ్యాలో
తంగేడి పూలలో ఉయ్యాలో
నా తెలంగాణమూ ఉయ్యాలో...





ఆచార్య పి. లక్ష్మీనారాయణ
చరవాణి: 9542656636

# 32

# భువనగిరి ఖిల్లా

భువనగిరి గుట్ట ఇలా మహోన్నతమైన గుట్టగా
మారిపోయిందేమో!
ఆకాశంలో పయనిస్తున్న నల్లని ఐరావతం
ఇక్కడ పచ్చని తమలపాకులు తమ చేతులు చాచి పిలిస్తే
ఆ ఆహ్వానాన్ని అంగీకరించి ఇలా నేలపై
నిలిచిపోతుందేమో!
ఇది అపురూపం అసమానం ఆశ్చర్యం
ఇది నిక్కచ్చైన నికార్సైన నిజం
ఈ ఏకశిల నిలువెత్తు సాక్ష్యం
నల్లని మబ్బుల్ని తాకే గండుశిల
ఆకాశాన్ని తన తలపై మోస్తున్న కల
ఈ కోట బురుజులకు చెవి ఆనించి వింటే
నాకు చరిత్రలో వెలిగిన భువనమల్లుని వీరగాథ వినిపిస్తుంది
తోపుల అరపులు, చెరగిపోయిన బ్రతుకులు
ఒరిగిపోయిన సామ్రాజ్యాలు, అక్షరాలలో నిక్షిప్తంకాని
నిజాలు,
ప్రతిఘటనలు మనసులో మారుమోగుతాయి -
ఈ కొండ ఈ ఊరిప్రజల ఆశలు ఆశయాలు
ఆత్మాభిమానానికి మహాప్రతీక
అది సామాన్య జనుల సగటు బ్రతుకుల
వ్యథలు, బాధలు ప్రతిధ్వనిస్తుంది
ఒక కొండకు కూడా గుండె ఉంటుందని నిరూపిస్తుంది -
మెట్లెక్కి ద్వారాన్ని దాటిపోతే
నీటికొలనులో కలువలు ఒరగా పలకరిస్తాయి
పగలే చంద్రునికోసం ప్రతీక్షిస్తున్నట్లు సగమై
విచ్చుకుంటాయి
రాత్రివేళ తారలు ఖిలా కిరీటంపై వ్రాలి కాంతులు
వెదజల్లుతాయి
స్వప్న స్వరూపాలు అప్సరసలెవరో
అటునుండి ఇటు కదిలిపోయే భ్రమ ఆవహిస్తుంది.
ఊరిలో శ్రామికులు ఈమట్టిలోని మమతను మహిమను
చాటుతూ
రారాజుల్ని మెప్పించే కూజాలు సృష్టిస్తారు
హమాలీ కష్టజీవులు కర్షకులు పండించిన ధాన్యాన్ని
దేశపు నలుమూలలకు పంపిస్తారు
నిరుపేదలెందరికో తరగని అండ ఆసరా ఈ కొండ
మొన్న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ ఆనందులకు
కొండను ప్రాకే ప్రావీణ్యతలో పాఠాలు నేర్పింది.
ఈ విషయం సమకాలీన చరిత్రకు అందకపోవడం
దురదృష్టం.
ఊరు చెరువు ఎండిపోయినా కరువు కాటువేసినా
ఈ మట్టిలో పుట్టడం మా అదృష్టం.
ఇన్‌ఖిలాబ్ కా ఇకరార్ - మైదానె జంగుమె తల్‌రార్ భోనగీర్
గులోగుజార్ - సదా బహార్ బోన్‌గీర్
మంజిలేతక్‌దీర్ సా కోహినూర్ ఏక్ బోన్‌గీర్.

ఆచార్య రామా చంద్రమౌళి
చరవాణి: 9390109993

33

# తెలంగాణ ఇప్పుడు దూసుకుపోతున్న క్షిపణి

**జూ**న్ రెండు... రెండువేల పద్నాల్గు
ఉదయం సూర్యుడుదయించలేదు... తెలంగాణ తల్లి
యుద్ధరంగంలో అలసి గాయపడి సొమ్మసిల్లిన
ఉద్యమయోధులైన తన పిల్లలను
తన అమృతహస్తంతో శిరస్సులను స్పర్శించి నిద్రలేపింది
అందరమూ కొత్త ఇంటిలోకి అడుగుపెట్టాముగదా...
అప్పుడది దొంగలుపడ్డ ఇల్లు
గడప దాటగానే లోపల నేలలేదు...
భూమిని కూడా తవ్వుకుపోయారు దొంగలు
అంతా చిమ్మచీకటి - న్యాలబొయ్యారం
అప్పుడుదయించాడు ఒక సూర్యుడు...
ఒళ్ళంతా అగ్నిచ్ఛటలతో మహోజ్వల విశ్వతేజమై
ఒక్క సూర్యునివెంట నాలుగు కోట్ల సూర్యులు...
ఇక చీకటెక్కడుంటుంది
చీకటి తోకముడిచి తెలంగాణ పొలిమేరలను దాటి
పారిపోయింది
ఇక దొంగలుపడ్డ ఇల్లును మళ్ళీ సరిచేసుకోవాలె
ఐనా... శతాబ్దాలుగా శరీరాన్నే ఆయుధంగా చేసుకుని
ఒట్టి భూమినే తల్లి ఒడిగా చేసుకుని బతుకుతున్న
తెలంగాణా బిడ్డలకు పడిలేవడం... కూలిపోయి మళ్ళీ
ఆకాశమెత్తు లేచి నిలబడడం...
మట్టితో సహా సౌధాలను పునర్నిర్మించడం కొత్తా?
రక్తాలోడే పాదాలు నడక మొదలుపెట్టిన ఒక్క ఏడాదిలోనే
ప్రపంచమే, అదిగో తెలంగాణ.. వాకిట్లో మోకరిల్లుతోంది...
ఇప్పుడు తెలంగాణా ఒక సూపర్ కండక్టర్ వాహకం
లోపల నాల్గువేల కోట్ల వోల్టేజ్ ఉంది
జోలికొస్తే పరమప్రమాదం...
దంచికొడ్తే... బంగాళాఖాతంలోనే సమాధి
నాయకులు శరీరంతో కాదు... మేధస్సుతో,
ప్రజలపై ప్రేమతో, దయార్ద్ర హృదయంతో
పరిపాలించాలని
తెలంగాణ కొత్త సిద్ధాంతాన్ని ప్రవచిస్తోంది.
హార్వార్డ్... స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలూ..
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లూ
ఒక్క నెత్తురు బొట్టుకూడా రాల్చకుండా ఉద్యమాలు
నడపొచ్చనీ
నిమిషాల్లో గంటల పనినీ... రోజుల్లో మాసాల పనినీ...
ఒక్క జీవితంలో అనేక జీవితాల పనినీ
చేయడమెట్లనో చెప్పి చేసి చూపిస్తాంటే...
'అరెబై'.. అని అందరూ ముక్కుమీద వేలుగాదు
నెత్తిన గుడ్డలేసుకుంటాంద్రు
తెలంగాణా ఇప్పుడు దూసుకుపోతున్న క్షిపణి
తెలంగాణా ఇప్పుడు నాలుగుకోట్ల సూర్యులను
ధరించిన ఆకాశం
తెలంగాణా ఇప్పుడు స్వర్గనిర్మాణంలో నిమగ్నమై ఉన్న
శ్రామికసైన్యం తెలంగాణ ఇప్పుడు రేపు ప్రపంచానికి
కాబోతున్న ఒక ఆదర్శం... ఒక అగ్నిచ్ఛట...
ఒక సజీవ స్ఫూర్తి....





ఆచార్య రావికంటి వసునందన్
ఇ.నెం. 6-35-26, మల్లారెడ్డి ఎన్‌క్లేవ్, సాయికాలనీ, భీరంగూడ,
హైదరాబాద్-500 032 చరవాణి: 09849852182
ఇ-మెయిల్: vasunandanraavikanti@gmail.com

34

# మన తెలంగాణ తల్లి

పల్లవి : వచ్చింది వచ్చింది మన తెలంగాణ
తెచ్చింది తెచ్చింది మురిపాల వాన ॥వచ్చింది॥

చ 1. ప్రజల మనసుల కాంక్ష ప్రమిదగా అమరగా
నిలువ కేసీఆర్ నిజముగా వత్తిగా
అమర వీరుల ఉసురు చమురుగా వెలుగగా
అన్ని వర్గాలకూ ఆనందకాంతిగా ॥వచ్చింది॥

చ 2. ఎన్ని ఆటంకాలు ఎదురొడ్డి నిలిచినా
అన్నిటి నెగురగొట్టి అడ్డు లేకుండగా
గెలిచింది గెలిచింది విలువైన దీక్ష
ప్రత్యేక రాష్ట్రమై పండిన పరీక్ష ॥వచ్చింది॥

చ 3. ఒక చేత బతుకమ్మ ఒక చేత పంటసిరి
ఒయ్యారముల మేన ఒంపు సొంపులు ముసిరి
మేలిమి కిరీటమున మేలైన నగలతో
కనుల వెల్లువలెత్తు కరుణామృతమ్ముతో
॥వచ్చింది॥

చ 4. జయహెూ తెలంగాణ! జై తెలంగాణ!
జై జై తెలంగాణ ! జై తెలంగాణ !
అన్ని దిక్కులలోన జనులుహోరెత్తగా
ఆత్మ ప్రదీపాల హారతులనెత్తగా ॥వచ్చింది॥
వందే తెలంగాణా!

ఆచార్య టి. మోహన్‌సింగ్
ప్లాట్ నెం. 10, రోడ్ నెం. 6, సమతాపురి కాలనీ,
న్యూ నాగోల్, హైదరాబాద్-35 చరవాణి: 9490704029

# 35
# పాలమూరు కవిత

శ్రమైక జీవులం మేము
కార్మికులం, కర్షకులం
బాధాసర్పదష్టులం మేము
కూడు కోసం, గూడుకోసం, బట్ట కోసం
దేశదిమ్మరుల వలె తిరిగేవాళ్ళం
పాలమూరు జిల్లావాళ్ళం
రాజధానిలో రిక్షాలాగుతోంది మేమే
రాళ్ళను ఎత్తుతున్నదీ
భవనాలను కడుతున్నదీ మేమే
భాక్రానంగల్
నాగార్జునసాగర్
శ్రీశైలం శ్రీరాంసాగర్
కట్టడాలన్నీ-కాలువలన్నీ
మా శ్రమఫలితమే
రాజకీయ నాయకుల
ఔదాసీన్యానికి,
ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలై
జూరాల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం
ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం
జిల్లాలో ఒక కలగా మిగిలిపోగా
దరిద్రనారాయణులుగా మిగిలిపోయిన మేం
తెలంగాణా వెనుక బడిన తనానికి ప్రతీకలం
అల్‌కబీర్‌లో
ప్రతిరోజూ శ్వాసవిడిచే పశువుల రూపంలో
అతి తక్కువ వెలకు లభించే
చీప్ లేబర్ మేం
సంతానానికి విద్య చెప్పించలేక
కుమార్తెల పెళ్ళిళ్ళు చేయలేక
ఆత్మహత్యలు చేసుకొనే
అభాగ్యులం మేం
నిరాశా నిస్పృహలకు లోనై
జీవచ్ఛవాలుగా బ్రతుకు భారాన్ని మోస్తున్న
జీవులం మేము
పాలమూరు వాసులం మేం
బలహీనులం
బడుగులం
బక్క చిక్కినోళ్ళం
బిక్కచచ్చినోళ్ళం
మా కూలిరేట్లు పెరిగేదెప్పుడో
మా బీడు భూములు
సస్యశ్యామలంగా మారేదెప్పుడో?
మా పిల్లలు చదువుకొనేదెప్పుడో?
మా రాతలు మారేదెప్పుడో?
ఎప్పుడో? మరెప్పుడో?



ఆచార్య వెలుదండ నిత్యానందరావు
చరవాణి: 9441666881

36

# ఆనందాల హరివిల్లు

సంకెళ్ళు లేని స్వాతంత్ర్య దినమిది
అమర వీరుల కలల కపోతాలు శాంతి సందేశాలను
మోసుకొస్తున్న రోజిది
రాహువు చెరనుండి విడివడ్డ ఆశల సూర్యుడికి
స్వాగతాంజలి ఘటిస్తున్న రోజిది
ఇన్నాళ్ళు ఏమేం అన్నామో, ఏమేం లేదని బాధపడ్డామో
ఎందుకోసం వాపోయామో
అవన్నీ పరిష్కరించుకోవడానికి, సాకారం
చేసుకోవడానికి
ఆనందాల హరివిల్లులను ఆకసమంతా విరియ
చేయడానికి
ప్రతిజ్ఞలు చేయాల్సిన రోజిది.
అనౌచిత్యాలకు, విద్వేషపు తూటాలకు టాటాలను
చెప్పాల్సిన తరుణమిది
అర్థంలేని ప్రేలాపనలకు, అవధిలేని ఆవేశాలకు
అంతిమ దినమిది
దోపిడీలకు, అవినీతి భూతాలకు భరతం పట్టాల్సిన
రోజిది
ఏ ఆశయాలకోసం కోటి గళాలు స్తోత్రం చేశాయో
ఏ పరిష్కారాల కోసం ఎన్నెన్ని ప్రాణసుమాలు
అర్పితమయ్యాయో
ఏ సాక్షాత్కారం కోసం హృదయాలు హారతులై
వెలిగాయో
ఆ లక్ష్య సాధనకోసం బాధ్యతా సిందురాన్ని తనువెల్లా
పులుముకొనే రోజిది
ఇక ఈ గానం ఎప్పటికీ సాగిపోనీ...
ఇక ఈ రాగంలో ఎన్నటికీ అపశ్రుతులు కలువకపోనీ...
ఇక ఈ పారిజాత ప్రసూనం ఏనాటికీ వాడకపోనీ...
పరిమళం చెడకపోనీ...
చరిత్ర పునరావృతం కారాదు.
పెనం మీంచి పొయ్యిలో పడ్డ భావన రారాదు
బయటివాడి స్థానంలో ఇంటివాడికి దక్కిన నిండు
కంచం కాకుండా
అలవోకగా అందివచ్చిన అవకాశం కాకుండా
నిత్య జాగరూకులం కావలసిన తరుణమిది
లభించిన ఈ అమృతభాండం
స్వార్థ విషనాగుల కైవసం కాకుండా
కాపాడుకోవలసిన కర్తవ్యాన్ని గుర్తించాల్సిన వేళ ఇది
ఒక్క నిమిషం ఆలస్యమైనా ఎంతో నష్టపోయే పరీక్షా
సమయం
ప్రారంభమైందని తెలిసి మెలగాల్సిన వేళ ఇది.

ఆచార్య ఫణీంద్ర
ఫ్లాట్ నెం. 48, ఈస్ట్ బాలాజీనగర్, లక్ష్మీనగర్ రోడ్,
దుబాయి బిల్డింగ్ ఎదురుగా, దమ్మాయిగూడ, హైదరాబాద్.
చరవాణి: 9959882963

37

# 'ప్రకృతికి' సీమంతము



ఆ.వె. బ్రతుకునిడు ప్రకృతిని 'బతుకమ్మ తల్లి'గా
ఎంచెడు తెలంగాణ యింతులెల్ల
భక్తి గొలిచి, ఆడి, పాడి మురియుచుంద్రు!
ప్రకృతి పూజ సలుపు పండుగిదియ ।

తే.గీ. గునుగు, తంగేడు వంటి పూలను వరించి,
ఏర్చి, కూర్చి, తెలంగాణ యింతి పేర్చి,
అమిత సుందరమ్ముగ 'బతుకమ్మ' దీర్చి,
ప్రకృతికిటుల 'సీమంతము' వరలజేయు ।

ఉ. పూవుల తోడ దేవునికి పూజలు సేయుట చూతు
మెల్లెడన్ -
పూవులకే యొనర్తు రిక పూజలు మా 'తెలగాణ'
మందునన్ !
కోవెల గట్టినట్లు, పలు కోమల వర్ణ
సుశోభితంబులౌ
పూవుల బేర్చి, సల్పుదురు పూజలు స్త్రీల్
'బతుకమ్మ' పేరిటన్!

కం. అంగనలు గూడి యాడుట
సింగారించుకొని పట్టు చీరలు, రవికల్,
బంగారు నగల తోడన్
సాంఘిక సహజీవన ఘన సంస్కృతి గాదో !

ఉ. భారత సంప్రదాయ ఋజువర్తన రీతులు, నీతి,
ధర్మముల్,
పేరిమి గొన్న యట్టి ఘన వీర కథా కమనీయ
భావముల్
కూరిచినట్టి దివ్య రస ఘోషితమౌ 'బతుకమ్మ
పాట'లన్
నేరిచి యాడి పాడెదరు నెచ్చెలులై తెలగాణ
జవ్వనుల్ !

తే.గీ. చెరువులం దౌషధగుణ మలరు సుమాల
చేర్చి, ప్రక్షాళనము సేయు శ్రేష్ఠమైన
శాస్త్ర దృక్పథమ్ము గలుగు సంస్కృతిదియ !
జయము! జయమిదె తెలగాణ సంస్కృతికిని !




**బల్లా సరస్వతి**
సిపిఎస్ కట్కూరు, బచ్చన్నపేట్,
వరంగల్

38

# అభివృద్ధి

నవ్య తెలంగాణా! నవ నిధుల తెలంగాణా!
ప్రత్యేక రాష్ట్ర తెలంగాణ ప్రగతిరథం సాగుతోంది
ఏడాది కాలంలో ఎంతెంతో అభివృద్ధి కెసిఆర్ పాలనలో
మాతా శిశు సంక్షేమం ముందుతరం ఆరోగ్యానికి బాసట
ఆనందమానందమాయె అంగన్‌వాడీ టీచర్ల ఆయాల
జీతాల పెంపుదల
ఆసరా పథకాలు వృద్ధాప్య, వికలాంగుల పించన్లు
వితంతు పెన్షన్లు, బీడీ, నేత, గీత కార్మికుల పెన్షన్లు
నిస్సహాయ, అభాగ్యుల కండ్లల్లో కాంతిరేఖలు
భిక్షాటన పారద్రోలె సమసమాజ నిర్మాణం పునాది
వ్యవసాయ కార్మికులకు భూమిపంపిణీ
ఇండ్లు లేని నిరుపేదలకు రెండు గదుల ఇండ్ల ప్లాట్లు
పంపిణీ కాంతులీను కల్యాణలక్ష్మి అమరవీరుల
కుటుంబ సంక్షేమం
ఇలా ఎన్నెన్నో విద్యా వైద్య సౌకర్యాలు
కరెంటు కొరత తీరిన కారణంగా కర్షకులు
కాలుమీద కాలేసుకుని తీరిగ్గా పేపరు చదువుకుంటూ
క్రమశిక్షణతో టైమ్ ప్రకారం తమ తమ పనులు
చేసుకుంటున్నారు తృప్తిగా
వరుణుడు కరుణిస్తే "మిషన్ కాకతీయ''
తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక వర ప్రసాదం.
జల కళలతో ఉప్పొంగి చెరువులు దొరలై
తమ కడుపునింపుకుని ప్రజల దారిద్ర్యములు బాపు
నవ సంపద, పశుపక్ష్యాదులు, జలచరాలు, వృక్షాలు,
జంతువులు
పెంపొంది ప్రకృతి రమణీయమౌను పాడిపంటలతో
ఏ కొరతలేని గ్రామరాజ్యం రామరాజ్యమౌతుంది
పల్లె, పట్నం తేడాలేకుండ ఇంటర్‌నెట్, వైఫై సేవలు
ఇట్ల ఎన్నో బాధలు బాపే సంక్షేమ పథకాలు
కళాసాహితీ రంగాలకు ప్రోత్సాహం
స్వచ్ఛభారత్‌లో భాగం పంచుకుని గ్రామ పట్టణాలను
అందంగా తీర్చిదిద్దుట, ఉద్యానవనాల పెంపుదల
పర్యాటక, దేవాలయాల అభివృద్ధి
ఇట్లెన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం
అన్ని రంగాల్లో సంక్షేమ ప్రజారాజ్యంగా
ఆదర్శ బంగరు తెలంగాణగా
రూపొందుతుందనడంలో సందేహం లేదు.
ఇదంతా చూసి ఇరుగు పొరుగు రాష్ట్రాలు
వాహ్ తెలంగాణా, భళిరే కెసిఆర్ పాలన
అని మెచ్చుకుంటున్నరు, ముచ్చట పడుతున్నరు
కొందరు మాత్రం అసూయ పడుతున్నరు
ఇంకా ఉత్సాహం పెంచి ఆనందం పంచు
తెలంగాణ రాష్ట్రం ముందు ముందు మనకున్నది
జై తెలంగాణ జైజై తెలంగాణ.



**బూడిద అరుణ్‌గౌడ్**
స్టేషన్‌రోడ్, గార్ల మండలం, ఖమ్మం జిల్లా.
చరవాణి : 9989066569
ఇ-మెయిల్: arungoudbudida@gmail.com

39

# తెలంగాణ వెలుగులు విరజిమ్మాలి

అరవైయేండ్ల ఆంధ్ర వలస పాలన అంతమైంది
కోట్లాది తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ
సాకారమైంది
తెలంగాణ తల్లి స్వేచ్ఛ చిరుదరహాసంతో ఉంది
పునీతమై మనల పులకింప చేసింది
నవ తెలంగాణ అవతరించి నగారా మోగించింది
దశాబ్దంపైగా సాగిన మన పోరులో
విద్యార్థులు, యువకులు ప్రాణాలను తెగియించి
పట్టువీడబోమంటూ బెట్టువీడబోమంటూ
బెరగీసి నిల్చింద్రు ప్రాణ త్యాగం చేసింద్రు
ఉద్యోగులు, సకలజనుల సమ్మె చేసింద్రు
ప్రపంచ ఉద్యమాలలో ఉద్యోగ ఉద్యమం ప్రత్యేకంగా
జేసింద్రు
ప్రకృతికి గాలిలా తెలంగాణ చుక్కల్లో చంద్రునిలా
తెలంగాణ
నింగికి నెలవంకకూ తెలంగాణ, ఇంటికి దీపంలా
తెలంగాణ
కుటుంబంలో అమ్మలా తెలంగాణ,
అమావాస్యలో నిండుపున్నమిలా తెలంగాణ
ఉత్తమ పౌరుల సమాజం-తెలంగాణ కావాలి
భ్రూణ హత్యలు-వరకట్నాల వేధింపు లేని తెలంగాణ
కావాలి
ర్యాగింగ్‌లు-రేపింగ్‌లు, అన్నదాత ఆత్మహత్యలు లేని
తెలంగాణ కావాలి
దాశరథి, కాళోజీ, జయశంకర్‌సార్ ఆశయాలు అమలు
కావాలి
నవ తెలంగాణ మన భవ్య తెలంగాణ
తెలంగాణ పునః నిర్మాణానికై మరోసారి ఉద్యమించి
స్వంత ఇల్లు చక్కదిద్దు-చైతన్య ఉద్యమంగా
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, లాయర్లు, డాక్టర్లు
బాధ్యత పంచుకుందాం-బంగారు తెలంగాణ నిర్మిద్దాం
హృదయం ఉప్పొంగగా-తెలంగాణ భేరి మోగించాలి
తెలంగాణ తల్లికి-మరింత వన్నె తేవాలి
తెలంగాణ తల్లి-ప్రపంచంలో వెలుగులు విరజిమ్మాలి



**బండారి రాజ్‌కుమార్**
1-133, మగ్దుంపురం, చెన్నారావుపేట,
వరంగల్-506 332 చరవాణి: 9959914956
ఇ-మెయిల్: bandarirajkumar02@gmail.com

40

# నా తెలంగాణ కోరిక

కరువు బత్కులకు
ఎరువేసే దిక్కులేక
బరువు గుండెలతో
గిరువియ్యాని దుక్కంతో
సెరువులై.... వలసెల్లిన బడుగు జీవుల్ని
దరువేసి ఎనక్కి పిల్సుక రావాలె
పరువు నిలిపే తెలంగాణ గావాలె
గర్జించాల్సిన గొంతులు మూగబోతాయనియెందుకు?
దరువేయాల్సిన చేతుల్లో జెట్టలు బుట్టినయేమో!
పాటెప్పుడూ ప్రజల పక్షమే నిలబడాలె
పోతన్న పుట్టిన పురిటిగడ్డ మనదని ఎలుగెత్తి చాటాలె
అధికార వర్గాల గడ్డిమేయని మేధావి గొర్రెల తెలంగాణ
గావాలె
రైతు కండ్లల్ల నీళ్లు
మడులు తడపనపుడు
అప్పుల కూడు జూసి
గొంతుల ముద్ద దిగనపుడు
ప్రభుత్వ పథకాలు చిత్తు కాగితాలై చెదలు పట్టినపుడు
ఉరితాడే... చివరి మజిలీ అని నమ్మినపుడు
దేశం ఆకలి తీర్చే దేవుళ్లను బతికించుకోవాలె
బువ్వతిన్న విశ్వాసాన్ని సూపే.... తెలంగాణ గావాలె
వరిగొలుసుల హారమై నిలిచే బంగారు తెలంగాణ గావాలె
ఆరుగజాల చీరలు
అగ్గిపెట్టెల్లో పెట్టినోల్లు అగ్గిపెట్టెంత కడుపుకు
బువ్వపెట్టలేక బుగులు పడేటోల్లు
మగ్గాల్ని ఇగ్గురాల్ని జేసి అంగట్లో నిలబెట్టినపుడు...
చేనేత బతుకురాట్నం దిప్పే తెలంగాణ గావాలె
మన ఆడుబిడ్డలకు బట్టగట్టినోల్లకు బతుకునిచ్చే
తెలంగాణ గావాలె
సదువుకుంటె కొలువుజూపే తెలంగాణ గావాలె
నిరుద్యోగుల కళ్లల్లో వెలుగులు నింపే తెలంగాణ గావాలె
ఫ్లోరైడ్ రక్కసిని పారదోలి... తాగు నీరందించే
తెలంగాణ గావాలె
అడవుల్ని కాపాడే.... అభయమిచ్చే తెలంగాణ గావాలె
భూకబ్జారాయుళ్లపై ఉక్కుపాదం మోపే తెలంగాణ గావాలె
మిగులు బడ్జెట్‌తో అలరారే తెలంగాణ గావాలె
ప్రపంచ బ్యాంక్‌కు అప్పిచ్చే స్థాయికి ఎదిగే తెలంగాణ
గావాలె
దండకారణ్యంలో నడుస్తున్న జనత సర్కార్‌కు...
సమాధానమై నిలిచే తెలంగాణ గావాలె
కోరికలే దుక్కానికి కారణమన్నడు బుద్ధుడు
బుద్ధుని మాటలు అబద్ధమని నిరూపించే....
సిద్ధాంత తెలంగాణ గావాలె

బండ అరుణారెడ్డి
చరవాణి: 9441614131

41

## విజయోత్సవాల స్ఫూర్తి

నాల్గు కోట్ల ప్రజల నవ్వుల నజరానా
వార్షికోత్సవ వేళ నా తల్లి తెలంగాణ
జలజలల గలగలలు బిరబిరమంటు మురిసె
గలగలల జలజలలు జరజరమంటు ఉరికె
మురిసి ఉరికిన నదీనదములు జైతెలంగాణ మనగ
విరిసెను పూబాలలు విజయ పరిమళపు... గుర్తుగ!
ఎగసి విరిసిన ప్రగతికి నిండెనిదె ఏడాది
కన్నుల పండుగగ పండెనిపుడు స్వేచ్ఛానిధి!
నిన్నటి నిజం నీకూ నాకూ తెలుసు
ప్రపంచ వేదికకూ తెలుసు
పోరు జోరులో ఎత్తిన పిడికిళ్ళ గట్టితనం..
బేజారుపడక వెంటబడి చేబట్టుకున్న జాణతనం
అవాంతరాలెన్నో దాటుకుని
అరవైఏళ్ళ పోరుబాటజని
అందుకున్నము తెలంగాణ రాష్ట్రం
ఎందరో అమరవీరుల ప్రాణత్యాగం
ఇంకెందరో మహానుభావుల
ఆత్మఘోషల శంఖారావం!!
అన్నా!
నేటి నిజమూ... అందరికీ తెలుసు...
ప్రగతికి బాటలేసుకుంటున్న ప్రణాళికలు
నీళ్ళకోసం ఇకపై మనకు వద్దు ట్రిబ్యునళ్ళ గోలలు
ఊళ్ళ ఉచ్ఛ్వాసలై నిండిన చెరువుల జలకళ
కాబోతుంతి నోళ్ళు తెరిచిన బీళ్ళ గొంతుకలు నింపే
జీవకళ!
పాజిటివ్‌గా ఆలోచిద్దాం ప్రణాళికా అమలులో!
పసిడి తెలంగాణా ఛాయలు నిండివున్న మన
ఆలోచనలతో
బాధ్యతగల పౌరులవలె!
ఇది పది జిల్లాల పరవశత్వం విజయోత్సవాల ఉత్సవం
రేపటికి పునాదులు వేసుకుంటున్న సంబరాల సన్నాహం!
నల్గొండ బిడ్డను నమస్కరిస్తున్నాను
ఈ ఉత్సవం... నల్గొండ బిడ్డల ఫ్లోరోసిస్
బాధను తీర్చే... స్ఫూర్తిని ఇవ్వాలని.. ఆశిస్తూ!



**బండి ఉష**
ఇం.నెం. 11-10-694/7/1/ఐ, ఆర్. ఆర్. హైస్కూల్ ఎదురుగా,
బర్హాన్‌పురం, ఖమ్మం-507 602 చరవాణి: 9676377462
ఇ-మెయిల్: ushabandi245@gmail.com

42

## తెలం'గానం'

తెలుగు బిడ్డలారా! తెలుగు వీరులారా!
తరలిరండి జయకేతన మెగురవేయ
త్యాగాల తొలిపొద్దున ఉదయించిన తెలంగాణ
జయ జయ తెలంగాణ! జయహో తెలంగాణ

విరబూసిన చైతన్యాన వెల్లువైన నిరసనల జోరు
పల్లె పల్లె వీధికెక్కి కాలిగజ్జె మ్రోగించ
కోట్లాది గొంతుకలతో కొండకోన నినదించె
అస్థిత్వ పోరాటం కురిపించె నిప్పుల ఉప్పెన

లాఠీలు ఎగిసినపుడు, తూటాలు పేలినపుడు
విశ్వవిద్యాలయాన ఉబికిన నెత్తుటి ఊటలు
ఆత్మవంచనతో బ్రతుకలేక అసువులు బాసిన వీరులు
ధరిత్రి చెక్కిలిపై ముద్దాడిన ధీరయోధులు

పవిత్ర పుణ్యభూమిన పరుల ఆధిపత్యమేల
బంగారు బతుకమ్మకు బానిసత్వమేల?
జాతి జాగృతికై రగిలిన కవన హృదయాలు
చారిత్రక కట్టడాలు - చరిత చెప్పే నిజాలు

ఆరు దశాబ్దాల పోరు - అమరుల బలిదానం
సకల జనుల స్వప్నం సాకారమైన రోజు
రగిలిన జ్వాలన విజయోత్సాహపు పన్నీరు
ఎదఎద పొంగె ఆనంద సాగరమై

అలిసిన బాటన ఎగిసిన ఉత్సాహం
గాయాల గుండెకు నజారానా తెలంగాణ
స్వప్నించిన ఆశలు పుష్పించిన రోజు
భాగమతి ప్రేమ సాధానికి రాజులమిపుడు

అంతరాల దొంతరలు అంతమైతే
అంతరంగమందు ఆత్మీయ రంగవల్లులే
రెండుభాషల తెలంగాణ చెలిమికిది చిరునామా
బతుకమ్మ పీరీల ఆట - కులమతాల అనురాగపు కోట

ఎదపైన గుదిబండ తొలగం
ఎండిన చెలమలో ఊటలు పుట్టేను
గోదారిలో దిగులు మబ్బులు తొలగ
కృష్ణమ్మ కులికె - సింగరేణి నవ్వె

స్వేచ్ఛా తెలంగాణ - నిత్యావసంతమవ్వాలి
శిశిరం విడిచిన వనమందు
మానవీయతా కొమ్మలు చిగురించాలి
శృతి చేసిన వీణ తెలం 'గానం' చేయాలి.

**బి.కళాగోపాల్**
3-3-387/సి, గాయత్రినగర్, నిజామాబాద్-503 001
చరవాణి: 9441631029
ఇ-మెయిల్: kalaqopal.b@gmail.com

43

# అడవిపూల ఆత్మ సౌందర్యం

పసుపు ధూళి మేఘాలు
అడవి అంతటా అల్లుకున్నాయేమో
కొండపూలు కిలకిలమంటూ విచ్చుకున్నాయి!
నిండు పసుపు పూమొగ్గలు
తెలంగాణ ఆడబిడ్డ
చెంపల పూసిన నునుసిగ్గులు !
పూల సింగిడీల ఉయ్యాల
సద్దుల బతుకమ్మలో
ప్రకాశించే పసుపుపూల సౌందర్యం
అదో అంతర్గత జీవన వికాస సూత్రం!
చేయి చేయి కలిపిన సమైక్య వారధిగా
పూసిన తంగేడు గుత్తులు,
పది జిల్లాల శ్రమ జీవన సొత్తులు !
పల్లెను పట్టణాలను ముడివేస్తున్న
మధురమైన బంధాలు !
బంగారు బతుకమ్మను నిలబెట్టిన
తంగేడు పూలు,
తెలంగాణ ఆడబిడ్డ ఆత్మవిశ్వాసానికి ప్రతీకలు!
తెలంగాణ ఆకాశాన్ని ప్రతిబింబించే
విరిసిన తంగేడు
గళమెత్తిన అడవి బిడ్డల
ఉద్యమ స్వరమైంది !
గజ్జెకట్టిన కళారూపాలకు
ముఖాన పూసిన పసుపు వర్ణమైంది!
పసుపు పూల తరగనని సౌభాగ్యం
ఇచ్చి పుచ్చుకునే వాయినాల సంస్కృతైంది!
యాసలో, భాషలో
పునరుజ్జీవన నిర్మాణంలో
తంగేడంటేనే తరగని
సాహితీ పెన్నిధి!
నా జ్ఞాపకాల చిరునామాలో
పూసిన తంగేడు
ఎల్లమ్మ చెరువు పక్కన ఆటలాడుకున్న
పెద్ద బతుకమ్మ సద్దుల సౌందర్యమైంది !
తెలంగాణ తల్లి ఆత్మ గౌరవ పతాకంగా
పూస్తున్న తంగేడుపూలు,
వసివాడని తెలంగాణ ఆత్మ సౌందర్యానికి
అద్దిన పుప్పొడులు !!





బి. నరసింగరావు
చరవాణి: 9908010404

44

# రాజర్షి దేహాంతం

అన్ని గేట్లు బార్లా తెరుచుకుంటాయి
వేయిపడగల తాచులా
నీళ్ళు బుసకొడతాయి!
జీవితమూ నిష్క్రమిస్తుంది
కోట్లాది వెలుగు జిలుగులు
చిన్ననాటి కిరీటపు పన్నీ మెరుపులో
కలిసిపోతాయి
అన్ని నదులు ఒకేచోట సంగమిస్తాయి
అన్ని గిరులు తమ శిరస్సులను వంచుతాయి
తప్పొప్పుల పట్టిక మనిషి
తపోధనుల కరిగిన ధనం
నిష్ఠాగరిష్ఠుల వ్యష్టి జీవనం
ప్రతిదీ సమతూకం దగ్గరే పేచి
అరణ్యాలనే దహించే ఆలోచనలు
లోకాన్ని గోవర్ధన గిరిలా ఎత్తిపట్టే ఆకాంక్ష
ఈ దేశం ఒక మరమత్తు లేని రోడ్డు
ఈ కాలం గుడ్డివాడి చేతిలో పాచిక
ఈ మనుషులు కోల్కోవడానికి వీలులేని మొండి
రోగులు
ఇక్కడ నేల దున్నాలి
దరిద్రనారాయణుల విత్తనాలు చల్లాలి
ఎత్తుపల్లాలను సమం చేయాలి
యాపిల్ పళ్ల మాటేమిటోకాని
కనీసం రేగుపళ్లయినా కాస్తాయా!
తల్లీ
భూదేవి
ఎక్కడ! ఎక్కడ పోగొట్టావు నా ఆనవాళ్ళను
నా ఆర్తినీ, ధీరోదాత్తతనీ, దీక్షనీ, త్యాగాన్నీ యవ్వనాన్నీ
నలుమూలలా పిచ్చివానిలా వెతుకుతుంటాను
ఒక గౌతముడి కోసం, గాంధీ కోసం, కొమరం భీం
కోసం!
(పి.వి.జ్ఞాపకాలతో)

బి. పద్మజ రమణ

45

# ఆనందాల హేల

**ప**ది జిల్లాల పల్లెపల్లెన తెలంగాణ తల్లి
ఠీవిగ తలెత్తుక నిలవడ్డది
బతుకమ్మలు, బోనాలు, బీరప్పకథలు, పోతరాజులు,
పీరీల
సందడితో ఇక్కడి మట్టి పరవశిస్తుంది
ఎగిరిన మువ్వన్నెల జెండాల నిండా
తెలంగాణ ఆత్మగౌరవపు రెపరెపలే
కొలువు తీరిన తెలంగాణ మహనీయుల నిండ
ప్రజల హృదయాంజలుల మాలలే
అమరుల త్యాగఫలితమే స్వరాష్ట్ర సాకారమని
ముక్కోటి గొంతుకల ఏక నినాదం
సుందర భవిష్యత్ తెలంగాణ చిత్రాన్ని పాలకులకు
నిర్దేశిస్తూ
వెలుగు దారుల్లో సమున్నతంగ నిలవడ్డయి
అమరవీరుల స్తూపాలు
స్వపరిపాలన నీడలో ఇక్కడి గాలి, నేల, నింగి, నీరు
స్వేచ్ఛాగానం చేస్తున్నయి
అరవయ్యేండ్ల గోస, దోపిడి, పరపీడన, వివక్ష
తెరల్ని తొలగించుకుంటు
తొలిపొద్దు పొడుపు కొరకు, వడివడిగ అడుగులేస్తున్న
నా తెలంగాణ తల్లికి పాదాభివందనం.



బిల్ల మహేందర్
ఇంటి.నెం. 35-7-674, ఎన్‌జీవోస్ కాలనీ, ఫేజ్-2,
హన్మకొండ. చరవాణి: 917604430
ఇ-మెయిల్: billamahisare@gmail.com

46

# కొత్త చిగురు

ఒక
చిగురుకోసం
ఎన్ని ఆకులు
నేలరాలిపోయాయో..?

రాలిన ప్రతీ ఆకు
ఆ చిగురుకోసం
తనకు తానుగా సమాధి అవుతూ
ఆ చిగురుకు జీవంపోయడం
నిజంగా ఎంత సాహసం..?

ఆ చిగురు
మన స్వప్నం!!
మన ఆకాంక్ష
మన ఆత్మగౌరవం
నేడు మన కళ్ళముందు
కొత్త చిగురై జీవం తొడుగుతున్నది..

ఇపుడా చిగురు
మన ఊపిరి
మన ఉచ్ఛ్వాస
మన రేపటి భవిత!!

రండి..
రేపటి మన భవితను
రేపటి మన బతుకులను
బంగారుమయం చేసుకునేందుకు
ఇపుడే జీవం తొడుగుతున్న కొత్తచిగురును
కన్న బిడ్డోలే కంటికి రెప్పలా కాపాడుకుందాం
రేపటి మహా వృక్షం కింద చల్లని నీడలో
తనివితీరా సేదతీర్చుకుందాం!!

బి. శ్రీమన్నారాయణచారి
1-1-370/17, వినాయక్‌నగర్,
నిజామాబాద్. చరవాణి: 9701866936

47

# పిడికిలి పొద్దు

బిడ్డా! ఎంత ఓర్పు నీకు
నీ గొంతుకోస్తామన్నా
కాగే నరాల్లోన ప్రజాస్వామ్యం  నింపినౌ బిడ్డా!
మా గర్జనలు నిశ్శబ్దంగా తోచాయా?
నిశ్శబ్దమే పడేసే రోజొచ్చింది ఎదురొడ్డిన చాతి కింద
జడత్వమైన యాల శాంతికై, కాంతికై క్రాంతి కావాలి
అది శబ్ద నిశ్శబ్దాల సంగమం, ఉద్యమం
కోట్ల హృదయాల కుహరాల్లో
కట్టలు తెంచిన శోకబిందువులపై
ఉక్కుపాదం మోపితే ఉప్పెనా నా వాదం
నా తెలంగాణ వాదం
ఉద్యమ కళిక మాసినప్పుడల్లా
ఆత్మజ్యోతి నిచ్చిన అమరులెందరో
ఉక్కు సంకెళ్ళ దాస్యత్వానికి
ఆత్మ బలమే తెంచింది బిడ్డా!
ధూం ధాం కాలి గజ్జెలై అలై బలై గుండె చప్పుడై
వంటా వార్పులతో సామాజికమై
కలం కవాతులు ఫిరంగులు మోసె
నినాదమొకటే లేచింది తెలంగాణమై వచ్చింది
దరహాస కేతనమై ఎగిరింది
నేల నవ్వింది వెన్నెల అభిషేకం చేసింది
నింగి మురిసింది - పిడికిలి పొద్దై పొడిచింది

నీళ్ళ కళ్ళు చెమ్మగిల్లాయి అడవి ఊపిరి పీల్చుకుంది
నా భూమి రెండు రాళ్ల ఇప్పుడు పెనవేసుకుంటది
ఇక బతుకమ్మ శాశ్వతంగా బ్రతికుంటుంది
రుద్రమ్మ కత్తి పదును - విశ్వానికి తెలుస్తుంది
సామాజిక న్యాయం లేనప్పుడల్లా
కాళోజీ నా గొడవంటూ పుడ్తాడు
నిజాం పాలన పేట్రేగినప్పుడల్లా
కొమరం భీం గర్జిస్తుంటడు
ఔ బిడ్డా! నువ్వు చెప్పిందే సై
విధ్వంసం నుండి వికాసం ఐందాక
ఉద్యమం బ్రతికే ఉండాలని
సమాధి స్థితిలో పునాది ఉంది కాబట్టి
శిఖరం అంతెత్తున ఎదిగి వుంది తెలంగాణ కేతనం
శిఖరం అంచున రెపరెపలాడిందంటే
పునాది రాళ్ళయిన అమరుల సార్థకత దాగి వుంది
ఆ శిఖరానికి పునాది రాళ్ళు ఎప్పుడు తోడుంటాయి.
కాని పునాది రాళ్ళను ఆ శిఖరం
కలకాలం గుర్తుంచుకుంటుందా
ఔ బిడ్డా! నువు చెప్పిందే సై
విధ్వంసం నుండి వికాసం ఐందాక
ప్రశ్నించడం బతికే ఉండాలి
స్వర్ణ తెలంగాణ (అయ్యేంతవరకు) సాధించేదాక
ఊపిరిని ఆపుకుంట బిడ్డా!



బుర్రా తిరుపతి
1-2-85/ఎ/ఎ ప్రగతినగర్, పెద్దపల్లి - 505172
చరవాణి : 9963242525

# 48

# పునాసలో అమాస బతుకు

అలల నురుగు కరవైన నా చెరువు
నెర్రెలు బారి నోరు తెరిసినట్లుంది
మృగశిర వస్తేనే ముసిముసి నవ్వులు విసిరే రైతుకు
పునాసలో కూడా అమాస బతుకే అయ్యింది
బాతుల ఈతలు కరువైన బతుకమ్మకుంటిప్పుడు
బావురుమని ఏడ్వడం తన వంతైంది
కట్టకింది మైసమ్మ కైతికాల పదాలు ఒదిలేసి
బెల్లంగొట్టిన రాయిలా బెగడుతో కూసుంది
అమ్మా! ఊరుతల్లి
కప్పతల్లి ఆడుదామంటే కండ్ల నీళ్ళే
బిందెడు నీళ్ళైతాన్నయ్
పసుల కంచెలన్ని పాడుబడ్డ భూములై పోయినయ్
గుట్టకింది పొలాలన్ని
గుండె దిటవు చేసుకొని
గుక్కెడు నీళ్ళకోసం దేవులాడుతున్నయ్
అలల చప్పుళ్ళతో
చాకిరేవు సుమ్‌సుమ్‌ల రాగాలతో
సంగీత  కచేరి చేసే నా ఊరి చెరువు
దాహం... దాహం అంటూ అఘోరిస్తున్నది

మూడు పానాదుల కాడ
మురిపెంగా నిలబడే చోట
బిందెల చప్పుళ్ళతో బెంబేలెత్తుతుంది
ఇంటివెనుక చేదబావిప్పుడు
చెదలు తిన్న మొగరమోలె అయ్యింది
గిట్టలు మెత్తబడ్డ పసులకిప్పుడు
జాలారి గుంటల జాడే కరువయ్యింది
మారిన నా సంస్కృతిలో
కుళాయిల బడాయే ఎక్కువయ్యింది
ఇంటి ముందు వేప చెట్టు
ఇంటి వెనుక చింత చెట్టు
మొదలంటూ నరికేసిన తీరులా
నిండు కుండలాంటి నా చెరువులో
నీటి బుడుగ కూడా లేకుంటా అయ్యింది
అమ్మా! నా ఊరుతల్లి..
అమ్మా! నా చెరువుతల్లి..
ఒక్క చినుకైనా రాల్చది..
నెర్రలిడిసిన నేలతల్లికి
జీగంజీ పోయనీయ్...





**బి. హరిరమణ**
3-3-405/2, గాయత్రినగర్,
శ్రీ నిలయం, నిజామాబాద్.
చరవాణి: 9490148904

49

# మేధోమథనం

నిన్నటి ఆశలస్వప్నాలు
నేడు ఉద్యమాల ఫలిత సాకారం
భవిష్యత్ చిత్రంకై మేధోమథనం
అణగారి బ్రతుకుల విమోచనకై
చేతనదారులు
పథ నిర్దేశ్యంలో విప్లవదారుల్లో
కంటకాలతో రక్తసిక్తమై
నేలతల్లిని ముద్దాడిన రుధిర ధారలు
దగాపడిన జనుల బెగళ్ళ నెగళ్ళ
రగళ్ళ సెగళ్ళకు
బెంబేలెత్తిన సమైక్యవాదులు
దగాపడిన మన జీవితాలింతే
మా ఊపిరులే ఉద్యమాలకు ఊపిరంటూ
అసువులు బాసిన తెలంగాణ బిడ్డలు
సహస్ర ఫణిరూపమై బుసలుకొట్టి
సాధించిన అమరుల త్యాగమే మన తెలంగాణ
న్యాయవాదులు, విద్యార్థిలోకం కార్మిక కర్షకలోకం
అంతా ఒక్కటిగా ఉద్యమాల బాట నడిచి
సాధించిన తెలంగాణ
కులమత భేదాలు తొలగి
ఆర్థిక అసమానతలు తొలగి
కులంతో కాక మనిషి మనిషికి
విలువ పెరిగి
సాంకేతిక రంగాన ఉజ్వల భవిష్యత్తుకై
ఆదర్శాల మార్గాన జీవనపథ నిర్దేశ్యపు
పాఠ్యప్రణాళికలు
ప్రతి మనిషిలో నైతిక విలువలు పెంచి
అవినీతి, ఉగ్రవాద, కీచక పర్వాలు
జనుల, మనుసులో తొలగి

**బి. సత్యనారాయణ**
రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ ఆఫీస్, ఖమ్మం.
చరవాణి : 9849907525

50

# తెలంగాణ ఉద్యమం

'**బాం**చెన్ కాల్మొక్తాల' ఒక్కటైన ఎట్టి బత్కులు
దొరల గడీల నేల మట్టం చేసిన తిరుగుబాటు
బావుటాలు
జల్-జంగిల్-జమీన్ రణన్ని నాదాలు
భూమి-భుక్తి-విముక్తి వసంత మేఘగర్జనలు

కారం ముంతయి , ఒడిశెల రాళ్ళు విల్లంబులు
గుత్పలు తుపాకులు
గోలకొండ ఖిల్లకింద నాజీల గోరికట్టిన అసమాన అయిన
గారాలు బండెన్క బండి గట్టీ పదహారు బండ్ల గట్టీ
ఏ బండ్లె బోతవ్ కొడుకో అంటూ విసిరిన సవాలక్ష
సవాళ్ళు

అమరులత్యాగాల పంట చేతికందింది
పెన్ను, గన్ను, చేతబట్టి వెన్ను దండైన
కలియోధుల ప్రబోధాదాలు వెన్నంటి నిలిచాయి
సకల జనులు సమరానికి పైయన్న ఘట్టాలు
చరిత్ర సాక్ష్యాలై నిలిచాయి

సాయుధ పోరాటాల గడ్డ శ్రమఫలించింది
కవుల రచనలకు కళాకారుల కాలిగజ్జలు
చైతన్య బాటలై తోడు నిలిచాయి
వీరుల గన్న తెలంగాణా పోరు జరిపి
పోరు తెలంగాణా ప్రసిద్ధికెక్కింది
వెన్ను చూపని వీరోచిత పోరాటంతో
విద్యార్థిలోకం పోరు జరిపి, విజయబావుటా ఎగుర
వేశారు
విద్యార్థి, ఉద్యోగుల వీరోచిత పోరాటం విఫలం
కాకుండా,
వీర తెలంగాణా ఆవిర్భావానికి బీజమై నిలిచింది

ఆనాటి 1956 తెలంగాణ ప్రజల స్వేచ్ఛకి సంకెళ్ళు
ఎన్నో గొంతుకలు-గర్జించిన-గజ్జెకట్టి పాడిన 1969 నాటి
అమరుల త్యాగాలు-మలిదశ తెలంగాణ అమరుల
ప్రాణత్యాగాలు
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తొలిమెట్టు అయినది

ప్రపంచ పోరాట చరిత్రలో మనరాష్ట్రం ఏర్పాటు
దశ ప్రపంచ ఆత్మాభిమాన పోరాటంగా ఎదిగింది
చరిత్ర కెక్కినది
కృష్ణా గోదావరుల పునీతనేల
ప్రత్యేక ఉద్యమంలో నవతెలంగాణ పురుడుపోసుకుంది
అమరుల ఆశయాన్ని నెరవేర్చుకుందాం
తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం
జై తెలంగాణ జైజై తెలంగాణ

**బూర రాజశేఖర్ రావు**
1-3-20, హన్మంతుని గడ్డ, మహబూబ్‌నగర్,
వరంగల్ - 506101. చరవాణి : 9491210001

# 51

# పుడమి పుణ్యం

జై తెలంగాణ వినొస్తుంటే
సోయికొచ్చిన... కళ్ళ సాల్లు చూసుకోలే
కడుపుల పేగు కదిలినట్టు
గడ్డకట్టిన గర్భశోకం కరిగి
కన్నీరుగా ఇన్నాళ్ళకు రాబట్టింది
తెలంగాణ కోసం పాణం తీసుకుని
కాటిలే ఉన్న బిడ్డను చూసినా
దాని దుఃఖం గిప్పుడు గిన్నేళ్ళకు
గుండె మంటలార్పడానికి రాబట్టె
తరతరాలుగా రగులుతున్న తల్లీ
గర్భశోకం కరిగి కన్నీరై నా గుండె
నిండ వస్తుందేమొ..!
నా గర్భఫలమో..! ఈ పుడమి పుణ్యమో..!
నువ్వు పుడితివి కదా బిడ్డ
నిన్ను మోసిన భూమికోసం పోరాడినవు
నిన్ను కన్న అవ్వ కోసం ఓ పాలి రా బిడ్డ
కొడుకా నిన్ను తలవకుండా నువ్వు లేకుండా
తెలంగాణ సంబరం చేసుకోనంటుంది.

**బూర్ల వెంకటేశ్వర్లు**
403, వెంకటేశ్వరటవర్స్, జ్యోతినగర్, సాధనాస్కూల్ ప్రక్కన,
కరీంనగర్ - 505010, చరవాణి: 9491598040

# 52

## జయం

"విఘ్నరాజ నీకు శరణు
ఇపుడె జేతు బ్రోవుమయ్య"
"విఘ్నరాయ విఘ్నహరణ
అగ్రజుండ ఓ దేవ"
పొద్దూకంగ ఒక్క సుతిల నడిచె
చిరుతల రామాయణం పాట
మనుసును చిటారు కొమ్మల మీదికి తీసుకుపోతది
అక్షరం ముక్క రానోళ్ళు
ఆది తాళంల రాగమెత్తుకుంటె
ఆకాశంల ఉన్న సుక్కలు చెవులువెట్టి ఇంటయ్
మన మల్లన్న ఎల్లన్నలు, మన ఆశన్న ఊశన్నలు
నిజాం గంధర్వులు దిగివచ్చినట్టు కండ్లకు గనపడుతరు
మన మాటా మన ముచ్చటా
గుండె నిండా సంబురమైతది
డిల్లం డిల్లం, డిల్లం డిల్లం, డిల్లం డిల్లం...
డోలు దెబ్బలకు ఊరు ఊరంత
పాల పొంగులెక్క నిక్కి నిక్కి సూత్తది
మన బీరన్న, మన ఐలన్న కాశె దోశి గోశి పెట్టి
డోలు గొడితె...
ఎహే... నీ యక్క...
పెయిన ఉన్న రోగాలన్ని ఆమెడ దూరం ఉరుకుతయ్
అమ్మ రావే పోశమ్మ రావే...
తల్లి రావే బైలెల్లి రావే... అని
బైండ్ల మల్లన్న కొలువుకు దిగుతె
డుబుక్ డుబుక్ జమిడిక మోతల పిలుపు ఇనవడుతె
కడుపుల జొచ్చిన పోశవ్వ
తీరొక్క బాధల తలపోసి వలపోసి
ఏమేమి గావాల్నో శివమెత్తి ఆజ్ఞలు జేస్తది
కల్లు సాక పోత్తే సల్లంగ జూస్తది
పన్నెండు డప్పుల్ల మోతల నడుమ
సిత్రా సిటికెన పుల్ల దప్పుకుంట
మోకాల్ల మీద వంగి
భూమ్మీద పడ్డ రూపాయి బిళ్ళను
నొసలుకు అంటిచ్చి లేస్తే
కొండయ్య కాళ్ళకు
నేల తల్లి దుమ్ముతోని కుంకుమ బెడుతది
ఒగ్గు సప్పుడు, రణభేరి నాదం,
తాళాల మోత, గజ్జెల సవ్వడి
ఎల్లు ఎల్లు ఎల్లమ్మా నీవూ...
ఎల్లవే ఎల్లమ్మా నీవూ... అని
గొల్ల మల్లయ్య పాట ఎత్తుకుంటే
పదం దప్పుకుంట, పాదం దప్పుకుంట
నాట్యమాడుతవుంటే
రాత్రి సుక్కలు నిద్రవోతయ్
తెల్లారి సూర్యుడు సూడస్తడు
పల్లెనిండ పండుగ పరమాన్నమైతది

పొద్దంత సాధనా శూర్యుల సర్వ మాయలు
తెల్లందాక చిందు భాగోతాలు
ఇంటింటికి గంగెడ్లు వంగి వంగి పెట్టే దండాలు
బొనుగ గంట వట్టి బొందిగలకెల్లి రాళ్ళు దీసె
కాటికాపల కనికట్టు విద్యలు
మన పీరీలు, మన లాల్ శావలు
నెమళ్ళు పులులు కలిసి ఎగిరినట్టు గోండీ, గుసాడీలు
కల్ల కపటం లేని ముత్తవ్వల బొల్లకోరు ముచ్చట్లు
ఏండ్ల పడంతరం బతికిస్తే
బతుకు నిమ్మలమైతది
మంగళార్తులతోని ఊరూరికి తోలుకస్తే
తిరుగులేని జయమైతది

అగో...
బోనాలమీద దీపాలు ఎలుగుతున్నయ్
శివసత్తుల పూనుకాలు ఇనవడుతున్నయ్
బసువన్నల మౌన ముద్రలు కనవడుతున్నయ్
పోతరాజుల శెర్నకోలల శెరశెర నవ్వుల్లు
సుతి గలిపిన బతుకమ్మల ఉయ్యాలలు
కైగట్టి నడుస్తున్నయ్
రాంఢ్రి రాంఢ్రి...
తొవ్వంత పూలు జల్లుంఢ్రి...
రాంఢ్రి రాంఢ్రి...
మన కళలకు పబ్బతి పట్టుంఢ్రి.





**బైరపాక స్వామి**
అమ్మనబోలు, ఆలేరు, నల్లగొండ-508 101
చరవాణి: 9490952285

53

# నా తెలంగాణ కోటి కాంతుల వీణ

కవులకు కళాకారులకు కొదవలేని గడ్డరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
జానపదులకు జీవం పోసిన నేలరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
ఇది భాగవతానికి అడ్డరా పోతన గడ్డరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
భారతావనిలో తెల్లోడిని తెగ ఉరికించి కొట్టిన మొదటి
నేలరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
ఆదిమానవులు పాదాలు మోపిన పవిత్ర స్థలంరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
బండెనక బండి కట్టించి రాజునే
సాగనంపిన భూమిరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
బ్రిటీషు మూకలను ముప్పుతిప్పలు పెట్టించిన
పటాన్ తుర్రెబాజ్‌ఖాన్‌ను కన్న భూమిరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పోరుబాటై
నిలిచిన
ఆరుట్ల కమలాలను కన్న వీరశౌర్య గడ్డరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
మీసం రోషంగా దువ్వే రేణిగుంట రామిరెడ్డిని కన్న
పౌరుషాల పుడమిరా నా తెలంగాణ కోటి కాంతుల వీణ
చెరసాలలు నాకేమి అడ్డు కాదురా అని
అడ్డుగోడపై నిలువుగా రాసిన
నా తెలంగాణ కోటి రతనాల వీణ
అన్న మహాకవి దాశరథిని కన్న పృథ్విరా
నా తెలంగాణ కోటి రతనాల వీణ
ఇది తెలంగాణ గొడవ కాదు నా గొడవ అని గర్జించిన
కాళోజీకి పురుడుపోసిన పుడమిరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
ఎందరెందరో రాజుల కీర్తి కిరీటంలో ఒదిగిన నేలరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
తెలంగాణ కోసం అశువులు బాసిన దొడ్డి కొమురయ్య
శ్రీకాంతాచారిలను కన్న త్యాగాల గడ్డరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
క్రీడా రంగాలలో కీర్తి పతాకాలను కన్న కన్న తల్లిరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
రాజకీయ ఎత్తుగడలకు ఎవరెస్టు శిఖరమై నిల్చిన
కెసిఆర్‌ను కన్న నేలరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ
చెరువులే గ్రామాలకు మూలాధారమని మిషన్
కాకతీయకు శ్రీకారం చుట్టిన హరీష్‌రావును కన్న గడ్డరా
నా తెలంగాణ కోటి కాంతుల వీణ.



**బోధనం నర్సిరెడ్డి**
6-2-513, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్‌రోడ్,
నల్లగొండ-508 001 చరవాణి: 9985663225

54

## గుండెల్ల కొలిమి బుట్టె

మమ్ముల
దిక్కూ దివాణం లేని
కుక్కల తీర్గ జేసి
గద్దెలెక్కిన పెద్దన్నలూ
పెజాసామ్మెం తరీఖనే
మమ్మల్ని దోసుకుంటిరి.
పేద జింకలమీద పెద్ద పులోలెగబడి
మా బతుకుల పీక్కతింటిరి.
విశాలాంధ్రలో పెజారాజ్జమని
ఏటికోపాలి పండుగజేసి
మా కాలే కడుపులమీద నీళ్ళు జల్లితిరి
మీ అన్నేలం దాసుకునేటందుకు
మాకులేని రంగులన్నీ పూస్తిరి
మీ బుద్ధులు గడ్డిదినడం జూసినందుకు
మా కనుగుడ్లు చితుకబొడిస్తిరి.
మీరు మాకోసమేనని
మీరు లేకుంటే మేం బతుకలేమని
ఎన్నెన్నో కాకమ్మ కబుర్లు జెప్తిరి
మాకు లేని నమ్మకం చెప్పజూస్తిరి
పాయె!
మీ బండారం బయటబడె
మా కడుపుకోత పెద్దదై
గుండెల్ల కొలింబుట్టె
మిమ్మల్ని జిట్టుగాకబెట్టి సాగదీస్తిమి
దాకలిమీద సమ్మెటేసి సక్కగ జేస్తిమి
ఇంక
మమ్మల్ని మేం జూసుకుంటం
మా పెయి సుబ్బరంగ మేమే కడుక్కుంటం.





బెంకి రాఘవేందర్‌రెడ్డి

# 55

## మనసు నిండా....

సుధలు కురిపించే క్షీరసాగరం
తొలకరి చినుకుల మట్టి పరిమళం
జానపదుల ఝుంఝా నాదం
గోండి జనుల చేతి గాండీవం
అందాల అడవి మల్లె
మరెవరో కాదు మన తెలంగాణ తల్లే ...!
కానీ, రాజకీయాల మాటున
వలస పాము పడగ నీడన
తల్లడిల్లెను తెలంగాణ తల్లి
యాస భాషలు మంట గలిసెను
నీరు, నిధులు నింగికెగిసెను
కడుపు మండిన కాకతీపుత్రులు
కలసి మెలసి కదం త్రొక్కగా
కె.సీ.ఆర్. కిషోరమై ముందు నడువగా
ఆచార్యులందరూ ఆశీర్వదించగా
సునామి సుడిగుండాలై
విప్లవించెను విద్యార్థిలోకం
శ్రావణ మేఘమై గర్జించెను ఉద్యోగ గనం
కడుపు కోతకు గురి అయిన
కన్నతల్లి కన్నీటి కెరటాల దాటికి
తెగిపడ్డ తల్లుల తాళి సవ్వడికి
బలిదానమిచ్చిన అమరుల ఆశయాలకు
అదిరింది హస్తినాపురం
బెదిరింది భారత ప్రభుత్వం
సోనియా, సుష్మాల సహకారం
అయ్యింది తెలంగాణ రాష్ట్రం సాకారం
వీథి వీథిన ఎగిరింది విహంగమై తెలంగాణ జెండా
పరవశించింది తెలంగాణ తల్లి మనసు నిండా
పరవశించింది తెలంగాణ తల్లి మనసునిండా



బైరోజు శ్యాంసుందర్
వీపనగండ్ల.
చరవాణి: 9441612629

56

# మగువల వరదాయి

బతుకు నిచ్చే అమ్మ
బతికించేఅమ్మ
బంగారు గౌరమ్మ
శ్రీదేవి బతుకమ్మ

బంతి చేమంతులు
మల్లె మందారాలు
తంగేడు అందాలు
శ్రీలక్ష్మి బతుకమ్మ

తొమ్మిది రోజులు
తొమ్మిది విధముల
పూబోణుల కొలువె
శ్రీగౌరి బతుకమ్మ

చదువు సందెలు నేర్పి
జ్ఞానవంతుల జేసి
బతుకు తీరును చూపు
శ్రీవాణి బతుకమ్మ

పాడి పంటల నెల్ల
పసిడి రాసుల జేసి
జగమేలు పెద్దమ్మ
శ్రీగంగ బతుకమ్మ

చక్కని సంతాన
చల్లని సంసార
మగువల వరదాయి
సద్దుల బతుకమ్మ



భైరోజు చంద్రశేఖర్
వనపర్తి.
చరవాణి: 9490909821

57

# ఆనాటి జ్ఞాపకం

నలభై ఏళ్ళనాడు
నాకు ఏడేళ్ళప్పుడు
అమ్మ చెప్పింది
బతుకమ్మ అంటే చల్లని తల్లీ అని
భూమ్మీది పూలన్నీ
ఆయమ్మకు ప్రతి రూపాలని
చదువు, సంపద, సౌభాగ్యాలకు
మూలపుటమ్మని
అందమైన పువ్వుల తీరు
ఆడబిడ్డ జీవితం
సుతిమెత్తని బ్రతుకును
అందంగా... తీరొక్క రీతిగా
అమర్చుకోవాలని
సూర్యుడు చూడకమునుపే
తలంటు రోజులు
నిత్యం కొలిస్తే
సద్దుల బతుకమ్మ
చల్లగ చూస్తదని
తంగేడు, బంతిపూలు
కనబడినపుడల్లా
అమ్మ మాట చెవుల తిరిగేది
పూలరాశికి పూజలు చేసి
గంగమ్మ ఇంటికి సాగనంపే
ఆనాటి జ్ఞాపకం
ఒక అదృష్టం
ఇన్నాళ్ళకు బతుకమ్మ మళ్ళీ కళ్ళబడితే
మా మేనత్త
పుట్టింటి కొచ్చినట్లుగా ఉంది
నా మనసు
కొత్త వయసు తొడుక్కున్నట్లుగా ఉంది

**చరణ్ దాస్**
తెలుగు పండిట్, జడ్‌పిఎస్ఎస్, యాపిల్‌గూడ,
ఆదిలాబాద్. చరవాణి: 9441017028



58

## కొత్త పొయి

అన్నదమ్ముల లొల్లి గాదు
అక్కజెల్లెండ్ల జగడంగాదు
అద్దనంగ గట్టిన తెర మొగరాల ఇల్లు
కార్జం తుకుడకు కలుపుకున్న దుబ్బ సెలక
బలిమీటికి సోపతైండు
జిత్తులోడు ఆడు-నాదాను గాన్ని నేను
పొత్తుకొత్తల పాన పానం
ఇగ నన్ను జూసుడైంది ఈన్య మీనం
జిమ్మల కూరండుకుంటే
జిత్తులోనికి జిమ్మలు
నాకు ఉత్త పులుసు
మాడు సిప్పలు
ఇదొక్కటే గాదు
బట్టల, పొట్టల, సుట్టల అన్ని ఫరాకే
తునికాకు బీడి దించిన కల్లు నాకు
సళ్ళటి బీరు సిగరేటు డబ్బలు ఆళ్ళకు
పోశవ్వ పొతంజేస్తే
మైశవ్వ మాయం జేసినట్టు
తెల్లెలుకలు సేండ్ల పత్తి
నెర్రెపొక్కలల్ల గుంజుక పొయినట్టు
ఎంత పంట పండిచ్చిన
నేను ఉత్త సేతుల ముండకొడుకునే
బోల తనాల వోతే బొకెలు
సేతికచ్చినయ్
ఇల్లిదాం పొయి బుదారం అయింది

ఏం జెయాలా, ఎట్ల జెయ్యాలా
ఒక్కటే మాట - రెండె తుకుడలు
పొత్తు వాయంది గాదు -
ఏరే వడంది గాదు
ఇత్తేసి పొత్తు జేసినోన్ని ఫజీయ జెయ్యాలని
పదిమందిని పిలిసిన
పంచాదేపిచ్చిన
ఒళ్ళ కాళ్ళైతేనే కయ్యం గాదని
పంచాదేగింది.
ఉన్నమాటన్నద్దు
ఊళ్ళ్యండద్దన్నట్లు
లంగతనమెత్తిండ్రు
రచ్చ రచ్చ జేసిండ్రు
అరవై యొద్దుల పంచాది
సలివొయి ఎండలు ముదిరినయ్
ఊళ్ళ్య పెద్దలు పాళ్ళై అన్నరు
గంగవతల ఆళ్ళకు
గంగివతల నాకు
గుట్టమీది గుడ్డి దేవుని గుడి అటు



సల్లగ జూసే సమ్మక్క గద్దె ఇటు
కొతల వట్టి ఇళ్ళు పాళ్ళాయా
బూజువట్టిన ఎనగార్లు
వాస్తుకులేదు, మనసుకు రాదు
పంచాంగం జూపిచ్చిన ఇల్లిడాలన్నరు
కొంపకు కంప జరిసిన
సక్కని దినం జూసిన
సారివట్టి ముగ్గేసిన
కసలం కట్టుకొని గుట్టకు వొయిన
కొడిశ పబ్బు, సంద్ర మొగరాలు
టేకుదులాలు మోసిన
అడ్లయినను మాట్లాడిన
ఇల్లు నిలవెట్టిన
దొడ్డిమన్ను మెత్తుడు
పెండపూత
సుద్దమన్నుతోని గోడలద్దిన
బొమ్మరిల్లు జేసిన
కొత్తపొయి ఏసుకున్న
మామిడాకుల దోర్ణం
దర్వాజకు గట్టిన
ఉగాది నాడింట్లకు వొయిన
పాలు వొంగిచ్చిన
గటక వోసుకున్న
అరుగుమీద రంజరొల లీళ్ళు
గుడ్లమీద పొదిగినకోళ్ళు

దళ్ళకొంపనేగని సళ్ళగున్నది
కల్లు దాగకున్న కడుపు కన్నంబోతున్నది
కంటికి నిద్ర వడుతున్నది
ఆవగింజంత రంజి లేదు
జీడిగింజంత చింతలేదు
గట్టి రొట్టెలు, ముద్దపప్పు
ఊరగాయ కారం
మద్దిసెట్టు నీడల సద్ది
దుక్కులైనయ్
రొప్పళ్ళు నడుస్తున్నయ్
మిరుగానల కోసం జూస్తున్నం
రేషం జెడిపొయింది
ధర్మం గెలిసింది
మనసుల మాట మిగిలింది
గంగలీల్లు దొంగలపాలు గావద్దు
ముత్తమూడు పిడీల ముళ్ళై
దోపిడి గావద్దు
దిగంబరుడికి దొరికింది పట్టు పీతాంబరం
అది కాళ్ళ కట్టకో తలాపకో గాదు
కట్టుకున గావాలి
అన్నదాత కాసలం సీల్యా పీకకుంటే
గాదె తరుగు వోదు
కాగులు ఖాళీ కావు
మనకు రోగాలు రావు.

చిక్కా రామదాసు
1-6-197/1/ఇ, బాపూజీ నగర్, ముషీరాబాద్,
హైద్రాబాద్-20. చరవాణి: 9963770587
ఇ-మెయిల్: chikkaramdas@gmail.com

59

## ఆకాంక్ష

ఒకప్పుడు నీటి కరువు బ్రతుకు బరువు
ఇప్పుడు త్రాగునీటికి సాగునీటికి కరువే లేదంటు
మిషన్ కాకతీయ ప్రబోధిస్తున్నది.
మోడువారిన చెట్టుచేమలు, బీడువారిన పొలాలన్ని
సస్యశ్యామలమై సమృద్ధిగా పంటలు పండాలని,
రైతన్న జీవితాలలో వెలుగులు నిండాలని,
చేనేత వృత్తి చైతన్యం కావాలని,
ఆత్మహత్యలు ఆగాలని,
కడుపునిండా తిండి, కట్టుబట్టకు కరువు రాకుండా ఉండి
నిలువ నీడ కొరకు గూడు కావాలని,
అడవి తల్లి అందాలు చిందులు వేయాలని
ప్రకృతి ఒడి పరిఢవిల్లి పచ్చపచ్చని పైరులతో,
పండ్లు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు,
కాయగూరలతో కళకళలాడాలని,
మన కలలు నిజం కావాలని,
పసిడి పంటలు పండాలని ఆకాంక్ష.
ఒకప్పుడు ఏటి కాలువలు,
పిల్లకాలువలు నిరంతరం ప్రవహించేవి.
ఇప్పుడు తరంతరం నిరంతరం
నదీనదాలు ప్రవహించాలని ఆకాంక్ష.
దిగుడు బావులు, మోటబావులు, చేదబావులు,
చెరువు కుంటలు, పరిపూర్ణంగా నిండి
ప్రజల అవసరాలను తీర్చేది అప్పుడు.
అది కనుమరుగవుతున్న వైనం ఇప్పుడు.
పూర్వవైభవం పునరావృతం కావాలని,
బోరు బావులు ఎండి బోరుమంటున్న ప్రజలకు
నీటి కరువు తీరాలని,
జల కళతో జనము పరవశించాలని,
కార్ఖానాలు, కర్మాగారాలు, అడవి, గూడెం, పట్నం,
పల్లె పల్లెల విద్యుత్కాంతులతో వెల్లి విరియాలని
మనమంతా చెరువు పూడికలు తీసి చేయూత నివ్వాలని,

జలచరాదులు పశుపక్ష్యాదులు సకల ప్రాణికోటి
సర్వకాల సర్వావస్థల యందు
సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని,
సుజలాం సుఫలాం సస్యశ్యామలమై
తంగేడు పూలవనంతో,
జింక పరుగులతో, పాలపిట్ట, జమ్మిచెట్టు
దర్శన పర్వమై మన తెలంగాణ రాష్ట్ర చిహ్నాలు
మహోన్నతమైన జాతి ఖ్యాతి ఖండఖండాంతరాలలో
ఆచంద్రతారార్కమై వెలుగొందాలని
ఆకాంక్ష...
జై తెలంగాణ!
జైజై తెలంగాణ!!





చిక్కా శంకర్
చరవాణి: 9396472729

60

# ఆశయమే మన బలం

ప॥ ఇదే ఇదే తెలంగాణ సాధించిన సంబరం
భావితరం తెలంగాణ భవితకు భాగ్యోదయం.

చ॥ ఆపలేదు ఆగలేదు ఆశయమే మన బలం
అంతిమ విజయమ్ము వరకు సాగించిన సమరం
తెలంగాణ రణ నినాద గణగణ గంటారావం
ఉక్కు సంకెళ్ళు తెంచుకొని వచ్చిన ఉద్యమం
॥ఇదే ఇదే॥

చ॥ తెలంగాణ జన కోటికి జయశంకరు స్ఫూర్తిగ
కెసిఆర్ ఎగరేసిన కీర్తి కాంతి కేతనం
జేఏసి తెలంగాణ జేగంటల మోతలు
కవులు కళాకారులంత గళమెత్తిన దీజయం
॥ఇదే ఇదే॥

చ॥ కొమరం భీం కలల ఫలం కాళోజీ కలం బలం
ఉరుముల మెరుపుల గర్జన విద్యార్థుల ఉద్యమం
అమరవీరులందించిన ఆత్మార్పణ తర్పణం
చిందించినదే రక్తం తెలంగాణ తిలకం
॥ఇదే ఇదే॥

చ॥ పొద్దుపొడుపు పోరుగడ్డ యుద్ధానికి సిద్ధమయ్యే
పాటల తూటాలు పేల్చె ప్రజాయుద్ధనౌక నడిపె
గండర గండడు గద్దరు తెలంగాణ బిడ్డడు
నడుంగట్టి గంతులేసి నడిచినాడు అప్పుడు
॥ఇదే ఇదే॥

చ॥ ఉద్యోగులు సమ్మెలతో ఉద్యమాన్ని నడిపిరి
అడ్డదిడ్డ మెవరొచ్చిన ఆగలేదు ఉద్యమం
నింగినేల ఒక్కటైన నిప్పులు కురిపించినాం
నిర్భయముగ నిశ్చయముగ నిలబడి పోరాడినాం
॥ఇదే ఇదే॥

చ॥ అడుగడుగో అందెశ్రీ అగ్గిమీద గుగ్గిలమై
గడ గడ దడ బుట్టించెను గర్జించెను సింహమై
జయజయహే తెలంగాణ జేగంటల మోతలు
దశదిశలు మారుమోగి దద్దరిల్లెనప్పుడు
॥ఇదే ఇదే॥

చిలివేరి రాజారాం

## 61

## ధీరుడు

అసుర అంతం కాగ సంకెళ్లు వీడినది
స్వేచ్ఛవాయువులు వీచె స్వాంతన చేకూర
సర్వజనులు మెచ్చ సాధించి తెచ్చాడు
వీరుడు ధీరుడు మన శేఖరుండు.
జల సిరులతో జనుల్ సుఖముగా జీవించ
కాకతీయ మిషన్ కార్యరూపం దాల్చె

దాహార్తి తీర్చ కెసిఆర్ జల గ్రిడ్డు నేర్పర్చె
బంగరు తెలంగాణకు బాటలు వేసె
అనాథ బీద వృద్ధ వికలాంగులకై
ఆసరా పింఛనుతో ఆసరై నిలిచె
దళిత మైనార్టీ గిరిజనుల పుత్రికలకు
కల్యాణలక్ష్మితో బ్రతుకు భారం మోసిన ఘనుండు.






**చైతన్య ప్రకాశ్**
ప్రా॥ కొండాపూర్, వయా : కిషన్‌దాస్‌పేట్, మం॥ ముస్తాబాద్,
కరీంనగర్ జిల్లా-505303, చరవాణి: 9948615874

## 62

## చిత్రం

భూమి పుష్పించి చెట్టు ఫలించాలె
బోనమెత్తుకొని వంటలకోయి అడవికి మొక్కుతం
బతుక వోయిన కాడ బంగారం పండాలని
కందుర్కి జేసి దర్గాకు దండం బెడ్తం
కప్పతల్లాటాడి కాలానికి ఆహ్వానం పల్కుతం
ఎదుర్కచ్చి కూరాళ్ళు వట్టి పడ్సు పిల్లం జేసి
సున్న మేసిన గోడ మీద జాజురంగు బాసింగం-
మేమెవరి దగ్గర అడిగి నేర్చుకోలేదయ్యా!
టప్పగట్టిన చేను గొల్కల్ని
మొట్టమొదట పచ్చ పందిరికి కట్టి
మనిషి మీదే పచ్చుల మీది ప్రేమను
మేమెవలను జూసి నేర్చుకోలేదయ్యా!
నిజంగా తమ్ముడా! గడనెత్తుకొని
నెమలీకల్లో ఇమిడిన గజ్జెలెగరేస్తూ
నవనాట సిద్దులూ కార్తీక రాజులూ
గవ్వలు రాలేదా ఎల్లమ్మ సిద్దోగం మాతమ్మలందా-
అబద్దం కాదు అన్నా! ఎన్నెన్ని తీర్ల పొర్లిచ్చి
పెయ్యన్ని కండ్లు జేస్కొని చూసినా
మీ చరిత్ర వేరు మా చరిత్ర వేరు
పూదిచ్చి పూదిచ్చి పొత్తి పరిచి
దిష్టి తీసేసి తీరొక్క దేవుళ్ళకు మొక్కుకొని
పశు సంతతి పైలంగుండాలని
కాట్రేవుల పండుగ జేస్కుంటం
కానిదేదో కానుభూతం బరువై కొనమండిరిగి
తనువెల్లా తండ్లాడ్తున్న చెట్టులా
విత్తులే వేరయినంక పొత్తేడ పొసుగతదనిగోస-
పైసగల పరమాత్ముల్లారా!
ఉత్తకథలు చెత్తకథలు కాదు
పండుగని కాదు పబ్బమని కాదు
సంస్కృతని కాదు చరిత్రని కాదు
అది పోరాటమైనా ఆరాటమైనా
ఆవేశ నిరసనలైనా
అనుసరిస్తూ కాపీ గొట్టే చరిత్ర మాది కానేకాదు
మాకు తెల్గు ఉర్దూ తప్ప మరేం రాదు
మీరు ఎప్పుడూ ఏం కాలేదు
ఎంత తర్కించి చూసినా
ముమ్మాటికి మీరు మేము వేరు వేరు
విహంగ యాత్రికున్ని బాటసారిని ఒకేలా చూసే
నీ రెండు కండ్లల్ల మన్నువడ!
ఏండ్ల కొద్దీ ఒకే దుఃఖం అదే పనిగా ప్రవహిస్తూ
ఒక్కటే బీభత్స దృశ్యం
అమాస చీకట్ల నిండు పున్నం కోసం మారెండు కండ్లు-
ఒక జీవితకాల నేత్ర ద్వయాల దృశ్య పరంపర
పుట్టిన ఊరు చుట్టూ బొచ్చెల మంటి నీళ్ళు



మోట బాయిల సొరంగమేసి....
సీకట్ల జెడకొప్పులాట
బాగోతం సొందిట్ల
ఎగిరే వాళ్ళూ చూసే వాళ్ళమంతా
పరస్పర తాదాత్మ్య పారవశ్యంగా
నిజంగా మేమే దేవుండ్లం-
తియ్యని స్మృతి వనం మీద
చిమ్మిన విషం ఏమది?
మత్తడికాడ తుంగమీద పిట్ల గూట్లె
మధురశబ్దం
చెర పట్టిన నాగళ్ళను విడువాలని
రామ చిలుకల భాష్యం
దట్టని గుట్టల మధ్య ఎరయై
చాప చింపుల నుజ్జునుజ్జుగా నెత్తుటి దేహం
గురిపెట్టిన స్వస్తిక్ తుపాకి దృశ్యమానం
అవే రెండు నేత్ర గోళాల నుంచి
రాలిపడ్తున్న ఆశ్రుబిందువులు
బొంబాయి బీవాండి పేల్కలైకొట్టుకు పోతూ
నగ్న దేహాలు తిరిగి తిరిగి సిరిసిల్లాకే ఉరిపడి
పిల్లా జెల్లా తెర్లు తెర్లు-
మరిగిన మనసు తల్లడమల్లడమై
అవే రెండు కండ్లు
అరబ్బు దేశాల నుంచి శవపేటికలై తిరిగొస్తూ
రాత్రి పూట పెద్దపిట్ల అపస్వరం
ఎండిన చెర్ల సర్కారు తుమ్మమీద
కోయిల విషాద గీతం
భూమి పట్టన పల్లి ఎన్నో భీకర దృశ్యాలు
నయన ద్వయాల ముద్రితంగా శోకనది
అలిఫ్ బేల నుంటి ఎ సర్ అంట్ దాకా-
తడ్చిన నేలనే మళ్ళీ మళ్ళీ తడ్తూ
చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెపుతూ
రెండే రెండు కండ్లు
మోసపోయిన కాడే మరెన్నో సార్లు మోసపోతూ

పొద్దుమాపు ఒకే ఒక కంచు కంఠం
భ్రమా జనిత ఆశల మలుపుల్ని దాటి
పట్టువిడువని ధృడంగా
పీరీల మసీదుల మట్కీలు దీసి
మలీద ముద్దల మెమర్భానీ-
పండుక్కీ పండుక్కీ దుంపగడ్డలు దంచి చల్లుకుంటూ
ఉడుక బెట్టిన కాశెగడ్డి సువాసన-
కులమని కాదు మతమని కాదు
ఒకే ఒక నిజం కోసం సుదీర్ఘయుద్ధం
బిక్కు బిక్కున గొడ్డూ గోదా తరలిపోతూ
మనిషి మాంసం మరిగిన దేశంల
నిద్ర నీల్లి నిలదొక్కుకొని
అది కళాశాలనైతే నేమి వల్లకాడైతేనేమి
బొగ్గుబాయిల తొంగి చూసి
చచ్చేదాకా బగ్గుబగ్గున అగ్గి అయిమండిన దేహం కదా!
కోసిన వరి కొయ్య కాల్లల్లి
అప్పుడే పుట్టి గంతులేస్తున్న కప్ప పిల్లల ఉత్సాహమది-
ఇప్పుడనిగాదు అప్పుడని గాదు
చచ్చి గూడా శంకం పురించిన
గరికపూల గానం
మాయిముంత నుంచి వ్యాఖ్యానం
కూరాడు కుండల మాగాణం
కడుపార అంబలి తాగిన సాంద్రతర ఆత్మీయం
బొడ్డెమ్మ కింద బీరాకు సౌందర్యం
పోలేరమ్మ పహాణి పత్రం
నిరంతర సత్యాన్వేషణతో
నిత్యాగ్ని గోళాల్లా
అవే రెండే రెండు నేత్రాలు
విచ్చుకత్తుల పహారా
దారి తప్పితే మాటమార్చితే
గమ్యం చేరే దాకా మనకాపరి
శంకరా! జయశంకరా!
జోహార్! మా తెలంగాణ జోహార్!





**సి.హెచ్. ఆంజనేయులు**
6-3-264, బ్యాంక్ కాలనీ, ఖమ్మం-2
చరవాణి: 7702537453

63

# తెలతెలవారిన తెలంగాణ

ఆకాశంలో చీకటి ముక్కలు ముక్కలయి నేలరాలింది
ఒక లక్ష నక్షత్రాల తోరణాలలు రంగురంగులుగా
కట్టింది నేడాకాశం
ఒక వెన్నెల కాంతిపుంజం నలుదిశల ఆక్రమించింది
ఎన్నేళ్ళకు, ఎన్నాళ్ళకు తెలతెలవారింది తెలంగాణ
తెలతెల్లని మల్లెలై విరబూసి నవ్వుతూ
పరిమళాలు తరగలు తరగలై గాలి చేరి
గాఢ సుగంధమై వ్యాపిస్తోంది
నేడు తెలివిని తెచ్చుకుని ధైర్యంగా సాగిపోతోంది
మేల్కొని సాగిపోతోంది నా కష్టజీవుల ప్రజ
ఈవేళ తెలంగాణ అమరులాత్మ కళ్ళారా నింగి నుండి
సంబరపడుతున్నది
ఇన్నాళ్ళకి వివక్షా సంకెళ్ళు బదాబదలయినయ్
ఆంధ్రా దోపిడీ వలసల గొలుసులు తెగిపోయినయ్
నేడే 60 ఏండ్ల చిరకాల స్వప్నాలు వెన్నెల దీపాలై
కాంతులు చిమ్మే వేళ సంబరాలతో ఈనేల
అంబరాలు తాకుతున్నయ్
ఈ నేలపై మా కన్నతల్లుల మమకారాలు
వాత్సల్య ప్రేమ హస్తాలతో పెంచిన
తండ్రులాత్మాలింగనాలు
మరువలేనివి
ఇన్నేండ్ల కడుపుకోతలు మర్చిపోలేనివి
పచ్చపచ్చని పంటల ధాన్యపు రాసుల గాదెలతో
మా పల్లెల కడుపు పంట పండాలని
కొమరం భీములు, ఐలమ్మలు, బందగీ ధీరయోధులు
ఈ నేల ఘన జననేతలు కాళోజీ, జయశంకర్
లక్ష్మణ్ బాపూజీ దీవెనలిస్తున్నరు
తెలంగాణా అమరవీరుల స్థూపం కన్నీటి
బాష్పాంజలితో
తడిసింది గులాబీల పూల జల్లు కురిసి
ఆకాశమవని గులాబీరంగు పులుముకుంది
నవ తెలంగాణ కర్తవ్యం ప్రగతిమార్గమై
బంగారు తెలంగాణ ఫలాలకై కళ్ళముందు నిర్దేశిస్తూ
సందేశం పలుకులు పలికింది
తెలంగాణ స్వేచ్ఛాభూమియై
ప్రబోధ చైతన్యగీతాల వర్ణమై కురుస్తోంది.

**సి.హెచ్. ప్రకాశ్**
5-6-129/307, తిరుమల అపార్ట్‌మెంట్
ఎన్జీవోస్ కాలనీ, కామారెడ్డి-503 111
నిజామాబాద్ జిల్లా. చరవాణి: 9346403040

# 64
# గుండెగోస

సడీ సప్పుడు జెయ్యకుండ
బడికి చెట్టగొట్టెనని
బాల కార్మికుడి ననవట్టిరి
బాధలు వెట్టవట్టిరి
నీ కేమిష్టమని ఒల్లడుగుతలేర్?
బడికి వోక మున్నె
బర్రె తోకవట్టి ఒర్రె దాటినోన్ని
పలక వట్టకమున్నె
చిల్కపల్కులెన్నొ ఒల్కవోసినోన్ని
ఉట్టి చెయిల్తోని సెర్ల జిమ్మలు వట్టిన నాకు
కాంచుపెట్టెల బొమ్మలు జూపి చేపలంటుండ్రు
ఇల్లేరా పస్టు బడంటరు మరి
బల్లె చెప్పింది ఇంట్ల చెప్పింది
ఒక్క తీర్గ లేదెందుకు?
వేప పండ్లను చూడంగనె
మామిడి పండ్లు గుర్తుకస్తయ్
బల్లె చెప్పినదాంట్లో నాకు
సగం దెల్సినయె ఉంటయెందుకు?
చిట్టన వల్గిన సితవల్ల పండ్లు
బొచ్చెడు దిన్న
సీతాఫలమంటె నాకేమెరుక?
శేగల పాశెం దెల్సుగని
చక్కెర పాయసం నాకేమెరుక?
గట్క దిన్నపుడు ఎక్కిల్లచ్చినట్టు
గోటీలాడినప్పుడె ఎక్కాలచ్చినయ్
బడికి బందయితె బాలకార్మికుడనెట్లయిత?
బండలా ఉండకుండ సుత్తెవడితెసుగ
బలవంతంగా బల్లె వెడుతుండ్రు
బర్రెల దొడ్లె కట్టేసినట్టుండద?
అయ్యా!
నా మన్సుల మాట చెప్తా
పేమతో వినుండ్రి
"బల్లె బువ్వ వెట్టుడుగాదు
బతుకు డెట్లనో నేర్పుండ్రి
పది పరీక్షలు పెట్టుడు గాదు
గెల్చుడెట్లనో తెల్పుండ్రి
ఏం జెప్పిన నా ఇంటి భాషలో చెప్పుండ్రి
ఏం బెట్టిన నా ఇంటి బువ్వనే పెట్టుండ్రి
నా పెయికి వడ్తది నే చెల్తిగైత".



సి.హెచ్ మధు
చరవాణి : 99494 86122

# 65

## ఇది శత్రువు నవ్వు

ఎక్కడ ఓడిపోయానో తెలియనిస్థితిలో
ఆకాశంలో ఒంటరి పిట్టనై
తిరుగుతుంటాను
తోడు లేదు నీడ లేదు
ఏ వాడ నాది కాదు
ప్రపంచీకరణ విసిరిన వలలో
చిక్కుకో కూడదని
ఆకాశం హద్దుగా పరుగులు తీస్తున్నాను కానీ
శత్రువు అరుస్తున్నాడు, 'ఎప్పుడో వలవేసాను
ఎక్కడికి పోతావులే' అంటూ కనిపించని వల
నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుందని
నా ఊపిరితో ఆట ఆడుతుందని

ఇప్పుడే తెల్సి వచ్చింది
ఇప్పుడు ఆకాశమే వలలా కనిపిస్తుంది
శత్రువు అరుస్తూనే వున్నాడు
'ఇపుడు ఏదీ నీది కాదు
నేల, నీరు, భూమి, సూర్యుడు, చంద్రుడు
సముద్రాలు, అరణ్యాలు, దిక్కులు
అన్నీ నా పిడికిలో వున్నాయని
శత్రువుతో అన్నాను
'రాజ్యాంగం నాదిగా...' నీదా?
పిచ్చిపిట్టా ఇంకా భ్రమలోవున్నావు
ఎప్పుడో కబ్జా చేసాను
శత్రువు వెక్కిరింపు

**సి.హెచ్. ఉషారాణి**
3-42, హుడా కాలనీ, చందానగర్, హైదరాబాద్-50
చరవాణి: 9441228142
ఇ-మెయిల్: usha.chavvakula@gmail.com

66

# నిర్మల్ బొమ్మల కొలువు

కొమ్మ కొమ్మకూ పిట్టలే-అన్నీ తాజా కూరగాయలే
గాండ్రించే పులి-పరిగెత్తే లేడి
ఎర్రముక్కు చిలక-చెట్టు మీద జాంపండు
పెళ్లిమేనాలు, పిల్లన గ్రోవి కృష్ణుడు
పొన్న చెట్టు కింద గోపికలు
వర్షానికి ముందు తూనీగల దండల్లె పరుచుకున్నాయి
అలుపెరుగని ఆ ఎర్రగాజు చేతులు
నగిషీలు నగిషీలుగా కదిలిపోతుంటాయి
పుష్పమ్మ నుదిటిపై బ్రహ్మగీతలే గోపికల కాటుక కళ్ళ
రేఖలుగా మారినాయేమో!
పోయిలోకి చేరే పోనికి చెక్క నకిషీ లింబయ్య చేతిలో
పొన్నచెట్టై, యమునా తీరమైందేమో
మరికొన్ని సంక్రాంతికో, దీపావళికో
బొమ్మల కొలువులో పేరంటాళ్లయినాయి
మేళాలో నా ఈ చేతులు పేర్చిన బొమ్మలన్నీ
అపురూపంగా సాకిన చిట్టితల్లై కళ్ళను హత్తుకుంటాయి
నా చేయి దాటుతున్న ప్రతిబొమ్మ అప్పగింతల
పెళ్ళికూతుళ్ళల్లే తోస్తాయి
గొంతుని రోజల్లా తాడుచుట్టి విసిరిన బొంగరం
చేసినప్పుడే కదా! పూటగడిచేది
ఒక్కోసారి కొసిరి కొసిరి బేరమాడుతున్నప్పుడు
కరుగుతున్న మట్టి బొమ్మలా పాకిపోతుంది మనస్సు
రింగు రింగుల చెక్క పొట్టుపై తడారిన చెమట చుక్కలే
కదా! మా చిరునామాలు
ఓ అపరిచితుడు మా బొమ్మల్లే ఈది మునకేస్తున్నప్పుడే
కదా బతుకుపై ఆశ అంటుతుంది
ఓ కళాపిపాసి కళ్ళలో ఇంద్రధనస్సు వలయాలు
పోటీపడుతూ
తళుక్కుమన్నప్పుడు కదా జీవం కుదటపడుతుంది
ఓ చిన్నితల్లి మారాం చేస్తూ కలవరించినప్పుడే కదా
ఈ కళ అత్యవశకమవుతుంది
బొమ్మలన్నీ అమ్మలై నా వైపు చూసినపుడు
ఏడు సముద్రాలు దాటి గెలిచినట్టుంటుంది
కడుపు నింపని సత్కారాలు అల్మారాలో అలంకారాలల్లే
తప్పెట్లేసే బొమ్మలయినాయి
వేపచెట్టుపై రాయితీ పరాన్న మొక్కలై
బతుకీడుస్తున్నపుడే గుండెకు గండిపడుతుంది
పెన్షన్-గూటి పడవలో లాంతరు వెలగవుతుంది
అధికారి ఈసరింపు, చెలాయింపుల మధ్య చిట్లిన
కళ్ళద్దాల్లో నుండి వాన చుక్కకై ఎదురుచూపు 'నిత్యం'
అవుతుంది నల్లరేగడి బీటలై వణుకుతున్న ఆ చేతులకు
వూట వూరక పాలిపోయిన ఆ కళ్ళకు
పస్తులతో పలచ బడినామెకు
ఏ వేకువ వెలుతురు పందిరౌతుందో
ఏ చేతికర్ర వూతవుతుందో కదా !







**చిందం ఆశన్న**
తెలుగు ఉపన్యాసకులు,
ఇంటి.నెం. 5-2-42, చించేరువాడ,
ఆదిలాబాద్-504001 చరవాణి: 9948030744

67

# నా తెలంగాణ

సుపరిపాలనతో
షష్టిపూర్తి జరగాల్సిన రోజు
ఆవిర్భావ దినోత్సవం
కొడుకుపుట్టి
తండ్రి లగ్గం జేసినట్లుంది
స్వాతంత్ర్య పసికూనకు
బలవంతపు తాంబూలం
పురిటిలోనే రాక్షసవివాహం
కలిసుందామని
కల్కాటం షురూ
దేశం బానిసత్వం వీడినా
ముష్కరుల చెరలోనే మేము !
రజాకార్ల రాక్షస క్రీడకు
నలిగిన పసిడి కన్య
జాతి జాతంతా స్వేచ్ఛా గానం చేస్తే
తెలంగాణకన్నీ చావుకేకలే
సర్దార్ పటేల్ అందించిన స్వేచ్ఛాఫలం
మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది
ముష్కరుల కంటగింపయింది
భాగ్యనగరం బంగారం పక్షిపై
డేగకన్ను పడింది
ఎనిమిది వసంతాల మీ పాలన
ధృతరాష్ట్ర కౌగిలైయింది
దుశ్శాసన పర్వమైంది
సామంతులై మనవాళ్ళు
చాకిరీ బతుకు చేసారే తప్ప
ఛాతీ విరుచుకొని నిలువలేదెప్పుడు
తెల్లదొరల పాలన తలదన్నె
రీతిని చవిజూసిన
మనవాళ్ళు
పోరాట పంథానెత్తుకున్న
అప్పటికే వాళ్ళు
వటవృక్షాలై నిలిచింద్రు
ఈ నేలతల్లి
బంధవిముక్తికై
అభిమన్యులై పద్మవ్యూహాల్ని ఛేదించే కొద్దీ
సైంధవులే పుట్టుకొచ్చారు
పురుషోత్తములై రాజనీతి నెరపినా
కంచె చేను మేసినట్లు
జయచంద్రులు వెన్నంటే ఉన్నారు
మలిదశ ఉద్యమం
మహోగ్రరూపం...
పడిలేసిన కెరటంలా
జోదేఘాట్ బంధంలా

కాళోజి కలంలా
దాశరథీ దరువులా
పట్టపగిలిన
చీమల దండులా
దండోర వేసి హెచ్చరించింది
జనగర్జన గళమై
నినదించిందీ
సకల జనులేకమై
స్వరాష్ట్ర నినాదమై
జై తెలంగాణ తారక మంత్రంమై
ఊరువాడ ఉప్పెనలా
ఎగిసిపడిన మహా సంగ్రామంలో
నేలరాలిన లేత పుస్తకాలెన్నో
తాళి తెగిన పుస్తెలింకెన్నో
శత్రుమూకల కుంభస్థలాన్ని ఛేదించ
నిప్పుకణికలై ఉరిమిన వీరుల
కర్మాగారం ఉస్మానియా

తెలంగాణ బొడ్రాయైంది
ఆంధ్ర పాలకుల గుండెల్లో నిదురించి
అసలు సిసలైన ఉద్యమరుచి చూపించి
హస్తిన కళ్ళు తెరిపించి
జాతి యావత్తును ఏకతాటిపై నడిపించి
జయశంకరుని ఆత్మను ఆవహించి
ప్రజాస్వామ్య గొంతుకై నినదించి
నాలున్నరకోట్ల ఉద్యమకారుల సిరాచుక్కై
పార్లమెంటులో పగటివేషగాల్లెందరు
అడ్డొచ్చిన! జయకేతన మెగురేసి
జననేతయై మనముందు నిలిచాడు
అతనితో మనవాళ్ళు
బంగారు తెలంగాణ అని కొందరు
ఏ తెలంగాణ అయితే ఏం? దోపిడి దొంగలు
ఆకలిచావులు లేని
అందరి తెలంగాణ అయితే చాలు అదే పదివేలు...!





**డప్పోల్ల రమేష్**
5-1-103/ఎ/9సి, గణేష్‌నగర్ కాలనీ, ఐటిఐ ప్రక్కన,
సంగారెడ్డి, మెదక్-502 001 చరవాణి: 8008797733

68

# సోపతి తీపి గుర్తుల మోపు

ఒక్కసారైనా మనుసు విప్పి
మాట్లాడకుండా ఉండగలమా?
ఎల్లబోసుకోకుండా జీవించగలమా?
నిజంగా...
మనిషిగా బ్రతికిన వాడికి
సచ్చేదాంక ఒక్కడంటే ఒక్కడు
ఆసరా లేకుండా పరిగెత్తి ఎలుగెత్తగలడా?
సూపులు మొలిసిన పాలగుర్తుల కేరింతలు
అమ్మ ఒడిల పాలధారలు
నాయిన కట్టిన మొలతాడు
నాయిన భుజాన్నెక్కి
వీపున జేసిన సవారీలు
కాగితపు పడవలాటలు
సోపతి ఆరామాలేగదా
దొంగలోని మంచి గుణమేగదా!
వాడికీ ఓ దోస్తిని పెంచేది
చెట్టుకూ ఓ సూర్యుని కాపును బట్టే గదా
దాని జన్మకు జీవనాహారం
చెట్టుకైనా మనిషికైనా
నీడేగదా వీడి ఉండలేని సోపతి
ఆటల పెద్దగుల్ల అల్లరితనపు
కలయికల సమాహారం భాండాగారం
మనబడి మనకు స్నేహపు రైలుబండి గదా
ఎవడికైనా ఏముంటది
బతుకు పునాదుల బాసట తప్పా
దాపరికానికి తావుండని
ఎడారిగుండెలు
ఎవరిసొంతం జీవితాసొంతం
సోపతివేగదా సోపతేగదా
చీమలను నవాబుల్ల నడిపిస్తది
అదిగో చరిత్ర నుదిటన ఓ సంతకం
ఓ పాఠము
మామూలు మనుషుల్ని
విశ్వమానవుల్ని
చేసింది - సూసింది
సోపతిగాక మరేమిటి?
చివరకు పెన్నుకు - పేపరుకు
ఏమున్నది సెప్పు?
ఓ కవితను
పురుడు పోయడంలో సోపతి తప్పా
అవును
ఈ చారిత్రక సంబరానికీ
సోపతి తీపిగుర్తుల మోపే గదా!
నన్నూరుమందిని కలిపింది.





డబ్బికార్ సురేందర్
ఇంటి.నెం. 10-4-156/2, నాసరపుర, సిద్ధిపేట,
మెదక్ - 502103. చరవాణి: 9618789598

69

# ఆత్మగౌరవం

చేయిచేయి కలుపాలి ఉద్యమమై కదలాలి
బంగారు తెలంగాణ కోసం బాధ్యతతో మెలగాలి
ఇంటికి ఒక ఉద్యోగము చాలు
రెండున్న ఒకటి త్యాగం చేసి
సమసమాజ నిర్మాణమే
తెలంగాణ ముందున్న ధ్యేయం
అన్నార్తుల అభాగ్యులకోసం
తలా ఒక చేయి వేయాలి
జలజలం గలగలకోసం
మొక్కలెన్నో నాటాలి
నిరంతర విద్యుత్తే లక్ష్యంగా
అవసరాలను తగ్గించాలి
నీటి నిల్వలు పెరుగుట కోసం
చెరువుల పూడిక తీసి
నేలతల్లికి నైవేద్యం పెట్టి
సిరుల పంటలు ఇంటింట నింపాలి
అక్షరాల ఆత్మసాక్షిగా
ఉద్యోగులు మారాలి
అడిగిన భత్యం పొందినందుకు
అభివృద్ధికి పాటుపడాలి
వరకట్నం నిషేధించాలి
ఆడబిడ్డల గౌరవించాలి

ధనవస్తు రూపం ఏదైనా
వరకట్నం దురాచారం
రూపుమాపడం అందరి ధర్మం
పల్లెర్లు మొలిసిన చెరువుల్ల
తన్నీరు రావాలి అంటూ
మిషన్ కాకతీయ ఆయుధంగా
కదం కదం కలుపుదాం
ప్రతి ఇంటికి మంచినీరు
నిరుపేదకు పక్కా ఇల్లు
కెజి టు పిజి విద్య
ఆత్మగౌరవ జీవనం
మన భాష యాసలో
మధురం అందరికీ పంచుదాం
మిగులు విద్యుత్తు సాధిద్దాం
హరిత హారం బాటలు వేద్దాం
ఉన్నవారు అడుక్కోవద్దు
లేనివారికి అడ్డురావద్దు
త్యాగానికి ఆనవాళ్ళు
అమరులను తల్చుకొని
రేపటి తెలంగాణలో
ఆకలిని తరిమేద్దాం
బంగారు తెలంగాణకై కష్టపడి పనిచేద్దాం
జై తెలంగాణ    జైజై తెలంగాణ.





డా. అగ్రహారం ఛందోజిరావు

70

## ఎప్పట్లాగే అనుకున్నా...

పార్టీలేవైనా/జెండాలు - ఎజెండాలు మార్చుకై
ఓటరెప్పుడూ ఓడడం/ఐదేండ్లూ తనను తాను తిట్టుకోవడం
ఇదంతా మామూలేనని/ఎప్పట్లాగే అనుకున్నా.
అదేం సిత్రమో
పోయినేడు నుండి జెండాలు ఎజెండాలు మారినా
ఓటరు గెలవటం ప్రారంభమైందీ!
పించన్ పెరుగతదంటే
మంచం నుండి పడి మూడు కాళ్ళతో వెళ్ళి
ఓటేస్తే బాంచ బతుకు మారలే
మంచం, మూడో కాలు ఊసిపాయె/ఎప్పట్లాగే
అనుకున్నా! అబ్బో ఎంత గమ్మత్తు
పోయినేడు నుండి పించను పెరిగె/బాంచబతుకుపాయె
కొడుకూ, కోడలు, మనవళ్ళూ
మంచం దిగనిస్తలేరు/కంచం కడగనిస్తలేరు!!
కరెంటు కోతలుండవని అంటే
కరిగెట ఎండినా, ఎండలో ఎగదొక్కుతూ!
పాతోన్ని కాదని కొత్తోన్కి ఓటేస్తే
కరెంటు రాక ప్రాణం పోక/అనుభవమేనని ఎప్పట్లాగే
అనుకున్న!
అమ్మో ఎంత ఎలుగు
పోయినేడునుంచి/కోతలే లేని చేతలు కనిపిస్తుంటే
పంటలూ, నోచిన నోములూ పండి
రైతే రాజవుతుంటే/బంగరు తెలంగాణ కనిపిస్తున్నది.
కూడూ గూడూ గుడ్డిస్తమంటే
గరీబీ హఠాతే అంటే/గంతులేసుకుంటెల్లి ఎన్నుకుంటే
కూడూ, గూడూ, గుడ్డలు విసిరి
గుడిసెలు కూల్చి మేడలు కడితే/ఎప్పట్లాగే అనుకున్నా!
ఎంత నిజం! ఎంత నిజం!!
ఈ యేడునుండి గుడిసె రెండు గదుల ఇల్లాయే
సాగునీరు తాగునీరు/పొలానికి, ఇంటికి ఉరికొచ్చే
గరీబీ హఠావైంది/గుండె నిబ్బరం పెరిగింది!!
కవులూ, కళాకారులూ/పార్టీలవారీగా విడిపోయి
ఆడుతూ, పాడుతూ జైకొట్టి/ఎన్నికలైనాక కనుమరుగై
కన్నీటిపాలైతే
విధి ఆడిన ఆటని, తడి ఆరని పాటని/ఎప్పట్లాగే
అనుకున్నా. ఇదేం మాయో!
కవుల, కళాకారుల/దరువులకు ఆదెరువు దొరికి
కళ కళ కోసం కాదన్న సత్యం
ఈ యేడు చిగురించి/ఆశ పువ్వై నవ్వింది.
ఆక్సిజన్ ఉస్మానియాకు ఊతమిస్తే
నిరుద్యోగం కుర్చీ ఎక్కి కులాసగుంటే
మేధావుల వలసలాగి వృద్ధి వెంబడి నడిచొస్తే
మిషన్ కాకతీయతో చెరువులు గలగలలాడితే
ప్రపంచమంతా పాలమూరుకు వలసొస్తే
నా గొంగడీ గోసీ పట్టువైతే... సల్లంగుంటే
ఇప్పటిలాగే అనుకుంటా! లేదంటే...
ఎప్పటిలాగే అనుకుంటా!!



**డా॥ అడువాల సుజాత**
ఇంటి.నెం. 2-10-1223, జ్యోతినగర్, కరీంనగర్ జిల్లా.
చరవాణి : 9989558678.
ఇ-మెయిల్: aduvalasujatha@gmail.com

71

## ఓ యువతా మేలుకో

ఓ యువతా మేలుకో
నీ శక్తిని తెలుసుకో
మంచేదో చెడుయేదో యోచించి మసులుకో
ఒక్కోరోజు ఒక్క నిముష మొక్క క్షణం వృధా వద్దు
బంగారు తెలంగాణ భవిత ఉంది నీ చేతుల
ఆకాశమె నీ హద్దుగ అభివృద్ధియె నీ బాటగ
చేయి చేయి కలపరా కలిసి ముందుకేగరా
త్యాగాల గడ్డమీది తెలంగాణా బిడ్డలారా
ఘణమైన గతచరితను మదిలో నువ్వు మరువద్దు
అసువులు బాసిన అమరుల ఆశలు నిలబెట్టురా
తెలంగాణ సంస్కృతిని, ఆటను, మాటను, పాటను
బతికించె బంధువువై చిరునామా నీవెని
ప్రగతి మార్గ దర్శకుడవై పయనం సాగించరా!
వృత్తులన్ని మాయమాయె బతుకుదెర్వు భారమాయె
పేదవారి (బలవంతపు) చావులను ఆపే దేవుడవీయై
కంటినీరుదుడ్చి నువ్వు 'కషిపి'ల బతికించరా!
ఓళ్ళ 'కషిపి' ఆళ్ళ కింపు అది నువ్వు నిలబెట్టు
నీ గుండెను దిటవు చేసి కండలు కరిగించరా!
సమభావం సమన్యాయం నరనరాన నిలుపరా!
నీచెమట బిందువులే విజయానికి బంధువులు
చెమటోడ్చిన నినుచూసి కన్నతల్లి దీవించు నేలతల్లి
పులకించు
కలాం కలలు నిజంచేయు భరతవీర లేవరా
బంగారు తెలంగాణా భవితంటే మీరేరా!
ఓ యువత మేలుకో నీ శక్తిని తెలుసుకో!
చేయి చేయి కలిపి నువ్వు ప్రగతిని సాధించరా!





**డా. అమ్మంగి వేణుగోపాల్**
11-9-317, లక్ష్మీనగర్, వీధి నెం. 4, కొత్తపేట,
పోస్టు ఆర్‌కె.పురం, హైద్రాబాద్-500 102 చరవాణి: 9441054637
ఇ-మెయిల్: ammangivenugopal1948@gmail.com

72

# ప్రాంతదర్శి

ఎడారిని దత్తత తీసుకొని
ఏరులు పారించాలనుకుంటాడుకవి
కలల వేలం పాటను
పోటీపడి దక్కించుకుంటాడుకవి
శూన్యం కురిసే ఆకాశానికి
మబ్బులు కమ్మిన రైతాంగానికి
మధ్య నలిగిపోతాడు కవి
ఊహకు భిన్నంగా వుంటే
ఊపిరిని కూడా ఒప్పుకోని అసహనం
ఉన్మత్త గజం మీదే ప్రయాణం

అసిధారలో స్నానం అగ్నికీలతో గానం
అతడు నిరుపేద కళ్లలోని ప్రాణం
పసిపాప కాళ్ళముందటి మైదానం
కాలం పొలంలో కలుపు తీస్తూ
మలుపు తిరిగే చరిత్రతో మమేకమవుతాడు
చీకట్లను చీల్చనిది సూర్యరశ్మి కాలేదు
ప్రాంతదర్శి కానివాడు క్రాంతదర్శి కాలేడు
కవి ఒక బహువచనం
కవిత్వానికి లేదు మరణం
(కాళోజీ యాదిలో)



డా. అయాచితం నటేశ్వరశర్మ
ఇంటి.నెం. 7-136 /9, రోడ్ నెం.1, కల్కినగర్, నిజామ్‌సాగర్ రోడ్,
కామారెడ్డి-503111. చరవాణి: 9440468557.
ఇ-మెయిల్: ayachitamnateshwarsarma@gmail.com

73

# తొలి వసంత ఫలం

ఎన్నాళ్ళ కల ఈ తొలి వసంతం?
ఇన్నాళ్ళకు కళ్ళముందు నిలిచింది
చైత్రంలో మావులు చిగురించినట్లు!
శిశిర విషాద పత్రాలు రాలిపోయినట్లు!
నా పుణ్యభూమి మామిడిచెట్టు!
నా జన్మభూమి మంగళానికి తొలిమెట్టు!
గతంలో ఈ చెట్టు చుట్టూ
ఎన్నెన్ని గాయాల మంటలు!
ప్రళయాగ్నుల వంటి మంటలలోనూ
పదిలంగా నిలిచింది నా మామిడిచెట్టు!
చీడపీడలు తొలిచినా
స్కంధాలకు స్కంధాలే నరికివేతకు గురైనా
పచ్చని ఆకులతో పరిమళించింది నా చెట్టు!
దాని మొగ్గల్ని మొగ్గలోనే తుంచారు
దాని కాయల్ని నిర్దాక్షిణ్యంగా రాల్చివేశారు
పండ్లదాకా రానీయలేదు ఏ దుర్మార్గుడూ!
రాళ్ళదెబ్బలకు ఓర్చుకొని
రగిలే ఆత్మవేదనాగ్నిని ఉద్యమంగా మార్చుకొని
మళ్ళీ నిండుదనాన్ని సంతరించుకొంది నా చెట్టు!
తొలి వసంతంలో ఫలాలను అందించింది!
పిల్లలకు తల్లి అన్నం పెట్టినట్లు!
పిల్లల్లారా! బ్రతకండి చల్లగా నూరేళ్ళు!
బంగరు తెలంగాణ తల్లి కరుణలో!
తల్లి మురిపాల సవ్వడిలో!



**డా.ఆర్. కమల**
ఫ్లాట్ నెం. 502, లోటస్ గగన్‌విహార్ అపార్ట్‌మెంట్,
దోమల్‌గూడ, హైద్రాబాద్-29. చరవాణి: 9989872723

74

# ఇల్లలు కంగనే పండుగ కాదురా!

తెలంగాణ వచ్చెనని సభలే చేసి,
సంబురాలు చేస్తే సరిపోదు తమ్ముడా!
అలసిపోయి కూకున్నా, జర ఆగుండనకురా!
అసలు ఆట యిప్పుడే మొదలైంది చూడరా!
ఆగి పోయిన ఆనకట్టలు మొదలు పెట్టి చూడరా!
అన్నదాత నా ఊరిని అందరికి చాటరా!
ఇద్దరన్నదమ్ములు యిల్లు పంచుకున్నారు
తెలంగాణ తమ్ముడా! వెనుదిరిగి చూడకు
గతం గోష్ఠి నకర్తవ్యం గది మనకు తెలువదా!
ఉరుకుతున్న తెలంగాణ పథకాలు చూడరా!
ఏలెత్తి చూపినోణ్ణి ఎగిరెగిరి తన్నరా!
ఏమి తెలియనోడొచ్చి తిన్క చెప్తె వినకురా!
కౌరవుల పాండువుల కథలెన్నో వినలేదా?
విజయం మన వెంటే వుంటే వీడెవ్వడు చెప్పనీకి
మెడ బట్టి దొబ్బినా చూరుపట్టుకున్నడు
ఉన్నదాంట్లో, లేనిదాంట్లో ఏలుపెడుతున్నడు
మనభాషతో, మనయాసతో వీడికేమి పని ఉన్నది?
పరీక్ష పేపరు రాస్తడంట, పోటీకి తయారుచేస్తడంట.
ఇగ జాలు దోస్తాని, ఇగ జాలు సావాసం
పోటుగాడు వీడేనట, పోటీ పరీక్ష రాయిస్తడట
ముందువాని ఊరుపేరు చక్కగ రాసి చూపమను
తలలు తోకలు కత్తిరించి, మన పేర్లతో రాస్తున్నడు
ఎక్కువ తక్కువ వదిరితె ఏలూరికి తరమరా!
రాతలు పూతలంటే రాయలసీమ పంపరా!
చిన్న పామని చూడకు పెద్దకట్టె పట్టరా!
రుచెరిగినపాణం పొమ్మంటే పోదురా!
పొంచి వున్న నక్కలను వంచి గుద్ది పంపరా!
ఏలు పెట్టనిస్తే రేపు కాలుపెడ్తరు తమ్ముడా!
కోకిల గుంపులో కాకిని కనిపెట్టి తిరుగురా!
బంగారు తెలంగాణ దూరమెంతో లేదురా!

**డా. కపిలవాయి లింగమూర్తి**
నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్.
చరవాణి: 9000185437

75

# తెలంగాణ వైభవం

తెలంగాణ నీ వైభవంబు నేమనుచు
తెలుపగావలెనమ్మ నీవు నెఱజాణ
మంజీర నీ పాద మంజీర కృష్ణ
వేణి నీ వెన్నున వేణియై పొరలు
తుంగభద్రోత్తుంగకుచ సీమపైన
తొలుకులాడెడితారహారంబుగాద

కోటిలింగాల శాతవాహనుల కోట
విజయపురిఇక్ష్వాకు విభులపూదోట
వృషభ పురివిష్ణు కుండినుల ప్రదేశం
హలముపురి ఆనాటి చాళుక్యవిషయం

కోడూరు రేనాటి చోడులకు బుడము
నాగపురినాగవంశపు రాజధాని
చంద్రగుప్తిపురంబు చంద్రగుప్తునిది
మాయపురి అరవీటి మాన్యులకినెలవు

గూడూరు పూడూరు మరియులట్టూరు
ఏయూరు జూచినా ఏదో ఒక చరిత
పేరు జెందిన రాజవంశాలునీదు
పేరులో రతనాల పాళికలు సుమ్మి





**డా. కలువకుంట రామకృష్ణ**
తెలుగుశాఖాధిపతి, ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల,
కరీంనగర్. చరవాణి: 9440152405

76

# నేలమీది పూల సింగిడి

మట్టి బిడ్డల మమతానురాగాల పరిమళాలతో
దోసిళ్ళ కొద్దీ పూల ముత్యాల్ని తెచ్చి
ఆత్మీయతలు కండ్ల కొసలల్ల చెలియెలై పారంగ
పల్లె తల్లి పురుడు పోసుకున్న ప్రాణ చైతన్యం
తీరొక్క బంధాల పేరున్న పండుగ
అక్క చెల్లిండ్ల అన్నదమ్ముల ప్రేమలు
రంగు రంగుల పూల వరుసలు
ప్రేమలేకాని పేదధనిక తేడాల్లేవన్న సందేశాల
ఇంటింటి ఇలవేలుపు-బతుకమ్మ
ముడుచుకుపోయిన మనుషుల్ని
మనసు విప్పి ముచ్చట్లు పెట్టించే అంతరంగ గంగ
గొంతు వాకిలిన్ జాలు వారిన పూలతోట
వీర రసం రంగరించి నూరి పోసి
తెలంగాణ జనం గుండె చప్పుడైన
తంబూర నాద తరంగం
బతుకు నదిని పూలసిబ్బిలా తీర్చిదిద్దిన
అనంత జీవన దృశ్యానుభవాల పూల వంతెన
జీవితాన్ని చిత్రిక పట్టిన పల్లె పందిరై
గుప్పెడు నవ్వుల్ని దోసిళ్లతో రాశులుగా పోసి
పచ్చని చెట్ల నీడల ముంగిట్ల తీగలై సాగి
అల్లుకున్న నవ వసంతరాగ సౌరభం

ఆర్ద్రతా పారవశ్యాల ప్రాకృతిక సౌందర్య ప్రవాహం
వెలుతురు పరిమళాల సోయగాల సంబురం
లంగా ఓణీల పల్లెపడుచు పాటల పరవశం
"ఉయ్యాల-ఉయ్యాల' అంటూ చప్పట్లు మోతల
ఏకనాదం
వాకిళ్ళ పొద్దు పొడుపుతో ప్రజ్వరిల్లే
నేలమీద మెరిసే పూల సింగిడి
మలీద ముద్దల సత్తుపిండి సద్దుల మూటై
ఎంగిలి పూలతో ఎగిలివారంగ కళ్ళు తెరిచిన పల్లె
కన్నతల్లై, వెన్న ముద్దై కడదాకా-
"బతుకమ్మంటూ'' ఇచ్చే దీవెన
తెలంగాణ తల్లి నుదిటి సిందూరం
యువగొంతుకలల్ల విరిసిన ఎర్ర మందారం
తంగెడు పూల బంగారానికి
పల్లె పడతుల సింగారపు నవ్వులద్దగ
పొక్కిలైన తెలంగాణ బతుకులల్ల
పోరాటపు తెగువ దీపాల్ని వెలిగించి
పూల కవాతై నిలిచిన సరికొత్త సాంస్కృతికాస్త్రం
సబ్బండ వర్ణాల సామూహిక సంవేదనల వేదిక
సకల జనుల గుండెలల్ల వెలిగే నిత్య చైతన్య దీపిక



డా. ఎండ్లూరి సుధాకర్
86-15-4, జి1, శ్రీ లిమోటవర్స్, తిలక్‌రోడ్,
రాజమండ్రి-533 103 చరవాణి: 9246650771

77

## ఆత్మకథ

మయసభలో నా ఆత్మకథ ఆవిష్కరించబడింది
బహిరంగ వేదిక మీద నా సన్మానం మొదలయ్యింది
ఇప్పుడు నా మెడలో దండలు పడుతుంటే
నిన్నటి నా గాయాలు ఉలిక్కిపడుతుంటాయి
నా తలమీద పూలు చల్లుతున్నప్పుడు
నా లోలోపల ముళ్ళకొరడాలు చరుస్తుంటాయి
నా మీద అభిమాన పత్రాలు చదువుతున్నప్పుడు
నా కడుపులో అవమానాల చురకత్తులు గుచ్చుకుంటాయి
సభావేదిక మీద నన్ను కూర్చోపెట్టినప్పుడు
ఊరి పొలిమేర దగ్గరే నిలబడ్డ నా తాత మొహం
గుర్తుకొస్తుంది
నా ముందు నీళ్ళ నిండిన గాజు గ్లాసులు పెట్టినప్పుడు
మోకాళ్లపై వంగి నీళ్ళు తాగిన ఎడారి దృశ్యాలు వేడిగా
తులుగుతాయి
నా భుజాల చుట్టూ శాలువా కప్పుతున్నప్పుడు
జాకెట్టులేని నా జేజెమ్మ మసక రూపం గుండెల్ని కోస్తూ
వుంటుంది
పట్టు వస్త్రాలు నాకు అర్పణంగా పెడుతున్నప్పుడు
చివికి పేలికలైన నా తాత ముతక పంచెలు కళ్ళ
తీగెలపై వేలాడుతుంటాయి
నన్ను విందు భోజనాలకు ఆహ్వానిస్తున్నప్పుడు
చిన్నప్పుడు గొడ్లచావిట్లో బువ్వపెట్టిన పొద్దులు గుర్తొస్తాయి
కాలం నా పాదాలకు నమస్కరిస్తుంటే
చెప్పుల్లేని నా తాతల మట్టికాళ్ల మనసులో
మెదలుతుంటాయి
ఏ రోడ్డు మీదో నా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా నా బొటనవేలు గుప్పిట్లో
దాక్కుంటుంది
ఆహా ఓహోల మధ్య నా కవిత్వాన్ని రామచిలుకలు
చప్పరిస్తున్నప్పుడు మన్నులో ఇంకిపోయిన నా జాతి
కవిత్వం గుర్తొచ్చి క్రూరంగా వేధిస్తుంది
నా కోసం చౌరస్తాలు రంగురంగుల తోరణాలై
ఆహ్వానిస్తున్నప్పుడు
నాతో ఐదడుగులూ కలిసేందుకు స్వర్ణహంసలు
సిద్ధపడుతున్నప్పుడు
నా పూర్వీకుల దేహధూళి నేలమాళిగల్లోంచి కొత్తగాలి
పీల్చుకుంటుంది
దేవలయాలూ కొత్తదేవుళ్లూ నా దర్శనం కోసం
పడిగాపులు పడుతున్నప్పుడు
గుడ్డి చీకట్లో గుడిగంటలు వక్రధ్వనులతో నవ్వుకుంటాయి
నాలుగు మబ్బుల నీటిగోడల్ని చీల్చుకుంటూ
నేను ఐదవ సూర్యుడినై ఉదయించాను
ఇవాళ నా రక్త కిరణాలు
చంద్ర తలం మీద ప్రతిబింబిస్తున్నాయి
ఇప్పటి కొత్త సూర్యుడి వెలుగులో కాలం నా ఆత్మకథను
పాఠ్యగ్రంథంగా చదువుకుంటుంది





డా.ఎం. పురుషోత్తమాచార్య
ఫ్లాట్ నెం. 516, 5వ అంతస్తు, శ్రీరామచంద్ర ఎన్‌క్లేవ్, రామగిరి,
నల్లగొండ-508 001. చరవాణి: 9396611905

78

# రేపటి హరివిల్లు

ఇవాల్టిదాకా మూసుకున్న కండ్లలో
పీడకలలే పీడించాయి
ముసుగుబొమ్మలే కలవరపెట్టాయి
రెప్పలెత్తిన తెలుగోడి చూపుకి
రెక్కల రాబందు మసైపోతున్నది
ముసుగులన్నీ జారిపోతున్నాయి
నిజరూపంలో స్వర్ణఖనిజం
నిజాలకు మెరుగు పెడుతున్నది
తెల్లవారడం తెలుస్తున్న తెలుగోడు
మెదడు కుంచెతో మేలిమి భావచిత్రాలను
హృదయపు కాన్వాసుపై ముద్రించుకుంటున్నాడు
కలంతో దున్నేవాడు
హాలికకావ్యాల్ని మొలిపించాలి
నాగలి కంఠంలో అమృతాన్ని నింపే
రసరాజదండం కావాలి
పలకా, బలపాలకు
చుట్టూరా తూర్పులే ఉండాలి
తుపాకిని భూమిలో పాతి
పూలు పూయించాలి
ఇంట్లో ప్రతి పూచికపుల్లా
కల్పవృక్షం కావాలి
ప్లాస్టిక్కుకు కొరతవేయాలి
చేతివృత్తులన్నీ
సాంకేతికపతాకాలు కావాలి
గుండెను గుండెతో కుట్టివేసే
చెలిమి దారం బలపడాలి
పలకరించే తెలుగు మాటలో
పొల్లంతా తూర్పారపట్టాలి
కల్లబొల్లి కబుర్ల కండ్ల కంటె
కన్నీరు తుడిచే చేతులు కావాలి
పాలకులకు అమ్ముకున్నా
తోటివాళ్ళకు పంచిపెట్టేంత
ధాన్యవర్షం కురవాలి
ప్రతి మెదడులో ఒక్కొక్క
పొత్తపు విత్తనం నాటాలి
ఇంటింటికో సూర్యుడు
విద్యుత్కేంద్రం కావాలి
తెలుగు సాంస్కృతికపతాకం
గ్రహాంతరాళాలలో రెపరెపలాడాలి
లోకశాసనసభా సరస్వతి
శోకవిముక్తురాలు కావాలి
భిన్నత్వంలో ఏకత్వంతో
భారతరాష్ట్ర గగనాంగణాన
'తెలంగాణా' దివ్యస్వరూపం
విలక్షణమైన హరివిల్లుగా
సాక్షాత్కరించాలి



డా. ఎ. జయంతి
చరవాణి: 9866371918

79

## బుద్ధిగా మసలుకోమంటున్నా

దేవుడు వరమిచ్చినా
అడ్డుకునే పూజారులెందరో
తెలంగాణ ఆకాంక్షల విస్తరిలో
ఏరుకోవాల్సిన రాళ్ళింకెన్నో
నీచ రాజకీయం కుళ్ళు కుతంత్రాలు
కుప్పగా పోసిన యాభైలక్షలు అడుగుతున్నాయి
కూడు గుడ్డ లేని ముంగిట్లో వాలేదెప్పుడని

కనీస అవసరాలను కూడా
కార్పోరేట్ అంగట్లో పోసి
చాతనైతే ఏరుకో
వాడు నా చెలికాడు సజ్జనుడంటూ
ప్రజల ఓటు మీద సవారులెందుకో
ఊరు తనది వాడ తనది
ఓటేసి గెలిపించిన జనం తనది
పొరుగింటి పుల్లారావు కోరకల
సొంతింటి వాసాలను లెక్కిస్తూ
దగుల్బాజీ వాదనల్తో

పసలేని నీతుల్తో
పదే పదే పలవరిస్తూ
ఇంకా
పక్క చూపు లెందుకో
వెనక్కి చూసుకో
వేలాది మంది నీ వాల్లడుగుతున్నారు
మేమంతా
సువర్ణ భూమిలో లేం బాబూ?
ఇన్నాళ్ళు
మీరంతా పొక్కిలి లేపిన
నేలను పొరకట్టలతో ఊడ్చి
సొంపి సల్లుకొని
ముగ్గు లేసుకుంటున్నాం
ఒక్కసారి
చూపు ఇటు మరల్చి
బుద్ధిగా మసలు కోమంటున్నాం!






డా. ఏనుగు నర్సింహారెడ్డి
# 3-14-50, విజయశ్రీ కాలనీ, వనస్థలిపురం,
హైదరాబాద్. చరవాణి : 8978869183
ఇ-మెయిల్: narsimharedy.anugu@gmail.com


80

# గాయం

గాయపడకుండా ఉండాలనుకుంటాను
నిద్రలేచింది మొదలు
కనిపించని బాణాలను
కనిపెట్టుకుని తిరగాలనుకుంటాను
అడుగు బయటపెట్టింది మొదలు
ఏ మాటల తూటా తగలకుండా
ఒడుపు చేసుకుంటుంటాను

దారిలో నడుస్తుంటే
చక్కగా నడవరాదా అంటారొకరు
వాహనం మీద పోతుంటే
డ్రైవింగ్ ఎక్కడ నేర్చుకున్నావంటారొకరు
ఏదైనా వస్తువు ధర అడుగుతుంటే
నీకు బేరం చేయడం వచ్చా అని
దెప్పి పొడుస్తుంది మా ఆవిడ

చిన్న బాణాల గాయాలు
మాన్పుకుందామని ప్రయత్నిస్తుంటానా?
పెద్ద పెద్ద అభాండాల జడివాన
అమాంతంగా మీద కురిసిపోతుంది
తేరుకోకముందే
తేనెపట్టునుండి కందిరీగలు లేచినట్లు
ఏవో వార్తల బాంబులుపడి
కనిపించని పొగలు లేస్తాయి
నిజాన్ని వీలైనంత వివరంగా
చెప్పడానికి ప్రయత్నిస్తాను
వెక్కిరించే నొసళ్ళమీద
సత్యపు సమాధానాల్ని
నమోదు చేయజూస్తాను
గాయానికి లేపనాన్ని
పూయజూస్తాను
గాయపడకుండా ఉండాలనుకుంటాను
కనిపించని యుద్ధరంగంలో
వినిపించని బాంబులమోత
అదృశ్యంగా ఆయుధాలు
సదృశ్యంగా తేనెపలుకులు
ప్రకటించే నీతుల మధ్య
బయటపడని ఎజెండాల నడుమ
అన్ని చురకత్తుల్ని
తప్పించుకోవాలనుకుంటాను
గాయపడకుండా ఉండాలనుకుంటాను
చివరికి
గాయపడ్డాకే ఇల్లు చేరుకుంటాను.



డా. కాసుల లింగారెడ్డి
3-9-318/1, సరస్వతి నగర్, చింతలకుంట చెక్‌పోస్టు, ఎల్.బినగర్,
హైద్రాబాద్-74. చరవాణి: 8897811844

# 81
# ఇడుపు కాయితం

పుస్తెలతాడు కట్టించి తన్నుకు చావమని
సాపెన పెట్టిండు సచ్చినోడు
తాటికమ్మల గుడిసన్నా లేదని
రాజప్రసాదంల ఆశ్రయమిచ్చిన
కాసులు లేని కనాకష్ట కాలంల
నిలువ గరిసెలిచ్చి నిలబెట్టిన
గొంతెండి ఎక్కిళ్ళు పెడ్తె
కుడిదాయి కుడిపి కుతిదీర్చిన
నా రామస్కని కుర్చీ ఇచ్చి
సదువుకున్నోనివని రాజును చేసిన
నిన్నేమన్న కర్రె కుక్కను చేసి
ఎంటదిప్పుకుంటినా? మర్లువెళ్ళన్నా కాలేదు
కాళ్ళ పారాణన్నా ఆరలేదు
ఒప్పందం తీసి ఒడ్డుమీద పెట్టి
నీకు నాకు నడుమ నియమాలెందుకంటివి
పొలిమేరలు చెరిపేసిన దేహాల మధ్య
అడ్డు తెరలెందుకంటివి సంపదలు నీకు
సందేశాలు నాకన్న సత్యం నేనప్పుడే పసిగట్టి
ఈ కాపురం నేనొళ్ళనంటె కూసున్న పెద్దమనుషులు
కాసింత సర్ది చెప్పి కాయితం మీద కాపురం నిలిపిరి.
కుడి ఎడమల పెయ్యినొరుసుకుంటూ
కాలపు పలుగురాళ్ళమీద పదునెక్కి పారుతున్న
జీవనదులసొంటి భాష బాగలేదని చీదరిస్తివి
ఎగిలివారగట్ల వరిమొవ్వలోని మంచు ముత్యమసొంటి
యాసనెక్కిరిస్తివి కట్టుబొట్టుమీద కథలల్లి
కోట్లు కూడ పెట్టివి నెలిమలు దోచి
నేనెండవెడ్తె కన్నీళ్ళు నాకాయె
నీళ్లు నీకాయె నిల్వ నీడలేదు చెయయ కొల్వు లేదు
ఉనికి ఉనుక పొట్టయితుంటే
నా కుర్చి నాక్కావాలంటె ఇకమతులతోటి
కాలం కమ్మలు మర్లేస్తివి. నా ఇంటి చుట్టూ మొలిచిన
ప్రైవేటు ఎస్టేట్ సర్కారు తుమ్మల మధ్య
నేను బందీనైన అస్తమా రోగి లెక్క
శ్వాసకోసం తండ్లాడుతున్న సూర్యుడు నీవోడయ్యిండు
సుక్కలన్ని నీ కుక్కలయినవి
బళ్ళు నీవి, గుళ్ళు నీవి మడులు నీవి, మాన్యాలు నీవి
చెమట నెత్తుర్లు ధార పోసి
మిగిలిన బొక్కల గూడును నేను
మల్లెసాల మీద మంచమేసి
సాధికారంగ సకులం ముకులం పెట్టి
చర్నాకోల చేతవట్టి
నా ఇంట్ల నన్ను బాంచెదాన్ని చేస్తివి
ఇగ ఇప్పుడైనా పనుగట్లకీడ్చి
పంచాయితి పెట్టి ఇడుపు కాయిదం అడుగక
ఇంకేం చెయ్యాలె?



డా. కాసర్ల నరేశ్‌రావు
చరవాణి : 9441406252

82

# పోరాటం

ఒక పోరాటం
ప్రపంచ ఉద్యమ చరిత్రపై
అనంతశాంతి సంతకమై నిలిచింది
ఒక పోరాటం-
సామాన్యుని శక్తి విజృంభణ ను
సూర్య తేజోసమం చేసింది
ఒక పోరాటం-
ప్రజాయుధమై ప్రళయభీకర
రణ నినాదాన్ని భావితరాలకోసం
ఉగ్గుపాలుగా సిద్ధం చేసింది

ఒక పోరాటం-
అక్షర యోధులకు కలంతో పాటు
కాలాన్ని రాసిచ్చింది-
ప్రజాకళారూపాలకు
జీవరసాన్ని పోసి నిలబెట్టింది
గాయకుల గొంతులకు
ఫిరంగుల నడక నేర్పింది
కోకిలలకు ధూం...ధాం...లు యిచ్చింది!
స్వేచ్ఛ తెలంగాణకై చేసిన పోరాటం
అచ్చమైన పోరాటానికి నిర్వచనమై నిల్చింది!

**డా. కాంచనపల్లి**
ఫ్లాట్ నెం. 02, స్నేహదీప్ అపార్ట్‌మెంట్, గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్-5000017. చరవాణి: 9676096614

# 83

# కల ఇంకా మిగిలే వుంది

మెల్లగా ఒక పాము... పుట్టలోకి
గుడ్డు నుంచి చిన్న ముక్కతో పొడుస్తూ
మబ్బు నుండి బయటికి వచ్చిన
చందమామ లాంటి కోడిపిల్ల
చీకటిని తూట్లు పొడుస్తూ వెన్నెల
పురిటి నొప్పుల ఉద్యమం నుంచి
అదిగో నిన్న ఉభయ సభల వైద్యశాలలో
ఒక పాప.....
చెంపలమీద ఎంత దీపకాంతి
నడకలో ఎంత ఖడ్గసోయగం
కంచుడులోని నూనెలో మరిగి మరిగి
వచ్చిన జల్లిగంటి నుంచి శకునం
అబ్బో తెలంగాణ సుందరి

అమృతుడా...
జయశంకరా...
కాళోజీ...
దాశరథీ....
అమరుడా వేణుగోపాలా...
శ్రీకాంతా....
యాదగిరి...

నీ ఊపిరి పిట్టలు
మబ్బుల రెక్కలు కట్టుకొని
మా ఊహల ఆకాశం మీద
ఎగరండెగరండెగరండి
మీ మరువలేని చరిత్ర
ప్రతి అడుగుకు
ఒక పొడవైన యాది కదా
ఎంత మబ్బు మేనా దిగినా
ఈ సుందరికి ...
ఇంకా చందనం అద్దవలసే వుంది
మళ్ళీ వేటగాళ్ళకు చిక్కకుండా
కాపాడుకోవాల్సే ఉంది
బహుజన పాటలతో కట్టిన దండలు
ఆమె మెడలో వేయవలసే వుంది
ఇల్లలికితే అలికనంగాని
దాన్ని పండుగ అనం
కలలకు ఒక కొనసాగింపే అంటాం
రేపటి మెలకువలో నిజం కాబోయే కల కోసం
ఇంకా...
ఇంకా...
ఇంకా...





డా. కూర్మాచలం శంకరస్వామి
4-52-187, మగ్దూంనగర్, జగద్గిరిగుట్ట, ఐడిపియల్ కాలనీ,
హైదరాబాద్. చరవాణి: 9703268858

84

# కల సాకారమైన వేళ

కల సాకారమైన వేళలో
తెలంగాణ నేల పులకించిన యాళలో
పాడుతున్న పాట జై తెలంగాణ
ఆడుతున్న ఆట జై తెలంగాణ ॥ కల ॥

ఆవిర్భావ దినోత్సవ వేళలో
కవిగాయక సమ్మేళన యాళలో
పాడుతున్న పాట జై తెలంగాణ
ఆడుతున్న ఆట జై తెలంగాణ ॥ కల ॥

అరవై యేండ్ల సంది
అణచివేతకు గురి అయ్యి
అస్తిత్వం కోల్పోయి
అలమటించిన తెలంగాణ ॥ కల ॥

నీళ్ళులేక నిధుల్లేక
చేయబోతే కొలువులేక
ఎండిపోయిన బతుకులతో
బండబారిన తెలంగాణ ॥ కల ॥
కోటి గాయాల వీణ
శృతి సవరించుకుని
ప్రత్యేక రాష్ట్రంగా
ఏర్పడిన తెలంగాణ వేళ ॥ కల ॥

కృష్ణా గోదావరి అనే
జీవనదులు ఎన్ని ఉన్నా
జీవి గంజి లేక తల్లడిల్లిన
తల్లి తెలంగాణ ॥ కల ॥

మిషన్ కాకతీయ
మన చెరువులను నింపాలి
వాటర్ గ్రిడ్ పథకం
మన దాహార్తిని తీర్చాలి
ఆసరా పథకము
మనందరికి అందాలి
నిరుద్యోగులందరికి
ఉద్యోగాలు రావాలి
సింగారాల తెలంగాణ
బంగారంలా మెరవాలి.





**డా. కూరెళ్ళ విఠలాచార్య**
వెల్లంకి గ్రామం, రామన్నపేట మండలం,
నల్లగొండ జిల్లా. చరవాణి: 9949539765

# 85

## ఆశంస

సీ. అమ్మ తెలంగాణ ఆశీర్వదింపగా
చక్కని పాలన జరుగుగాక!
తల్లి తెలంగాణ దయతోడ మముజూడ
చల్లగా జనము వర్ధిల్లుగాక!
మాత తెలంగాణ ప్రీతితో మముజూడ
విశ్వవిఖ్యాతమై వెలుగుగాక!
జనని తెలంగాణ ఘనముగా దీవించ
స్వర్ణ రాష్ట్రంబు వరలుగాక !

తే.గీ. మాన్యతకు ధన్యతకు పరమార్థమునకు
ఏకతకు మానవతకు ప్రతీక యగుచు
మంచికి నిదర్శనముగ రాణించు గాక!
నా తెలంగాణ కోట్ల రత్నాల వీణ!

డా. కె. జ్యోత్స్నప్రభ
ఆచార్య ఖండవల్లి లక్ష్మిరంజనం,
న్యూనల్లకుంట, హైదరాబాద్.

# 86

# తొలి వేకువ పొద్దులు

మరకతంలా మెరిసే
పచ్చని గుమ్మడి ఆకులు పరచి
కనక పుష్యరాగాలు తంగేడు పూలు పేర్చి
తెలుపు కొంత మరికొంత గులాబి కలిసిన
గునుగు పువ్వుల వరుసలు పేర్చి
ఎర్రని ఇంగిలిపువ్వులు ఆపై అమర్చి
నీలి నీలి పూలు నీర్కావి రుద్రాక్షలు
ఊదా కుర్వంతికలు ఉనుకబంతులు
చేమంతులు చిట్టి చేమంతులు
మందారాలు మరి మల్లెపువ్వులు
కేతకీ పుష్పాలు కలువ ప్రసూనాలు

వన్నె వన్నెల పూలు వరహాల పూలు
తీరు తీరుగా తీర్చి
బ్రతుకునే పండుగగా మలచిన నైపుణ్యం ఉన్నవాళ్ళు
వెండికోలాటాలతో వేయి పాటలతో
జీవితాలను కవితాత్మకం చేసే విద్య తెలిసినవారు
ఉయ్యాలపాటలే కాదు ఉర్విని పాలించడం నేర్చినవారు
తీరొక్క పువ్వులు వేయిన్నొక్క దివ్వెలు
నేలపై వెలసిన ఏడువన్నెల సింగిణులు
నీళ్ళపై నడిచే నవరత్నరాశులు
తెలంగాణా ఆడబిడ్డలు
తొలి వేకువ పొద్దులు

డా. కొమర్రాజు రామలక్ష్మి
హన్మకొండ.
చరవాణి: 9849234725

87

# మా గుండెల్లో నీవు

**కాళోజీ!** ప్రజాకవీ!
జనస్వామ్యవాదివై జనం వైపు నడిస్తివి
పేదోళ్ళబాధలు గాధలన్నీ నీవంటివి
పౌరహక్కుల కోసం పోరాటం జేస్తివి
రాజ్యహింస తప్పంటివి
ప్రతిహింస తప్పుకాదంటివి
అన్యాయంపై ధిక్కార గళమైతివి
అణచివేతనస్సలు సహించనంటివి
జీవితమంతా సంఘర్షణ నెదుక్కొంటివి
దౌర్జన్యాన్నెదిరిస్తివి
దోపిడీని నిలదీస్తివి
నిక్కచ్చిగ జీవిస్తివి
నిరసించుడు, నిలదీసుడు నీహక్కంటివి
ఇచ్ఛవచ్చినట్లు ఆచరిస్తనంటివి
మాటల తూటాలు పేలిస్తివి
మా గొడవను నీదంటివి
యాస నీశ్వాసంటివి
పలుకుబడుల భాష కావాలంటివి
పలుకుబడుల భాష కావాలంటివి
తెలంగాణా అక్షరమాలవై
సాహిత్య సంపదనందిస్తివి
గాయపడిన హృదయంతో
కవిత్వాన్ని సృష్టిస్తివి
ప్రశ్నించెటోడె అసలైన మనిషంటివి
మానవతకు నిలువెత్తు మనిషయితివి
గొప్పోడివై మాగుండెల్లో
పదిలంగా నిలిస్తివి

డా. గంటా జలంధర్ రెడ్డి
ఏవి కళాశాల, గగన్‌మహల్, హైదరాబాద్-29.
చరవాణి: 9848292715

88

## నేను కలలు కంటున్న తెలంగాణ

ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా
నిరుద్యోగులు లేని రాష్ట్రంగా
పచ్చని వృక్షజాలంతో విరాజిల్లే
నిర్మల పర్యావరణ రాష్ట్రంగా
సమసమాజ నిర్మాణం వైపు
నేటి నవ తెలంగాణ
దృష్టిని సారించాలని

నాలుగుకోట్ల ప్రజల కలలు సాకారమై
బంగారు తెలంగాణగా మారాలని
కలలు కంటున్నాను
జరిగిన ఉద్యమాలను
అమరుల త్యాగాలను
నెమరువేసుకుంటున్నాను.

డా. గంద్ర లక్ష్మణరావు
10-3-537, వివేకానందపురి, కరీంనగర్-505 001
చరవాణి: 9849328036
ఇ-మెయిల్: gandralrao@gmail.com

89

# తెలంగాణ హేల!



సీ. గోదావరీ తీర పాదమ్ములందున
తెలుగు పలుకులిట మొలకలెత్తె
శాలివాహన రాజు జనపదమ్ముల నేరి
ఏడువందల గాథ లిటరచించె
చాళుక్య ప్రభువుల పాలించు భాషగా
కవిజనాశ్రయముల ఘనత మించె
జినవల్లభుని నోట చిందించు ఛందమై
కందమై అందమై కదిలె నిచట

తే.గీ. పంపకవి భారతమ్మిట పాదుకొల్పె
భీమకవియును పల్కుల బిగువు చూపె
వేల యేండ్లుగా పాడిన వీర గాథ
ఈ తెలంగాణ బంగారు హేల నేడు 1

సీ. చిత్రభారతము విచిత్ర ప్రయోగమ్ము
చరిగొండ ధర్మన్న శతావధాని
పోతన్న శిష్యుడై పూరించె భాగవ
తము వెలిగందల తగువిధాన
బద్దెన పాలనా బద్ధుడై జనులకు
విమల బుద్ధులు చెప్ప సుమతి నిచ్చె
నరసింహ నీ దివ్య నామమంత్రము చేత
శేషప్ప శతకముల్ చెప్పినాడు

తే.గీ. ఎందరెందరో కవివరుల్ ముందు నడిచి
వెలుగు తెలుగుల బాటలు వేసినారు
పదము పదమున కవితయు పరిఢవిల్లి
జ్ఞాన శిఖరము నందెను కరిమునగరు. 2

కం. రాజులు తమతమ భాషల
రాజరికమ్ము చేసి తెలుగు రాపిడి చేయన్
తేజము మరియింత పెరిగె
నైజము నా భాష జనుల నాల్కల నిలుచున్ 3

ఉ. దాస్యము చేయనేల యని ధైర్యము శౌర్యము
కూడగట్టి, పం
చాస్యముబోలు వీరులజస్రసహస్రము గర్జచేయగా
హాస్యములాడు నాంధ్రులవిహారములన్నియు
పారిపోవ, స
ద్భాష్యము గాగనిల్చె మన బంగరు నేల
తెలుంగు హేలయై 4

ఉ. పాటలు పాడినారు, మన పల్లెల పిల్లల లేపినారు, ము
మ్మాటికి వేరు తప్పదని మాటికి మాటికి
చాటినారు, పో
రాటము చేసినారు తమ ప్రాణము లాహుతి
చేసినారు, ఈ
నాటికి ఏటి పండుగ జనమ్ముల నవ్వులు
పండుచుండగన్ 5

ఉ. ప్రాణములొడ్డినారు, జనవాహిని నొక్కట చేర్చి జై
తెలం
గాణకు జైయటంచు జయగానములెన్నియొ
చేసినారహో
బోనములెత్తినారు, పలు బుల్లెటు దెబ్బల
కోర్చినారు, మా
గాణము వేరుగాగ బతుకమ్మల నాడిరి
వీరనారులున్. 6

సీ. తెలగాణ మాటయే తీరైన భాషగా
అవధానముల నేడు నాడుచుండ్రి
తెలగాణ పాటయే వెలగట్ట రాదని
అఖిలాంధ్రజనులంత నాడుచుండ్రి
తెలగాణ కవితయే తెలుపు జీవితమని
పండితులంతట పలుకుచుండ్రి
తెలగాణ కళలన్ని వెలసె బాధలనుండి
అనుచు కళాకారు లాడుచుండ్రి

తే.గీ. కనగ, తెలగాణమున నుండె కాకతీయ
గుణములని ఎల్లెడల నేడు గొణుగుచుండ్రి
ఎవ్వరేమన్న తెలగాణ అవ్వ నేడు
పాల పిట్టోలె మంచిని పంచిపెట్టె. 7

తే.గీ. ఇది అమరవీరుల త్యాగనిధియె నేడు
చంద్రశేఖరు తాండవ జయఫలమ్ము
సకల జనుల నిర్నిద్రమౌ సమర ఫలము
ఇది తెలంగాణ పండుగ హేల నేడు 8

కం. ఒక యేడాది పండుగ యిది
ఇక ముందుకు సాగ వలయు నెదుగుచు, రైతుల్
సుకములు పొందగ, యువతకు
సకల జనులకును మరెంతొ సంతోషముగాన్ 9

డా. గుడికాడి ఆంజనేయులు

90

# బంగారు తెలంగాణ

నా తెలంగాణ, కోటి రతనాల వీణ
నా తెలంగాణ, ఉవ్వెత్తున ఎగిసిపడ్డ కెరటాల జాణ
ఉద్యమంతో ఊపిరి బిగపట్టి కురిసిన ఓ జడివానా
కోట్లాది ప్రజల, కృషి ఫలంతో వచ్చిన మా ఈ
తెలంగాణ!!
మరిప్పుడు మరింత మాలో చిగురించిన కొంగ్రొత్త
ఆశలు
మేము సాధించే ఆశయాలు
ప్రభుత్వ పథకాలు
పేద ప్రజల కడుపు నిండే ఫలాలు.
మరి, మనవి మనకే చెందుతాయంటే సంతోషమే
అవి ఎలా చేస్తారనేది మాత్రం ఇప్పటికీ ఓ సందేహమే.
ఎందుకా!!
ప్రభుత్వం - ప్రతిపక్షం
నువ్వు అవునంటే నే కాదంటా
నువ్వు కాదంటే నే నవునంటా!
ఇదే మరి రాజకీయం
ఇప్పుడు కూడా ఇలాగే ఉంటే కాదు నయం.

పొరుడు పార్టీనీ పెంచుకోవడం కన్న
నిజాయితీ నిస్వార్థం పెంచుకోవడం మిన్న
మన తెలంగాణ, ఓ బంగారు పూల వాన కావాలంటే,
సింగారాల జలపాతంలా సాగాలంటే
పరాయి పాలనలో, మూతపడ్డ ఫ్యాక్టరీలు తెరవాలి
కార్మికులకు ఉపాధి చూపాలి
మన నదుల నీళ్ళను, మనమే మళ్లించుకోవాలి
మన రైతుల కళ్ళల్లో ఆనందం నిండాలి
తెలంగాణ సాధనకై ఉద్యమమే ఊపిరిగా
పోరాడిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలి
అందరూ చదవాలి
అందరికీ ఉచిత విద్య కావాలి
ఇది కల మాత్రమే కాకుండా ఉండాలంటే
కేసీఆర్ సాకారం చేయాలి.
దానికి మనందరి తోడ్పాటు కూడా ఉండి తీరాలి
అప్పుడే నిజమైన తెలంగాణ
అదే నవ తెలంగాణ
మరదే నిజమైన బంగారు తెలంగాణ.



డా. చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ
భద్రాచలం, ఖమ్మం.
చరవాణి : 8978852385

91

# రేపటి తెలంగాణ

సీ. అవతరించెను నేడు అమర వీరుల త్యాగ
ఘనఫలమై తెలంగాణ తల్లి
వినిపించినది నేడు విజయభేరి ధ్వని
ప్రియ తెలంగాణ దిగ్వీధులందు
వికసించినవి నేడు వీర తెలంగాణ
పౌరలోక దివిజ వారిజములు
వినుతించినవి నేడు విశ్వవిపంచి పై
వర తెలంగాణా కవనగళాలు

తే.గీ. జాలువారె గులాబీల పూలవాన
వీచె స్వేచ్ఛా పవనములు వీధి వీధి
సంతసమ్మున దిశలు వసంతమాడె
కలత తీరె తెలంగాణ కలలు పండె

కం. విడిపోయి కలిసినప్పుడు
కడు ప్రేమలు పొంగి పొరలు గదా! సహజముగన్
విడిపోవనేమి యందరి
యెడదల సడియొకటె గాదె! యెప్పటికైనన్

ఆ.వె. పలుకుబడులు వేరు పలుకుభాష యొకటె
పలుకుతీరు వేరు భావమొకటె
దారులెన్నియున్న చేరుగమ్య మొకటి
శాంతి యొక్కటె ఇరుప్రాంతములకు

సీ. ఆంధ్ర భాగవత కథామృతధారలో
పులకించె పావన పుణ్యధరణి
కాకతి రుద్రమ్మ కరవాల కాంతుల
చైతన్య మార్గదర్శక ధరిత్రి
దొరల నిరంకుశ పరిపాలనమునకు
ఎదురొడ్డి పోరాడె కదనభూమి
కష్టజీవుల పాలి కల్పవృక్షమై
అక్కున జేర్చు సౌహార్ద్ర వసుధ

తే.గీ. వేయికంబాల గుడి వేల్పు వితత మహిత
వేదనాదాలు ఆశీస్సులైదనరగ
అయ్య భద్రాది రామయ్య అండనుండ
చల్లగా తెలంగాణ వర్ధిల్లుగాక !

తే.గీ. జయ జయ జయ తెలంగాణ జనని! నీకు
వందనము లభివందన చందనములు
అమ్మ ! భద్రకాళీ! బతుకమ్మతల్లి !
ఏలుకొనరమ్మ! బిడ్డల నెల్లవేళ !

తే.గీ. కళల కణాచి సంస్కృతీ కల్పకముగ
అభినవ స్వర్గధామమై శుభములలర
నవతెలంగాణమును ప్రేమ నమునయించి
దిద్దుకొనుమా! యువతరమా! దివ్యభవిత

డా. చింతల ప్రవీణ్‌కుమార్
16-10-236, శివనగర్, వరంగల్-506 002
చరవాణి: 9346886143



## 92
# మరణం లేని మట్టి

ఎన్నని చెప్పాలె ఏమని చెప్పాలె
ఒక గాయమైతే మరచిపోవచ్చు
గాయాల మీద గాయాలు
నిలువెల్లా గాయాలే దేహమైన వాణ్ణి

అరవై ఏండ్లుగా గాయపడని రోజంటూ లేదు
గాయపడి గాయపడి పుండు సలిపి సలిపి
కడుపు మసిలి మసిలి గాయం పోరాటమై
పోరాటం ఉద్యమమైన
మూడున్నర కోట్ల జనాల
మూకుమ్మడి అజెండా - తెలంగాణ

ముక్కలైన దేహాలు
ముద్దాడిన బుల్లెట్లు
గాయపడ్డ హృదయాలు
రక్తాశ్రువుల త్యాగధార - తెలంగాణ

ధర్నాలు రాస్తారోకోలు
సాగరహారాలు సకల జనుల సమ్మె
ఒక్కటేమిటీ -
లెక్కలేనన్ని పోరాట రూపాలు
మోదుగుపూల వనాల విస్తృత ప్రజాపోరాటం -
తెలంగాణ

ఒకటా రెండా పెట్టని కేసు లేదు
చేయని కుట్ర లేదు ఎక్కి దిగిన ఠాణా మెట్లపై
యవ్వనమంతా కరిగిపోయింది
బ్రతుకో చావో చావో బ్రతుకో
కండ్లల్ల వత్తులేసుకున్నం
కండ్ల ముందే ఐనోళ్ళను పోగొట్టుకున్నం
ఏదైతేనేం -
అమరవీరుల సాక్షిగా స్వరాష్ట్రం సాధించుకున్నం

అయితే తెలంగాణ అన్న ప్రతిసారీ
ఈ గాలినిండా పరుచుకున్న అమరులే కదా గుర్తొచ్చేది
తెలంగాణ అన్న ప్రతిసారీ
కోల్పోయిన బిడ్డల తల్లుల దుఃఖమే కదా
కండ్లల్ల మెదిలేది

ఇంతకీ ఈనేల విముక్తికి
నెత్తుటి త్యాగాలద్దిన వాళ్ళకు మనమేం ఇవ్వగలం
మండిన దేహాలకింత నవనీతం పూయగలమా
చిందించిన నెత్తుటి భాషకు దుఃఖ భాష్యం
రాయగలమా తలవంచి వాళ్ళ తల్లుల పాదాలపై
మోకరిల్లడం తప్ప

తెలంగాణ చరిత్రంటేనే త్యాగం
త్యాగానికి మారుపేరే తెలంగాణ.

డా. చెమన్
చరవాణి: 9440385563

# 93
## స్వేచ్ఛా ఖడ్గధారి

వాడు కాలానికి కాంతిని నింపి
చరిత్ర నిర్మాణానికి కొత్త ఇటుకల్ని పేరుస్తాడు
పీడనల దుర్దినాల్లోంచి
పిడికిళ్లై మొలకెత్తుతాడు
తరగతి గదినుండి మానవ అసమానతల్ని
లెక్కలు గట్టి తేలుస్తాడు
ఫ్యూడల్ ఆధిపత్యపు వేయికాళ్ళ రక్కసిని మట్టి
కరిపించి
తిరుగుబాటు బావుటాని మానవనొసటి మీద
వెలివాడల వెలిబతుకుల అనావిష్కృత
దుఃఖ పరంపరని ప్రశ్నల శరాఘాతాలుగా
మానవుల గుండెల మీద సంధించిన వాడు

వలసవాద పెత్తనాలపై సైరన్ మ్రోగించి
అస్తిత్వపు అవసరాన్ని నలుదిక్కులా నినదించినవాడు
నిండా ముసురుకున్న చీకట్లోంచి....
ఆధిపత్యపు భావజాలపు ఛీదరింపుల్లోంచి
వాడు... స్వేచ్ఛా ఖడ్గధారియై వెలుతురు కిరణాలను
భుజకిరీటాలుగా ధరించివస్తాడు
వాడు... చదువుతో పాటుగా
ఉద్యమాల ఊపిర్లను నింపుకుంటాడు
బతుకు బతుకుల్ని బడి పాఠాల్లో చదువుతాడు
కళాశాలను జ్ఞాన సముపార్జనా భాండాగారంగానే కాదు
కలల్ని సాఫల్యం చేసే కదన రంగంగా మారుస్తాడు

డా. జనువాడ రామస్వామి
చరవాణి: 9848583693

94

# అంతరంగం

తెలంగాణ బిడ్డలార
దివికేగిన దివ్యులార
ఉద్యమ గీతాలలోన
వెలుగుతున్న ధీరులార
మరణంతో విజయమిచ్చి
ఊపిరులు ధారపోసి
ఉరికొయ్యల ఉయ్యాలల
ఉద్యమాన్ని రంగరించి
అమరులైన వీరులకు
జోహార్... జోహార్.
అంధకారమానాడు
అపరకాంతి ఈనాడు
రైతన్నల వ్యథల బాపి
నడిపించిన ముఖ్యమంత్రి
రైతులకు రుణమాఫీ
రాబడి అయ్యింది నేడు
సంకల్ప బలమున్నది
సత్యము మనవెంటున్నది
నీతి నిజాయితీలు
చక్రాలై తిరుగుతుంటె
ప్రగతిరథం ఆగకుండ
పరుగులు పెడుతున్నది
ఆసరా పించన్లు ఇచ్చి ఆదుకొన్న ఘనాపాటి
రమ్యమైన రహదారులు పరచె తెలంగాణలోన
మిషన్ కాకతీయతో
చెరువులు పులకించిపోయె
జాతిరుణం తీర్చుకొన్న
తెలంగాణ జాతిపిత
కల్వకుంట్ల కనులపంట
బంగారు తెలంగాణ నేడు
కన్న కలల సాకారము
మిన్నంటెను నేడు చూడ
ఆరుపదుల పరిపాలన
ఆగమాగమా వ్యవస్థ
ఎక్కడ వేసిన గొంగళి
అక్కడనే యున్నది
అవినీతి అక్రమాలు
అడుగంటెను ఏడాదిలో
ప్రజల మనిషి మన సిఎం
పరిపాలన దక్షతతో
సమసమాజ నిర్మాణం
సానుకూలమయ్యె నేడు
బంగరు తెలంగాణలోన
బ్రతుకుట మన అదృష్టం
జై తెలంగాణ జైజై తెలంగాణ.





డా. జి. నరేందర్ రెడ్డి
3-2-502, చప్పల్‌రోడ్, కాచిగూడ-500 027
చరవాణి: 9849625592

95

# తెలంగాణ తల్లి చిగురించిన ఆశ

అమ్మా తెలంగాణ తల్లి పరాయి పాలనలో
ఒక్కరు కూడా నీ దగ్గర లేరని
బాధపడ్డావా తల్లీ
అయినా నిన్ను రక్షించలేనని నేను
ఎప్పుడో ఆశలన్ని వమ్ము చేసుకున్నానమ్మా
ఈ ఆరు దశాబ్దాల
వలసవాదుల బలవంతుల ఉన్మాదములో
నీ గడియలు ఆఖరుకు చేరుకున్నవని
మాకు బాగా అర్థమైందమ్మా
నీకు తెలుసుకదా అమ్మా
మన నేలలన్ని ఫిరంగి తుమ్మలతో
నిండినాయి గదమ్మా
నేను ఎన్ని రోజులు వెతికినా ఒక్క
పువ్వైనా చూడనే లేదమ్మా
అయినా నా తల్లికోసం
మహానదులైన కృష్ణమ్మ, తుంగభద్ర, గోదావరి
ఇంకా ఎన్నో నదీ హారాలు నీ మెడ చుట్టూ ఉన్నాయి
గదమ్మా
కనీసం ఒక మోపు వరి గడ్డైనా
దొరుకుతుందని ఆశపడ్డానమ్మా
ఊరూరా తిరుగుతున్నానమ్మా
నీకు తెలుసు అదైన దొరకదని
పోనీలే భూసురుడి సలహా మేరకు
కనీసం ఆవు పాలైనా నా తల్లి
నోట్లో పోద్దామని
వాడవాడ వెతుకుతున్నానమ్మా
ఈ ఫిరంగి తుమ్మలతో బీటలు వారిన నేలలో
ఆవులెక్కడున్నాయమ్మా
ఎన్నడూ ఒళ్ళు కనబడకుండా
ఛిద్రము రంధ్రము లేని
చీరైన తొడగని నీ శరీరానికి
ఒక కొత్త చీరకై దుకాణానికి పరిగెడుతున్నానమ్మా
అయినా నీకు తెలుసు కదా తల్లి
నాకు ఆ తాహతు లేదని
నీ శత్రువుతో జరిగిన యుద్ధంలో తెలంగాణ
యుద్ధవీరులు
గెలిచారని నాకు తెలిసి ఆనందంతో
కన్నీళ్ళ పర్యంతమై ఉచ్ఛ్వాస నిశ్వాసలతో
నీకు ఈ వార్త చెప్పుదామని
వస్తున్నానమ్మా
నా ఆశ!
ఆ శరీరవాణి ద్వార ఈ విజయ వార్త విన్నావా
నీ ప్రాణము పుంజుకుంటుందేమోనని
ఆశపడుతున్నానమ్మా



వలసవాదులైన నరహంతకులను తరిమాం
మాతృభూమిని రక్షించుకున్నాం
స్వతంత్ర పోరాటం ముగిసింది
అయినా వలసవాదులు
తెలంగాణను మరుభూమిగా యుద్ధభూమిగా
మార్చిన వైనం భయంకర స్వప్నం
సస్యశ్యామలానికి నడుం కట్టాం
ఇక హరిత విప్లవం మొదలుపెట్టి
పచ్చని పంటలతో కళకళలాడిస్తాం
నీ ఒంటిపై మచ్చలేని పట్టు చీర కట్టిస్తాం
నీ మెడపై గుబాళించే పుష్పమాలను అలంకరిస్తాం
నిజంగా మాయమైన నీ కోహినూరు వజ్రాన్ని
జాకబు రత్నాన్ని తిరిగి నీ వంటి మీద పేరుస్తాం
దీనికోసం మా తెలంగాణ తమ్ముళ్ళలో
అవినీతి లేకుండ చేసి
అహర్నిశలు కష్టపడి
మన చుట్టూ పెనవేసుకున్న
కృష్ణా గోదావరి తుంగభద్రల సాక్షిగా
బంగారు తెలంగాణ చేస్తామని
కనిపించని దేవుళ్ళ ఆశీస్సులుంటాయని నమ్ముతూ
ఓ తెలంగాణ తల్లీ
నీవు మా తల్లివైనందుకు గర్విస్తూ
యుగయుగాలకు నీవు మా తల్లివే అని ఆనందిస్తూ
నరహంతకులైన వలసవాదుల
ఆరు దశాబ్దాల అకృత్యాలకు
చరమగీతం పాడుతూ
నీ రుణం తీర్చుకుంటామని
ప్రతిజ్ఞ చేస్తున్నాం తల్లీ
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!



**డా. జె. బాపురెడ్డి,**డి.ఎల్.ఐ.టిటి., ఐఎస్ (రిటైర్డ్)
'రామచిలుక' ప్లాట్ నెం.10, రోడ్ నెం.5, జూబ్లిహిల్స్, హైద్రాబాద్-33.
చరవాణి : 9949465964.
ఇ-మెయిల్: bapureddy1936@gmail.com

96

# తెలంగాణ రాష్ట్రపిత

తెలంగాణ ప్రజాకోట్ల
కలల పంట నీవు
భరతమాత గర్వించే
చరితాత్ముడ వీవు !
జయహో జయహో జయహో
విజయచంద్రశేఖరా
విప్లవ ప్రభాకరా !

కారణజన్ముడవు నీవు కాలాతీతుడవు!
ఇరువది ఒకటవ శతాబ్ది ఎత్తిన పిడికిలివి
సత్య, శాంతి, ధర్మన్యాయ
సమరాంగణ యోధా!
'ప్రారంభించరునీచ మానవులు
విఘ్నాయాస సంత్రస్తులై
ప్రారంభించి పరిత్యజింతురు
విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నివాస్యమానులగుచున్
ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగించకు సుమీ
ప్రజ్ఞానిధుల్ గావునన్' అంటున్న
హృద్యమైన ఈ పద్యంలోని
ధీరునికి ప్రతిరూపమైనావు
విఘ్నాలను వెలవేసిన
ప్రజ్ఞాశాలివి నీవు!
ఉపజ్ఞాశాలివి నీవు
ఆమరణ నిరాహార దీక్ష సాక్షిగా
చేసిన ప్రతిజ్ఞా పాలకుడవు నీవు!
మాయమర్మాల కుటిల వ్యూహాలకు
బలియైన ఆత్మత్యాగయోగుల
అమరత్వపు అమృతత్వం
నీ కలల కలువ కొలనై వికసిస్తుంది !

అపూర్వ సకల జనుల సమ్మెశాస్త్రం
సంధించిన సవ్యసాచివి నీవు
విద్యార్థిలోకం నీ వెంట నడిచి వెన్ను తట్టింది
పల్లె పట్టణాల ఉద్యమవాణి
నీకు జై కొట్టింది వలస పాలన విముక్తి నీకు
అభినందన హారతి పట్టింది
అంబేద్కర్ రూపొందించిన నీ వాదనను
ఆమోదించింది
ముగురమ్మల మెప్పించిన దేశభక్తి నీది
తెలంగాణ  రాష్ట్రపితగా
గుర్తిస్తుంది నిన్ను భవిత
అందుకే...
అంకితం నీకు ఈ చిరు కవిత

డా. టి. గౌరీశంకర్
1-1-217, వివేకనగర్, చిక్కడపల్లి, హైదరబాద్-20.
చరవాణి: 9440969130
ఇ-మెయిల్: tg_shanker@yahoo.co.in

97

## బోన్సాయి పాపాయి

తొలిపొద్దు పొడిచింది!
ఏడాది గడిచింది
ఎంతగా ఎదిగింది నా బిడ్డ!
వీర తెలంగాణ పోతుగడ్డ!!
ఉగ్గు పాలే తాగి
ఉయ్యాలలే ఊగి
అంబాడుకుంటునె
లేచి అడుగేసింది!
తొలి తొలి అడుగులె
బలమైన నడకలై
ప్రగతి రథంపైన
పరుగులే తీసింది!!
గోలకొండ పైన
జెండా ఎగురేసింది!
ట్యాంక్‌బండ్ మీద
బతుకమ్మై పూసింది!!
పేదోళ్ళ కన్నీళ్ళు
ప్రేమతో తుడిచింది!
గోడు విని గోముగా
గూడు నిస్తానంది!!
గోస బతుకు వారికి
ఆసరగ నిలిచింది!
కల్యాణ లక్ష్మినె
ఎలుగెత్తి పిలిచింది!!
కరెంట్ కోతల్లేక
విద్యుత్తునిస్తుంది!
ఇంటింటికి మంచి
నీళ్ళ నల్లాలు తెస్తుంది!!
రైతులకు రుణాల
మాఫీలు చేస్తుంది!
చెరువులె తవ్వి నీటి
ఎద్దడి తీరుస్తుంది!!
ప్రపంచ దేశాలనే
తనకాడ రప్పించుకొంటుంది!
విశ్వనగరమై ఇల
విరాజిల్లుతానంటుంది!!
తంగేడు పూలతో
తడిసి మురిసింది!
పాలపిట్టల కూతకు
నాట్యమే చేసింది!!



డా. టీవీ భాస్కరాచార్య
5-5-55, 87, అభ్యుదయనగర్, విష్ణు 70 ఎంఎం ప్రక్కన,
ఎల్‌బినగర్, హైదరాబాద్-74.
చరవాణి: 9394513044

98

# మంచిరోజులు వచ్చాయమ్మా

సా. భగవతీ భారతీ భవతి భిక్షాం దేహి! దేహి అంటూ వచ్చానమ్మా...
మాతా! తాయి మాయీ, మా! మదర్... నా బంగారుతల్లి!
ప. మంచి రోజులు వచ్చాయమ్మా ఓయమ్మా!
మనిషి మనిషికి మధ్య అడ్డుగోడ లొద్దోయమ్మా ॥ప॥
అందుకే!
అప. ఉలిసేత బట్టుకొని ఊర్లు తిరుగుతున్న నమ్మా
అమ్మా మనిషి బొమ్మ చెక్కాలనీ..
ఎక్కడే... ఎక్కడే! ఆ మనిషి బొమ్మ
బలిదానాలతో నిలచెనమ్మా!
ఇక్కడ అక్కడ ఎక్కడా? వాడుంటే పట్టుకొంటే అట్టే చిక్కడా
అస్సలు ఉన్నాడా లేడా అంటే పైకి కానరాడా! మం॥ అప॥ ఉలి
వెలుగులున్న సోట... ధర్మమున్నసోట... న్యాయమున్నాసోట
సప్పుడు లేని సోట సల్ల గుంటాడనీ
మనిషిలో దేవుడై దాగి ఉంటాడనీ...
వెల్గులో వెన్నెలై వెలిగేటి సినుకులై... కాల్చేటి మెరుపులై
ఊరేగుతుంటాడనీ నాన్న సెప్పగ విన్ననమ్మా
చీకటినే కాల్చేసి తేనెల్లో! తేనె వెన్నెల్లో! సెమట సుక్కల్లో...అల్లనేరల్లో!
తారాడు తుంటాడని... మన బాపూ సెప్పగ విన్ననమ్మా... గాంధీతాత సెప్పగ విన్నానమ్మా
బడిలోనా... గుడిలోనా... అమ్మనీఒడిలోనా... ॥ఎక్క॥ మం॥ అప॥ ఉలి
పాట గాడినైనే వచ్చా!...మనిషి(పాటనే) పాడాలని వచ్చా
గీత...గాడినైనే వచ్చా!...మనిషి బొమ్మనే గీయాలని వచ్చా
రాతగాడినై పాటనే రాయల ప్రాణదాతనై ప్రాణమే పోయాల!
సేత గాడినై భూమి నిట్టే దున్ని... భువికి దింపేసీ-అట్టే ప్రేమనే నింపేసీ

బుక్కెడన్నం బెట్టి ఉక్కు పిండం జేసి
ఇయ్యాలో...ఇయ్యాల మానవత్వం పంచి ఇయ్యాల
ఈ లాగే సాగాలి ఉత్సాహంగా ఊగాలి తూగాలి మాయమ్మా!
ఓ! చుక్కల్లార...అష్ట దిక్కుల్లార...పంచభూతాల్లార...
...విశ్వశిల్పుల్లార! మీరైన చెప్పరండి! రండి!!
...మనిషి బొమ్మ చెక్కాలనీ... మం॥ అప॥ ఉలి

నేను చెక్కిన బొమ్మ నాకు దక్కని దాయెనమ్మా
ఓ జక్కన్న రామన్న పోతన్న వేమన్న పోతులూరి వీరబ్రహ్మన్న
అక్కన్న మాదన్న రైతన్న కూలన్న కాళన్న జయశంకరన్న
అన్న మీరైన చెప్పరన్న... అరే! అది యేటి "రూపాయె" రన్నా ఇది "పాపాల" పాపాయె రన్నా
అన్న మనిషంటే ఇంతేనా అన్న రియాల్స్ డాలరు! యూరోలు!
ఫ్రాంకులా! షిల్లింగ్! యాచింగ్‌లా అన్న మీరైన చెప్పరన్నా
ముక్కునే దట్టించి గాలినే బంధించి సందు సందున చందమామై చూశా
పిచ్చి వేషాలెన్నో వేసుకొచ్చా దేశదేశాలెన్నో తిరిగొచ్చా మం॥ అప॥ ఉలి

ఉన్నట్టి ఉండి లేనట్టే లేదాయె మనిషి జాడే దొరకడాయె నమ్మా
ఉలిని చేతబట్టి ఈ రాతిలో వ్యర్థాల తొలగించి చూస్తేనే అమ్మా
అట్టే అగుపించునే తల్లి ఆ మనిషి బొమ్మ
ఆ (అట్టి) బొమ్మ నేనే నమ్మ ఆ శిల్పి నీ వమ్మ
నాలోని వ్యర్థాల తొలగించవే తల్లి!
నాలోని వ్యర్థాల తొలగించవే తల్లి!

డా. తక్కెళ్ళ బాలరాజు

# 99

## భళారే !

ప. మన తెలంగాణ తల్లికి చెంగల్వ పూదండ
మమ్ముగన్న అమ్మకు కర్పూర హారతులు
మనసులోన తేనెలు చూపులోన ప్రేమలు
కిల్లకిల్ల నవ్వులతో కనకంబు కురిపించు.... ॥మన॥

1. ప్రాణహిత పెనుగంగా, మూసి, మున్నేరు నదులు
కిన్నెరసాని, మంజీరా, కృష్ణ, గోదావరి జీవనదులు
మన యింట పారంగ పాడి పంటలకు
కొదవేమిటన్నా
పశు ఫల సంపదలకు కరువెక్కడి దక్కా.... ॥మన॥

2. వేయిస్తంబాల గుడి రామప్ప ఓరుగల్లు కోట
చార్‌మీనార్ మక్కామసీదు గోల్కొండ ఖిలా
మన సంస్కృతి వైభవాలు పరిమళిస్తుంటేను
మన భాష మన తెల్గు ప్రపంచాన వెల్గుతుంటేను
॥మన॥

3. కాకతీయ కాలం శిల్పకళా శోభితాలు
జానపదుల జానళీలు రంజింపు స్వరాలు
పోతన్న భాగవతం రసరమ్య భావాలు
కాలన్న 'నా గొడవ' అభ్యుదయ కవనాలు
సత్యమై సకలమై సర్వధా నిలిచి ఉండేదాక...
॥మన॥

4. రుద్రమదేవి భుజశక్తి రేచర్ల రుద్రయ్య దేశభక్తి
యుగేంధరుని దీయుక్తి ప్రతాపరుద్రుని కీర్తి
మన భావిపౌరులు భళరే భళ యనుదాక
తెలంగాణ గానమే పాడుదాం, తెలంగాణ గాథలే
చెప్పుదాం
జై తెలంగాణ... జైజై తెలంగాణ ॥మన॥

డా. తాడూరి వెంకట నర్సయ్య

## 100

# అందరి తెలంగాణ కావాలి

వెన్నుపోట్లను ఎదురొడ్డి
ఆరు దశాబ్దాల
తెలంగాణ ఆకాంక్షకు
వెనుదిరుగని
ఉద్యమాలతో నెరవేర్చుకున్నాం..
మన రాష్ట్రమనే
మధుర భావనను నిజం చేసుకున్నాం...
ఇక తొలగాల్సిన
కష్టాలెన్నో ఉన్నాయి
సాధించాల్సిన లక్ష్యాలు
మనముందున్నాయి
నీటి వ్యథలలో రైతన్నల
కన్నీటి గాథలు...
నిధుల వివక్షతతో
అడుగడుగునా వెనకబాటు
నియామకాల్లో అన్యాయం
నిన్నటి చరితగానే మిగలాలి..
అన్నింటా ముందడుగు
మన కర్తవ్యం కావాలి
అభివృద్ధి పథం - మన
నిఘంటువులో మొదటిదవ్వాలి
మనం నిర్మించే నవ తెలంగాణ
అందరి సొంతం కావాలి
ప్రగతికి పందిరవ్వాలి.



డా. తూర్పు మల్లారెడ్డి
శ్రీ లక్ష్మి నర్సింహస్వామి కళాశాల,
భువనగిరి (పోస్ట్) నల్గొండ జిల్లా.
చరవాణి: 9849192154

101

## వి'జయ' శిఖరం

సత్సంకల్పానికి సైద్ధాంతిక జ్ఞానం తోడైనప్పుడు
కుట్రలు కుతంత్రాలు తోకముడుచుకుపోయాయి
నీళ్ళు, నిధులు, నియామకాలు
వనరులు వసతులు దోపిడీకి గురైనప్పుడు
జయశంకర్ సార్! జయశంకర్ సార్!
నువ్వొక వ్యాసానివై, ఉపన్యాసానివై, చర్చవై
తల్లడిల్లే తెలంగాణ తల్లి విముక్తికి
మార్గాన్ని చూపిన మేధోపాతానివి
రాష్ట్ర ఆవశ్యకతను
ఆధారాలతో సహా చూపిన జ్ఞానదీప స్తంభానివి
దశాబ్దాల తరబడి అణచివేతను మోస్తూమోస్తూ
అలుపెరుగక ప్రవహించిన పోరాట సంద్రానివి
ఆత్మగౌరవ దిక్సూచివి
మన నాయకులను యాచకుల్లా కాదు
శాసకుల్లా జీవించమని
స్వయం పాలన తొవ్వజూపిన ఆచార్యుడివి
భాష భావ వ్యక్తీకరణమని
హేళనకూ వివక్షకూ విస్మృతికీ గురైన
తెలంగాణ భాషామాధుర్యాన్ని చాటిన శాస్త్రవేత్తవి
అరవై ఏండ్ల ఆకాంక్షవి
నాలుగున్నర కోట్ల స్వేచ్ఛాకేతనానివి
నీ మరణం ఉద్యమానికి ఊపిరై
అమరత్వాన్ని పొందింది
ఇది నీ స్వప్నం సాకారమైన తొలి వసంతం
స్మరణీయం నీ పోరాట పార్శ్వాలు సమస్తం
ఆచరణీయం నీ ఆలోచనలు
నవ తెలంగాణ నిర్మాణానికి అనునిత్యం.



డా. తిరునగరి
6-17/5, డి నగర్, చింతల్ (హెచ్ఎంటి),
హైదరాబాద్-500 054 చరవాణి: 9392465475

# 102

# తంగేడు పువ్వంటే

నా తెలంగాణా సంస్కృతి ప్రతీకలు
ఈ తంగేడుపూలు
నా తెలంగాణ తల్లికి ప్రీతిపాత్రలు
ఈ తంగేడుపూలు
నా బతుకమ్మల వైభోగాలు
ఈ తంగేడు పూలు
నా తెలంగాణా ప్రకృతి శోభలు
ఈ తండేడు పూలు
నా పల్లెలకు వన్నెలు
ఈ తంగేడు పూలు
నా పల్లె పడుచుల సొగసులు
ఈ తంగేడు పూలు
ఈ నేలలో ఎక్కడ చూచినా
విరిసినవ్వే తంగేడుపూలు
ఈ తెలంగాణ స్వచ్ఛ హృదయాలకు సంకేతాలు
పసుపు రంగు
ప్రపంచ కళ్యాణానికి సంకేతం
పసుపు రంగు
ప్రజాజీవన సౌభాగ్యం
పసుపు రంగు
పరిపూర్ణతకు చిహ్నం
పవిత్రతకు మూలం
తెలంగాణ ప్రజలకు
భలే ఇష్టం తంగేడుపూలు
పసుపుపచ్చని తంగేళ్ళపై ఎన్ని
పాటలు పాడుతారో నా జానపద మహిళలు
పసుపుపచ్చని తంగేళ్ళపై ఎన్ని
పద్యాలు రాస్తారో నా పల్లెటూళ్ళ కవులు
తంగేడు పువ్వు
నా తెలంగాణ రీతి
తంగేడు పువ్వు
నా తెలంగాణ గీతి
తంగేడు పువ్వు
నా తెలంగాణ అస్తిత్వం
తంగేడు పువ్వు
నా తెలంగాణ విలాసం
తంగేడుపువ్వులోనా సంప్రదాయం
తంగేడు పువ్వులో నా సంస్కారం
నా తెలంగాణ
నా తెలంగాణ అంటే
తంగేడు పువ్వు





**డా. తిరుమల శ్రీనివాసాచార్య**
ఎ40-201, సింగపూర్ (సంస్కృతి) టౌన్‌షిప్,
ఘట్‌కేసర్, హైదరాబాద్-88
చరవాణి: 9949365903

# 103

## ఓ తంగెడుపువ్వా!

శ్రీ లక్ష్మియె నవ్వినట్లు ఎవరవమ్మ! నువ్వు
బంగారం పూచినట్లు మేను కళలు రువ్వు
ఏ పువ్వుకు లేదింతటి సింగారం నిగ్గు
అయితే నీ వెవరొ కాదు నువు 'తంగెడుపువ్వు'

ఓ బంగరు పూబోణి!
పల్లెలన్ని నీ వాణి
నిన్ను ముడిచికొని నవ్వు
వన్నెలాడి అలివేణి

పల్లెలోని పూలల్లో జాణవు నీవు
పల్లెలోని ప్రతిలతాంగి గానమునీవు
తంగెడుపువ్వా! నీ తనువే బంగారు
అందుకొఱకె బతుకమ్మకు ప్రాణము నీవు

చెట్లల్లో రావి చెట్టు గొప్పది
గిరులల్లో మేరుశిఖరం గొప్పది
ఓ తంగెడుపువ్వా! నీ ఉనికే
బతుకమ్మల పూలల్లో గొప్పది

నీ వద్దకు కీటకాలు రావంట
పురుగుబూచికీ వంటే దిగులంట
పిడుగు కూడ నిన్ను జూచి ఆగునట!
ఆ లక్ష్మికి నీ వంటే ప్రేమంట

'గోశ్రేణీ! అని నిన్నే పిలుస్తారు
'తలపోటం' పేర నిన్ను తలుస్తారు
బంగారం తపం చేసి పూలల్లో
తంగేడై పుట్టిందని కొలుస్తారు

నిన్నుగాంచి పొంగిపోవు బతుకమ్మ
నీ బతుకే బంగారపు బతుకమ్మ!
తెలంగాణ రాష్ట్ర పుష్పమువు నీవు
విడివిడి గుండియల గలిపి అతుకమ్మ!

మా 'గులాబి శశిశేఖర్' నిన్ను మఱవ లేదు
నీ బంగరు రూపురేక ఎపుడు మఱపురాదు
బతుకమ్మల పండుగులో నీ పాత్రయెగొప్ప
తెలంగాణ జనస్వరం నిన్ను మఱచిపోవు

నిన్ను జూచినంతలోనె కనులు సంతసించు
నిన్ను తలచినంతటనే మనసు పులకరించు
నిన్ను గూర్చి కవిత వ్రాయకలం పట్టుకుంటె
తంగెడు పువ్వా! సువర్ణ ధారను కురిపించు

**డా. తండు కృష్ణ కౌండిన్య**
దేవరకొండ, నల్లగొండ.

104

# పరమార్థం

ఎందరో అమరుల త్యాగఫలం
కోట్లాది ప్రజల కలల సాకారం
ఆశనిరాశల ఊగిసలాటల నుండి
అవహేళనలు, ఎత్తిపొడుపుల చక్రబంధాల నుండి
అలముకున్న నిరాశానిశీధిని చీల్చుకుంటూ వచ్చే
ఆశారుణ రవికిరణం నా తెలంగాణ
ఇల్లలుకగానే పండుగకాదు కదా?
రాష్ట్ర సాధనతోనే బాధ్యత తీరదు కదా?
మన బొట్టు, మనబోనం, మన తెలంగాణ
అంటూ కూర్చుంటే సరిపోదు కదా?
కన్న పేగులను ఉద్యమవీణకు తంత్రులుగా చేసి
తెలంగాణ ఉద్యమ నినాదాన్ని దశదిశలా వ్యాపింపజేసి
తీరని దుఃఖంతో రగిలే తల్లుల చేరదీద్దాం
వారి కళ్ళల్లో ఆనందాల కాంతుల్ని నింపేద్దాం
ఎండిన ఆశల బతుకులతో దినదినం గండంగా
గడుపుతూ
దేశానికి అన్నం పెట్టే రైతన్నలు
అప్పులవూబిలో కూరుకుపోయి
కష్టాల కడలిలో శవాలై తేలుతుంటే
ఎలా సాధ్యం బంగారు తెలంగాణ?
పత్తి మందును పాయసంలా తాగే అన్నదాతకు
భరోసా సంజీవినందిద్దాం
గ్రామదేవతలకు బోనమెత్తడమే కాదు
పల్లె సీమల్లో కునారిల్లుతున్న కులవృత్తులనుద్ధరించి
వృత్తి పనివారల నోటికి పట్టెడు అన్నాన్ని అందిద్దాం
నిరాశల సుడిగుండంలో చిక్కుకుపోయిన నిరుద్యోగ
యువతకు
ఉపాధి జీవిగంజితో ఆశలవూపిరులనూద్దాం
మన నీళ్ళు, మన కొలువులు, మన నిధులు అన్నీ మనకే
అవి కాకూడదు ఏ ఒక్క వర్గానికి
ప్రతి ఒక్కరు కొంచెం స్వార్థాన్ని వీడి కృషి చేసినపుడే
తెలంగాణ రాష్ట్ర ఫలాలు అందరికీ అందుతాయి
అప్పుడే సాధించిన రాష్ట్రానికి అర్థం పరమార్థం



డా. దామెర రాములు
నిర్మల్ నర్సింగ్ హోం, నిర్మల్-504 106
ఆదిలాబాద్. చరవాణి: 9866422494
ఇ-మెయిల్: haleemshams@gmail.com

105

# తెలంగాణలో కాశ్మీరయానం

సోన్ గంగ (గోదావరి) పెన్ గంగల మధ్య
తెలంగాణ రాష్ట్ర శిఖరాయమానమైన
పది జిల్లాల్లో అకారాక్షరం నాంది
ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి
తెలంగాణ కాశ్మీరానికి
నిర్మల్ నుంచి నేరేడుగొండల మీదుగా
మా బస్సు ప్రయాణం...

ఇనుడు పశ్చిమాద్రి నుండి గ్రుంకుతున్నాడు
బొట్టు బొట్టుగా కురిసే వాన చినుకులు
దడి గట్టినట్టుగా దట్టమైనవి
గాలి వాన బీభత్సమైంది
గుట్టల చుట్టు కమ్మిన మబ్బుల్తో
పెను చీకటి కప్పేస్తున్నది
జడి వానలా మాలో
ఆలోచన మొదలైంది
అన్నూ, మిన్నూ ఏకమై
జలధార కుంతలమైంది.

జల్ జంగల్ జమీన్ అని
శతాబ్దాలుగా గొంతుకలు బొంగురు పోంగా
పిట్టల్లా అరచి గీపెట్టి పులుల్లా గాండ్రించి
పొగిలి పగులంగా నినాదం విరమించని
ఆయుధం దించని

చారిత్రక భీం వారసత్వం ఆదివాసుల బాధలు గాథలు
సహ్యాద్రి పర్వత కనుమల్లో ప్రతిధ్వనించగా
మా మనః సీమల్లో సుళ్ళు తిరిగినవి

గ్రీష్మంలో భగ్గుమనే ఎండ దెబ్బల్తో
వడగాల్పుల ధాటికి నేలరాలిన టేకుటాకుల స్థానే
ముసిముసి నవ్వులు రువ్వుతున్నట్లు
లేచిగుళ్ళు కుచ్చిళ్ళని సవరించుకుంటున్నాయి
ముళ్ళపొదలు తంగేడు పూల చెట్లు
గరికపచ్చ దుక్కులు
పచ్చ పచ్చాటి చీర ధరించినట్టున్నాయి
ప్రకృతి రమణీయంగా సోయగాలు పోతుంది
రామచిలుకలు నెమళ్ళూ
కువ కువ లాడే గండు కోయిలలు
కిచకిచారావాలు చేసే బుర్క పిట్టలు సందడి చేస్తున్నవి
కుంతల జలపాతంలో దభేలుమని
దునికేటందుకు కాలు దువ్వాయా అన్నట్టుగా
పరుగులు తీస్తున్నవి వాగులు వంకలు
చెరువు గట్ల మీద కొంగలు
చెట్ల కొమ్మల్లో కోతులు కొండెంగలు
నిర్భయ దృక్కులు సారిస్తున్నవి మాకేసి...
పుట్టల్లోంచి కుబుసాలు విడిచిన
నల్ల నల్లాటి నాగుబాములు

వాడి వాడి కోరల్ని రెడీగా దాచుకుని
బుస్ బుస్ మంటూ మెలిదిరిగే తాడుల్లా పాకుతున్నయి
హైవే మీద అక్కడక్కడా...
తెలంగాణ ఊటి అనదగిన
బొంతల(బోథ్) గుట్టలు ఎడమవైపు
నార్నూర్ కెరమెరి కొండలు లోయలు కుడివైపూ
వేలవేల ఎకరాల్లో మంచు ముసుగులు ధరించి
ఏపుగా పెరుగుతున్న పత్తిచేలు
మాకంటి రెటీనా మీద చిత్రం చేస్తున్నవి...

నమ్మితే ప్రాణమిచ్చే గోండు కోలాంలు తుడుం మోగిస్తే
ఏప్రిల్ 20 ఇంద్రవెల్లి రగల్ అంటే
ఏలికలు ఇప్పటికే జడుసుకుంటారు
గాఢ నిద్ర నుంచి ఉలిక్కిపడకపోతే
కేస్లాపూర్ నాగోబా మీద ఒట్టు...

జోడేఘాట్ ఇంద్రవెల్లి
రోమాంచిత పోరు స్మృతిపరంపర
రగల్ గతం నెమరేసుకుంటూ
వేడి వేడి నిట్టూర్పులు విడిచినాము
పత్తి పూల దుఃఖాన్ని భారంగా
దిగమింగుకునే కృషీవలులు
మా బస్సు కిటికీలోంచి దృశ్యమానం అవుతుండగా
మేం పట్టణ శివార్లలో ప్రవేశించినం....

బంద్‌లు రాస్తారోకోలు
ఉధృతమై ఉప్పెన రూపం సంతరించుకున్నవి
విద్యార్థి, ఉద్యోగ ర్యాలీలు
తుదకంటా తాడోపేడో తేల్చుకున్నాయి
సమర సంసిద్ధులౌతున్న ప్రజానీకంలో
మేం కలకలసిపోయినం
స్వరాష్ట్రం సాధించుకున్నాం
నవ తెలంగాణ రాష్ట్ర శిశుకందుని
స్పృశిస్తూ శ్వాసిస్తున్నాం...
బంగారు తెలంగాణ ఆకాంక్షల పొత్తిళ్ళలో
నేటి ఏడాది వయస్సు అందుకుంది
సుదూర నక్షత్రాల కాంతి సమీపిస్తున్నట్టుగా ఉంది

అరుణారుణ ఆశయాల్ని ఫలించనున్న ఆశల్ని
పదిలపరుచుకుంటూ.... పదును చేసుకుంటూ....

ఇంకా చేయాల్సిన యుద్ధం మిగిలే ఉంది...
అంతా అయిపోయిందనీ ఆనందోత్సాహాల్తో
జరుపుకునే సభలు సమావేశాలు
ములాకత్‌లు దావత్‌లకు కొద్దిగా
విరామమివ్వండి! జర్ర ఆగండి! ఉద్వేగపడకండి!!
మరొక్కసారి ఆలోచనలకు పదును పెట్టండి
భౌగోళిక తెలంగాణ ఒక్కటే లక్ష్యం కానేరదు
ఎన్నో చిక్కుముళ్ళున్నాయి అపరిష్కృతంగా
విప్పాల్సిన పీటముళ్ళు పెండింగ్‌లో ఉన్నాయి

గడీలముందు చెప్పులు నెత్తిన బెట్టుకొని
తలవంచుకుని నేల చూపుల్తో
బిరబిరా తడబడుతూ సాగే నెత్తులు
ఇప్పుడిప్పుడే నిట్టాడులా నిలబడుతున్నాయి
ఇంకిన పౌరుషాన్ని కలల్ని రగిలిస్తున్నాయి
ఎంత అల్లిబిల్లిగా అడ్డగోలుగా
ధాతు ఫిర్యాదు లేకుండా తొక్కివేతలకు
కుక్కివేతలకు మానావమానాలకు గురైన
సబ్బండ వర్ణాలు పీల్చి పిప్పి జేయబడిన వర్గాలు
ఇప్పుడిప్పుడే నిర్ద్వంద్వంగా
యుద్ధం యొక్క ఒక్కపార్శ్వం గెలిచినందుకు
కాస్తా! ఊరట కొంచెం నిబ్బరం నిర్భీతితో
పునశ్చరణ తరగతులకు ఆత్మ విమర్శలకు
ఎలాంటి అరమరికల్లేకుండా అవకాశమిస్తున్నయి
అవధుల్లేని అనంత ఆందోళనలకు
ఇంకా పూర్తి చేయాల్సిన
అసలు గెలవాల్సిన యుద్ధం కోసం ఇపుడే
సిద్ధమౌతున్నయి
ఎన్నో తరాలు కొన్ని అక్షరం ముక్కలకు
ఇన్ని అన్నం మెతుకులకు దిక్కులేనితనం నుంచి
ధిక్కరించే స్థాయికి ఎదిగి ఎదురొడ్డుతున్నయి.

అంతా ముగిసిందని అథియారలు దించొద్దు
ఇంకా చేయాల్సిన యుద్ధం కళ్ళముందుంది
బీ రెడీ!!



**డా. దేవరాజు మహారాజు**
జి-1, ఆస్థా హైట్స్, అపర్ణా సరోవర్ ఎదురుగా,
హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటి, నల్లగండ్ల, గోపనపల్లి రోడ్
హైదరాబాదు-500 046 చరవాణి: 9908633949
ఇ-మెయిల్: devaraju.maharaju@gmail.com

106

# క్షణాల వెంట దిగంతాలకు

క్షణాన్ని మరోక్షణం
నిమిషాన్ని మరో నిమిషం ఉగాదిని మరో ఉగాది
వెతుక్కుంటూ వెళ్ళిపోతున్నాయి
క్షణాల్లో అలా యుగాదులే గడిచిపొయ్యాయి
రోడ్డుమీద బస్సు వెంట బస్సులా
రేడియోలో పాట వెంట పాటలా
అంగట్లో మనిషి వెంట మనిషిలా
ప్రకృతిలో రుతువు రుతువులా
చిరత్రలో నాగరికత వెంట నాగరికతలా...
వెతుక్కోవడమే జీవితమయితే
వెళ్ళిపోవడమే నిష్క్రమణం!
నిష్క్రమణం తాత్కాలికమా శ్వాశ్వతమా
పరుగులు తీసే క్షణాలు చెపుతాయి
క్షణాల మధ్య ఊపిర్లూది అందంగా ఎగరేసిన
జీవితపు బెలూన్‌లు చెపుతాయి
జీవితం క్షణభంగురం అన్నారు మనవాళ్ళు
అది రెండు క్షణాల మధ్యో
కోట్ల కోట్ల క్షణాల మధ్యో తెలియదు
బతుకు తీపికి, భయానికి ఉన్న
అవినాభావ సంబధమే గుండె కొట్టుకోవడం
లబ్‌డబ్ జననం మరణం, లబ్‌డబ్ జననం మరణం
రెండు శబ్దాలు రెండు సంకేతాలు
ఆదినాటి తాళపత్ర గ్రంథమైనా, నేతి సాండ్విచ్ అయినా
రెండింటి మధ్య ఇమిడిపోవాల్సిందే, ఒదిగిపోవాల్సిందే
అవసరమైతే నలిగిపోవాల్సిందే
రెండు ఉగాదుల మధ్య ఒక వత్సరం
రెండు తేదీల మధ్య ఒక జీవితం
పొద్దువాలిపోతుందేమోనన్న భయం
బతుకుమీద తీపిని పెంచే క్షణం
ఆక్షణం ఆగిపోతుందేమోనన్న భయమే
క్షణాలకూ ఉంది క్షణక్షణానికీ ఉంది
క్షణాల వెంట పరుగులెత్తే ఊహలు
వేగం పెచుకోవడం దార్శనికత!
క్షణాల వేగానికి తట్టుకోలేక
కుప్పగూలడం నిశ్చలత్వం
నిశ్చలత్వంలోనూ చలనం ఉంటే అది మళ్ళీ తపస్సు
తపస్సులో చైతన్యం - మెదడు కణాల వికసం
నవ సూత్రీకరణల జననం
తెలియని దెప్పుడూ భయం
తెలుసుకున్నదే అభయం
తెలిసీ తెలియని వాటి మధ్య
కనపడీ కనపడని వాటి మధ్య పరిశోధనే... జీవితం!
క్షణాలు నీతో ఆడుకోకుండా జాగ్రత్తపడుతూ,
నువ్వే క్షణాల్ని ఆట పట్టిస్తూ ఆడుకోవడం!!
అదే అందమైన జీవితం! అదే అర్థవంతమైన జీవితం!!
అదే ఆనందభాజనం



డా. లింగంపల్లి రామచంద్ర
చరవాణి: 9394023143

# 107
# రేపటి తెలంగాణ

మన తెలంగాణ
దిశల్ని అలరించిన
చారిత్రక నియమం
మన తెలంగాణ
విశ్వాన్ని ఆకట్టుకున్న
సంస్కృతీ కేదాదరి
తొలి మానవుడి ఆశ్వాసాలు
చరిత్రకు ఊపిరులు పోసిన
అక్షరాస్యురాలు
జగత్తును ఊగించినవి
రామప్పనాగిని శిల్పాలు
ధరిత్రిని ఆకర్షించినవి
నాటి ఓరుగల్లు వస్త్రాలు
ఎన్ని శిలా శాసనాలో
మరెన్ని కైఫీయతులో
గుట్టకీ పుట్టకీ, చెట్టుకీ
మట్టికీ ఉజ్వల చరిత్ర
ప్రజావళికి అందించింది
మానవత్వపు అక్షయపాత్ర
తెలంగాణ మనది
వెలుగు మాగాణగా మలచడం
మన విధి

చెమటను త్యాగం చేయాలి మనం
పచ్చని సిరులు వర్షించడానికి
మేధను విద్యుత్తుగా మలచాలి నిరతం
యంత్రాలనుంచి ఐశ్వర్యాన్ని
జలపాతంలా దూకించడానికి
గ్రహాల మీద జయకేతనాలు
రెపరెపలాడించడానికి
శాస్త్రాభ్యసన కేంద్రాలను
నవీకరించడానికి
మనస్సుని నిస్సంశయంగా మలచాలి
సమాజానికి వ్యక్తిత్వాన్ని నేర్పడానికి
వక్తవ్యం రుచి చూపించడానికి
ఆలోచనలకు అన్వేషణ ఇవ్వాలి
ఆచరణలకు ఊపిరిపోయాలి
అప్పుడు శిథిలాలు
సుందర దృశ్యాలు అవుతాయి
బీళ్ళు పచ్చని వనాలు అవుతాయి
జీవితాలు ఆమని పరిమళాలుగా
కళకలాడతాయి
విశ్వాన్ని నడిపించే
సందేశాలు అవుతాయి





**డా. నాళేశ్వరం శంకరం**
16-11-774/1, శారదా అపార్ట్‌మెంట్స్, ముసారంబాగ్,
హైదరాబాద్-500 036.
చరవాణి: 9440451960

# 108

## తొలి వెలుగు జీవనది

తెల్లవారుజామున
దేవున్ని మేల్కొల్పాలి గానీ
సోమనాథుని కవిత్వమైతే మనల్నే మేల్కొల్పుతుంది!
ఎలా నేర్చావు తండ్రీ
ఈ భావోద్వేగ భాషనీ
ఎలా నిర్వహించావు భాషోద్యమయాగాన్ని
అక్షర సుగంధ లేపనాన్ని
ఎలా ప్రజల పారాణిని చేయగలిగావు

నీ సరికొత్త పద్య విల్లంబుల్ని
పఠించిన ప్రతిసారి
లోలోని నా లోయలో డమరుకమై మారుమ్రోగుతూనే
వుంది!
నువ్వే లేకపోతే
మా కావ్యభూమి సామంతరాజు రాజ్యంలానే ఉండేది
నువ్వే లేకపోతే
మా పల్లె పదాలూ వెన్నెల వెలుగులూ
మా జాతి మనోనేత్రాలలో రూపుకట్టేవే కావు

ఓ నా పండితారాధ్యుడా!
ఏకంగా ఆనాటి ఉద్యమ నాయకుల్నే
కావ్య నాయకులుగా మలచిన ఆదికవివి నీవే
ఉద్యమజాతి నేత్ర ధనుస్సువు నీవే
మొట్టమొదట పూరించిన అస్తిత్వ పాంచజన్యం నీదే

ఛందస్సుకు రెండు కళ్ళుంటాయనీ
మూడోనేత్రం తెరిస్తే తప్ప
దేశీయ రహదారిలోని అడుగుల ఆనవాళ్ళు
విస్తరించవని నువ్వు విశ్వసించబట్టే కదా!
ద్విపదల్లాంటి ముద్దుబిడ్డలు
శతకాల్లాంటి రాజకుమారులు
ప్రజల పాండిత్యానికి పంచాక్షరీ వైభవాన్ని తెచ్చిపెట్టారు
సోమనాథా! సోమనాథా!
నీ బాల్యాక్షరాలు
పాలకుర్తిలోని ఏ గోవుపాలు తాగాయోగానీ
మా అస్తిత్వ ఇలవేల్పులు అవేకదా!
ఒకప్పటి త్రిలింగదేశాన్ని
నేడు పాలిస్తున్నది నీ బసవడే కదా! బసవపురాణమే
కదా!
పాల్కురికి సోమనాథా!
నీ మీద ఆన
మా తొలి తెలుగు కవన జీవనదివి నీవే!

**డా. నందిని సిధారెడ్డి**
37-18/9/944, ఫ్లాట్ 301, సాయికృపా రీజెన్సీ, డిఫెన్స్‌కాలనీ,
సైనిక్‌పురి, హైదరాబాద్. చరవాణి: 9440381148
ఇ-మెయిల్: nandinisr56@gmail.com

109

## ఊరి నెత్తురు

శరీరం కోసం
భూమి వదిలిన వాడికి
భూమి మీద ప్రేమ వున్నట్టా?
శరీరం మీద ప్రేమ వున్నట్టా?
బుద్ధి తెలిసినప్పట్నుంచి మాట్లాడుతనేవున్నా
గాయం గలుమలో కొస్తే
కట్టు కట్టిన
ఆకలి తలుపుతడితే
అన్నం పెట్టిన
వసంత మేఘం గర్జిస్తుంటే
వసంతం వచ్చినట్టే పరవశించిన
నీళ్లకు మొఖం వాచిన వాణ్ణి
నది తారసపడితే
చేతులు చాచి ఆలింగనం చేసుకున్నా
వెన్నకరిగినప్పట్నుంచి
మనసు విప్పుతనే వున్నా
గర్జించిన మేఘం
చెప్పా పెట్టకుండా తరలిపోయింది
చెట్లు చిగురించకముందే పూలు పూయకముందే
వసంతం వెళ్ళిపోయింది
పెంచి వదిలి వెళ్ళిన కత్తి
ఊరి గుండెల్లో దిగింది
రాజ్యానిది బహుముఖ వ్యూహం
మనవేలితో
మనకన్ను పొడువాలని చూస్తున్నది
మాట్లాడినా
మౌనంగా వున్నా
కాగడా వెలుగుతుండాలి
నగరం
అడవి గురించే మాట్లాడుతున్నది
ఊరేం కావాలి?
అక్షరమంతా
అమరత్వమే నిండితే
జీవితమేం కావాలి?
అలవాటయిన భాష
అంతర్జాతీయం మాట్లాడుతున్నది
ప్రజలేం కావాలి?
కాలం పొలిమేరదాటితే
గాయం మానినట్టు కాదు
ఇప్పుడూ గాయాలు ఇక్కడే వున్నయి
ఇంటికొస్తూనే వున్నాయి
కట్టు కడుతూనే వున్నా
పేగుమాడి పెరిగిన వాణ్ణి
మాడిన పేగు తండ్లాడితే

తట్టుకోలేక పోతున్నా
రేపుసరే
ఇయ్యాలెట్ల నడువాలె
చెరువు శోకం పెడుతుంటే
దామార మంటున్నా
అక్షరం పూనినప్పట్నుంచి
ఊరి గురించి
కవిత్వం కడుతున్నవాణ్ణి
కలం లేసినప్పుడు
గింజలూడ్చుకుంటున్న
తల్లి తండ్లాట మాట్లాడొద్దా?
మోకాలి నెత్తురుతో లోకాలు పాకుతున్న
పసిపాప గోస మాట్లాడొద్దా?
ఊరు ఊపిరి తీసుకుంటే
ఊరట పడుతున్నా
వరదగూడు కడితే వాన పడుతుందని
ఊరు ముచ్చటపడితే ముచ్చట పడుతున్నా
వొంగ్రడు మట్టి ముట్టిన వాడు లేడు
పెళ్ళ తీసినవాడు లేడు
అటు తొవ్వ తొక్కినవాడులేడు
యంత్రమే మహానుభావా,
చెరువు తొవ్వ చెంగలిస్తుంటే
పేగు కదులుతున్నది

ఉదయానికీ సాయంత్రానికీ నడుమ
ఊయల ఊగుతున్నవాణ్ణి
నగరంలో వున్నా
ఊరు నెత్తురు అల్లుక పోయినవాణ్ణి
వారం నడుస్తావుంటే
రెండు చేతులా నారుపట్టుకొని
సూర్యుడు కండ్లల్ల కదులుతున్నడు
ఎన్నాళ్లని మరణాన్ని ప్రేమించుదాం?
బతుకుకు భ్రమ కూడా అవసరమే
భ్రమలేని బతుకేది?
చెలుకలు తిరిగి పద్యాలు మూటగట్టుకున్న
కవి ఎటుంటాడు
ఖచ్చితంగా బతుకువైపే
కవి ఎటుంటాడు,
కన్నీళ్లు తడుచుకుంటున్న
గాయాలు తడుముకుంటున్న
ఊరి వైపే ఉంటాడు
ఊరు ప్రజల ఉమ్మడి ఆత్మ
ఎక్కడున్నా కొట్టుకుంటది
మళ్ళా అదే మాట
కవి భూమి స్వప్నం
ఇక్కడి భూమి స్వప్నం

డా. నలిమెల భాస్కర్
కరీంనగర్.
చరవాణి: 9491598988

# 110

## గది

అప్పటి కప్పుడు వేళ్ళ సందుల్లోంచి
సుద్ద 'ముక్క'లు మొలుచుకొస్తాయి
వాటినించే కదా
ఓ అత్యంత దయామయుడైన ఉపాధ్యాయుడు
గుప్పెడు బీజక్షరాలు కోసుకొస్తాడు
ఎవరు తీర్చిదిద్దారో గాని
అతడలా వెనక్కి తిరిగితే చాలు
ఓ నిలువెత్తు వాకిలి ప్రత్యక్ష మవుతుంది
అక్షరాలకది అతను సురక్షిత స్థలమని భావిస్తాడు
తెలివి ఏకంగా కొలువుతీరిన నెలవని తలుస్తాడు
క్రమంగా ఆ నల్లబల్ల
అతడు కోసుకొచ్చి ఆరబోసిన
గింజలను 'ఎండుగ'వుతుంది
ఎక్కడెక్కడి పల్లెల తీరాల నుండో
విద్యార్థులు విహంగాలై ఎగిరివచ్చి
ఆ వాకిలిపై వాలి తమ ఆకలిని తీర్చుకుంటారు

గది గిది కాదు గది...గది...తరగతి గది
పిల్లలకు కన్నతల్లి స్తన్యమవుతుంది
కానుగ నీడవుతుంది
అజ్ఞానం ఒకానొక భయంకర వర్షంగా మారి
అదే పనిగా అదరగొడుతున్న వేళ
వాళ్ళను రక్షించడానికి ఏ జ్ఞాన తృష్ణుడో
ఎత్తిన గోవర్ధన గిరి అవుతుందది
అక్కడ ఒక గీత నిద్ర నుండి
మెలకువ వేపు జరుగుతుంది
ఒక విద్యార్థి సరళం నుండి
సంక్లిష్ట విషయాల వేపు మరలుతాడు
ఒక గ్రాపు కింద నుండి పైకి ఎదుగుతుంది
మనుషులు మొత్తంగా చీకటి నుండి
వెలుతురు వేపు మళ్ళుతారు
అవును...
ఎప్పటికయినా ప్రపంచమానవాళికే కాదు
చుట్టపుచూపుగా వచ్చే గ్రహాంతర వాసులకన్నూడా
ఈ భూమండలమ్మీద
ఏకైక లోకైక దర్శనీయ స్థలం బడి







**డా. పత్తిపాక మోహన్**
నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఓయు క్యాంపస్
చరవాణి: 9966229548

# 111

## 'యాది' రెడ్డి

ఏ తల్లి కన్న బిడ్డనో
నేల తల్లి కోసం పాణమిడిసిండు
ఏ మట్టిలాడుకుని పెరిగిండో మమకారం పెంచుకున్న
నేలకోసం మట్టిగలిసిపోయిండు

మూతిమీద
మీసాలన్న మొలవని సోరసోర పోలగాండ్లు
పైలా పచ్చీసన్నా దాటని అన్నలు... తమ్ముండ్లు...
కండ్లముంగట కలిసిమెలిసి ఉండి
పాణం పాణమోలె రాఖీలు గట్టిన అక్కలు... చెల్లెండ్లు..
గడియకొక్కరు...
పూటకిద్దరు చుక్కలల్ల గలుస్తుంటే
ఎందుకో అర్థం కాకుంటున్నోడు ఇప్పుడు
చెట్టుకు పువ్వై యాలాడుతున్నడు
కుట్రలు కుతంత్రాలు తెలువనోడు
పాముల్ని నిచ్చెనల్ని సూడనోడు
కండ్లకు బట్టలు గట్టుకున్న
ధృతరాష్ట్రులకు తన చావు
కండ్లు తెరిపిస్తదనుకున్నడు
అయిందానికి... కానిదానికి
సుట్టాలకోసం చట్టాలుచేసే
పెద్ద సభ ముంగట పాణాలిడిస్తే
ఢిల్లీ పీఠం కదుల్తదనుకున్నడు -

పార్లమెంటు బంగ్లమీది
నాలుగు సింహాలు సూత్తుండంగనే
ఒర్రెంక చెట్టుమీది బంతిపువ్వైండు
రాష్ట్రపతి భవనంమీది మూడురంగుల జండా
విలవిలా కొట్టుకుంటుండంగనే
తల్లి తెలంగాణకోసం అసువులు ధారపోసిండు -

రోజుకో మాట జెప్పి గడియకో పాట పాడి
కల్లబొల్లి కబుర్లు చెప్పే ఓట్ల పార్టీలకు తన మరణం
గుణపాఠమైతదనుకుని అమరజవాను జ్యోతిలో
సమిదగా మారిపోయిండు -

నిండుకుండోలె
నూరేండ్లు బతకాల్సినోడు
తనకు గాకున్నా తమ్ముండ్లకన్నా
మంచిరోజులత్తయ్యనుకున్నడు

మొగులుమీద సుక్కైండు
ఎత్తిన పిడికిలైండు...
ఎక్కుపెట్టిన బాణమైండు
ఎవలకు కాకుంటైన
ఏపి భవన్‌తో పాటు
ప్రజలు... పాలకులు...
జవాబు చెప్పాల్సిన ప్రశ్నయ్యిండు.



**డా. పసునూరి రవీందర్**
ప్లాట్ నెం. 406, గుల్మోహర్ పార్క్, శేరిలింగంపల్లి,
హైదరాబాద్. చరవాణి: 702648825
ఇ-మెయిల్: drpasunuri@gmail.com

112

# పేగుబంధం

తనువును ఆయుధం చేసి
రేపటికి ఊపిరిపోసిన చేతులు నావి
ఈ మట్టిపొరల మీద మహాచరిత్రను లిఖించిన
ఆదిజాంబవుణ్ణి నేనే! తంగేడు సెక్క నా పని పరికరం!
లందెగోళాల్లో
నేను నానేసింది తోలును మాత్రమే కాదు
మీ రేపటి పొద్దును కూడా! నా గూటం, రంపెం
ఇప్పుడు మీ ఎగ్జిబిషన్‌లలో పురాతన వస్తువులు
నా చరిత్రను కూల్చిన గొంతులే
మళ్లీ నా పనితనం మీద
పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లు ఇస్తున్నాయి
అటెన్షన్ ప్లీజ్... తంగేడు సెక్కనా ఆదిమవేట ఇన్వెన్షన్
నా ఊహ ఒక మహా శబ్దానికి ఊపిరిపోసింది
శతాబ్దాలు గడిచినా చెరగని సంతకాన్ని చేసింది
మిమ్మల అలరించినా, ఆలోచింపజేసినా
నాలుగు బాటలకాడ లొల్లి చేసినా
ఈ నేలకు దక్కని వాటాకోసం
దండోరా వేసినా నా డప్పె కదా...
నిప్పుల దరువులు కురిపించింది
తంగేడు చెక్క నా తండ్లాటకు సాక్షి!
మీ సుతిమెత్తని పాదాలకు
రక్షణ కవచాలను తొడిగిందీ ఈ చేతులే కదా
ఈ చేతులంటే మీకెందుకంత చిన్నచూపు
నాగరికతా విత్తనాన్ని నాటింది నా చేతులే కదా
మరి వెలివాడలే నాకు దిక్కెందుకయ్యాయి?
తాలుగింజల కోసం నేను తండ్లాడుతుంటే
ఒక్కడైనా నా పొక్కిలైన మా వాకిల్లలోకి తొంగిచూశాడా?
నా రందీ జిందగీ మీద పిడికెడు మద్దతునైనా
కుమ్మరించాడా తంగేడు చెక్క నా పేగుబంధం!
పూలకు మొక్కి, పూలను పూజించే నేల
ఆడినమాటలకు అసువులు బాసే నేల
అమరత్వానికి అమ్మఒడి, చెమ్మగిల్లే కన్నుల జాబిల్లీ
బుద్ధుని బోధనలు నడయాడినా
చిందు ఎల్లమ్మ ఎత ఎగిలివారినా
సదాలక్ష్మమ్మ సవాలిసిరినా
మా భాగయ్య ఉద్యమసేద్యం అచ్చరాలు పంచినా
మా కొసింటి గుడిసెల్ల వెలుగెందుకు పూయలేదో
తల్లీ... ఈ వెలివాడల వ్యథలకు ముగింపు ఎప్పుడో!
తంగేడు సెక్కజెర నువ్వైనా చెప్పవే!
పాదముద్రలు చెరిగిపోతాయి
ఆధిపత్యకోటలూ కూలిపోతాయి
ఈ చరిత్ర నా తంగేడుసెక్కె రేపటి తరానికి
ఒడువని పాఠాన్ని చెబుతది
మనసులను, మనుషుల్ని సానబెడ్తది!





**డా. పులిపాటి గురుస్వామి**
ఆనందకల్ప, ఫ్లాట్ నెం. 245, సాయినగర్‌కాలనీ, బైరామల్‌గూడ,
ఎల్బీనగర్, హైదరాబాద్-79. చరవాణి: 9848887904
ఇ-మెయిల్: anandudu@gmail.c

113

## తీపి తపన

మెదడు పొరల గుండా
తిరుగుతున్న వానపాము
ఒక్క మజిలీ కూడా
స్థిరంగా తోచదు
ఈ రాత్రికి చల్లటి హుషారు
మినుగురుల పుంతను
ముందు పరుచుకొని
సంగీత కథల నాట్యాల పాటలతో
అడవి మనసు
జలపాతాలు
కళ్ళను జోకొట్టే కాంతులు
సంబరాల రహస్యం తెలియదు
అడవీ నేను వేరు కానట్టు -
కాళ్ళకు చుట్టుకుంటున్నాయో
కలలకు బిగుసుకుంటున్నాయో తీగలు
తీగల ఒంటిమీద
పారుతున్న చీమలు
ఆకుల కొనలనుంచి
రాలుతున్న కన్నీళ్లు
ముండ్లు గీసిన చిత్రాలు
ఒకరికొకరం లాలనగా
శ్వాసను తినిపించుకుంటూ
ఉమ్మడి బహుమతిగా
వర్షపు చుక్కల్ని
తరాల పునరుత్పత్తికి తడుపుకుంటూ
పచ్చదనం వ్యాప్తిని
కూలబెడుతున్న విషకీటకాలు
తొలుస్తున్న దేహగాయం-
అంతా మాయం చేయగల
తాయెత్తు ఒడి
చెట్టుకింది నీడ
ఓదార్పు జాడ తెలిసింది
చల్లటి స్పర్శ తెలిసిన చేతులు
భూమండలాన్ని
జోకొట్టాయి
ఒక్క వెలుతురు తీగ నాటినా చాలు
వికసించిన గాలి పూల సంగీతాలతో
జన్మంతా జాతర





డా. పిల్లలమర్రి రాములు
8-284/ఓయు/614, ఓయు కాలనీ, షేక్‌పేట్,
హైదరాబాద్-8. చరవాణి: 9246526627

114

## మగ్గం

లట్కా పుట్కా లట్కా పుట్కా
మగ్గంది మనోహరనాదం
చుంచుకత్తి ఒక చేత
అనిడాలు మరొక చేత
మగ్గం గుంట మరుభూమిలో
పోగుల సైనికులపై యుద్ధం చేస్తూ
నాడె కదిలిన వైపు జాగరూకుడై పరిశీలిస్తూ
బాగోత విషాద నాయకుడు
కన్నీట ఇంధనంతో
జలతారు వస్త్రాలను నేసినవాడు
రాట్న హార్మోనియం రమణీయ నాదం

పిల్లలు వంతలు పాడుతుంటారు
చేతినిండా కళల పుష్పాలు
వంటి నిండా మాయని గాయాలు
కడుపులో పిల్లీ ఎలుకల సయ్యాట
పొయ్యిలో ఎప్పుడూ కదలని పిల్లుల మందహాసం
అప్పులూ, అనారోగ్యాలు, అవమానాలు
మద్దెల దరువులై తకథిమి తకథిమి
మోతలు మోయిస్తుంటాయి
బలంగా పేనిన తాడు
బలవంతంగా ప్రాణాలను తోడేస్తుంది
నేసిన వస్త్రం కప్పటానికి మిగలదు..



డా. పి. సరళ
ఇం.నెం. 37-93/45/2, మధురానగర్, నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్,
సికింద్రాబాద్-56. తెలంగాణ. చరవాణి: 9908208449

115

# పల్లె తల్లి పసిడి నవ్వులు

పల్లె తల్లి పసిడి నవ్వులు!
పచ్చని తంగేడు పువ్వులు
పుడమి తల్లి ఒడిలో విరిసి
అడవి తల్లిని అందంగా అలంకరించి
కాలుష్యాన్ని తరిమేస్తూ!
మనిషికి ఆహ్లాదాన్నీ, ఆరోగ్యాన్నీ పంచుతూ
దారిపొడుగునా చిరునవ్వులు చిందిస్తూ!
బాటసారులకు స్వాగతం పలుకుతాయి
బ్రతుకు పున్నమి వెన్నెలగా!
విరిసి మురిసిపోతాయి
అవే! తంగేడు పూలు! అవే తంగేడు పూలు!
పసుపు పచ్చని సిరులు! ప్రవహించని ఝరులు!
చిరుగాలికి కదలే చిన్నారి అలలు
బ్రతుకమ్మ సిగలో సింగారాలు
తెలంగాణా తల్లి మెడలో బంగారు హారాలు
ఇక్కడి సంస్కృతికి ప్రతిబింబాలు
మధుర భావాలకు ప్రతిరూపాలు
అవే! తంగేడు పూలు! అవే! తంగేడు పూలు!
సుతిమెత్తని అందాలు! సుతారంగా కనువిందులు.
పల్లెవాసులతో సహజీవనం చేస్తాయి
పలుకరిస్తే హరిచందనం పూస్తాయి
తెలంగాణా తల్లికి ప్రత్యేకం
గౌరమ్మ తల్లికి బహు ఇష్టం
అవే! తంగేడు పూలు! అవే! తంగేడు పూలు!
ప్రతి లోగిట్లో వెదజల్లుతాయి ఆనందాలు
ప్రతి వర్ష ఋతువులో జరుపుతాయి సంబరాలు
ప్రతి ఆడపిల్లకీ మధురానుభూతుల్ని పంచుతాయి
ప్రతిసారీ ఉయ్యాల పాటల్ని వినిపిస్తాయి
ఇంటింటా పూస్తాయి బ్రతుకమ్మగా
అంతటా వెలుస్తాయి గౌరమ్మగా
అవే! తంగేడుపూలు! అవే! తంగేడుపూలు!
పల్లె తల్లి పసిడినవ్వులు!
పచ్చని తంగేడు పువ్వులు!

డా. పోరెడ్డి రంగయ్య
అధ్యక్షులు, తేజ ఆర్ట్ క్రియేషన్స్, ఆలేరు,
నల్గొండ జిల్లా-508101 చరవాణి: 9948049864
ఇ-మెయిల్: tejaartso6@gmail.com



# 116

## అసలుజాడ

అవును
నన్ను పట్టి చూపింది
ఆ పువ్వే
నా ఆనవాళ్ళూ ఆపువ్వే
జీవి మూలం
కణంలో ఉందేమో!
కానీ,
నా అసలు మూలాలు మాత్రం
ఆ పువ్వులోనే
ఖరీదైన పువ్వులు
ఎన్నైనా ఉండొచ్చు!
నా మట్టుకు
అదే అసలైన పువ్వు
అది ఆత్మగల్ల పువ్వు
తలలకు ఎక్కకపోవచ్చు !
తలపులలో
హమేషా నిలిచిన పువ్వు
ఈ మట్టి సంస్కృతిని
పట్టి చూపిన పువ్వు
నిఖార్సైన నిలువుటద్దం
నా పువ్వు వానకు మురిసింది
ఎండకు మాత్రం బెదరలేదు
పకృతి చీరపై
పట్టు అంచుగా మెరిసింది
పసుపుముద్దై
గౌరమ్మగా నిలిచింది
పెతరమాసనాడు
ఎంగిలి పువ్వై
తొమ్మిదోనాడు తాంబూలమంతై
ప్రకృతిలోంచి ప్రకృతిలోకి
తన్మయత్వం పొందే పువ్వు
నాది బ్రతుకమ్మ జాతి
అందుకే బతుకుపై భరోసా
నేనేంటో
ఆ పువ్వ రెక్కలు చెపుతాయి
నా యాసకు నా భాషకు
నా సర్వస్వానికి
తానే నిలువెత్తు ప్రతీక
మొన్నటి దాకా
చిన్న చూపు కొందరికి
అయినా పొంగలేదు, కుంగలేదు
ఈనాడు శిఖరమై
తల ఎత్తుకు చూస్తుంది
అదే ఇన్నేళ్లుగా....
కలలు కన్నది

**డా. మల్లేశ్ బలాస్తు**
రూం. నెం. 19ఎ, తెలుగుభవన్, త్రివేణి హాస్టల్,
ఓయు క్యాంపస్, హైదరాబాద్-500 007
చరవాణి: 9440021500

117

## తెలంగాణ వెలిగిపోతది

ఈయ్యాళ్ళ పొద్దుగళ్ళ కొత్త కొత్త గున్నది ...?
నిన్నటి పొద్దుగాళ్ళకంటే ఈయాళ్ళ పొద్దుగళ్ళ
కొత్త కొత్త గున్నది ఆకులురాలిన చెట్లకు
కొత్తఇగురచ్చినట్లున్నది ఇంత ఎండలల్ల గూడా
బరఫ్ గడ్డలల్ల నడుస్తున్నట్లున్నది
కోయిలలు కూడా కూహూకుహు అని గాకుండ
తెలంగాణ తెలంగాణ అని కూసినట్లున్నది
జూన్ రెండు ఇయ్యాల్ల అచ్చినట్లున్నది
సంపూర్ణ తెలంగాణ రాష్ట్రంలనే ఉన్నట్లున్నది
అందుకే ఈయ్యాళ్ళ పొద్దుగళ్ళ
కొత్త కొత్త గున్నది అదేందో మరి....
ఇప్పుడు కవితలు రాద్దామంటే
కలాలు కదులుత లేవు...!
ఏం రాయాలో అర్థమయిత లేదు
ఇది వరకంటే ఉద్యమముండే
రోజుకొక్క కవిత రాయ బుద్దయితుండే
వారం కొక్కపాట పుట్టుకొస్తుండే
డిల్లీ కెల్లి గల్లి దాక యాడసూసిన
హల్‌చల్ హల్‌చల్ గుంటుండే
ఎప్పుడు జూసిన 'ధూం ధాం'
ప్రోగ్రాంలుంటుండె.... పూటకొక్క ధర్నా
తీరొక్క ర్యాలీ టి.వి.లో షోలు జూస్తుంటే
సూడంగ సూడంగ టైం పాసయి పోతుండే....
ఇక ఓ.యు క్యాంపస్ సుట్టు
ఇరవైనాల్గంటలు మిల్ట్రికాపల ఉంటుండే
సదువుకొనె పోరాగాండ్లు లైబ్రరీ పోదామన్న
పోలీసోల్లు లాఠీలు పట్టి గెదుముడుంటుండే
ఏది ఏమయినా...
ఆకాశం ఇరిగి మీద పడకముందే
భూమి బద్దలయి రెండు వక్కలు కాకముందే
తెలంగాణ ఆవిర్భవించింది...!
రేపటి నుంచి ...
నా నీళ్ళు నేను దాగుతా
నా ఉద్యోగం నేనే జేసుకుంటా
నా భూమి మీద నేనే రాజ్యం జేసుకుంటా...
గప్పుడే నా తెలంగాణ వెలిగిపోతది

**డా. బాణాల శ్రీనివాసరావు**
3-18-125/5, మైత్రి నివాస్,
ప్రగతినగర్, రామంతపూర్-13
చరవాణి: 9440471423



# 118
# ఫీనిక్స్ తెలంగాణ

కలలు గానే మిగిలిపోయే
కొన్ని కలలు...
ఎప్పుడోగాని నిజం కాని
ఇంకొన్ని కలలు...
అరవై ఏళ్ళకు నిజమైందీ కల
అపురూపమైన కల
తెలంగాణ కల
ఎందరో అమరవీరుల
ఆత్మాహుతి మంటల్లోంచి...
మరెందరో ఉద్యమకారుల
త్యాగాల రక్తపు ధారల్లోంచి...
ఫీనిక్స్ పక్షిలా పుట్టి
కొత్తగా పురుడు పోసుకున్న
పసిగుడ్డు తెలంగాణ...
ఈ ఆనందాన్ని ఎలా వర్ణించాలి?
పండు వెన్నెల్లోని
తెల్లదనంలానా?
కోయిల స్వరంలోని
తీయదనంలానా?
అమ్మ స్తన్యంలోని
కమ్మదనంలానా?
చింతచిగురు వగరులానా?
సముద్రం గుండెల్లోని
బడబానలంలానా?
ఏమని చెప్పాలి?
ఎలా రాయాలి?
అరవై ఏళ్ళ వలస పాలనలో
మోసపోయిన అమాయకత్వం
గురించి రాయాలా?
ఇన్నేళ్ళూ...
కంటిరెప్పల కేలాడే తెలంగాణ
చేతికందలేదనే
దిగులు గురించి చెప్పాలా?
ఇన్నాళ్లకు..
వలస పాలకుల చెరనుంచి
విముక్తి పొందిన
అమృత ఘడియల గురించి
మాట్లాడుకోవాలి మనందరం
బంగారు తెలంగాణ సాధించుకోవాలి.



డా. బుక్కా బాలస్వామి
ఫ్లాట్ నెం. 111, ప్లాజా బ్లాక్, రాఖీవీన్ అపార్ట్‌మెంట్స్
సఫిల్‌గూడ, సికింద్రాబాద్-500 056 చరవాణి: 9441477699
ఇ-మెయిల్: balaswamy.bukka@gmail.com

119

# అమరవీరులకు కవితానీరాజనం

తెలంగాణ రాష్ట్ర సాధన యజ్ఞంలో
ఆత్మ బలిదానాలు చేసుకున్న సమిధలకు
త్యాగమూర్తులకు
ఉద్యమవీరులకు
అమరజీవులకు
రాష్ట్ర అవతరణ తొలి వసంతంలో
కృతజ్ఞతలతో కవితా నీరాజనం.
తమ కలల పంటల త్యాగాల వల్ల
పేగుబంధం తెగిపోగా
కడుపుకోతకు గురియై
కుడుపుతీపికి దూరమైన
శోకమూర్తులకు
వీరమాతలకు
పాదాభివందనం
తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసిన
తెలంగాణ పోరాట యోధులకు
తెలంగాణ ఉద్యమకారులకు
తెలంగాణ విప్లవకారులకు
తెలంగాణ అమరవీరులకు
తెలంగాణ చరిత్రపుటలలో
చిరస్మరణీయులుగా
చిరంజీవులుగా నిలిచిపోయిన
ధ్రువతారలకు
త్యాగధనులకు
అశ్రునివాళులు.
మీరు కలలు గన్న
త్యాగాల తెలంగాణ
ఆత్మగౌరవ తెలంగాణ
సామాజిక తెలంగాణ
బంగారు తెలంగాణ
సాకారమై
మీ ఆత్మలకు శాంతిని కలిగించాలని
నవతెలంగాణ రాష్ట్ర ప్రజావళి
మీకు సమర్పిస్తున్నది
హార్దిక స్మృత్యంజలి
అమరులారా! ఉద్యమవీరులారా
స్వీకరించండి! తరించండి
సమస్త తెలంగాణ జన నీరాజనాలు!

డా. బండారు సుజాత శేఖర్
8-8-382, రోడ్ నం. 1, గ్రీన్‌పార్క్ కాలనీ,
సరూర్‌నగర్-79. చరవాణి: 9866426640

120

# బండప్రాణం

మా ఊరుప్రక్కన
అంతెత్తుగా అలా నిలబడి ఉంది
తరతరాల వైభవానికి ప్రతీకగా సురగిరిగా
కోటి దేవుళ్ళ దేవరమ్మ కొండగా
కొలువై ఉంది -
పద్మనాయకుల ప్రాభవాన్ని
మోసుకొచ్చిన ప్రాకారాలతో
నిండైన మనసుతో ఆహ్వానించే ద్వారాలతో
ఖిల్లా కింగ్‌ల గుట్టగా
నిండుగా పలకరిస్తూనే ఉంది -
ఏడునూర్ల మెట్లు ఏడుగుట్టలను చేరిస్తే,
బుడిబుడి అడుగులతో
అక్క చేయిపట్టి నడిచిన ప్రాయం
ఆడిన చిలిపితనం దారిపొడవున
జ్ఞాపకాల గుండ్రాళ్ళను అచ్చెన్నలుగా
అందిస్తూనే ఉన్నాయి.
రాచకొండ దేవరకొండ
అన్నదమ్ములై అచ్చుదిద్దిన నిర్మాణాలుగా
ఎన్నో సాక్ష్యాలు -
నాటి ఆత్మీయతలకు - అవి విశ్వాసాలు
కాలచక్రం ఓ పట్టు పట్టి శతాబ్దాలను దాచినా,
అక్కడి నిర్మాణాలు -
బండను గుండె చేసి
నిజాలను పలికిస్తూ ఉన్నాయి.
అశ్వశాలలు, దేవళాలు, కోనేర్లు
ఆ ప్రక్కనే ఆంజనేయుడు -
నాడు రాజ్యానికి నడిబొడ్డున
నున్నని గుట్టపై రామాలయం
నేడు నా ఇంటి కెదురుగా అల్లంత దూరం.
అయినా కంటిపాపకు మరువని చిత్రాలే.
పల్లకీ మోతలతో ఖిల్లా
సువర్ణ అక్షరాల సాక్షిగా అతివైభవం
నేటికీ ఆ ప్రాంగణ జలం అమృతమే.
కాని తరాల సందడిలో ఖిల్లా గుట్టగా,
నాటి పల్లకిమోతలు, సన్నాయిరాగాలు
కవుల గళాలకు బదులుగా
సుతిమెత్తని సుత్తె దెబ్బలు -
గుట్టను గులకరాళ్ళుగా
రాళ్ళను ఇంటి పునాదులుగా
శ్రమజీవుల నిట్టూర్పును రాగాలుగా వినిపిస్తూ -
అలా మౌనంగా, అంతెత్తుగా, అలా నిలబడే ఉంది.
బండనయినా బడబాగ్నుల దాచిన
తనకన్న రాతిగుండె ఉన్న జనం మధ్య -
'బండ ప్రాణం' క్షణం క్షణం చింతిస్తూ
అలా చూస్తూ ఉంది.





**డా. భీంపల్లి శ్రీకాంత్**
8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్-509 001
చరవాణి: 9032844017
ఇ-మెయిల్: srikanth.bheempally@gmail.com

121

## ఉద్యమగళం

**ఒ**కే ఒక్క స్వప్నం కోసం
ఎన్ని కళ్ళు ఇక్కడ ఎదురుచూశాయి
ఎన్ని కలాలు ఇక్కడ కవాతు చేశాయి
ఎన్ని గళాలు ఇక్కడ గళమెత్తి గర్జించాయి
ఒక్కో కలం ఉద్యమ స్వరాన్ని వినిపించింది
ఒక్కో గళం పోరాట పటిమను చాటింది
ఎన్ని రాస్తారోకోలు తెలంగాణ కోసం రోడ్డెక్కాయి
ఎన్ని ర్యాలీలు, ధర్నాలు తెలంగాణ అని గర్జించాయి
ఎందరో అమరవీరుల త్యాగఫలం ఇది
సకల జనుల సాకార ఫలితమిది
అరవై యేళ్ళ ఉద్యమం
తెలంగాణ సాకారం
ప్రతి జనహృదిలో ఆనంద తాండవం
నాల్గు కోట్ల ప్రజలు ఆశించిన ఆశాదీపం
ఇక బతుకంతా బంగారుమయం.

డా. బెల్లంకొండ సంపత్ కుమార్
302, శ్రీ శివగంగాటవర్స్, మంజీరనగర్, ఓల్డ్ అల్వాల్,
సికింద్రాబాద్-10 చరవాణి: 9908519151



# 122

## కలల కౌగిలి

కమిలిన భూమి
ముద్దగట్టిన పేగు
కూలిన దిక్కు
కూలబడ్డ ఆకాశం
కనుసంధ్యల తెలంగాణ
జీరబోయిన సింగిడి అలుపు
అనుభవాల పేరిక
ఆరాటాల చిత్రిక
అంటరానిదై
ఆకురాలుదై
నిత్య గాయాల మాలైంది
ఎంత గాలించినా
గుండెడు కన్నీళ్ళ పుల్కరం
పుండు సల్పిన బాధ తప్ప
దగ్గరికి తీసే ప్రేమా
ఇంత మోసపోయే అమాయకమూ తప్ప
ఏం స్వార్థమున్నది?
బంగారు చెండు గాబట్టే ఇదంత!
కోసుకుంట ఆటాడవట్టింద్రు!
జూన్ల తెలంగాణనే వేరంటే
తొలకరికి పులకరించిన
మనసున్న వజ్రాలగని
వంచన దాని ముసుగులనే బద్దలు గావాలె
ఎల్లల నికాలస్ మట్టి వాసనల
కలల కంకుల హారాలు మొలవాలె
అనంత ఆశల పూమొగ్గలు
ఆశయాల స్రవంతయి
కదలాలె! కదలాలె!
మానే గాయం అంచున
ఫుట్‌పాత్ గుడిసె ఆకాశహర్మ్యమూ సమవై
ఒంటరి తుమ్మగూటి చిమ్మెట ఏడ్పుల
చిరునవ్వుల మకరందం నిండాలె
ఒక గబ్బిలం ఆకలికేక రద్దుగావాలె
ధ్వంసమైన ఆ గోడలమీద
హింసానంతర కావ్యాలు రాయాలె
డేగ నాట్యం చేయాలె
కోకిల పిట్ట నెమలి చిలుకా
పరవశించి పోవాలె
నిత్యగాయాల మాల
మల్లెల ముల్లెలై
విశ్వ పరిమళాలు వెదజల్లాలె.

డా. బెల్లి యాదయ్య
6-2-330, శ్రీనగర్‌కాలనీ, బి.సి. హాస్టల్ పక్కన
నల్లగొండ-508 001 చరవాణి: 9848392690
ఇ-మెయిల్: bellipoet@gmail.com

# 123
# శాస్త్ర వాక్యం

అప్పు దొరుకుడు
కష్టంగ ఉండె ఎక్కట -
పైస పుట్టుడు
బహుత్ పరేషానీగుండె నిన్నమొన్నటిదాంక -
నీళ్ళకు
మా ఇబ్బందిగ ఉంది ఊళ్ళె
ఇయాల్ల -
మబ్బుల్ని నమ్ముకుంటే కూడంగ
దొంగల్ని నమ్ముకున్నట్టే అయ్యింది
రాష్ట్రపతిని కలిసిన
ప్రధానమంత్రిని కలిసిన గవర్నర్ని ముఖ్యమంత్రిని కల్సిన
కలెక్టర్ని కలిసిన
ఇగ ఈళ్ళ ఎవలతోని కాదు గానీ
మా చెర్లకు చేదబాయిలకు మునుపటి లెక్కన
జలరాశి ఊరాల్నంటే
జర నువ్వన్న చెప్పు అని
గవర్నర్‌ని కలిసిన
ఢిల్లీ కూడా పోయి ప్రధానమంత్రినీ
పెద్దాయన రాష్ట్రపతినీ కలిసినా
ఇగ
ఈళ్ళెవరితోను కాదని
ఓ కవిని కల్సిన
"సెర్యకు సేతబాయిలకు మునపటి తీర్గ
జల రావాల్నంటే నేనేం చెయ్యాల్నో జర
నువ్వన్నా జెప్పు'' అని అడిగినా
అడివికి పోయినప్పుడు
ఎలక్షన్లు వచ్చినప్పుడు
సదువుకొమ్మని ఒక చిట్టీ ఇచ్చిండాయన
"బ్రదర్
డోంట్ కట్ అండ్ సేల్ ద ట్రీ అండ్ వోట్'' అని
ఒక శాస్త్రవాక్యం రాసుంది దాంట్లె

డా. బెజుగామ రామమూర్తి
ఇం.నెం. 5-1012/58, శారదా నిలయం 301,
మంగాపురం కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్-500 003
చరవాణి : 8500829980

124

## ఒక సాకార స్వాప్నిక సంతకం

ఇనుప పనిముట్లను
పదునెక్కించాలంటే
కొలిమిలో కాల్చాలనీ,
సుత్తెలతో మోదాలనీ
ఎవ్వరైనా చెప్పగలరు
కానీ-చరిత్రను పదునెక్కించాలంటే....?
అవును, ఏం చేయాలి....?
కారాగారాలను, కర్మాగారాలుగా
లాఠీలను సుత్తెలుగా
శరీరాలను ఇనుపముద్దులుగా
మార్చాలి...! లేదా మార్చుకోవాలి
ఇది, ఒకప్పటి సూత్రం....!
కానీ- నేటి మూలకణం...
క్షణ... క్షణం... అంతరంగాల మథనం
కనిపించే ప్రతి అణచివేత,
సాచి వేతల క్రింద
కణ, కణ మండి, కరిగి-
అస్తిత్వం కోల్పోయిన
సహజ సౌందర్య వనాన్ని
ఆవేశంతో, అనురాగంతో, ఆత్మీయ స్పర్శతో,
దూరదృష్టితో
వాస్తవిక జీవన చిత్రిత
మార్మిక భావజాలంతో
మొలకెత్తించే-
వాగమృత ధారా ప్రవాహాలంబన
చుంబిత నాయకత్వం...
చరిత్రను ప్రసాదించిన
జనగణ గర్జిత గీతాశాస్త్రం ...!
నిలిచినా, గెలిచినా
గెలిచినిలిచినా, నిలిచి గెలిచినా
పావన నవజీవన బృందావన మందిరాలను
సాకారం చేసే తొలి అడుగులు
పచ్చ, పచ్చగా విచ్చుకున్న
భూమాత సుందర శరీరం
జలకళతో కళకళలాడే
పల్లెటూళ్ళ వైభవం
పట్టు కుచ్చులపై నుండి నూనె చుక్కలు
జారిపోతున్నట్లు
రహదారులపై పరుగుల తీసే వాహనాలు
పండువెన్నెలను మరపించే
అమావాస్యరాత్రులు, వెన్నెల బువ్వలు
మెరసిపోయే పారా-పలుగూ
పులకరించిన సుత్తీ-కొడవళ్ళూ
మిణుగురు పురుగుల పాలపుంతలు



కొండల్లో, కోనల్లో విరబూసిన మందారాల ఎరుపుజీరలు
పరిమళించే వీథుల్లో-
మోరెత్తే బసవన్నలు, గోమాతలు
పాలకులు, పాలితులు లేని
పల్లవించే మానవతా మందిరాల ప్రాంగణాల్లో-
కర్షక, కార్మిక , మేధావి బుద్ధిజీవులు;
అనాథలు, అభాగ్యులు, నిర్వాసితులు, నిరుద్ధులు
ఒక్కటై ఆలపించే
జయగీతాలు...
రెపరెపలాడే-పాలపిట్టల సొగసులు
పురివిప్పిన-నెమలి పిట్టల సోయగాలు
చివురెత్తిన శమీవృక్షం నీడన-
త్యాగాల రక్తపు చారికల
పోరాటపు గురుతులు
బతుకు బాటలు నిర్మించే- బతుకమ్మల పాటలు,
ఆటలు;
ఇవన్నీ ఒక స్వేచ్ఛా స్వాతంత్ర్యాల
సుస్వర మంత్ర ప్రసారాలై
తరతరాలకూ-తరగని
సుందర దృశ్యమాలికలై-అల్లుకున్న
నా సుందర మాగాణం,
రేపటి నా తెలంగాణ..!

డా. మడికొండ శ్యామ్ సుందర్
1-8-702/26-1/2, 401-సాయి అమృతా అపార్ట్‌మెంట్స్,
పద్మాకాలనీ-నల్లకుంట, హైద్రాబాద్-500044. చరవాణి: 9440628996

125

## ధ్యేయం

ప్రాణాలుంటే ఏమిటి ప్రాణాల్ పోతే ఏమిటి
నాణాల్ పోతే ఏమిటి మాన్యాల్ పోతే ఏమిటి
ఎప్పుడైనా, ఎక్కడైనా వాదిస్తాం వాదిస్తాం
సాధిస్తాం సాధిస్తాం తెలంగాణ సాధిస్తాం
ఇదే స్ఫూర్తి ఇదే దీప్తి ప్రతీ తెలంగాణ హృదయంలో
ఇదే దీక్ష ఇదే ఆకాంక్ష
ప్రతీ తెలంగాణ మనస్సులో
ఈ స్ఫూర్తికి ఈ దీప్తికి ఎవరు ఎవరు కారణం
ప్రతి హృదయంలో వెలిగే దివ్య వెలుగు తోరణం
కె.సి.ఆర్ కె.సి.ఆర్
ప్రతి హృదయంలో కె.సి.ఆర్
కె.సి.ఆర్ కానే కాదు ఒకే ఒక వ్యక్తి
తెలంగాణ ప్రజామనోసంఘటిత శక్తి
తన ప్రాణ ధనమానాల్ని తృణ ప్రాయంగా భావించే
చెప్పలేని ఆరాటం నిరంతరం పోరాటం
నిస్వార్థుడు నిరాడంబరుడు
ఆచార్య జయశంకర్ అండతో
ఎన్నో చర్యలు వ్యూహాల్ నిద్రలేని రాత్రులు
ఉద్యమాలు, బందులు లేనే లేవు విందులు
ఎన్నో త్యాగాలు ప్రాణార్పణలు
విద్యార్థుల ఆర్తులు నాదాలు
విరిగిన ఆస్తులు
ధ్వంసమైన ఆస్తులు
మరెందరో మహానుభావుల
మనోబలం త్యాగఫలం
మన నవ తెలంగాణా
బంగారు తెలంగాణ
జూన్ రెండు, రెండువేల పద్నాల్గు
నెరవేరుస్తు తెలంగాణ తెలుగు వాడి స్వప్నం
ఆ రోజు తెలంగాణలో నవ సూర్యోదయం
ఆ రోజు తెలంగాణ పునరావిర్భావం
ప్రస్తుత నవ తెలంగాణ ఒక వినూత్న శిశువు
దీనిని ప్రేమతో పాలించి పోషించి
పరిఢవిల్ల చేయడం ప్రతి పౌరుడి ధర్మం
ఇప్పటి మన తెలంగాణలో
చెరువులన్ని బరువులే
తరువులన్ని కరువులే
భూయజ్ఞం, జలయజ్ఞం పేదల ఇళ్ళు
మెట్రోలు మరి ఎన్నో సమస్యల తోరణాలు
సమస్యలతో రణాలు
సర్కారూ, ప్రతిపక్షం, ప్రతి ప్రజాహృదయం
వీరందరి ఐకమత్య బలమే నవ తెలంగాణ బలం
బంగారు తెలంగాణా సాధనకు పనికొచ్చే హలం
పరస్పరం రాజకీయ పోరాటం హేయం
బంగారు తెలంగాణా నిర్మాణమే మన ధ్యేయం





**డా. మడికొండ ప్రవీణ్‌కుమార్**
డా.బి.ఆర్.కె.ఆర్.ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల,
సంజీవరెడ్డి నగర్, ఇ.ఎస్.ఐ హాస్పటల్ ఎదురుగా,
హైదరాబాద్. చరవాణి: 9849271601

126

# స్వేచ్ఛ

ఆరు దశాబ్దాల కల అంకురించిన రోజు
పది జిల్లాల తెలంగాణ అవతరించిన రోజు
అమర వీరుల త్యాగం ప్రతిఫలించిన రోజు
సమరంతో భాగ్యనగరాన్ని సైతం సాధించిన రోజు
మన భాష మన సంస్కృతి పలకరించిన రోజు
ఆత్మగౌరవం అభిలాష ప్రస్ఫుటించినరోజు
గళంలోని గరళం సమసిపోయిన రోజు
మనతో మనం మమేకమై ముచ్చటించినరోజు
నేడు తెలంగాణ తల్లి సంపూర్ణంగా ఆవిర్భవించిన రోజు
నా హృదయ విహంగం స్వేచ్ఛగా ఎగురుతున్న రోజు





డా. మల్ల అంజయ్య శతావధాని
వికారాబాద్, రంగారెడ్డి జిల్లా.
చరవాణి: 9849592494

# 127

## నా తెలంగాణ

సీ. గౌతమి కృష్ణలు నా తల్లి గళసీమ
ముత్యాల హారమై ముద్దు గూర్చ
సింగరేణి గనులు శిఖలోని కురులన
తాండూరు బండలే తల్లి పాద
పీఠమై లోకాల ప్రీతిని గూర్చగా
నా పది జిల్లాలు నాకమనగ
అదిలాబాద్ నలమల అందాల అడవులు
బృందావనమ్ములై విందుగూర్చ

తే.గీ. పాడిపంటల నెలవయ్యె పరమ సాధ్వి
శాంతి సహనాల వెలుగొందె సత్యవర్తి
దశదిశల యందు వెలుగొందె ధర్మకీర్తి
నా తెలంగాణ తల్లికి నతులొనర్తు

సీ. మంజీర నాదాలు మదికింపు గూర్చగా
తుంగభద్రా నది తొంగి చూడ
శ్రీరామ పాకాల చింతలే దీర్చగా
పచ్చపచ్చని పైరు పరవశింప
తోటలు బంగారు కోటలై విలసిల్ల
బతుకమ్మ బోనాలు బయలుదేర
కొమ్మకొమ్మల యందు కోకిలల్ కోరిపాడ
బృందావనమ్మని డెందమలర

గీ. నిత్య కళ్యాణ శోభలు నింపు గూర్చ
నా తెలంగాణ తల్లియె నవ్యమయ్యె
కాంతి చిందించు అందాల కళల రేఖ
అమ్మ భారతి చెంతన అలరు కొమ్మ

సీ. పాల్కుర్కి బమ్మెర పంపగుణాఢ్యులు
నా తెలంగాణలో నాది కవులు
యాదగిరి భద్రాద్రి శ్రీ ధర్మపురి రాజ
రాజేశ్వరాదిగ రమ్యగుడులు
శాతవాహనమేటి సార్వభౌములు కాక
తీయ నవాబుల దివ్యనేల
సమ్మక్క సారక్క సర్వాయి పాపన్న
కొమురము భీమన్న కొలువు నేల

తే.గీ. పానగల్లును కుండిన పట్టణమ్ము
పర్ణశాలయు వెలగంద బాసరలును
రాయగిరి భోనగిరినంత రాచకొండ
ఓరుగల్లును రామప్ప చార్మినారు
తీరు తెన్నుల వర్ణింపలేరు యెవరు

సీ. హైటెక్కు అందాలు అలరించు బంధాలు
గ్రీను ఫిలీం సిల్కు గ్రేటరనగ
శాస్త్రీయ విద్యల స్థానమై శారదా
హారమై వెలుగొందు హైద్రాబాదు
కనకాభిషేకాల కంపినీ తతులతో
రమ్యమై వెలుగొందు రంగరెడ్డి
గండిపేటోషను గచ్చిబౌలీ క్రీడ
క్షేత్రాలు చిత్రాలు చెప్పతరమె

తే.గీ. చక్కనైనట్టి సాలారుజంగు శాల
నెహ్రు జంతుప్రదర్శన నెన్నతరమ
భాగ్యనగరమ్ము మనకున్న భాగ్యరేఖ
మన తెలంగాణ రాష్ట్రము మణుల పంట

సీ. స్వాతంత్ర్య ఫలములాస్వాదించకనుముందె
ఆంధ్ర విశాలాంధ్ర అవతరించె
అరువదేండ్లుగ తెలంగాణ రాష్ట్రమ్ములో
వారి పాలన అనివార్యమయ్యె
సిద్ధాంత కర్తయౌ శ్రీ జయశంకరు
చింతించి చింతించి చివరి దశలొ
చంద్రశేఖరు వల్ల సాధ్యమునిదియని
దీవించి యుద్యమ దిశను దెలుప
కల్వకుంట్ల గదిలి కదనాన దూకగా
సకల జనులు వెంట సాగిరాగ
కోదండ రాముడు మేధావి వర్గాల
ధూందాముల సభల దూకిరాగ

తే.గీ. జూను రెండవ తేదీన మేను పొంగ
నవ్య తెలగాణ రాష్ట్రమ్ము నడచివచ్చె
అమ్మ సోనియా కృపవల్ల ఆగకుండ
అఖిల లోకాలు నిదిగని హర్షమొందె

తే.గీ. ఆత్మ బలిదానములు ఆగి ఆత్మ పొంగె
అమ్మ బంగారు తల్లియై అలరు కొరకు
చెరువులెల్లను మన కల్పతరువులయ్యె
ఆసరాదిగ పథకాలు అలరుచుండె
మనదు ముఖ్యమంత్రి కెసియార్ ఘనతవల్ల

**డా. యస్. చెల్లప్ప**
అధ్యక్షులు, యస్.టి. విచారణ సంఘం,
తెలంగాణ రాష్ట్రం
చరవాణి: 900022766

128

## విజయచరిత్ర

గోదావరి కృష్ణమ్మ
కొప్పునున్న పెనుగంగ
పాదాలు దీవించు
బంగారు తెలంగాణ
బౌద్ధ దమ్మ సెలయేరు
పారిన మా పుణ్యభూమి
సామాన్యుల హక్కులకై
సమ్మక్క సారాలమ్మలు
జతకట్టిన కురుక్షేత్రం
గొల్లకొండ నవాబులు
కుదుర్చుకున్న హైద్రాబాద్
విశ్వశాంతి నగరం
అది విశ్వానికే శజఖరం
వలసవారి పాలనలో
వాడిన మా చిరుమల్లె
యువతీ యువకుల రక్తముతో
మచ్చబడ్డ స్వచ్ఛ సీమ
అందరమూ ఒకరన్న పాలకురికి
అణచివేత తగదమ్మ ఐలమ్మ
జలమూ జంగిల్ జమీన్లే
గిరివాసుల బలయన్న కొమరం భీం
దాశరథి కాళోజీ జయ శంకర్ల
కలలన్నీ నెరవేర్చ
కల్వకుంట్ల చంద్రన్న
బాటలలో నడుస్తున్న
బంగారు తెలంగాణ
వికాసం నీది వేగం నీది
ఇక విజయం నీదే చరిత్రా!





**డా.ఎస్. రఘు**
ఫ్లాట్ నెం. 49, 3-10-32 ఆర్.టి.సి కాలనీ, రామాంతపూర్,
హైదరాబాద్-500013
చరవాణి: 9848208533

129

# పునర్నిర్మాణం

వాక్యానికి, వ్యాఖ్యానానికి
విరామ చిహ్నాలు ఉన్నట్టే
కాలానికి, యుద్ధానికి
విరామ చిహ్నాలు ఉంటాయా?
యుద్ధం ముగిశాక
పునర్నిర్మాణకాలమే
అసలైన యుద్ధం!
ఇన్నాళ్ళుగా కురిసిన
దుఃఖ వర్షం వెలిశాక
క్షణాల్ని ఆనందబాష్పాలుగా
మలచుకోవాలనే తపన
మనసు లోతుల్లోకి
పాతాళ గరిగ వేసి
పోగొట్టుకున్న అనుభవాల్ని
అందుకోవాలనే అన్వేషణ!

జీవన అగాథాల్లోని
పూడికను ఎత్తి వేయాలనే ఆశయం
ఎదురుగా కనిపించే
స్మారక స్థూపాలు
రేపటి కలల తీరాలకు చేర్చే
దీపస్తంభాలు!
మచ్చగా మిగిలిపోయిన గాయం
పోరాట పురస్కారపతకంగా మెరుస్తుంది
ఎండిపోయిన నెత్తుటి మరక
రేపటి యుద్ధానికి
పతాకమై పిలుస్తుంది!
శాశ్వత యుద్ధ శిబిర కాలం మీద నడుస్తూ
మనసును జమ్మి చెట్టుగా
మార్చుకుంటేనే చరిత్ర మారుతుంది!
బతుకు పాలపిట్టలా ఎగురుతుంది!!





డా. యం. లక్ష్మణాచార్యులు
జి.హెచ్.ఎం.సి.
హైదరాబాద్

130

# జయ్ బోలో...

జయ్ బోలో... జయ్ బోలో
జయ్ జయ్ బోలో... జయ్ బోలో
తెలంగాణ వీరుడు, నిజమైన నాయకుడు
కెసిఆర్ అన్నకూ జయ్ జయ్ బోలో జయ్ జయ్ బోలో
తల్లి తెలంగాణకు ముద్దు బిడ్డ ఎవరు రా
బడుగులకు, దళితులకు పెద్ద దిక్కు ఎవరురా
తెలంగాణ సాధనకై పోరాడిన దెవరు రా!!!....
ఇంకెవరు? వేరెవరు?
కేసిఆరే మన కేసీఆరే ॥తెలంగాణ॥
అరువదేళ్ళ కలలన్నీ నిజం చేసి నిజం చేసి
అమరుల ఆశలకూ ప్రాణం పోసి ప్రాణం పోసి
దోపిడికి, రాపిడికి కళ్ళెం వేసి కళ్ళెం వేసి
మన రాజ్యం మనదిగా చేసిందెవరూ? ఇంకెవరూ?
వేరెవరూ కేసీఆర్ మన కేసీఆర్ ॥తెలంగాణ॥
ప్రొఫెసరు జయశంకరన్న సహకారంతో
ఆ మహనీయుని దివ్య స్ఫూర్తితో
వేయి మంది అమరుల బలిదానంతో
తన గమ్యం చేరుకున్న దెవరురా? ఇంకెవరూ?
వేరెవరురా?
ఇంకెవరూ? వేరెవరూ? కేసిఆరే మన కేసీఆరే
జయ్ బోలో జయ్ బోల్ జయ జయ బోల్
కేసీఆర్ సారుకూ జయ్ జయ్ బోల్



**డా. పల్లా రత్నాకర్**
కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్.
చరవాణి: 040–2754010

131

# సంతోష సంబురాలు

**నా** బంగారు తెలంగాణ
ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా
నలిగిన నా తెలంగాణా
పరవారి రాజ్య పాలనలో
వాడిన నా తెలంగాణా
అడుగడుగునా జరిగే అరాచకం
మనవారికే అన్యాయం, అన్యాయం
అడుగడుగునా జరిగే అక్రమం
లేదెక్కడ క్రమం, అంతా వక్రమే
నలుదిశల నేడు మనసారా
నవ్వుతుంది, నవ్వుతుంది
విరబూసిన పువ్వుల
రువ్వుతుంది, రువ్వుతుంది
లేవిక వేధింపులు, సాధింపులు
ముందున్నవి సంతోష సంబరాలు
అదిగదిగో ఎగురుతుంది తెలంగాణా
పతాకం అల్లెత్తున నీలి వర్ణ అంబరాన
ఇద్దరు శివులు, చంద్రశేఖరుడు (కెసిఆర్)
జయశంకరుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయ
విద్యార్థుల దండుతో కలిసి సాధిచ్చిరి
కలలు కన్నబంగారు తెలంగాణ

**డా. రాపోలు సుదర్శన్**
ఇంటి. నెం. 4-1-64/1, నింబోలి అడ్డ,
కాచిగూడ, హైదరాబాద్. చరవాణి: 9441779688

132

## ప్రక్షాళన

అలల కొంగును నేలపై పర్చుకొని
సోయి లేక నిద్రిస్తున్న ముత్తైదువలా
మసిబారిన నేటి మూసీ అలనాటి ముచుకుందా నది
ఉభయ సంధ్యల్లో మూసీపై నింగిలో
పక్షుల తోరణాలు నదీ రాణికి మకుటాలు
మలి సంధ్యలో నయాపుల్ నుంచి హైకోర్టు వైపు
చూస్తే నదీమ తల్లికి సూర్యుడేబొట్టు
సమృద్ధి జలనిధి కలకలలతో
ఒడ్డెంబడి చెట్లతో, తీరొక్కపిట్టలతో
కళకళలాడే ఏనదైనా అనాదిగా అనాథ కాదు
అందుకేగదా నది ఒడ్డునే నాగరికతలు ఆవిర్భవించినై
మూసీ సాక్షిగనే హైదరాబాదు మొలిచి నిలిచింది
ముసి ముసి నవ్వుల మూసీ నీళ్ళతోనే తరించిందీ
నగరం మాతాతలు స్నానమాచరించింది
మా అమ్మల తరం బట్టలుతికిందీ మూసీలోనే
మూసీ ఒడ్డుపొంటి కూరగాయల పంట ఒకనాడు
పశుగాసానికి కొదవలేదు నేటికీ
వనితామతల్లులాడిన బత్కమ్మలను
అలల ఊయలల మీద ఒయ్యారంగా ఊపుతూ
మోస్కెళ్ళేది మూసే
వినాయక నిమజ్జనానికి నిలయంగా నిలిచిన
జ్ఞాపకాలు మాతరం బాల్యానివి
మూసీకి దక్షిణాన చాదర్ ఘాట్‌లో
పీర్ల తండై మతాన్నెంచక, కులాన్ని చూడక
అక్కున చేర్చుకుందీ మూసీ
ఈ ప్రాంత నివాసులు కాలం చేసినా
ఖననం చేసేది మూసీ ఒడ్డు నున్న
శవాలఘాటో, అంబర్ పేటో మరోటో, మరోటో
మా పూర్వ తరాల అస్థికల్నీ
నిమజ్జనం చేసింది మూసీ జలనిధి హృదిలోనే
అక్షయపాత్ర పాత్ర పోషిస్తున్న మా మూసీని
వినాశకాలే విపరీత బుద్ధి ప్రదర్శితమైనట్లు
క్రూరాతి క్రూరంగా విషకన్యను చేసింది వలస పాలనే
వ్యర్థ జలాలనూ, పదార్థాలనూ పారుతూ
నది నదినంతా ఎంత విషం విషమించిందంటే
దుర్గంధపు ఖడ్గం ముక్కుపుటాలపై దాడిని
ప్రకృతి ఎన్ని సార్లు వరదలతో ప్రక్షాళనకు పూనుకున్నా
బాగుపడలేనంత స్వచ్ఛతకు దూరమౌతూనే ఉంది
మూసీ మురికి గుర్తుకొస్తే చాలు
యాటలోలెనే జర్రిస్తున్నరు జనం
సమృద్ధి జలకళ చూసిన మేం
నీళ్ళు లేని కల్లోలాన్ని కలలోనైనా ఊహించలేం
పారనందుకు మూసీనదిలో నీళ్ళు
మా కళ్ళలో కారుతున్నై కన్నీళ్ళు
గీ ముర్కిపోయి మళ్ళెప్పుడు పార్తయో నీళ్ళు?

డా. రూప్‌కుమార్ డబ్బీకార్
5-5-212/5, సాయికృప అపార్ట్‌మెంట్, ప్లాట్ నెం. 102,
పటేల్‌నగర్, నాంపల్లి, హైదరాబాద్-01 చరవాణి: 9177857389

133

# ఇసుక దారుల్లో వెలుగు రేఖలు

సముద్రంలోంచి సన్నని ఇసుక తోడి తీరాన పడేసినట్లు
మన తెలంగాణ... ఒక తీరానికొచ్చింది
ఏ మాట కా మాట...
అలల హోరులో నిశ్శబ్దాన్ని కుడ్యంగా చుట్టూ కట్టుకున్న
ధీశాలి
చేరువనే ఉన్నట్టు... ఒక కదలిక అనుభవిస్తాం
ఆర్తిగా చూస్తే ఇసుక పొదివి పట్టుకున్న పాద ముద్రల్లో
తెలంగాణ చరిత్రవి ప్రౌఢ రేఖలు
పాద ముద్రల మీద పాదాన్ని ఆన్చి
ప్రేమగా గుజ్జనగుళ్ళు కట్టుకునే అమాయకపు
లేప్రాయపు ఆత్రుత...
మసక చీకటి నుంచి... మసక వెలుతురులోకి ప్రయాణం
ఇసుక రేణువులను ఒకటొక్కటిగా పేర్చి...
పాలపుంతలను ఉట్టిమీది ముంతలోకి దింపడమో
ఆకాశగంగా ప్రవాహాలను సిబ్బిలోంచి
కూరాటి కుండలోకి వార్చడమో...
ఇక తొలకరి వాన కురవాల్సిందే, పునాస గాలుల్లో సేద
దీరాల్సిందే
ఇసుక నదుల్లో మరుగున పడిన
తెలంగాణ ముత్యాలను వెలికి తీద్దాం
తొలి తప్పుల సమాధానాలను తొలగిద్దాం...
తొలి సమాధానాలను అబద్ధం చేద్దాం
ఇసుకను స్వప్న స్తంభాలపై తొడిగి
అద్భుతమైన సాకార నిర్మాణం సృష్టిద్దాం
ఇంతకాలం పాత అబద్ధపు సమాధానాలకు
సమాధానపడిపోతూ వచ్చాం
ఇక కంటిలోని నలక నేలకు రాలింది
ఇసుక రేణువులు ఒక దానితో ఒకటి జత కలిసి
పునర్నిర్మాణానికి సిద్ధమవుతున్నాయి...
శ్వాసకోశంలో ఎక్కడో ఆశ ఊపిరి పోసుకుంటున్నది...
బడి చివరి గంట మోగింది
నాలుగ్గోడల మధ్య...
తరగతి గదిలోని పిల్లలు ఆకాంక్షల మైదానంలోకి
పరిగెడుతూ...
భుజాన మోయబడిన ఎండమావుల్ని వదిలించుకుని,
అక్షరాల తట్టలను నెత్తిన మోస్తూ...
ఇసుక కుప్పలవైపు పరిగెడుతూ...
వారి రక్త స్పర్శతో చిక్కదనాన్ని పుంజుకున్న ఇసుక
చూపు...
ఇక చీకటి దారుల మీద కాదు
రేపటి భవిష్యత్తు రహదారుల మీద...
తెలంగాణ నేలపై ప్రవహించే వెలుగు రేఖల మీద...

డా. వడ్డేపల్లి కృష్ణ
1-5-62/3, చైతన్యపురి, హైదరాబాద్-50
చరవాణి: 9246541699

134

## కవిత-భవిత

"ఆకులందున అణగిమణగి
కవితకోకిల పలుకవలెనోయ్!"
అన్నాడు నాటి మేటికవి !
'చెట్టుపై చెలరేగిరేగి
వట్టి కవితలు వాగవలెనోయ్!'
అంటున్నాడు నేటి పోటీ కవి!
గొంతెత్తి అరిచే వాడే
గొప్పవాడననుకుంటున్నాడు!
ఏదో సంఘం ఏదేదో 'సంగమం'గా
భుజాలు చరిచే వాడే
సమస్తం అనుకుంటున్నాడు !

కాలం మారింది !
కలం-కాగితాన్ని నెట్టుకుంటూ
"నెట్టు" కవిత్వంగా మారింది!
కాలంతో పాటు
కవితా మారింది !
కాని
సామాన్యుడి భవిత మాత్రం
చావలేక - బతకలేక
దళారీల 'నెట్టు' లోనే చిక్కి
గిలగిలా కొట్టుకుంటోంది

**డా. వాణి దేవులపల్లి**
2-6-1485, శ్రీనివాసకాలని, సుమంగళి పంక్షన్ హాల్,
హన్మకొండ. చరవాణి: 9866962414

# 135

# మా వూరి చెరువు

చెరువంటే మా వూరి నుదువు
చెరువంటే మా ఊరు బతుకు దెరువు
చెరువంటే మా ఊరు సిన్నోల్ల ఆటల మద్దెల దరువు
చెరువంటే మా వూరి బతుకమ్మ సంబరాలకు నెలవు!
చెరువంటే మా ఊరు పట్టు చీరె జల్తారంచు
చెరువంటే మా ఊరు గొర్లకు బర్లకు ఆటవిడుపు
చెరువంటే మా ఊరు పాలబుగ్గల బర్ల పోరగాండ్లకు
అమ్మపాలిండ్లు
చెరువంటే చెన్నంగిపిట్టలకు, నీటికొంగలకు,
బుడుబుంగలకు
అమ్మ చీరకొంగు!
చెరువంటే మా ఊరు!
ఎండిపోతున్న చెల్కలకు, చేన్లకు చెంపపెట్టు!
చెరువంటే మా ఊరు మంచి నీళ్ళ బాయిలకు ఆయువు
పట్టు!
ఎండాకాలంల గూడా వూరాన ఊరు దాహాన్ని తీర్చే
కనికట్టు!
చెరువంటే మా వూరి సంతోషపు చెంగలువ పూదండ!
చెరువంటే మా వూరి అక్షయ కుండ!
చెరువంటే మా ఊరు చేతనావస్థకు ఎప్పటికీ
తీపి ఇగిరిపోని చెరకు గడ!

డా. వి.ఆర్. శర్మ
103, ఆకృతి అనెక్స్, జిక్ కాలనీ, సనత్‌నగర్,
హైదరాబాద్. చరవాణి: 9177887749

## 136

# నేల వెన్నెల కాయని

అపజయాల తుపానుల కెదురొడ్డి
యుగాని కొకటిగా
ఈ నేల సాధించుకున్న దొక విజయం
రక్త ప్రవాహాల పోరాటాల
చరిత్ర కాసారంలో
అలలైన ఉద్యమాలు
నురగలైన ప్రాణాలు
ఎవరికి వాళ్ళు
తామే జయించామని
జనం జయించారో లేదో
ఎరుకకు ఎక్కువకాలం పట్టకపోవచ్చు
నిరంతర యుద్ధాల భూమిలో
ఇప్పుడు ముగిసింది ఒక సమరమే
రేపటి సూర్యుడు ఎలా ఉదయిస్తాడో చూడాలి
విముక్తి సందర్భం కోసం
కౌగిలించుకున్న పురుగులు
సీతాకోక చిలుకలవుతాయా
గుంటనక్కలూ తోడేళ్ళూ
ఆక్టోపస్‌లూ అనకొండలూ అవుతాయా
విశ్వరూప సందర్శనం - వీలయినంత త్వరలోనే
గుంపులో కలిసిపోయిన జీవాలు
మందలోంచి ఇళ్ళలోకి
మళ్ళీ వస్తాయేమో చూడాలి
ముళ్ళ కంపల్లో చిక్కుకున్న పతంగాలు
రెక్కలు చిరిగిపోకుండా స్వేచ్ఛగా
ఎగురుతాయేమో చూడాలి.
బయటి శత్రువుల్ని జయించడానికి
ఇంటి శత్రువుల్ని కూడా హీరోలను చేసుకున్నాం
అన్ని రంగులూ కడిగేసి
ఇక అసలు రంగులతో నిలబెట్టాలి
ప్రజలు సర్వస్వాన్ని ఒడ్డినా
ఫలితం పరులపాలు కావడం విద్రోహం
ఇది దక్కన్ పీఠభూమి
ప్రజలకు ఏమీ దక్కని పీఠభూమి
ఇకనైనా స్థానిక జాతులకు
స్థానిక వనరులన్నీ దక్కనీ
వాళ్ల అధికారాలూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ వర్ధిల్లనీ
సంస్కృతులూ భాషలూ విలసిల్లనీ
మంచితనాలూ మానవత్వాలూ వెల్లివిరియనీ
సుఖశాంతులతో ఈనేల వెన్నెల కాయనీ.

డా. విప్లవ్ దత్ శుక్లా
3-4-723/45/జిఎఫ్, జిహెచ్ఎంసి పార్క్ ఎదురుగా,
లింగంపల్లి, భర్కత్‌పుర, హైదరాబాద్.

137

## ఊరు యాదికొస్తది...!

ఉండీ ఉండీ
జబ్బమీద చినిగిన
అంగి యాదికొస్తది -
బట్టలకంటిన
ఎర్ర మన్ను యాదికొస్తది -
ఊరు యాదికొస్తది...!
పచ్చటి పొలంల
గట్టుమీద నడిచేది
జారుకుంటా... సంబలాంచుకుంటా...
పెసరకాయలు పంచుకొనే
సోపతిగాండ్ల ప్రేమ యాదికొస్తది -
ఊరు యాదికొస్తది...!
పొట్టు పొట్టు అయిన పుస్తకాలు
పల్గిన పల్క...
బలపం తున్కలు యాదికొస్తయి...
నాయన దెబ్బలు..
అమ్మ ఓదార్పులు యాదికొస్తయి...
ఊరు యాదికొస్తది...!
ఊరేగింపులు... రాత్రిసభలు...
దస్ర సంక్రాంతులు యాదికొస్తయి -
ఆత్మగల్ల మనుషులు..
కాలంతోని మారని మైలురాళ్ళు..
ఊరూరు సుట్టాలయిన యాదిలో
స్వర్గం వస్తది... ఊరు యాదికొస్తది...!
ఊరు యాదికొస్తే ప్రాణం లేసివస్తది!!

డా. వి. శంకర్
6-39, దేవి విహార్, దేవునిపల్లి, కామారెడ్డి-503 111,
నిజామాబాద్. చరవాణి: 9440798954
ఇ-మెయిల్: s@gmail.com

138

# అక్షర సైనికులం కావాలి

కాలం సంఘర్షించి
ప్రభవించిన కొత్త చరిత్రతో
కరచాలనం చేసి నడిచిన
దారి తప్పని పాదచారులం.. మనం!
చీకట్లు నింపిన
వలస మేఘాలను తరమడానికి
ఆకాశం బద్దలయ్యేలా
ఆగ్రహించిన, అరచిన
ఝంఝూ మారుతాలం... మనం!
అవనతం చేయబడ్డ
ఆత్మగౌరవాన్ని
పెయ్యంతా పూసుకొని
శిఖరమెత్తు చిందేసిన
ఆటగాళ్ళం, పాటగాళ్ళం, మాటగాళ్ళం... మనం!

మన శిరస్సులపై
అక్షింతలు కురిపించి
ఉదయించిన ఒక స్వప్నానికి
జెండాలమై నిలిచిన
నిలువెత్తు రూపాలం... మనం!
త్యాగాల పునాదుల మీద
మనం నాటిన మొక్క ఇప్పుడిప్పుడే
నిటారుగా ఎదుగుతోంది!
అది పుష్పించి, ఫలించి
నీడనివ్వడానికీ, ప్రాణమివ్వడానికీ
మనం తోటమాలులం కావాలి
సరిహద్దులు కాపలా కాసే
సైనికులం కావాలి... మనం
అక్షర సైనికులం కావాలి!



**డా. వి. త్రివేణి**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాల,
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్-503322
చరవాణి: 9951444803

139

# తెలంగాణ తొలి కిరణం

తెలంగాణ తొలికిరణం...
ఆరు దశాబ్దాల చీకటి తెరను చీల్చి
నవజీవనానికి కొత్త రేఖను
ప్రసరించింది
అధఃపాతాళ ఆశల ఊసులను
అనంత శిఖరాలకు ఉసిగొల్పింది
పూర్వవైభవం-నేడు అరచేతిలో అగ్ని కణమైయింది
ప్రస్తుత చైతన్యం-రేపటి బంగారు కాంతిని వెలిగించింది
భవిష్యత్తు స్వర్ణం-నవతెలంగాణ నిర్మాణానికి నాంది
పలికింది

రాజకీయ సంక్లిష్టతకు
రాజ్యకాంక్ష ఛేదనానికి
రుధిర ప్రవాహమైంది
నవోదయ శక్తి సాధనకు
తెలంగాణ ఆత్మ గౌరవం
ఆహ్వానం పలికింది
అశాంతి.... ఆవేదన...
సంకుచిత సమరం విడనాడి
కొత్త చిగుళ్ళు... కొత్త రసాల
రోచిస్సు

డా. వెలుదండ సత్యనారాయణ
మహబూబ్‌నగర్. చరవాణి: 9441162863

140

## చదువుకోకపోయినా సరే!

చదువకపోయినా సరేరా!
చావకు నాయనా! పోయిరారా!
మార్కులు రాలేదని మూర్ఖుడవై పోకు
దోస్తులు నవ్వుతారని కస్తీ పడబోకు
మునిగిపోయేదేమి లేదురా! నాయనా!
ముంచిపోకురా కొంపను.
ప్రేమలు పెళ్ళిళ్ళని కాముకుడైపోకు
కళ్ళు మూసుకుపోయి కాలమై పోబోకు
మగువనిప్పు మరచిపోకురా! నాయనా!
మనసు పాడు చేసుకోకురా





**డా. వెల్చాల కొండల్‌రావు**
ఇంటి. నెం. 11-4-654/2, రెడ్‌హిల్స్, నియర్ నీలోఫర్ హాస్పటల్,
లక్డికాపూల్, హైద్రాబాద్-04. చరవాణి: 9848195959

141

# మాటిద్దామా ఈ రోజు?

మిత్రమా! ఇదేమి చిత్రమిది?
మనిషి తనను మొదట జయించక
ప్రతి దానినీ, ప్రతివానినీ, ప్రకృతినే
జయించ గోరుతాడు పదేపదే ఇదేమిటిది?
మనిషి తన ఆత్మను కోల్పోతూనే
పరమాత్మను వెదకుతాడు పదే పదే,
తాను కూడా విలువలను ఉపేక్షిస్తూ, కాలరాస్తూ,
ప్రక్కవాడి వైపు వ్రేలు చూపిస్తాడు పదే పదే,
ఇదేమిటది? మిత్రమా!
మనిషి సౌఖ్యాన్నే సంస్కారమనుకొంటున్నాడు
నగరీకతనే నాగరికత యనుకొంటున్నాడు
వస్తుసేవ సౌకర్యాలే అభ్యున్నతులనుకొంటున్నాడు
"అర్థమే" జీవితార్థమనుకొంటున్నాడు, ఇదేమిటి?
మిత్రమా! మనిషి, విద్యంతా అధ్యయనం చేసీ చేసీ,
అభ్యసించీ అభ్యసించీ సైన్సంతా వడబోసీ వడబోసీ,
విద్యనూ, సైన్సునూ ఇలా అర్థం చేసికొంటున్నాడేమిటిది?
"సత్యం" కొరకైన వాటిని కేవలం "నిత్యం"
కొరకనుకొంటున్నాడు,
"కళ" కొరకైనవాటిని కేవలం "కలిమి"
కొరకనుకొంటున్నాడు
ఇన్నేళ్ళు పెరిగిన మనిషి ఇంతేనా మరీ?
మనిషికి మనిషే చింతేనా మరి?
సముద్రం సృష్టిస్తుంది "సునామీలు"
మనిషి సృష్టిస్తున్నాడు, అసూయా ద్వేషాల,
దోపిడీ దొంగతనాల, ద్రోహ దౌర్జన్యాల,
అన్యాయ అరాచకాల, అవినీతి అన్యాయాల సామాజిక
సునామీలు
సముద్రం మనిషి సృష్టిస్తోన్న కాలుష్యంపై తిరుగబడి
కల్పిస్తోంది సునామీలు
మనిషి తోటి మనిషి అమానుషంపై తిరగబడి సృష్టిస్తున్నాడు
అనేకానేక తిరుగుబాటు సునామీలు అంతా
అయోమయంగా ఉంది
ఎవరిది నీతో, ఎవరిది అవినీతో, ఎవరిది బీజమో,
ఎవరిది వృక్షమో, మొదలేదో, తుదేదో తెలియకుండా
అంతా గజిబిజిగా, గందరగోళంగా వుంది
మిత్రమా ! కాస్తాగి, ఆలోచించి, వెనుదిరిగి చూచి
బేరీజు వేసుకుందామా వీటినీ రోజు?
పాపానికి కోపం కారణమా కోపానికి తాపం కారణమా
రెండింటికి అజ్ఞానం, అహంకారం కారణమా?
దేనికేది కారణం, ఏది మూలం? ఏది పర్యవసానం
కాస్త నిదానంగా, నిజాయితీగా ఆలోచిద్దామా మరి
ఈ రోజు? "మహాత్ముడు" వాంఛించినట్లు
ప్రకృతి సునామీలను అరికట్టుటకు మనం మన
దుష్కృతి సునామీలకు అడ్డుకట్టవేద్దామని,
పాపాల కొరకు కోపాలను, కోపాల కొరకు తాపాలను,
తాపాల కొరకు అజ్ఞానాలను, అహంభావాలను
అరికడతామని మాటిద్దామా మరి ఈ రోజు?

డా. వెంకన్న గారి జ్యోతి
1-1-698, పద్మానగర్, రోడ్ నెం. 3, నిజామాబాద్.
చరవాణి: 9440459222

142

# బీడు భూముల పూచు తంగేడు పూలు

పసుపు కుంకుమల సొగసు పరిఢవిల్ల
స్త్రీల సౌభాగ్య సౌందర్య సేసలలద
పుణ్యముల పంటగా వెల్గు పొటమరించి
బీడు భూముల పూచు తంగేడు పూలు

జగతి ముత్తైదువులనెల్ల తాకగాను
పరమ శివుని మేనిలో నర్థభాగమైన
పార్వతీదేవి కరుణకై పరితపింప
బీడు భూముల పూచు తంగేడు పూలు

చిన్నివన్నియల పులమి చిగురులెత్త
హరితవర్ణాలు ఒడలెల్ల నలదికొనుచు
నీలి గగనంపు సోయగాల్ వాలినట్లు
బీడు భూముల పూచు తంగేడు పూలు

ఒడలు గగనమనంగనీ పుడమినిండి
పసుపు రంగుల మెరియుచు మిసిమి గూర్చు
తారకలవోలె తలపింప ధరణి మురియ
బీడు భూముల పూచు తంగేడు పూలు

రాష్ట్ర సిద్ధికై తపియించి రాజసమున
త్యాగమూర్తులై వెలిగిన అమరులట్లు
దివ్యబతుకమ్మలై నీటతేజమలర
బీడు భూముల పూచు తంగేడు పూలు.

డా. శంకరమంచి శ్యాంప్రసాద్

# 143

## తెలంగాణ పరిమళం

ఆకాశంలో సింగిడేసినట్లు
తంగేళ్ళన్నీ విరబూసినట్లు
చెర్లన్ని అలుగుబోసినట్లు
తెలంగాణ ప్రాంగణాన
అడుగడుగున సంబరాలు
ఐలమ్మ వడిశాలను విసిరినట్లు
సమ్మక్క సారక్కలు బతుకమ్మను పేర్చినట్లు
రుద్రమ్మ శివమెత్తి బోనమెత్తినట్లు
తెలంగాణ ప్రాంగణాన
అడుగడుగున సంబరాలు
కాళోజీ కవితా కాహళిని పూరించినట్లు
రావెళ్ళ తెలంగాణ గీతం పాడినట్లు
జయశంకరు ఉద్యమ పాఠం చెప్పినట్లు
చంద్రశేఖరు చరిత్ర గతిని తిరగరాసినట్లు
తెలంగాణ ప్రాంగణాన
అడుగడుగున సంబరాలు
స్వాతంత్ర్యం వచ్చినట్లు
సమరగీతం పాడినట్లు
పిల్లాపాపలు ప్రగతి పథం పట్టినట్లు
తెలంగాణ తేరు తేజంతో కదిలినట్లు
తెలంగాణ ప్రాంగణాన
అడుగడుగున సంబరాలు
అమరుల త్యాగ పతాకాలు
అడుగడుగున కన్పించగ
ధూంధాం కళాకారులు
విజయగీతికలు విన్పించగ
తెలంగాణ స్ఫూర్తి సురభిళ
పరిమళాలు ఇంటింటా విరజిమ్మగ
తెలంగాణ ప్రాంగణాన
అడుగడుగున సంబరాలు.



**శాస్త్రులు రఘుపతి**
నిజామాబాద్.
చరవాణి: 94937105572

## 144

# అర్థప్రదాయిని

తే.గీ. శ్రీకరమ్ముగ ధన ధాన్యసిరులు గురియ
నిత్య సౌభాగ్య సంక్షేమ నిరత దీక్ష
నొప్పు స్వాతంత్ర్య పాలన నొసగు గాత
కామితార్థవినుత తెలంగాణ తల్లి

తే.గీ. ఈ తెలంగాణ శరణార్థ ఈప్సితార్థ
తేనెలొలికెడు చిరమౌ తేనెపట్టు
ఆంధ్రసీమల నాయకులాక్రమించి
మోస పుచ్చిరి భాష పేరాస జూపి

తే.గీ. ఆకలైనచో అన్నమ్ము నడిగి తినుము
నీదు క్షుద్బాధ నడ్డుకోలేరెవండు
అలమటించెడు వారి క్షుదార్తి వ్యధను
తీర్చరాదను నీతి ఏతీరు జాటు

తే.గీ. ప్రాంత భేదాలు కలుగవు భాష వలన
తెలివి తేటలు దోపిడీ నిలయమగుచు
ఆధిపత్యమ్ము జూపించి అణచి వేయ
ద్వేషభావమ్ము పెట్రేగె భాషదేల ॥

తే.గీ॥ ఇచట పుట్టిన ప్రతి బిడ్డ నింగిరిజు
లట్టు లతి వక్రబుద్ధితో నణగద్రొక్కి
మోసపుచ్చెదరని యెంచి చేసినట్టి
ములికి నియమాల మట్టిలో కలిపి రెపుడో

తే.గీ. తమిళ నాయకులాంగ్లేయ దమననీతి
నాంధ్ర సీమలనణచగా అప్పుడేల
పారతంత్ర్యమ్ము వలదంటు వేరుపడిరి
మరల తమిళుల పంచకే చేరరాదో

తే.గీ. ఇప్పుడైనను సీమాంధ్రులిచ్చగించి
తమిళ సాంగత్యమును గోర తగవు గాదొ
కోరినంతగా వృద్ధి చేకూరగలదు
భరతజాతి విశాలమౌ భాషదేల

తే.గీ. బానిసత్వపు సంకెళ్ళు వదిలిపోయే
పీడ విరుగడ ఐపోయె ప్రియము జరిగె
ఉద్యమింపగ పూనుడో యువకులారా
కనుచు పులకింప మన తెలంగాణ తల్లి

తే.గీ. కార్మికులు కన్న కలలు సాకారమొందె
ఆరుగాలము శ్రమియించు అన్నదాత
మదికి ముదమొందునట్లు సమ్మతమ్ము గూర్ప
కలిమి పులకింప మన తెలంగాణ తల్లి
'జయహొ తెలంగాణ'

డా. సమ్మన్న ఈటెల
చరవాణి: 9885238654

# 145

## ప్రగతి కేతనం

మానవ జీవితం
మహా సంగ్రామం
పోటీ ప్రపంచాన
పోరాడి గెలవాలి
మెట్ట వేదాంతాన్ని
పక్కకు నెట్టాలి
స్వయంకృషితోనే
తలరాత మార్చాలి
యువ శక్తి ఏకమై
ఉప్పెనై కదలాలి
కార్యశీలతతోనే
కదనాన దూకాలి
ఉరుములా ఉరమాలి
మెరుపులా మెరవాలి
అవినీతి భూతాన్ని
అంతమొందించాలి
కాళిలా లేవాలి
కత్తినే దూయాలి
కలియుగ కీచకుల
కనుగుడ్లు పెరకాలి
పులిలా గాండ్రించాలి
పంజాని విసరాలి
దోపిడీ దొంగల
చీల్చి చెండాడాలి
కులమత భేదాల్ని
కుచ్చితాలుగా ఎంచి
నవ తెలంగాణకై
నడుం బిగియించాలి
భోగాల్ని వీడాలి
త్యాగాల్ని చేయాలి
రాష్ట్ర సౌభాగ్యమే
ధ్యేయమై సాగాలి
ప్రతి పౌరుడు
యోధుడై నిలవాలి
ప్రగతి కేతనాన్ని
గగనానికెత్తాలి!

**డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి**
ప్లాట్ నెం. 69, సాయినగర్, దేవరకొండరోడ్,
నల్గొండ-508 001. చరవాణి: 9885682572

146

## ఉత్సవం

అభిమన్యుల ఉసురు తగిలి
కౌరవ రౌరవ పాచికలు ధ్వంసమయినవి
కట్ల పాముల తలలు చితికిపోయినవి
చెరసాలయిన వసంతం రంగులు చిమ్మింది
ముక్కోటిని ఒక్క తాడుగ పేనిన విద్యుత్తేజమా
ఎత్తుగడలకు తాడెత్తు పైన నిలిచిన జాతి కేతనమా
కుట్రలు కూలిపోయినవి
స్వప్నం సాకారమయింది
కొలువులను పణం పెట్టి ముచ్చెమటలు పట్టించిన
అన్నా
ఉస్మానియాను కోటగా నిలిపిన తమ్మీ
నిర్బంధం నివ్వెరపోయింది
గ్రహం వీడింది
ఉరితాడుల కలిసిన కొడుకా
శత్రువు చుట్టూ ఉరి బిగించినవ్
కల ఈడేరింది
తలొంచుకొనిపోయే దర్భలు కూడా నినదించినవి
నేల ఇగురేసింది
గాలి మనది
నీరు మనది
భూమి మనది
నిర్మించిన నగరు మనది
పైన నింగి మనది
శిరసెత్తిన సకల జనులు
మోడు చిగురేసింది
నచ్చని దారిలో ఎడ్లు మొరాయించినయి
బొగ్గు భగ్గున మండింది
పగిలిన ప్రతి ముక్కా అద్దమయింది
ఆయుధమయింది
ఎండిన వాగు నురగలెత్తినది
స్వరమైన గాయం అలుగుబోసినది







డా. సిహెచ్ ఆంజనేయులు
చరవాణి: 702531453

147

# మా తెలంగాణం మాగ్గావాలి

ఎన్ని నిరసనలో అన్ని రకాల నిరసనలూ చేశాం
సబ్బండ వర్ణాలై 45 రోజుల సమ్మె సృష్టించింది
ప్రపంచంలో ఈనేలవాసులే
రాస్తారోకోలు బంద్‌ల మీద బందులూ
చేశాం జై తెలంగాణ పిలుపుపై పిల్లాజెల్లా ఊరువాడలు
ఉద్యమ కెరటాలై పరిగెత్తుకొచ్చినయ్ 69లో 369, ఐతే
నేడో 1000 మందిని దాటింది వీళ్ళంతా
ఉద్యమవీరతారలు
రేపటికి ఉజ్జ్వల తారల్లా వెలుగులు వెదజల్లాల్సినవాళ్ళే
నిండు ప్రాణాల సమర్పణంలో త్యాగాల
అమరగానమైనారు.
సమైక్యాంధ్రులకు చీమకుట్టినట్టులేదు, జాతిస్పర్శ
అసలేలేదు
ఏరోజు ఉస్మానియా భగ్గుమంటుందో లెక్కేలేదు
అదెప్పుడూ యుద్ధకాండను తలపిస్తూంది
సాగరహారాలతో 'జనహోరెత్తించాం'
మిలియన్ మార్చ్ పాస్ట్ రణ తెలంగాణమయ్యింది
రజాకార్ల లడాయి చూసినం గడీల బురుజుల చరిత్ర
అంశాన్నీ మరిచిపోలేదు
మా కళాకారులు వూరు వాడవాడలు ధూంధాం
చైతన్య కళాగీతాలై వెలిగించని దినమే లేదు
అమ్మా తెలంగాణ జనని మాచెమట చుక్కల ప్రజల
కోరికలు నెరవేర్చే రోజెప్పుడొస్తది
ఆఖరి మోఖాలు, దోఖా బాజీతనం చూసి
దక్కాలు తిని తిని వున్నోళ్ళం
మా ఆత్మీయుల అన్నా, తమ్మీ అనే రాగాల వాన
కురిపించే తోటి రాగాలను పలికిస్తుంది
బ్రతుకమ్మ ఆటపాటలై మానవహారాలను సంబురంగా
హస్పైదులయ్యింద్రు
ఆత్మగౌరవ నినాదమైన మట్టి మనుషుల చరిత్ర మాది
మీరు హింసా ప్రేరకులు మేము శాంతిప్రేమికుల
వారసులం
అన్నదమ్ములుగా విడిపోదాం, తెలుగు వాళ్ళుగా
కలుసుందాం
తెలంగాణ ఋతువులో కొత్తపొద్దు పొడుపయ్యింది
ఇంకా సమైక్యాంధ్ర జూటాకోరు రాగాలొద్దు
మాది దేశీయం, మాజానపదమే మాకు కావాలి
కలుసున్నందుకు తెలుసుకొన్న సరిక్రొత్త పాఠాల
రహస్యాలు తెలుసుకొన్నాం
అందుకే ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ కావాలని
ధోకాభాజీ లీడర్లను నిలబెట్టి ఇపుడు
అడుగుతం. మాకు మేమే పాలించుకుంటమని
ఆత్మగౌరవంతో తలెత్తుకుంటమని
ఒక్కసారిగాదు వందసార్లు చెపుతున్న
మా తెలంగాణ రాష్ట్రం మాగ్గావాలని :
జై తెలంగాణ జైజై తెలంగాణ గా వర్ధిల్లాలని





**డా. యాకూబ్**
1-7-9/1/3, చైతన్యపురి, హైదరాబాద్-60
చరవాణి: 9849156588
ఇ-మెయిల్: kaviyakoob62@gmail.com

# 148
# శాంతి ప్రవచనం

మనం కోరుకునే శాంతి
గుండె చప్పుడుకు, తుపాకి మొనకు మధ్య
ఊగిసలాడుతుంది
మనం కోరుకునే శాంతి
మరణించే మనిషి చివరి శ్వాసలాగా
మంచం మీద ఉంది
మనం కోరుకునే శాంతి
ఒక మందిరం, ఒక మసీదు
ఒక ప్రేలుడు, ఒక కాల్పుల విరమణ, ముగింపు,
కొనసాగింపు
గాయపడిన పాట, రాలిపడిన విద్యుత్ నినాదంలా
ఉంది
నిషేధింపబడి గొంతులోనే సమాధి అయ్యే
కవితాపాదంలా ఉంది
గడ్డాలు పెంచిన ముల్లాల సాధువుల
శాంతి ప్రవచనాల రాగాల మధ్య
మన శాంతి ఉక్కిరిబిక్కిరిగా ఉంది
మన శాంతి
కాలువిరిగి దేకుతున్న కుక్కపిల్ల నడకలా
కుంటి కుంటిగా ఉంది
రేషన్‌లో శాంతిని ఈ రాజ్యం ఎంత కేటాయిస్తే అంత
అంతే సంచిలో తెచ్చుకోవాలి
అంతటితోనే సరిపుచ్చుకుంటూ గడపాలి
ప్చ్...






డా. యల్లంభట్ల నాగయ్య
ఇంటి.నెం. 2-7-1342, విజయపాల్‌కాలనీ, వడ్డేపల్లి, హన్మకొండ,
వరంగల్లు, తెలంగాణ-506370. చరవాణి: 9441479388

149

## చూస్తున్నాం ఆశగా!

వచ్చింది తెలంగాణ రాష్ట్రం
తెచ్చింది మనలో ఆనందం
ఏర్పడింది నూతన రాష్ట్రం
ఆశయాలకు పడుతుంది కాలం
సంస్కృతీ సంప్రదాయాలు
బొడ్డెమ్మ నట్టింట నడవాలి
బతుకమ్మ కలకాలం నిలవాలి
పోచమ్మ మైసమ్మలు దీవించాలి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్టు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు
తెలంగాణ ప్రజా కవులు
సోమన్న, పోతన్న, వరదన్న
దుర్గన్న, కాళన్న, దాశరథులు
ప్రపంచ ప్రజల చేత చదవబడాలి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్లు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు
తెలంగాణ యోధులు, వీరులు, ధీరులు
కొమురంభీం, దొడ్డి కొమురయ్య మొగిలయ్య
చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలక్కలు
చరిత్ర పుటలకెక్కి స్థిరంగా వుండాలి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్టు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు

పట్టాలు పొంది ఎదురుచూస్తున్న యువతకు
కావాలి వేవేల కొలువుల జాతర
కలగాలి వారి జీవితానికి నిండు భరోసా
ఉపయోగపడాలి ఉత్తమ పౌరులుగా సమాజానికి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్టు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు
మన నీళ్ళు బీళ్లన్నింటిని తడపాలి
పచ్చని పైరులు నిండుగా రెపరెపలాడాలి
రైతన్నల కళ్ళల్లో వెలుగులు నిండాలి
దేశసౌభాగ్యానికి నిలువెత్తుగా నిలవాలి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్టు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు
మన నిధులు మన జీవితాలకుపకరించాలి
బీదలు, దీనులు భద్రంగా కలకాలం బతకాలి
ఆకలిచావుల మాటసలే వినబడొద్దు
అందరి ఆర్థికస్థితి అందంగా ఉండాలి
అప్పుడు స్వరాష్ట్రాశయం నెరవేరినట్టు
ఆనందం మన జీవితాలలో నిండినట్టు
తెలవకనే కాలం గిర్రున తిరిగింది
తెలంగాణ వచ్చి అయింది వత్సరం
అయినా స్వరాష్ట్రాశయాలకై
ఆనందంగా, ఆత్రుతగా చూస్తున్నాం ఆశగా!





డా. దిలావర్
చరవాణి: 9866923294

# 150
# ముల్కీ

దాగుడు మూతలు దండాకోర్ పిల్లీ వచ్చే ఎలుకా
భద్రం...
ఇంగెంతకని మేం
గీ పాటల ఎల్కోలె భద్రం లేకుంట వుండాలే?
గీ దండాకోర్ పాటల దిల్లగీ ఏంద్రా అంటె
ఆటల అరటిపండన్కుంట శాత్రాలు ఎయ్య బడ్తివి.
అదేందోగని అరటిపండెప్పుడూ అర్గీజ్ మా నోటి
కందదు- శాత్రం యిసిరేసిన తొక్క మీద, కాలు
జారిపడటం తప్ప.
మొక్కజొన్న తోపులోని మేకపాల జిగిరీ దోస్తీ
ఎన్ని జన్మలెత్తితే నీకర్థమయితది?
సద్దగట్క మీన కూకోనిఎల్లిపాయ కారం, మీసం దువ్వుడు
పిర్కి పిత్తులోనివి - నీకెట్ల కండ్ల బడ్తది?
బగ బగ మండే అంబటాల్లను
సల్లమెత్కులు సల్లబర్చటం
కడుపుల సల్ల గదలనోల్లకేం ఎర్కైతది?
దినాం గివ్వీటి తోటి సోబతి కట్టెటోల్లకు
సన్నబియ్యం ముచ్చెట్లు సమజైతయా?
కన్నతల్లి పురిటివాసనసుంటిది  మా బాస, యాస!
పెంపుడు తల్లి నేవళం అత్తరు; మాకెట్ల అంటుతది?
మా అవ్వ గుండెల్ల గడ్డపారలు దింపి
'సెజ్'లని బోర్డులు గట్టితే నిలబడేటందుకు జాగ లేక
దిక్కులేని పచ్చులెక్క ఆగమాగమైపోతున్నం.
మేం చెమటోడ్చి కట్టుకున్న పుట్టల
నువ్వు బుస్సు మంట పడగెత్తితే
చీమలెక్క అగ్గం బగ్గమై చెదిరిపోతున్నం.
తెగ్గోసిన మా తల్లి నరాల కెల్లి పారే నెత్తుటి నదులకు
క్రస్ట్ గేట్లు ఎత్తి, దారి మళ్ళిత్తే
బొక్కలు దేలిన అవ్వ గోస సూసి
అల్లడం తల్లడం అయితన్నం.
దొంగలు దొంగలు వూళ్ళు పంచుకున్నట్టు
'ఫిరీజోన్' ముసుగులో దొడ్డిదారంట మూటలు దాటేత్తంటె
మాటలు రాక కామోష్‌గ తండ్లాడుతున్నం.
మా మెడకు ఆరోనంబరు బిళ్ళ తగిలిత్తే
పడిపోటానికి మేం మూర్ఛరోగులం గాదు.
నువ్వు మంత్ర నగరి సరిహద్దులు ముట్టినవ్
ఇంగ సూస్కో బిడ్డా!
పది పక్కన సున్నాను నూకిపారేసి ఒక్కటై ఎదిరిత్తే
గాదెకింది పందికొక్కులన్ని పరార్ గావాలె.
ఉప్పు బెర్రలాడినప్పుడే
మా వుప్పు మేం ఎట్ల పుట్టిచ్చుకోవాల్నో తెల్సినోల్లం.
ఇగ అల్లోడు బంతి యిల్లోడు బంతులాట బందువెట్టు.
నీ నోరు - దాస్కో మూస్కో సాంబారు బుడ్డి.
గిన్నాళ్ళ సంది యాది మర్సి సందూకలో దాసిపెట్టిన
ముల్కీ జెండాగుడ్డ యిప్పి దుమ్ము దులుపుతున్నం.
మా వతన్, మా ముల్క్ మాకు గావాలె నన్న
మా తల్లి గుండె సప్పుళ్ళు దిక్కులు పిక్కటిల్లంగ
'జై తెలంగాణ' అనుకుంట జంగ్ షురూ జేత్తన్నం.



**దాసరాజు రామారావు**
1-3-30/79, సాయి భగవాన్ కాలనీ, బిహెచ్ఇఎల్ రోడ్,
రామచంద్రాపురం, మెదక్ జిల్లా- 502 032
ఇ-మెయిల్: dasaraju@gmail.com

151

# మనిషి కళ తప్పిండు

రెండాకుల మధ్య చల్లగా దూరిన సూర్యతేజం
ఉండుండి పొడి పొడిగా రాలుతూ
ఎండబొబ్బలు పెడుతుంటది పొనాది పొంటి నడుస్తుంటే
అడుగులు పద మవ్వకుండా
పొనాది పాము ఊహల మెడకు చుట్టుకుంటది
ముద్దుగా, ముద్దగా
నేర్చి, వొల్లిస్తున్న చిలుక పలుకులకు
చిలకే నొచ్చుకుంటది
శాంతిని రెక్కల కింద ముడుచుకున్న
పావురాలను ఎగరేసినప్పుడు
పావురాలు సిగ్గుపడతయి మనిషి పల్లె నొదిలిండు
నమ్మి, నానబోసిన అపురూపమైన ఆశలు
పుచ్చి బుర్రలైనయి తను దేని మీదా
విగ్రహ వాక్యంలా నిలబడడు
అరికాలి వేళ్ళ మీదా మడమల మీద
చురుక్కుమనే సంతకం మీదా
యుద్ధభేరి మాట మీదా దిక్కుల భుజాల మీదా
అతని పేరునే మోయాలని చట్టం
చెబుతాది
విరోధ భావనా బలం విస్తరిస్తదేమోనని
రెండు కనుబొమ్మల మధ్య
వచ్చి వార్తల్ని కుప్పబోసి, భగ్గున
మండిస్తడు పాముల పుట్టలో చేరి
మాయల కోరల నతికించుకుంటాడు మల్లె పువ్వు
దిగజారుతున్న సెన్సెక్స్ కన్నా ఈ మనిషిని చూసి
ముఖాన్ని మసిబొగ్గు చేసుకుంటది
ఎవ్వరినైనా చిత్తు కాగితంతో పోల్చి
తిరుగు టపాలో పంపేస్తాడు.
అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని
చెవికి తగిలించుకుని వలల్ని, పాశాల్ని
విసురుతుంటడు మాగాణి పొలాన్ని
రింగురోడ్డు పూల దండగా మార్చి
రైతు మెడలో వేసి
శ్రద్ధగా వో కన్నీటి చుక్క సమర్పిస్తడు
చందమామ వెన్నెల పత్రాలను పంచటానికి
జీవో ఉండది ఆకసం తలెత్తుకొని
మబ్బుల మిత్రులతో విహరించే సందర్భ
మిక రాబోదని
కవి హెచ్చరిక రాసి పెట్టడు
భూ మండలమంత నోరు
గగన మండలమంత పొట్ట
రాత్రనకా, పగలనకా
అధికారం యాత్రలో, యావలో
మనిషి కళ తప్పిండు !

డి. నిఖిత

# 152
## ఆకాంక్ష

నల్లని మబ్బులతో
నిండిపోయిన ఆకాశంలో
కంటికి కనబడని సూర్యులెందరో
దాగి ఉన్నట్లు ఎందరో ప్రతిభావంతులు
ఉన్నారు నా తెలంగాణమున
రేపటి నా తెలంగాణమున
అక్షరాస్యత మెండుగ కలిగి
కరువు కాటకాలు అసలే లేని
కులమత భేదాలు లేని
కూటికి గుడ్డకి నీళ్ళకు గుడిసెకు
దిక్కు మొక్కు వాళ్ళులేని
కోపతాపాలు లేని
శాంతి దయ కరుణ కలిగి
జాలి దయ కరుణ కలిగి
జాతి నీతి ఆభరణాలుగా
ఏదేశానికి వెళ్ళిన
మేమంతా భారతీయులమని
చాటి చెప్పే తెలంగాణ
పచ్చని పైరుల నిలయమై
కీర్తి కాంతులను ప్రసరింపచేసి
అసమానతలు లేని
అసంతృప్తులు లేని రాష్ట్రంగా
ఎదగాలి నా తెలంగాణ

**డి. రమాదేవి**
వర్ని మండలం జి.ప బాలుర ఉ.పా,
నిజామాబాద్. చరవాణి: 9885284712

153

# తెలంగాణ జెండా

ఎగిరింది ఎగిరిందీ తెలంగాణ జెండా
మన ప్రజల మనసుల్లో పౌరుషాలు నిండా ॥ఎగిరింది॥

ఏది కులం ఏది మతం ఎవ్వరిదీనేలా
తరతమ భేదాలను చూస్తారు ఏలా
కలిసుండి కలిమిని పొందుదాం ఇలా ॥ఎగిరింది॥

చెరువులన్ని బాగుచేసి సిరులన్ని పొందుదాం
బడులన్ని బాగుచేసి భవిష్యత్తు మార్చుదాం
మిషనులెన్ని వచ్చినా విజయఢంక మోగిద్దాం ॥ఎగిరింది॥

ఆసరాఫించన్లు, ఆహారభద్రతలు
ఉచిత వైద్యములు, ఉన్నతవిద్యలు
కళ్యాణ లక్ష్మి చిరుదరహాసములు ॥ఎగిరింది॥

హరిత తెలంగాణ, వాటర్ గ్రిడు ఫథకాలు
ఇంటింటి లోగిళ్ళ గోదావరి గళగళలు
జల సంరక్షణకై వనముల పెంపకాలు ॥ఎగిరింది॥

మన ధనం, మనజలం అందరమూ పొందుదాం
మనసత్తా చాటి జగతికి వెలుగవుదాం
చెడుదృష్టి తగలకుండా మన రాష్ట్రం నిర్మిద్దాం ॥ఎగిరింది॥

**దండ్రె రాజమౌళి**
హన్మకొండ
చరవాణి: 7702649820

154

## ఆశనే శ్వాసగా

కరువు భూతములేని
చెరువులన్ని నీళ్ళతో
పొలాలన్ని పచ్చని
పైర్లతో కళకళలాడి
రైతన్న ఇంటిలో
సిరులు నాట్యమాడి
సెజ్‌ల పేరుతో
బక్కోడి భూమిని
కబళించని తెలంగాణ
కావాలె రేపటి తెలంగాణ!

ఓపెన్ కాస్ట్ లల్ల పేదోడి
పొలాలని బుక్కపెట్టని
కరెంటు కోతలకు తావులేని
పురుగుల మందే రైతుకు
పెరుగన్నము కాకూడని
బట్టలు నేసే నేతన్నల
పొట్టలు కొట్టని తెలంగాణ కావాలె!
నిరుద్యోగుల నిరాహారదీక్షల్లో
కనిపించని ఉద్యోగాలు
స్థానికేతరులు తన్నుకుపోని
తెలంగాణకావాలె!!





దార్ల రామచంద్ర
6-1-108/241, ఎన్‌జీవో కాలనీ, మహబూబాబాద్,
వరంగల్ జిల్లా, చరవాణి: 8143455526

155

## వ్యవసాయమే మనిషి జీవననాదం..!

ప్రజా ఉద్యమాల నేపథ్యం
ప్రభవించెను మన తెలంగాణ
దేశభౌగోళిక యవనికపై
నవ్యపథంలో బంగారు తెలంగాణ
రాష్ట్ర రథం నడుస్తుందా?
పల్లవించిన తెలంగాణ
వివక్షలేల పక్షపాతం లేని
విలక్షణ విధానాల ఆచరణ
వ్యూహానికి అదును - సేద్యానికి పదును
ఏరువాకకు శిక్షణ
వ్యవసాయపు రక్షణ
రైతుల సేద్యం - దళారుల భోజ్యం
అప్పుల ఊబిలో రైతునేస్తం
మరణ యాతన
సంక్షోభంలో ఎవుసం.
దిగుబడి తగ్గి - ధరలు అగ్గి
మద్దతు కరువు - సాగు బరువు
మా ఊరి మట్టిలో పుట్టి
మా నట్టింటిలో పెరిగి
మా ఊరుకు జవం జీవం చెరువు
జనపదాలకు బతుకు చెరువు (దెరువు)
చెల్లాచెదురైన చెరువులు, కుంటలు
మరమతు ప్రక్షాళన
జాతి జీవితాలకు బహుదా రక్షణ
చెరువులు నిండితే జలకళ
పల్లె పల్లెకు తిరిగి రావాలి బతుకు కళ.
నెర్రెలు పారిన మడికట్టు మాగాణీలు
జలజల కాల్వలు గలగల పారాలి
తెలంగాణ సస్యశ్యామలమై నిలవాలి
సరస్సులన్నీ శిరస్సు నెత్తుకొని
మా పొలంలో వరికంకులై వర్ధిల్లాలి
సుజలాం సుఫలాం
పూర్వవైభవ సఫలాం.
జలాశయం నిండుగా
గ్రామీణ బతుకు పండుగ
పిల్లా పాపలు పల్లెల్లో
బతుకు పచ్చ పచ్చగా నిలవాలి
ఒక్కొక్క నీటి బిందువు
కావాలిప్పుడు గ్రామజీవన బిందువు
వ్యవసాయమే
దేశ జీవన నాదమై కలకాలం నిలవాలి.

**దాసరి వెంకటరమణ**
5-5-13/4, సుష్మ థియేటర్ ప్రక్కన, వనస్థలిపురం,
హైదరాబాదు-500070. చరవాణి : 040-24027411, 9000572573
ఇ-మెయిల్: dasarivramana@gmail.com

156

## బంగారు బాట

దేవుడు
ఆపదలో
ఆదుకుంటాడు
-అమ్మ చెప్పిన మాట
ఆపదలో
ఆదుకునే వాడే
దేవుడు
- అనుభవం నేర్పిన మాట

రెండో మాట
కావాలి మొదటి మాట
తథ్యంగా అదే
బంగరు తెలంగాణకు బాట

దాసరి రంగ

# 157

## సర్వం తెలంగాణం

నా ఆట నా పాట నా మాట
నా యాస, నా భాష, నా గోస, నా ధ్యాస
నా ప్రాణం నా గానం
సర్వం తెలంగాణం
నా కట్టు నా బొట్టు నా తిట్టు
నా ఒట్టు, నా జుట్టు
సర్వం తెలంగాణం
నా కరువును తీర్చె చెరువు
మన ఆదెరువు కల్పతరువు
సర్వం తెలంగాణం
పూజించే పుట్ట, నా ఊరు చెరువు కట్ట
ఎరుకలి అల్లె బుట్ట, సాలె నేసె మన బట్ట,
ఉప్పరి తట్ట
సర్వం తెలంగాణం
నా ప్రాణం నా గానం నా ధ్యానం
సర్వం తెలంగాణం

**దాసోజు జ్ఞానేశ్వర్**
నల్లగొండ జిల్లా.
చరవాణి: 9912138152

158

# రైతులదే తెలంగాణ

**ఓ** కవీ!
నేనూ! రైతును
తోటిరైతుల ఆత్మహత్యలు చూసి
గుండె చెరువైన వాణ్ణి
ధైర్యంగా "బతుకడం-బతికించడం" తప్ప
మరేమీ నేర్వని నేలతల్లి బిడ్డను
జర నా ఈ మాటలను
నా రైతు సోదరులకు కవితగా అల్లి
ధైర్యం చెడొద్దని చెప్పవూ!
భవిష్యత్‌పై భరోసా కల్పించవూ!
మాయా పరదాలను కప్పి
వరదగా నీటిని మల్పుకపోయినపుడు
బొట్టు బొట్టుగా కూడి ఉప్పెనలా చెలరేగి
ఆంధ్ర జలరాక్షసులను ముంచిన సుడిగుండాలం
నా రైతు సోదరులకు
జర ఈ విజయగాథను గుర్తుచెయ్
లోహంగా కొలిమిలో ఎంత కాగినా
అవసరమైన రూపాన్ని అందుకోవడానికే
దెబ్బమీద దెబ్బలైన సుత్తిపోట్లకు
కొడవళ్ళు, గొడ్డళ్ళు లొంగినట్లుంటే తెలిసొచ్చింది
పదునెక్కే ఆయుధాలకు ఓర్పు ఎంత అవసరమో....
కొడవలి పిడినుంచి పిడికిలిగా బిగిసేవరకు
పొలం గట్టుమీది తుమ్మచెట్టూ
వలస బల్‌రక్కసి పొదల తుదనంట నరికిన గొడ్డలికి
కామ నిచ్చిన ఇంటిముందరి వేపచెట్టూ పడుతూ లేస్తూ
ఎన్నిసార్లు విరుగుతున్నా ఇగురేస్తూ
తడబడినా నిలబడటమెలాగో నేర్పినయ్
ఇంతలోనే అంత అధైర్యమా!
నిన్ననే కదా ఏరువాక తోలింది
ఇప్పుడేనాయె విత్తనమేసింది పంటకోసుకొనే దాంక
పండుగ సంతోషం చల్లారనివ్వొద్దు
రైతుబిడ్డలం మనం
పచ్చనాకు సాక్షిగా చెబుతున్నా
పొద్దు పొడవడం తోటే బొట్టు బొట్టుగా కరిగి
మాయమయ్యే మంచులా
తెలంగాణ రాష్ట్రావతరణతో మన కష్టాలు కన్నీళ్ళు
కరిగిపోయే రోజు దగ్గర్లోనే వుంది
చెలకా చెట్టూ పనిముట్టూ మనం
అందరం కలిస్తేనే "మన తెలంగాణం"
అరిష్టాలను ఎదుర్కొంటేనే "నవ తెలంగాణం"
కాలం కలిసొచ్చేదాంక పదును చల్లారకుండా
అదును దాంక ఆగి ఉండడం రైతులుగా మన ధర్మం
అప్పుడే అందుకొని అందిస్తాం, అనుభవిస్తాం
బంగారు తెలంగాణం





**ద్యావరి నరేందర్‌రెడ్డి**
5-5-27/1, ధనగర్‌గల్లి, తాండూర్, రంగారెడ్డి జిల్లా-501 141
చరవాణి: 9848995597

159

# ఊరచెరువు

రైతన్నల మేలుకోరి ధ్యానించును ఊరచెరువు
అమ్మవలే ఆదరించి బ్రతికించును ఊరచెరువు
జనమంతా ఒక్కటయ్యి కబ్జాలను ఎదిరిస్తే
కలకాలం స్వేచ్ఛగానే శ్వాసించును ఊరచెరువు
నేటికైన ప్రగతి కోరి పూడికనే తొలిగించగ
నీరు నిండి జలకళనే మెరిపించును ఊరచెరువు
గట్టులన్ని మరమత్తుకు నోచుకుంటె ఘనతగాంచు
నీటినంత తన ఒడిలో పాలించును ఊరచెరువు
చుక్క చుక్క ఏకమయ్యి ఉషారుగా ప్రవహిస్తే
బీడులలో పంటలనే పండించును ఊరచెరువు
చేపకైన చేనుకైన తనే కదా ఆధారం
సిరులనొసగి కృషీవలుని మురిపించును ఊరచెరువు
మహిళలంత పాడుకుంటు ఆడుకుంటు దరిచేరగ
తన ఎదపై బతుకమ్మను లాలించును ఊరచెరువు
తెలంగాణ చరిత్రతో తన బంధం స్వర్ణమయం
రారాజుల రాజసాన్ని తలపించును ఊరచెరువు
మిషన్ కాకతీయ వచ్చి మేలు చేసె ఓ 'నరేంద్ర'
వలసలింక వద్దంటూ నినదించును ఊరచెరువు.



**దామరకుంట శంకరయ్య**
3-4-183, సదరన్ స్ట్రీట్, కరీంనగర్-505 001
చరవాణి: 9440876788

160

## కావాలి! మారాలి!రావాలి!!

పూతపూయని కాతకాయని
కల్తి విత్తనాలు సరఫరాలేని
పురుగు చంపని రోగము కుదుర్చని
కల్తి మందులు అమ్మనీయని
కరువు కోరలలో చిక్కినలిగెడి
సన్నకారు చిన్న రైతులు
పనిదొరకక తిండిలేక
వలసపోయే కూలిప్రజలు
ఆదుకునే వారికోసం
ఎదురు చూసి వాడే బ్రతుకులు
రైతు ఆత్మహత్యలు భవిష్యత్‌లో చూడని
రైతు తెలంగాణ రావాలి
అగ్గిపెట్టెలో పట్టే చీరలు
నేసినట్టి నేత కారులు
తెలుగు ఖ్యాతిని ప్రపంచాన
చాటి చెప్పిన వస్త్రకారులు
పట్టెడన్నము కరువై
చస్తువున్నరు బ్రతుకు బరువై
కావాలి చేనేత తెలంగాణ
సంపూర్ణ అక్షరాస్యత
సాధిస్తా మంటుంద్రు
హైస్కూలు చదువులు
అందుబాటులో లేని
మండలాలు ఉన్నవింక
స్కూలంటే తెలువని
ఊళ్లెన్నో ఉన్నవింక
మారాలి విద్యా విషమస్థితి
ఒక్క గుక్క నీటికై
కిలోమీటర్లు నడవాలి
రక్షిత మంచి నీటి పథకం
వచ్చి ఎన్ని ఏండ్లు దాటిన
దాహంతో అలమటించే
పెక్కు ఊళ్ళు గల ఈ ప్రాంతం
తెలంగాణ ప్రజల దాహార్తి తీరాలి

**ధాత్రిక సాయి రఘునాథ్ చరణ్**
ఫ్లాట్ నెం. 205, బృందావన్ రెసిడెన్సి ఓల్డ్ సఫిల్‌గూడ,
సంతోషిమానగర్, రంగారెడ్డి, తెలంగాణ-500056.
చరవాణి: 7702396293

# 161

## ఉషస్సు

ఉద్యమాల ఉప్పెనలో ఉద్భవించిన గానమా!
అమరవీరుల త్యాగఫలమున మూర్తీభవించిన రూపమా!
ప్రణమామి అన్నది ప్రపంచం వీక్షించగా నీ వైభవం
ధన్యోస్మి అన్నది అనంతం, దర్శించి నీ ఘన చరిత్రం
కోటి రత్నాల వీణవు నీవు,
నీ స్వరానికి మించిన తేనెలు లేవు
ఆత్మీయ భరితం నీ యాసనీ పదాల్లో ప్రేమను
గుర్తించలేదు తెలుగుభాష

తెగులు పట్టిన తెలుగు భాషకు
పగలు చూపే వెలుగు నీది
పసిడి కాంతుల నీ ఉషస్సున వెలుగనున్నది వీథి వీథి
మరోస్వర్ణయుగం వైపు సాగుతుంది నీ పయనం
నీ కీర్తి పతకం వైపుకు చూస్తున్నది ప్రతినయనం
అదిగో వినిపిస్తున్నది జయహే అంటూ జన ధ్వానం
ప్రతి గొంతుక పలుకుతుంది తెలంగాణ అను గానం

దెంచనాల శ్రీనివాస్
ఫ్లాట్ 342, ఫస్ట్ ఫ్లోర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి,
హైదరాబాద్-72. చరవాణి: 9848326617
ఇ-మెయిల్: s@gmail.com

## 162

# భస్మసారంగి

కోటిచింతల నేలకొండ నెక్కొండ
విశ్వకర్మిడి పద్నాలుగో సద్దుల బత్కమ్మ, ఆడ ఈశ్వరుడు
చలనాచలన ప్రపంచాల్ని ముంచేయబోతున్న చిట్టిశిరః
చీకటి జలపాతాలు, నరసమ్మతల్లి నులకతాటి నాట్యం
భూగోళాన్ని బిడ్డ చిటికెనేలుపై సంగడాడిస్తున్న
నరసయ్య తండ్రి పోరగాండ్లతో చెడుగుడేందే
బురదమడుగుల్ల దస్తీ బిస్తీ జొన్న వానల్ల కొమ్రమ్మ కుస్తీ
బర్రెల వెన్నెల అడవికాసిన బాల్యం కన్నీటి తీర్థం ఆకలి
డాకలి జగజ్జననీ రైటా రాంగా మన జన్మలు
తొమ్మిదేండ్ల యావజ్జీవ పెండ్లి ఖైదీ
ముప్పైయేండ్ల భర్తగత్తరనుండి విముక్తిపొందిన
పన్నెండేళ్ళ పాలపిట్టా
మరిది బ్రహ్మయ్యను పటాయించిందా
మయుడునేసిన హీనజఘనం ఇంద్రజాలం
సాంధ్యదేహం సంపెంగకంపు
నువు గత్తరపోయి నిప్పులుపూచిన శోకవనం అదృశ్య
సముద్రంలో
అరణ్యాలు కలిసి కరిగిన మహాకాలంనుంచి
ఖాసింరజ్వీ కన్నేసిన కమ్మరి సువర్ణ స్వర్ణసుందరీ
చెట్టెక్కిన మీసంపంచెల మగరుద్రమదేవీ
బావలబాడిశెలనుంచి మొగుణ్ణి కాపాడుకున్నవా సావిత్రీ
అర్ధరాతిరి బెజవాడబండిలో వెంకట్రామయ్య విప్లవం
ఆదుకున్నదానే
దుర్గమ్మ దుర్గంల రాంబ్రహ్మం రాజయి యేలిండు
రాణీ
ఆడనే ఉంటే నా మహాస్వప్నం సాకారమయ్యేదికాదా--
బ్రహ్మేశ్వరిరంగశాల
పన్నెండు పూళ్ళల్ల పన్నెండిళ్ళు కట్టి అమ్మేసిన
పరమాదర్శ సంచారజంటా
శని పెదనాన్న రూపంలోనా గుడంబా రూపంలో నానే
వచ్చింది
ఒడ్డెరెంకమ్మ పందులకొట్టంల అద్దెకుంచిండా
సత్యహరిశ్చంద్రా చంద్రమతీ
పదమూడు బండ్లల్ల పరుగెత్తించిన ఇరవై ఆరుపుట్ల
ధాన్యమేమాయె
రాగి ఇత్తడి బిందెలు గంగాళాలు ఎటుబోయె
బాయిల పడేసిన ఎండిబంగారం ఎవడెత్కబోయిండు
కరువు అలకరిగిరి మేరలెగ్గొట్టిన రైతులు
ఉలిబాడిశె చేతబట్టి ఊళ్ళుతిరిగిన మైఖెలాంజిలో
లియొనార్డొ డావిన్సి-- నా మయబ్రహ్మయ
నాట్లేసి కుప్పగొట్టి పరిగెలేరి కుడుంలమ్మి కుటుంబానికి
దేహాన్ని అన్నం చేసి తినిపించిన ఆడశిబి చక్రవర్తి--
నా మదర్ థెరిసా ఈశ్వరమ్మ
చెట్టు చెట్టు చుట్టూ తిప్పించిన కడుపునది ఎడారి



గుట్టగుట్టకు పొర్లుదండాలు
గుండెకు తెచ్చుకున్న గునపదడల జబ్బు
గోపయ్యసారు పసరు పనిచేసిందా మేడారం గద్దె నీ
బంగారం మెచ్చిందానే
జంపన్న మల్లబుట్టిండా శ్రీనివాసాచార్యై
సమ్మక్క సరళకుమార్యై సారక్క విజయకుమార్యై
దొంగల దీపోత్సవంలో చుక్కల్ని లెక్కపెడుతూ
చంద్రుల్ని పోగొట్టుకున్న
నీ గర్భంలో ఆవిరైన పద్నాలుగు ఉమ్మనీటిసంద్రాల
నరకఘోష నాదే
సృష్టినుంచి కాదది ఆదిదేవుడి అక్షయపాత్ర
నేనెప్పటికీ దాటలేని నేను దిగగానే లాక్కొనిపోయే
నదివేనువ్వు
నీ ఎల్లప్పటికీ నయంకాని, కోయలేని నీ స్తనకేన్సర్
పుండును నేను నా విభిన్న వేలవేణువుల వెదురుచెట్టూ
నువ్ చేసిన దీపంతలు దీపాల్ని కాల్చుతున్నయి
నువ్వాడుకున్న నా బెల్లంకాయను తినేశారెవరో ఎందుకో
తల్లీ నీ కడుపుమాయల కస్తూరితోట నా కవిత
తండ్రీ నీ పక్కటెముకల పాట
"గీతార్థసారము వినుడీ'' అని లోకానికి ఎలుగెత్తిన నీ
గానమాట "జీతభత్యములొద్దు దేవయ్యా, నా కొలువు
నాకివ్వు ఏసయ్యా'' అన్న నీ వాక్యం ఉసురు
డెబ్బైఐదేండ్లు దీపంపెట్టి సాకబోసి అన్నంముట్టినవా
ఏ భగవంతం నా బట్టా నీ నిత్య అగ్ని దుఃఖంమీద నీళ్ళు
కప్పలేదేమే
ఆడబిడ్డల పెళ్ళి భయం అర్ధరాత్రి రోజూ నీతో నిద్రలో
మండపాలు తవ్వించింది
కుటుంబంకోసం నీ త్యాగాల్ని విని పురుషుడిపై నీ
ప్రేమను కని భూలోకం విడిపోయిన స్త్రీలు తిరిగి భర్తల్ని
చేరుతారు పరమ పురుష ద్వేషులూ
నీ నాల్కలపై మొలిచిన నగ్నసత్యం బ్రహ్మజెముడు
అడవులను నా నాల్కలకు పురిట్లోనే అంటుగట్టినదానా
రంగసాని తింటున్నదే నన్ను
పదభంగసాని బలి రోజు కొంచెం
నేనెప్పటికీ కనుగొనలేని సరోవరానివే నువ్వు
నేనెన్నటికీ ఆరంభించలేని వాక్యానివి
చిలుంబట్టిన రిక్తరక్తం మాది

మంత్రం జపించు శపించు మన్నుబోసి దీవించు
ఏమిచ్చాము మేమేమిచ్చాము
మొగుడు, దేవుడు నీ చేతుల్లో ఓడిపోయారా
జీవనజూదమాడి
మూడు శకునులు ఆడి శిలువెక్కించినయా నిన్ను
అమ్మా నీ మునుంగానాలు పద్నాలుగు లోకాలకు
ముక్కాలజ్ఞానాలు
నీ ఆజన్మ అనునిత్య ప్రసవవేదికే నా అనురాత్రి
హరివిల్లు రంగపేటిక సోమ్లానాయక్ స్వప్నసుందరీ
నా శాస్త్రాలు బహుకుశాలు నీతిసర్పాలు
నా అదృశ్య మాధురీదీక్షిత్
నువు పురుషాంశ లేని సెంట్‌పర్సెంట్ స్త్రీవి
నామూడోకన్ను తెర్వకముందే నీ యవ్వన పారిజాత
పుష్పం వాడిపోయిందే క్రొత్రమేను కాయం
ఎండిపోయిందే
ఇంక ఏం చేసుకోను నా ఈ ఎముకల మాంసపు
హృదయదేహాన్ని
నలభై ఐదేండ్ల మహామోహ ప్రేమాన్ని
నా బిడ్డకు రెండో తల్లీ తండ్రీ
ఎవతి తన జన్మదేవుళ్ళ గుండె నీరుతుడ్వదో అది వారి
వీర్యాండాలకు పుట్టనట్టు
యెవడి బిడ్డలము ముగ్గురము సకలజనులము
కదలని నీ పాదాలచుట్టూ కొండలైపరిచిన శిరసు
ముక్కలధూళినాదే
తెరవని నీ కన్రెప్పల మీద ఊగని ఉరఃపంజరంమీద
కురుస్తున్న రక్తకుంభవర్షాన్ని నేనే
మిన్నంటి ఎగిసిన కాలరుద్రుడి రుంజన రవ్వలు రావాలు
రాగాలు
కళ్లల్లో సూదులు గొంతుల్లో ఖడ్గాలు గుండెల్లో శూలాలు
తల్లి నీ యజ్ఞంబు తలపెట్టినంతనే అశ్శరభశ్శరభ
బ్రహ్మాండభాండంబు పగిలిపోయెను కొడక
అశ్శరభశ్శరభ
ఆది అమ్మ బయలెల్లింది.... ఆఖరి తల్లి బయలెల్లింది....
నందినై కూర్చున్న నేను ప్రాణలింగమై కూర్చుండు నాన్న
ఆచంద్రతారార్కం ఆత్మ గుడిలోనే............
అమ్మ గర్భాత్మ గుడిలోనే..........

దేవులపల్లి రమేశ్
చరవాణి: 9963701294

163

## పువ్వుల మహాత్యమది

పాక్కిలి అయిన వాకిలల్లా
కోటి వెలుగుల వెన్నలయుతది
కూటికి లేని బతుకులల్లా
ఆత్మగౌరవ నినాదమైతది
పల్లె పల్లెలో పండుగై తది
దండిగ పువ్వుల జాతర ఐతది
ఎండిన దొక్కల ఎతలను
అలసిన బతుకుల కతలను
రాగమెత్తి నినాదమై వినిపిస్తది
పువ్వుల పూజించె సంస్కృతి నేర్పుతది
తరగని సంస్కృతి చరిత్ర తెలుపుతది
పల్లెల పసుపు వర్ణం చేస్తది
తల్లి లెక్క చెల్లి లెక్కల ఆత్మీయబంధం
పెనవేసుకుంటుంది
తల్లిపేగు బంధమది
తంగెడు పువ్వుల మహాత్యమది





**దేశపతి శ్రీనివాస్**
మాన్యతా రెసిడెన్సీ, గంగారం, చందానగర్,
హైదరాబాద్.

164

# తెలంగాణ చెరువు తీరు

తెలంగాణ చెరువు తీరు మన జయశంకరు సారూ
అలుగు దుంకి పారూ పదునైన మాట జోరు (2)
పాలు పోసుకున్న పజ్జొన్న కంకులల్ల
పైకి పైకి ఎగిరే ఆ పాల పిట్టలల్ల
మీ ఆశయాల వ్రాలూ కనిపించె ఆనవాలూ...
చరితగల్ల తెలంగాణ తల్లి కడుపులోన
సాయుధ రైతాంగ పోరు పొద్దు పొడుపులోన
వీరభూమి ఓరుగల్లు ఒడలు పులకరించె
పసిగుడ్డుగ పొత్తిళ్ళలో పిడికిలి బిగియించె
పల్లెనిండ కొత్త వెలుగు నిండి పరవశించె (2)
భద్రకాళి చెరువులోన బతుకమ్మలు మురిసె -
"తెలంగాణ"
గండమోలె ఆంధ్ర దండు దండిగ వచ్చింది
కొండచిలువవలోలె మన కొలువులు మింగింది
మర్కజి హైస్కూలు లోన మంటలు మాట్లాడె
సిటీ కాలేజిలో కొన్నెత్తురు కొట్లాడె (2)
ముల్కి పోరులోన నువ్వు ముందుకురికినావు
గైరు ముల్కి గో బ్యాకని గొంతు విప్పినావు
నిదురపోని రాతిరివై నిప్పులు చెరిగావు - "తెలంగాణ"
రక్తసిక్త చరిత్రలో అదో అగ్నికీలా
అరవై తొమ్మిది వేళ ఎగిసెను జనజ్వాలా
కన్నులలో ఆవేశం కదలాడిన రుద్రుడు
ఆధిపత్య శక్తులపై అతడు వీరభద్రుడు (2)
ఆలోచన అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు (2)
తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు -
"తెలంగాణ"
ఉద్యమాగ్ని చల్లారిన విశ్రమించలేదు
వివక్షను నిలదీయుట విస్మరించలేదు
తోడు ఎవరు లేకున్నా తొవ్వ తీసినాడు
ఆంధ్ర వలస పాపాలను రాసి పెట్టినాడు
విద్రోహం మూలాలు విప్పి చెప్పె దీక్ష
విడువని జయశంకరెపుడు తెలంగాణ రక్ష
ఆచార్య నీ కీర్తికి లేదు కాల పరీక్ష - "తెలంగాణ"
తెలంగాణ వాదాన్ని తీర్చి దిద్దినావు
మారుతున్న తరానికి మార్గం చూపావు
ఆరువదేండ్ల తెలంగాణ మనాదివె నీవు
మలిదశ పోరాటానికి పునాదివె నీవు
భావాలను వెదజల్లిన వెల్లువ వైనావు
తెలంగాణ పాటలకు పల్లవి వైనావు
ఒడిదుడుకులలో చెదరని ధైర్యమిచ్చినావు - "తెలంగాణ"
ఉద్యమమంటే ఇప్పుడు ఉరుకుతున్న ప్రవాహం
స్వాభిమాన సమరంలో జాగృత జన సమూహం
సమానత్వ విలువ కొరకు సాగుతున్న పయనం
స్వరాష్ట్ర సాధన కోసం జరుగుతున్న సమరం
ఆంధ్ర వలస పాలనకు ఇది అంతిమ చరణం
చేరువలోనే ఉన్నది చెరవీడే సమయం
ఆ ఉదయంలో ధ్వనియించును జయశంకరు
హృదయం - "తెలంగాణ"



దోరవేటి
ప్లాట్ నెం. 101, ఎస్ఎల్బి నిలయం, 1-4-938/2/ఎ, బాకారం,
ముషీరాబాద్, హైదరాబాద్-20 చరవాణి: 9866251675

165

## తల్లీ! నిన్నుదలంచి మ్రొక్కెదను...

మ. నవమాసమ్ములు మోసి గర్భమున, జన్మనిచ్చి, రక్తమ్ము పా
లవలెన్ మార్చుచు, ప్రాణముల్ నిలుపుచున్, లాలించి, పోషించి, ఏ
యవమానమ్ములనైన లెక్కగొనకన్ అందింతువే ప్రేమ!
స్తవనీయమ్మగు దైవరూపమవు మాతా! నీదు కాల్మొక్కెదన్.

ఉ. అంచిత ప్రేమతో సుతుల యాకలి దీర్చుచు, నింటివాని ప్రే
మించి సుఖమ్మునీయగను మేనిని మానుగజేసి, రోజు క
ష్టించి ఫలమ్ములిచ్చుచును సేవలు పూవుల తావివోలె నం
దించెడి రైతు తల్లికి నిదే కవితాంజలి నందజేసెదన్.

ఉ. రాతిరి నిద్రలేచి యపరాతిరి వేళల స్వచ్ఛభారత
ఖ్యాతిని నేతలందరి కయాచిత రీతిగ కట్టబెట్టగా
చేతిన చీపురందుకొని చిమ్మును మా కలుషమ్ములెల్ల స
త్ప్రీతిని మున్సిపల్ మహిళ! దేవత రూపమటంచు మ్రొక్కెదన్.

ఉ. పిల్లలకెల్ల నూడిగము ప్రేమతో జేయుచు, దారిగాచు ఆ
పిల్లల తండ్రి కోరిక లుపేక్ష వహింపక దీర్చి, కళ్ళు చి
ప్పిల్లిన కొంగునెత్తుకొని, పిల్లల మోమును జూచికూలికై
వెళ్ళెడి తల్లి! నీకు పదివేల నమస్కృతులమ్మ నిచ్చలున్.



మ. కనులన్ ఎక్సరె దీసి చూచుచును, వెన్కాడంగబోకన్ సదా
నిను నేడ్పించగ జూచు మూర్ఖులను మన్నించేవు చిర్నవ్వుతో,
అనుమానించు మొగుడ్ని తట్టుకొని, చన్నందించి నీ పిల్లలన్
కనుపాపై యెదజేర్చు తల్లివి గదా! కండక్టరమ్మా! నమో!

ఉ. గుచ్చెడి చూపులన్ దులుపుకొంచును, ప్రేమను నించు జాలి నం
దిచ్చుచు, అమ్మవోలె విసువింతయు జూపక కంపుమించు మా
ఉచ్చను, రోతనెత్తుచును ఊడిగముల్ యొనరించి, సూది మం
దిచ్చెడి నర్సు తల్లులకివే శతకోటి నమస్సుమాంజలుల్!

ఉ. వేళ్ళ ని'యంత్ర'ణా పటిమ వేగము, యాగము, యోగమయ్యి, క
న్నీళ్ళను లెక్కసేయక ననేకముగా సృజియించి, దారము
న్నోళ్ళ సుఖమ్ముగూర్చుటకు నోటికి పూటుగ బోసి, మృత్యుకౌ
గిళ్ళను మ్రగ్గుతల్లులకు కేలను మోడ్చెద బీడిలమ్మకున్.

ఉ. ఆకులు జీల్చి, ఈనెల కళాకృతు లొప్పగ తీర్చిదిద్ది, య
ర్ధాకలి నోర్చుకొంచు నొకతాపసివోలె శ్రమించి, దేవతా
నీకము సేవకయ్యి కమనీయపు బుట్టలనల్లి యిచ్చు నీ
శోకము జూచువారెవరు సోదరి మేదరి నీకు మ్రొక్కెదన్.

ఉ. కండగరుంగ దారముతొ కండెలు చుట్టుచు, నేతగోతిలో
నుండి శ్రమించు భర్తకును యోపిక సేవల జేయుచున్ కళా
ఖండములెన్నొ జేసి, యవి గట్టగలేని యదృష్టహీనతల్
గుండెలలో కెలుంకగ పొగుల్ ఘన'శాలె'ల తల్లి మ్రొక్కెదన్.

మ. గురులై వాణివిపంచి తంత్రులయి యుద్ఘోషించుచున్, జ్ఞానధీ
సరులై పల్లెలు, పట్నముల్ దిరుగుచున్, సౌజన్యమున్ బెంచుచున్
తరులై పిల్లల సేదదీర్చు మహితత్వమ్ముల్ గదమ్మా యశ
స్కరులీ టీచరులంచు మ్రొక్కెదనెదన్ సంతోషముప్పొంగగన్.

ఇరువెంటి వెంకటేశ్వర శర్మ
చరవాణి: 9441943949



## 166

# మన గొంతులు సవరించుకుందాం

కటువుగా అనిపించినా
మనమిప్పుడు కొన్ని నిజాలు మాట్లాడుకోవాలి
కండ సక్కెరకొండ జాలువారినట్లు
అచ్చతెలుగు పాల సంద్రం కుండ
ఒలికి పల్లె సెలిమెలు నిండినట్లు
తేనె మాటల బాస, తెలంగాణ యాసను
కృత్రిమ నవ్వుల మాలలా, తెచ్చి పెట్టుకున్న గంభీరంలా
దీర్ఘ సమాసాల సుడిగుండాలలో
పద బంధాల సంకెళ్ళ మధ్య బంధించింది మనం
కాదూ... పక్షులు సముద్రంలో ఈదాలని
చేపలు ఆకాశంలో ఎగరాలని
అభ్యాసాల పజిళ్ళను పేజీలకు పేజీలు పరచి
బాల్యం చేతికి అందిస్తున్నది మనమే కదూ....?
తట్లు తట్టలకెత్తి, సామెతలు వెదజల్లి
మోటపాటలు, నాట్లపాటలు
వివిధ ప్రక్రియలు విరిసిన పూదోటలా
తీరొక్క పువ్వులా బతుకమ్మ పాటలా
సాగిపోతున్న జనపద సేద్యంలో
హైటెక్ సొగసుల హైబ్రీడ్ మొక్కలు
నాటుతున్నది కూడా మనమే కదూ...?
మనమిప్పుడు ప్రశ్నించుకోవాలి
విచ్చుకున్న పత్తికాయల నవ్వులా
మొలకెత్తుతున్న విత్తనంలో
రెక్కలు విప్పుకుంటున్న చిగురాకులా
పుత్తడి రేకుల్లా పరచుకున్న
తంగేడు పూవుల పలకరింపులా తొలకరికి తడిసిన మట్టి
వాసనలా సహజమైన పదాలను
చిలుక పలుకల పరభాషా వాక్యాలమధ్య
విభక్తి ప్రత్యయాలుగా మార్చుతున్నదెవరు?
తేటపలుకుల తేనెకుండలో విచ్ఛిన్నభావాల
నీటిచుక్కలు రాల్చుతున్నదెవరు? రంగుల తెరపై విలన్
భాషలా కాకుంటే చిన్ని తెర చిద్విలాసంలో
రియాల్టీ షోల తారాగణం ఒలికిస్తున్న
వెకిలి మాటల తిట్ల దండకంలా
నవ్వులపాలు చేస్తున్నా... మౌనం ధరిస్తున్నదెవరు?
మనమిప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి
మన కలాల గొంతులను సవరించుకోవాలి
సమాజ రక్త నాళాల్లో పేరుకుపోతున్న అవాంఛిత
సంస్కృతి కొవ్వును కరిగించి మందు గుళికల్లా మారాలి
స్వచ్ఛమైన బాస, యాస రక్తాన్ని నరనరాల్లో నింపాలి.
ఇంటర్‌నెట్ వలలో చిక్కుకొని
ఇంట్లో, ఒంట్లో స్వేచ్ఛను వెతుకుతున్న
యువతను నేలపైకి దింపాలి మట్టి సుగంధాన్ని
అద్దుకున్న మేలిముత్యాల పదాలను ఏరి
బాల్యం బడిలో నింపాలి



ఇ. వెంకటేశ్

# 167

## మౌనం మాట్లాడుతోంది

మౌనం మాట్లాడుతోంది
మానవత్వం మట్టి కలిసినపుడు
మనిషితో మనిషి కరచాలనం
గత కాలపు వైభవం మాత్రమే!
రెండు రక్తపు చుక్కలు
చిందించి ఎంతమంది
నల్లవాళ్ళు వారి శరీరాన్ని
కళేబరాల్ని చేసుకున్నారో!
నా అస్తిత్వం మాయమై
ఆకాశం వరకు చిమ్మిన
చెమట చుక్కలు
ఇపుడు వర్షమై మీ దాహాన్ని
తీర్చుతున్నాయి!
చిన్నప్పుడు చెప్పిన
చందమామ కథ
పగిలిన గాజు పెంకుల్లా
చెల్ల చెదురుగ పడిన శకలాల్ల
తోస్తున్నాయి!
చరిత్ర ఎప్పుడు పునరావృతం
అవుతుంది
ఒంటరి సమూహంలో ఉన్నప్పుడు
రాత్రుళ్ళు పేలిన బాంబుల శబ్దాల్లా!
అనుమానపు చూపులతో
దేహాలను ఎక్స్‌రే తీస్తున్నారు
రక్తమాంసాలతో పాటు కాసింత
మానవత్వపు రేఖలు అస్పష్టంగా
కనిపిస్తున్నాయి!
ఆకాశమే హద్దుగా
కంఠమెత్తి విలపిస్తున్నా
మారణహోమానికి వ్యతిరేకంగా
చివ్వున చిందిన నెత్తుటి మరకల
సాక్షిగా మీ నెత్తురు వృథాపోదని
అభయ హస్తం ఇస్తున్నా

ఎడవెళ్ళి అనిల్‌రెడ్డి

# 168

## మన చెరువు

నేనొక చెరువు
నా జీవితం
ఒకప్పుడు ఘనం
ఇప్పుడు అధ్వానం
పిచ్చిమొక్కలకు నిలయం
కాకతీయులు
కన్న బిడ్డలోలె కాపాడుకున్నారు నన్ను
గొలుసుకట్టులు గట్టి
ఎవుసాన్ని బతికించినరు
నేను నిండుగా ఉన్నప్పుడు
పల్లెలు సల్లగా బతికినయి
కడుపార తిన్నయి
కంటినిండా కునుకు తీసినయి
ఎతలు, వెతలు లేని ఎవుసం నడిసింది
కరెంటు కష్టాలు లెవ్వు
కన్నీళ్ళ జాడలు లెవ్వు
ఆత్మహత్యలు లెవ్వు
ఆకలిచావులు లెవ్వు
పల్లె కోయిల రాగాలతో తెల్లారేది
తెనుగు, దెంకరి, సాకలి, మంగలి
సబ్బండ వర్ణాలు
కట్టు కాలువల పొంటి
తీరొక్క పండు దొరికేది
గొర్రె, మేక కడుపార మేసేది
కుర్మ, గొల్లలు సల్లగా బ్రతికిండ్రు
ఊరు మైలనంత
సాకలి సమ్మయ్య
ఉతికి ఆరేసేటోడు
ఎంత సల్లగా బతికింది పల్లె
ఎంత సక్కగా ఉండె పల్లె
అరవై ఏండ్ల నిరంతర
ఆరాట, పోరాటాల నుండి
దగాకోరు కబ్జాదారుల నుండి
వలసపాలన నిర్లక్ష్యంనుండి
ఇప్పుడు బయటపడ్డ
నన్ను నమ్మండి.
ఎతలు, వెతలు లేని
కన్నీటి వేదనలు లేని
పల్లెను నిర్మించుకుందాం
గొడ్డు, గోదా ఎవుసం
నిలబెట్టుకుందాం
అప్పుల బాధలు
ఆకలి చావులు లేని
తెలంగాణ నిర్మించుకుందాం





**ఎడమ రాంరెడ్డి**
సిఆర్ ఫౌండేషన్, రూ. 141, కొండాపూర్,
హైదరాబాద్-84. చరవాణి: 7569789816
ఇ-మెయిల్: s@gmail.com

169

# ఆశీర్వాద పత్రం

ప్రపంచంలో ఎవ్వరికీ అలవిగాని పంచభూతాలను
ప్రజల కందించిన అపర భగీరథుడు మన తెలంగాణ
ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు,
బంగారు తెలంగాణ నిర్మాతకు తెలంగాణ ప్రజల
బలమైన ఆశీర్వాదములు.
అల్లమార్కండేయునంత దీర్ఘాయువు
సూర్యునియంత తేజోభరంబు
శంకరునంతటి శాశ్వతైశ్వర్యంబు
దేవేంద్రునంతటి దివ్యభోగం
అర్జుననంతటి ఆహవ శౌర్యంబు
భీమసేనునియంత భీమబలము
అలహరిశ్చంద్ర రాజంతటి సత్యంబు
ధర్మరాజంతటి ధర్మనిరతి
నలరాజునంత పుణ్యశ్లోకతాయుక్తి
మాంధాతయంతటి మహితకీర్తి
అనిలునంతటి సత్ప్రతాపాతిశయము
కర్ణునంతటి ఈవియు గలిగి మనుము
భళిర శ్రీ చంద్రశేఖర పుణ్యచరిత
బంగారు తెలంగాణ నిర్మాత భాగ్యదాత.

**ఎన్నవెళ్ళి రాజమౌళి**
తడ్కపల్లి (పోస్ట్), సిద్ధిపేట (మం.) మెదక్ జిల్లా-502 114
చరవాణి: 9848592331

170

## మన్ను మిన్ను ఏకమై

తెలంగాణ ఆవిర్భవించి
వార్షికోత్సవము జరిగెనని
వాణియే వినిపించ
ముక్కోటి రతనాల
వీణయే మ్రోగ
ప్రపంచానికి వెలుగైన
భానుడు మేల్కొని
కిరణాల నవ్వే!
ఆ నవ్వులలో
స్వతంత్ర తెలంగాణ పథకాలు
పుష్పాలై వికసించ
ఆ పువ్వులను
తెలంగాణ తల్లి మెడలో
హారముగా
అలంకరించె ముఖ్యమంత్రిగారు

ఆనందాల నందనాలలో
లేగదూడలు
గంతులేసి ఎగిరి
మురిపంతో పరుగెత్తగా
మెడలోని మువ్వల సవ్వడికి
ఆబాలగోపాలం
కరతాళ ధ్వనులు కలిపె
వెల్లివిరిసిన ఆనందము
బాణసంచా వెలుగులో
మన్ను మిన్ను ఏకమై
మెరుపులే చిందు
ఇన్నాళ్ళకు
తెలంగాణ హృదయాలు పొంగి
అంబరమంటె సంబురం.

ఎలనాగ
73, నక్షత్రకాలనీ, బాలాపూర్ (వి.) హైదరాబాద్-500 005
చరవాణి: 8885563042
ఇ-మెయిల్: elanaaga@gmail.com

171

# అపురూప సామగ్రి

గులాబీ గుత్తుల్ని దాచిపెట్టిన
డబ్బా మూతను తెరిచినట్టు
గుప్పుమనే సౌజన్య పరిమళంతో
అతనొస్తాడు
అత్తరు సీసాను అమాంతంగా వొలకబోసినట్టు
ఆత్మీయతా సౌరభాల తీగలు
మనసును చుట్టుకునేలా
అతడు చిరునవ్వును చిందిస్తాడు
నాభి దగ్గర్నుంచి నాలుకదాకా
వేసిన సౌహార్దపు బాటమీద
సాగివచ్చిన పూలరథం
'ముఖ' ద్వారంలోంచి బయటికి వచ్చినట్టు
అతడు ముచ్చటిస్తాడు
కంటిలోపలి స్నేహకాంతి
కారుణ్యపు ఉప్పెనగా మారి
కనుకొలకుల్లోంచి దూకినట్టు
అతడు నిర్మలమైన చూపును ప్రసరింపజేస్తాడు
వేలికొసల్లోంచి ప్రవహించే
వాల్లభ్యఝరీ తరంగాల్లో
మునకలు వేయిస్తూ
అతడు ఆప్యాయంగా స్పృశిస్తాడు
దౌష్ట్యాల ఘోరాటవిలో
దయా పర్ణకుటీరం అతడు
అనురాగ రాహిత్యపుటెడారిలో
చలువ పందిరి, ఒయాసిస్సు అతడు.

ఎలుగేటి దేవదాస్
చరవాణి: 905927549

172

## సుభాషితాలు

సీ. కూర్మమాధారంగ కడలి చిలికెటి వేళ
పర్వతం కవ్వము పరగ జేసి
అసురులు నొకవైపు అమరులు నొకవైపు
ఆదిశేషుని వారు నరయ జుట్టి
సాగర మథనంబు సాగించు వేళలో
గరళంబు మొదలొచ్చె ఘనము గాను
గరళంబు కంఠాన గట్టిగా బంధించి
గరళ కంఠుడు కీర్తి గాంచె నపుడు

తే.గీ. ఆది విష్ణువు మోహినవతారమున వచ్చి
అసురులను వీడి సుధనిచ్చె అమరు లెన్న
చంద్రశేఖర మన్నించి జేర దీసి
దేవదాసుని దీవించు దేవ దేవ

సీ. ప్రాణ ధారణ జేసి పాలిచ్చి పోషించి
ప్రేమ పంచెడి తల్లి ప్రథమ గురువు
విద్య బుద్ధులు నేర్పి విశ్వంబు నెరిగించి
తనయుని మేలెన్ను తండ్రి గురువు
పాఠశాలలలోన పాఠాలు నేర్పించి
ప్రగతి మార్గము జూపు పరమ గురువు
భ్రమలు బాధలు దీర్చి బ్రహ్మంబు నెరగించి
ఆనందమును పంచు ఆత్మ గురువు

తే.గీ. గురువు లందరు తెలిపిన గుట్టు తెలిసి
మంచి నెన్నగ జూపుము మహిమ నీదు
చంద్రశేఖర మన్నించి జేరదీసి
దేవదాసుని దీవించు దేవ దేవ

సీ. నలుగు పిండితో బొమ్మ నవని లోనను జేసి
ప్రాణధారణ జేసె పాప కిలను
జనని పార్వతి దేవి జలకమాడెటి వేళ
కావలుండగ బెట్టి కదిలె తాను
అంతలోన శివుడు యరుదెంచి స్పందించ
శివునితో తగువాడ సిద్ధపడెను
ఉగ్రరూపము దాల్చి నురకలేయు శివుడు
తాండవంబాడుచు తలను నరికె

తే.గీ. తనయు తలగాంచి రోదించె తల్లి తాను
గజశిరమ్మును బెట్ట గణపతయ్యె
చంద్రశేఖర మన్నించి జేర దీసి
దేవదాసుని దీవించు దేవ దేవ



ఏలేశ్వర నాగభూషణాచార్య
1-6-29/1, ఫతేనగర్, మెదక్.
చరవాణి: 9441125372

173

# లోతైన జీవితం

సమస్యల పరికి కంపలమీద ఎన్నెన్ని వలతాళ్ళని
ఆరేసుకోను గుండె కదలిన ఎన్నెన్ని ఆవేదనా అశ్రు
నయనాల చేదు కన్నీటిని
వణుకుతున్న నా అరచేతిలోకి ఒంపుకోను
పుట్టెడు కష్టాలను బట్టతలపై మోసుకుంటున్న జిందగీ
అయ్యింది
ఏగిన కష్టాలను ఏకరువుగా నెమరేసుకుంటూ
బతుకు పాటలను పాడుతున్నవాణ్ణి
పాటల సింగారపు లయలలో నర్తిస్తున్నవాణ్ణి
కాలపు కనుకట్టు ప్రవాహం మీద
కన్నీటి జాలుని గుమ్మరించుకుని
తడిసి ముద్ద ముద్దైనవాణ్ణి నాకింకా పనిబాటెక్కడిది
బతుకు భయమెక్కడిది
బ్రతుకు బండిపైన భారమైన స్వప్నాల రాసుల్ని
కుప్పలు కుప్పలుగా బోసి
పలుగు రాళ్ళ నేలమీద బక్కచిక్కిన హస్తాలతో
ఈడుస్తున్నవాణ్ణి
నేనే పలుగైనట్టు పలుగే నేనైనట్టూ వెకిలి నవ్వులు
నవ్వుతూ కకావికలవుతున్నవాణ్ణి
శోక సముద్రమైన నీ జీవితంలో ఎవరు ఏ అలను
మోయగలరు ఎవరూ ఏరుల పరుగులకూ
అమాంతంగా అడ్డుకట్ట వేసి ఆపేయగలరు?!
అంతా భ్రమ! అంతా దిగ్భ్రాంతి!!
కాషాయ ఆచ్ఛాదనాలను ఒంటినిండా బురకేసుకుని
జీవితం మిథ్యాని
చిన్నారి పంజరంలో బంధించబడ్డ ఎన్నెన్ని రామచిలుకల
జోస్యాల్ని వీనులవిందుగా పసందుగా కర్ణపుటలు
గాయాలయ్యేదాకా వినలేదు
అంతా బూటకమే! ఇదంతా ఇంద్రజాలపు నాటకమే!!
సుడిగాలిలో సుడులు తిరిగిన జీవితాన్ని చూసి
ఎత్తుపల్లాల ఆటుపోటుల నధిగమించి ఆకలిలో దాగి
వున్న ఔన్నత్యపు అగ్నిశిలలను అధ్యయనం చేశాకా...?!
జీవితం మిథ్యావాద మౌతుందా మిథ్యానాద మౌతుందా!
అనంతర్థాల జీవితం మిథ్య కానే కాదు
ఆకాశమంతెత్తు ఆలోచనా రహదారులకు పునాదులు
వేసేదే జీవితం
పచ్చపచ్చని లేగడ్డి చిగుళ్ళను తిని గుక్కెడు గుక్కెడు
నీళ్ళు తాగి ఎండిన గొంతును తడిజేసుకుని
ముక్తకంఠంగా జీవితం యుద్ధక్షేత్రమని
జీవించాలంటే రణభూమిలో పాలు పంచుకున్న కన్నీటి
వారసులమని
తెలుసుకున్నాక జీవితం ఎలా మిథ్య అవుతుంది
జానెడు పొట్ట కాలి కమురెక్కినా జనజాగృతి గీతాల
నాలపించిన జీవితాలు యథార్థం ఈ జీవితాల్ని మించిన
ఎత్తైన సత్యం లేనేలేదు
ఎక్కరాని ఎన్ని గట్లెక్కి ఎన్నెన్ని గట్లు దిగాను

కాయలు గాసిన నా అరికాళ్ళకు ఎర్రతామర మొగ్గల్లా
ఎన్నెన్ని బొబ్బలు మొలిశాయి అయినా?!
ఎన్నెన్ని దిబ్బల్ని దున్నుకుంటూ
వస్తున్నవాణ్ణి యింతకూ నాగూర్చి ఎవరైన ఆనవాళ్లు
పట్టారా?! మీరెందుకు ఆనవాళ్ళు పడతారు నాయనా?
జీవిత మర్మం గూర్చి మీకేమి తెలుస్తుందని
మీరానవాళ్ళు పడతారు?!
మీరూ ఖుషీ మీ జీవితం ఖుషీ మీ భార్యా బిడ్డలూ ఖుషీ
మొత్తానికి మొత్తమే ఖుషైనవారు
జీవితంలోని కసినీ మీరెలా ఆనవాలు పడతారు
ఏఏ జీవితాల్ని అధ్యయనం జేశారు గనుక....
జీవితాలను చదివి చదివీ నేను జీవితమైన వాణ్ణి
జీవితమే నేనైన వాణ్ణి
జీవితాలను చదవడమంటే మజాకా బాబు!
జీవితాలను అధ్యయనం చేయడమంటే
జీవితంలో పడరానివి పడుతున్న
బాధల్ని గాథల్ని ఆలోచనా గడ్డపలుగుతో
పెకిలించుకొని ఒకేచోట రాశిజేసుకుని ఒక్కొక్క
స్వప్నాన్ని వెలికి తీసుకొని
ఒక్కొక్క బతుకు పోరాటపాట పాడుకుంటూ ఒక్కో
జీవితపు నిగూఢ అర్థాన్ని నిక్కచ్చిగా నిర్భయంగా
నిరూపించడమే జీవితాన్ని అధ్యయనం చేయడం బాబూ!
మీరు జీవితం మత్తులో గమ్మత్తై చిత్తు చిత్తైనవారు
మీరు జీవితాలను అధ్యయనం చేయడమే నేరం!
మీరు చిక్కని మత్తులోనే నిండా మునిగిపోయారు
పోవాలిగూడ!!
మీ జీవితాల గూర్చి మేం కొత్త చదువు చదువుకోవాలి
ఏ కొత్త చదువు చదువుకోవాలన్నా
వినూతన పుస్తకాన్ని ఆవిష్కరించుకోవాలన్నా
ఏ పండగ పబ్బాలకు జానెడు జాకెట్టు పీల్క తేలేదని
నా భార్య కళ్ళనిండా నులివెచ్చని కన్నీళ్ళ వర్షమే
కురుస్తుంది
నా బిడ్డలు పావలా పైసలకు ఐస్‌క్రీంలా కరిగిపోతారు
నేను తలవంచుకుని ఎదపై లబోదిబో గుద్దుకుంటాను
నా చుట్టూరా తల్లీ, భార్య, పిల్లలు కందిరీగల్లా
మూగుతారు అమాంతంగా అందర్నీ బొండుమల్లె
తీగలా అల్లుకొని గొల్లున ఏడుస్తాను
అందరూ చిగురుటాకు హస్తాలతో నా తలనిమిరి
ఓదారుస్తారు నా దుఃఖాన్ని గుండెనిండా
దిగమింగుకొని వీథిగుండా
వణుకుతున్న కాళ్ళతో తూలుతు పోతుంటాను
వీథిలో నిల్చున్న కుక్కలన్నీ ఓరగా నావంక చూస్తూ
ఎక్కిళ్ళు పట్టి ఏడుస్తుంటాయి
మనుషులకన్నా కుక్కలే నయమనుకుంటాను
అంతా అతలాకుతలమే అంతా
ఆగమాగమేఅనిపిస్తుంది
ఇంత బతుకు బతికి ఇన్ని కష్టాలను ఎన్నెన్నో
నష్టాలను మరెన్నో ఛీత్కారాలను మోసి జిందగీతో
పరిమళిస్తున్నా ఏం జిందగీ అయ్యింది నాది?!
ఇంట్లోకి చారెడు బియ్యాన్ని చేరవేసుకొని
జిందగీని జూసి ఏమని మురిసిపోవాలి!
ఎందుకని వర్షంలా కురిసిపోవాలి!!
అంతా దేవులాటయే అయ్యింది
ఇపుడు నా కడుపును కనుపించని ఉక్కుచేతులు
దేవుతున్నాయి ఒళ్ళంతా కన్నీళ్ళతో తడిసి తడిసీ
గాబరగాబరైతుంది ఎన్ని గాబరలైతేనేమి?!
నేను నమ్ముకున్న స్వప్నాలను
నేను నమ్ముకున్న వేల ఆశలను ఆశయాలను
కుందనపు బొమ్మలా నిలబెట్టేంతవరకు
నా కన్రెప్పలకు నిద్రెక్కడిది? నాకు నీడెక్కడిది?!!
తెగిపడ్డ నా ఉదర అపశ్రుతుల విపంచి శిరస్సును
మేధోశక్తితో అతికించుకొని
కొంగ్రొత్త ఆలోచనా నరాలను శ్రుతిచేసుకుని
సరికొత్త మంజీరా సప్తస్వరాలను ఒలికిస్తాను
నా స్వరాల లయలకు మీరందరు దరువందియ్యాలని
అందిస్తారని తదేకంగా మీకై నేను నాకై మీరు
జనం హోరెత్తేలా సరికొత్త పాటలను పాడుకుందాం!
చిందులో చిందేసి తత్తోంధిత్తోం
తలాంగుతధిగిన తకధోంధోం అంటూ
సరికొత్త ఆటలను ఆడుకుందాం!!
తెలంగాణ సంబురాల సాధనలో!





ఏలేశ్వరం వెంకటేష్
చరవాణి: 9849487146

## 174

# బంధం తెర్లు కావద్దు

తిట్టవలసిందె
ఈడ్చి కొట్టవలసిందె
నీచుల!
కాదనను.
లక్ష్యం నెరవేరాలె
అడ్డు తొలగిపోవాలె
బంధం తెర్లు కావద్దు!
కొడితె
ఉలి దెబ్బ తిన్న రాయి
శిల్పమైనట్టు
తిడితె
విద్యార్థి తలొంచుకు నిలబడ్డట్టు
స్పందన రావాలె!
కోపం
రుచి చూసినవాడు
మళ్ళీ తప్పు చేయొద్దు
పగబట్టిన పామై
బుసకొట్టొద్దు
పాఠం బోధించబడ్డ
పసిపిల్లాడు గావాలె!
చిన్న పామునైన
పెద్ద కర్రతోనె కొట్టాలన్నట్టు
వివాదం చిన్నదే అయినా
బహువిషయాలు సేకరించాకే
వాక్బాణాలు సంధించాలె!
పదిమంది కనబడగానే
కుక్క తోకముడిచినట్లు
సంధించే పలు ప్రశ్నలకు
సమాధానం లేనివాడై
తలదించాలె!
ఎవడినైన
వాస్తవ అంశాలతోటె వంచాలె!
ఎదురింటి వాడితో గొడవంటె
శత్రుసైన్యాలు
ఎదురెదురుగా మొహరించుకుని
నిలబడ్డట్టే! కదిలిస్తే
ప్రతీది తేనె తుట్టే
అందరికి ఇది ఎరుకున్న గుట్టే
అందుకే గొడవలొద్దు
పగలూ ప్రతీకారాలూ వద్దు!
ఇండ్లు స్నేహపు నీడనిచ్చే
చెట్లు గావాలె!
విరబూసిన పూవుల
తోటలు గావాలె!

ఏనుగు సత్యనారాయణరెడ్డి

## 175

## తెలంగాణ మహారథం

తెలంగాణ ప్రాంగణాన మహారథం ఇదిగిదిగో
భడభడ గుండెల బడుగుల అవమానం తొలగువేళ ॥తెలం॥

ఉద్యోగాల్ కొల్లగొట్టి ఊడిగాల పాలుచేసి
త్యాగధనుల ఉసురు జ్వాల నింగి కెగిరిన వేళ ॥తెలం॥

బంగరు భూముల పంటలు బంజరుగా మార్చి వేసి
బంజరు భూముల మెక్కిన బలిసిన కొడుకుల ప్రోలే ॥తెలం॥

చేతకాని ప్రభుత కుట్ర రాజకీయముల నేర్పే
చాతకాని దద్దమ్మలు భూమికి భీరువని తెలిపే ॥తెలం॥

భాగ్యమున్న చోట చేరి భోగములకు చాల మరిగి
భాగ్యనగరు మాదియన్న లఫూటులకు బుద్ధి దెలిపె ॥తెలం॥

మీ భూమిలో ఆనకట్ట మా భూమిలో నీరు పుట్ట
మునిగిన గ్రామాల బాధ బాబు గాళ్ల కుసురుముట్ట ॥తెలం॥

ఎరువులంటె ఫైరింగ్ ఉద్యమాల్ స్టాపింగ్
నోటికాడి కూడు గొట్టె వోటు నడుగువారి ద్రోలె ॥తెలం॥

తల్లుల పేగుల బంధము తెలియని పాషండులను
గుండెలదుర చెండాడే వేళయె నిదియని తెలిపే ॥తెలం॥

తెలిసియు తెలియనివాడా బాగుగ చదివినవాడా
ముంగిట్లో తెలంగాణ రాజ్యమిదే తెలుసుకోర తెలంగాణ ॥తెలం॥



గడీల సుధాకర్ రెడ్డి
జప్తులింగారెడ్డి పల్లె చౌట (మం.)
మెదక్ జిల్లా-502 372 చరవాణి: 9948936488

176

# జెజ్జెనకరె జనతెలంగాణ

జెజ్జెనకరె జెజ్జెనకరె
ఇది జన తెలంగాణా
మన తెలంగాణా
రణ తెలంగాణా
ఘన తెలంగాణా
నమస్తే తెలంగాణా
నీళ్ళు దోచీ, నిధులు దోచీ
నియామకాలలో నిండముంచీ
మన భాషనేమో అవమానించీ
అన్నింటా ఆధిపత్యమే
అణువణువున పక్షపాతమే నిండిన
వలస పాలకులకు వంతపాడే
స్వయంపాలన తెచ్చుకుంటిమి ॥ జెజ్జెనకరె ॥
ఆత్మగౌరవ బతుకులకై
అమరులైరీ ఎంతోమందీ
పల్లె పల్లె, గల్లీ గల్లీ, ఇల్లు ఇల్లు
కదిలి వచ్చీ
ఢిల్లీ దాకా లొల్లి జేసి
బల్మీటికి బంధమేసిన
నా తెలంగాణ రాష్ట్రానికి
ఇడుపుగాయిదం జేసుకుంటిమి ॥ జెజ్జెనకరె ॥
ఎట్టి బతుకులు ఎన్నాళ్ళని
ఏడ్చు బతుకులింకెన్నాళని
గులాంగిరి మనకొద్దని
సగర్వంగా బతుకుదామని
సకల జనుల సమ్మెజేస్తిమి
మిలియన్ మార్చ్ చేస్తిమి
ఎన్నెన్నో జేయేసీలు
అలుపెరుగక పోరాడీ
స్వార్థపాలకుల సాగనింపితిమి
సంతోషంగా బతుకుదామని ॥ జెజ్జెనకరె ॥
ఉద్యోగాలలో మనకు
ఉన్నత స్థానం లేదని
కవులు, కళాకారులకు
తగిన ప్రోత్సాహంలేదని
ద్వితీయ పౌరుల్లాగా
దిగజారిన బతుకులొద్దని
మనన్నింట్లా అణచివేసిన
ఆంధ్ర పాలకుల పెత్తనమొద్దని
సర్వశక్తులు కూడగట్టీ
సంకుల సమరంబు జేసె
స్వరాష్ట్రంను మనం
సాకారం జేసుకుంటిమి
సగౌరవంగా బతుకుదామని ॥ జెజ్జెనకరె ॥

ఏడాది పాలనలో
కొంత సాధించితిమి మనం
ప్రైవేట్ చదువులు
ప్రైవేటు వ్యాపారాలు
సాధారణ జనాన్ని
సంపుక తినవట్టె
మంచినీళ్ల వ్యాపారంతో
మనిషి మనిషిని దోయవట్టిరి ॥ జెజ్జెనకరె ॥
సింగపూర్ నాయకత్వ
స్ఫూర్తితో ముందుకెళ్ళాలి
కెసిఆర్ నాటి త్యాగనిరతి
నేడు చూపాలి. వచ్చే
నాల్గు ఏండ్లలో మరింత
ప్రజా పక్షపాతిగా
సాధించాలి.
నవ తెలంగాణ
మన తెలంగాణ ॥ జెజ్జెనకరె ॥
నమస్తే తెలంగాణా
నడుస్తున్న తెలంగాణా.

గజ్జెల శ్రీనివాస్‌గౌడ్
4-128/36, సాయిబాబా నగర్ కాలనీ, కిస్మత్‌పుర, రాజేంద్రనగర్,
డాన్‌బాస్కో (పోస్ట్), రంగారెడ్డి-86
చరవాణి: 9949155170

177

# ధూంధాం - తెలంగాణ

అంతరంగ వైభవంగా ఆవిర్భావ వేడుకలు
అరుదైన సందర్భం అరవై యేళ్ళ కల
అంబరాన్నంటే సంబరాలు...
పటాసులతో ప్రారంభం ఆవిర్భావం
ఆత్మ బలిదానాల అమరుల స్మరణం
తెలంగాణ అస్థిత్వం, ఆత్మగౌరవం
చాటే కళల ప్రదర్శనలు, కచేరీలు
కాంతులీనుతుంది భాగ్యనగరం
రంగురంగుల దీపాలతో దారులన్నీ
ధగధగ మెరుస్తున్నాయి కలర్‌ఫుల్‌గా మెరుస్తుంది
ట్యాంక్‌బండ్ శోభాయమానంగా
ముస్తాబైంది పరేడ్‌గ్రౌండ్
అర్ధరాత్రినుంచే నెక్లెస్‌రోడ్‌లో
డండం టపాసుల ప్రేలుళ్ళూ, చప్పుళ్ళూ
బాణసంచా కాల్చి వేడుకలు చేసిరి
యన్‌టిఆర్ మార్గ్ మిరుమిట్లు గొల్పే
పీపుల్‌ప్లాజాలో సాంస్కృతిక ప్రదర్శనలు
రాత్రివరకు తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్
భగార అన్నం, తలకాయ శారువ,
బోటి, మటన్, సకినాలు, భక్ష్యాలు మొదలైన
వంటలు రుచుల ఘుమఘుమలు
రవీంద్రభారతి, హరిహర కళాభవన్,
పబ్లిక్ గార్డెన్‌లో చర్చలు, సమావేశాలు
సాంస్కృతిక ప్రదర్శనల మేళవింపులు
చిడుతల రామాయణాలు, చిందు యక్షగానాలు,
శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు
పోరాటాలు ఇతివృత్తాలుగా నిర్మించిన
అంకుర్, మాభూమి, కొమురంభీం
చలనచిత్రాల ప్రదర్శనలు గోల్కొండ ఖిలాలో ఇవ్వాళ
గజల్స్‌లు, తెలంగాణలో ఉద్యమంలో కీలక మైలురాళ్ళు
వివిధ వర్ణాల పాత్ర, తెలుగు యూనివర్శిటీలో
తేజోమూర్తులు వారి ఫోటో ప్రదర్శనలు
పరేడ్ గ్రౌండ్‌లో అలరించిన శకటాలు
ఆర్ట్స్ గ్యాలరీలో ఫోటో ప్రదర్శనలు
విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు
ఢిల్లీలోని తెలంగాణ భవన్ అమరులకు
జోహార్లు అర్పించారు. ముంబాయిలోను సంబురాలు,
బహ్రెయిన్‌లో ఉత్సవాలు
మస్కట్, ఒమన్ రాజధానుల్లోను సంబురాలు
కెనడా దేశంలోను, ఆస్ట్రేలియాలోని
తెలంగాణ ఎన్నారైలు వారి సంబురాలు జరిపిరి
ప్రపంచంలోని తెలంగాణ ప్రజలందరు
సహృదయంలోంచిపెల్లుబికిన ఉత్సాహంలో ఘనంగా
ధూంధాం చేసుకొనిరి బంగారు తెలంగాణకోసం
భవిష్యత్ బంగారుమయం కోసం
తపనతో....

గజవెల్లి నర్సయ్య
నల్లగొండ జిల్లా.
చరవాణి: 7893263329

178

# చొక్కమై అతిశయించే....

బడుగు బలహీన వర్గపు పుష్పాన్ని
బతుకు దెరువుకెల్లప్పుడూ అక్కరకొచ్చేదాన్ని
బతుకమ్మ పండుగకే వన్నె తెచ్చేదాన్ని
నేను తంగేడు పువ్వుని!
రహదారుల వెంట బాటసారులకు
స్వాగతాంజలి ఘటించేది నేనే
కమ్మని కబుర్లు చెప్పే-
అప్రకటిత జాగృతి కవిత నేనే
అనేకానేకుల బాధల గాథలకు
కలత చెందే హృదయం నేనే....
ఒక లయగా పాటందుకునే
అచ్చమైన పేర్పును నేనే!
పేద జీవితాన్ని పండించే
పంటచేలే నా పుట్టినిల్లు

ఆరు రుతువుల్లో విరిసి మెరిసే
ప్రకృతి వొడియే నా మెట్టినిల్లు
పచ్చదనాన్ని మెచ్చే నేను
పల్లెపడుచుల నెచ్చెలినౌతాను!
మల్లెలోలె తెల్లగా లేని
మాయా మర్మాలెరుగని బంగారాన్ని
దొరసానుల కొప్పుల్లో ఇమడని దాన్ని
గడుసుదనాలు-కరుకు గుణాల్ని
అసలే ఎరుగని దాన్ని
అందమైన మేడల్లో ప్లవరు వేజుల్లో
రివాజుగా కులకని సామాన్యురాల్ని
అయితేనేం-నేనొక స్వతంత్ర రాష్ట్రంలో
అతిశయించే అధికారిక రాష్ట్ర పుష్పాన్ని!





గన్ను కృష్ణమూర్తి
5-3-770/1, బిలాల్ మసీద్ వెనుక, విద్యానగర్ కాలనీ,
కామారెడ్డి-503 111 చరవాణి: 9247227087

179

# బాగుండును! బాగుండును!

లాఠీలకు కన్నులున్న బాగుండును! బాగుండును!
తగలరాని చోట దెబ్బ తగలకుండ ఉండెడిది.
తూటాలకు తలలుండిన బాగుండును! బాగుండును!
మంచి తలలు కొన్నైనా మహిలో మిగిలుండెడివి.
కాలిబూటుకైన సుంత కారుణ్యం ఉండినచో
హృదయమున్న మనిషితోడ వినయంగా మాటాడును
ఉరి(త్రాళ్ళకు మెదళ్ళున్న బాగుండును!
నిర్దోషుల కంఠాలకు బిగిసికొనక యుండెడివి.
కటకటాలకే యొకింత కాలజ్ఞాన ముండినచో
నిర్దోషుల విడిచిపెట్టి దోషుల బాధించెడివి.
కుర్చీలకు చేతలున్న చేతులున్న బాగుండును!
బాగుండును!
తలలులేని వారిలెక్క నేలకూల(ద్రోసెడివి
నల్లకోటులే యొకింత చట్టమ్ముల నరసినచో
అన్యాయపు వాదితోడ వాదమ్మునకు దిగెడివి.

జడ్జిచేతి సుత్తికైన హృదయమున్న బాగుండును!
తప్పుడు (వ్రాతల కలముల నెత్తురులను చూచెడిది.
పుస్తకాలకే యొకింత పు(రెలున్న బాగుండును!
విద్యార్థుల చెవుల పిండి విద్యను గరిపించెడివి.
నల్లబల్లకే యొకింత (ప్రాణమున్న బాగుండును!
బడుద్దాయి పంతుళ్ళకు పాఠాలను నేర్పెడివి.
కొడవళ్ళకు ఆకలన్నదర్థమైన బాగుండును!
ధాన్యాలను దాచిపెట్టు వారలనే పాతిపెట్టు.
(ప్రతి మనిషికి తలయుండిన బాగుండును!
బాగుండును!
తలవంచక తలయెత్తుకు (బ్రతుకు (బ్రతక
యత్నించును.

నాకో మానవతా కిరీటం దొరికింది.
కానీ, దాన్ని తొడగడానికి
ఓ తలకాయ దొరకడం లేదు.

గరిశకుర్తి శ్యామల
కరీంనగర్. చరవాణి: 9490189081



# 180

## నా తల్లి తెలంగాణ!

ఎంత చల్లని తల్లి నా తెలంగాణ!
ఎంత దయగల తల్లి నా తెలంగాణ!
చుట్టాలకే సురభి నా తెలంగాణ!
బహు కుటుంబికురాలు నా తెలంగాణ!
నా తెలంగాణ! కోటి రతనాల వీణ!
వీరులకు, ధీరులకు నెలవై
తెలంగాణ స్వేచ్ఛకై నాడు ఆత్మార్పణం గావించిన
అమర పోరాటవీరులకు ప్రఖ్యాతి గాంచిన జన్మభూమి
నా తెలంగాణ! కోటి రతనాల వీణ!
కవులకు, గాయకులకు, నటులకు, నర్తకులకు నిలయమై
కళాకారులు, సాహితీమూర్తులు
ఎందరెందరో మహనీయులు
నుతులు, నీరాజనాలందుకొనిన
పరమ సౌందర్యమూర్తి కళలకే కాణాచి
నా తెలంగాణ! కోటి రతనాలు వీణ!
పల్లెలకే పసిడితల్లి భరతమాత
భావిధాన్యదాతలు
సిరిసంపదలు వెల్లివిరియు
పల్లెలే తన ఆభరణాలుగ వెలుగొందే తల్లి!
నా తెలంగాణ! కోటి రతనాల వీణ!
చదువుల తల్లీ! శారదా మాతా!
కోరికలు తీర్చేటి వేములాడ రాజన్న!
దయగల తండ్రి భద్రాద్రి రామన్న!
భక్తుల కొంగు బంగారం యాదగిరి నరసింహుడు
ఇడుముల బాపేటి దేవుళ్ళు వెలసిన పరమ పవిత్ర
భూమి
నా తెలంగాణ! కోటి రతనాల వీణ!
దూర తీరాలనుండి, బ్రతుకు బాటపట్టి
అండకోరి ఆశ్రయించగ
అక్కున చేర్చుకొని అన్నంపెట్టిన అన్నపూర్ణ!
కామితములు తీర్చేటి కల్పవల్లీ!
నా తెలంగాణ! కోటి రతనాల వీణ!
కలలన్నీ ఫలించగా
శ్రమ ఫలితం సిద్ధించగా
స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పొంది స్వరాష్ట్ర సాధనలో
సంబురాలు అంబరాన్ని తాకగా
గతేడాది జరుపుకున్న వేడుకలు
మరపురాని మధురానుభూతులు
ఈ ఏటి తెలంగాణా అవతరణ దినోత్సవం
ఆనంద తరంగాలై వెల్లి విరియ(గా)
జనులంతా ఆటపాటల నడుమ
పల్లె, పట్నం ఏకం కాగా
తెలంగాణ తల్లికి సమర్పించినారు కర్పూర హారతులు
ముత్యాల నీరాజనాలు.



గరిశకుర్తి రాజేంద్ర
5-3-560, ఆర్యనగర్, కామారెడ్డి-503 111
చరవాణి: 9493702652

181

# పర్యావరణ పరిరక్షణ కోసం

కునుకు పట్టడం లేదు - ఒకటే రొద!
భూకంపంతో నేల బద్దలైనట్లు!
కార్గిల్ యుద్ధంలో బాంబుల వర్షం కురిసినట్లు
నా గోడ పక్కనే జరుగుతున్నది యుద్ధం!
నేలతల్లి కడుపు చీల్చుకుని
పాతాళానికి పయనమవుతున్నది
జలధారకోసం, దాహార్తికోసం
అది బోరింగు యంత్రం - యంత్రం కాదు
భూ సమతుల్యాన్ని అతలాకుతలం చేసేందుకు
ఉద్భవించిన ఘోర రాక్షస జాతి - దానికసలు లేదు నీతి
భూమి తల్లి ఏమి శాపం పెడుతున్నదో
దుమ్మూ, ధూళీ తప్ప తడి కనిపించడం లేదు
మేఘాలు వచ్చినట్లే వచ్చి, వర్షించకుండానే
వలస పోతున్నాయి ఆగ్రహంతో...
ఉరుములు, మెరుపులు ఆర్భాటమే తప్ప
ఒక్కనీటి చుక్కానేలపై రాలడం లేదు
భూమాత గాయం మానడంలేదు
పొలాలన్నీ బీళ్ళు, రైతుకంట్లో తరిగిపోని కన్నీళ్ళు
ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించేదాకా
ప్రజలందరిది ఒకే తపన - సాగునీటికోసం
త్రాగునీటి కోసం ఆరాటం, పోరాటం
"ఓ మనిషీ" నీవు నరికే ప్రతి చెట్టూ
నిన్ను శపిస్తున్నది, తాపంతో పరితపిస్తున్నది
నీవు అనాలోచితంగా చేసే ప్రతి చర్య
నీ పాలిటి శాపమై ఇలా పీడిస్తున్నది
చెట్లను నరికితే కాదు, చెట్లను నాటితేనే ముక్తి
సమతుల్యం కాపాడితేనే నీకు ప్రగతి
కెసిఆర్ తలపెట్టిన మిషన్ కాకతీయ
చెరువులను పునరుద్ధరిస్తున్నది
ప్రతి వ్యక్తీ ఒక్కొక్క చెట్టు నాటితే
పచ్చదనంతో ప్రకృతి శోభిస్తుంది
ఇంటింటికి నీరందించే పథకం
నీటి సమస్యను తీరుస్తుంది
చెట్లుంటేనే కదా, అవి ఆకాశంతో స్నేహం చేసి
అమృతధారల కురిపించేది
చెట్లుంటేనే కదా, కాసి పూచేది
దేవుడి మెడలోకైనా, ఆడవారి జడలోకైనా
విరులు విరివిగా అమరేది
తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పథకాలు
బంగారు తెలంగాణా కోసం ఉరుకులు, పరుగులు
ఆకాశం వర్షం కురిపిస్తే, నీటి కరువు తీరిపోదా
నేలతల్లి పరితపించేలా బోరింగ్ యంత్రాలతో
మనకిక పనే ఉండదు
తెలంగాణా ప్రజలందరి సహకారముంటే
మనమంతా కెసిఆర్ అడుగుజాడల్లో నడిస్తే
తెలంగాణ రాష్ట్రం కాగలదిక భూతల స్వర్గం.

గసికంటి సంజీవ
చరవాణి: 8374490013

182

## ఆకాంక్షల తెలంగాణ

నిజాం నిరంకుశ పాలనపై
పిరంగి తూటాలను ఎక్కుపెట్టి
రాజాకార్ల రాక్షసత్వాన్ని బడిసెలు చేతపట్టి తిప్పికొట్టి
నిలిచినారు ఈ తెలంగాణ ముద్దు బిడ్డ లెందరో
అమరులై నేలకొరిగినారు మరెందరో
దాశరథి, కాళోజీ కవితల స్ఫూర్తితో
జయశంకరు సారు చూపిన బాటలో
ముందుకు సాగినం, తెలంగాణాను సాధించినం
ఇగ పేదవాడు-ధనికుడనే మాటలు పోవాలే
సమానత్వమనేదే మిగులాలే
పొడిసేటి పొద్దులే కల్మషమేలేని కాంతుల్ని పంచాలే
తంగేడు పువ్వులై తండ్లాట పోవాలే
మోదుగు పువ్వు మెండుగా ఊరంతా నిండాలే
బతుకమ్మపండుగ-
బోనాల జాతరలలో సందడులే జేయాలే
పాలపిట్టలన్నీ కనువిందులే చేయాలే
ఊర విశ్కెల పలుకులలో ఊరంతా మురువాలే
చెరువులు నిండి-కరువులు పోయి
గుండె బరువులన్నీ దిగి పోవాలే
బడుగుల బతుకులలో చీకట్లు తొలిగి
కలలుగన్న బంగారు తెలంగాణా నిలిచి
కాంతులను పంచే దివిటీయై !
నిలువాలే... రేపటి తెలంగాణ..!!





గాజుల శ్రీధర్
చరవాణి: 9849719609

183

# వర్తమానం

ఒంటినిండా నెత్తుటి గాయాలతో
కుట్రల కత్తుల వంతెనపై కదులుతున్న కాలం
మూతపడని కనురెప్పలగుండా
ధారలుగా రక్తాక్షరాలను రాల్చుతున్న కలం
చీకటి యుగాల ఇనుప కట్టడాలపై
వెలుగు జల్లులు కురుస్తున్న వెన్నెలకల
మెరుపుల పురుటినొప్పుల్లో పొడిచిన సింగిడి
మట్టిని ముద్దాడుతున్న నల్లని మేఘం
ఉరితీయబడ్డ కంఠం వెదజల్లిన
సూర్యోదయాల్ని గానం చేస్తున్న గాలి
శతాబ్దాల చిత్రహింసల నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ
తరంగాల దీర్ఘయానంలో శబ్దం
నరకబడ్డ శిరస్సుల ఊరేగింపులతో
చిరునవ్వుల సరస్సులను పండిస్తున్న నేల
అమ్మ చేతి మునివేళ్ళు రాల్చుతున్న అశ్రువుల్లో
బువ్వ ముద్దల రాగాల్ని కలగంటున్న పల్లె
భూమిని భుజానికెత్తుకుని
వస్తున్న పొద్దుపొడుపుకోసం
కెరటాలతో కవాతు చేస్తున్న నీలి సంద్రం.

గాజీపూర్ నాగయ్య
విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు,
తాండూరు, రంగారెడ్డి జిల్లా. చరవాణి: 9491975352

184

## తంగేడు పువ్వు

సీ. బతుకమ్మ జడలోన బంగారు పువ్వమ్మ
రంగారు తెలంగాణ రాణివమ్మ
నీరులేదని నీవు నిప్పులు చెరుగవు
నేలలేవియైన నెలవు నీకు
ఆరు ఋతువులందు నలరారు నీపూలు
తంగేడు నీజాతి తరగదెపుడు
పువ్వులు ఆకులు బెరడును వేళ్ళును
ఔషధ గుణములు అమరియుండు

ఆ.వె. పూర్వకవులు నిన్ను పొగడగా మరిచినా
చిన్న బుచ్చు కోవు ఎన్నడైన
పసిడి పసుపు కాంతి పదిలమౌనందాక
తంగెడమ్మ కీర్తి తరుగదమ్మ

ఆ.వె. తెలుగు నేలలోన వేవేల పూలున్న
రాష్ట్ర పుష్పమయ్యి రచ్చకెక్కి
బతుకు నింపవమ్మ బతుకమ్మ నీకండ
తంగెడమ్మ నీకు దండమమ్మ

తే.గీ. శవము పూడ్చెడు వేళలో చేతులార
తల్లి పొత్తిళ్ళ రాతిని తంగెడమ్మ
పూలు ఆకులు మెత్తగ పరుపు రీతి
పల్లె ప్రజలెల్ల నీపూలు పరుతురమ్మ

తే.గీ. లొందలోన బెరడు లోతుగా ముంచేసి
చర్మశుద్ధి కొరకు చెమట నోడ్చి
పాదరక్షలెన్నొ పలురీతి గుట్టెడు
'మాదిగన్న నిన్ను మరచి పోడు

తే.గీ. రాష్ట్ర పుష్పము అనగానె రాదు కీర్తి
కంచెగానైన పూదోటగట్ల పైన
పెంచి పోషింప నెగడును పేర్మిగల్లి
జాతి వర్ధిల్లు తంగెడు జాతి ఖ్యాతి



గాదె వెంకటేష్
ఫ్లాట్ నెం. 102, సూర్య పార్క్ వ్యూ, అపార్ట్‌మెంట్,
స్ట్రీట్ నెం. 3, కాకతీయనగర్, హబ్సిగూడ, హైదరాబాద్
చరవాణి: 9849722127

# 185

# కవి - ప్రతిపక్షం

ఎన్నో అస్తిత్వాల మధ్య
సయోధ్యను తెచ్చిన
శతాబ్దపు ఏకైక ప్రజా విజయం
పొక్కిలి నేలమీద
మత్తడై దుంకి
మునం పట్టినం
గింజలు కల్లెంల కనబడుతున్నయ్
ఎవరి పాలయితయో సూడాలె
కాదు... కాదు... కావలుండాలె

ఎవరి సింగిడి వాళ్ళకు
దక్కేతట్టు సూడాలె
ఊరు దాటకుండా పొలి పోయాలి
కనరుగా - ఒనరుగా 'ఒనగూర్చుకునేవాళ్ళ'
కనిపెట్టాలి... కాట్లాడాలి
ఎన్నో 'కళ'ల సభలు
ఎన్నికల సభలయినయ్
కవులు కావలుండాల్సిందే - కలంతో
అవును ప్రతిపక్షం కావాల్సిందే.

గుడిపల్లి నిరంజన్
జడ్‌పిహెచ్‌ఎస్ కెమ్మర, తాడూరు (మం.) మహబూబ్‌నగర్.
చరవాణి: 9493319878
ఇ-మెయిల్: niranjangudipally@gmail.com

186

## మట్టి స్వప్నం

తీరని స్వప్నాలు సాకారమై
ఆశలు సాక్షాత్కరిస్తున్నై
సామాన్యుడికై గౌరవాలు మొలుస్తూ
మర్యాదలు దురువాజలై
పిడికిళ్లెత్తిన వీరులకు నమస్కరిస్తున్నవి
వలస వాదితో నిత్యం
నినాదమై మోగినోళ్లం
ఇప్పుడు తెలంగాణ జేగంటలై మోగుతున్నం!
అన్ని స్వప్నాలు సాకారమయ్యాయని చెప్పలేను
కొన్ని స్వప్నాలు మసకబారుతున్నై
ఇంకా కొన్ని స్వప్నాలకు
సామాజిక న్యాయం ఆమోదాన్ని అందివ్వాల్సి ఉంది
బడుల్లో సన్నబువ్వ స్వప్నం
తెల్లగా చిన్నారుల పెదవులపై నవ్వింది
పొలాల్లోని మట్టి స్వప్నం
తనను తాను ఓదార్చుకొని
ఆకాశం నిండా హలాలను
ఆవిష్కరిస్తు సాగుతుంది!
నడుముల్లో, మోకాళ్లో నొప్పులున్న
ముడుతలు పడిన ముసలి స్వప్నం
తలుక్కున పించన్ తీసుకుంటున్న కళ్ళు
ఆనంద స్వప్నమై ఎగురుతుంది!
ఏలికలై పోదామనుకున్నా
దళిత మహాప్రయాణస్వప్నం
చార్మినారు ముందు
పగిలిన డప్పై అరుస్తుంది!
స్వప్నం వికసించి, విస్తృతమై
కమ్మటి మట్టివాసనై
వలస దుఃఖాన్ని ఆపి
బతుకులోకి సంతోషాన్ని ఒంపి
మనిషిని భూమిపై ఇంకా
నమ్మకంగా నిలబెట్టాల్సి ఉంది!



గురిజాల రామశేషయ్య
2-2-149/2&2ఎ, న్యూనల్లకుంట,
హైదరాబాద్-500 044 చరవాణి: 040-27633100

# 187

## విజయ గీతం

బ్రతుకమ్మ మెచ్చిన సిరినవ్వు
తంగేడు నా బంగారు పువ్వు
రెక్కవిప్పే శుభశకునాల సూచి
పాలపిట్ట నా అందాల పక్షి
నా ముంగిట్లో చెంగనాల జింక
నా పిల్లాపాపల ఉల్లాసానికి ప్రతీక
నేను "తెలంగాణా"ను
చేతుల్లో వికటించని తేనె మాటను
కఠినతను చీల్చుకొని ఎదుగుతున్న చైతన్యాంకురాన్ని
వెలుగులను ప్రేమిస్తున్న దృక్పథాన్ని
దిక్కులను పలకరిస్తున్న పరిమళ కరచాలనాన్ని
మాధుర్యాంశాలకు రూపం దిద్దుకుంటున్న
సుఫల గీతాన్ని
నా విజయం అవిస్మారిత అస్మిత
అస్తిత్వ సువ్యవస్థిత
నా విజయం ప్రతికూల తరంగాల తాకిడితో
పదును దేరిన దీక్షా సంకల్పధార
నా విజయం విశ్వమహాదృశ్యంలో నేడు
"అదిగో తెలంగాణా"గా
ధన్య చరిత ఇక స్వర్ణభవిత

గుముడాల చక్రవర్తి గౌడు
మహబూబ్‌నగర్.
చరవాణి: 9441059424

188

## నవ తెలంగాణ

తొలిపొద్దు పొడిచింది
తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది
అరువై ఏళ్ళ బంధనాలను తెంచుకొని
నవ తెలంగాణ పునర్నిర్మాణానికి
స్వాగతం పలుకుతోంది
పోరుబిడ్డల త్యాగాలను స్మరించుకుంటూ
నేలకొరిగిన వీరులను తలచుకొంటూ
బంగారు తెలంగాణ కావాలని
బడుగు జీవుల బతుకుల్లో
వెలుగులు విరజిమ్మాలని
తెలంగాణ సమాజం
వేయి కళ్ళతో ఎదురుచూస్తోంది
ప్రతి ఇంట సిరులపంట పండాలి
ప్రతి కంట ఆనందాల వెలుగు నిండాలి
చేపట్టే ప్రతిపని విజయవంతం కావాలి
ప్రతి అడుగు ప్రగతికి దోహదపడాలి
కొత్త రాష్ట్రంపై కోటిఆశలు
కోరుకునే ప్రతి ఒక్కరికి
కలగాలి శుభాలు...

గోరటి వెంకన్న

## 189

# పాట

బీరపాదు తీగవారె నారుమడి నవ్వులూరె
తంగేడు వనం బిలిసె బింగన్న నిదుర లేసె
తేనెటీగ మనసు దోసె బంతిపూల తోటపూసె
గునుగు గుమ్మడి గలిసె బతుకమ్మ సిగన మెరిసె
పూలన్ని సింగిడయిన నింగేమొ పందిరయిన
బోల్లు బిళ్ళు నీళ్ళు పూల్ల సంగమమీ పండుగ
ఏళ్ళ నుండి ఈ నేలన వెలుగుతుంది నిండుగ
ఆడబిడ్డలూరి బాట అడుగులతో అలికిడి
సిన్న నాటి గురుతుల పరవశించె అమ్మవొడి
పసుపు గందాలొలికిన పల్లెతోరణాల గుడి
బొమ్మరిల్లు తలుపులు చెమ్మగిల్లె కొలుకులు
పల్లె పలకరింపులు ఎదల బాధ మరుపులు
అరచేతి దరువులాట అలరించె జానపాట
దివినుంచి జూసి దేవుడె మైమరిసె పూలకోట
విరగబూసె పొలంగట్లు గద్ద గోరింట సెట్లు
వడ్రెలెల్ల పసుపు నొలుకు కామంచ పూల తొలుకు
కంచెలెంబడి మొలిసె కట్లపూలు వెలుగు పరిసె
సీకటేల రేకులిప్పె సంద్రపూవుల కుప్పె

బండసరికెలల్లుకునె బండగోగు సొగసులీనె
తరుగంటి ఎర్రపుంటి సోంపూవు గోగుపూవు
కాలపు చెక్కిలి పూల మేళం ఈ పండుగ
దోసిళ్ళతొ వాగునీళ్ళు తాగిన తీయని యాది
మోసుకొచ్చిన తప్పెల తడిసి తొలిగిన వేడి
సేప పిల్ల సిందులాడ సెరువుగట్టు గుంపుగూడ
విప్పుకున్న కలువపూల కొప్పుల మురిపెంగ తడుమ
బతుకమ్మ తరలి రాగ ఏరమ్మ తనువు పొంగ
పసుపు పారాణి లేత పాదాలు తడిసి మురవ
సెరువమ్మ వొడిలోన బతుకమ్మ కొలువు దీర
మక్కసేను లేత పంట పల్లెతల్లి సేతిపంట
సీతమ్మ ఫలములంట బతుకమ్మకి పంట
ఆవునెయ్యి పాకమంట సద్దముద్ద శాకమంట
దీపాల వొత్తులంట దివిటీలోలె వెలుగులంట
గోపురాల పూల తేరు మోసె తెలంగాణ ఊరు
పూలవోలె మనిషి మారాలని చిగురాశ
పుడమి నడవడికనువుగ నరుని బతకమనె బాస

గోర్ల బుచ్చన్న

# 190

## తెలంగాణొచ్చి ఏడాది

తెలంగాణొచ్చి ఏడాది
కొన్ని ఆశలు
మరిన్ని నిరాశలు
ఊహకు అందని వరాలకూ... ఏడాది!
ద్రోహులెవరో - దొంగలెవరో
మంచివాళ్లో - ముంచేవాళ్ళో
ఎవరైతేనేం గద్దెనెక్కి... ఏడాది!
కలవరింతలు - పలవరింతలు
పాలనలో - పాలసీల్లో
అంతావాళ్ళే అన్నింటావాళ్ళే
స్వయం పాలనకూ... ఏడాది!
ప్రశ్నకు ప్రాణం పోయి
మేధావికి సోయి పోయి
నిఘా నేత్రాల కళ్ళు మూసుకుపోయి
ఫోర్త్ ఎస్టేట్ పొయ్యిలో కాలిపోయి... నిండా ఏడాది!
దొంగనటుల రంగు వెలిసి
అమాత్యులకు దాసులై
గానకోకిలల గడబిడలకు... ఏడాది!
ఫ్రెండ్లీ సర్కారుకు - పెళ్ళిళ్ళ పైసలకు
ముసుగేసుకున్న అవినీతికి
గడిచిన చరిత్రకూ... ఏడాది!
చూపులకే శూరులు
చేతల్లో నిశ్చేష్టులు
మంత్రివర్గానికి
దానిచుట్టూ అల్లుకున్న యంత్రాంగానికీ... ఏడాది!
ఉరుకులు పరుగుల మిషన్
బంగారు తెలంగాణ విజన్
చెరువు నీరందె ఛాన్సు లేని చివరి పొలం
ఏ రాయి అయితేనేం
అనుకునే వాళ్ళకూ... ఏడాది!
ఇప్పటికైతే ఇదే మరి...!



గోపగాని రవీందర్
9-76/2, ఫకీర్‌గుట్ట, ఉట్నూర్-504 311
ఆదిలాబాద్‌జిల్లా. చరవాణి : 9440979882

# 191

## బతికించే తెలంగాణ

కల సాకారమైందని సంబురపడిన
క్షణాలు ఇంకా మరుగున పడకముందే
రైతన్నల బలవన్మరణాలతో నిలువెల్ల
విషాదమేఘాలు కమ్ముకున్నాయి
పాలపిట్ట, తంగెడుపూలతో విలసిల్లుతున్న
తెలంగాణా మాగాణంలో, జీవనదుల
జలధారల సిరులు పంటలకు అందాలని
ఆశపడడం అత్యాశైతే కాదు కదా
ఉపాధితో వలసలు ఆగుతాయని
ఈ గడ్డమీద బతకటానికి ఢోకాలేదని
సామాన్యునికి భరోసాను కల్పించాలని
కోరుకున్న వాళ్ళల్లో నేను ఒకణ్ణి
దశాబ్దాల దగా నుండి తేరుకొని
దర్జాగా మనుగడ సాగిస్తామని
మా వనరులు మాకేనని నినదిస్తూ
దూసుకుపోతున్న తెలంగాణ నాది
ఈ నేల చెమట చుక్కలతోనే కాదు
వీరుల రుధిరంతో తడిసిందని తెలుసు
ఇక ఎంతమాత్రం అడ్డంకులు లేని
బతికించే బంగారు తెలంగాణనే కోరుకున్న







గోశిక్ నరహరి
దురికి (గ్రా.) నిజామాబాద్ జిల్లా.
చరవాణి: 9848048529

192

# నా భాష మంజీరనాదమై

నా భాష మంజీరనాదమై వెలిగెరా
మూడు నదులా సంగమమ్మయ్యెపారెరా
అమ్మ గోదావరి అమృతపు జలధార
కృష్ణ భీమరథియు తృష్ణ దీర్చెటి ధీర ॥నా భాష॥

ప్రాణహిత పాలేరు డిండిమూసీ నదులు
పెన్‌గంగ మున్నేరు పెద్దవార్ధా నదులు
తెలగాణ ప్రాంతాన్ని కలుపుకొనుచూ పోవ
తెలిసి పారిన తీరు తెలుగురా ॥నా భాష॥

శాతవాహనులెన్న కోటిలింగాలురా
ఇక్ష్వాకులును వీర వాకాటకులు శూర
విష్ణు కుండినులు కళ్యాణి చాళుక్యులు
పాలించినది భూమి పలుకుచూపిన భాష ॥నా భాష॥

అలనాటి ద్వాపరయుగము పరసమాప్తము
ఆశ్మకుల సామ్రాజ్యమది బోధనాపురము
తెలుగు భాషకు నాడు అంకురార్పణము
ఇంద్రపురి ఇందూరు నాయెతల మాణికము ॥నా భాష॥

వ్యాసముని నిలిపినా వాగ్దేవి వాసరా
వాల్మీకి గురుతులా వానోళగడ్డరా
పోతనాఖ్యుడు గన్న పొత్తమీ బిడ్డరా
పాల్కురికి సోమన్న పద్యములు దొడ్డరా ॥నా భాష॥

బద్దెన కవిరాజు నీతిశాస్త్రపు మూట
పనసహనుమద్దాసు పలుకుకోలల పాట
నరసింహ నరహరి శతకములె నా ధ్యాస
ధర్మపురి శేషప్ప మర్మమిప్పిన భాష ॥నా భాష॥

కొల్చారమనె మెదకు జిల్లా కపర్ది
కొడుకు మల్లీనాథ సూరిదీ ప్రత్యూష
దోమకొండ మల్లరెడ్డిదీ వాగ్భూష
బండారు అచ్చమ్మ పండువెన్నెల వరుస ॥నా భాష॥

పంపకవి సేద్యమున పండించె పుష్పొడుల
దాశరథి దున్నంగ దర్శించె రతనాల
గజవెల్లి విధుమౌళి ఘనజాన పదముల
వరకవివరమాణ్య సిద్ధప్ప పద్యాల ॥నా భాష॥

కాళోజి కలగన్న కావ్యాల పుట్టరా
అపరకాళీదాసు కుకునూరు రామయ్య
చెర్విరాల్ భాగయ్య చెలిమెరా నా భాష
సాహిత్య పరవళ్ళ సంపదల నా భాష ॥నా భాష॥

సామల సదాశివుని సాహిత్యమీ భాష
కొఅవి గోపరాజు కొలతరా నాభాష
మడివాళ్ళయాభ్యుని సాహితీ పదప్రాస
గోశికా భూమన్న యష్గానము భాష ॥నా భాష॥



**జి. అనసూయ**
ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల,
హయత్‌నగర్, హైదరాబాద్.

# 193
# మనసుకు చికిత్స

దూరాలు దగ్గరౌతున్నాయి
అదృశ్యాలు దృశ్యమానమౌతున్నాయి
జోహారు శాస్త్ర విజ్ఞానమా
ఎన్ని అసంభవాలను సంభవాలు చేశావ్
ఎన్ని అసాధ్యాలను సుసాధ్యం చేశావ్
నదులను బంధించావ్
నగాలను ఆక్రమించావ్
గగనాంతరాలను అధిగమించావ్
పాతాళాన్ని శోధించావ్
మరెన్ని వింతల్ని చూపిస్తావో
ఎన్ని విచిత్రాలను సచిత్రం చేస్తావో
కృత్రిమ ప్రాణుల్ని సృష్టించావు
మరణాన్ని కూడా శాసించావు
ఆధునిక శాస్త్ర విజ్ఞానమూ
నీకు వినమ్రంగా ఓ విన్నపము
మనసులను దగ్గరచేసే యంత్రాన్ని
మానవత్వాన్ని పెంపొందించే మందుల్ని
అంతరాల దొంతరలను ఛేదించే పనిముట్టును
మనిషితనాన్ని మేల్కొలిపే సాధనాన్ని
మనిషిలోని మృగాన్ని అంతమొందించే వాక్సిన్‌ను
పశుత్వాన్ని తొలగించే శస్త్రచికిత్సను
ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించే వలయాన్ని
కనిపెట్టు
తను సృజించుకున్న సాంకేతిక జ్ఞానం
మనుగడకే కాని అంతానికి కాదని
మనిషికి గుర్తొచ్చే మానసిక వైద్యం కావాలి
మాకంతా అత్యవసరంగా...

జి. అశ్విని
చరవాణి: 9989455570

194

# రైతుదుఃఖం

ఓ రైతన్నా....
నీకే ఎందుకే ఇన్ని కష్టాలు
రెక్కలు ముక్కలు చేసుకొని
పొద్దస్తమానం ఎద్దులా పనిచేసి
ఎండనక వాననకగోజలా కష్టపడి
నేలతల్లిని చెమటతో తడిపావు
సద్ది బువ్వ గట్టుకొని సేనికని పోతే
అసెనులోని పైరు నిన్ను కన్నెర్ర జేసింది
పొద్దనక మాపనక సేనులోన గూసుంటే
ఆసద్ది బువ్వ కాస్త పిట్టందుకుపొయే
యుగయుగాల శూన్యమేదో నీ
మొగంలో స్ఫురిస్తుంది
ఏడవలేదు, కన్నీరొడవ లేదు
ఆశపడలేదు, ఆహ్లాదపడలేదు
ఎద్దు.... గొడ్డలి.... నాగలి...
వీటికి తోబుట్టువే రైతన్నా

విశేష భూమి భారం క్రింద
కూసోని ఆకాశానికి మొగం పెట్టి
ఎంత సూసిన పడని వానల కోసం
నీవు పడే మానసిక క్షోభ
ఎవరికుండునే రైతన్నా!
ఎవుసం తేప తేపకు కనుమరుగైతే
ఎన్నడు కులాసా గుంటవే
ఎన్ని రుతువులు మారినా,
ఎన్ని దారులు మార్చిన
తిరిగి నీకలంతా నేల తల్లి చుట్టే
పుట్లు పండించినా పూటకు
నోచుకొని బతుకైందా?
నేటికన్నా రేపు బాగుంటదే
ఆశతో బతికితే రైతన్నా
దేశమే నీదైతదే రైతన్నా



**జి.ఆర్. కుర్మే**
చరవాణి: 9440140881

195

## తెలంగాణ... మరో సింగపూర్!

నేడు...
తెలంగాణ ఆవిర్భావ వార్షికోత్సవం
అరవైయేళ్ళ కల పండిన సుదినం!
మండుటెండలు పండువెన్నెలైన దినం
గులాబీలు గుబాళించిన సుదినం!

ఉద్యమాలు విజయవంతమైన దినం
అమరవీరులను స్మరించే సుదినం!
సకల జనుల సమ్మె సఫలమైన దినం
తెలంగాణ ఆవిర్భవించిన చారిత్రక సుదినం!

తెలంగాణ భాషను తెరకెక్కించిన కవులు
ధూంధాం దరువులతో ఆడిపాడిన కళాకారులు
వీరే... ఉద్యమస్ఫూర్తిని రగిలించిన తెలంగాణ బిడ్డలు!
సీమాంధ్రుల గుండెల్లో నిద్రించిన శూరులు!!

కేసీఆర్ ఆరాటమో... పద్నాలుగేళ్ళ పోరాటమో...
తెలంగాణ వచ్చుడో...! కేసీఆర్ సచ్చుడో...!!
గులాబీల గుభాళింపో... ఉద్యమాల నిగారింపో...
సీమాంధ్రుల పరాజయం! జై తెలంగాణ విజయం!!

దళిత కుటుంబాలకు దన్నుగా మూడెకరాలు
మురికివాడ నివాసులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు
కరెంట్ కోతకు తావులేని మిగులు విద్యుత్!
ఎదిగిన కూతుళ్ళకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్!!

పంటరుణాల మాఫీతో రైతుకంట పన్నీరు
వాటర్‌గ్రిడ్ పథకంతో ఇంటింటికి మంచినీరు!
మిషన్ కాకతీయతో చెరువే ఆదరువు
వికలాంగులు ముసలోళ్ళకు పెంచిన పించన్లే ఆసరా!

పర్యావరణ ధ్యేయంగా అడవి మెడలో హరితహారం
కేజీ టూ పీజీ అందరికీ ఆంగ్ల మాధ్యమం!
అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం
ఉద్యమాల ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు బహుమానం!!

అనారోగ్య పిల్లలకు ఆసరయ్యే అంగన్‌వాడీలకు
వీధులూడ్చి చెత్తతీసే పారిశుద్ధ్య కార్మికులకు
ఉపాధి కోల్పోయిన బీడీ కార్మిక మహిళలకు
సర్కారు అక్కున చేర్చుకున్న ఆర్టీసీ కార్మికులకు

తెలంగాణ కార్మికులకు కాంట్రాక్టు ఉద్యోగులకు
పర్మనెంట్ చేసేసి జీవితాలను మార్చారు
నిరుద్యోగ యువతకు పల్లెటూరి పేదలకు
ఉపాధిహామీ పథకంతో ఉపాధిని కల్పించారు

ఆలోచన ఆచరణ కన్న కలలే నిజాలుగా
పువ్వంత మృదువుగా వజ్రమంత కఠినంగా
అందరికీ అండగా కేసీఆర్ వుండగా
కాదా! తెలంగాణ... మరో సింగపూర్...!!!

**జి. బాలసరస్వతి**
14-194/1, మారుతినగర్ కాలనీ,
ప్రశాంత్‌నగర్, సిద్దిపేట. చరవాణి: 9912661463

196

## విరిమాలిక

తెలంగాణ వేదికపై జన విజయపు వేడుక
ఎద ఎదలో వెలుగొందిన చైతన్యపు దీపిక ॥తెలంగాణ॥

నవసమాజ నిర్మాణపు కాంక్ష ఉరకలెత్తగా
నవ పతాక చేతబూని జనము నడుము కట్టగా ॥తెలంగాణ॥

కలతలేని దారిలోన యువత భవిత సాగగా
కలిమినిండి తెలగాణము నాకముగా మారగా ॥తెలంగాణ॥

చెరువులన్ని జలమునిండి సిరుల పంట పండగా
పల్లెతల్లి ప్రజలతోడ మరల పులకరించగా ॥తెలంగాణ॥

నిస్వార్థపు నేతృత్వము ప్రజల కండనుండగా
అరవై ఏడుల మనకల సార్థకమై నిలువగా ॥తెలంగాణ॥

కరువు కాటకములు లేని రాష్ట్రముకై వేడుకొనుచు
మన తల్లికి గళసీమన వేసెడి విరిమాలిక
ఈ ఆశావహ గీతిక. ॥తెలంగాణ॥



**జి. విజయ స్వామి**
ప్లాట్ నెం. 111, ప్లాజా బ్లాక్, రాఖీవీవ్ అపార్ట్‌మెంట్స్
సఫిల్‌గూడ-500 056. సికింద్రాబాద్.
చరవాణి: 9441477699, 040-27220346

197

# మబ్బులు తొలగిన చంద్రుడు

మబ్బులు తొలగిన జ్వలిత చంద్రుడు
వెలుగు రవ్వలను విరజిమ్ముతున్నడు
పటాపంచలైన మబ్బులు
మళ్ళీ చంద్రుని కమ్మటానికి జంకుతున్నవి
ఏండ్లకొద్ది తపించిన పీడిత జనావళిలో
ఆశాజ్యోతులను వెలిగిస్తున్నడు
అందరికీ సమానంగా తన కిరణాలను పంచాలని
సామాజిక న్యాయం చేయాలని ఆశిస్తున్నడు.
గూడులేని వారికి ఆనందాన్ని పంచాలని
కూడులేనివారికి కడుపులు నింపాలని
గుడ్డలు లేనివారి శరీరాలు కప్పాలని
పేద ప్రజల జీవితాలలో
తంగేడు పూలరంగుల వెలుగులు నింపాలని
వారి కళ్ళలో కాంతిరేఖలు చూడాలని
చంద్రుడు తహతహలాడుతున్నడు.
తనకు స్వాగతం పలికే కలువల కొరకు
కలువల కుంటలు కావాలని
తనను కమ్మడానికి వచ్చిన మబ్బులను
వర్షధారలు కురిపించి చెరువులను నింపమని
తెలంగాణలోని
ప్రతి జలాశయాన్ని ప్రజల ఆశాలయంగా చేయమని
పేదల పాలిటి పెన్నిధులుగా మారండని
చంద్రుడు మబ్బులను అర్థిస్తున్నడు.
అమరుల త్యాగాల ప్రతిరూపమైన
నవ తెలంగాణ రాష్ట్రాన్ని
సామాజిక తెలంగాణగా
బంగారు తెలంగాణగా మార్చాలని
మబ్బులను వేడుకుంటున్నడు చంద్రుడు.
నిరుద్యోగుల పాలిటి కల్పవృక్షంగా
అమరవీరుల ఆశయాల కామధేనువుగా
కష్టజీవుల కన్నీటిని తుడిచే
కడలి చంద్రునిగా
నిరుపేదల గుండెలలో వెలిగే
నిండు చంద్రునిగా
కల్వకుంట్ల చంద్రుడు
వలస మబ్బులను
అర్థిస్తున్నడు.
వారిస్తున్నడు.
ఆదేశిస్తున్నడు
తొలి వసంతం సంబురంలో
తెలుగు వెలుగులు దశదిశల
పరివ్యాప్తం కావాలని
కలలు కంటున్నడు.
మబ్బులు తొలగిన చంద్రుడు

**జి. నర్సింహస్వామి**
1-12-110/1, శ్రీనగర్ కాలనీ, వినాయక్‌నగర్,
నిజామాబాద్ - 500 003 చరవాణి: 9441041475
ఇ-మెయిల్: swamy9933@gmail.com

198

## నాలోకి చూసుకుంటూ...

**బాపూ!**
నీవు పనిచేస్తూనే ఉంటావు
చీమైనా క్షణకాలం ఆగుతుంది
బొంగరంలా తిరగటమే జీవితమైన వాడివి
ఆగిపోవటం అంటే నువ్వు చెప్పిన శ్వాస చేసే
సయ్యాటల ముగింపు ఉత్సవమే మరి
ఇంకా నువ్వు చెప్పావు
అదే శ్వాస మరో నూతన బాల్యాన్ని
తొడుక్కుంటుందని..
ఏదో ఒక పని చేస్తూ చేస్తూనే ఉంటావు
అంత చలనశీల జీవితం నీకెలా అబ్బిందో?
నా మనోక్షేత్రంలో
అక్షరమక్షరం రూపు దిద్దుకుంటున్నట్లే
నిరంతరం తలరాత తలుచుకుంటూ
భూమిలా గుండ్రంగా నీ చుట్టే తిరుగుతూ
కన్పించిన అన్ని విషయాల్ని నీలో కలిపేసుకొని
వాటి చుట్టూ కూడా తిరుగుతూనే
అన్ని పనుల్ని పూర్తిచేస్తావు
సూర్యున్నైనా ఒక రోజు చూడలేనేమో కాని
నిన్ను చూడకుండా మాత్రం లేను
నీకు నేను చేసిందేమిటి చెప్పు?
నేను టీ తాగినప్పుడింత టీ నీకు ఇవ్వటమే
అన్నం తిన్నప్పుడింత అన్నం నీకు పెట్టడమే
అలా పనిమీద బయటకు వెళ్తున్నప్పుడు
ఓ చిరునవ్వు నీ పరం చేసేసి వెళ్ళటమే
ఒక్కనాడైనా నోరుతెరిచి ఫలానా కావాలని అడగవు కదా?
నీ కళ్ళలోకి చూసినప్పుడల్లా
తృప్తి నిండిన రెండు జలాశయాలు
తాము పరుచుకున్న మేరా
పంటల్ని పండించినట్లే ఉంటాయి
ఒక్కోసారి భయమేస్తుంది
ఆ కళ్ళు చిమ్మే అనంత వెలుగుల్ని చూస్తూ
నన్ను నేను తెలుసుకోవాల్సింది ఎంతో ఉంటుందని
ఎప్పుడు నా లోకంలోకి వచ్చావో కాని
నన్ను అక్షరమక్షరం కడుగుతూ ఉంటావు
మలినాలన్నిట్నీ తీసేసి మంత్రమేసినట్లే
నా ముందు పరిచిన దారిని పరిమళ భరితం చేస్తావు
ప్రభావ భరితమూ చేస్తావు-
ఎక్కడైనా ఒక్క మరకా నాకు కనపడదు కదా?
నీకు నేనిచ్చేదేదైనా ఉందంటే
నీ పనిగుణాన్ని
నిరంతరం హృదయంలా స్పందించే నీ జీవన విధానాన్ని
నాలో నింపుకుని
అక్షరాల్ని అల్లుకుంటూ వెళ్ళటమే
వాటిని నీవు నడిచిన దారిలో మాలలుగా నిలపడమే.



**జి. వెంకటేశ్వర్లు**
11-13-181/1, గ్రీన్ హిల్స్ కాలనీ, రోడ్ నెం. 1, సరూర్‌నగర్ పోస్ట్,
హైద్రాబాద్-35. చరవాణి: 9849044835

# 199

## వాళ్ళ మీద నాకు గురి

దిగజారిపోతున్న వాళ్ళని చూసి
ఎగతాళి చెయ్యకు
చితికి పోతున్న వాళ్ళని చూసి
చిత్రంగా నవ్వకు
దమ్ముంటే ఆదుకో
రొమ్ముంటే చేదుకో
ఏం చేయక మాత్రం
ఏ మనకు వాళ్ళను
మీలాగా వాళ్ళ బ్రతుకు
పూలబాట కాదు
మీలాగా వాళ్ళ జీవితం
తీయని పాట కాదు
కాలం ఎప్పుడూ ఎవ్వరినీ
కటాక్షవీక్షణాలతో కవ్విస్తుందో
కఠిన రూక్ష వీక్షణాలకు గురి చేస్తుందో
ఎవరికీ తెలియదు
వాళ్ళు -
కాలం చేతిలో ఓడిపోయినవాళ్ళు
మన దారిలో
ఎక్కడో విడిపోయిన వాళ్ళు
ఎంత అంధకారమైన
అరుణోదయం రాకతప్పదు
ఎంత శిశిరమైన
వసంతం వస్తుందని
ఆ విశ్వాసమే నాకు ఊపిరి
అందుకే ఆ ఆశాజనితుల మీదే
నాకు గురి

**ఘనపురం దేవేందర్**
9-8-9, గాజుల్‌పేట్, నిజామాబాద్-503 001
చరవాణి: 9030033331
ఇ-మెయిల్: dgchinnudinnu@gmail.com

## 200
## గిట్లజేద్దం

**జ**మ్మి చెట్టు
జన్మ ధన్యమైంది
జింక
పుట్టుక కూడా సార్థకమైంది
తంగేడు పువ్వు
బతుకు తలమానికమైంది
పాలపిట్ట
మనకు దేవతైంది
అమరవీరులు
ఇప్పుడు మనకు
ఇవ్విట్లనే కనబడ్తరు
ఆ... మర్చిపోయిన
గన్‌పార్కే కాదు
గల్లి గల్లిలల్ల ఎలిసిన
స్తూపాలల్ల ఒదిగిపోయిన
రాయిరప్పలు కూడా
అదృష్టం పొందినై అవ్విటికి
భూమి మీదనే సర్గం దొరికింది
తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డకు
ఇవన్నీ చరిత్రను చెప్తుతై
నీతి, న్యాయం, పోరాటం, త్యాగం నేర్పుతై
మొక్కులు తీర్సేతందుకు
గంగకు పోయినట్టు...
నర్సిమ్మ సామి దగ్గరకు...
రాజన్న దగ్గరకు పోయినట్టు
యాడాదికోసారి స్తూపాల దగ్గరికి పొండ్రి
కొబ్బరికాయ కొట్టకున్నా
రెండు కన్నీటిబొట్లు ఇడుపుండ్రి
దసర నాడే కాదు ఎపుడైతే అప్పుడు
జంబి శెట్టును తడుముండ్రి
పాలపిట్ట కోసం లెంకుండ్రి
జింకను జూలల్ల గాకపోతే
కనీసం బొమ్మలల్ల జూడుండ్రి
బతుకమ్మనాడే గాదు
తంగేడు పువ్వు ఎన్నడు గనపడ్డా
మొక్కి తెంపుండ్రి
ఇంట్ల దేవుడికి ఎక్కియ్యుండ్రి
ఇంతకన్న ఏం జెప్పాల...
గివ్వి జేస్తే మనుషులమైతం
సర్గమసుంటి తెలంగాణ గడ్డ మీద
మల్లా మల్ల పుడ్తం మల్లా మల్ల పుడ్తం
లోకంల మానవత్వానికి
పతాకలమవుతాం
జై తెలంగాణ.

**హలావత్ సీత్లానాయక్**
సాహితీబంజారనిలయం.
ఇంటినెం. 5-5-244, పార్శిబందం, ఖమ్మం.
చరవాణి: 9395130719

# 201

## చైతన్యపు జెండా

దోపిడి దొరల పెత్తనంపై
60వసంతాల అలుపెరుగని పోరాటం
మొక్కవోని దీక్షకు తార్కాణం
చైతన్యపు పతాకాల రెపరెపలు
గల్లి పల్లె నుండి గడపగడపకు ధూంధాంద్రుశ్యాలు
పసితనపు పంతాలు పసివాడాయి
కడుపు శోకంతో తల్లడిల్లిన తల్లులెందరో
వలసవాద పాలనపై వొరెత్తిన ఉద్యమం
బ్రతుకంతా బానిసత్వమేనానంటు గర్జించి
తెలంగాణ సాధన కోసం తెగించిన వీరత్వం
యాదగిరి నర్శింహుడు, బాసర సరస్వతి, భద్రాద్రి
శ్రీరాముడు
చల్లని చూపుల వెన్నెల దారిలో
సమ్మక్క సారలమ్మ సాహసగాథలు
కొమరంభీం, చాకలి అయిలమ్మల త్యాగాల వారసత్వం
నరనరాన నింపుకున్న చైతన్యపు దివిటీలై
మహోద్యమంగా మలితరపు త్యాగాల బాటలుపరిచి
రాలిన ప్రాణాలెన్నో రాక్షసతూటాలెన్నో
నల్లబంగారాన్ని విశాల అడవుల అందాల్ని
ప్రకృతి పరవశాలను ముసుగేయాలన్న కుట్రలను
గలగల ప్రవహించే జీవనదులను ధృతరాష్ట్రుని
కౌగిటబంధించాలని
ఉద్యోగ ఉపాధులను కబళించాలన్న జిత్తులను
పల్లెలు బిగిసిన పిడికిళ్ళు
విశ్వవిద్యాలయాలు విత్తన ఉత్పత్తి కేంద్రాలుగా
కార్మికులు, కర్షకులు, కూలీలు, నాలీలు,
ఉద్యోగమేధావులు
సవరించిన స్వరం తోరణ గర్జన చేసిన తీరు
తెలంగాణ సాధన చారిత్రక ఘట్టం
నాల్గున్నర కోట్ల జనం నవ్వుల సంబురం తెలంగాణ
ఆవిర్భావం
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!

**హిమజ**
305, సౌందర్య రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 8, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-29. చరవాణి: 9441492737
ఇ-మెయిల్: himajamangari@gmail.com

## 202

## సంధికాలం

విలీనమో విమోచనమో విద్రోహమో
తెలియకుండా వున్న సంధికాలమిది
ఓ నా హైదరాబాదు నగరమా
ఎన్నెన్ని చూసావు నువ్వు! మరెన్ని మోసావు నువ్వు!
ఉడుకుడుకు ఉద్యమాలతో ఊగిపోయావు వేగిపోయావు
వీరోచిత సాయుధ పోరాటాలకు వేదికవై నిలిచావు
మహోగ్ర నిరసనలతో మరిగి పోయావు
భూమికోసం భుక్తికోసం విముక్తి కోసం
సాగిన పోరాటాలకు బాటవు నువ్వైనావు
ఉద్విగ్న ఉత్తేజ వాహికవై సాగావు
మా ఉద్యమాలను మా భావావేశాలను
ప్రాణవాయువుగా చేసుకొని
మా స్వావలంబన ధిక్కార ధోరణుల
ఫలితాలు పర్యవసానాలు నువ్వే అయినావు
పోరుబాటకు తిరుగుబాటుకు
పిడికిలెత్తిన సాక్ష్యానివి నువ్వు
మహోజ్వల చారిత్రక ఘట్టాలెన్నింటికో
ప్రత్యక్ష ప్రతీకగా నిలబడిన ఆత్మశక్తివి నువ్వు
మేము మాత్రం ఇప్పుడు
నిజాం ధాష్టీక కృత్యాలను మించిన
అరాచకాలను అనునిత్యం చూస్తున్నాం
మా విశ్వవిద్యాలయం ఒక ఓపెనెయిర్ జైలిప్పుడు
మా విద్యార్థులు విధ్వంసకులు
పోలీసు పదఘట్టన ముళ్ళ కంచెల్లో
నిషేధిత వాఘాబార్డర్ మా యూనివర్సిటీ ప్రాంగణం
మా భాష ఎగతాళి-మా భావం అణచివేత
భాషలేని భాషాప్రయుక్త రాష్ట్రంలో
మాకు ఓంకారమైన మా నుడికారం
వాళ్ళకి మాత్రం హోహోకారం
మా భాషలేని తెలుగు పుస్తకాలు
మా ఊర్లులేని సాంఘిక శాస్త్రాలు
మా చరిత్ర తెలియనివ్వని చరిత్ర పాఠాలు
మా నదులు ఎండిన కన్నీటి చారలు
మా గుట్టల గుండెల్లో గునపాలు
టాంక్‌బండ్ మీద బండ్లరాళ్ళు
మా చరిత్రని లోయల్లోకి జార్చేసిన పిడుగురాళ్ళు
మా శ్రీకాంతాచారి, మా యాదిరెడ్డి
మా కానిస్టేబుల్ కిష్టయ్యల బలిదానాలు
మా విద్యార్థులు ఉద్యమకారుల చిత్రహింసలపై
కళ్ళుమూసుకున్న న్యాయస్థానాలు
ఆకలి చావులు ఆత్మహత్యలు
నిలువ నీడలేని బడుగు జీతగాళ్ళు
ఓ నా హైదరాబాదు నగరమా
ఇవి విలీనమో విమోచనమో తెలియదు గానీ
నవంబరు ఒకటి మాత్రం ఖచ్చితంగా విద్రోహమే!



ఐతా చంద్రయ్య
4-4-11, శేర్‌పుర, సిద్దిపేట-502 103
చరవాణి: 9391205299

# 203
# వేల సంవత్సరాల వెలుగు

వేలవేల వత్సరాలు
వెలిగిన తెలగాణమ్మా!
విశ్వమంత నీ సంగతి
వ్యాపించెను గదమ్మా!

దేశ స్వాతంత్ర్యమపుడు
దాస్యమనుభవించినావు
నైజాం పరిపాలనలో
నలిగి తల్లడిల్లినావు

సర్దార్ పటేల్ వ్యూహమున
స్వేచ్ఛను సాధించినావు
కొన్ని వత్సరాలు కొంత
మన్నన చూపించినావు

కృష్ణా గోదారి నదులు
కొంగునుండి పోతున్నవి
తాగుసాగు నీటికొరకు
తల్లడిల్లుటిక చెల్లదు

ఉద్యమాల ఊపిరిలో
ఉక్కిరిబిక్కిరైనావు
వేలాదిగ యువకుల బలి
దానములు భరించినావు

చంద్రశేఖర ప్రసాద
త్యాగములతో కదిలినావు
రాష్ట్ర సాధనా యజ్ఞము
ఫలితము సాధించినావు

నీ పిల్లల దరహాసము
నిగనిగలతో మురిసినావు
ప్రగతి పథము పాలనలో
సుగతులు సాధిస్తున్నవు

అభివృద్ధి పథమంటే
ఇప్పుడు తెలుసుకున్నాము
స్వర్ణ తెలంగాణ యజ్ఞ
సమిధలమై పోతాము

జయము జయము జయజయహే
జయము తెలంగాణ తల్లి
విశ్వవీధిలో నీకిక
ఎదురులేదు కల్పవల్లి.

**జనజ్వాల**
15-23, రాయిగడ్డ వీధి, వనపర్తి,
మహబూబ్‌నగర్ జిల్లా -509 103 చరవాణి : 9949163770
ఇ-మెయిల్: janajwala1957@gmail.com



# 204

# సంబరాలంటే

రాయిమీద రాయి పెట్టిన రాళ్ళమీద
ఒయబ్బో పచ్చని చెట్టు మొలచెనమ్మా
మొలిపించిరి... గతమంతా తడిసిన
పాలక అభివృద్ధి మంత్రాల యంత్రాల మీద -
పాము పడగల నీడల క్రింద పాట
విని విని అ అంటే అమలాపురమని నేర్చుకుంటిమి -
చించివేసిన... దాచివేసిన కాగితాలలోంచి, చరిత్ర అంతా
కాకమ్మ కథలతోనే పాఠాలు పాఠాలుగా
చదువుకుంటిమి -
నడిచిన కాలమంతా తెలంగాణ పీఠభూమి ప్రశ్నిస్తూనే
ఉంది! రాళ్ళమీద చెట్లు ఎలా మొలుస్తాయని!
అబద్ధానికి ఎంత అందమైన పాట కడితిరి అనీ...!
కాకమ్మ కథలలో చించివేసిన కాగితం ముక్కలు
ఎక్కడా అనీ! ప్రశ్నప్రశ్నలతో జతకట్టి ఎంత ఎంత
తడిసెనో ఈ నేలనేలంతా -
తడిసిన మట్టిమీద పులకరించి పుట్టిన బిడ్డలే కదా
నిన్న దాటిన మొన్నటికాలం మీద...,
రైల్లకు ఎదురుగా పరుగెత్తి పాట కొత్తగా పాడిరి -
పెట్రోల్‌తో తలంటి స్నానమాడి అపశృతి స్వరరాగమైన,
కొత్త స్వరం ఏదో వినిపించిరి - బ్రతుకంటే ఇక్కడ
ఎదిరించడం... చావు అంటే జీవించడం...
అందుకేనేమో... వందనంతో...తుజే సలామ్‌తో...
శాంతి ఉత్తుత్తి మాటల తిత్తి అని,
శాంతితో సాధించడమంటే అబద్ధమని చెప్పడానికి...
అమరుల రెప్పలక్రింద కాలిన కంటిగ్రుడ్లు అరుణ
నిప్పులకిరణ నొప్పులై చరిత్రకు తొవ్వ చూపుతుంది -
ఇన్నాళ్ల దుఃఖం, ఊరట పడదామని ఆరాటపడుతున్న
తెలంగాణ పునర్నిర్మాణ గొంతు అడుగుతుంది
ఆత్రుతతో -
తల్లి పాల పైట చాటు పిల్లలు పిరికివారు ఏమికాదని
రేపటికి భరోసాగా, బాసటగా నిలుస్తామని
సంబరాలకు తోరణాలు కట్టి మరీ యాడాది లేత
ముఖాన్ని ఆహ్వాన పత్రికలో వెతుక్కుంటుంది -
సంబరాలంటే..., పంజరంలోంచి ఎగిరిన చిలక రెక్కల
శబ్ద గీతం-సద్ది మూట మీద ఉడుకుడుకు నీళ్ళు
చల్లుకొని తినడం కాదు-
తెగిన తల... కాలిన వళ్ళు చచ్చిన త్యాగశీల ప్రాణులు
జీవించాలి సంబరాలంటే -
అమరుల కన్నుల క్రాంతి తొవ్వలో...
అలాయ్ బలాయ్ చేసుకోవడం -
తంగెడుపూల మీద సీతాకోకలు వాలి,
తొలకరి వాన చినుకుల్ని ఆస్వాదించడం -
ఎప్పుడూ నిండు గర్భంతో వుండే ఉస్మానియా
ఉద్యమ తల్లికి చేతులు ఎత్తి, అగ్నిపునీతం కావడం
సంబరమంటే... సంబరాలంటే...

జలజం సత్యనారాయణ
చరవాణి: 9849444944

205

# వేయి పూలు వికసించనీ

వేయి పూలు వికసించనీ
వేయి ఆలోచనలు సంఘర్షించనీ
వేయి పరిమళాలు అన్ని దిక్కులా వెదజల్లనీ
వేలవేల వృక్షాలు కొత్త చిగుళ్ళు చిగురించనీ
నిండుచూలాల్లా మావిచెట్లు పూయనీ
మావి చిగుళ్ళు తిని మత్తకోయిలలు మనసారా కూయనీ
వేపలు విరగబడి నవ్వనీ
పసిపాపల నవ్వులు పువ్వులై విరియనీ
ఆకాశంలోని వెన్నియలు ఈ నేలపై తేనియలై కురవనీ
ఎండిన ఎదలన్నీ నిండిన నదీనదాలై పారలనీ
మనుషుల మనసులు
మమతల మల్లెలు మొల్లలై గుసగుసలాడనీ
మనుషుల హృదయాలన్నీ
ముగ్ధమోహన అరవిందాలై విప్పారనీ!
తెలంగాణ  ఎవరో ఇచ్చింది కాదు
ఎవరో తెచ్చింది కాదు భిక్షం కాదు కనుక అసలే కాదు
ఎన్ని బలిదానాలు చేసినం ఎన్నెన్ని త్యాగాలు చేసినం
ఎంతమంది విద్యార్థులు అగ్నికి ఆహుతైనారు
ఇక్కడి చెట్లన్నీ కన్నీటి వానలో తడిసినై
ఇక్కడి నేలంతా ఉద్యమాల నెత్తుటితో మెరిసింది
తెలంగాణ పాటలు వడిసెల రాళ్ళయి
శత్రువుల గుండెలకు తగిలినై
ఇక్కడి ప్రజల ఆర్తనాదాలు
పార్టీల మెడలపై కత్తులై వేలాడినై అందుకే తెలంగాణ
ఎందరో త్యాగధనుల ఫలం
తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక
తెలంగాణ భూమిపుత్రుల జీవనగీతిక! ఇంకేముంది
తెలంగాణ రానైతే వచ్చేసింది
ఉద్యమానికి ఉరేయమన్నారు టిఆర్ఎస్ అసలు సిసలైన
రాజకీయ పార్టీగా అవతారమెత్తింది
తెలంగాణకు సై అన్నవాళ్ళు నై అన్నవాళ్ళు ఒక్కటైనారు
ఓట్లు ప్రజలవి అధికారం మాత్రం పెద్దోళ్ళది
చెట్ల వ్రేళ్ళు ఎప్పుడూ భూమిలోనే ఉంటాయి
కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పూలు పూస్తాయి!
ఇక్కడి చెట్లు, గుట్టలు, పుట్టలు
ఇక్కడి నదీనదాలు, వాగులు, వంకలు
గనులు, మణులు, రాళ్ళూరప్పలు
అన్నీ ప్రజలవే ప్రజలే పాలకులు
ప్రభువు లెవరైనా ప్రజాసేవకులే!
ఏమైనా తెలంగాణ మన కన్నీటి కల
కంటికి రెప్పలా దీన్ని కాపాడుకోవాలి
తెలంగాణ మేలిమి మేడిపండు కారాదు
అందరికీ ఆనందాన్ని పంచే అమృత ఫలం కావాలి
మనది కాళోజీ వారసత్వం ధైర్యంగా నిలబడదాం
అన్యాయాల్ని ఎదిరిద్దాం
అవసరమైన చోట ధర్మాగ్రహాన్ని ప్రకటిద్దాం
ధిక్కార స్వరాల్ని వినిపిద్దాం
అప్పుడే మట్టి తెలంగాణ బంగారు తెలంగాణ
అవుతుంది!

**జ్వలిత**
అక్షరవనం, ఫ్లాట్ నెం. 202, శేషసాయి ప్యారడైజ్,
విజయనగర్‌కాలనీ-2, ఖమ్మం-507 002 చరవాణి: 9989198943
ఇ-మెయిల్: jwalitha2020@gmail.com

206

# అవసరమైన ప్రశ్న

అవసరమైన ప్రశ్నగ మొలకెత్తిన ప్రతిసారి
తప్పుడు సమాధానం ఎదురయ్యింది
నే సరయిన ప్రశ్నగ తలెత్తిన ప్రతిసారీ
అనవసర సమాధానం నోరు మూయించింది
బిడ్డలను కూడా మాంసపు ముద్దలుగ చూస్తున్నా
ద్వేషం తండ్రి రూపమెత్తి హంతకునిగా రూపాంతరం
చెందినా
భర్తలు అనుమానపు జ్వాలలై
పచ్చని బతుకుల కాలుస్తున్నా
స్థితప్రజ్ఞత పొందిన మనసు మనకెందుకులే
అంటున్నది
అమ్మలు ఉడిగిపోయి అనాథ వృద్ధులౌతున్నా
గోవులు వట్టిపోయి వధ్యశాలలౌతున్నా
పసిపాపలు పావురాల గుట్టలౌతున్నా
గిడసబారిన గుండె తడిబారడం లేదు
కొండలన్నీ ధ్వంసమయి రోడ్లపై ఉరుకులు పెడుతున్నా
చెరువులన్నీ మాయమై మయుడి నిర్మాణాలౌతున్నా
తరువులన్నీ నరకబడి అడవులు వల్లకాడులౌతున్నా
బండబారిన గుండె మొండిదయ్యింది
ముంపు ముసుగేసుకొని మృత్యువు వేటాడుతున్నా
దండకారణ్యాలు రక్తపుటేరులౌతున్నా
హక్కుల రెక్కలు నరికి హింస రాజ్యమేలుతున్నా
సరిహద్దుల సైన్యం పిట్టలై రాలుతున్నా
శాంతి మంత్రాలు బూతుపురాణాలౌతున్నా
కలత చెందలేని కన్ను చెమ్మగిల్లట్లేదు
చెరువన్నా తరువన్నా అమ్మేకదా
అడివి అన్నా అమ్మ అనే కదా అర్థం
ఊరి పక్కన కొండలుంటే ఇంట్లో అమ్మ ఉన్నంత
ధైర్యం కదా
కలిమికోడి ఊరపిచ్చుక కనుమరుగౌతున్నవని
చింతిస్తున్నాం
అంతరించి పోతున్న తరులు గిరులు చెరువులతో
పాటు
ఆడపిల్లలను కాపాడుకోవాలి
కన్నతల్లి పుట్టినగడ్డ ఋణం తీర్చుకోవాలి

**జాజుల గౌరి**
3-16-13, నెహ్రూనగర్, రామంతపూర్, హైదరాబాద్-13
చరవాణి: 9848855366
ఇ-మెయిల్: gourijajula@gmail.com

207

# చైతన్య తెలంగాణా

ఎందుకంటుండ్రు ఇప్పుడు
బంగారు తెలంగాణా వచ్చిందని
నా తెలంగాణా అప్పుడు ఇప్పుడు
మరెప్పుడు బంగారు తెలంగాణనే
సమతుల్యమైన ప్రకృతి
అనంతమైన ఖనిజ సంపద
జలజలాపారే జలసంపద
వాగులు వంకలు నదులు
పసిపిల్లల్లా పలకరించే
సరస్సుల అందాలు
అన్నింటికన్నా అందంగా
మనసున్న మంచి మనుష్యులున్న
మన బంగారు తెలంగాణా
ఎన్నెన్ని ఘర్షణలు మరెన్ని సంఘర్షణలు
ఒక నిర్బంధపు సంకెళ్ళు తెంచడానికి
ఒకటే నిర్ణయం, ఒకటే నిబ్బరంతో
తెగించి పోరాడిన తెలంగాణా బిడ్డల
ఆత్మ బలిదానాలు
మరెన్నో ఆత్మఘోషల ఫలితం మన తెలంగాణా
ఇక ఎవ్వరినీ తిట్టవద్దు
మరెవ్వరిని నిందించవద్దు
త్యాగాల పునాదుల మీద
తెలంగాణా ఆవిర్భవించిన
శుభ సందర్భమిది
నేడు నిర్భయంగా నిశ్చలంగా
వడివడిగా సాగుతున్న చైతన్య తెలంగాణా
పాలకులు ఎవ్వరైనా పాలితులం మేమే
పీడించబడుతున్న వాళ్ళం మేమే
పీడన నుండి విముక్తిని కోరుకున్న వాళ్ళం మేమే
తెలంగాణా భాషను యాసను
పదసంపదను ప్రకృతి సంపదను
ఆత్మగౌరవాల తెలంగాణా ముద్దుబిడ్డలను
పది జిల్లాల సాక్షిగా భవిష్యత్తు తరాలకు
భద్రంగా అందించే బాధ్యత మనదే
అదే అదే మన బంగారు తెలంగాణా.

**జీవనరాధ**
1-60/1, గ్రా॥ ధర్మారం (బి) మం॥ డిచ్‌పల్లి,
నిజామాబాద్-503230 చరవాణి: 8985332294

208

# నవప్రస్థానం

పురిటినొప్పులు పడే వేళ
తల్లి కంటి నుంచి జారే ప్రతీ చుక్క
ఓ సంతోష తరంగమే
ఆరు దశాబ్దాల పురిటినొప్పుల్లో
నా తల్లి తెలంగాణ కంటి నుంచి జారిన ప్రతీ చుక్క
ఓ చైతన్య తరంగమే
ప్రకృతిని తాకే వెన్నెల కెరటం నా తెలంగాణ
ఉద్యమాల్లో పూసిన అగ్నిపువ్వు నా తెలంగాణ
అగ్నిపునీత నా తెలంగాణ
పరాయిపాలన పాతముచ్చట
ఆశయసాధన కొత్తముచ్చట
తరతరాల అంతరాలు ముందున్నాయి
కాలం ఆవలితీరంలో దీపధారులూ ఉన్నారు
ఆ అంతరాలు పూడ్చాలి....ఆ దారులూ వెతకాలి
కపట రాజకీయ మందమతుల మాటల మంత్రాలకు
జారిపోవద్దు
సమయమొచ్చింది సమరభేరి మోగిద్దాం
బిగిసిన పిడికిళ్ల సాక్షిగా
ఎగిసిన గొంతుకల సాక్షిగా
నవ ప్రస్థానాన్ని లిఖిద్దాం
బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం



**జూకంటి జగన్నాథం**
6-5-101, విద్యానగర్, సిరిసిల్ల, కరీంనగర్-505 301
చరవాణి: 9441078095
ఇ-మెయిల్: jukantijagannathm@gmail.com

209

# సైబర్ ప్రయాణం!

ఉన్నోడికి ఎప్పుడూ ఉగాది
లేనోడికి బతుకు ఒక మనాది ఇక్కడికి వస్తూ వస్తూ
కడుపు తరుక్కుపోతున్న మా ఊరును
తలమీద మోసుకొచ్చాను
ఎండిపోయి తల్లడిల్లుతున్న మా మానేరును
ఎదమీద తీసుకువచ్చాను
యంత్రాలకు క్షమధర్మం ఉండదు
కంప్యూటర్లు అన్నం పెట్టవు
టెలివిజన్లు సెల్‌ఫోన్లు ఇంటర్నెట్లు
విరిగిపోతున్న సంబంధాల్ని పునరుద్ధరించలేవు
బాగుపరుస్తుందనుకున్న జాతీయరహదారి
ఎక్కడికక్కడ చెరిపి ఇసిరిసిరి కొడుతుంది
అటకెక్కిన పనిముట్లతో
ప్రతి ఇల్లూ ఒక సాలార్‌జంగ్ మ్యూజియం
ఉన్నోనికి ఉగాది లేనోనికి జీవితమే మనాది
కూసాలు కదిలి లుకలుక లాడుతున్న
నాగలిని పదిలంగా భుజంమీద మోసుకొచ్చాను
వుండి అన్ని రకాలుగా కోల్పోయిన
మా మట్టి గట్టి ఆత్మను వెంట తీసుకొచ్చాను
ఎరువులు మోసం విత్తనాలు మోసం
ధరలు మోసం కరువులు మోసం
చెప్పుకుంటే బాధనే చెప్పుకోకుంటే బాధనే
వ్యవసాయం మార్కెటయ్యాక
గిట్టుబాటులేని పంటయ్యింది
ఎక్కడ తప్పు జరిగిందో తెలియలేదు
ఎప్పుడు తప్పటడుగు పడిందో ఎరుకలేదు
పిడికెడు మట్టిలోంచి గుప్పెడు అన్నాన్ని తీసిచ్చే
రైతు దేశానికి తలకుమించిన బరువయ్యాడు
సందెడు దూదిలోంచి జానెడు బట్టనిచ్చే
నేత కార్మికుడు వ్యవస్థకు తనకు మించిన కరువయ్యాడు
లేనోనికి పసుపన్నమే ఉగాది
ఉన్నోనికి అమెరికా ఒక పరమావధి
భూమయ్య  ఉన్న రెండు బక్కెడ్లను అంగడికి అప్పచెప్పి
బస్టాండులో బస్సుబస్సుకు తిరిగి
నీళ్లపొట్లాలు అమ్ముకుంటున్నాడు
మార్కండేయులు కులకళ్ళని నమ్ముకున్నందుకు
ఇల్లిల్లూ అడుక్కు కళ్ల నీళ్లు కమ్ముకుంటున్నాడు
ప్రపంచ గ్రామ సంగ్రామంలో కలలు కన్న గాంధీపురం
మానవ పరిమళం వాడిపోయింది
గాయం చేసుడే తెలుసుగానీ
నయం చేసుడు తెలువని అంతా జన్యురహిత విప్లవం
చెయ్యకుంటే కడుపుకాలే చేస్తే మనసు కాలే
ఉన్నోనికి బతుకు ఒక పెద్ద ఉగాది
లేనోనికి మెతుకు ఒక యుద్ధ మనాది
తండ్రులారా! చేతులు జోడించి మొక్కుతున్న
ఊరికి ఒక నిండిన చెరువును దానం చేయండి
తల్లులారా! తలవంచి లొంగిపోతున్న దేశాన్ని
చెట్టుకు దత్తత ఇవ్వండి

జూపాక సుభద్ర
13-6-462/ఎ/27, భగవాన్‌దాస్ వే, తాళ్ళగడ్డ,
హైదరాబాద్-500 006  చరవాణి: 9441091305, 9849905687
ఇ-మెయిల్: joopakasubadra@gmail.com

210

# దుక్కాల్ని దున్ని పోసుకున్న తొక్కుడు బండ మావ్వ

మావ్వ దిగుట్లె దీపంగాదు
ఆకాశం గొంగట్ల ఆగమైన పొద్దు
నేలమ్మ కొంగున అంగిట బట్టిన ఆకలి
ఒక్కొక్క పువ్వుగాదు వెయ్యేసి పూలేసినా
ఒక్క జాము నిండని సందమామ మా అవ్వ
సేతికి సెమటకు తీరని తెల్లారని గోస
రోట్లె తల్కాయ బెట్టి రోకటికి
ఎదురొడ్డిన తాలుగింజ బతుకు
కోడికూత పొద్దులన్ని అవ్వకండ్లల్లనే కాపేస్తయ్
సుక్కపొద్దున్నె ఆకిలూడ్సి అలుకుజల్లి లేపేది
అడివిల ఆవొ్రది ఇంటికాడ లాగొ్రది
గుర్తింపులేని గులాపుది మా అవ్వ
బువ్వ ఉడకలేదని మెత్తగైందని
రాయొచ్చిందని ఎంటికొచ్చిందని
కూలేది నాలేది ఏనేది పాటేదని
అయ్యకోపాల కొలిమిల బడి
ఎన్నిసార్లు భస్మమై పుట్టిందో...
మా అందరికి మావ్వ వండిన కుండ వాల్సిన మంచమే
నాగేటి సాల్లల్ల యిత్తునమై మొలిసే మొలకంత మా
అవ్వే మోకాటి బంటి మడుగుల
పొద్దొంగిన నడుమెత్తని నాటై కలుపై
ఎదుగే పచ్చని పైరంత మా అవ్వే
పొరబట్టి ఒడ్లు సెక్కినట్లు రాగాలు సెక్కి
పల్లెకు పాటలూదిందంతా మా అవ్వే
అవ్వపనిల దిగితె సెమట తోడిన సెలిమయ్యేది
పొయల సల్లారని పిడికె నిప్పయ్యేది
నేనవ్వ కడుపును నడికట్టోలె సుట్టుకున్న
వెచ్చటి యాదులే లేవు
సేగబారి కాయలు గాసిన మా అవ్వ
సేతిల పాలబువ్వ తిన్న సందమామ సంగతులె
ఎవరుకలె... పాలకేడ్సిన ఆకలి సత్తుగిన్నెల రాత్రి
బువ్వకాన్నె సల్లారని యాదులు సద్దుమనగలె...
అవ్వపక్కల ఆవులించి ఆడుకున్న పొద్దులే లేవు
పగిలిన డప్పుమీది దరువు మా వ్వ
భూమికి కాతాపూత పంటపలం నేర్పి
తోలుకు తొండమై దప్పె చెప్పెయని సెమటల్ల
సేదకు నోచని నాదము ఆసామి అయ్య సేతుల
తాడును తప్పించుకునే బొంగరం తన్లాట
బూమాతకు చాతిచ్చి బువ్వబెట్టిన
నాగలికి దూరం చేసిన నా రాజులు
దుక్కాల్ని దున్నిపోసుకున్న తొక్కుడుబండ
మూతిడువని చరిత్రల ముల్లె
కొంగు నడుమునకు సుట్టి కొడవలెత్తిన
సవాల్ మా అవ్వ మా సవాల్ మా అవ్వ గీ లోకములున్న
అక్షరాలు పాడువడ
మా అవ్వ తిరుగాడిన అంచులకే రాకపాయె




జూలూరు గౌరీశంకర్
1-8-702/33/20ఎ, పద్మకాలని,
నల్లగొండ, హైదరాబాద్-44
చరవాణి: 9440169896


# 211

# నా నేలమీద ప్రవహించవే గోదావరి

నీ అందం ముందు నేను సొమ్మసిల్లుతూ
నీ అలల నురుగుల ఊయల మీద ఊగుతా
నీ అందంతో నేను ముత్యపు చిప్పనై మెరుస్తా
నా దప్పిక తీర్చని
నా కన్నీళ్లని చూడని
నా ముంగిట గోదావరిని నాక్కాకుండా చేస్తున్న
అడ్డు గీతలను తుడిచేస్తా
నువ్వు పోయేదేమో నా వాకిలిముందునుంచి
గొంతు తడిపేదేమో వాడికా?
ఇదెక్కడి న్యాయం
గోదారమ్మా నువ్వు జెప్పే
కాసింత నోరిప్పే
నన్ను కడగొట్టోణ్ణి చేయకే

నీ తలపక్కన కోతకోసిన యిసుక
ఎందరో ఎన్నేళ్ళో కష్టపడి చెక్కినట్లు సిత్రాలు
వొళ్ళంతా కళ్ళు చేసికొని సూసినా
తనివితీరని అందాలు
నా సూపెంత దూరమో తెలుస్తుంది
కానీ నువ్వెంత విశాలమో తెలియట్లే
బాసరలో అడుగుబెట్టిన ఆ అందమైన అరికాళ్ళను
ఆ పాపికొండల మధ్య వొయ్యారంగా వంగిన
ఆ నడుము, ఆ గాలి తాకిడికి కదులుతున్న
ఆ వొంపుసొంపులు చిత్రకారుడి చేతికి వేయి కుంచెలు
నీ బుగ్గల సుడిలో సొట్టపడ్డ ఆ అందం ముందు
నా అక్షరాల అందగత్తెలు ఏం నిలుస్తయి
ప్రకృతినే పరవశింప చేసిన రూపంగదే నీది
నిన్ను వర్ణించడం నాకు వశపడనట్టే
ఈ అక్షరాలతో పద్యం రాయగలను
కాకుంటే సలసల కాగుతున్న నా కన్నీళ్ళను
నా కంటి జలపాతం నుంచి నీలోకి వొంపగలను
కవి లోతు, నది లోతు బైటకు కనపడదు
నా పక్కనుంచే నా కాళ్ళముంగటి నుంచే
గలగల పొక్కుంటూ పోయినవు
నన్ను సవతి కొడుకునే చేసింద్రు
నీకు తెగిపడ్డ తల్లిపేగు రోదన తెలుసు
ఈ బిడ్డకు పాలిచ్చిపోవే గోదావరీ

యిప్పటిదాకా గుక్కెడు నీళ్ళివ్వకుండా
నన్ను సవతి బిడ్డను చేసి పోయినవు
గోదావరీ... దండాలు నీకాల్మొక్తా
నిన్ను చూస్తే
కాలు మొక్కాలనిపిస్తుంది
వొల్లంతా పరవశం
చెప్పరాలేని కోటి భావాలు
కొట్టుకలాడుతున్నాయ్

నిన్ను యిడిసి పెట్టలేను
పెనవేసుకోవాలనిపిస్తుంది
తల్లి ఒడిలో బిడ్డనై ఒరిగిపోవాలనుంది
చెట్టు నుంచి వేర్లను, మట్టి నుంచి మొలకను
నీళ్ళ నుంచి నురుగును వేరు చేసినట్లు
తల్లిస్తన్యాన్ని బిడ్డకందకుండా చేసిందెవ్వడా?

నువ్వట్లా అంగలేస్తూ పోతుంటే
చుట్టూ ఎన్నెన్నో నాగరికతలు బట్టకట్టినై
ఎన్నెన్నో నాగరికతలు బట్ట కట్టినై
నిన్ను వర్ణించడానికి ఎన్ని జన్మలైనా ఎత్తుతా
నీతో మమేకం కావడానికి పెనుగులాడుతూ
నువ్వు అవనికే అందానివే
కాని నాకు మట్టుకు
నా నోటికి అన్నం పెట్టే
నీళ్ల కంచానివి కమ్మంటున్నా
మమ్మల్ని సల్లంగ చూసే చల్లటి అల కమ్మంటున్నా
నీనుంచి నన్ను ఎవడు ఎడబాపిండో ఎరకైనంక
నా కోపం కట్టలు తెగుతుంది
నా ఆగ్రహమే నా నేలకు ఆనకట్ట

యిప్పటిదాకా నీ నెత్తిన పూలచెండులాగా
నీ చెవుల కమ్మల్లాగ, కాలి గజ్జెల్లాగా
నీ భుజంపై పైటలాగా
నీ ఒంటిమీద అందంగా పరుచుకున్న గూళ్ళు
అందానికే దరుల్లాగా
పరుసుకున్న పాపికొండలు
ఆ అందాలను కనుమరుగు చేస్తున్న సేతులెవరివి
స్వచ్ఛమైన ఆ జొన్న రొట్టెల సంస్కృతిని
ఆ అమాయక అందాన్ని చెరిపేస్తున్నదెవరు?
ఆ చెట్టు ఇగురాలను తుంచేస్తున్నదెవరు?
నువ్వు పెంచిన సంతతే దిక్కులేని దైనంక
నువ్వు ఎందుకమ్మా?
అందుకే నా నాలుగోకన్ను తెరుస్తున్నా
నా నీళ్ళు నాకు దక్కకుండా పోయినంక
ఇంక నేనెవరిని విడిసిపెట్టను
ఎన్ని రాజదండాలేకమైనా
నిన్ను యిడిపించుకొస్తా
గోదావరి... అటుగాదె
ఇటే రా తల్లీ
కన్నీళ్ళతో నమస్కరిస్తున్న ఆ దోసిళ్లను నింపవే
నా అస్తిత్వానికి
నా స్థిరత్వానికి ఆసరా అయిన నిన్ను వొదిలిపెట్టను
నా నుంచి నిన్ను దూరం చేస్తున్నోళ్ళను అసలు
యిడిసిపెట్టను



**జూపూడి జిగీష**
ఖమ్మం.
చరవాణి: 9989366826

212

## నమో! నమో! నవతెలంగాణ

నమో! నమో! నవ తెలంగాణ!
నవ నవోన్మేషమై కొత్త పుంతలతో....
రతనాల వీణకు రంగులద్దాల !
నవరత్న ఖచితమై రాజ్యాలన్నిఏలాల
నాల్గు దిక్కు లందు నవనవ లాడాల!
జయహో! జయ జయ ధ్యానాలు, తెలంగాణకీ!
మున్ముందు సంబురాలు అంబరాల తాకా !
చంద్రుడి ఆలనపాలన అజరా మరమై !
దిగంతాల, దిగ్విజయమై వెలగాల!

ఈ కవిత "ఆకవిత" జనజాగృతమవ్వాల!
జలయజ్ఞంలో పూడికతీతలో కళకళలాడాల!
మిషన్ కాకతీయ కృషిలో రైతులే రాజులవ్వాల!
రుద్రమ పౌరుషం పునర్ వైభవం వెల్లివిరియాల!
కడుపు చెర్వు గాక మునుపే
చెరువులన్ని నిండాలె! పండుగ జేస్కుందాం!
పథకాలన్ని ఉర్కుతున్నయి!
ప్రగతి పథం జేరుతున్నయి!
నవతెలంగాణకు నమో! నమో! నమః

**జె. రామకృష్ణరాజు**
ఇం.నెం. 8-3-228/526/4, రెహమత్‌నగర్,
యూసుఫ్‌గూడ, హైదరాబాద్. చరవాణి: 9550453224
ఇ-మెయిల్: ramakraju315@gmail.com

# 213

## గజల్

నిట్టూర్పులై ఉప్పెనయై నినదించిన తెలంగాణ
కలలు అలలు సజీవమై  ఉదయించిన తెలంగాణ

దశాబ్దాల దమనకాండ వలసవాద నిర్లిప్తత
తొలగించగ ఆక్రోశం చిందించిన తెలంగాణ

కాళోజీ దాశరథీ జయశంకరు బోధనలే
సకల జనుల ఉద్యమమై సాధించిన తెలంగాణ

ఆ అమరుల త్యాగాలే తారకలై దారిచూప
సామాన్యుల ఆశయాలు చిగురించిన తెలంగాణ

శీఘ్రగతిన దార్శనికుల సంస్కరణలు అమలుచేయ
కలల అలలు సజీవమై చిగురించిన తెలంగాణ

ఎగురెను మన ఆశయాలు పతాకమై ఆకసాన
సంబరాల అంబరాన్ని సృజియించిన తెలంగాణ

ప్రాంతాలుగ వేరైనను ప్రాణంగ మసలుకుంటు
ప్రగతే మన లక్ష్యమంటు కాంక్షించిన తెలంగాణ

అలుపెరుగక అహర్నిశలుపోరాడగ ఓ కృష్ణా!
నాల్గు కోట్ల తనబిడ్డలు పులకించిన తెలంగాణ.





**జోగు అంజయ్య**
1-10-76/1/2, లక్ష్మిబాయికుంట, జనగామ-506 167
వరంగల్. చరవాణి: 8008957480

# 214

# ముఖారవిందం

నిన్న నాకొక కల వచ్చింది
పునర్నిర్మాణం అనే పుస్తకం
నా చేతిలో ఉంది ఆసక్తిని ఆపలేక
గబ గబ చదివాను

మొదటి పేజీ తీస్తుంటే
అమరుల ప్రతిరూపాలు
అభిమానంగా పలుకరించినవి
తెలంగాణ తల్లికి దండలు ఇచ్చి
ఎన్నటికి మరవొద్దన్నవి

రెండవపేజీలో..
రాజ్యం అనే పటం అధికారం అనే కుర్చీ
సామాజికం అనే చాప
ఓటు అనే ముద్ర కనిపించాయి
సకల జనుల సమ్మేళనమే
సమాజ నిర్మాణమని
పునాది రాయిని కాపాడితే
సుస్థిర శాంతి కలుగుతుందని
లిఖించబడినది

మూడవ పేజీ నిండా
చెమట చుక్కల సేద్యపురాశులు
చెరువు నీటి చల్లని చూపులు
చేప పిల్లల చక్కటి తొవ్వలు
మొక్కజొన్న ముఖారవిందాలు
పాలపిట్టల జోరు పిలుపులు
కందికాయల కవ్వింపులు
పల్లికాయల పట్టు విడుపులు
నువ్వు తోటల నవ్వులాటలు

నాలుగవ పేజీ అంతా
అడవి లాంటి చెట్టు మధ్య మధ్య ఇండ్లు
శ్రమజీవుల కులవృత్తులు తీరైనా సంస్కృతిలో
మెరుగులు దిద్దుకుంటున్న
కాలిబాటల కాంతిరేఖలు...
ఒకవైపు సీమాంధ్ర చొరబాట్లు లేని
తెలంగాణ పరిశ్రమల గేట్లు
మరోవైపు
ఎన్ని పేజీలు తిరగేసినా
అన్నింట్లోను కనిపించినవి
కొత్త జీవితాలు-కొత్త పాటలు
కొత్త రాగాలు-కొత్త నమ్మకాలు
కొత్త అనుభూతులు-కొత్త ఊసులు
లేచి చూస్తే
కలలోని తెలంగాణ
కళ్ళముందే నిలిచింది

**కనుకుంట్ల వెంకటేశ్వర్లు**
ఇం.నెం. 16-2-213, శివాజీనగర్, గోదావరిఖని,
మం. రామగుండం, కరీంనగర్, చరవాణి: 9849333252

215

# బంగారు వన్నె

అసలు ఎవరిచ్చారు నీకు ఈ వరం?
ఎవరద్దారు మరి నీకు ఈ వర్ణం?
కనకాన్ని భూమి ఎరువుగా వేసిందా
పసుపుతో ఆకాశం నీకు అభిషేకం చేసిందా?
తెలంగాణాకే నీవు ఓ తలమానికానివి,
పది జిల్లాల ప్రజలు తీర్చలేని రుణానివి
పడతులకు తోడు ముత్తయిదువవయ్యావు
పండుగకు ప్రకృతి మాతగా మారావు
ఉద్యమానికే నీవు ఊపిరివై పోయావు
రాష్ట్రం సాధించేదాకా మానోట రాగమయి సాగావు
పోరాటాలకు అమ్ముల పొదవయ్యావు
బతుకమ్మకు బంగారు ఎదవయ్యావు
అసువులు బాసిన వారికి శాంతి కపోతమయ్యావు
సానుభూతికి నీవు శ్రద్ధాంజలి మాలవైపోతావు
అమరులైన మా వీరులను నీ పొత్తిళ్లలో దాచుకున్నావా?
రాష్ట్రం సాధించామనే వారికి లాలిపాడుతూ జో
కొడతావా
అమూల్యమైన స్థానాన్ని పొందిన నువ్వు
అజరామరమైన నీ చరిత్ర నిలిచిపోనివ్వు
ఈ ప్రాంతానికే ప్రథమ పుష్పమయ్యావు
మా పూజకు నోచే తంగేడు పువ్వువయ్యావు





**కట్టా భగవంతరెడ్డి**
ఫ్లాట్ నెం. 316, ప్రశాంత్‌నగర్, వనస్థలిపురం,
హైదరాబాద్.

# 216

# యుద్ధం

యుద్ధం అనివార్యమైందిప్పుడు
దుర్నీతినేరకృత మృగీకృత వ్యవస్థ
జన జీవితాలను అతలాకుతలం చేస్తున్నప్పుడు
సమాజం అరలుపొరలుగా విచ్ఛిన్నమై, వివర్ణమై
అభివృద్ధి పేరున విధ్వంసం పరివ్యాప్తమవుతున్నప్పుడు
నెత్తుటి సంతకాల విత్తనాలను
మొలకెత్తకుండ ధ్వంస రచనలు చేస్తున్నప్పుడు
మరీచుల మందహాసాలు మాయలు చేస్తున్నప్పుడు
పాలకులు నియ్యోయ వంచక కళాపూర్ణులై
పాపాల పంటలు దండిగా పండిస్తున్నప్పుడు
యుద్ధం అనివార్యమైందిప్పుడు
సమూహంలో ప్రజలు దిక్కు తోచని ఏకాంతులై
జీవితాలు కుదించుకొని గిడస బారిపోతున్నప్పుడు
జనం రక్తమాంసాలు పిండుకొని తాగుతున్నప్పుడు
ధర్మపీఠాలు ఆదర్శమూర్తులకు ఆలవాలమై
ఆ ధర్మాన్ని ప్రశ్నించడమే అన్యాయమంటున్నప్పుడు
డాలర్ సామ్రాజ్యము ప్రపంచాన్ని దోచుకొని
ఫలహారంగా పసందుగా ఆరగిస్తున్నప్పుడు
యుద్ధం అనివార్యమైందిప్పుడు
రెండు పదులు నిండని యవ్వనాలు
ఆరు పదుల వృద్ధాప్యాలై విలపిస్తున్నప్పుడు
శాంతి, సౌభాగ్యాల మాటున
అడవిబిడ్డల, ఆదివాసుల జీవితాలు హరిస్తున్నప్పుడు
వర్గ, వర్ణ అహం జులుం ఆధిపత్యాలు
ఊచకోత ఉత్సాహాలు జరుపుకుంటున్నప్పుడు
మూలాలకంటా మనిషితనం పెకిలించబడి
మొత్తానికి మొత్తంగా వైమనస్యలతకు గురైనప్పుడు
యుద్ధం అనివార్యమైందిప్పుడు
తెగబడిన తెగబలసిన తనం
పేదరికాన్ని వెక్కిరిస్తున్నప్పుడు
తెల్లోని దొంగ తొత్తు దళారి సంతతి
వలస వాసనల వారసత్వాల కిరాయి బ్రతుకుల్లో
జనం విసిగివేసారి దుఃఖితులైపోతున్నప్పుడు
అధికార వంచనా శిల్పాలు నగ్న దృశ్యాలై
జనం తలల మీద నాట్యం చేస్తున్నప్పుడు
మన ఇంట్లో మన గొంతుల్ని నులిమి వేస్తున్నప్పుడు
యుద్ధం అనివార్యమైందిప్పుడు
ఓట్లు నోట్లకు కొనుగోలు సరుకై
ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నప్పుడు
రాజ్యాలకు రాజ్యాలే తెగ నమ్ముకుంటున్నప్పుడు
డాలర్ గమ్మత్తు మత్తు సంస్కృతి
జాతి జవసత్వాలను నిర్వీర్యం చేస్తున్నప్పుడు
నా నేల మీద నన్ను పరాయీకరిస్తున్నప్పుడు
యుద్ధం అనివార్యమైందిప్పుడు
శతకోటి మహాధిక్కార స్వరాలు
సమర ఢంకాలై మోగాలిప్పుడు
సుందర సమ సుమధుర సమాజావిష్కరణకు
ప్రస్థానం మహాధిక్కార ప్రస్థానం కొనసాగాలి

**కపిలవాయి వెంకటేశ్వర్లు**
1-10-5/17/బి, ఎస్.ఎస్. గుట్ట, మర్లు,
మహబూబ్‌నగర్-509 001 చరవాణి: 9494019898

# 217

# సంకల్పం

విజ్ఞాన యుగమునా
చరిత్ర కాలరాసినా
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం
నూతన కార్యాచరణకై శ్రీకారం
బంగారు భవిష్యత్తు
రేపటి తెలంగాణ ఉషస్సు
పథకాలు పచ్చని తోరణాలై
పర్యావరణానికి అనుగుణమై
హరివిల్లే హరితహారం
మంచి సంకల్ప భావం
నెర్రలిడ్చిన చెరువులు
పూడికతో పునీతమై
జలకళ కలకలలాడాలనీ
మిషన్ కాకతీయ పనితనం
నిండు మనస్సుతో సాధనం
ప్రజల మమేకంతో
ప్రభుత్వ అధికారుల అండతో
వలస జీవితాలకు ఉపాధి ఊతమై
అన్నదాతలకు ఆసరై
దళారుల వ్యవస్థను రూపుమాపడం
అవినీతిని నిర్మూలించడం
లక్ష్యం దిశలో పునరంకితం
గ్రామ జ్యోతి పథకం
స్వార్థం విడనాడీ
సాక్ష్యం బతికించీ
నీతి నీయతి నిలిపి
నాణ్యత నైపుణ్య ప్రణాళికలై
చిత్తశుద్ధిగా సుపాలనగావించి
ప్రజల గుండెలలో కొలువుదీరి
కొత్త వెలుగుల తెలంగాణ విరజిమ్మాలి
మనస్సు యథార్థమై ప్రయత్నించు
అన్ని ప్రయత్నాలు ఫలాలై పంచు
జై రేపటి బంగారు తెలంగాణ



**రాగ (కసువోజుల రాజేశ్వరి)**
1-3-186/1, విద్యానగర్‌కాలని, కొత్తగూడెం,
ఖమ్మం జిల్లా. చరవాణి: 7382090681

# 218

## స్వ తెలంగాణ స్వరం

పొద్దుపొడవగనె ఆకలి నకనకలను
అంబలితో కంబళి కప్పి
మెట్ట చెలకల్లో నాగలికి తోడై
కాడెడ్ల జోడిని ముల్లుగర్రతో
సాలు బెట్టించి
నేలతల్లిని తడిమి చూస్తూ
ఎర్రని మొగులును నీరెండిన
కళ్ళతో ఆహ్వానిస్తూ
వానదేవుడా యాడ కూసున్నవూ....
ఎప్పుడొత్తవో అనుకుంటూ
తన దోసిట చెమటతో తడసిన
మట్టి వాసనకు సంబరపడి
కురుపు వానదేవుడా కురుపు
నీ కడుపు సల్లగుండ మా కడుపు నిండేలా
రావయ్యా ఉరికి రావయ్యా....
రక్తారుణ రజాకార్లు
సిరాచుక్కల సిల్లరదేవుళ్ళు
దారిచూపే కాళోజీ కైతలు
ఎదురుగా నిలిచిన కన్నాభిరామ్
కొమరం భీం తూటాలు
ఒక్కసారి యాదికొచ్చి
గట్టుమీద కూలబడి
ఎన్నో ఎన్నో నెలలు, కళ్ళు మూతలు
పడ్డాయి
మెరుపు మెరిసింది
పిడుగులు పడ్డాయి
వానజల్లుకు మారుగ
వడగండ్లు కురిసెననగ
ఆకసాన ఉస్మానియా కిశోరాలు
దోసిటలో పూలవాన
ఒక్కటైన వేలవేల సిరాచుక్కలు
మొక్కవోని కోటిగళాల తేనె
మొగులు పై గీసే ఇంద్రధనుస్సులా
నాతెలంగాణ మన తెలంగాణ
"నవ చైతన్యపు సారం
స్వతెలంగాణ స్వరం"

**కందాళై రాఘవాచారి**
సాయి రెసిడెన్సి, ప్లాట్ నెం. 503, వినాయక్‌నగర్,
నిజామాబాద్ (పోస్ట్)-503 003
చరవాణి: 9908612007

# 219

# చెరువు పూజ

**భూ**మి పూజ కాదు
చెరువు పూజ చేయాలి!
ఇప్పుడున్నవన్నీ పేరున్న చెరువులే!
నీరున్న చెరువులు కాదు!
నిండైన చెరువుల కోసం
పాతకాలంనాటి చెరువుల చరిత్రను తవ్వాలి లోపలి
లోపలికి.
తవ్వకాల్లో తట్టెడు తట్టెడు బయటపడేవి
బంగారు నాణాలు వజ్రాలు వైఢూర్యాలు కాదు
తెరుచుకున్న తడి తడి ఊటలు
పెరుగుత్ను లోతుల చిమ్ముడు
జలధారకు రహదారులు!
బారులు బారులుగా నీటిపాయల పాయసాలు
చెరువుకు పూలువేసి
మనసారా పూజ చేయాలంటే పొడిపొడిగా కాదు
నిండారా నీరుండాలి!
పుష్కరాలంటే గుంపులు గుంపులుగా జనం కాదు
గలగలపారే జలాల జీవనదుల ప్రవాహాలు
ప్రవహించి వచ్చే పితృదేవతల నాటి ప్రవాహ ఆశీస్సులు
ఎటుచూస్తే అటు నీరుండే జలోత్సవం! జనోత్సవం!
నిండా నిండిన చెరువు నీళ్ళలోకి
తంగేడుపూలు తమ బంగారు రంగు సింగారం
చూసుకుంటూ
పూలు రాల్చి అభినందనలు తెలుపుతాయి
అరే! కోటి కోటి తంగేడు పూలు నీళ్ళలో రాలగానే
చెరువు చెరువంతా బంగారు రంగులోకి మారుతున్న
బంగారు తెలంగాణలో బంగారు చెరువు!



కందుకూరి శ్రీరాములు
503, సుహర్తివెస్ట్, 16-11-1/5/డి/2-3, సలీంనగర్,
మలక్‌పేట్, హైదరాబాద్-36. చరవాణి: 9440119245
ఇ-మెయిల్: kandukoorisreeramulu20@gmail.com

220

# వ్యవకలనం

అర్థంకాని దొక్కటే!
ఈ కలగాపులగపు సహస్రవర్ణ కలగూరగంప
మనిషి అంతర్ముఖంలోని బహుముఖాలు
అపహాస్య వ్యంగ్య అసభ్య వక్రీకరణ భ్రమణాలు
బహుపద ద్వంద్వార్థాల విభిన్న దృక్కోణాలు
లేఖనాల్లో ఉల్లేఖించిన కవిత్వతత్వ బింబ ప్రతిబింబాలు
అక్షర నాణేల వ్యాపార వ్యవహారాల చిత్రవిచిత్ర
చిత్రాలు హిమ శిఖరాల ఘనద్రవవాయు రూపాల
మహోత్తుంగ తరంగాలు వాదాలా
ఉగ్రతీవ్ర తీవ్రాతితీవ్రాల వాయుగోళాలే
సమర్థించటమో వ్యతిరేకించటమో
పట్టించుకున్నట్టుండటమో పట్టనట్టుండటమో
క్రీడల నీడల్లో తడబడుతూ నడయాడే వాడల జాడలు
ఉద్భోధార్థాలు తెలియని అమాయకులెవరూ లేరు
అందరూ అన్నిట్లో ఆరితేరిన
అన్నిట్లో లోతు లెరిగిన యుద్ధ నైపుణ్య విశుద్ధ
సిద్ధహస్తులే! సమస్య ఎట్లా మొదలైనదన్నదే సమస్య
మొదలై పర్జన్య వాయువ్యాస్త్రాలు ఎదురెదురుగా
గురుశిష్యుల్లో రాజకవుల్లో ధనికపేదల్లో
రెండే రెండు వర్ణదృక్కుల వర్గదిక్కులు
యుద్ధం మొదలవకముందు ఎవరి రూపాల్లో వాళ్ళు
మొదలైంతర్వాత పురాతత్వ కంకాళాల పరకాయ
ప్రవేశాలు వీరుల్లో వెన్నుపోటు దారుల్లా!
వెన్నుపోటు దారుల్లో వీరుల్లా!
అసలు రూపాలను దాచేయటమే అర్థంకాని సమస్య
సప్త సముద్రాల కావల మర్రితొర్రలో
చిలుకలో ప్రాణముండటమే వింతల్లో వింత
బతుకో ఉనికో సూచనో గుర్తింపో
పదాల పాదాల విశిష్ట చేష్టల
స్పష్టాస్పష్ట మేఘ గమనాగమనాలు
అది సమర్థనో వ్యతిరేకమో అర్థంకాని
అమాయకులెవరూ లేరు ఆడామగా రెండే రెండు
మంచీ చెడ్డా రెండే రెండు ధనికా పేదా రెండే రెండు
ఇలా రెండుండాలి!
మధ్యలో గీత భగవద్గీతలో బోధపడని అర్జునుడెవ్వడు?
సంతకాల అంకితసంకేతాలు దృగ్గోచరమైనా
ధృతరాష్ట్ర కౌగిలులే! లిపిలేని ఈర్ష్యాసూయద్వేష భాషల
పురివిప్పిన ఝరీ ప్రవాహాలే!
ప్రాణం తీసేది అసెంబ్లో పార్లమెంటో
కోర్టో కొయ్యనో ఉన్మాదమో అధికారమో
ఇదో లెక్కనో అదో హక్కనో
ఏ ఒక్కరిదీ కాదు! కాకూడదు!
అమాయకుల్లో అసాధ్యుల్లో ఏ ఒక్కరూ బలికాకూడదు!!
ప్రజాపాలన పరిహాసం కాకూడదు
అర్చనలూ అభిషేకాలూ అవసరం లేదు
ఉంటే అన్నీ ఉండనీ - లేదా
ఈడ్చేసి పూడ్చేసిన అన్నీ వ్యవకలన నిషేధ ఔషధాలే!

కంకణాల రాజేశ్వర్



# 221
# తెలంగాణ వైతాళికులు

'పంపన'కు జన్మనిచ్చి 'బద్దెన'కు పద్యమిచ్చి
భీమకవి చనుబాల బీజాక్షరమైన తల్లి
'హాలు'ని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల
బృహత్కథల తెలంగాణ కోటిలింగాల కోన.

ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన
తెలుగులో తొలి ప్రజాకవి 'పాలకుర్కి సోమన్న'
రాజ్యాన్నే ధిక్కరించి రాములోరి గుడిని కట్టి
కవిరాజై వెలిగె దిశల 'కంచర్ల గోపన్న'.

కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి
'మల్లినాథ సూరి' మా మెతుకుసీమ కన్నబిడ్డ
ధూళికట్ట నేలినట్టి బౌద్ధానికి బంధువతడు
'దిగ్నాగుని' కన్న నేల ధిక్కారమే జన్మహక్కు.

'పోతన'దీ పురిటిగడ్డ 'రుద్రమ'దీ వీరగడ్డ
"గండరగండడు 'కొమురం భీముడే' నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప"
రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచెర్ల

సర్వజ్ఞ సింగభూపాలుని బంగరు భూమి
వాణీ నా రాణీ అంటూ నినదించిన కవికుల రవి
'పిల్లలమర్రి పినవీరభద్రుడు' మాలో రుద్రుడు
'సమ్మక్క'లు 'సారక్క'లు 'సర్వాయి పాపన్న'లు

సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు
ఊరూర పాటలైన 'మీరసాబు' వీరగాథ
దండునడిపే పాలమూరు 'పండుగోల్ల సాయన్న'
భావ ప్రకటనా స్వేచ్ఛకోసం ప్రాణాలొడ్డిన
'షోయబుల్లాఖాన్'.



**కమలేకర్ నాగేశ్వరరావు**
మహబూబ్‌నగర్. చరవాణి: 9490147801

# 222

## 'విజయ' తెలంగాణ

ప్రజలకాంక్ష
ప్రతి మది ఆకాంక్ష
కపటం లేని మనసున హృదయ కవాటాల్లోంచి
తెరుచుకుంది 'నా తెలంగాణ'
ఈ విజయ తెలంగాణకై ప్రతిమది హృదిని
కలవరపరచిన కథలెన్నో కథలెన్నో... కథనాలెన్నో....
ఆత్మహత్యలు, అమరుల బలిదానాలు
గుండెల్లో మంటరేపుతుంటే
ఇన్నాళ్ళ అరాచకాలకు బలియయ్యామన్న బాధ
కన్నీరు పెట్టిస్తుంటే
అప్పుడప్పుడు విరబూస్తున్న కుసుమాలు
ఉద్యమాల బాటపట్టి
మృత్యువును ముద్దాడుతూ నేలరాలిపోతుంటే
మరుపురాకుండా కడుపుకోతయై
ఆ నీడలు వెంటాడుతూ ఉంటే
సకల జనుల సమ్మెలు, వంటావార్పులు
సహాయనిరాకరణలు
ప్రతిమదిని చైతన్య పరుస్తుంటే
అవకాశం అందిస్తూ జరిగిందే ఎన్నికల యుద్ధం
ప్రజల చేత బట్టిరి ఓటు అనే ఆయుధం
తెలిపి తెలంగాణనే మా అందరి ఆమోదం
ఒకే త్రాటిపై ఒకే మాటపై ఒకే బలమై, ఒకే కలమై
ఒకే గళమై వినిపించిరి తెలంగాణ విజయమై...
చిట్టిచేతులు చిన్నారి గొంతుకలు యువత చేతలు
ముదసలి ముచ్చట్లు ఎక్కడ విన్నా
అందరినోటా తెలంగాణ విజయమే
కలిసికట్టుగా సాధించాం అమరులకు గుండెల్లో
గుడికడుతూ
సుపరిపాలనా సాగిద్దాం
జ్యేష్ఠ మాసం తెలంగాణ జ్యేష్ఠుడి ప్రమాణం
ఇదే మనందరి విజయానికి ఇమానం
ఆరు ఋతువులు తోడై ఉండాలని ఆరవమాసం
రెండు కళ్ళు, రెండు కాళ్ళు విజయం వైపే చూడాలని
విజయం వైపే అడుగులు వేయాలని రెండవతేది
జయాలన్ని మన వెంటే ఉండాలని,
తెలంగాణా విజయాన్నిచ్చిన 'జయ' నామ సంవత్సరం
రాదేది చేయనిది, లేదేది చేతకానిది అని పలికిన
మహోన్నత వ్యక్తి (కె.సి.ఆర్) విజయం
ఈ విజయమే అందరిది
జై తెలంగాణ, జై తెలంగాణ, జైజై తెలంగాణ

కమలేకర్ రామచందర్‌జీ రావు
చరవాణి: 9490411734

223

# విజయోత్సవ హారతి

జయ జయహే జననీ తెలంగాణ భారతీ!
జయజయోస్తు నీకిదే విజయోత్సవ హారతి!
అరువదేండ్ల అలుపెరుగని మా పోరాటం
నేడు విజయ తీరం చేరిన కెరటం!
మా భూముల నాక్రమించి
మా నిధులను కొల్లగొట్టి
మా యువకులను జైళ్ళలో త్రోసి
మా హక్కుల కాలరాసి
ఒప్పందాలను చెత్తబుట్టపాల్జేసి
మా భాషా సంస్కృతుల నవహేళన జేసి
అడుగడుగున వివక్ష జూపి
అధికారబలంతో అణచివేయ జూసి
దురహంకారంతో విర్రవీగి
తెలంగాణకొక్క రూకైనాఇవ్వను పొండి అని
అసెంబ్లీలో వెర్రికేకలేసిన
ఆంధ్రనేతల అడ్రసు గల్లంతైన రోజు నేడు!
ఆంధ్రపాలన అంతరించిన రోజు నేడు!
నవ్య తెలంగాణ ప్రభవించిన రోజు
నవకాంతులు ప్రసరించిన రోజు!
ఆబాల గోపాల హృదయాలు
ఆనందడోలిక లూగిన రోజు!
ఎందరో విద్యార్థుల ఆత్మార్పణలు
ఎందరో వీరుల బలిదానాలు
అమరణ దీక్షలూ సకలజనుల సమ్మెలు
ఎందరెందరో అమరవీరుల త్యాగాలు
అందరి త్యాగాలు ఫలించెను నేడు
ఆ త్యాగాలను మరువరు తెలంగాణ ప్రజలు!
ఆ అమరవీరులకివే మా జోహారులు!
అమ్మ తెలంగాణకు దాస్య విముక్తి కల్గినదీ రోజు
నవ తెలంగాణ కొరకు మేము కన్నకలలు సాకారమై
అవతరించిన మా నవతెలంగాణ భారతీ!
నవ సామాజిక భవ్య తెలంగాణ భారతీ!
అమ్మా! గైకొనుమా విజయోత్సవ హారతి!

కమలేకర్ డాగోజీరావు
చరవాణి: 8185032426

# 224

## బంగారు తెలంగాణ

ఆరు దశాబ్దాల పోరాటం
తెలంగాణ ప్రజల ఆరాటం
అమరుల త్యాగాల ఫలితం
ఆకాంక్షలన్నీ శుభాకాంక్షలై
వెల్లి విరిసిన శుభోదయం
తెలంగాణ తల్లికి

విముక్తి లభించిన వేళ
పదిజిల్లాలలో ఆనందహేల
తెలంగాణ పునర్నిర్మాణంలో
ప్రతి ఒక్కరం భాగస్వాములౌదాం
బంగారు తెలంగాణ
చూసుకుంటూ మురిసిపోదాం

కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు
చరవాణి: 9441076632

## 225

## తెలంగాణ జయహో!

ఇది చరిత్ర సృష్టించిన నేల
ఇక్కడ మట్టిని తొలుచుకొని
పిడికిళ్లు మొలుస్తాయి
ఇది ధిక్కరించిన మాగాణం
ఇది లేచి నిలిచిన తెలంగాణం
నా తెలంగాణమా
కోటి త్యాగాల వనమా
పోరాటోద్యమాల గీతమా
ఆత్మ బలిదానాల దీపమా
ఆత్మ గౌరవ కేతనమా

నిన్నటి రక్తాశ్రువులు
నేడు ఆనంద బాష్పాలవుతున్నాయి
అమరుల ఆకాంక్షలు పరిమళించగా
తడి ఆరిన కళ్ళ ఆర్తి తీర్చగా
మడి తడవని చేను
గుండె కోత తీర్చగా
మన కలల రాజ్యాన్ని
మనమే ఆవిష్కరించుకొన్న వేళ
నవ్యరాగాల నవ్యతెలంగాణకు
జయములిచ్చెడి విజయ తెలంగాణకు జయహో!





**కరిపె రాజ్‌కుమార్**
ఇంటి.నెం. 13-105, ఎస్.టి.ఆర్. చౌక్ ఖనాపూర్ (పోస్టు),
ఆదిలాబాద్ (జిల్లా)-504203. చరవాణి: 8125144729

# 226
# స్మృతిగీతాలు

తర తరాల వన్నె తరగని వారసత్వ సంపన్న
పరిమళాలు
నరనరాల వెన్ను చూపని సడలని దృఢ సంకల్పాలు
ఆకుపచ్చ మరకతాల్లో అమరులై అమరిన పుప్పొడి
రేణువులు
చీకటి చీల్చుకొని చిగురించిన చిత్తడి బతుకుల పసిమి
ఛాయాచిత్రాలు
ఆకాశమార్గాన అహరహం ఆశీర్వదించిన అమరుల
తెలంగాణాలు
సువర్ణవర్ణ సూర్యకాంతులతో పుటంబెట్టిన పుత్తడి
రేకులు

ఎర్రనేలల్ల ఏపుగా ఎదిగిన పచ్చ పచ్చని పందిరి
పొరకలు
పోరు గడ్డల్ల పొటమరించిన పొగరుబోతు సుమదళాలు
మిర్రమడులల్ల మిత్తి వీణా తంత్రులను మీటిన
మిణుగురు పురుగులు
బతుకమ్మ సిగలో బతుకుపూలైన సాంస్కృతిక
గాయాల గేయాలు
పొద్దుపొడుపుల్ల తరచూ తరచి చూసుకునే
అమృతవీరుల
అవిస్మృత స్మృతి గీతాలు తంగేడుపూలు

**కాచాపురం పాపేశ్వరశర్మ**
వినాయక్‌నగర్, జన్నారం-504 205, ఆదిలాబాద్.
చరవాణి: 9966249287

227

# సమైక్యతా గీతం

దేశానికి మనమే సౌభాగ్యం
విశ్వానికి మనమే ఆదర్శం
తెలంగాణను కలిసి సాధించాం
శ్రమశక్తితో ఈ భువి సేవిద్దాం
న్యాయానికి గౌరవమే ఒసగి
ధర్మానికి నెలవుగనే నిలచి
స్వార్థాగ్నిని మనమున చల్లార్చి
సహజీవన పథమున పయనిద్దాం
దేశానికి ప్రగతిని చేకూర్చే
మార్గాలను వెదుకుచు సాగుచునే
బలిదానాలొసగిన వారలను
స్మరియించుచు ముందుకు సాగుదాం
సమసమాజమే మన లక్ష్యముగా
సహకారమె నైతిక వర్తనగా
సంస్కారవంతులుగా వెలుగొంది
శ్రేయోభిలాషులుగ మనముందాం
చంద్రశేఖరుని నాయకత్వ పాలనలో
బాధ్యతలే సత్ఫలితాలొసగ
జయశంకరు, కాళోజీ కలలన్నీ
నెరవేర్చగ దీక్షతో ముందుందాం.





కాల్వ వేణుగోపాల్
12-2-17, గణేష్‌నగర్, సిద్దిపేట, మెదక్‌జిల్లా.
చరవాణి: 9701750863

228

# వజ్రాల తెలంగాణ

తెలంగాణ జాగ
ఎన్ని పూజలు చేసుకుందో
ఎన్ని నోములు నోచుకుందో
ఒక చింతమడక చిన్నోడు
తెలంగాణ బిడ్డల సహకారంతో
అలుపులేక, సొలుపులేక జై తెలంగాణ అంటూ
తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి మేలుకొలుపు
అయినాడు.
ఒక ఉద్యమ సారథియే ముఖ్యమంత్రి కావడం
తెలంగాణ చేసుకున్న అదృష్టం!
తెలంగాణ చేతలెంతో అద్భుతం!!
బడుగు వారి గడప గడపకు
కల్యాణ లక్ష్మి పథకం కలకల లాడించింది.
రెండు వందల రూపాయలను ఐదు రెట్లుగా పెంచి
పింఛన్‌దారుల సంతోషంను ఎన్నో రెట్లు పెంచెను
పింఛన్ ఫికర్‌ను పటాపంచలు చేసెను
కరువుతో గుండె బరువెక్కిన తెలంగాణ
నిరంతర కరెంట్ కోతలకు నిలయమై
అథోగతి పాలవుతున్న తరుణంలో
ఇరవై నాలుగు గంటల కరెంట్ సరఫరాకు కృషి
ఇరవై నాలుగు కారెట్ల బంగారంగా మార్చింది
అభివృద్ధికి చిరునామాగా మలిచింది.
బీడువారిన బీడీ కార్మికులకు
వెయ్యి పించను అందించిన పథకం
ఆడపడుచుల ఆరాధ్యదైవం అయ్యింది.
కరువు కోరల్లో కబ్జాదారుల కోరల్లో చిక్కి
చెరువు తల్లి గుండె చెరువైంది
ఆగ్రహించి మీసము తిప్పిన మిషన్ కాకతీయ
చెరువుతల్లి చెరల విడిపించింది
పూడికతీసి, పుత్తడి చేసి రైతన్నకు బహుమతినిచ్చింది.
విజయ దరహాసంతో "బంగారు తెలంగాణ" అంటూ
నినదించింది
సాధించిన దానికి సంతృప్తి చెందక
సంస్కరణలు చేపడుతూ
సాధనలోనే లీనమైతే
బంగారు తెలంగాణ కాదు
వజ్రాల తెలంగాణ కూడా సాధించగలం.



కారం శంకర్
హైదరాబాద్. చరవాణి: 9440207311

229

# మళ్ళీ వసంతంలోకి

మళ్ళీ ఎన్నాళ్ళకో పాలపిట్ట
మా చెట్టుపై స్వేచ్ఛగా వాలింది
మళ్ళీ ఎన్నాళ్ళకో తంగేడు చెట్టు
మా యేటి గట్టున మొలిచింది
ఎండిపోయిన జమ్మిచెట్టు మళ్ళీ చిగురించింది
మళ్ళీ తెలంగాణ గడ్డమీద కృష్ణజింక
స్వేచ్ఛగా గంతులేసింది
కొన ఊపిరితో ఉన్న బతుకమ్మ
పునర్జీవం పోసుకుని
పసుపు కుంకుమలతో మాకెదురొచ్చింది.

ఒక గులాబీ పుష్పానికి
మఱ్ఱిచెట్టు వంగి సలాం చేసింది.
అరవై యేళ్ళ ఎడతెగని దుఃఖానికి
చరమగీతం పాడి
విజయ దరహాసం చేసిన రోజు
ఇప్పుడు ప్రపంచ పటమ్మీద
నా తెలంగాణ నిండు ముత్తైదువుగా కనిపిస్తోంది
కన్నీళ్ళు కాలువలై ప్రవహించిన దృశ్యాలు అదృశ్యమై
మళ్ళీ వసంతంలోకి....



**కాసుల ప్రతాప్‌రెడ్డి**
11-13-1184/2, రోడ్ నెం. 11/2, నార్త్‌రోడ్-11,
వాసవికాలనీ, కొత్తపేట, హైదరాబాద్-500 102
చరవాణి: 9848956375

# 230

## ఇలాగే

పచ్చని చెట్టు మొదలంటా కూలింది
నా రెండు రెక్కలూ తడిసి ముద్దయినై
దేహం కన్నీటి పర్యంతమైంది
తలుచుకున్నప్పుడల్లా
రక్తం బొట్లు బొట్లుగా పడి
గుండె పిడచ కట్టుకుపోతది
కన్నీరింకిపోయి, కళ్లు ఎర్ర జీరలు కట్టినై....
ఏం చేస్తాం, బిడ్డా...
ప్రాణానికి ప్రాణం అడ్డమేసే దాకా నేనూ అమ్మా...
గాలి ఊపిరి బిగబడుతది
చెట్టు ఆకు ఊగదు
శిరీష పుష్పం రాలిపడుతది
మొక్కులు, మొత్తుకోళ్లు, ప్రతినలు
నినాదాలు మిన్నంటుతయి
తెలంగాణ అంగలారుస్తది
పీతిరి గద్దలు ఒక్కటొక్కటే వాలుతయి
ప్రాణాలకు ప్రాణాలు అడ్డమేస్తమంటయి
పీక్కుతినేసి, బొర్రలు విరుచుకుని
చల్లటి గూళ్లల్ల వెచ్చగా నిద్రపోతయి
నెత్తి మీద కత్తుల కోలాటాలు
శివతాండవం అనుకుంటాం గానీ....
శిలువైపోయి, చిద్విలపిస్తడు
వెనక్కి రాలేం, ముందుకు తొవ్వ మూత
అడుగు పడదు, నడక సాగదు
బిడ్డా, ఇంత మాత్రానికే అంత ప్రాణమా...
జాబితా పెరుగుతది

**కాంచనపల్లి రాజేంద్రరాజు**
8-2-310/ఎ/77, రోడ్ నెం. 10, బంజారాహిల్స్,
హైద్రాబాద్. చరవాణి: 9849226423

# 231
# కొన్ని నినాదాలంతే

బంగారు తెలంగాణ కలలు
కల్లలు కాలేదు
కళాకాంతులతో
రెపరెపలాడాయి
కొన్ని కలలంతే
చెదిరిపోవు
కళాంతరం చెందుతాయి
వస్తుందో రాదో అన్న సంశయంలో
ఘనీభవించిన కన్నీళ్ళు
బాష్ప వాయువులను ఛేదించి
ఆనంద బాష్పాలయ్యాయి
కొన్ని కన్నీలంతే
కరిగిపోవు
ఏకశిలా తోరణాలవుతాయి

వందేళ్ళ బాధలు
బంధ విముక్తమై
నిర్బంధాల్ని నిరోధించి
విజయ కేతనాలయ్యాయి
కొన్ని బాధలంతే
బందీలవవు
చారిత్రక బోధలవుతాయి
నినాదాల నిప్పులు
నడినెత్తిన కురిసాక
చేతులు పిడికిల్లయి
అడుగులు పిడుగులవుతాయి
కొన్ని నినాదాలంతే
వివాదాల విస్ఫోటనాలై
విస్తరించిన
విశాల ప్రపంచాలవుతాయి.

**కుమ్మరి భిక్షపతి**
చరవాణి: 9704878679

# 232

## తెలంగాణ

తెలంగాణ విజయ ప్రస్థాన శిఖరమై నిలిచింది!
"కలం'' ఖడ్గమై రణభేరి మ్రోగించింది.
"గళం'' జన విప్లవ గీతమై ప్రతిధ్వనించింది...!
కవి హృదయం రవి సంధ్యలా మెరిసి నిలిచింది
'సకల జనుల సమ్మె..' ధర్మ పోరాటానికి చేయూత
నిచ్చింది
విద్యార్థి వీరాభిమన్యుల ఆత్మార్పణం
అంకురమై... విజయ ఫలమై
ఆయుధం పట్టిన బతుకమ్మయై
తెలంగాణ నేలపైనే... విజయ చిహ్నమై...
"సింగిడి''లా విరబూసి
తెలంగాణ విజయ ప్రస్థాన శిఖరమై నిలిచింది!
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమై ఆవిర్భవించింది!!

**కూకట్ల తిరుపతి**
చరవాణి: 9949247591

# 233
# ఎలిమి



వెలుతురు పూసిన తొవ్వల
ఇగురుకచ్చిన ఇకామతుల గుంపులు
గుట్ట పొరుపుట ఈనిన
పట్ట పగ్గాల్లేని పాయల వరదలు
బొగ్గునాల బొగుడల వంపు సొంపుల్ల
ఇరుదరుల కరుచుక బొర్లే వొర్రెల
ఉరుకుల పరుగులకు నిలకడయి
ఆబాది వందురు జాగల ఏరికోరి
సదర్ల పొందిచ్చిన చల్లకుండ రూప్కం
తట్టల కొద్దీ లోతయిన
తాతముత్తాతల రెక్కల కట్టం
గట్టిగ కట్ట గట్టి
పొడుగూత పాటమరించిన సింగిడిలా
తెట్టెను పట్టుకొని నిల్సింది తెల్లగా
ఉప్పొంగిన ఊత చెలిమె ఊటలు
జలజల జారు జాలు జాలి మడుగులయి
ఊరికి ఊపిరి చెలమెలయినయి
కాకతీయుల కడుపు తీపికి
వొల్లెడయిన అసఫ్‌జాహీల సాదకం
ఆబిలాబిల తనివితీరా తరించిన తరి
నిరందిగ దో ఫసలు నీళ్ళాడింది
ఊరి పొలిమేర చుట్టూత

ఒర్రెల ఒయ్యారాల వొడిసి పట్టు
తవ్వి పోసిన గొలుసుకట్టు కుంటలు
పల్లె తల్లి మెడల పచ్చులపేరు
తోపులాట పోటీల తొపెల
పొట్ట నిండుగ బుట్టలు ఇనాం
తిస్పోయ్ ఇస్పోయ్ రేవు దరువుల
మల్లె పువ్వయిన బట్టల మూట
కుమ్మరి చేతి కనికట్టు విద్దెల
బంకమట్టి పాకానికి పానం
ఎవుసందార్ల బతుకుల ఎదుగుబొదుగు
సబ్బండ వర్ణాల బువ్వకుండ
కాటికి బైలెల్లిన దుక్కం
కట్ట కొమ్ము కడుపుల
గొర్రె మ్యాకకు ఆసరా
గొడ్డు గోదకు దూపబుడ్డీ
నిక్కి నిక్కి సాగే నీరు కట్టెలు
నక్కి నక్కి దాగే సుక్క కోళ్ళు
కొంగలు, కర్రిపిట్టలు, పుల్లకోళ్ళు
తీరొక్క వలస పచ్చుల తివ్వ
కొడిపెలు, కొర్రమట్టలు, సందమామలు
బొమ్మెలు, మార్పులు, జెల్లలు, బుడ్డపర్కలు
తీరొక్క నీటి పువ్వుల తల్లి



కిన్నెర్ల మోతల తూము
చెంగ చెంగ చెంగలిచ్చే పోరగాండ్లు
బుడుబుంగలోల్లే ఈతలు
మత్తడి దునికిన అలుగులు
ఆకుపచ్చ చీరల మడికట్టు
ఐదేళ్ళ నోట్లెకు పోతూ
బంగారు తీగెలా సాగిన బతుకులు
కట్ట వొంటి పయి మొల్సిన వనంల
ఇపసారి నురుగుల ఈత లొట్లు
సప్పసేదు పొంగుల తాటి బుంగలు
తూందీసిన సంబురాన
జలపిల్లల జడ్తలు
పచ్చిగడ్డి మొల్కయి మొల్వంగ
పోచమ్మకు చిలుకల పేర్లు
కట్ట మైసమ్మకు కల్లు శాక ఆరగింపు
నిగురాను నియతి నీరటి తనంల
మెదుం కొద్దీ మెదుల నీళ్ళ సారకాం
నిండుగ కళకళలాడు చెర్వు కుంటలు
ఎలిమి కచ్చిన భూమి
కక్కులు కక్కే బాయి ఊట
కరువు రక్కసి కోరలు తోమి
కలిమి బలిమిగ కుటీరాలు
కండ్లు మండిచ్చుకొన్న కసాయి
పచ్చని బతుకుల చిచ్చు వెట్టిండు
వెండ్లో పండ్లనీ అమ్ముడే ఎల్తి
నివాల్ని వాలుగ పోగులేసిన రీతి
ఇప్పెడు ఇడువక నిస్సిగ్గు కబ్జాలు
ఊసరవెల్లి యిగురాల జిత్తులు

శిఖం కడుపుల శకునాలయినయి
ఉడుంలకు ఊదరవెట్టు ధైర్నం చాలక
బెల్లంగొట్టిన రాయోల్లే బక్క జీవునాలు
తుమ్మితే ఊడే తూము
చింపుల బొంతయిన మత్తడి
గుండెకు గండీవడ్డ కట్ట
పొట్టల నట్టలోలె లొట్టపీసు చెట్లు
జిబ్బు జిబ్బుగ ముసిరిన నీటి తుంగ
ఈ బుగ యిగిలిచ్చిన కంప తుట్టెలు
పాపనచ్చి వలస పాలనల
కొప్పరంగ కొట్టుకొచ్చిన పూడిక
కారుబీడు కంచెలోలె కలలపంట
గంగాళంల గలగలా ఎగసిపడ్డ తడలు
తాంబాలం వోలె తపేల గొట్టిన గోస
మన రాజ్యం మన పాలనల
కాకతీయ మిషను కదిలొచ్చింది
పల్లెను నిద్రలేపి
ఇల్లును చక్కబెట్టుకుందాం
నెత్తిన సుట్టబట్టలు
సంకన సద్దిమూటలు
తరతరాల ఎతను తవ్విపోసి
పొలాలకు ఎరువుగ పోద్దాం
కులమతాల కుళ్ళు వొదిలి
పేదగొప్పల తేడా మరచి
నడువండ్రీ... నడువండ్రీ...
పచ్చితోర్నాలు కట్టడానికి
పచ్చని బాటలు పరుద్దాం.

**కూజ సుష్మ**
కరీంనగర్. చరవాణి: 9908369954

## 234
## తెలంగాణం

మొక్కజొన్న కంకి సంబరంగ తలవూపుతుంది
పాలపిట్ట కమ్మంగా పాడుతుంది
ఏండ్ల తరబడి ఎదురుచూసిన మన తెలంగాణ మనదై
సంవత్సరం పూర్తైన సమయాన
ఆడుదాం... పదం పదం కలిపి
పాడుదాం... దిక్కులు పిక్కటిల్లంగ
తంగేడు పూల బతుకమ్మలతో
వేపమండలతో బోనం సింగారించి
అసోయ్ దూలాపీరీలతో
జన జాతరను తలపించేలా
అలుగులు దుంకే సంబురాన
సాలు నిండంగా సంతోషాలు
అంబరాన్నంటేటట్టు
సాలు సాలు అయ్యేటట్లుగా
ఊరును వాడను ఏకంచేద్దాం
కదిలి రాండ్రి... రాండ్రి.





కూరపాటి మోహన్
ఇ.నెం. 11-25-318, బాదంచెట్ల వీధి, కొత్తవాడ,
వరంగల్-506 002 చరవాణి: 9849313890, 8341374341
ఇ-మెయిల్: mohankurapati72@gmail.com

235

# సంబురంతోని కండ్లల్ల నీల్లు రావాలె

ఇప్పుడు ఇంగ నాకు యజ్ఞపు అయిస్సులు అద్దు...??
అగ్రతాంబూలాలు అద్దు...!!
ఇంగ నిన్నటిదాక యాడసూసిన
నెర్రెలు వాసిన చెల్కలు
పూడ్కెలు నిండిన చెర్లు
ఎగ్గొట్టడానికి గట్టిన ఎత్తిపోతలు
సర్కారు తుమ్మలు బెర్గిన కాల్వలు
ఇంగ ఊర్లకుఊర్లు కాలి...
ఐతే పట్నంబోవుడో...
కాకపోతె..బొంబాయో...దుబాయో...?
ఇంగ ఊర్లె ఉన్నోల్లు
ఆకలికి ఆవురావురనుకుంట ఫ్లోరేడు నీల్లుదాగుడు..
గంతే...నడ్మకాల్జెతులు నల్బయారు అంకర్లు
గా అంకర్లతోనే సంసారంజేసుడుదప్ప...
లగ్గానికి పిల్లనిచ్చెటోల్లు కర్వు...!?!?
నీల్లల్ల ఇసమున్నదంటె...
గానీటితోని పండిన గింజల్ల ఇసమేనాయె...!!
నాకడ్పుల నల్లబంగారమున్నా...
నాపిల్లగాండ్లకి దక్కపాయె గద్దలోతిగ తన్నుకపోయిరి..
ఇంగ మస్కచీకట్లల్ల మగ్గుడుదప్ప
ఇండ్లల్ల నిండుగ ఎల్లుగానరాకపాయె...
పొలానికి పోయినోడు పొలంలోనె పోవుడాయె...!?!?

గానాత్రి గాడ పురుగు గుట్టుడో కరెంటైర్లు పాషమౌడో...
పండక పండక పుర్షడో చారడో పండితే...
అంగట్లకు బోతే కైకిలి జేసినోల్ల మందమన్న రాక
పాయె...
అప్పు దెచ్చితిన్నగాసం పిల్లకు పిల్లె అమాంతం
బెర్గబట్టె...
పొల్ల పెద్దమనిషై పదేండ్లు దాటిపాయె...
లగ్గం జేద్దామంటే చిల్లి గవ్వకానరాకపాయె...
యెన్నడో తాతల్నాడు గట్టినిల్లు...
గాలత్తె గలగల ఆనత్తె జలజలగాబట్టె...
ఆడీడ కట్టపడి పొల్ల పెండ్లిజేత్తె....!!
ఇంటికచ్చిన కొత్తల్లునికి యాడ మంచమెయ్యాల్నొ
తెల్వకపాయె
ఇంగ గివన్ని బొవనీకి... తెగించి లడాయిజేయ....
ఇగ పెద్దోడు ఆమర్న నిరారధీచ్చ జేసి సావుకు దగ్గరై...
చెలోహైదరాబాద్... రైలురోకోలు జేసి...
సకలజన సమ్మెతో...వంటావార్పుజేసి...
సాగరహారంతో...దూందాం దునుకులతో...
దోసుకునెటోని జేతులు గట్టేయనీకి...
ఒంటిమీద ఓలిరంగోలిగె...!
అగ్గాయిలు బోస్కొని హారతి దీపమై...!!
జైతెలంగానంటు ఏగంగచ్చె రైలుకెదురెల్లి...!!!



పార్లమెంటు పమానంగా ఉరితాడునుముద్దాడి...!!!!
మల్లింకో సతంత్ర పోరాటంజేసి...
నాకు సేచ్ఛనిచ్చిండ్లు...గందుకే ఇంగ...
నాకడుపుల నల్లబంగారంతోని ఎల్గులు నిండాలె...
దినం నాత్రి మూడుతీగల్ల కరంటునిండాలె...
నారైతన్న మొగం గోగుపువ్వోలె మెర్వాలె
కల్యానలచ్చిమి
సాదిమబారకులతో లగ్గాల గనంగా గావాలె
రొండుపడ్కల కొత్తిల్లుతో కొత్తల్లులకు ఆగ్వానం
పల్కాలె...
మిష్నికాకతీయతో చెర్వుల్ల కుంటల్ల నీల్లు
తొన్కీసలాడాలె...
నెర్రలువాసిన చెల్కలు పచ్చటి పైటేసి నవ్వాలె...
కాలి తావుల్ల బత్కునిచ్చే చెట్లతోని
అరితారంజెయ్యాలె...
ఎన్కిబోయిన ఆనల్ని ఊల్లల్లకి చేండ్లల్లకి దేవాలె...!!
అప్పులపాలైన రైతన్న అప్పుమాపితోని మొకాన
నువ్వుపువ్వుపూయాలె...
ఇంగ సైకిల్ చేతబట్టుకోని చెవ్వుల పువ్వు బెట్టుకోని
మీద ఎర్రగుడ్డ కప్పుకోని ప్యానుకు ఆరబెట్టుకుంటు
ఇజిలెసుకున్నోల ముందట...
నాపిల్లలు జింక పిల్లలోతిగ సెంగు సెంగున ఎగ్రిఎగ్రి
దున్కాలె...
పాలపిట్టోతిగ రిక్కలిప్పి సర్రుసర్రున ఎగరాలె....
జమ్మి చెట్టోతిగ పచ్చపచ్చగ  మురువాలె...
తంగేడు పూవ్వోల్గె బంగారు తెలంగాన గావాలె
ఇంగ నాకు సంబురంతోని కండ్లల్ల నీల్లు రావాలె
మీరంత సల్లంగుండాలె





కృష్ణ మణి

## 236
# సీటు మిక్షర్

ఈయల్ల పంద్రాగస్టు కదా
గోవిందు గాడు నేను మల్లేశ్ గాడు
ముంగల కూసున్నం స్టేజి కాడ సక్లముక్లం బెట్టుకొని !
మా అమ్మకు జరం
మా అన్న చాయ్ పెట్టిండు
రూపాయి ఫైను బిస్కెట్ నానపెట్టుకొని తిన్న!
మల్లేష్‌గాడు ఏం సోకులవడుతడో
కొత్త బట్టలేసుకొని ఏమన్న నీల్గుతడా వాడు
గోవిందుగాడైతె దినం ఏం తినకుండనే వస్తడు స్కూల్కి
పగటిల్ల ఆయమ్మ పెట్టె బువ్వ తింటెనే పొద్దు గడుస్తది
ఆనికి!
పెద్ద కిలాసోల్లు చేతులు పట్కొని
ఊర్ల తిరగనీకే పోయింన్రు
ఈళ్ళు పోయినంకనే జండలెగురుతయి ఆడ!
ఎనిమిది గొట్టంగ కూసున్నం
ఊర్ల పెద్ద మనుషుల కోసం దిక్కులు సూడవట్టె మా
హెడ్ మాస్టర్‌సారు
వచ్చిన్రు తెల్లబట్టలల్ల మెడలెత్తి నడుసుకుంట పది
గొట్టంగ
జండ ఎగిరింది
సప్పట్లు కొట్టినం మురిపెంగా
మా సార్ చేతిలకెంచి మైకును తీసుకున్నరు
ఇగ వొర్ల వట్టె నేనింత నువ్వింత అనుకుంటా !
ఈళ్లేం మాట్లాడుతున్నరో అర్థం అయితలేదు కాని
మా కాళ్ళు గుంజి తిమ్మిర్లు పడుతున్నై
కండ్లు తిరుగుతున్నై
దూపైతుంది ఇంక ఆకలైతుంది
మొగులైయ్యింది
అయినా ఇడుస్తలేరు మైకుని
కోతికి కొబ్బరి శిప్ప దొరికినట్లు చేస్తున్నరు !
మొత్తానికి పన్నెండు దాటింది
ఆకలైయ్యిందేమో పాపం చేతులూపి జైహింద్ అన్నరు
హమ్మయ్యని కిలాసులకు లైన్లు గట్టినం
సీటు మిక్షర్ పెట్టిండు సారు!
ఇంటికొచ్చి
అమ్మకు నాయినకు ఇంత పెట్టి తిన్నం మురుసుకుంట !

**కె.ఎ.ఎల్. సత్యవతి**
8-6-118/3, పద్మావతి కాలనీ,
మహబూబ్‌నగర్. చరవాణి: 9440210103

237

# జల్దిన మన కండ్లుజూడాలె

మన తెలంగాణ మనకొచ్చుడు... నిన్నమొన్నటి
లెక్కకడ్తాంది!
గప్పుడె అయినాది? ఏడాది!... అరవై ఏండ్లు పోరాటం
జేసినం!
ఢిల్లీ పీఠానికి... ఎండపొద్దున... సుక్కలు జూపినం!
ఎట్లనన్న గానీ... మన రాష్ట్రం... మనం సాధించుకున్నం!
మన అమరులు యాదికొచ్చి... కండ్లల్ల నీల్లు ఆగ్తలేవు!
తెలంగాణ కోసాన్కి... పోల్లు ఇడిసింగ్రు పానాలు!
పోల్ల పేరుమీన... పెట్టుకోవాలె.. మన ఇండ్లల్ల దీపాలు!
గా వానదేవుడు.. రైతన్నని ఆటాడిపిస్తుండు! మస్తుల
ఏడిపిస్తుండు! ఒకపాలి గింతనన్న మొగంజూపియ్యడు...
గంతలనే లెవ్వకుంట ముంచిపోతడు!
దిక్కుతెల్వక తిక్క రైతన్న...
నిట్టనిలువున ఉసురు తీసుకుంటాండు!
మనకు తీరొక్కబట్ట నేసిచ్చేటోడు నేతన్న..
తన పెయినిండ బట్టలేకుంటయిండు!
అప్పుల వూబిల పూరమునిగిండు....
ఉరితాడు వూయలంటని వూగుతాండు!
గరీబోల్ల కతలు ఎన్నంటని జెప్పాలె?
ఇన్నేండ్లకు చేతికొచ్చిన యింటిని..సర్దుడు లేకుంట
యిడ్చిపెడ్తమా? యాదికుంచుకోంగ్రి!
గిది కన్న కష్టాలుపడి... మనం దెచ్చుకున్న రాష్ట్రం!
సర్కారు ఎట్లెట్ల నడిచేది మనంగూడ జూడాలె!
మంచి ఆలోచనలుంటె గన జెప్పాలె!
మంది పిల్లల ఆడోళ్ళ బతుకులు నాశనం బట్టించె నా
కొడుకుల తాటతియ్యాలె!
జల్దిన బంగారు తెలంగాణ తయారుగావాలె!
గా కల నిజంకానీకి నిద్ర మేల్కగావాలె!
అందరితోన చేతులుగలిపి ముందుకుబోతె.. పల్లెపల్లెకు
పండగనే!
సర్కారు పథకాలు మంచిగ అమలయ్యేటట్లు జూడాలె!
కష్టాలను మనం తరిమిగొట్టాలె!
మన నదుల నీళ్ళు మనకయితే యింకేమి గావాలె?
మిషన్ కాకతీయకు జైకొట్టాలె!
ఎండిన మన పైర్లకు... నిండ నీళ్ళు మళ్ళీ రావాలె!
ఈడకెల్లి వలసలు పత్తలేకుండ పోవాలె!
మన పోరలు మంచిగ జదివి రాజలెక్క బతకాలె!
తెలంగాణ వుద్యమంల ముందట నడ్సినోల్లకి గుర్తింపు
వుండాలె! నిరుద్యోగ తమ్మీలకు వుద్యోగాల పంట
పండాలె! కులమతాల లొల్లి పోవాలె!
గద్దెనెక్కిపించినోల్లకు అండగ నిలవాలె!
దేశంల అన్ని రంగాల్ల... మన తెలంగాణ
ముందుండాలె! సొక్కమైన బంగారుతెలంగాణ.. గా
సూరునిలెక్క చెమ్కాయించాలె!



కె.ఎస్. అనంతాచార్య
7-2-237, సాహితీగౌతమి, కరీంనగర్
చరవాణి: 9441195765

238

# మహోపకారి

తెప్పలుగ చెరువు నిండిన
కప్పలు పదివేలు చేరిన
మహాజలాశయం!
చేపలు కొంగలు కప్పలు
బుడుబుంగలు ఏర్చి కూర్చిన
నీటి ఆహారపు వలయం!!
చాకిరేవు సోకులో
చెరువుదంతా నవసోయగం
ఉతికిన కొద్దీ
బట్టబయలయ్యే నిజాలు!!
ప్రకృతికి ఆకుపచ్చని చీరకట్టి
మానవాళికి గింజల దండలు వేసి
సన్మానం చేసిన మహోపకారి!!
సంధ్యావందనంతో అర్ఘ్యప్రదానం
సూర్య నమస్కారంతో సంస్కారం
చెరువుదొక మహాసంస్కృతి!!

బుర్రకాయలు, పోరగాండ్లు
నీరుకట్టెలతో సయ్యాటలు
అదో అద్భుత ఆనందమైన
హిమశీతల జలక్రీడావేదిక!!
జాలరులకు గాలం
దుర్యోధనునికి
జలస్తంభన విద్య
ఎన్నో విద్యలనందించిన
జలకళా ప్రవీణ చెరువు!!
నోళ్ళు తెరిచి తుమ్మలు మొలిచిన
చెరువును చూస్తే గుండె.. చెరువైంది
మనసు బరువైంది!!
ఇప్పుడు చెరువుకు మహోదయం
మిషన్ కాకతీయతో
నూత్న కళల ఉషోదయం!!

కె. లక్ష్మణ్ గౌడ్
8-5-123, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్.

239

# తపోయజ్ఞం

అరవై వసంతాలు అగ్నికి ఆహుతైన వేళ
ప్రాంతీయ అజ్ఞానం ఆధిపత్య సంకెళ్ళకు బలైన వేళ
తెలంగాణ చారిత్రక వైభవం కాలగర్భంలో నిక్షిప్తమైన
వేళ చట్టసభల సాక్షిగా నాయకుల
నిష్క్రియాపరత్వం మూగబోయిన వేళ
పదవీ లాలసతే పరమావధిగా భ్రాంతిలో మునిగిన వేళ
వలస దోపిడి అన్ని రంగాల్లో వనరుల్ని కబళించిన వేళ
నాయకత్వ క్రియాశూన్యత
వలస పాలకుల పాదాలపై మోకరిల్లిన వేళ
తెలంగాణ పద ఉచ్చారణే చట్టసభలో నిషేధానికి గురైన
వేళ
స్వార్థం బరితెగించివిజ్ఞతను కాటేసిన వేళ
నీళ్ళు నిధులు నియామకాలు
ప్రాంతీయ దురహంకారం ధ్వంసం చేసిన వేళ
ప్రాంతీయ సాంస్కృతిక ప్రాభవం వలస పాలకుల
పదఘట్టనలో పరితపించిన వేళ
సగటు తెలంగాణీయుడి రోదన అరణ్య ఘోషగా
మారిన వేళ
పసిడి పంటల తెలంగాణ మాగాణం ఎడారిగా
తపించిన వేళ
కృష్ణ గోదావరి నదుల పరవళ్ళు తెలంగాణ బీళ్ళకు
దూరంగా విలపించిన వేళ
ఒక్క పైసా ఇవ్వనని చట్టసభలో మూర్ఖ నాయకత్వం
ప్రకోపించిన వేళ
అమరుల బలిదానాల ఆత్మఘోష
మృతప్రాయ మూఢుల్ని మేల్కొలిపిన వేళ
త్యాగధనుల ఉద్యమ పిడికిలి సంకెళ్ళు ఛేదించిన వేళ
తెలంగాణ కళాప్రాంగణం అంధకారాన్ని
జ్యోతి ప్రజ్వలనం చేసిన వేళ
నిద్రాణ మస్తిష్కాల్లో సూర్యోదయ కాంతులు జ్వలించిన
వేళ
ప్రాంతీయ అస్తిత్వ ప్రబోధం నరనరాల్లో జీర్ణమైన వేళ
సిద్ధించిన తెలంగాణ స్వరాష్ట్రం
కోటి వీణల శతకోటి రాగాల సంగీతం
అది భవిష్యత్ ఉషోదయ సంక్షేమ పథకాల దిశానిర్దేశం
బంగారు భవితకు పునాదిరాళ్ళు
రాజ్యమేలే ధీరోదాత్త తెలంగాణ రారాజులు
ప్రజాభీష్టంలో పట్టాభిషిక్తులైన నాయకత్వం
బంగారు తెలంగాణ సాధనలో ప్రతినిత్యం
తపోయజ్ఞం.



కె. ప్రభాకర్

# 240
# అస్పష్ట మనోహరుడు

వాడు ఎవ్వడో
ఎక్కడినుండి ఇక్కడికి వచ్చాడో
ఎందుకు వచ్చాడో
ఎవ్వరికి తెలియదు
వాడికి అందరూ శత్రువులే
వాడి పేరు అజాత శత్రువు
వాడు తన కన్నీళ్ళను
చెలియలి కట్టగా మార్చుకున్నాడు
పల్చటి లాల్చి, సన్నని చిరుగడ్డం
అరిగిన చెప్పులు
వీధుల్లో కవులు కనిపిస్తారని
ఊరంతా తిరిగేస్తుంటాడు
మకుటం లేని మహారాజులా
గానుగ ఎద్దులా తిరిగి ఇప్పుడు పీనుగయ్యాడు
ఎందుకోసం తిరిగాడో
ఎవరికోసం తిరిగాడో
అతను రజకుని చేతిలో మరో ఖరుడు
మాయామర్మం ఎరుగని
అస్పష్ట మనోహరుడు
చాయ్ ఇప్పిస్తానంటే
కోఠీ నుంచి కంచన్‌బాగ్ వరకు నడిచి వస్తాడు
భోజనం పెట్టించావంటే ద్రవించి చలించి
భోజరాజుకు జై అంటాడు
తన బ్రతుకు మీద ముసురుతున్న పరిస్థితులను
విసుగు చెందకుండా ఈగలను తోలుకుంటూ
తొంబైఏళ్ళ తొయ్యలితో స్నేహం చేసి
కన్నీళ్ళను తాగేస్తాడు.
నవ్విస్తూ నవ్వుతూ రోడ్లను దాటుకుంటూ వెళ్ళిపోతాడు
పగ తీర్చుకోవడంలో శత్రు కూటమిలో చేరి
జబ్బ చరిచి, దెబ్బతీసే శకుని కంటే
మొనగాడిననిపిస్తాడు
నువ్వు కనబడుతూ వినేవారి తలలు తింటే
కనబడని ఇక్ష్వాకుల కాలం నాటి
తాళపత్రాలు సంచి నుండి వెలుపలికి తీస్తాడు
కంచికి పోయే కథలను తన అరచేతిని అడ్డుపెట్టి
విని హాయిగా ఎంజాయి చేస్తాడు, తల వూపుతాడు
సూతుడేది చెప్పినా వినే శౌనకాది మునులా
ముందుగ వింటాడు, ఆ వెనుక నిన్ను తింటాడు
మెరిసే తారలను కౌగిలించుకుని
ఆకాశ హర్మ్యం మీద పక్కేసుకుని
వెన్నెల దుప్పటి కప్పుకోవాలనుకుంటాడు
ఇంట్లో నిండుకున్న బియ్యం డబ్బాలో
నిండిన విషాదాన్ని సంచిలో కొంచెం పోసుకొని
గాలిలా వ్యాపిస్తాడు
స్ట్రీట్ సింగర్‌లోని సైగల్ పాటను

జబ్ దిల్ హీ టూట్ గయాతో హమ్ జీ కే క్యా కరేంగే
పాట ప్రతిధ్వనితో తాను మమేకం చెందుతాడు
ఎవరి చేతుల్లో ఏ పత్రిక దొరుకుతుందా
అని కళ్ళతో ఎరవేసి నమిలి నెమరేద్దామనుకుంటాడు
నాలుగు కవితలెవరయినా అచ్చేస్తే
ఏ పత్రికలోనైన కుదురుకోవచ్చని నిరీక్షిస్తూ
తెగిపోయిన చెప్పును తిట్టుకుంటూ
మస్తకాలు మేసే పుస్తకాల చెట్ల మూలాలకోసం
ముస్తాబై ఆధార గ్రంథాల కోశాగారాల కోసం
నిరాధారంగా, మీనమేషాలు లెక్కపెడుతూ
సీక్రెట్‌గా, సీరియస్‌గా త్రిపాదిలా తిరుగుతాడు
వెండి జారుడుమెట్లు ఎక్కి దానిని దిగుతాడు
వెలుగులో పడేసిన నెగెటివ్ అయిపోతాడు
వాడు నలుగురికి పంచాలనుకుంటున్న
వెలుగు కిరణాలను వ్యవస్థ తిమింగలమై మింగేస్తుంటే
తాను తప్పుకుంటూ మిమ్మల్ని ఢీ
కొట్టినా ఛీ కొట్టినా మీరు గుర్తుపట్టలేరు
వాడు నిన్న రాత్రి నిద్రపోయాడనుకున్న
సూర్యుడికి వారసుడు
వాడు ఎవ్వడైతే నేమి నాకు ఆప్తుడు
కవితా గంగాధరుడు అస్పష్ట మనోహరుడు
దగాపడ్డ తమ్ముడు, అమ్మకు ముద్దు గుమ్మడు
వాడి గుండె జల్లడయి పోతేనేం
కలలు కన్నీళ్ళుగా వడగట్టుకుంటున్నాడు
వాడు నిజంగా కవితా విటమిన్ ఇచ్చి
సంఘంలోని సుదీర్ఘ రోగాలను నివారణ చేసి
నిజాన్ని రుజువు చేసే జాగ్రత్త చేసే కవి
రేపు ఉదయించడానికి రెడీగా ఉన్న కళారవి.

కె. సిరిచందన

## 241

## మృగత్వం

ఢిల్లీలో నిర్భయ
హైదరాబాద్‌లో అభయ
ఇలా ఎందరో...
బలి అవుతున్నారు మన ఆడపిల్లలు
మరెందరో...
ఆగమవుతున్నారు మన లేడిపిల్లలు

కొవ్వొత్తులతో కొండంత నిరసన
అయినా... ఏదీ అభయం
ఓ భగవంతుడా!
రక్షించు నా దేశాన్ని
శిక్షించు మగవాడి దానవత్వాన్ని.

కే. విజయ నర్సింహారావు

## 242
# మా ధరణి తెలగాణ

విప్లవాగ్నుల సెగల పొగిలి రగిలి
కలగి కరిగి కాలపు కనులు చెమ్మగిల్లనిది
ఈనేల నిప్పుల కొలిమి ఇంత ఎరుకల కలిమి
చెలిమె అయ్యినది
విషాదమెంతగ మదిని పట్టి తడమనిది
వట్టి ఈ మట్టికి ఇంత తడి ఏడిది
గుండె నెత్తురు లొలికి నేలనలకనిది
మట్టి తెలగాణ కీ పరిమళము ఎక్కడిది
మృత్యుగడీలగోడలు కూలగొట్టి
బ్రతుకు పోరు నారు మళ్ళు గట్టి
కూలి రైతుల మట్టి శ్రమల త్యాగాల
ప్రేమ స్వేదపు ధారల భూమి తడిసినది
హలమొకటే కాదు కలము పట్టిన జనము
వినయ మొలికిన పలుకు విపల్వము పాడిన గళము
దోపిడీ మెడవంచు తిరుగుబాటుతనము
అన్యాయమెదిరించు అలవాటు కలిగిన
అశేష జనబాహుళ్యమీ పోరునేల
తమ్ముడా ఈ మట్టి గుండెలను తడిమిచూడు
ప్రతి పల్లె త్యాగాల అడుగు జాడలు చూపు
ప్రతి మనిషి ఆత్మీయతకు అర్థమును తెలుపు
అన్నా అను పిలుపు అనుబంధము కలుపు
బతుకమ్మ ఇగిరిపోని గంధమీనేల
ఉయ్యాల పల్లెపాట అనుబంధ మీ ధూళి
ఒక్క దేవులపల్లి ఒక్క కాళోజీ
ఒక దొడ్డి కొమురయ్య పాలకుర్తి ఐలమ్మ,
శ్రీకాంతాచారి
మొక్కవోని పెక్కురైన బిడ్డల తల్లి
భావిభారత జన విప్లవాల కల్పవల్లి
అనుభవాల నిప్పుల కేగె నీ మణికణిక
మానవీయతకు ఓ మచ్చుతునక
ఉద్యమవని ఎడల ఈ అవని ఎదల
నాటి ఎదుగునెటుల ఈ చైతన్య మొలక
గుండె నెత్తురులొలికి నేలనతికినది
శ్రమల త్యాగాల ధార నొడిసినది
జనచైతన్య ఉద్యమాల పంట పండినది
మా ధరణి తెలగాణ పరిమళము వాడనిది.



కే.వి.యల్.

# 243

## ప్రపంచీకరణ నాగరికత

ච. భారతదేశపు నాగరికతను
బట్టలు విప్పి చూపుతున్నది
పాడు బుద్ధుల ప్రపంచీకరణ
ఆడవాళ్ళతో ఆడుతున్నది
మనం... ఏమైపోతున్నాం!? ॥ భారత ॥

1. కొండల మధ్యన నీటిపాయలా
కోర్కెలు పెంచే పీలికగుడ్డలు
పాముమెలికలా నడుకలుంటవి
కామోద్రేకపు చూపులుంటవి
బట్టలే బరువై దేహముంటది
కట్టలు దెంచే కోరికలుంటవి
ఫ్యాషన్లంటుండ్రో... నాయన
పేలిపోతుండ్రో... ॥ భారత ॥

2. ఎదిగిన బిడ్డలు ఒదిగి ఉండరు
వెనుకటి పద్ధతి చెప్పితె వినరు
కట్టుబాట్లను కొట్టివేస్తరు
మోడ్రన్ బతుకుల మోజుపడుతరు
ఫ్యాషన్ ఊబిలో పడిపోతుంటరు
కాషన్ ఇచ్చిన కండ్లు తెరువరు
అందం చానలురో... నాయన
కొంపలు ముంచెనురో... ॥ భారత ॥

3. ప్రపంచమంతా టివిలో ఉందని
ఫ్యాషన్ పరేడ్‌ల ఛానల్లున్నవని
సొంగలొలుకుతూ సోకులకోసం
అందం ఛానళ్ళకతుక్క పోతరు
వేషం భాషను మార్చివేస్తరు
మంచిని, నీతిని మర్చిపోతరు
మానవ విలువలురో... నాయన
మంటగలిసెనురో... ॥ భారత ॥

4. చిలువలు పలువలు చిందులు వేస్తూ
తాగుతు తూగుతు తందన లాడుతూ
ఒంటరి రూములో తుంటరి చేష్టలు
ఇంగ్లీషుపోలై.. ఇగిలిస్తుంటవి
మిడ్‌నైట్ షోలు, మసాలమూవీ
ఇంటర్‌నెట్‌లో... నగ్నదృశ్యం
కల్చర్ పేరుతో... నాయన
ఖరాబు అవుతుండ్రో... ॥ భారత ॥

5. ప్రపంచ మార్కెటు దుశ్శాసనులు
ఫ్యాషన్లంటూ, మోడల్సంటూ
అందం పేరుతో, కల్చర్ పేరుతో
గాలం వేస్తరు, గలీజు జేస్తరు
జనం బతుకును జప్తుచేస్తరు
నాగరికతల వలువలనొలిచి
నగ్నంగనే దోచుకుంటరు
ఇది దోపిడి సంస్కృతిరో...
మనల దోచుకతింటదిరో...
ఆలోచించండ్రో... నాయన
దీన్ని అంతం చేయండ్రో... ॥ భారత ॥

కొత్త శంకర్ రెడ్డి
టీచర్, ఖమ్మం.

244

## జయహో తెలంగాణ

ఎలుగెత్తి చాటండి నవ తెలంగాణ మనదే (2)
ప్రగతి కొరకు కదలండి భవితంతా మనదే (2)
అమరవీరుల త్యాగఫలం కాకూడదు నిష్ఫలం (2)
ప్రగతిరథం ఎక్కేందుకు (2)
వనరులెన్నో పుష్కలం "ఎలుగెత్తి"
జయశంకర్, ఐలమ్మల త్యాగనిరతి మరువకు (2)
కాకతీయ పౌరుషాన్ని చూపేందుకు వెరువకు
కొమరం భీమన్న పోరాట పటిమ వీడకు (2)
చంద్ర, సూర్య శోభితమై (2)
వెలగాలి తుదివరకు "ఎలుగెత్తి"
గ్రానైట్, డోల్‌మైట్, సింగరేణి తెచ్చు గొప్ప సిరులు (2)
పచ్చని వనసంపద తెలంగాణ తల్లి ప్రియ కురులు (2)
కృష్ణ, గోదారి, మంజీరతో పోటెత్తు జల సంపదులు (2)
ఇక తెలంగాణ మాగాణై (2)
తొలిగించును ఆపదలు "ఎలుగెత్తి"
విరామ మెరుగక పనిచేసి ఎదగాలి మనసంతా (2)
మన కలలను సాకారం చేసి చూపాలి జగమంతా (2)
తెలంగాణ తల్లి ఋణం ఇక తీర్చాలి మనమందా (2)
ఆ బిడ్డ బిడ్డల మైనందుకు (2)
మది మదిన నిండినట్టి మన మాతృ మూర్తికి (2)
ఎదనిండ వెలుగునిచ్చు (2)
మన తెలంగాణ తల్లికి "ఎలుగెత్తి"



**కొల్లాపురం విమల**
చరవాణి: 9441234987
ఇ-మెయిల్: vkatikaneni@gmail.com

# 245

## చెరువు

నగరం నడిబొడ్డున
గొలుసుకట్టు వ్యథల
కన్నీటి సాకారం
ఒంటరి చెరువు.
అభయమిస్తున్న
బుద్ధుని రంగుల దరహాసాన్ని
ఒంపుకోలేని ఒంచిత,
నిరంతర పహారాలో
స్వేచ్ఛను కలగంటున్న ఖైదీ.
నీ సమస్త నిమజ్జన వేడుకల్లో
చావు, పుట్టుకల శ్రాద్ధాలతో
పూట గడుపుకుంటూ
ప్లాస్టర్ నవ్వుతో వీధివీధి నాయకుల ముందు
ఒయ్యారాలు పోయే బిచ్చగత్తె.
నీవు విసిరేసిన ఖాళీ సీసాలకు
పడేసిన ప్లాస్టిక్ ఫుడ్‌ను
కడుపున దాచిన
అకాల గర్భం
ముసలమ్మ మరణంలో
ప్రాణం పోసుకున్న అనాథ శిశువు
బతుకమ్మను బలిపెట్టే
అధికార రాజకీయాల్లో, ఉన్మత్త పురుష క్రీడల్లో
మాయమైపోతున్న
తంగేడు వనం.
ఆచారాల సంకెళ్ళలో
ఆవలి తీరాలను వెతుక్కునే
పుత్తడి బొమ్మల కలువ కన్నులను
గుర్రపు డెక్కలకు అప్పగిస్తున్న
అమాయిక తల్లి.
స్నేహితుడా -
ఒంద్రంటే ఒట్టి మట్టికాదు
ఒడిసి పట్టుకున్న నా పురాగాథల
గాయాల సారం.
చెరువంటే పారే యేరు కాదు
పేరుకుపోతున్న నీ మకిలిని ఊడ్చి పారేసేటందుకు
ఆమె
నిశ్చల జల స్థిత ప్రజ్ఞ
అన్నిటిని గుండెల్లో
ఒడిసిపట్టుకునే
బడబానలం.

**కొలిపాక శోభారాణి**
6-3-86, గీతానగర్, సిరిసిల్ల, కరీంనగర్-505 301
చరవాణి: 9491367409

246

# తెలంగాణ కోటి రతనాల వీణ

సంబురం మొగులునంటుతాంది
పక్షపాతపు పరిపాలనకు చరమగీతం పాడి
సంవత్సరం గడిచిన సంబురాన
తెలంగాణా రాష్ట్రం పురుడుపోసుకున్న శుభదినం
చూస్తుండగానే కన్ను మలిగిందో లేదో
సాలుగడిచి స్వేచ్ఛావాయువులు
గుండెలనిండుగా పీల్చుకున్న సుదినం
ఎంతోమంది కసుగాయలు అమరులై
అందించిన త్యాగఫలమిది

ఈ ఫలితాన్ని నిండారనిండుగా
చిన్నాపెద్ద పేదగొప్ప తారతమ్యం లేక
మిన్నంటేలా అలాయ్ బలాయ్ తీసుకొందాం
ఒకరికి ఒకరై సంతోషాన్ని పంచుకుందాం
సిరిగల సిరుల మాగాణాన్ని చేసుకుందాం
మన తెలంగాణను...
తంగేడు పువ్వుల పుప్పొడినలది...
బంగారు రాష్ట్రం చేసుకుందాం!



కొమురవెల్లి అంజయ్య
6-2-56, సిద్దిపేట-502 103
మెదక్ జిల్లా.

# 247

## తవ్వకం

తవ్వడం ఓ అద్భుతమైన కళ
అందరికీ అబ్బని సొత్తు
తవ్వితేనే కదా లోతులు తెలిసేది
తవ్వితేనే కదా చరిత్ర గుట్టు వెల్లడయేది
తవ్వితేనే కదా దేనికైన పునాది పడేది
తవ్వుతూ తవ్వుతూ పోతే
బండ గుండెలు కరుగొచ్చు
తేనె మాటలు అలుముకోవచ్చు
వెన్నంటి వేటాడే ప్రశ్నల తూటాలు
తుపాకి గొంతులోనే లాక్ అయిపోవచ్చు
నిట్టూర్పుల నుంచే ఆశల మొక్క ఏసుకోవచ్చు
మోడువారింది పలకరింపులతో చిగురించవచ్చు
తవ్వడానికి పలుగు పారలే ఆలోచనలు, ఆచరణలు
నిరాశగంపను నెత్తిపై మోస్తూ
నిశ్శబ్దాన్ని ఒంట బట్టించుకొని
మడిగట్టుకున్న అంటరానితనంతో
ఎవరికి వారే మట్టి దిబ్బలా ఉంటే
ఎవడో ఒకడు హక్కుల్ని తవ్వుకుపోతాడు
మెజారిటీ గుంతల్లో కప్పేసి దిమ్మిసవేస్తాడు
ఎవరికి వారు స్వార్థం తుప్పులో ఊరుతుంటే
ఆత్మ విమర్శ సూదులు చిలుమెక్కుతాయి
నిప్పుల గుండంలో నడక
జాతరలో భలేగుంటది
నిజజీవితాల్లో... నిప్పులు పోసినట్లే
నేను ఒక్కొక్క అక్షరాన్ని తవ్వుతున్నా
గుంత చుట్టూ ఒప్పుల కుప్పపోస్తున్నా
పదాలు, పాదాల మొక్కను
ముక్కుసూటిగా, నిటారుగా నాటి
బాధ్యతల సేంద్రియ ఎరువులు వేసి
జీవాక్షరాల మట్టిపోసి తొక్కుతున్నా
నిజాయితీ వేప కవి కోసం ఎదురుచూపులు
దాని హరిత నీడలో
సమాజాన్ని సేద తీరుద్దామనుకున్నా

కోటం చంద్రశేఖర్
4-2-120, విజాపూర్ కాలనీ, తాండూర్-501 141
చరవాణి: 9490157320

# 248
# ఇదిగో నవలోకం

ఎటు చూసినా నిరాశే
విశాల కోటలో వున్నాం, ద్వారమే దొరకలేదు-
ఎటు చూసినా నీళ్ళే-
విరుచుకుపడు అలలసముద్రంలో వున్నాం,
తీరమే దొరకలేదు
క్యాలెండర్లు రాల్లూ ఉన్నాయ్
డైరీలు మార్తూ ఉన్నాయ్
మార్పు లేదు
తీర్పు లేదు
లోపించని ప్రయత్నంలో, కొరవడని కఠోర అన్వేషణలో
ఇదిగో నవలోకం-

చీకటి గుహలో కిరణంలా అరుణంలా
ఇదిగో నవలోకం-
వ్యవస్థ క్రౌర్యాన్ని ప్రశ్నించి నిలిచిన మేకలు,
గెలిచిన గొర్రెలు
ఉండవిక! సహించడాన్కి అవమానాలు,
స్వతంత్ర ఊహలకి ఊపిరి పోసాం
ఉండవిక! భరించడాన్కి వెటకారాలు, వ్యూహాలకి
ప్రతి వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేస్తాం-
ఇదిగో నవలోకం
ఆశలు ముగ్గులై రంగవల్లులై
బంతిపూల మధ్యన అలంకరించిన గొబ్బెమ్మలై





కోట్ల వెంకటేశ్వర రెడ్డి
4-31/1/2, భగీరథకాలనీ, మహబూబ్‌నగర్-509001
చరవాణి: 81860281666
ఇ-మెయిల్: kotla9440233261@gmail.com

249

## ఒక్క అడుగుతోనే

ఇది
ఒకే అడుగు
తంగేడు పూల పరిమళం
బతుకమ్మ మురిపెం!
ఒకే అడుగు
పాలపిట్ట దర్శనం
జమ్మిచెట్టు ఆశీస్సు!
ఒకే అడుగు
లేడిపిల్ల దుంకులాట
గులాబి పూల విరబూత!
నిర్దిష్టంగా వేసిన ఈ అడుగు
భవితకు స్థిరమైన పునాది!
అరవై ఏళ్ళుగా
అణచి వేసిన ఆశలు
ఎదురు చూస్తున్న దృశ్యం
నాలుకలెండిన పొలాలు
నదులవైపు చూపు వేలాడేస్తున్న చిత్రం
బతుకుమీద ఆశ చచ్చినా
మట్టి మనిషి జీవన స్పర్శకోసం వెతుకులాట
లాటీలకు తూటాలకు ఎదురునిల్చిన ఉస్మానియా
ఉపాధికోసం ఎదురుచూపులు
వలస పాలకుల పాదాల కింద
జీవచ్ఛవాలైన పల్లెలు
మనుగడ కోసం స్వచ్ఛత కోసం
అశ్రులు చాస్తున్న తీరు
చారిత్రక నగరం
విశ్వనగరం కోసం ముస్తాబవుతున్న తహతహ
ఒక్క అడుగుతోనే
అద్భుతాలు ఆవిష్కృతమవుతున్న వేళ
దేశపటంపై ఇప్పుడు
బంగారు తెలంగాణ పొడుస్తున్న పొద్దు!
నా కలమిప్పుడు
అమరుల స్తూపమై
త్యాగాలను గానం చేస్తున్న వేళ
స్వరాష్ట్రమా సకల జనుల సాకారమా
మరో అడుగు ముందుకెయ్
మా బతుకుల్లో బంగారం పండనీయ్!
రాష్ట్రమంతా వెలుగులు నిండనీయ్!!

**కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి**
చరవాణి: 9441561655

## 250

# ధీరులకు మొగసాల

**నా** జిల్లా నల్లగొండ తెలుగునాట విరజిమ్మిన నేల
దుండగులను చీల్చి ఉద్యమాలకు నిల్చిన యుద్ధభూమి
క్రూరపాలన ఎదిరించి ప్రజోద్యమానికై నెత్తురు జిమ్మిన
మట్టిముద్ద
నియంతల దుందుడుకు చేతులకురేసిన నా నల్లగొండ
శిల్ప వాస్తు శాసన పరిశోధన సాగించిన ధీరశాల
ఎల్లవేళలా మార్పు కాంక్షించు నల్లటి కొండ
సిరులు నెలకొన్న సొరుకొండ - రాటుదేలిన ధీరుల
కొండ
దిక్కుదిక్కులు వెలుగులు విరజిమ్మే నిప్పుకొండరా
తెలుగు నేలకు మెరుగులు దిద్దిన నా... నల్లగొండ
ఇచట కనిపించును యాదాద్రి లక్ష్మినరసింహస్వామి
మహిమలు
ఇంకోచోట విలసిల్లెను కాకతీయుల కట్టడాలు
మరోచోట సిరులు పలుకు కృష్ణమ్మ పరవళ్ళు
ఓచోట కనిపించును కనువిందులు చేసే జైన బౌద్ధ
నిర్మాణాలు
ఏమి తక్కువరా నా నల్లగొండ - ఎదురు నిలిచి పోరాడే
ఎర్రకొండ

ఆదిమానవ అవశేషాలు అవతరించెనిచట
చరిత్ర పూర్వయుగ సమాధులు బయటపడెనిచ్చోట
శాతవాహన, ఇక్ష్వాకులు విష్ణుకుండినులు
కాకతీయులేలిన భూమి
ఉద్దండ కవులు రచయితల కళాకారుల కాణాచి
నా నల్లగొండ త్యాగాలకు నిండుకుండ
నిజాం నిరంకుశంపై ఎగసిపడిన అగ్నికణం
ఫ్యూడల్ వ్యవస్థ గుండెల్లో నిద్రించిన మరఫిరంగి
అలుపెరుగక సాగిన పోరులో వికసించినమందారం
బండెనుక బండి కట్టి నైజాం రాజును తరిమికొట్టినది
వడిసెల రాళ్ళు నింపినది జడివాన కురిపించినది
భూమికొరకు భుక్తికొరకు పేద ప్రజల విముక్తి కొరకు
నా తల్లి నల్లగొండ నడుం కట్టిన వీరకొండ
కొమరయ్య, ఐలమ్మ, ఆరుట్ల, భీంరెడ్డి అనుభవాలు
శ్రీకాంతాచారి, వేణుగోపాలరెడ్డి మరణాలు
ఏమి తక్కువరా నా నల్లగొండ
వీరులకు నిలయమ్మురా, ధీరులకు మొగసాలరా నా
నల్లగొండ.

కొండ రవీందర్
నిజామాబాద్. చరవాణి: 9848408612

# 251

## కనురెప్పల మాటున

కళ్ళు తెరచుకుని
కనురెప్పల మాటున
దాగిన కన్నీళ్ళ త్యాగపు
విలువ తెలిసేదెప్పుడు ....!
దుక్కి దున్ని చెమట ధారలు పోసి
మట్టిలో మాణిక్యాలు
పండిస్తూ...
గిట్టుబాటులేక
ఉరిత్రాళ్ళను
ముద్దెట్టుకుంటున్న అన్నదాత...
ఆర్తనాదం .. వినేదెవ్వరు....!!
గుక్కెడు నీళ్ళకోసం
గోదారి ఈదినట్లు
పాతాళగంగను
తోడి తోడి
అలసిపోయిన అమ్మ... అక్క చెల్లెళ్ళల్లా.....
గోస తీరేదెప్పుడు !!!
మనం మన కోసమే
బతకడం
నేర్చుకుంటే .... తప్ప
మనం మన భూమిని
దున్నుకుంటే తప్ప
ఈనేల మట్టివాసన
మరో కురుక్షేత్రం కాకముందే...
సమాజపు కుళ్ళుని
కడిగే....
చట్టాలు తెస్తే గాని
మా యాస మా భాషలకు
గౌరవం ఇస్తే గాని
బతుకులు మారవు
.... అప్పుడే ....
ఈ నేల తెలంగాణ తల్లి
అక్కున చేర్చుకొని
అందరు నావాళ్ళేనంటూ
గోరుముద్దలు.... కొసరి కొసరి
తినిపిస్తుంది....
మమతానురాగాలు
కురుపిస్తుంది
దశాబ్దాల పోరాట ఫలితానికి
నేలమ్మ ఒడిలో....
ఇంటింటా ... వెలిగే
దీపావళి కాంతులు
కావాలి....
అందరి మోములో
ఆనందపు చిరునవ్వులు
పూయాలి.

కొండపర్తి భాస్కరాచారి

252

## ఎగతాళి నెదిరించి

ఎగతాళినెదిరించి నిబ్బరంగా నిలుచున్నదిరా...
నా తెలంగాణ జాన!
ఎదుటోని ఎగపోతల్నేజూస్తూ నవ్వుతూ ఉన్నదిరా...
-ఈ తొలి వసంతాన!
నా తెలంగాణ ఇపుడు కోటి కాంతుల (కాంక్షల) వీణ-
-ఈ రాష్ట్రావతరణ తొలి వసంత పరువాన!
స్వపరిపాలన శాతగాదు అన్న, యాసబాస నెక్కిరిస్తూ,
స్వరాష్ట్రంవస్తే,,, చిమ్మ చీకటే అన్నా!
రాగమాలికల మధ్య ఊయలలూగుతున్న
పసిపాప నవ్వురా నా తెలంగాణ
రంగులరాట్నమెక్కి ఎంతో ఎత్తుకెగసి
జలపాతాలవోలే గలగల నవ్వుతుంది నా తెలంగాణ
భరతమాత చేతిలోని బతుకమ్మరా! నా తెలంగాణ!
దక్షిణం అంటే తమిళమే కాదు
ఢిల్లీ గల్లీలోన లొల్లి లొల్లి జేసే
అతిపెద్ద తెలుగు భాషణం నా తెలంగాణ.
ఆరున్నర పదులు పదవుల్లో ఉండి ఏమి ఎలగబెట్టినారు?
ఎండకాలమొస్తె బట్టలెం డేసుకోను విద్యుత్తు తీగల్నే
జూపినారు! ఎగసెగసి పడతారెందుకు ఏడాదికే...
ఏమేమి ఒరగబెట్టేదుండే మాకాడికే!
స్వాభిమానముతోటి ఎగతాళి నెదిరించి నిలుచుందిరా
చాలు నా తెలంగాణ

తొలి ఏడులోనే తొలి పొద్దులాగ వెలుగులీనుతుందిరా
చూడు నా తెలంగాణ
అమరుల కర్పించే జలతర్పణాకై కదులుతున్నదీ
నా కాకతీయ మిషన్
ఐనా ఒక విజన్ ఐతే కూర్చి తొలగించవలసే ఉన్నది
నిరుద్యోగుల పరేషాన్
ఏ ఉద్యమం ఐన చేపట్టి సాధించవచ్చు ఏ సమన్యాయమైనా!
ప్రజల దగ్గరకు పాలన చిన్న రాష్ట్రాలతోనే వీలన్నా!
ఎందుకురా అంత తొందరా! ఏడాదే కాదు చాలా ఉన్నది
ముందరా!
గుజరాత్ తర్వాత ఏకైక మిగులు రెవిన్యూ రాష్ట్రం
మనదేరా!
సప్తగిరికి దీటుగా నవగిరిగా మారే యాదగిరి రూపిణి నా
తెలంగాణ!
భద్రగిరికి దీటుగా ఒంటిమిట్ట ధార్మిక ప్రభావిణి నా
తెలంగాణ!
హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనం అమరావతి మంచినీటి
కొలను ప్రస్థావనం
ఏదిజూసినగాని ఏడాదికేడాది ఎగబాకే పోటీతో...
ఒక్క భాషగల రెండు రాష్ట్రాలు ఎదగాలి అన్న
స్ఫూర్తిరా నా తెలంగాణ!

**కొండపల్లి నీహారిణి**
16-559, శ్రీశ్రీ హోమ్స్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట పోస్ట్
సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా-58.
చరవాణి: 9866360082

# 253

## దీపశిఖ

చెట్టుకూ విత్తుకూ తెగని బంధం
వేళ్ల రక్తనాళాలు రిక్తహస్తాలు గావు
వ్యవస్థ నిర్మాతలు
నిర్మిస్తారు ప్రేమ వారధులు
క్రోధావేశాల క్రింద బెరడు చర్మరంధ్రాలు
చెమట చుక్కలు
చూపుకానని గాలి ఆకు కదలికల రూపు
పువ్వూ నవ్వింది కాయా నవ్వింది
కోయకున్నా జారే గుండె, విరిసే గుండె
రెండు రెండు నాలుగు, రెమ్మలూ రేణువులూ
జీవి ఆనవాళ్ళు
ఒక్క దీపశిఖ ఒక్క మానవుడు
శాఖోపశాఖల ఊహల సాకారాలు
ఒక్క దరి చేరే కుటుంబ అందం
కొత్త నీరు చేరిన సంద్రం
ఏటేట సాగే సంబురం, ఊరూర వెలిసే
బతుకమ్మలు ఆడబిడ్డలు
అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములు
తెలంగాణ మొత్తం ఒక భావ సముచ్ఛయం

కెరటాల గీతలు అలల గీతికలై
చేతులన్నీ కలిపి తీరం జేరె
కడుపులు నింప చెరువుల గుండె మురిసి
క్షణాలన్నీ దోసిట బోసె
హృదయ తరంగం అంతరంగంలో
ఒక ఉపరితల దృశ్యం చిత్రించె
సంతోషాలు సంవేదనలు
అడుగున బురద ఆలంబన
గట్టు ఆదరణ
వచ్చిపొయ్యే నీటి పలకరింత
ఆటుపోట్లు, అమ్మ బాపుల ఆలోచనలు
కొడుకు బిడ్డల బాగుబాధలు
ఆశాజీవి చెరిపి రాసుకున్న నల్లని పలకపై
అక్షరాల వెలుగుల్లా ఉత్సవకావ్యం
అందులో విచ్చిన భావాలు తంగేడు పువ్వులు
ప్రతేడు నవ్వులు విరిసి సబ్బండ వర్ణాలు విచ్చాలి
నా తెలంగాణ భావపరంపరల బతుకమ్మ!

కొండి మల్లారెడ్డి
19-61/5/సి, విద్యానగర్, సిద్దిపేట-03,
మెదక్ జిల్లా. చరవాణి: 9441905525

254

# చెరువుతల్లి

మృగాలకు మూగజీవాలకూ
పాలుతాపి చెట్లకు, చేలకూ
తలంటుపోసి నేలపాదాలు కడిగి
బీడు పొలాలను తడిమి
సకల జీవజాలానికి
తావునిచ్చి, సాదిసవర్చిన తల్లిగారిల్లు....
పచ్చనాకుల పైటకొంగు చాటున
పిచ్చుకలను దాచుకున్నట్టు
పల్లె పిల్లల్ని చల్లంగ చూసిన
చెరువుతల్లి...
పిల్లా ముల్లె సదురుకొని
వలసెల్లిపోంగ
మిగిలిపోయిన ఇల్లోలె
ఇన్నేళ్ళుగా
చిన్నబోయిన శిథిల సౌందర్యం
మారుతున్న తరాలకు
మౌనవారధి...
ఇన్నాళ్ల వనవాసం ముగిసి
ఊళ్లెకు మళ్ళీ పండుగ కళొచ్చింది...
పల్లెల్ని వల్లకాళ్ళను చేసి
పరాయిరీతి ఎగజల్లిన కుళ్ళును
పురాగ కడిగేయాలె...
పూడుకుపోయిన
గుండె కవాటాల్లోని పూడికతీసి
తనువు అణువణువూ
శుద్ధి చేయాలి...
వట్టిపోయిన పొలం దేహానికి
చెరువు మట్టి సుగంధాన్ని పట్టించి
వెచ్చని చెమట చుక్కలు చిగురించి
పచ్చని పైరులై పరవశించాలి...
వలసపోతున్న మేఘాలు ఆగి
వానల దీవెనార్తులిచ్చి
ఉక్కిరి బిక్కిరైన చెరువులకు
ఊపిరి పోయాలి...
పొద్దంతా తడలు కొట్టి
తానమాడే తెట్టెరాళ్ళను తనివితీరా ముద్దాడి
దిగులు వారిన లోగిల్లలో
వెలుగు పూలై అలుగు దుంకాలి...
తల్లడిల్లిన భూమితల్లి
బుసబుస పొంగి
సేద్యకాని పెదాల మీద
చెరువు చిరునవ్వై పరిమళించాలి...
మట్టిని నమ్ముకున్న మనిషి
మహోన్నత శిఖరమై
నిరందిగా తలెత్తుకోవాలి....

**కోడూరి విజయకుమార్**
12613-613, స్ట్రీట్ నెం. 14, లేన్-1, నాగార్జుననగర్ కాలనీ, తార్నాక,
సికింద్రాబాద్-17 చరవాణి: 8330954074
ఇ-మెయిల్: kodurivijay@gmail.com

255

# ఒక ప్రేమలేఖ

మహా నగరం నుండి ఎప్పుడు వొచ్చి వాలినా
నా వరంగల్
నా బాల్య మిత్రుల్ని కౌగిలించుకున్నట్లే వుంటుంది
రైల్వే గేటు, చౌరస్తా, మండీ బజార్, కాకతీయ టాకీస్
రోడ్లన్నీ
నా బాల్య మిత్రునితో తిరుగుతున్నట్లే వుంటుంది
రేగి పళ్ళ చెట్టు కింద చిర్రా గోనె ఆడుకున్నట్లే
వుంటుంది
ఊరి రహదారుల మీద స్కూలు పిల్లలెవరు కనిపించినా
నా వరంగల్
నా శిశుమందిర్ నా మహబూబియా లలో వేదికలెక్కి
అమితానందంగా పాటలు పాడుకున్నట్లే వుంటుంది
వీధి దీపాల వెలుగులో చదువుకున్నట్లే వుంటుంది
ఊరి గోడలపైన ఎక్కడ ఎర్రా ఎర్రని రాతలే
కనిపించినా
నా వరంగల్
గద్దర్ పాటతో ఆమెడ నారాయణ హత్యతో
ఊరు ఇంకా ఊగిపోతున్నట్లే వుంటుంది
నెత్తుటి తడి ఇంకా తగులుతున్నట్లే వుంటుంది
పోచమ్మ మైదాన్ హన్మకొండ చౌరస్తా బాలసముద్రం
కనిపించినపుడల్లా
నా వరంగల్
సకల జనులూ తెలంగాణ కోసం ఇంకా
రోడ్లపై కూర్చుని వునట్లే వుంటుంది
ఉద్యమ కాక ఇంకా చల్లారనట్లే వుంటుంది
నక్కలగుట్టలో కాళోజీ విగ్రహం కనిపించినపుడల్లా
నా వరంగల్
కవితా గానాలలో ఓలలాడిన మిత్రమండలిలో
మైమరచి పోయిన రోజులలో బతుకుతున్నట్లే
వుంటుంది
'నా నుండి మన దాకా ఎదగమని' కాళోజీ
తడి కళ్ళతో చెబుతున్నట్లే వుంటుంది
రెండు వీధుల అవతల వీచే గాలి పలకరించినపుడల్లా
నా వరంగల్
నా యవ్వన పగళ్ళని వెలిగించిన
నా తొలిప్రేమ పలకరించినట్లే వుంటుంది
నా దిగుళ్ళ రాత్రులలో తిరుగుతున్నట్లే వుంటుంది
వరంగల్... నా ప్రియ వరంగల్
బస్సు దిగి అడుగు కింద పెట్టగానే
ఊరి మట్టి నన్ను స్పృశించినపుడల్లా
మా అమ్మ సమక్షంలోకి చేరినట్లే వుంటుంది
అమ్మా నువ్వూ వేర్వేరు కానట్లే వుంటుంది

లింగాల రాజ సమ్మయ్య
ఆదిలాబాద్.
చరవాణి: 9440587986

256

# సమ్మక్క తెలంగాణ

మొన్నటి మాఘశుద్ధ
విజయ మాసంలో
మేడారం మహాబ్రహ్మాండ జాతర
జనవనంలో డోలు ఢమరుమోతలతో
బోనం బంగారం బండారులతో
పవిత్ర గద్దెల ముంగిట మోకరిల్లి
మొక్కులు భక్తజనం మొరాలకించి
దీవించి ధైర్యమిచ్చే !
నిన్నటి పార్లమెంటులో
తెలంగాణ ఆరుదశాబ్దాల
ఉద్యమ చరిత్ర తుది ఘట్టంలో
తీర్పు అంతిమం గావించి
చిమ్మిన చీకట్లు కమ్మించి
తక్షణమే చట్టసభ బిల్లు
ఆమోదింప అద్భుతం కనబర్చే !
తెలంగాణ ప్రజానీకం
అనంత ఆనంద పర్వంలో తేలాడుతున్న
తరుణంలో జయజయ నాదాలను
దశదిశలు మారుమ్రోగిస్తూ !
మా తెలంగాణ తల్లులు మా బతుకులు
కాపాడి ధన్యుల చేసిన
ముల్లోకాల దేవతల్లో నేటి మేటి దేవతలు
సమ్మక్క సారక్కలకు
మా శతకోటి వందనాలు

లెనిన్ శ్రీనివాస్
సాహితీకుటీరం, కాచిరాజు గూడెం (పోస్టు),
ఖమ్మం-గాంధీచౌక్-507003.
చరవాణి: 9959852154

257

# రక్తం చిందని యుద్ధ విజయం

సుదీర్ఘ సమరాల స్వప్నం
క్రొంగొత్త వెలుగుల కోసం
దొరబాంచన్ నీకాల్మొక్కుతానన్న
వ్యవస్థకు ఎదురు నిలిచి
స్వార్థపు పునాదులు కూల్చడం కోసం
సగటు జీవి సమరయోధుడుగా
ఊరువాడ ఉద్యమ దివిటీలై
కాకతీయుల కథన వ్యూహం
సమ్మక్క సారమ్మల సాహసం
కొమరంభీం, చాకలి ఐలమ్మల వారసత్వం
అగ్గికి నిలువునా బుగ్గైన శ్రీకాంతాచారి త్యాగం
ఆత్మహత్యలతో సంకల్పదీక్ష ప్రమిదలు వెలిగించి
రక్తం చిందని యుద్ధంలో
రణనినాదం నింగికెగసింది
స్వంతగడ్డపై పరాయి పాలన
మనభాష, సంస్కృతుల బతుకమ్మల
ఊరు ఊరూ ఉద్యమ కేంద్రమే
తనువు తనువు ఆకాంక్షల హరివిల్లే
మాగాణుల మత్తడి కోసం
గోదావరి, కృష్ణమ్మల గలగలపరుగులవై
ఆరేసుకున్న ఆశలెన్నో-
ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యమకారుల ఖార్ఖానాలో
రాలిపడ్డ పూ మొగ్గలెన్నో
చరిత్ర నిర్మాణంలో పునాది రాళ్ళెన్నో-
తెలంగాణ కోసం పరితపించిన ప్రాణాలెన్నో
జయశంకర్, కాళోజీ, దాశరథి, విద్యాసాగర్, కె.సి.ఆర్
వ్యూహాలకు ఊపిరిలూదిన ప్రొఫెసర్ కోదండరాం
నవయుగ నిర్మాణానికి నాంది వాచకం పలికిన
రాజకీయ పార్టీలెన్నో-
కోటి ఆశల తెలంగాణ ఆవిర్భావం
60వసంతాల స్వప్న సాకారం
రక్తం చిందని యుద్ధం విజయం
2 జూన్ 2014 చరితా సువర్ణాక్షరం
జయహో తెలంగాణ, జయజయహో తెలంగాణా....!!

**మడిపల్లి రాజ్‌కుమార్**
4-42-652, యాజ్‌బెస్ట్ యాజ్ కాలనీ, కూకట్‌పల్లి (వి)-500 037
హైదరాబాద్. చరవాణి: 9949699215

# 258

# మూడోకన్ను మూయొద్దు

అక్కడి వలసల
నిరంతర పెను తుపానులో మునిగిన వాణ్ణి
అయినా...
అక్కడి తుపానుకు కన్నీళ్ళు పెట్టుకున్నాను.
ఇన్నాళ్ళూ...
చిల్లరపైసల నా జేబుకూ
చిల్లులు పెట్టుకున్నాను
తుపాను వెనక్కి తగ్గుతున్న
పెను సంబురానికి సంవత్సరం నిండిన పండుగవేళ
నేను
ఇప్పుడిప్పుడే కళ్ళు తుడుచుకుంటుంటే
వాడి కళ్ళు మండుతున్నాయి

అందుకే ఇంకా
తెలంగాణ నువ్వు నా కున్నవంటున్నాడు
నేను ఇప్పుడిప్పుడే జేబు చిల్లులు కుట్టుకుంటుంటే
వాడికి సూది గుచ్చుకుంటున్నది
అందుకే విలవిల్లాడుతున్నడు
మనం సంబురాలు చేసుకుంటుంటే
దీక్షలు జేస్తున్నడు
తెలంగాణ వీరుడా!
నా తెలంగాణ పౌరుడా!
రెండూ ఒకటైతయనే
వాడి కలలను కాదు కళ్ళను పొడవాలి
వాణ్ణి జూసే మన మూడోకన్ను మూయొద్దు!!

**మడిపల్లి హరిహరనాథ్**
నిర్మల్, ఆదిలాబాద్
చరవాణి: 9603577655

259

# విజయ దుందుభి

స్వప్నం సాకారమైన వేళ
దశాబ్దాల కల నెరవేరిన వేళ
విజయ వత్సరాన ఉద్యమ కెరటమై ఎగిసి
విజయతీరాలకు చేరి
జయ వత్సరాన జయజయహో అంటూ
విజయ దుందుభి మోగించి
పుడమి తల్లి పులకించగ
ఆనంద పరవశాన
నవ తెలంగాణగా అవతరించి
అమరుల స్ఫూర్తిగా నిలిచి
మన్మథలా మన మదియందు ముదము నిండగ
గ్రీష్మంలో తొలివసంతమై
మేఘావృత చిరుజల్లై- హరివిల్లై
తెలంగాణ ఆవిర్భావ శుభదినాన వారోత్సవాన
అంబరాన్నంటిన సంబరాలు
సప్తవర్ణ శోభలను - దశదిశలా వ్యాపించగా
కనులకు రమణీయ కమనీయ దృశ్యాలు
సాంస్కృతిక వారధులు కళామ క్షేత్రాలు
అమరుల స్థూపాలు
విద్యుల్లతల వెలుగులతో తళుకులీనుతుంటే
ఈ ఆనందహేల
భాజాభజంత్రీలతో డమరుకం నాదాలతో
తాండవమాడి
శివతాండవమై పేరిణీ నృత్యమై
చిందు యక్ష గానమై గుస్సాడి నృత్యమై
జానపదమై ఒగ్గు కథలై కొమరం భీములై
తరుణుల నెత్తినెత్తిన బోణాలై బొడ్డెమ్మలై
వాడవాడల త్రివర్ణపతాకమై ఎగిరి
అమరుల త్యాగాన్ని కోటిగొంతుకల కీర్తిద్దాం
జోహార్ అమర వీరులకంటూ
జై తెలంగాణ జయజయహో తెలంగాణ అంటూ
అమావాస్య చీకట్లను పారద్రోలి
తెలంగాణ రాష్ట్ర అవరతణగ పేదరిక నిర్మూలనే
ధ్యేయంగా
అవతరించిన అవతార పురుషుడు
మేరునగధీరుడు
పక్షమెరుగని నిండుజాబిలి
వెన్నెలరేడు శశాంక ఫణిభూషణుడు
చంద్రశేఖరుడు
వెన్నెల వెలుగులు విరజిమ్మగ
మోడువారిన వృక్షాలు తొడిగెను లేలేత చిగురులు
పడతి పెళ్ళీడుకు రాగ కళ్యాణలక్ష్మిగ కంటి వెలుగయ్యె
హరిత హారమై హరిణుల పరుగయ్యె
దార్శనికుడి దార్శనికతకు దర్పణమై

పేదల రెండు పడకగదుల ఆత్మగౌరవ జీవనమయ్యె
వృద్ధులకు వితంతువులకు ఆసరాగా నిలిచె
కడునిరుపేదలకు మూడెకరాల మాగాణిగా నిలిచె
పొగచూరిన బతుకుల జీవనభృతిగా మారె
నిందించిన వారు నీచులంటూ వారి మనస్సు
మాలిన్యమనుచు
ఆసరాగా నిలిచి ఊతమిచ్చె
విద్యార్థులకు అన్నింటా అండగా నిలిచి
సన్నబియ్యాన్ని పౌష్టికాహారముతో జతకూర్చె
ఆరోగ్య లక్ష్మిగ మారి శిశువుల కేరింతలకు
నిలయమయ్యె
కృషీవలులకు ఋణమాఫీ చేసి ఊతమిచ్చి
కాకతీయుల కళాప్రభల క్రాంతిరేఖ
గలగల జల ఉదకంగా ఊరి చెరువయ్యె
తెలంగాణ ప్రజల ప్రతిష్ఠాత్మక జలజాలంగా
రూపొంది
ఫ్లోరిన్ రక్కసిని తరిమికొట్టి ప్రతి ఇంటి అమృతధారగ
నిలిచి
చల్లని గుండెతో సేదతీర్చె
చదివిన చదువు సార్థకమైన వేళ విద్యార్జన దిశగా
విద్యార్థులు పనిమంతులైన వేళ
వారి మానసపుత్రిక కెజి టు పిజి మొగ్గతొడిగి
ప్రజలు ప్రభుత్వము (మంత్రులు, ఉద్యోగులు)
నా రెండు కళ్ళు అంటూ ఒకరికి కడుపునిండా జీతాలు
పెంచి
మరొకరికి కడుపు నిండా అన్నం పెట్టిన
దొరబాబు కడుపు చల్లగుండ
వారికివే నా ముకుళిత హస్తాల కైమోడ్పులు



మడిపల్లి భద్రయ్య
1-3-126/3-ఈ, శాస్త్రినగర్, నిర్మల్ (పోస్ట్)
ఆదిలాబాద్-504 106 చరవాణి: 9885830550
ఇ-మెయిల్: madipallybhadraiah@gmail.com

260

# తెలంగాణ వైశిష్ట్యం

సీ. తెలగాణ కొరకయి కలగాంచి యరిగిన
అమరవీరుల కెల్ల నంజలింతు
తెలగాణ తల్లికి తిలకము దిద్దుచు
పులకించి పోవుదు పుణ్యయుతుగ
తెలగాణ భాషను తెలగాణ యాసను
మాటాడి మురియుదు ఆటవోలె
తెలగాణ మట్టిని తలపైన దాల్చుచు
గర్వించి నేలపై గంతులేతు

తే.గీ. అమ్మ ఆనందమొందగా చెమ్మగిల్లు
కనుల బాష్పాలతో తన కాళ్ళు కడిగి
నెత్తిపై చల్లుకొంచును నిత్యమేను
హత్తుకొందును 'అమ్మ'ను అమృతమయిని

సీ. పసిడి తెలంగాణ పసివాడనీయక
ముందుకు నడిపించు ముఖ్యులెవరు?
అన్ని రంగములందు ఆరితేరినవారు
స్వార్థము లేనట్టి సాధుజనులు
పేదలకెప్పుడు పెన్నిధిగా నిల్చి
ఆదుకొనెడినట్టి ఆర్యుడెవరు?
ప్రజల ధనంబును పద్ధతిగా వాడి
స్వార్థమొనర్చని వ్యక్తతండు

తే.గీ. నల్లధనమన్న మాటను కల్లజేసి
ఎల్లవేళల జనులకు ఏడుగడుగ
ఉండి కాపాడువాడె ఉత్తముండు
పుణ్యుడాతడె కనగాను పుడమియందు.

మధుకర్ వైద్యుల
ఇంటినెం. 13-1-3/3/6/2ఇ, అవంతినగర్ తోట, మోతినగర్,
హైదరాబాద్ - 500018  చరవాణి: 8096677409

261

# భవిష్యత్ తెలంగాణ!

ఎన్ని కలలు, ఎన్నెన్ని కలలు... ఒకటా రెండా?
భవిష్యత్ తెలంగాణకోసం అంతులేనన్ని కలలు
బంగారు తెలంగాణ కోసం ఎన్ని కలలు కంటున్నానో
ఎన్ని రాత్రుళ్లు ఆనందంతో ఎగిరి గంతేశానో...
భూగోళమంతా ఒంటరిగా చుట్టేసి వచ్చినట్లు
యుద్ధాలంటూ లేని శాంతి ప్రపంచం సృష్టించినట్టు
శాంతి కపోతాలు స్వేచ్ఛ గీతికలు ఆలపించినట్టు
సరిహద్దులు చెరిపేసి స్నేహహస్తాలు చాచినట్టు
కరువు కాటకాలు లేని తెలంగాణను సృష్టించినట్టు
చుక్క చుక్కని ఒడిసిపట్టి తాగునీటి సంద్రం కట్టినట్టు
పాడి పంటలతో పరిఢవిల్లే ప్రకృతిని పల్లవించినట్లు
ఎంగిలి మెతుకుల కోసం వెతికే దారిద్ర్యాన్ని
పారదోలినట్లు
కులమతాల తేడాలేని ఏకత్వాన్ని ఏర్పరచినట్టు
పేద, ధనిక అడ్డుగోడల్ని అడ్డంగా కూల్చేసినట్టు
ఆడ, మగ భేదం లేని సమానత్వాన్ని సాధించినట్టు
మనమంతా ఒక్కటనే మానవ సమాజాన్ని
నిర్మించినట్టు
రంగుజెండల రాజకీయాల్లేని ప్రజాస్వామ్యాన్ని
స్థాపించినట్టు
పాలకులు, ప్రజల మధ్య సమన్వయాన్ని నెలకొల్పినట్టు
అభివృద్ధి మంత్రాన్ని జపించే నేతల్ని
అందలమెక్కిచ్చినట్టు
స్వర్ణయుగాన్ని తలపించే పరిపాలనను అందించినట్టు
కోపతాపాలంటూ లేని చిరునవ్వుల్ని కురిపించినట్టు
పగ, ప్రతీకారాలు లేని ప్రేమ పుష్పాలు పూయించినట్టు
శారీరక లోపాల్లోని మంచి మనుషుల్ని పుట్టించినట్టు
ఒకరికి ఒకరం అనే అనుబంధాలను పెంపొందించినట్టు
అజ్ఞాన తిమిరాన్ని జయించి జ్ఞానజ్యోతిని వెలిగించినట్టు
నిరుద్యోగానికి తావులేని ఉద్యోగ అవకాశాలు
కల్పించినట్టు
స్వార్థానికి తావులేని సమాన అవకాశాలు కల్పించినట్టు
చావు బతుకులను సమాధిచేసి దుఃఖాన్ని జయించినట్టు
ఆర్థికాభివృద్ధిలో అమెరికాను తలదన్నినట్లు
తెలంగాణ గడపదగ్గర ప్రపంచమంతా మోకరిల్లినట్లు
సీమాంధ్ర వాసన లేని భవిష్యత్ తెలంగాణను
ఎప్పటికైన నిజమవుతుందన్న ఆశతో కలకంటూనే
ఉంటా



**మద్దికుంట లక్ష్మణ్**
ఇ.నెం.4-2-60/1/1, శాంతినగర్ రోడ్, ధోభిగల్లి, సిరిసిల్ల,
జిల్లా కరీంనగర్, తెలంగాణ. చరవాణి: 9441677373

262

# నీటి కళ

పూడికలు తీసి చెరువులు కుంటలు దురస్థు చేస్తరు
వానలు దరో దరో దంచుతయి
నీళ్ల తావులు బర్‌పూర్తిగ నిండి అలుగులు దునుకుతయి
శేండ్లు శెల్కలు ఆకుపచ్చ రంగేసుకుంటయి
ఊర్లు పల్లెలు కిల కిల నవ్వుతయి
మాసుల్దారి మల్లయ్య అద్ద బీగెడు శీర్క గూడ
అద్దం లెక్క మెరుస్తది
పచ్చలు పసురాలు కడుపు నిండ మ్యాత మేస్తయి
గడ్డమీద మాదిగ బాలయ్య మామ
హఠాత్తుగా మహారాజైపోయి
"సభ జేయుదామిప్పుడు మంత్రివర్యా సభ జేయుదా
మిప్పుడు' యక్షగానంల ఏకతాళం దరువందుకుంటడు
కృష్ణార్జున యుద్ధం నాటకంల కృష్ణునేషం గట్టే
సాకలి హన్మయ్య బావ పిల్లన గొయ్యందుకోని
సత్యభామ ఏషమేసే మున్నూరుకాపు రాజయ్యను
తయారుజేస్తడు వడ్ల బ్రహ్మయ్య తాత బాడిసె
నాగటి దుంప మీద నాట్యం జేస్తది
కమ్మరి శివయ్య కొలిమిల
ఇనుప కర్రు ఎర్రగ ధగ ధగ మెరుస్తది
మసిరెస్ ధోతి కట్టుకొని
బెస్తపోశాలు శాపనారుకు పట్నం బస్సెక్కుతడు
కుమ్మరి సాయన్న ఇంటి ముంగిటి సారె
భూచక్రం లెక్క గిర్రున తిరుగుతది
గుర్రాల రాజయ్యపటేలు యాభైవేల అప్పు ఎంత
భిషాదమని నాగటి కర్రు భుజం మీద పెట్టుకొని శేను
దారి పడుతడు నర్ర మల్రెడ్డి కాక పన్నెండు గజాల చీరె
రెండంచుల ధోతుల జోడ సంచకారికి
సాలె రామన్న సంకలు కొట్టుకుంట మగ్గం
జమాయించుకుంటడు
పనుల ఎన్నులాటకు పట్నం పోయినోళ్లందరు
మల్ల ఊరు పట్టు పడుతరు
రాజమ్మదు చిచ్చా ఉస్సేను తాత
బరిగె గాలాలను సవరించుకుంటరు
గౌండ్లోల్ల ఎల్లు పెద్దనాయన తాడిచెట్టెక్కి
'జీవులెనుబది నాల్గు లచ్చలు చావు పుట్టకలిక్కడ'
కల్లును బింకిలను పోసుకుంట జ్ఞాన బోధ చేస్తడు!
పంట కాలువలు గలగల పారుకుంట బీళ్లు తడుపుతయి
బాయికాడి తెన్లోల్ల మల్లవ్వత్త గోశి ఎగదీసి కట్టి
వరి నాటుకు పొలంల దిగుతది
చిందు రాయమల్లు బృందం పటమేసి
ఏడు రోజుల కథకు రంగం సిద్ధం చేసుకుంటది
ఊరు ఊరంతా ఎల్లమ్మ పోషమ్మ
పట్నాలేసి బోనమెత్తుకుంటది
ఊరు ఆనందాల రాగరంజితమైతది
ఆరొక్క కళతోని అలరారుతది
రాత్రి కలతల్లేని నిశ్చింత నిద్రల జోగుతది

**మద్దెర్ల రమేశ్**
మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లా.
చరవాణి: 9985135771

263

# వర్ధిల్లు తెలంగాణ

ఉద్యమమే ఊపిరిలా
ఉద్యమమే పండుగలా
ఉద్యమమే వినోదంలా
ఉద్యమమే హృదయ నాదంలా
ఉద్యమమే జీవన వేదంలా
ముక్కోటి గొంతుకలు ఒక్కటై
ఘోషించిన తెలంగాణ!
పిడికిళ్ళెత్తిన చేతులే
ఆకాశపు తోరణాలుగా
జై తెలంగాణ నినాదాలే
సుస్వర స్వాగత గీతాలుగా
ఉద్యమ పద ఘట్టనలతో
ఉరకలెత్తించిన తెలంగాణ!
జై తెలంగాణ నినాదాలే
ఉరుములై ప్రతిధ్వనించిన
మెరుపులై ప్రతిఫలించిన తెలంగాణ!
వంటా వార్పులతో
రహదారులన్నీ పండుగనాటి వాకిళ్ళై
ఆటాపాటలతో నిండిన ఊరూవాడలు
ధూంధాం వేదికలైన తెలంగాణ!
మాటలను ఈటెలుగా మలిచిన తెలంగాణ!
కళలకే కొత్త కులుకులు నేర్పిన తెలంగాణ!
గజ్జె కట్టిన కాలుకు జిద్దు నేర్పిన తెలంగాణ!
పాటకు కోట కట్టిన తెలంగాణ!
కవి కలాలను రవి కిరణాలుగా
ప్రసరించిన తెలంగాణ!
తెలంగాణ! తెలంగాణ! తెలంగాణ!
కళలతో కలకాలం వర్ధిల్లు తెలంగాణ!
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!



**మల్యాల మనోహరరావు**
2-9-512, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్.
చరవాణి: 8106542095

# 264

## ఇక బే ఫికర్

మీతో సోపతి మా కొంప ముంచింది
బేకార్‌గ మేం ఏం బతకలె!
గోరుకొయ్యలు పొడవకముందే నిద్ర లేచినం
అమ్మటాల్లదాక మోటకొట్టి ఎకరాలకెకరాలు తడిపినం
బోట్లొరుస, గిద్దెలోరుసతో పండించిన ఒడ్లను కొలిసినం
గావులు, గావులు నింపినం చెరువులు మస్తుగ నిండితే
కట్టమైసమ్మ పండగ చేసినం అసైదులా అని ఎగిరినం
అలాయ్ బలాయ్‌గ బ్రతికినం
మా చెరువులకు మీరొచ్చినాకే గండ్లు పడినయి
శిఖాలన్నీ రాకాసి మూకల పరం అయినయి
ఎగుసం గాయి గాయి అయింది
ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టనట్లు
అన్నీ దిగమింగడానికి మరిగింన్రు
మమ్ములను అమాయకులను చేసి
ఆటాడుకుంన్రు ఎక్కిరించిన్రు
సోయికొచ్చి ఎగబడ్డం ఏండ్లకేండ్లు కొట్లాడినం
నెత్తీనోరు కొట్టుకుని మాసావు మేం సచ్చినం
వయసు పోరగాండ్లను పోగొట్టుకున్నం
ఆఖరికి పోయినేడే మా భూమి జాగలను
మేం గుంజుకున్నం మా పెత్తనం మేం తెచ్చుకున్నం
ఇక బేఫికర్ మునం పెట్టి దున్నుకుంటం
యాసంగి, వానకాలం పండించుకుంటం
మాకు సముద్రం లేకుంటె మాయె
కాళోజీ, జయశంకర్, శ్రీకాంతాచారి స్ఫూర్తి
తాతల కాలంనుంచి బుక్కెడు బువ్వ పెడుతున్న
సుజల కాసారముంది రామప్ప, పాఖాల వంటి
వేల వేల చెరువులున్నయి
విశాలంగా మన నేలను స్పృశించే
మా మంజీర, గోదావరి, కృష్ణమ్మ నదులున్నవి
అభయారణ్యాల మధ్య అపార ఖనిజ నిక్షేపాలున్నవి
చెరువులకు పూడికతీసి కట్టలకు మరమ్మత్తు చేస్తం
తూములనిండా నీరు బారిచ్చి మంచి ఎగసంచేస్తం
సొన-మసూరి బియ్యం తింటం
పుష్కలంగ కరెంటు పుట్టిచ్చి
పట్టిన చెమటను తుడుసుకుంటం బొంద్రాయి కాడే
బోనం ఎత్తుకుంటం రోజు బతుకమ్మ ఆడుకుంటం
ఇంక మీకు కండ్లు కుడుతుండొచ్చు
మీరేందో మూటగట్టిచ్చినట్లు మాట్లాడుతాంన్రు
మీతోటి మాకు ఒరిగిందేమి లేదు
ఎన్ను ఇరగడం తప్ప తల తిరగడం తప్ప
మాది నిజాం జమానా నుంచే మిగులు బడ్జెట్
రజాకార్లనే ఎదురించిల నిలిచిన తాకత్
ఇక చూస్కో మా తడాఖా సాలు పొడుగూత
సద్దులు - దసరానే జెజ్జెనకరె జనారే
జయ మంగళ తెలంగాణ హమారే....

మహ్మద్ కుర్షీద్ పాష
విలిమినాడు, చిట్యాల (మం), నల్గొండ జిల్లా
చరవాణి: 8121138261

265

## మల్లెలాంటి మనుషులం

అవమానం! అవమానం!
ఎందుకూ.. నేను ముస్లింనైనందుకేనా?
అమానుషం! అమానుషం!
ఎందుకూ.. నేను ముస్లింనైనందుకేనా?
మానవత్వం లేని మనుషులు చేసిన గాయం
బతుక్కు ఎల్లలు గీసి
బహిష్కరిస్తున్న గాయం
ఎందుకూ.. నేను ముస్లింనైనందుకేనా?
కాలులో ముల్లు కలుక్కు కలుక్కు బాధ
కంటిల నలుసు గరగరబాధ
ముప్పిరి కష్టాల కృత్రిమ వెల్గులో
కాళ్ళు కుంచించుకుంటున్నె
కళ్ళు ముడుచుకుంటున్నె
ఐనా... ప్రయత్నం... ప్రయత్నం...

ముల్లు తీయాలని, నలుసు తోడేయాలని
అయ్యో... అంతలోనే మరో బాధనా?
ఎవరో గుండెలో గునపం వేశారు
ఎందుకూ...!
బతకడానికీ ఉద్యోగానికీ అనర్హున్నా!
నీడలో నివసించడానికి అసాంఘికున్నా!
ఎందుకూ...!
నీకూ నాకూ అంత వ్యత్యాసం?
లేదు... లేదు...
మల్లెలాంటి మానవజాతి మనది
విశ్వజీవులం మనం
సర్వ సమానులం
నిర్మిద్దాం సమసమాజం.



మహ్మద్ ఖాజా మైనద్దీన్
1-10-85/18, పాషాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్-509 001
చరవాణి: 9396626276
ఇ-మెయిల్: khajamoinuddin.163@gmail.com

266

## పునర్నిర్మాణం

ఆకాంక్షలు ఫలించి
ఆశయం సాకారమై
నా తెలంగాణ ఆవిర్భవించి ఏడాదైంది
కొత్త స్వేచ్ఛాకాశంలో
విహరిస్తున్నది తెలంగాణ
వసంత ఉషోదయ కాంతులు వెలిగాయి
బంగారు తెలంగాణను నిర్మించుకుందాం
తెలంగాణ తహజిల్
అత్తరులా అద్దుదాం
మట్టిని పెకలించుకొని మొక్క పైకి లేచినట్లు
చీకట్లను చీల్చుకొని సూర్యుడు ఉదయించునట్లు
నవ వసంత సంబరాలు జరుపుకుందాం
కోటి ఆశలతో స్వాగతం పలుకుదాం

ఏళ్ళ చరితగల కాలగమనంలో
అణచబడ్డ వాళ్ళం
పాలకుల పెత్తనానికి పతనమైన వాళ్ళం
పైకి లేచినప్పుడే జన్మకు సార్థకం
అభివృద్ధి, పునర్నిర్మాణం అంటే
సామాన్యుడి ముఖంపై చిరునవ్వులు పూయడం
యువతను శక్తి కేంద్రాలుగా నిలబెట్టడం
పల్లెలకు జవసత్వాలను అందించడం
నా కలము అందుకు కవిత్వమై కదులుమన్నది
ఎవరో వస్తారని, ఏదో చేస్తారని అనుకోకు
హామీలు, మాఫీలు సాఫీగా జరిగినప్పుడే
మరో సంబరం, ఆకాశమంతా సంబరం
మనుషులుగా కొత్త తెలంగాణ నిర్మాణం.

మహమ్మద్ జాబర్ ఆలీ ఖాన్

# 267
# తెలంగాణ గీతం

ఆకాశమున అలజడి మొదలాయె గర్జన ఏమిటి ఎవ
రికని దేవదూతలూ కానలేరు రహస్యం ఏమిటిది ఎవ
రికని విశ్వామిత్రుడు తెలంగాణ బిడ్డ - తల్లి బిడ్డలకని
ఆకాశమున అందరునూ దీవించిరి చంద్రశేఖరుడినీ!
విద్యార్థీ.
తల్లి కళ్ళలో విషాదం చూశాను నేను
కళ్ళతో కళ్ళు చదవగలను నేను
నా తల్లికై అన్ని విధులకు రాజీనామా చేశాను
తల్లి సన్నిధిలో కాపలాగా నిలిచాను నేను
తల్లి గీతకు కట్టుబడి ఉన్నాను నేను
పెదవి విప్పకుండా విప్లవం లేపగలను
తల్లి సహనం గీత దాటిన నాడు
విప్లవం స్వయాన పుట్టింది ఆనాడు
నేటికి ఆనాటికీ వ్యవధి నీకు
ఆనాడు ఎవ్వరూ కాపాడలేరు నిన్ను
కాని 69 జ్ఞాపకం నా ముందుంది ఈనాడు
తల్లీ బిడ్డల కన్నీటి బొట్టు కారనివ్వను నేను
ఆశలు నిరాశలయి బలిదానాలు విఫలమయి
అంధకారంలో నిలిచిన బాటసారికి చంద్రుడి
వెన్నెల శేఖరుడి ప్రకాశం తోడుగా నిలిచినంతనే
తెలంగాణము సాధ్యమయ్యెను! విద్యార్థీ!
నీ తొలి రోజులు మరచి శాసించితివి నీవు
అన్ని రంగాలలో దీనస్థితికి చేరితిమి మేము
నిరాశల సుడిని ఛేదించి ఉద్భవించాడు చంద్రశేఖరుడు
అందరినీ చైతన్యపరచి తోడుగా నిలిచాడు నాడు
విడిపోయి అన్నదమ్ముల వలే ఉందామంటిమి మేము
ఆధిపత్యం వీడజాలనంటివి నీవు
న్యాయం అనే వారధిపై కదం తొక్కాము మేము
అహంతో అణచనెంచావు నీవు
నాదే సంఖ్య, నాదే అధిష్ఠాన మంటివి నీవు
నీ నోట న్యాయం పలికించెను మా నేత
నీ వంతాలు దగాతో ఓడించనెంచితిరి మళ్ళీ
వంతల నోట న్యాయం పలికించెను మా నేత
సారథి ప్రాణాలు పణంగా పెట్టాడు ఆనాడు
అధిష్ఠానమే దిగి వచ్చెను అచట ఆనాడు
మీరందరూ అధిష్ఠానాన్ని వంచించిన నాడు
సకల జనులను సమాయత్తం చేసెను మా నేత
సమస్త తెలంగాణ తల్లి బిడ్డలను
ఏకతాటిపై నడిపించెను మా నేత
జాతి సమస్తం సహకారము పలికెను
అనివార్యమయ్యెను తెలంగాణ ఈనాడు
మీ ప్రస్తావనలన్నీ జాతి త్రోసిపుచ్చెను ఈనాడు
చంద్రశేఖరుడు తెలంగాణ సాధించెను ఈనాడు
తెచ్చిన రాష్ట్రాన్ని నీవే పాలించాలన్నారు ఈనాడు
బంగారు తెలంగాణవైపు సాగుతున్నాడు ఈనాడు
చంద్రశేఖరుడు! విద్యార్థీ!



మహమూద్ పాషా

# 268

## ఆహార భద్రత కార్డు

అవును మంచిదే!
పేదవానికి 'ఆహార భద్రత కార్డు' ఉంటేనే షాన్!
లేకుంటే బడే పరేషాన్!
భయమెందుకు?
కొత్త సర్కార్ ఇంటింటి సమగ్ర సర్వే!
ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండ
తెలంగాణ పునర్నిర్మాణంలో
వ్యూహ రచన - మంచిదే!
సర్కార్ ప్రతిపాదించిన ప్రజాసంక్షేమ వరం!
జీవన సుస్వరం!!
గత సర్కార్ ప్రజా సంక్షేమ పథకాలు నీరు
కారిపోయినవి
ప్రజల ఆశలు, కలలు చెదరిపోయినవి
ఎక్కడ అవసరమో!
ఎక్కడ దుర్వినియోగమో!!
అక్రమార్కుల గుట్టు రట్టు ఆటకట్టు!
ప్రజా సంక్షేమంలో భాగమే!
దేశ ప్రగతికి సుమార్గమే!!
"ఆహార భద్రత కార్డు" బహు ప్రయోజనకారి
గరిబోళ్ళ హక్కు
దిక్కులేని వాళ్ళకు పెద్ద దిక్కు
ప్రజాస్వామ్య దేశంలో...
ప్రతి పౌరుడి "చిరునామా" గుర్తింపు
"ఆధార్ కార్డు" జీవనాధారం
అవును మంచిదే!
ఉన్నోడు లేనోని హక్కులు లాక్కుంటూ ఉంటే!
గత సర్కార్ చూస్తూ... కళ్ళుమూసుకొని
నోరు విప్పలేదు!
కొత్త సర్కార్ తెలంగాణను
కడుపులో పెట్టుకొని కనురెప్పలతో
కాపాడుకొంటుంది.
ఉద్యమ పోరాటంతో తెచ్చుకున్న తెలంగాణను
"బంగారు తెలంగాణ" గా తీర్చిదిద్దడం
కెసిఆర్
ప్రపంచ చరిత్ర పుటల్లో నిల్చిపోవడం
నిజం!
అవును మంచిదే!!

మహ్మద్ వలి హుస్సేన్
వారాసిగూడ, హైదరాబాద్.
చరవాణి: 9704157084

269

## బాటల వైపు

ఆవహించిన నిశ్శబ్దం
దృశ్యమై సంచలనమై
అదృశ్య సంకెళ్ళను తెంచుకుంటు
జనగణమన తెలంగాణం
సంఘర్షణ పదంలో - తిరగరాసిన చరిత్రగ
ఆశల మణిదీపాలను చీకట్లో వెలిగించుకుంటూ
శూన్య ప్రవాహాలకు ఎదురీది
నవశకానికి, నవలోకానికి
చైతన్య దీపికలమై
ప్రగతి మానవహారంగ
జగతి శాంతిగీతం ఆలపిస్తూ
పదం పదం కదం కదం ప్రస్థానమై
వ్యవస్థీకరించుకుంటూ
కెరటాలుగ
గమ్యాలను సంస్కరించుకుంటూ
అమరులను స్మరించుకుంటూ
తొలిపొద్దు కిరణాలుగ ప్రతిష్ఠించుకుంటూ
తరం తరం నిరంతరం
అంతరాలు లేకుండా
సాగదా మన పయనం
హరిత వనాల గుండా
జలప్రవాహాల తళతళలో
సంతోషాల పూలబాటలో
పసిడి లక్ష్యం వైపు.

మహ్మద్ హనీఫ్ అలీ

## 270

# రచయిత

క్రిములు పడిన మెదడును శస్త్ర చికిత్స చేస్తాడు
తన ఆయుధ కలంతో మొద్దుబారిన బుర్రలోంచి
వెగటు పుట్టే ఆలోచనను పొలిమేరవతలకు తరిమేస్తాడు.
అందాల బొమ్మను బలిమితో చెరచి
బజారుపాలు చేసే రాక్షస జాతిని
ఏరి పారేయాలని నినదిస్తాడు.
చీకటి కోణాల్లో దాక్కున్న కుట్రలను పేల్చేస్తాడు.

ఎన్నటికైనా రచయిత కాబోడు క్రిమినల్
దేశ పటంలో దూరిన చెదలను
పీల్చి పిప్పి చేసే నులి పురుగులపై
అక్షర బాణాలు సంధిస్తాడు
వాడే అసలు సిసలైన కవి, రచయిత
మేలిమి బంగారు మెరుపులు
ప్రసాదించే అక్షర మైనపు బొమ్మ.

మడికొండ శ్రీనివాసరావు, యమ్
హైదరాబాద్

271

## 'మా ఊరే-ఈ కవులందరి చిరునామా!'

భాగవతమ్మును తన భావసంపదతో
తెలుగుదనమ్ముట్టిపడునట్లనువదించి
వందలాది పద్యమ్ముల రచించినవాడై
మేటికవుల మన్ననల నందుకొన్న 'మా' వానమామల
వరదన్న 'అభినవ పోతన' బిరుదాంకితుండు
తన అన్న జగన్నాథ చార్యులును మంచి పేరున్న
కవియగుటచే ఒకరిమాటనొకరు జవదాటరన్నట్లు
రంగురంగుల ముగ్గులు గొబ్బెమ్మలు
డుబుడుబుకలవాడును గంగిరెద్దుయును
పంబలవాని వాద్యమును మేళవించి
పల్లెపదముల తోడ పద్యములనల్లి
సంక్రాంతి లక్ష్మికి స్వాగతము పలికిన
పల్లదుర్గయ్య మా కవులకు పెద్ద దిక్కు
కల్లకపటము తెలియని 'కవిబ్రహ్మ'తాను,
చేదోడు వాదోడుగా నున్న తన అన్న
పల్ల సత్యనారాయణను గలసి ఒకరికొకరన్నట్లు బ్రతికిరే!
నా కవితా సరస్వతికి నాలుకలేదొక గుండెదక్క, యని
ఆర్ద్రముప్పొంగిన కన్నులన్గన్పడు వెనువెంట
చిరునగవులలుకు ఒక నిముషమైనను తిరుగదే-
ఉగ్రరూపమున అటునిటుచిందులాడు
అతడే-'రసబ్రహ్మ' అనుముల కృష్ణమూర్తి
అతని అక్షరమె ఒక పదము, పదమొక పద్యముగ-
పద్యమొక కృతిగ ఒక్క కృతియే బ్రతుకు నా
సంతమన్నటు వ్రాయగల 'కవి' తానొక్కడయేనితోచ,
తోడునీడైన తన అనుంగుసతిని గూడి
ఆదిమ దంపతుల వంటి ఆ జంట
నిప్పులను తన అరచేతియందుంచుకొని
నీళ్ళపై నడిచి వెళ్ళినవాడు కాళన్న!
'ఇత్తడి బిళ్ళలపై కాలజ్ఞానం' వ్రాసి ఇట్లు కాళన్న!.... గా-
సొమ్మ రోగులమైన మా మెడళ్ళో వ్రేళాడాడు.
ఆయనే! కాళోజీ నారాయణరావు నిను కట్టడి చేయనెంచి
'ప్రభుత్వం' 'పద్మవిభూషణ' బిరుదును నీ కంటగట్టి
నిను నమ్ముకొని నీ వెనుకనున్న మమ్ము
నీ నుండి తరిమి తరించిన వారైరి!
అన్న ఉర్దూ కవి రామేశ్వర్రావును గూడి
అపూర్వ సోదరులుగ రచనలు జేసిరే!
సమకాలీనులైన ఈ నలువురును
మా ఊరికి నాలుగు దిక్కులోయన్నట్లు
ఎవరి ముందెవరు తీసిపోరు కాలమహిమలు కాబోలు!
నేడు కైతసేసెడు కవులు కరువైరి మా ఊర!
కరిమ్రింగిన వెలగపండును బోలిన మా 'మడికొండ'
గ్రామమందు 'కవులు' మీరెల్లరును మమ్మ కరుణించి
మరలనొక మారు పట్టుకొనిరారె!
వచ్చి మా ఊరు పరువు నిలబెట్టరె!

**మరికంటి**
ఆఫీసర్, ఎపిజివి బ్యాంక్, వనపర్తి.
చరవాణి: 9640407103

272

## తంగేడు పూలు...!

ప్రకృతి కాంత మెళ్ళో
అచ్చమైన బంగారం
పసుపు పచ్చని సింగారం
ఈ తంగేడు పూలు
బాటెంట నడుస్తుంటే
ఆనందంగా స్వాగతం
పలుకుతాయి అందమైన
ఈ తంగేడు పూలు
మా అక్క గట్టుకుపోయి
గంపనిండా ఎర్ర మన్నెత్తుకొని
తంగేడు పూల కొమ్మను
అందుల తీసుకొచ్చేది

అప్పుడు నాకవి పసుపు
పచ్చగా కనిపించలేదు....
ఎర్ర మన్నులో ఎర్రెర్రగా
అగుపించినవి !
నిండుగా నవ చైతన్యాన్ని
తలపించినవి...
ఆ రోజు నుండి తంగేడు పూలంటే
తెలంగాణ పూలు-తెగువ గల పూలు
బతుకమ్మ పూలు- బతుకునిచ్చే పూలు
అమ్మ ప్రేమని కమ్మగా
గుర్తుకు తెచ్చే పూలు ...!!

మండల స్వామి

## 273

# గుండెదరువు

పైరు పచ్చల మట్టి తల్లి
వాడిపోతూ నిలదీస్తుంది
ప్రాణ నాడుల చెమ్మను.... పీల్చిందెవరని
బతుకుతూ బతకనిచ్చిన
గుండెదరువు ఎండిపోయిందని
మండే గుండెలనిండా... అశ్రుధారలు
బతుకు దీపాల చమురు
అడుగంటిందని
బావురుమన్న హృదయాలు... బరువెక్కినయి
చిట్టి కాలువలు
దూపో దూపంటూ అంగలారుస్తున్నవి
పిడచ కట్టిన నాలుకలకు... ఆశ్రయమెక్కడని
ప్రాణికోటి జీవాధారం
ప్రకోపంతో ప్రశ్నిస్తుంది
పట్టణీకరణ కొండచిలువ నోట్లోకి... నెట్టిందెవరని
ఏ అడవి తల్లి ఒడిలోకి
పచ్చని పైర్లు జారుకున్నవో!
ఏ ఒయాసిస్సుల జాడకై
కిలకిలా రావాలు ఎగిరిపోయినవో!
ఆకాశగంగలో ఆడుకుంటున్న
బుడుబుంగలను పిలుచుకు రావాలిప్పుడు
సముద్రుడినైనా నిలదీద్దాం
మేఘమథనం చేస్తాడో!
మేధోమథనం చేయిస్తాడో!



మందుల పరమాత్మ
వరంగల్.
చరవాణి: 8374382524

# 274

## ఆత్మల సాక్షిగా

తెలంగాణ గడ్డమీద
ఎందరో విద్యావేత్తలు, మేధావులు
విద్యార్థులు ఉక్కుపిడికిళ్లై
లాఠీలకు తూటాలకు జంకక
ఉద్యమాన్ని ఊపిరిగా మలుచుకొని
ముమ్ముందుకు తీసుకువెళ్ళారు...
ఉస్మానియా యునివర్శిటీ
పోరాటాలకు పుట్టినిల్లు
ఓ శ్రీకాంత్ చారి ఓ యాదగిరి
ఇలా ఎందరెందరో అసువులు బాసిన
అమరుల గడ్డ తెలంగాణ
కవులు కలాలు పట్టి మెదళ్ళకు
పదును పెట్టిండ్రూ...

కళాకారులు కాళ్ళకు గజ్జెలు కట్టిండ్రు
ఆటాపాటలతో హంగామా జేసిండ్రూ
తరతరాలుగా ఈ సీమాంధ్రుల దోపిడి
సాగదు ఇక సాగదంటూ
సాగిన పోరాట ఫలితమే
అమరుల ఆత్మల సాక్షిగా
తెలంగాణ రాష్ట్ర సాధన
పది జిల్లాల ప్రజలంతా
పండుగలు జేసుకోవాలే
పల్లె పల్లెల్లో గులాబీ జెండాలు
రెపరెపలాడాలే
ప్రజలంతా ఆనందంగా జీవించాలే

మణి కె.

275

## నా కల బంగారు తెలంగాణ

కావాలి మనకు బంగారు తెలంగాణ.
మన రాష్ట్రం మనకొచ్చిన ఇంక ఎందుకు సవతి తల్లి
కొడుకుల పోరు.
ఇంకా ఎందుకు మనపై ఈ వివక్ష వారికి మనపై కక్ష.
మనకు రానున్న మెట్రో ట్రైన్ మన తంగెడి పూలలా
మన బతుకమ్మలా వెలగాలి, నిలవాలి.
వేంకటాద్రిని మించిన యాదాద్రి కావాలి.
శ్రీశైల మల్లన్నను మించిన వేములవాడ రాజన్న కావాలి.
నేడు భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన నా
రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామి కావాలి.
మనమంత బంగారు తెలంగాణలో తలెత్తుకొని
నిలవాలి.
నేడు మొదలైన 400 మంది కవి సమ్మేళనం రానున్న
కాలంలో నిలవాలి 40000 కవులతో ఈ ప్రాంగణం
నిండిపోవాలి.

మాడిశెట్టి గోపాల్
8-3-91/బి, కట్టరాంపూర్, భగత్‌నగర్,
కరీంనగర్-01 చరవాణి: 9440238852

276

## శ్రీకారం చుడదాం

ఊరందరి బ్రతుకుతెరువు చెరువు
జలకళతో కళకళలాడితే
తీరేను ప్రజల కరువు
బాతు, కొంగ, చేప, రొయ్య
జీవులెన్నింటికో నెలవు ఈ చెరువు
చిన్న, పెద్ద, బీదా, బిక్కి
అందరి జీవనాధారం చెరువు
దూకే మత్తడిని చూస్తే
ప్రాణం లేచివస్తుంది
చెంగుచెంగున దూకుతూ
మళ్ళీ ఆడాలనిపిస్తుంది
కన్నతల్లిమీద ఊరి చెరువు
కల్పవల్లి మన ఊరి చెరువు
ఆకాశం నుండి జారే అమృత బిందువులను
ఒడిసిపట్టి నేర్పుతో నిల్వచేస్తుంది
కరువు కాటకాలను దూరంచేసి
జలదానమిచ్చి ఉదారత చాటుతుంది
రాష్ట్రంలో నడుస్తుంది అభివృద్ధి ఋతువు
మిషన్ కాకతీయ క్రతువు జరుగుతుంది
చేతులెత్తి చెరువు తల్లి పిలుస్తుంది రండి
బద్ధకాన్ని వీడి దాన్ని ఉద్ధరిద్దాం పదండి
పూని మనమంతా పూడికతీద్దాం
పెరిగిన పిచ్చిమొక్కలను శుద్ధి చేద్దాం
చెరువులోని మట్టి ఎరువుకన్నా మేలు
భూసారాన్ని పెంచి చేలకు చేవనందిద్దాం.
అందరమొక్కటిగ నిలబడదాం
మన ఊరి గౌరవం నిలబెడదాం
చేయీ చేయీ కలిపి కదులుదాం
బృహత్ యజ్ఞంలో పాలుపంచుకుందాం
ప్రజల భుజం తట్టి జాగృతంచేద్దాం
భావితరాలకు బ్రతుకుపై భరోసా కల్పిద్దాం
అన్నదాత ముఖంలో చిరునవ్వులు చిందిద్దాం
బీటలువారిన చెరువుకు మరమ్మతులు చేద్దాం
బంగారు తెలంగాణకు శ్రీకారం చుడదాం.

మామిడి కొండల్‌రెడ్డి

277

## నా తెలంగాణ

తొలి వసంత అవతరణ వేడుకల కోలాహలం
అమరవీరుల త్యాగఫలం
ఆత్మాభిమానాల అద్భుతదీపం
అరవై ఏండ్ల కలల సాకార విజయపథం
సంస్కృతి, సాహిత్య సాగర సంగమం
పది జిల్లాల విభిన్న జాతి ప్రజల సమ్మేళనం
కాకతీయుల రెడ్డి రాజుల కళల కట్టడాల మణిహారం
గిరులున్న సిరులున్న తంగేడు వనాల పూలవనం
సింగరేణి నల్లబంగారం ప్రత్తి తోటల తెల్ల బంగారం
రైతన్నల నేతన్నల గీతన్నల శ్రమ జీవనం
పల్లె సీమల ప్రగతి రథం గొలుసుకట్టు
చెరువుల జలహారం
పల్లె చెరువుల ఆపరేషన్ మిషన్ కాకతీయ పనిహారం
పల్లె, నగర జీవుల దాహార్తిని తీర్చే వాటర్ గ్రిడ్
నిరంతరం విద్యుత్ కాంతుల వెలుగుల తార
పవర్‌గ్రిడ్
హరిజనుల, గిరిజనుల ఆడపిల్లల కలల
లక్ష్మీ కల్యాణ లక్ష్మీ
వృద్ధుల వికలాంగుల ఆసరా జ్యోతి అది ఆనంద
ఆసరాభృతి
బీడీకార్మికుల కలల నేస్తం వారి జీవనభృతి
మైనార్టీల కళ్యాణ తోరణం షాదిముబారక్
వేముగల్లు వే వెలుగుల విరజిల్లిన కొఅవి గోపరాజు
అశ్మకంలో ఉదయించిన కన్నడ తెలుగుల పంపకవి
దాశరథి, కాళోజీల ధిక్కార స్వరగొంతుకల మేళనం
సినారెల సాహితీ సంపదల జ్ఞానపీఠం
ఇందూర్‌లో ఉదయించిన
నటేశ్వరం వి.పి. చందన్‌రావ్ కందాడైల ప్రభంజనం
నేను కలలు గన్న తెలంగాణ
నా తెలంగాణ
జై తెలంగాణ.



**మామిడి హరికృష్ణ**
జి2, చల్లా ఎస్ఎపి టవర్స్, అపొజిట్ లేన్ దిలీప్ సూపర్ మార్కెట్,
పుప్పాలగూడ, రాజేంద్రనగర్ (మం.), హైదరాబాద్. చరవాణి: 9908844222
ఇ-మెయిల్: harikrishnamango1@gmail.com

278

# Fusion షాయరీ on తెలంగాణా జమీన్!

1. భూగోళం మీన బారాణా వంతు నీళ్ళే. చారాణా వంతే భూమి. గనీ గీ చారాణా జాగలనె total civilisation నడిచొచ్చింది. మొత్తం human evolution ప్రవహించింది. యుగాల సంది నేల మాత్రమే మనకు నెలవయి, మన ఆశల కొలువయి, మన గమనానికి మలుపు అయి, మన గమ్యానికి ఇలవేలుపు అయింది. మన journey కి మేలుకొలుపు అయింది.

   Of course, మట్టి గొప్పది... మట్టి సూపిన బాట గొప్పది!

2. మనిషి body ల 95 percent skeleton and flesh మాత్రమే గుండెకాయ. గనీ గీ గుండెలనే పూరా life ఉన్నది, రేపటి ఆశల knife ఉన్నది. మన existence కి ఓ proof ఉన్నది.

   కనిపించని అణువు లోన infinite power ఉన్నది. 'లబ్ డబ్' అని కొట్టుకొనే గుండెల్లో, పుట్టిన గడ్డపై అంతులేని అభిమానం, వంతులేసుకోలేని అనురాగం ఉన్నది. గా గుండె సప్పుళ్ళే గిప్డు universe ని ముట్టినై. Adverse ఆటంకాలన్నిటినీ overcome చేసి, Free Verse నీ, ఇస్ జగాహ్ పె నయా నగమ్ నీ, bidri work అంత aesthetic గా, నకాశీపటమంత colourful గా, పాండవుల గుట్ట మీద శిల్పాలంత wonderful గా ఈ మట్టి బెడ్డలని పాటలు పాటలుగా చెక్కినై.

   My deal folks, ఈ మట్టి గొప్పది.... మట్టి మొలకెత్తించిన పాటల పంట గొప్పది...!

3. ఎన్ని techniques తో చెప్పినా, మరెన్నిటినో technical గా విప్పినా, గుండె గొప్పది... గుండెల్లోని ధైర్యం గొప్పది. ధైర్యాన్ని లోకం నిండా పరిచిన తూరుపు దిక్కు గొప్పది. తూర్పు దిక్కుకు వెలుగునిచ్చిన వర్ణం గొప్పది... వర్ణానికి వన్నెలద్దిన మట్టి గొప్పది! హర్ ఏక్ బార్ చెప్పినా, హజార్ బాత్ చెప్పినా నేల గొప్పది... మనల్ని, మన ఏడేడు తరాలని, మన కలలని, మన బలాలని, బలగాలని కన్న నేల గొప్పది. మనం వేసిన seeds of dreams నీ, మనం నేసిన clothes of streams నీ, మనం కాసిన fields of crops నీ హత్తుకున్నదీ. తలపైకెత్తుకున్నదీ, తలపుల్లో సైతం మనం గొంతెత్తి మొత్తుకునేలా చేసింది ఈ నేలే కదా...
   దోస్తులారా, మట్టి గొప్పది... ఈ మట్టి పుట్టించిన కల గొప్పది....!

4. నేల గొప్పది... సాలు సాలునా నెత్తుటితో, కన్నీటితో తడిసిపోయింది కదా... గడ్డ గడ్డనా త్యాగాలనీ, ప్రేమనీ passionate గా compassionate నింపేసింది కదా... వాడ వాడనా తూటా బొబ్బలనీ, లాఠీ దెబ్బలనీ శిఖాయత్ చెయ్యకుండా దాచుకుంది కదా...

That's why, మట్టి గొప్పది... తెలంగాణా మట్టి బౌ గొప్పది!

5. జల్-జంగల్! జమీన్ కోసం ప్రాణాల్ని బాణాలుగా ఎక్కుపెట్టిన వీరులను కన్న భూమి ఇది. భూమి వెట్టి చాకిరి విముక్తి కోసం నాగలి పట్టిన చేతులతోనే gun లనీ, pen లనీ పేల్చిన అడవి బిడ్డలనీ, ఆడ బిడ్డలనీ పెంచిన భూమి ఇది. “బాంచెన్ కాల్మొక్తా” నుండి “బాకునై పాణాల్ తీత్తా” అని గుడ్లెర్ర జేసి గర్జించిన freedom fighters కి ఉగ్గు పాలు అందించిన పోరాటాల అడ్డా ఇది. ఎప్పటికప్పుడు మోసగించ బడుతూ, అప్పటికప్పుడు తిరగబడుతూ revolution నీ, rebellion నీ భూమి తన చుట్టూ తాను తిరిగినంత సహజంగా, తన existence కోసం fighting instinct ని కొత్త identity card గా మార్చుకున్నంత అనివార్యంగా నాలుగున్నర కోట్ల voices తో పోటెత్తిన భూమి బిడ్డల గడ్డ ఇది...

Indeed, ఈ మట్టి గొప్పది.... ఈ మట్టి మండించిన ఉద్యమాల బట్టీ గొప్పది!

6. చెరసాలలలో మగ్గిపోయి, ఉరికొయ్యలపై ఎండిపోయి, encounters లో ఆరిపోయి, పై ఇంకిపోనీ సిరాగా మారిపోయి. suicide notes కీ state anarchy కీ నిలువెత్తు గాయాలు వేళ్ళాడి, suppression పై, state anarchy పై జంగ్‌లెన్నో చేసి, దిల్లుని విల్లులా వంచి, ఎదురొడ్డి, ఎద ఒడ్డి, రొంబొచ్చెలు ఇర్సుకొని నిలబడ్డ పోరు బిడ్డలకు పుటకనిచ్చిన భూమి ఇది. స్వేచ్ఛ కోసం, ప్రాంతేతరుడి ఇనుప కౌగిలి నుండి ముక్తి కోసం అర్వై ఏళ్లుగా అరిచేతులపై నడుస్తూ, అరిపాదాలకి మొలలు గుచ్చుకుంటూ అరిగోస పడి, మానుకోట కంకర రాళ్ళుగా మారి, ఆఖరికి ‘అర్రెర్రె-నీయవ్వ’ అని నాలుక మడ్తబెట్టి, గుత్ప పట్టుకొని ఉర్కిచ్చిన సకల జనులకు ఆనుపానులు నేర్పిచ్చిన నేల ఇది....

షాయద్, ఈ మట్టి గొప్పది... ఈ మట్టి నుండి పుట్టిన ప్రజానీకం గొప్పది!

7. నిజమే, వాళ్లన్నట్టు మనది బక్కపానమే... ముక్కులల్ల పానాలు పెట్టుకున్న బొక్క పానమే... గనీ years together ఆగకుంట, ఆపకుంట మా ఖ్వాబ్ నీ, ఖాయిష్ నీ, ఖయాల్ తప్పకుండ చెప్తనే ఉన్నం. మా గుజారిష్‌ని ఇన్పిత్తనే ఉన్నం. సర్పరోష్‌లు ఎన్నో చేత్తనే ఉన్నం... గిన్నాళ్ళకి, ఇపుడు వాళ్ళందరికి సుక్కలు సూపిచ్చినం. సుక్కలకెక్కిన మా martyrs, young warriors కన్న కలలని ఇపుడు reality చేసినం and final గా జెండా పాతినం... తెలంగానం పాడినం.

Absolutely, ఈ మట్టి గొప్పది.... ఈ మట్టి నేర్పించిన పోరాట స్ఫూర్తి గొప్పది!

8. “Ayes have it, Ayes have it, Ayes have it... Bill passed” విజయం వరించింది. యుద్ధం ముగిసింది. కానీ పోరాటం ఇంకా ఉంది. గిప్డు, తెలంగాణా గుండె ఆరాటాలను తీర్చే అగ్గి బరాటాలుగా మనం మారాల్సి ఉంది. లంబీ రాత్ అంతం అయింది. నయా సుబాహ్, నయె రంగ్, నయా ఉమంగ్ రెక్కలు తొడుక్కొని ఎగరడానికి ready గా ఉన్నాయి. Take-off చెయ్యాలి. Take of the nation కావాలి. జరూర్, ఈ వేకువకి వికాసం రంగులు అద్దాలి.... We have to turn this Summer into Spring...

After all, ఈమట్టి గొప్పది... తెలంగాణా మట్టి మా గొప్పది!!

(ప్రస్తుత ప్రపంచంలో మనకంటూ ప్రత్యేకంగా దేశాలు, ప్రాంతాలు, సంస్కృతులు, భాషలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ గ్లోబలైజ్డ్ వ్యవస్థలో మన తరం మాత్రం మల్టీ కల్చరల్ విశ్వంలోనే బ్రతుకుతోంది. దీని ప్రభావం ఇప్పుడు మన ఆలోచనలు, భావాలు, వ్యక్తీకరణలలో కూడా కనిపిస్తూనే ఉంది. అంతేగాక మానవ భావోద్వేగాలను వ్యక్తీకరించే సాధనమే భాష అయితే, కొన్ని భావోద్వేగాలను కొన్ని భాషలలోని పదాలు, ఇతర భాషా పదాల కన్నా బలంగా, గాఢంగా అభివ్యక్తి చేస్తాయనేది కూడా నిజం. దీని వల్ల, సంక్లిష్టమూ, సమ్మిశ్రితమూ అయిన సమకాలీన జీవన వీక్షణని కూడా మల్టీ కల్చరల్, మల్టీ లింగ్వల్ దృక్కోణం లోంచే పరిశీలించాల్సిన ఆగత్యం ఏర్పడుతోంది. ఈ అనివార్యతే ఇప్పుడు ఫ్యూజన్ పోయెట్రీ పుట్టుకకు కారణం. అలాంటి ఫ్యూజన్ పోయెం శైలిలో తెలంగాణా ప్రజా ఉద్యమ విజయంపై రాసిన ప్రయోగాత్మక కవిత ఇది.)

**మిట్టపల్లి పరశురాములు**
సిద్దిపేట, మెదక్ జిల్లా.
చరవాణి: 9949144820

279

# విజయలక్ష్మి

జయము జయము తల్లి !
విజయాల కల్పవల్లి!!
విజయ పథంలోన మమ్ము!
నడిపిన తెలంగాణ తల్లి !! ॥జయ॥
మన సంపద కొల్లగొట్టి !
మన పదవుల చేపట్టిన !!
వలసవాదులందరిని !
వదలకుండ తరిమికొట్టి!! ॥జయ॥
తెలంగాణ ప్రతి బిడ్డను !
ఎదను తట్టి పదును పెట్టి !!
ఆంధ్రవలస వాదులను !
పంతముతో పంపిస్తివి !! ॥జయ॥
త్యాగధనుల విజయఫలం !
ఎల్లకాలమందరిలో !!
పదిలంగా నిల్వాలని !
ప్రతిన ముందు పెట్టినావు !! ॥జయ॥
తెలంగాణ విజయలక్ష్మి !
స్వర్ణపథంలోన నేడు!!
శాంతిగా నడవాలని !
నీకివె మా వందనాలు !!
డెందము హరి చందనాలు!!! ॥జయ॥

మియాపురం శ్రీనివాస్ పూడూర్
జెడ్‌పిహెచ్‌ఎస్ గోవిందరం,
మేడిపల్లి, కరీంనగర్-620

280

# రేపటి తెలంగాణ

రేపటి తెలంగాణ
మేడిపండై మెరువకూడదు
రేపటి తెలంగాణ రాష్ట్రం (కాయ)కు
రసాయనిక కార్బైడ్ తాకకూడదు....
కోటి రతనాల వీణ నాదనలు
తియ్యని తేనె రాగాలు పాడాలి
చెరువులు జలకరించాలి
హరితం ఇంద్రవర్ణం కావాలి....
గ్రామజ్యోతి (అభివృద్ధి) వెలగాలి
గోదావరి కృష్ణలు మన కడుపులను
(గుమ్ములు) నిండు పుట్లుతో నింపాలి...
ఆకలి, చావులు, ఆత్మ హత్యలు
నిరుద్యోగం పోవాలి....

ప్రతొక్కరికి వృత్తి ఉపాధి వుండాలి
శాస్త్ర సాంకేతిక విద్య ఆర్థిక వ్యవసాయ
రంగాలలో అభివృద్ధి సాధించాలి...
అంతరాలు లేని అందరి తెలంగాణ
శాంతి తెలంగాణా రావాలి....
రేపటి తెలంగాణ పండై పండాలి''
దాని ఫలాలు అందరికి అందాలి....
ప్రకృతి తల్లిని రక్షించుకోవాలి
గుట్టలు గుళ్ళు అడవులు రాయిరప్పలు
యిసుక, చెరువులు, వాగులు, నదులు కాపాడుకోవాలి
స్వచ్ఛందంగా పాటుపడాలి
స్వచ్ఛ తెలంగాణ చేయాలి
స్వర్ణ తెలంగాణకై నడుం బిగించాలి....

మిర్యాల లలిత
నల్లగొండ. చరవాణి: 9949337036

# 281
# అమృత కలశాన్ని అందిద్దాం

వెయ్యరదెబ్బ దరువెయ్యర దెబ్బ
దెబ్బకుదెబ్బ, దెబ్బకుదెబ్బ వెయ్యరా... వెయ్
అంటూ తన కలాన్ని
ఖడ్గంగా, గళాన్ని తూటాగా
వదిలిన సాంస్కృతిక సేనాని
సుద్దాల హనుమంతు
బండెనక బండిగట్టి
పదహారు బండ్లుగట్టి
ఏ బండ్లె పోతవ్ కొడుకో
నైజాము సర్కరోడా
అంటూ నిజాం నిరంకుశత్వాన్ని
దౌర్జన్యాన్ని ఎండగట్టిన
తెలంగాణా పోరుబిడ్డ
బండి యాదగిరి
అబలకాదు ఆమె నయవంచకుల పాలిటి
ఆదిశక్తిలా విజృంభించిన చాకలి అయిలమ్మ
ప్రాణాలను ఫణంగా పెట్టి
పోరాడిన దొడ్డి కొమురయ్య
తెలంగాణా మలి ఉద్యమంలో
అసువులు బాసిన తెలంగాణా ముద్దుబిడ్డ
శ్రీకాంతాచారి
ఒక్కరా... ఇద్దరా...
వందలు... వేలు... ఎందరో మరెందరో
పోరాట యోధుల ప్రాణత్యాగం
అమరవీరుల త్యాగఫలం
మన తెలంగాణ కల సాకారం
పోరాడి గెల్చుకున్న మన నవ తెలంగాణను
బంగారు తెలంగాణగా
పునర్నిర్మించుకుందాం.
అందుకు మనం చేయి
చేయి కలుపుదాం!
మన ఆలోచనలను రంగరిద్దాం.
మేధోమథనం నుండి వచ్చిన
అమృతకలశాన్ని
నవ తెలంగాణకు అందిద్దాం.
కవులూ, రచయితలూ
జాతి నిర్మాతలమై
ప్రపంచ చరిత్రలో తెలంగాణా ఖ్యాతి
ఆచంద్ర తారార్కమూ
నిలిచి మెరిసేలా
బంగారు తెలంగాణా నిర్మించుకుందాం!
భావి తరాలకు అమృతకలశాన్ని అందిద్దాం.
జై తెలంగాణా!
జైజై తెలంగాణా!!

ముక్కెర సంపత్ కుమార్
చౌటపల్లి (గ్రా, పోస్ట్) వయా అంతర్గపేట్-505 466
కరీంనగర్ జిల్లా, చరవాణి: 9959618206

# 282

## జాతి గీతం

బాల్యమంటే అందరికీ
బంగారు పళ్లెం కాదుగదా !
చెరసాలవంటి ఛత్రంలో
బలిమీటికి ఈదుతున్న బలిమీటి బతుకులు
జీవన పోరాటంలో నిత్యం
ఆరని కొలిమిలో సెగబారుతున్న బానిసత్వం
అతుకుల బతుకుల్లో
అప్పుడప్పుడు తొంగి చూసే బతుకమ్మ సంబురం
దూరంగా నిలబడి
భాష్ప జల ధారల మసక కళ్లతో
చూసి మురిసిన దురదృష్ట బాల్యం !
పుట్టమన్నుతో - సొంత బిడ్డలా పూదిచ్చిన బొడ్డెమ్మ
కొందరికే పరిమితమై పొరాడుతుంటే
డొక్కల్లో పేగులు కదిలిన గర్భశోకం
ఎంగిలి పూలు మొదలు ... సద్దుల బతుకమ్మ దాకా
సందడే సందడి
డప్పుల డొప్పలల్లో - అయ్య
బిచ్చమడిగి తెచ్చిన సత్తుపిండి ముద్దలు
క్షుధానలాన్ని చల్లార్చే అకాల చిరుజల్లులు
ఆ పద్దెనిమిది రోజులూ
తెలంగాణ లోగిళ్లు - ఆనందాల పొదరిళ్లు
గునుగు పూల కట్టలతో కట్లపూల అందాలతో
తాంబాలం అడుగున గుమ్మడాకు తివాచీ మీద
అందంగా ముస్తాబైన బతుకమ్మ
తంగేడు పూలతో సింగారించుకుని
నింగినిండా విస్తరించిన సింగిడిలా
ఎవరెస్టు కన్నా ఎత్తైన హుందాతనంతో !
బతుకమ్మలోని తంగేడుపూల బంగారు వన్నెలు
బడుగుల బతుకుల్లో వెన్నెలలా వెలుగులు పంచాలె
సంగీతపు సంగతులే తెలియని మా అవ్వ
శృతిలయల మేళవింపుతో ఇంపుగా పాడే ఉయ్యాల
పాట
జాతి గీతమై జాగృతం చెయ్యాలె
కులాల కుతంత్రాలు ఛేదించాలె
గవుండ్లోళ్ల రేణక్క - పటేండ్ల పద్మక్క
మాదిగ మల్లవ్వ - మంగళి గంగవ్వ
సబ్బండ జాతులకు ఒక్కటే పాట - బాటగా మారాలె
తరతమ భేదం లేని
ఐక్యతా శంఖారావం పూరించాలె
తెలంగాణ జాతి ఖ్యాతిని దిగంతాలకు
వ్యాపించజెయ్యాలె

మునాస వెంకట్
చరవాణి: 9948158163

## 283
# పూడిక తీస్తే పుత్తడే

కాళ్లకింద మట్టి వణుకుతుందో
పెయ్యి వణుకుతుందో
పైకి ఎంత జూసినా సినుకు వణకలే
చేతికందని మబ్బులు
చెదిరి పోతుంటే
చేతులెత్తి దండం పెట్టిన
కాని కంట్ల నల్లపాపే
మబ్బయి కురిసింది
పిట్ట వాలని చేనుతో
పచ్చులమయితిమి
కాలం కన్నా కన్నీళ్లే పెచ్చు
కట్టమీద మైసమ్మ కట్టకింది గంగమ్మ
కాళ్ళు మొక్కుతా కరువు రాకముందే
పరువు పోకముందే సెరువు నిండితే
పాణం ఇగురేస్తదే పావురం దక్కుతదే తల్లి మీకు
కుంట అంటే కుండ సెరువు అంటే గుమ్మి
మా కొలతలే  మామ్మ
మోతె కుంట సాకరి కుంట బోసికుంట
మావూరి పంట
సెర్లంటే నేల నేత్రాలు
మట్టి సూపు
మెతుకు బంగారు భాండారం
ఆనంద బాష్పాల పుట్ట
నాగరికత నడక కింద
నీటి సుక్కే నిధి
సెరువంటే కొడిపె జెల్ల
పూమేను కొర్రమేను
చందమామ బుగ్గదొమ్మ
కొమ్మలు లేని పూల వనం
జీవన ధ్యానంలో
బొరబొరకొబోయబుద్దులు
తూములు దీస్తే
మట్టి పాదాల మీది నుంచి
పంట పరవశించి పోతుంది
పూడిక దీస్తే సెరువుకు
పుత్తడితో పుదిచ్చుకుంటుంది నేల

మెర్సీ మార్గరెట్ బోడ
ఇంటి నెం. 1-4-61/12, రంగానగర్, భోలక్‌పూర్,
ముషీరాబాద్, హైదరాబాద్-500 080. చరవాణి: 9052809952

284

# నాన్న నవ్విన నవ్వు

లోలోపలి పొరలు చీల్చుకొని
కొత్తనీరు పైకెగసినట్టు
పురావైభవాల పూలగనులు త్రవ్వి
సుగంధాలన్నిటినీ ఇప్పుడే వెతికి తీసినట్టు
అల్లిబిల్లి అల్లికల ఆటపాటల గట్టు
పెరుగుబువ్వ పాట నాన్న నవ్వు
మా నాన్న కలగన్న తెలంగాణ నవ్వు
గొంతు పెగలని రాగం
సాధన చేసి చేసి అలసి గెలిచి
తరలిపోయిన మేఘాలు మరలివచ్చినట్టు
అక్షరమొకటి నిటారుగ తలెత్తుకొని నిల్చొని
తంగేడు పూల రంగులు రాల్చుతున్నట్టు
పూల గుత్తుల పుప్పొడి నాన్న నవ్వు

పుడమికే అందం తెలంగాణ నవ్వు
నింగి కిందకు వంగి
నేల నుదురు నిమిరి
అందమైన అడవుల నదులై ప్రవహించినట్టు
కురిసి కురిసి వాన వెలిసిపోయాక
నేలంతా చలికి వణికి చెట్ల వేరుల్లో దాక్కుని
చీమల ముచ్చట్లతో రోజు గడిపినట్టు
మబ్బు మబ్బుకు మధ్య ఇంద్రధనుస్సు నాన్న నవ్వు
అమరులకని ఉద్యమ
ఊపిరులు పోసుకుని
ఘన
చరిత్ర



మొగిలి వెంకట నర్సింహ్మారెడ్డి

# 285

## బానిస బతుకులు వద్దు

కులమొక కుట్ర
మతమొక మాయ
కులపుటేనుగు కుమ్ములాటలో
నలిగిపోతున్న నిర్భాగ్య జీవులు...
అణగారిన బతుకులు ఆక్రోశంతో
అడుగుముందుకేస్తే...
నిరాదరణకు గురయ్యామని
నిలువెత్తు ఎగసిపడితే
ఉద్యమమై ఉప్పెనలా ముంచుకొస్తే...
సముద్రంలా ఘోషిస్తూ
సునామీలా ముంచేస్తే
సుడిగుండంలో కొట్టుకుపోతున్న
అభాగ్యులు
నోరున్నా మాటలేక
కాళ్ళున్నా కదలలేక
మెదడున్నా ఎదగలేక
జీవన ప్రవాహంలో కొట్టుకుపోతూ
మతం చిచ్చులో మసౌతున్న సమిధలు
మసక బారుతున్న బతుకులు
రిజర్వేషన్లు... రిజర్వేషన్లు...
రిజర్వేషన్లు...
అణగారినవారికి ఆసరా నియ్యాలె
పేదవారికి పెన్నిధి గావాలె
వెనకబడిన వాని వెన్నెముక గావాలె
బతకలేని వాని బతుకుబాట గావాలె
తెలివికి బలం ప్రతిభకు పట్టం
కులం మాటున కుబేరుల
మతం మాటున మిలియనీర్ల
సొమ్ముకు సోపానం కారాదు.

మొగిలి శ్రీనివాసు
చరవాణి: 9491746700

# 286

## ఐదు

నేల నా పొలం నింగి నా తలరుమాలు
గాలి నా చెమటల ఆవిరి ఎండ నా వెచ్చని వూపిరి
నా కన్నీళ్ళు ఇంకని సముద్రం
వాడిపోని వసంతాలన్నీ నా పొలంలోనే
మరిగిపోని రాత్రింబవళ్ళు నా కంటిలోనే
ఊపిరులూదే ఆశల సేద్యగాణ్ణి
రేపటి నక్షత్రాల సోపతిగాణ్ణి
పచ్చటి నేల, పచ్చటి నీరు, పచ్చటి ఎండ
పచ్చటి చందమామ, పచ్చటి ఆకాశం
నేనొక పచ్చటి వెలుగురాగాల ఏక్ తారను
మిన్ను మన్నునేకం చేసిన పాటను
కైగట్టని దుక్కంలేదు, కైగట్టని నవ్వులేదు
కైగట్టరాని దేముంది ఈ లోకంలో
ఊకుంచడానికయినా, చెప్పరాని బాధలయినా
పట్టరాని సంతోషమయినా, పట్టి దాచుకున్న పచ్చరెక్క
ముచ్చట్లయినా కైగట్టరానిదేముంది
పులకరించిపోయే కలలకు ఈ దేహం
పలవరించిపోయే వూహలకు ఈ మోహం
నేను నాకే చాలని విశ్వాన్ని నేను నాకే చిక్కని రహదారిని
నా లెక్కన నా కవిత్వం కూడా
నా పక్కనే నా కవిత్వం నీడ తెలంగాణ సమాజాన్ని
బాగుచేయ కదలండోయ్
సలసల రక్తం మరిగేయువత సుస్ఫూర్తితో కదలండోయ్
సత్తువలేని చెత్తకొడుకులు చావండోయ్...!
అన్యాయస్తుల లంచగొండుల భరతం పట్టండోయ్
భావితరాలకు బంగారు బాటను చూపండోయ్...!
ఆంధ్రపాలనలో అణగారిన జాతుల ఉద్ధరణ జరుగాలి
ఉద్యోగాల కోసం ఆశతో వున్న
నిరుద్యోగుల కల పండాలి...! బంగారు తెలంగాణలో
చెంగుచెంగుమని గంతులువేసే బాలలను తీర్చిదిద్దాలి
భావితరాలకు బలీయశక్తిగా మలచాలి...!
అన్నదాతల, అభాగ్యుల ఆకలిచావులు ఎన్నాళ్ళు
అమరవీరుల ఆశలస్వర్గం ఇదియేనా...?
ప్రభుత్వమంటే పెద్దలపక్షమా
ప్రభుత్వమంటే పేదలపక్షమా...?
అసమానతలు తొలగాలి అన్యాయం నశించాలి
కార్మిక కర్షక కళ్యాణం కొరకు...
ప్రభుత్వ పాలన సాగాలి...! నాయకులంత మారాలి
ఈర్ష్యలు, స్వార్థం, క్రోధంలేని శాంతిసమాజం కావాలి
ప్రపంచంలో అగ్రగామిగా తెలంగాణ నిలవాలి...!
కవులు కలాలు తీయండోయ్ ఉద్యమస్ఫూర్తితో
ఉక్కురాతలు రాయండోయ్ భావితరాలకు
బంగారు బాటను చూపండోయ్....!



మొగిలి స్వామిరాజ్
చరవాణి: 9963642205

# 287
# అగ్ర స్థానం

పుడమి తల్లికి పసుపు కుంకాల అభిషేకం చేసినట్లు
తంగెళ్ళు, మోదుగులు కిలకిలా నవ్వినాయి
జీవధాత్రికి తలార పన్నీటి స్నానాలకై
వర్షకాభ్రములన్నీ చిరుజల్లులు చిలకరించినాయి
పోరుగడ్డకు నీరాజనమివ్వడానికే
కోటి దివ్వెలు వెలుగు నింపినాయి
ఎనిమిది కోట్ల నమూనాల ఆనందాశ్రువులు
అక్షింతలై నా తల్లి తలపై రాలినాయి
పూలగుత్తులతో బతుకమ్మను చేగొన్న
చెంగావి చీరతో వరి, జొన్న కంకులతో దాల్చిన
కెందామరల వంటి చేతులతో
మందస్మితమై నా తల్లి నిలుచుంటే
33 కోట్ల దేవతలు కుసుమాభిషేకం చేసినట్లు
పచ్చని తారలు నేలపై రాలినాయి
ఈ ఆనందహేల హెచ్చించు వేళ
నూతన రాష్ట్ర ఆవిర్భావం ఓ కళ
అడవిలో ఎక్కడో మారుమూల పూచి
సామాన్యుల చేత పొగడబడే తంగెడు పూలు
నేడు రాజ పుష్పములైనాయి
తెలంగాణ భూమి పాటలీ కుసుమ వర్ణ శోభితమై
అలరారుతోంది

ఈ రోజుకోసం ఎంత ఆర్తి
ఎంత ఆవేదన, ఎన్ని అడ్డంకులు
ఎన్ని అవరోధాలు, ఎన్ని ఇబ్బందులు
ఎన్ని నిర్బంధాల బంధనాలు
ఎన్ని ప్రాణజ్యోతుల కొడిగట్టినామో
ఆ సమవర్తికే ఎరుక
సముద్రము చెలియలి కట్టలు తెంచుకొని
దారులు తీరి సాగినట్లు జన ఉద్వేగ హృదయఘోష
జయనాదమై మోగుతుంటే నా స్వప్నం ఫలించింది
నవకాంతి కుంకుమ ప్రభలు మొలిపిస్తుంటే
ఆకలి కేకలు, చీకటి రోజులు పారిపోయాయి
ఇక సంబరాలే సంబరాలు
కవి కలం గళం కదం తొక్కితే మాటల తూటాలే
పాటల ఫిరంగులే వన సీమనపూచే తంగేళ్ళు
రండి... మా శిరస్సుపై చేరి తల ఎత్తుకుని చెప్పండి
మాకూ గుర్తింపు వచ్చిందని
తెలుగుదనంలో మేమూ ఓ భాగమేనని
మీ పసిమికాంతి, మీ హరితశోభతో
మా సీమ మరింత శోభోత్కరం చేయాలని
అంజలిస్తూ....

మోతుకూరి అశోక్‌కుమార్
టీచర్, కామారెడ్డి (పోస్ట్ & జిల్లా)
చరవాణి: 9247380976

# 288
# నజర్

పల్లె ఈడ్చుక పోవట్టె
పట్నం పెయి జెయ్యవట్టె
ఓల్ల దిష్టంటపు బిడ్డా...!
ఇంట్లోల్లదా...బైటోల్లదా....
పైసకు పైస గుంజుదామనెటోల్ల నజరంతా
గిప్పుడు పల్లెల మీదనే
హైవే తొవ్వల మీదనే
శాపలగ్గాదు, గిప్పుడు
మనుషులగ్గాలమేశే ఇక్మతుల!
మంచిగ నమ్మిస్తైనే గద
నిండముంచనీకి తొవ్వ
తవ్వల్లెల్లినోళ్లకే గీడ శెయినిండపని
ఏశమేదేశినా...ఏ జగలున్నా....
జగంతా సంపాదించుడు మీదనే...
మందిని ముంచుడు మీదనే....
ఇంతేసంగతి నెత్తికెక్కది
పూటకు లేకున్నా ఆకలనద్దు...
కడ్పు గాలినా మొత్తుకోవద్దు....
అన్యాలం ముచ్చట్లు
యాపనే జేయద్దు...

గుడ్శెగాలినా...జాగలు
గుంజుకున్నా లొల్లి జేయద్దు....
అంతాటా జబర్దస్తీ!
కన్నువడ్డ జాగలన్నీ కబ్జైతుంటయి
పడావుడున్నా అడావుదీసుడే పని-
జాగలకు అద్దులు వాతినట్టు
మన్నిసడ్కు సుత అద్దులు వెడ్తుండరు
కట్టుగొయ్యల నడ్మ ఉంచినట్టు
పట్నం కచ్చినమంటెనే
పానాలు గిరివెట్టుడు కచ్చింది!?
గీద అగ్ర గానం జేసుడే తెలివయ్యింది....
మందిని ముంచుడే దినాలు జెల్తున్నయి....
దొర్కిన పరంపోగు జాగల్లకు
అంత్రాల బంగ్లాలు సూటి జూడవట్టె...
యడ్ల గెల్వనిస్తరు? యాడ బత్కనిస్తరు?
అన్నీ నజర్‌బంద్ పశాలు-
ఎటువాయి. బత్కెల్లనోన్ని బత్కనియ్యకుంట
జేస్తుండరు
పట్నం కండ్లు వడ్డయా
పల్లెలన్నీ కత్తెర వట్టినట్టే...!!

డా. మొత్కూరి మాణిక్యరావు

# 289

## కవితాంజలి

కం. తన కవితారచనంబున
తనినియు దీరకను మరల దాల్చెనొ! జన్మం
బును పెద్దన, దుర్గనయై
యనువగు 'పల్లాన్వయమ్ము'నందున నెలమిన్

కం. ఆ జిగిబిగి యల్లిక, మరి
యా జిలుగు వెలుంగు కైత లాచతురోక్తుల్
'యాజి' ముఖకాంతి సంపద
లీ జన్మము నందు నబ్బునే యిటుగాకన్

చ. అది 'మడికొండ'లో యగుటనాయె
పసిండికి తావి యబ్బుటై
నది తన యూరిపేరును ఘనంబుగా
దా వెలిగించె, చాతురీ
పద కవితాభిరాముడును పండిత
మాన్యుడు 'దుర్గ'నార్యుడే
మెదలును మానసంబున సమృద్ధవచో
విభవోన్నతుండునై

తే.గీ. భాషయను 'పాలవెల్లి' ని భావమనెడు
కవ్వమున ద్రచ్చి పొందిన 'గంగిరెద్దు'
నింటి యింటికి ద్రిప్పి తా నెలమి గాంచె
సద్యశః పరిధానముల్ సంతసమున

సీ. సంక్రాంతికి తెనుగు చానల భుజముల
వ్రేలాడు భుజగంపు వేణులందు
'రంగవల్లిక లందు రహిమీరబెట్టు గొ
బ్బిళ్ళలో, యా తిరునాళ్ళయందు
'కోడి పందేల'లో, గొంతు చించుకుయుచు
'సాతాని జియ్యరు' సరళిలోన
పంబనాదాలలోపల 'డుబుడుక్క'ను
'బుడుబుక్క' సడులలో బల్పు మీర

తే.గీ. తొంగి చూతువు యొకవి దుర్గనార్య!
మీదుకవితా ఛలోక్తుల మిసమిసలను
మరతుమేరీతి? గైకొనుమా! కవీంద్ర!
నాదు కవితాంజలుల నేడు సాదరమున

కం. ఈ 'సంకురాతిరి'కి మీ
కేసంబరమొదవె? యేడ్పులే దక్క, మిమున్
కాసేపైనను జూచుచు
నూసులాడు భాగ్యమొదవుటో, మృషయౌగా!

*(డా. పల్లాదుర్గయ్యగారి స్మృతిలో...)*

మోహన్ రుషి
చరవాణి: 8341725452

290

## సాల్ గిరా ముబారక్

సలపరింత సంవత్సరంల పొయ్యేటిది కాదు
బాధ బాయిల దుంకినంత ఈజీగ మాయమయ్యేటిది
కాదు
గోసకు గోరీ కట్టడానికి టైమ్ పడ్తది
ఫలితాల్ని అందుకోవడానికి పైనకింద పడాల్సొస్తది
గబ్బిలాల గురించి మనకు తెలియంది కాదు
జాగిలాలు మేల్కొన్నాక కథ ముంగలుంటది సూడు
అటు వూరు, ఇటు పట్నం... న ఘర్ కా న ఘాట్ కా
అయినోళ్ళం మనం...

ఇప్పుడిప్పుడే కిందంతా ఒకే నేల వుందన్న ధైర్యాన్ని
చిక్కబట్టుకుంటున్నం...
కొత్త పాటలు పాడాలె, కొత్త బాటలు పర్వాలె...
దుఃఖం తప్ప ఇంకేం లేదనుకునే బత్కులల్ల ఆనందం
మొల్వాలె...
నమ్మకాల్ని వొమ్ము చెయ్యని తెలంగాణ...
ఇప్పుడు నా స్వప్నం, నా ఖ్వాయిష్, నా ప్రతిజ్ఞ!

మౌనశ్రీ మల్లిక్
18-1-10/3/4, శివసాయినగర్, ఉప్పుగూడ,
హైదరాబాద్-53. చరవాణి: 9394881004
ఇ-మెయిల్: mounasrimallik74@gmail.com

291

# సుప్త చేతనత్వం నుండి

కూపస్థం లోకాసమస్తం అనుకున్నపుడే
సంకుచిత పరిణామాల అవధులేమిటో
సమాజానికి సులువుగా తెలిసిపోతుంది.
కడలికోసం పరుగెందుకని అడిగితే
నది తనలో తానే నవ్వుకుంటుంది
స్వయంగా ఎలా ప్రకాశిస్తున్నావని నసిగితే
నక్షత్రం మినుకు మినుకుమని విసుక్కుంటుంది
సహజాతాలను ప్రశ్నించడం అవివేకం
మిణుగురుల వెలుగును పగలే చూపుతానంటూ
ప్రగల్భాలు పలికితే అభాసుపాలు కాక తప్పదు
కాకులు మూకుమ్మడిగా తపస్సు చేసినా
సుస్వర నిగమగమకాలు పలుకలేవు
అవి మౌనవ్రతం చేస్తే మోక్షమైనా దొరుకుతుంది
అంతరంగపు పొరల మాటున మూలుగుతూ
విశ్వవేదిక మీద ప్రసంగిస్తున్నానుకుంటే ఎలా?
జ్ఞానతేజోన్ముఖ ధీరుడు ఎదురుపడినపుడు
మొదలవుతుంది అసలు సిసలు కథ!
అంతరిక్ష పరిశోధకుడికి మేఘాల వైభవాన్ని
బుర్రకథగా చెపితే ఏం బాగుంటుంది?
జీవితాన్ని మధించిన మహోన్నతుడిపై
గతకాలపు మరకల స్మృతులను చిలకరించడం
వృథా ప్రయాస ఆయాసం కాక మరేమిటి?
కాలం అడుగులను లెక్కిస్తున్న వాడి ముందు
డింభకులు డాంబికాల డాబులు మానకపోతే
అతడి తీక్షణ దృక్కులకు మోకరిల్లక తప్పదు
అహంకార గర్వాలను అందంగా అలంకరించుకుని
భస్మ సింహాసనాల మీద కూర్చొబెడితే
అవి మాత్రం ఎంత కాలమని భరిస్తాయి?
మిడిమిడి జ్ఞానంతో మిడిసిపడే మిడతల్లా
ఎగిరి పడితేనే అసలు సమస్యంతా
ముష్కరులను పొగడ్తల దండకంతో నిద్రలేపితే
వారు అసురుల చరిత్రనే తిరగరాస్తారు
నీచంగా... కళేబరాలను మెడలో వేసుకు తిరిగే
వీధికుక్కల్లా పేరు తెచ్చుకోవాలో...
స్వచ్ఛంగా... మానవీయ మానస సరోవరంలోని
రాజహంసల బారుల్లో కలిసిపోవాలో...
అంతా మన చేతుల్లోనే వుంటుంది
ఔను! అంతా మన చేతల్లోనే వుంటుంది
సుప్త చేతనత్వం నుండి తత్త్వ చైతన్యంవైపు
స్పష్టంగా దృష్టి సారించిన మేధ
బంగారువర్ణ తంగేడు పువ్వులా విరబూస్తూనే
వుంటుంది.

**ఎం. జలజారాణి**
చరవాణి: 9963175445

## 292

# అమ్మకు నీరాజనం

తెలంగాణ తల్లిదో వందనం వందనం
అందుకో మన జాతి నీరాజనం ॥తెలంగాణ ॥

ఆనాటి కాళోజి కవితలల్లగలేను
తేటతేనియవంటి పాటనేనల్లుతా
వీణ మీటల మీద నే పాడలేనమ్మ
అలుగు సవ్వడి వినుచు అలరిస్తు గేయాల
అమ్మ నీ పాదాల కభిషేకమే జేస్త ॥ తెలంగాణ ॥

బంగారు తెలంగాణ బాటలో ఈనాడు
బతుకమ్మ బోనాల సందడే జూడాల
జలసంపదాలేక జడుసుకోనీకమ్మ
కాకతీయులనాటి ఆ జ్ఞాపకాలతో
సుప్రభాతమ్మున సుమమాలలందిస్త ॥ తెలంగాణ ॥

శివుని శిరమున గంగ మేఘమై గర్జించి
హిమగిరులనూ దాటి గలగలా ప్రవహించి
జలజలా పారేటి చెరువులే నిండాలి
కట్టుకాల్వలన్నీ కళకళలాడితే
ఆ పంటతో అమ్మ కారగింపు జేస్త ॥ తెలంగాణ ॥

**యం. శ్రీరాములు**
నార్సింగి (గ్రా.), చేగుంట (మం.) మెదక్.
చరవాణి: 8008957323

# 293

## పెరుగుతున్న ముప్పు

ప్రతి ఉదయం నుండి సాయంత్రం వరకు సమరం
శ్రమ జీవికి పలుకుతుంది సంధ్యావందనం
పేరుకు ఉన్న ఫలహారాల పండుగలు
పేదవానికి మరపురాని అప్పులు
సంతలో కొంత సొత్తు మనుగడలో
చురకత్తిలా మారుతున్న పై ఎత్తు
ప్రజాస్వామ్య వికాసంలో
ప్రతి నిత్యం పెరుగుతున్న ధరల ముప్పు
పెను తుపానులా పాకిన అవినీతి
తరాలు మారినా తీరాలు దాటని పేదరికం
హద్దులు లేని ఆకాంక్షల దుస్థితి
కురుక్షేత్ర కుమ్ములాటలో కమ్ముకున్న
కలికాలానికి దోహదమవుతున్న సమాజ జాగృతి
జనజీవన ప్రవంతిలో జీర్ణించని
రాజకీయ నాయకుల పరాకాష్ఠలు
పాత గోడలకు చిల్లులు పొడుస్తున్న మేకులు
పెరుగుతున్న ముప్పులు
తస్మాత్ జాగ్రత్త.

త్రివిక్రమ శర్మ
చరవాణి: 9000392707

294

# చిదిమేసినా చిరుప్రాణమా

చిగురించే బ్రతుకుల చిదిమేయకు
వికసించే మొగ్గల విరిచేయకు
కలల సామ్రాజ్యాన్ని సమాధి చేయకు
కంటి పాపల మంట కలపకు
ఉదయించే చిన్నారుల ఊపిరి తీయకు
ఉయ్యాలలో పాపాయిల ఉసురు తీయకు
ఆడబిడ్డలంటే అలుసెందుకు
అమ్మ, ఆలి, చెల్లి లేని ఇల్లేది ఈ ప్రపంచంలో
నిన్ను కన్నది అమ్మే, నీ నేటి ఉనికికి, ఆలంబన అమ్మే
నీవు అనుభవిస్తున్న ఈ ప్రపంచమంతా అమ్మ చలవే
పాలుతాగి రొమ్ము గుద్దే పాషండుడా
పాపం పుణ్యం తెలియని పసిమొగ్గల చిదిమేశావు
ఆడబిడ్డలు కరువైతే, అమ్మమాయమవుతుంది
అమ్మే మాయమైతే సృష్టి అనాథ అవుతుంది
మనిషి రాతియుగంలో ఉన్నాడా?
మనసు రాయిలా మారిందా?
సృష్టిధర్మాన్ని ఎదురించే పాపిష్టి పద్ధతి
కాసులకు కక్కుర్తిపడే స్కానింగ్ సెంటర్‌లు
పచ్చనోట్లకోసం 'కడుపుకోత' పెట్టే డాక్టర్లూ
ఆడదై ఉండీ ఆడ శిశువును హత్య చేయించే అమ్మ
చెడుతనాన్ని ధిక్కరిస్తూ
ప్రాణం పోసిన పాపిష్టి తండ్రే ప్రాణాంతకుడైతే
ఈ దుర్నీతిని మౌనంగా చూస్తున్న సమాజాన్ని
ప్రశ్నిస్తూ
ఈ హత్యాకాండకు సాక్షీభూతులైన మనుషులందరినీ
ఛీత్కరిస్తూ
మౌనంగా కరిగిపోతూ, మానవత్వాన్ని నిలదీస్తూ
కల్మష హృదయాల కత్తివేటుకు ముక్కలౌతూ
కాలంలో కనుమరుగై కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ
'కాలగర్భం'లో కలిసిపోయిన భ్రూణమా
చిదిమేసినా చిరుప్రాణమా
నీ చిక్కుముడని ఎలా విప్పను
నీ ప్రశ్నలకు ఏమని సమాధానం చెప్పను
కానీ ఓ చిన్న ప్రయత్నం
నా అక్షరం ఒక్క చిరుప్రాణాన్నైనా
నిలబెడుతుందేమోనన్న పెద్ద ఆశ



నక్కా హరికృష్ణ

# 295

## చిగురించిన చెట్టు తంగేటి చెట్టు

చెట్టు ఎండిపోతుంది
ఎండుటాకులై పండించిన ఆకులై
వేళ్ళలోకి మొదలు కుంచించుకుపోతూ
చెట్టు ఎండుకవోతుంది.
తెల్లటి మొగుళ్ళకింద
మొదళ్ళను మసి శాసిస్తుంటె
రాతిపొరలల్ల నాగళ్ళను తల్లవెడుతుంటె
చెట్టు ఎండిపోతుంది
గాలిని  బంధించి
కొమ్మల్ని కోతకు వెడుతుంటె
ముళ్ళపొదలకి వానకప్పల్ని కుచ్చి
పొంచన సొచ్చిన చెడుగులు
చెట్టుకింద పొయిరాళ్ళని వెట్టినాయి
సీసపు రజాన్ని చల్లినయి
చెట్టు ఎండిపోతుంది
తోళ్ళను పీకుతు
కాయల్ని తొక్కిపెట్టి
పచ్చటి పువ్వులకు
ఆసిడ్ స్నానం చేయిస్తుంటే
చెట్టు ఎండిపోతుంది
ఈ చెట్టెకదా ఒకనాడు
చుక్కల్లా మెరిసే ఫలాలతో
నిండుకున్న తేనెతుట్టె
బంగారు తొడుగు చలువచందమా
వన్నెలనీడలపాటున
సకల జనుల ఆకలి తీర్చిన దయాపూర్ణ
ఏ దురహంకారం చూపుకి
చెట్టు ఎండిపోయింది!
స్వార్ధ ప్రయోగాలు శాశ్వతం కావు
తంగేటి చెట్టుకిప్పుడు
అరుణోదయం తాకింది
చీకట్లను తూట్లు పొడిచే
జనవన చైతన్యంకోసం
చెట్టు నేనైనాను
నేను చెట్టునయి అలుముకుంటున్నాను.

**నరాల సుధాకర్**
నిజామాబాద్.
చరవాణి: 9440353699



## 296
## నైటింగేల్

మొన్నట్సంది సూస్తున్న
అదేందో కోయిలలు
మా ఇంటి మీదనే కూసుంటున్నాయి
వాన కాలం కద
పాపం గూడులు తడిసిపోయినయేమో
గుంపుగా ఇక్కడికి అచ్చినయని అనుకున్న
నిన్నటికి నిన్న సూసిన
నెమళ్ళు పురి ఇప్పి
నా ఇంటి ముందట నిలుసున్నాయి
కలికాలం కద
పాపం అడివిలో సెట్లన్ని నరికేసింద్రేమో
ఊరి మీదకు అచ్చినయ్ అని అనుకున్న
ఇయ్యాల ఇంకా గమ్మత్తు సూసిన
సీతాకోక చిలుకలు తేనెటీగలు
మాఇంటి సుట్టూ తిరుగుతున్నాయ్
దోపిడి కాలం కద
పాపం పూలల్లోని మకరందాన్ని
వీళ్లకంటే ముందే ఎవరన్న దోచుకున్నారేమోనని అనుకున్న
కోయిలను సూస్తున్న మౌనంగా కూని రాగాలు
తియ్యడాన్ని
నెమళ్ళను సూస్తున్న వాన లేకున్న ఆడడాన్ని
తేనెటీగల్ని సూస్తున్న ఝుంఝూం రాగాలను పలకడాన్ని
వాటిని చూస్తూనే మౌనంగా కూసిండిపోయిన
ఎవరితో మాట్లాడలే.... ఎవరూ నాతో మాట్లాడలే
అప్పుడు ఇసిత్రం సూసిన
కోయిలలు కోపంగా నన్ను సూడడాన్ని
నెమళ్ళు పరుషంగా నావైపు రావడాన్ని
తేనెటీగలు రౌద్రంగా నన్ను సుట్టుముట్టడాన్ని
అప్పుడు భయంతో పలికిన
అమ్మా.... అని అంతే
ఎవరో ఆపినట్టు అవి ఠక్కున ఆగిపోయాయి
నా మాటల్ని పలకరింపుగా వింటున్నాయి
కోయిలలు ప్రేమగా నన్ను మళ్ళా సూస్తున్నాయి
నెమళ్ళు కంట నీళ్ళు పెట్టుకున్నాయి
తేనెటీగలు మెత్తగ రెక్కలతో నన్ను తాకాయి
అప్పుడు నాకు అర్థమయింది
వినడానికి కోయిలలు వచ్చాయని
పూలల్లోని తేనే కంటే గమ్మత్తైన నా తెలంగాణ భాషను
ఆస్వాదించడానికి, నెమళ్ళు తేనెటీగలు వచ్చాయని....



నాగరాజు రామస్వామి

# 297
# స్వర్ణ తెలంగాణ

అదృష్టవంతుణ్ణి!
నేను తెలంగాణ వాణ్ణి!
ఈ నేల
శాపగ్రస్త నేల
అసమాన సహనశీల
అణగారని అగ్నికీల!
సీమ తుపాకి తూటాలకు
నిజాం నిరంకుశ కత్తిపోట్లకు
ఎదురొడ్డి పోరిన ఉక్కు ఎడద!
దొరల ముక్కులకు ముగుదాళ్ళు వేసి
పెద్దన్న జిత్తులను చిత్తుచేసి
రగిలే గుండెల రక్తాశ్రువులు రాల్చి
ఉద్యమ నిప్పులు చెరిగిన సంకల్పజ్వాల!
ఉదయాన్ని తెచ్చిపెడతానన్నవాడు
ఉన్న తూర్పును ఊడ్చుకు పోతాడని ఎవడూహించాడు?
సమతలం కాలేని భిన్న పొలిమేరలను
అంటకుట్టు వేసి అతికించిన ఉమ్మడి రేఖ మీద
ఉదయం కాలేకపోయింది ఉషస్సు
వేగుచుక్క కాలేకపోయింది
వేలు మీది సిరా చుక్క!
అది అరవై ఏళ్ళ అమావాస్య!
రాకాసి చీకట్లు
స్వైరవిహారం చేసిన కుటిల సంధ్య!
వేల బతుకులు చితిమంటలైతే కాని
వ్యూహాత్మక వివేక దార్శనికత
ఉద్యమ జ్వాలై ఎగసి పడితే గాని
వేకువ కాలేదు! ఉదయం రాలేదు!
తెలంగాణా తూరుపు తెలవారలేదు!
నేను ఉదయించని ఉషస్సు కోసం
ఆరు దశాబ్దాలు అలమటించిన వాణ్ణి!
అయినా, అదృష్టవంతుణ్ణి!
నేను తెలంగాణావాణ్ణి!
అదుగో, ఉద్యమ జ్వాలలు చిమ్మిన అగ్నిగోళాలు
ఆకాశంలో నవ్య నక్షత్రాలై జ్వలిస్తున్నవి!
నవ తెలంగాణా చందన చర్చలో
నిన్నటి చంద్రుడు వెండిపూతల నలదుతున్నాడు!
కొత్త సూర్యుడు స్వర్ణ కిరణాలను అద్దుతున్నాడు!
ఇక మన తెలంగాణ బంగారు తెలంగాణ!



నాగారం వనిత
చరవాణి: 7702226253

# 298

## రైతు బతుకు

కరకర పొడిచే ప్రొద్దువోలె,
నిద్రలేపే కోడి కూతవోలె,
శ్రమను నమ్ముకొని,
బక్కచిక్కిన శరీరంతో
బీడు భూమిని నాగలితో దున్ని,
గింజలని చల్లి,
వానకోసం ఆకాశం వైపు
ఎదురు చూస్తావు
గాలి వస్తే చెదిరిపోతావు
నిరాశ - నిస్పృలకు లోనవుతావు
సూర్యుడు ఉదయిస్తాడు, అస్తమిస్తాడు,
ప్రొద్దు తిరుగుడు పువ్వులాగ,
కానీ... రైతన్న ఎప్పుడూ...
వేగుచుక్కలా ప్రకాశిస్తుంటాడు
పొట్టకూటి కోసం పనిని నమ్మి,
చెమట విలువ తెల్సిన
ఓ రైతన్న...
దిగులు చెందకు
నీ శ్రమయే నీ ఆయుధం

నీపై ఆధారపడ్డ వాళ్ళెందరో
తినే ప్రతీ గింజ మీద
రైతన్న పేరుంటుంది
అలాంటి నీవులేని
పల్లెలన్ని అంధకారమే
అందుకే రైతన్న నీవు బ్రతుకు,
ఎదుటివారిని బ్రతికించు
కాలచక్రం కంటగిస్తే
నీకలల ప్రపంచం చెరిగిపోదు,
ఇప్పుడు గాకపోతే మరోయేడు
మట్టిలో మాణిక్యాలను పండిస్తావు
రైతు బ్రతుకు - కాలానికి బలికాకూడదు
పురుగుల మందు నీకు
శరణ్యము కాదు రైతన్న
నీ కలల్ని నిజం చేసే
క్షణం కోసం ఓదార్పుతో
సర్కారు నుండి వచ్చే
ఉపాధి, బంగారు పథకాలని ఆశ్రయించు
పల్లెసీమని రత్నాల సీమగా మార్చు రైతన్న



**నాగవరం బాల్‌రాం**
14-31, హనుమాన్ టేక్డి, వనపర్తి-509 103
మహబూబ్‌నగర్ జిల్లా. చరవాణి: 9440678603

# 299
# ఆశల ఇంద్రధనస్సు

సత్యసంధతకి  ఆఖరి జవాబు
సారంగధరుడే
హరిశ్చంద్రు డెప్పటికీ కాదు!
ధర్మానికి చివరి రుజువు
ధర్మవ్యాధుడే
ధర్మరాజు కాదు!
నిశిరాత్రుల్లో వెన్నెల మాయ జలతారు వెన్నపరిచినా
చంద్రునికి గమనం తప్పదు
ప్రజల మస్తిష్కాలపై
మీడియా కమ్ముతున్న చీకటిని
రేపటి సూర్యుడు తన కిరణాల్తో
పటాపంచలు చేయక మానడు!
స్వార్థపు ఊబిలో చిక్కుకున్న
జాతికి నీతి రుచించదు!
వాత్సాయన కామసూత్రాలకి
ద్వంద్వార్థపు మాటలకి మచ్చికైన
పంచవన్నెల చిలక నేటి దృశ్యమాలిక
అధికారం లక్కగృహానికి
తగల బెట్టటానికి బయటి వాళ్ళెవ్వరూ అక్కర్లేదు
దున్ని నిర్మించిన
విశ్వకర్మలే దాన్ని తగలేస్తారు
డాలర్ నీరెండ చాటు
పరుచుకొన్న
ఆశల ఇంద్రధనుస్సు
ఎంతోసేపు నిలవదు!!
పదవులను ఎరచూపి
మాయలు మంత్రాలతో
బాలనాగమ్మలను
కుక్కలుగా చేయవచ్చు
ప్రశ్నించే కార్యవర్ది రాజులు
శిలలై పోవచ్చు
అయినప్పటికీ
ప్రశ్నలు వేయటం తప్ప
పనుల్ని మానిన బేతాళుల్ని
విక్రమార్కులే మోస్తారు
ఎన్నిసార్లైనా
మరెన్ని విధాలైనా
విజయం సాధిస్తారు!

**నన్నపురాజు విజయశ్రీ**
8-7-98/పి1/3, ప్లాట్ నెం. 3, రోడ్‌నెం. 7, వెంకటేశ్వర కాలనీ, ఫేజ్1,
వైశాలీనగర్ (పోస్ట్), హస్తినాపురం సెంట్రల్, రంగారెడ్డి-500 079
చరవాణి: 9441643849

300

# అన్నయ్య

తెలంగాణ చరిత్రలో తొలి ముఖ్యమంత్రిగా
తెలంగాణ తల్లి హృదయంలో ఓలలాడిన
ముద్దుల తనయుడు
మీ పాలన స్వర్ణయుగం - నిండుమనసు
నిజాయితీ నిష్కలంక ప్రజాసేవ
ప్రగతి రథపు చక్రాలై పరుగిడే ఈ జగాన - తెలుగు
ప్రజల సేవకై ప్రగతి రథంపై పయనించెడి సమయాన
స్వాగత తోరణమాలిక - సంబరాల సమగీతిక
భూమిలేని గ్రామీణుల, పేదప్రజల ఉన్నతికై
వనరులను నధికంచేసే ప్రాజెక్టులు నిర్మించి
తొలి ముఖ్యమంత్రిగా తొలి హస్తంతో పరిశ్రమలు
స్థాపించి నిరుపేదల బ్రతుకులో చిరుదివ్వెలు వెలిగించి
నిరుద్యోగ యువకులకు నిధులను విడుదల చేసె.
మధుర మధుమాస ఆవాసమై జగతికి
క్రొత్త చివురులు ఒనరులం గూర్చుచుండ
తెలుగు కవనము తేనెలు చిలుకరించు
పలుకు పలుకున కలకండ కలుగునట్లు.
తెలుగులోని తియ్యదనం తేటగీతి తెలుగుదనం
మత్తేభం మంచితనం చంపకమాల చమత్కారం
ఉత్పలమాల ఉత్సాహం అలంకారాలతో ఆదమరుస్తూ
ఛందస్సుతో చిందేస్తూ సంధులతో సముదాయిస్తూ
అక్షర లక్షల విలువగు అక్షయమగు కీర్తినిచ్చి
అక్షర కతమున అక్షర రూపగు నిధి
వేలక్షలు వెచ్చించిన నిధి లభ్యంబగునే
కదలివచ్చిన కార్యశూరుడు కాకతీయ మిషన్ స్థాపకుడు
విజ్ఞానమునకు విహంగమై తత్వాన్వేషణకు తరంగమై
రాజకీయ చతురోక్తులతో మృదంగమై
ఒక పతంగమై ఒక విహంగమై ఒక ఘన తరంగమై
సరస చలోక్తుల అంతరంగమై
మీ జీవితం ఆలోచనల కన్న ఉన్నతం.
అచ్చతెలుగు సామెతలతో అలరిస్తూ
మీ మాటల తూటాలు ఎదుటివారి
గుండెల్లో ఫిరంగిమోతలు నివురుగప్పిన అగ్నికణము
మాటల్లో చంద్రనిప్పులు కురిపించగల
మాటల మాంత్రికుడు తానై ఓ ప్రభంజనం
ఎర్రకోటను కదిలించాడు పార్లమెంటును కుదిపేశాడు
తెలంగాణ సాహిత్య పుష్పం విశ్వమంతా పూస్తే
ప్రతిభా పరిమళం తెలంగాణా అంతా వీసే
ఆ పుష్పం వాడనిది ఆ గంధం వీడనిది
ఆ దీపం ఆరనిది మీరు మేలుకోరే ఆదర్శప్రాయం
మీ మాట కత్తి కన్న పదునైనది నవనాదము కన్న
సుతిమెత్తనైనది ఆ రూపం తెలంగాణది
తెలంగాణ సేవయే మన విధి తెలంగాణమే పరమావధి
అని చాటిచెప్పిన అమృతమూర్తి

**నందిగామ నిర్మలకుమారి**
తెలుగు అధ్యాపకురాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం,
తెలంగాణ. చరవాణి: 9490369252

301

# అనుబంధం

అవి నేలనంతా కాంతిమయం చేసిన పూలు!
అవి మాకెంత సింగారమో మాటలతో చెప్పలేం
అవి ధనవంతుల ముంగిళ్లలో పూయవు
ఎక్కడో వూరి బయట
పొలాల మధ్య, గుట్టల మధ్యన పూచిన పూలవి
కుబేరులకు వాటిమీద మక్కువ లేదు
కుబేరులకు వాటికంటె ఎక్కువేమీ లేదు
ఆ పూలలో ఎంత సహజత్వం !
ఒడిసిపోని మానవత్వం !

కొన్ని పూలు రాజసం వొలకబోస్తాయి
రాణిపూలమని విర్రవీగుతాయి
మా అందాలకు, సుగంధాలకు
సాటిలేదని ప్రచారం చేసుకుంటాయి
మేమంటే వాటికెంత ప్రేమ!
అవంటే మాకెంత ప్రేమ!
ఇంతకూ ఆ పూలకూ... మా నేలకూ
విడదీయరాని బంధం!
తంగెడు పూలకూ, తెలంగాణకూ ఉన్న అనుబంధం!

**నామని సుజనాదేవి**
అయ్యప్పస్వామి టెంపుల్ దగ్గర, ప్రగతినగర్, బి.ఓ. పెద్దపల్లి,
కరీంనగర్-505172 చరవాణి: 7799305575

# 302
## ప్రభంజనం

నిజాంకాలం నుండి
రజాకార్ల దాస్యం నుండి
అందరి అధికారం నుండి
అడుగడుగునా అణచివేయబడి
అన్ని రకాల వివక్షకు గురై
పొగిలి పొగిలి ఏడ్చిన కాళ్ళు పోటెత్తి
మసిలి మసిలి మంకెనలై
రగిలి రగిలి కసితో రక్తాశ్రువులై
ఉడికి ఉడికి ఉప్పెనలా ఉవ్వెత్తున ఎగిసి
అగ్ని పర్వతంలా బద్దలయి
అగ్ని కణాల లావాలా వ్యాపించి
కల్లోల తరంగమై ఎగజిమ్మి
సునామీలా విరుచుకుపడి
తెలంగాణ విముక్తికై బిగించిన పిడికిళ్ళు
అందరి అణువణువు ఆక్రోశించి
దినం దినం కణం కణం కదిలించి
ఆగత్యాలపై సమరశంఖం పూరిస్తే
ఎందరి వెతలు
ఎందరి కష్టాలు
ఎందరి కలలు
ఎందరి కన్నీళ్ళు
ఎందరి కడగండ్లు
ఎందరి పోరాటాలు
ఎందరి ఎదురుచూపులు
ఎందరి బలిదానాలు
ఎందరి ఆత్మాహుతులు
కలగలసి ఒక్కటై
కులమత వర్ణ వర్గ విభేదాలకతీతంగా
జనం జనం కలిసిన ప్రభంజనమై
సాధించిన తెలంగాణ విజయం
కావాలి తరతరాలకు స్ఫూర్తిదాయకం

నారాయణస్వామి

303

## బిడ్డలాల

మీ అవ్వను చేతులు జోడిస్తున్న
నాతోడే మిమ్మల్ని మీరు
చంపుకోకండ్రి ఏడ్సెతందుకు -
నీల్లు లేవు నా కంట్ల మొత్తుకునెతందుకు
సత్తువ లేదు నా ఒంట్ల బరిసెలు గామ్సనోల్లు
నాకండ్ల ముందే కట్టెలవుతుంటే
వశపడుతలేదు- నిప్పుల సుంటి కొడుకులు
నట్టింట్ల బూడిదైతుంటె
పానమాగుత లేదు ఎండిన రొమ్ముల కల్గి
జీవం పిండి పోసిన సేతికందకుంటనే
ఎల్లిపోతర బాంచెననిపించుకున్నోన్ని
బండకు కొట్టందే బతుకు సాలిస్తర
బిడ్డలాల మీరెందుకు సావాలె
బతికెటందుకు హక్కు లేనోల్లు
బాజాప్త తిరుగుతుంటె
లేత మోదుగాకులసుంటోల్లు
మీరెందుకు ఎండిపోవాలె
పచ్చని మామిడిపిందెలసుంటోల్లు
మీరెందుకు రాలిపోవాలె
నీల్ల మీద వెలుగుసుంటోల్లు
మీరెందుకు మాయమవాలె
బిడ్డలాల ఆశ విడువొద్దు
బతుకు మీద బరోస ఇడువొద్దు
నేల మీద కాల్లు గట్టిగుండాలె
నా పెయ్యి మీద తేలిన నరాలు చూడుండ్రి
ఉబ్బిన నరాలల్ల పొంగిన పోరాటం చూడుండ్రి
గన్నుల తోటి కొట్లాడి గెల్సిన
మనోల్ల రేషం చూడుండ్రి మీరెందుకు బిడ్డా
కోడెలాగసుంటి మీ వయసుని
పానంలేని కట్టెను జేస్తరు
ఎర్రటి కొలిమసుంటి మీ కోపంమీద
సావునీల్లు జల్లుతరు బిడ్డలాలా తాల్లు పేనింది
మీ కుతికెలకేసుకునెటందుకు గాదు
మనని తొక్కే మదపుటేన్గుల్ని
కట్టి నేలక్కొట్టెతందుకు
గాసునూనె డబ్బాలు మీ మీద పోసుకుని
నిండుపానం తీసుకునెటందుకు గాదు
మనకున్నదంత ఊడ్చుకున్న
బడాచోర్లను నడి బజార్ల
నిలబెట్టి భగ్గుమనిపిచ్చెటందుకు
రాండ్రి బిడ్డలాల ఒక్కటవుదాం ఒక్కటిగుందాం
చేతులొక్కటి చేసి చప్పట్లు కొడదాం
'జీవితం జిందాబాదని'
మాటలొక్కటి జేసి మంటిని మింటిని ఒక్కటి చేద్దాం
'చరిత్ర మనదేనని''

**నాంపల్లి సుజాత**
1-32, పోతారం పోస్ట్, హుస్నాబాద్ (మం.)
కరీంనగర్ జిల్లా. చరవాణి: 948059893

# 304
# మలినం

అతడు పొద్దున్నే
నగరాన్ని అద్దంలా దిద్దే బ్యూటీషియన్
మైలపడ్డ నిన్నటి దృశ్యానికి
కొత్తరంగు లద్దే చిత్రకారుడు
పాత గతుకులకు
అతుకులు మెత్తడానికొచ్చే మేస్త్రీ
మలేరియా మరణాలను
డెంగ్యూ జ్వరాలను
దరి చేరనియ్యని డాక్టర్
మన ఖర్చా వదలించటానికి
తానే మురికీ అయిన గరీబు
మూడు చక్రాల బండే
కూడు బెట్టే యావదాస్తి
ఒక్కరోజు ఆలస్యమైతే
ఎదురుచూసే జనం
దూరాన్నెక్కడో
ఈల అలికిడి

హమ్మయ్య!
చెత్తోడొస్తున్నట్టున్నాడు
పాతచెత్తా పాలకవర్గూ
అరటితొక్కలు, పేపర్ ముక్కలు
ఉల్లిపొట్టు పుచ్చొంకాయలు
పారేసిన ప్రతీది
పదిలంగా తన రిక్షాలోనే...
తను లేక నగరం
పాచి పళ్లూ ఊసుకళ్లతో
అడుగు ముందుకెయ్యనని మొరాయిస్తుంది
ఐనా!
అందరి కంటికి తనో చెత్తోడు
బాబూ!
మనుష్యుల్లో పాతుకొన్న మలినాన్ని
ఏ గుండెతో మోసుకెళ్లుతున్నావో
ఆ గుండెకు
నమస్కారం



ఎస్. నరసింహాశర్మ
వనపర్తి.
చరవాణి: 9441357400

# 305

# సింహ గర్జన

తెలంగాణ వీరులారా
ఉక్కుపిడికిళ్ళై మొలవండి
చింతనిప్పుల్లా భగభగమండే
కళ్ల నుంచిఉద్యమాల
గుళ్ళు కురిపించండి
కల్లోలంగా తల్లడిల్లుతున్న
తెలంగాణ తల్లి గుండెల్లో
గునపాలు గుచ్చిన కిరాతకుల
ఆటలకు చరమగీతం పాడాల్సిన సమయమొచ్చింది
ఊళ్ళను బీళ్ళుగ మార్చిన వలస ఊసరవెల్లులను
తరమాల్సిన క్షణం ఇదే

గుళ్ళలో దేవుళ్లను మేల్కొల్పండి
గోడ మీది పిల్లుల్లాంటి
తెలంగాణ ద్రోహుల
పిరికితనానికి ఆత్మగౌరవమనే
విరుగుడు మందు పోయండి
తడారిపోయి ఎడారిగా
మారుతున్న తెలంగాణ
మాగాణాన్ని గోదారి కృష్ణమ్మ
నురగల తరగలతో
ధాన్యాల గాదెలను నింపండి.

నిసార్
చరవాణి: 9490952285

306

## చెరువులు - కుంటలు

ప. చెరువులు కుంటలు నిండాలే
మన ఎండిన బీళ్ళు తడువాలె
పాడి పంటలు పండాలె
మన ఆకలి దప్పులు దీరాలె
బంగారమై మెరువాలె మన సింగారాల తెలంగాణ

చ. ఆదిలాబాదు, కరీంనగరు,
వరంగల్లు, ఖమ్మంమెట్టు
గెట్టును దాటి పారిపొయ్యే
గోదారమ్మ పక్కకు మర్లి
నిజాంబాదు, మెదకు జిల్లా,
రంగారెడ్డి, నల్లగొండ
బీడుభూముల తడుముకుంటు కరువునంత
తరుముకుంటు కృష్ణమ్మతో చేతులు కలిపి అలయ్
బలయ్ తీసుకోవాలె ॥చెరు॥

చ. పాలమూరు పక్కలకెల్లి పరుగులుదీసె క్రిష్ణానది
తల్లడిల్లె మైబూనగరు పల్లెపల్లెన పారుకుంటు
దేవరకొండ, రాచకొండ, యాదగిరి నర్సింహ్మాసామి
గుండంలోన నిండా మునిగి, గంధామల చెరువుల
నిండి ఆలేరు మోత్కూరు కెల్లి సూర్యాపేటకు
సాగాలె ॥చెరు॥

చ. పెండింగున్న ప్రాజెక్టులకు దండిగ నిధులు
ఇయ్యాలె
సాగర్ ఎడమ కాలువనీల్ల వాటా సరిగ పంచాలె
శ్రీరాంసాగర్ వరద కాలువ, సిద్దిపేటను దాటాలె
దేవాదుల ఎత్తిపోతలు, పానాదుల్లకు రావాలె
పసిడి గడ్డి తిన్న ముసలి ఎడ్లూ రంకెలెయ్యాలె
॥చెరు॥

చ. గండ్లూ పడిన కట్టల కంతట మరమ్మతులు జెయ్యాలె
వానాకాలం వరదానీల్లు ఊరి చెర్లకు మలుపాలె
గొలుసుకట్టూ చెరువులనన్ని వరుసాబెట్టి నింపాలె
బోరుబావుల బొందాబెట్టి ఊటబావులు తవ్వాలె
పల్లె పోరగాండ్లు మల్ల దునికి ఈతలు గొట్టాలె
॥చెరు॥

చ. పంటారాసులతోని ప్రతి యింట పండుగ గావాలె
కరెంటుకెపుడు కొదువాలేక ఇంతట వెలుగుతుండాలె
కొలువులొచ్చిన పిల్లల జూసి కన్నావాల్లు మురువాలె
అమరవీరుల యాది జేస్తూ తెలంగాణ ఎదుగాలె
ధైర్యసాహసాల నేల దునియాల పేరెల్లాలె
॥చెరు॥

నిఖిలేశ్వర్

307

## కోల్పోయిన వాటి గురించి...!

ఉద్యమాల దారిలో
రక్త చారికలను కడిగేస్తున్న
కన్నీటి ధారలకు
అంతమెక్కడో చెప్పగలవా?
ఆయా మజిలీల దగ్గర
ఏమేమి కోల్పోయామో
ఎన్నెన్ని చెప్పమంటావు?
ఎవరెన్ని వాగ్దానాల
సమాధుల కింద
కూరుకపోయారో
తవ్విపోయమంటావా?
ఆత్మీయులు ఒక్కొక్కరే
అర్థాంతరంగా సెలవంటూ
కోల్పయినవన్నీ తమతోపాటే
తీసుకెళ్లిపోయారని
సంతోషించమంటావా?
వైఫల్యాలే గాథలై
మానని గాయాల్లా సలుపుతూ
ఆయా మలుపుల దగ్గర
నిలదీసినందుకు శోకించమంటావా?
ప్రతి కీలక సన్నివేశంలో
అనూహ్యంగా
ఆశించిన ముగింపు మిగిల్చిన
దుఃఖభారాన్ని
ఇలానే మోయమంటావా?
కాలాన్ని లెక్కించలేక
డబ్బు గుణకారం చేతకాక
చేతికందినదే
మహద్భాగ్యమని మురిసిపోలేదా?
మన ఉద్యమాల దారిలో
రక్త చారికలను కడిగేస్తున్న
కన్నీటి ధారలకు
అంతమెక్కడో చెప్పగలవా?

నెల్లుట్ల రమాదేవి
4-66, శివునిపల్లి, ఘన్‌పూర్, వరంగల్ జిల్లా
చరవాణి: 9440622781
ఇ-మెయిల్: ramadevi.nellutla@gmail.com

308

## మీరే...

విజయ తోరణాలు వాకిట్లో
వేలాడే ఈ వేళ
వేయి రేకుల వెలుగు పూలు
విచ్చుకుంటున్న వేళ
ఆరు దశాబ్దాల అపూర్వ పోరాటానికి
అద్భుత ఫలితం అందిన వేళ
మీరే - మీరే గుర్తొస్తున్నారు
విశ్వమంతా ఉద్యమ జ్వాలలై కనిపిస్తున్నారు
మా నెత్తురు చచ్చుబడ్డప్పుడల్లా
వేడి రక్తం ఎక్కించింది
పోరుమంట ఆరి పొగచూరినప్పుడు
నిప్పుకణికలై నెగళ్ళు మండించిందీ మీరేకదా!
మేకవన్నె పులులకు
మేకప్ తీసి అసలు ముఖాలు చూపిందీ
గొర్రెల్లో దాగిన తోడేళ్లను
పట్టిందీ బయటపెట్టిందీ  మీరేకదా!
మీ చిటికెన వేళ్ళు పట్టుకొని నడిపించాల్సిన మేము
కాటగలిసిన పిల్లలమైతే బాట చూపిందీ
మా జవసత్వాలు ఐసీయూలో చేరినప్పుడు
ఆక్సిజన్ అందించి ఆదుకున్నదీ మీరేకదా!
కారు చీకట్లు కమ్ముకున్నప్పుడల్లా
వెలుగు దివిటీలై ముందుకు కదిలారు
ఊగుతున్న ఉరి కొయ్యలకు
ప్రాణాలు పణమిచ్చారు
నడుస్తున్న రైలు బళ్ళకు
ఎర్రపూల చెట్లై ఎదురు వెళ్ళారు
ఎండిన ఎడారి నేలల్ని
కారుతున్న కన్నీళ్ళతో తడిపారు
కాలుతున్న గంధపు కర్రల్లా
పరిమళ దీప్తిని పరివ్యాప్తం చేశారు
కొమ్మ కణుపుల నుండి ఆకులు రాలినంత తేలిగ్గా
ఆశయం కోసం అసువులు వదిలారు
ఇప్పుడు ఆనందం నిండిన అన్ని ముఖాలూ
మీలాగే కనిపిస్తున్నాయి
ఉత్సాహం ఉరకలేసే ఎవర్ని చూసినా
మీరే గుర్తుకొస్తున్నారు
ఈ ఉత్సవ ఊరేగింపుల్లో
మీరు ఇక్కడే ఎక్కడో ఉండే ఉంటారు
ఎగురుతున్న జెండాలై కదులుతూనో
ఉజ్వల దీపకాంతుల
కాగడాలై వెలుగుతూనో
దారి పొడవునా స్వాగత వృక్షాల నుండి
ఎర్రపూల అక్షింతలై రాలుతూనో!!



**నేరోజు రమేష్**
జిల్లెల్ల, 6-183/ఇ, సిరిసిల్ల (మం.)
కరీంనగర్ జిల్లా-505 405
చరవాణి: 9951261203

309

# తెలంగాణ తొలి కర్తవ్యం

తెలంగాణ ఇప్పుడు తెగిన గాలిపటం కాదు
తెగువ జూపి గెలుపొందిన త్రినేత్రుడి లలాటం
పిడికిలెత్తి ఉరికించిన ఫిరంగుల యుద్ధస్వరం
దగాకోరు కోరల్ని చీల్చిన ధనుర్బాణ అంకురం
తెలంగాణ ఒకప్పుడు అవ్వలు జుర్రిన గంజి మెతుకులకు
అయ్యలు తాగిన సుట్టపొగాకు ఆకలి కునుకు తీసేది
కలుపులు తీసిన చేతుల నిండా
దండి కడియాలు దగదగ మెరిసేవి
కోతకొచ్చిన వరిచేల నిండా గింజలు గలగలమనేవి
కళ్ళంపోసిన ధాన్యం కుప్పే రైతు కలల సామ్రాజ్యం
కుంచపు కుండకు ఇనాము లేదు కొలవడానికి
కచ్చురం గీరలకు పడాకు లేదు మోయడానికి
అయినా తెలంగాణ ఎప్పుడూ ఆడడానికి గంగిరెద్దు కాదు
అడుక్కోవడానికి బిచ్చగత్తె కాదు
అడుగులకు మడుగులొత్తే అసహాయ జనం కాదు
నా తెలంగాణ ఎప్పటికీ!!
అసుర సంహారంలోంచి ప్రభవించిన ప్రజాగర్జన
ఆకాశంలో ఎగిరే ప్రశాంత శాంతికపోతం
గతం! నా తెలంగాణ కాన్వాసు నిండా
అరవై ఏళ్ళ ధ్వంసరచన
వర్తమానం!! వేల ఆర్తనాదాల గొంతులో మార్మోగిన
జై తెలంగాణ భవిష్యత్తు !!! బంగారు తెలంగాణకు
బాటలు వేద్దాం రండి!
ఓ మేధావుల్లారా, మెరికలు తిరిగిన యువకుల్లారా
స్వరాష్ట్ర సమృద్ధికి స్వరం పెంచుదాం
కయ్యానికి కాలు దువ్వినా కనికరిద్దాం
నేర్పుతో నెయ్యానికి పూలబాటవేద్దాం
భాషను, యాసను పరిహసించిన నోటికి
తెలంగాణ తెలుగు తేనెను నాకిద్దాం
ఇంకా ఊరిజనం ఊపిరిలో ఉపాధి హోరెత్తాలి
వట్టి చేతుల యువతకు మట్టి వాసన తగలాలి
పేరుకపోయిన పేదరికంను పెంట కుప్పకు తరుమాలి
పల్లెను గుల్లచేసే పాశ్చాత్య సంస్కృతిని ఆమడదూరం
వుంచాలి దేశీయ సంస్కృతిని దేవులాడి పంచాలి
మూసిన పరిశ్రమలను ముచ్చటగా తెరవాలి
మాడిన కర్షక కార్మికుల కడుపులో సల్ల బువ్వ నింపాలి
ఎన్కటి ఎద్దెవుసం బీడు భూముల్ని దున్నాలె
నాడు యాతంబోసిన తాత కళ్ళల్లో ఆనందం చూడాలె
చెల్కల నిండా చెట్టూ చేనుకు చిటారు కొమ్మలు
పెరగాలె బడుగు రైతు అడుగుల వెంట ఊట
చెలిమెలు వూరాలే చూరుకు గట్టిన వరిగొలకను
ఊరపిచ్చుక పొడవాలె పారకు, గడ్డపారకు కమ్మరి
సమ్మెట పోటు పడాలె పాతరేయబడ్డ
పాతనాగళ్ళకుకొత్త కర్రులు రావాలె
ఇంకా తెలంగాణలో మనం
వైజ్ఞానిక సదస్సుల కోసం వేదికలమవుదాం
సామాజిక వికాసాన్ని సంతృప్తిగా స్వాగతిద్దాం
గుడిగంటల్ని బడిగంటల్ని వడివడిగా మ్రోగిద్దాం
తెలంగాణ మనుగడలో తొలికిరణమై వెలుగుదాం.

ఎన్వీ రఘువీర్ ప్రతాప్
9-6-162/1, ఫ్లాట్ నెం. 103, రోడ్ నెం. 14, మారుతీనగర్,
చంపాపేట్, హైదరాబాద్-79 చరవాణి: 9440551522
nvraghuveerprasadp1@gmail.com

310

## విజయ ద్వజం

త్యాగాల గడ్డ మీద
తొలిపొద్దు పొడిచింది
వట్టి పోయిన వటవృక్షం
కొత్త చిగురు తొడిగింది
ఆశల సమాధుల్లోంచి
అరుణోదయం విరిసింది
చిద్రమైన బ్రతుకుల్లో
కొత్త వెలుగు నిండింది
దగా పడ్డ తెలంగాణ
దరహాసం చిందింది
తరతరాల దోపిడిపై
విజయధ్వజం ఎగిసింది
ఉద్యమ సంగ్రామంలో
నిప్పుకణిక లెగసింది
అంబరాన్ని చుంబిస్తూ
అమరుల త్యాగఫలం
జనం గుండె మ్రోగించిన
జై తెలంగాణ నినాదం
కుతంత్రాల కూకటేళ్ళు
పెకిలించిన ఉద్యమం
చీకట్లను తొలిగించి
వేకువ వెల్లువైన నిజం
రాజీలేని పోరులోంచి
రసరాజ్యం వెలిసింది
తెలంగాణ గుండెల్లో
జే గంట మ్రోగింది

**ఎస్. హరిప్రియా గిరిధర్‌రావు**
ప్రభుత్వ ఉపాధ్యాయిని
చరవాణి: 9233293384, 9492788150

# 311

# తెలంగాణ మధురఫలం

అదును చూసి విత్తు నాటిన
తెలంగాణ మధురఫలంను రుచి చూసిన
ప్రజల సంకల్పమే పంటపొలమాయె
చాకలి ఐలమ్మ ఆత్మ అరకై దుక్కి దున్నె
అగ్నిపూలతో శుద్ధైన శ్రీకాంతాచారి విత్తనం
చినుకుకోసం చూడక ప్రజల కన్నీటి స్పర్శతో మొలకెత్తే
దొడ్డి కొమురయ్య కలలపంట ఏపుగా పెరిగె
విప్లవ గేయ మాధుర్యాన్ని నింపుకొని
సకల జనుల సమ్మె వరంగా
తెలంగాణ పంట కాపుకొచ్చె

అమర వీరుల ఊపిరితో మాగిన తెలంగాణ ఫలం
మనందరి శ్రమకు దక్కిన ప్రతిఫలం
మనిషిగా కాపాడి భూగర్భజలం
బాధ్యతగా పెంచుదాం హరితవనం
ఈ స్వచ్ఛ తెలంగాణ సాక్షిగా
సాదిద్దాం మున్ముందు బంగారు తెలంగాణ ఫలం
అందుకే అదును చూసి విత్తునాటిన
తెలంగాణ మధురఫలంను రుచి చూసిన

**ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్**
స్వప్నాన్ రామకృష్ణ హైట్స్, ప్లాట్-67, ఫ్లాట్ 202,
సారధి హౌజింగ్ సొసైటీ, మోతీనగర్-500 018
చరవాణి: 9849082693



# 312

## నీటి జ్ఞాపకం

కార్తెలు కదిలిపోతున్నా
చెరువు మాత్రం కదలడం లేదు
పెరిగిన తుమ్మల మీదుగా
చంద్రుడు చెరువును
వెతుక్కుంటున్నాడు
గుండె చెరువయ్యింది
అని అంటాము గాని
గుండె కింది చెరువును మింగిందెవడు?
పూడికలు తీయకుండా
జమాఖర్చులో కూడికలు వేసి
వలసల మీదుగా ఊరి పునాదులను పెకిలించిన
పెత్తనం!
అలుగు మీదుగా పారాల్సిన నీటిని
ఆత్మహత్యల ఉరితాళ్ళుగా
పేనిన సమైక్యవాదం

గొలుసు కట్టు చెరువుల
గొలుసులు తెంపి
ఊరుమ్మడి బతుకుల ఊపిరి
మింగిన ఉమ్మడి రాష్ట్రం
చెరువు ఊరికి చెలికాడు
ఎండిన చెరువు సాక్షిగా
ఊరిప్పుడు చెల్లని నాణెం
తూము కింది కాలువలో
పళ్ళెంతో నీళ్ళుతోడి
పరకలు పట్టిన బాల్యం
ఊరి పాదాలు చెరువు కట్ట మీద
కదలాడిన నీటి జ్ఞాపకం
చెరువు అంటే చనుబాల ధార
మత్తడి దునికితే పొలాల పులకరింత.

**ఓదెల వెంకటేశ్వర్లు**
ఇంటినెం. 2-63, ప్లాట్ నెం. 279, విజయపురి కాలనీ, చౌదరిగూడ
గ్రామం, నారపల్లి, ఘట్‌కేసర్ మండల్, రంగారెడ్డి-500 088
ఇ-మెయిల్: odela79@gmail.com

# 313

# పచ్చని చెట్లు

చెంగు చెంగున సెంగలిచ్చి ఎగురుకుంట
వచ్చి కొమ్మమీద ఆలెటట్టు
అలిస్ట పడిన పానానికి నీడనిచ్చేటట్టు
జెరంత సేపు కునుకు పాట్లు పడెటట్టు...
నెమరేసుకునే గొడ్లు తోకలూపుకుంట
నిమ్మలంగా వున్నట్టు
సన్నని గాలి పాట ఇన్న
సెట్టు తలకాయ ఊపినట్టు...
కొమ్మల దాక్కున్న కోయిల ఈరాం
లేకుంట కూ... కూ... అని అరిచేటట్టు....
అమ్మ ఒళ్లోలాంటి సీరల
కంటి నిండా నిద్రపోయినట్టు...
ఆటలాడుకునే పోరగాండ్లు
పోట్లాడుకున్నట్టుగా ఉన్నది!!!
ఏ పుల్లనో పోయ్యిలకు ఏరుకుందాం
అని వచ్చిన ఓ అవ్వ నిలబడి చూస్తున్నదన్నట్టుగా...
మోజుపడ్డ మొగులు మనసారా వచ్చి
ప్రేమనంతా చెట్టుమీద కురిపించేటట్టుగా...
గాడుపు దుమారానికి నిలవడి
నిద్రదన్ని నిలబడ్డట్టు....
గొడ్డలి పట్టుకుని అచ్చినోన్ని
అలుముకుని దగ్గరకు తీసుకున్నట్టు
తీరొక్క తీర్ల కనిపిత్తాంది
కని గసోంటి సెట్టును చూస్తే
రైతుకెందుకు గట్ల అనిపిత్తాందో అర్థం అయిత లేదు
సెట్టుపచ్చగా వుంటే ఊరంతా పచ్చగున్నట్టే
ఎవలేమనుకున్న నేను సేతులెత్తి మొక్కుతాను
సూస్తే సెట్టు నాకు పచ్చగా కనిపిత్తాంది
సెట్టు పచ్చగా వుంటే... అందరూ పచ్చగా వుంటరు

**ఓరుగంటి పురుషోత్తం**
నల్లగొండ జిల్లా.
చరవాణి: 9703336584

314

## గర్జిస్తుండాలె

ఎటో మళ్ళిన నీళ్ళు గలగలమని యిటు మళ్ళి
మట్టి కలలు పండించాలె
ఎప్పటి నుంచో మండుతున్న కోడె గుండెలు
ఉద్యోగాలతో చప్పున చల్లారాలె
వొక్క నిముషమైన కోత లేని విద్యుత్తు
గాలిలా ప్రవహిస్తూనే వుండాలె
పది జిల్లాలు మరిన్ని జిల్లాలై పచ్చ పచ్చగవుతుండాలె
గుండెకాయంటి చార్మినార్ ఆకాశాన్నంటుతనే వుండాలె
పాలంటి తెలుగు భాషల మన యాస మీగడల్లె వుండాలె
పాలపిట్ట రెక్కలూపుతూ ఆకాశంలో ఎగుర్తనే వుండాలె
జింక అడవుల్ల అదరక బెదరక తిరుగుతనే వుండాలె
నేల ఈనినట్టు తంగేడు పువ్వు పూస్తనే వుండాలె
జయ జయహే తెలంగాణగీతం జనగణమణలో
కల్సిపోతుండాలె
బతుకమ్మ బోనాలు ప్రపంచం చుట్టి వస్తుండాలె
కర్మాగారాలు ఖార్ఖానాలు మూడు పువ్వులు
ఆరుకాయలై
కర్మజలం కురిపిస్తుండాలె
వై ఫై తరంగాలు యింటింటిని
తాకుతుంటపోతుండాలె
కాలుష్య భూతం సీసాలో దూరిన జిన్ లెక్క
దిక్కుతోచకుండాలె
అర్ధరాత్రయిన ఆకాశంలో సగం చుక్కలతో ముచ్చట
చెప్తుండాలె
మానం ప్రాణం విత్తు సొత్తు లాకర్‌లో పెట్టినట్టు
పదిలంగ వుండాలె
నా తెలంగాణ సింహంలా జూలుదులుపు కుంట
గర్జిస్తనే వుండాలె



పట్టాల అశోక్
1-6-174/5/28, బాపూజీనగర్, ముషీరాబాద్,
హైదరాబాద్-20. చరవాణి: 9849940479

# 315

## తెలంగాణ సంస్కృతి చిహ్నాలు

పది జిల్లాల తెలంగాణా
ప్రపంచపు మణిహారం
దశాబ్దాల కలల పంట
నవ్యమైన తెలంగాణ
కనులముందు నిలిచింది
ఉద్యమాలే స్ఫూర్తిగా
ఎదగాలి గొప్పగా
మనోభావ మిళితాలు
సంప్రదాయ చిహ్నాలు
తెలంగాణపు ముఖచిత్రము
జనజీవన ప్రతిబింబము
తంగేడు, జింకలు
పౌరాణిక ప్రసిద్ధములు
జమ్మి, పాలపిట్టలు
యుగయుగాల జమ్మిచెట్టు
తెలంగాణ వృక్షరాజం
సర్వశుభము పవిత్రము
బంగారు తెలంగాణకు
శమీ వృక్ష ఆశీస్సులు
రాజ్యాలను కాపాడిన
రమ్యమైన ఆయుధము
పాలపిట్ట దర్శనమే
ప్రజలకు
శ్రీరామరక్ష
వరాల పాలకడలి
దేవదేవుడైన
రామునికి శుభములొసగి
తెలంగాణ వైభవాన్ని
నలుదిశల చాటిచెప్పు
ప్రకృతికే వన్నెతెచ్చే
బంగారు తంగేడు
బతుకమ్మ
సంబురాలు
పల్లెటూరి యువతుల
సిగలలో ఒదిగిపోయి
ఆయుర్వేద విలువలతో
ప్రగతిలో తామంటున్నాయి.
సాధుశీలి జింకలు
ఆదర్శం మనుజులకు
క్షణంక్షణం అప్రమత్తం
బంగారు మాయలేడి
రావణుని దర్పమణిచి
నిలిచే నేడు సాక్షిగా
తెలంగాణపు జింకగా.

పడాల రామారావు
చరవాణి: 9848833081

# 316
## హృదయం తిరగబడ్డది

60 ఏళ్ళ గాయాలు
గేయాలైన వేళ
త్యాగాలు బలిదానాలు
శోకాలైన వేళ
దాశరథి కాళోజీ కవితలు
కవుల కలాలు
ఒక్కటైన వేళ
రేపటి ఉదయం కోసం
హృదయం తిరగబడ్డది
పరుగెత్తె ప్రవాహంలా
ఉరుమెత్తె శబ్దంలా
శిరసెత్తె సర్పంలా
ఊరువాడని ఏకం చేస్తూ
ఉప్పెనలా ముందుకురికింది
తెలంగాణ తల్లి
విముక్తి బాటలో
నేనో వజ్ర కిరీటాన్నైతానని
దాయాదుల దాష్టికం
పాలకుల దౌష్టికం
పోలీసుల క్రూరత్వంలో
ఆ నిశీథ నిశ్శబ్దస్థలిలో
ఒళ్ళు జలదరిస్తున్నప్పుడు
రగిలిన చైతన్యజ్వాలా
సమరం చేయమన్నది
కంటినుండి రాలే
నిప్పుకణికల గుండును
బద్మాష్‌గాళ్ళ గుండెలకు
గురిచూసి కొట్టమన్నది
తెలంగాణ బాదుషా
ఎవరో పసికట్టమన్నది
ఈ తెలంగాణ విజయ ప్రస్థానంలో
నేలరాలిన కొమ్మలెందరో
జారిపోయిన జాజిమల్లెలెందరో
కూలికాలిన యోధులెందరో
వాడి మాడిన ప్రజాకళాకారులెందరో
ఆరనితడి అక్షరాల బిగువును
తట్టిన మహాకవులెందరో
పోరాటాల పురిటిగడ్డన
స్వరాష్ట్ర నిచ్చెనకు
బాటలు వేసిన వీరులెందరో
వారందరికీ సెల్యూట్
చేద్దాం రండ్రి
ఈ వేళ తెలంగాణ  సంబరాల సద్దులు
ముల్లెగడదాం పదండి

**పరమాత్మ**
3-1-649/1, రోడ్ నెం. 1ఎ, కాకతీయకాలనీ,
ఎల్‌బినగర్, హైదరాబాద్. చరవాణి: 9848552512

# 317

## తంగెడు పూ కల

రాష్ట్రం వొచ్చిన కాన్నుంచి నన్ను నన్నుగా జూస్తలేరు
నా రూపం-రంగుల గురించి
ఎక్కడ పడితే అక్కడ కవులు
కయిత్వమై జాలు వారు తుండ్రు
"తెలంగాణ రాష్ట్రం పువ్వు" వనీ
నన్ను నన్నుగా మాట్లాడనిస్తలేరు
నా పుట్టువడీ-నా ఇలువలు గురించీ
సందుదొరికిన జాగలల్ల ఉపన్యాసాల వరుదలైతుండ్రు
ఊర్లల్ల పానాదుల పొంటి చెల్కలల్ల గెట్ల పొంటి
పసులు మేసే గడ్డి కంచల్ల
ఏ రచ్చన లేకుండా ఎదుగుతుంట
పసుపు మొగ్గల బంగారం పువ్వుల్లో
రాగిరేకుల సొంటి కాయల్త్ ఊరోల్ల రందిని వూడ్సెశి
మొఖాలల్ల నవ్వులు పూయిస్తుంట
పల్లెతల్లులు నన్నింత కాలం
శిగలల్లో ముడ్సుకుంటున్నందుకు అంబలి యాల్లకు
సద్దగట్కల సల్లబొట్టు పోస్కొని
కడ్పునిండతాగినంత సంబూరంగుంటుంది
నా పల్లె కన్నె పిల్లల యింతకాలం
జడలల్ల గింత సోటిస్తున్నందుకు
మన్సుతెల్సి మసులుకునే పెండ్లి కొడుకు
ఆకిట్లకొచ్చినంత ఆనందంగుంటుంది
నా పల్లెలు పెత్రామాస నాడు
నన్ను తంగెడు పూల బతుకమ్మజేశి
నానడినెత్తిన గౌరమ్మను నిలిపితే
మన్సుసొప్పబెండంత అల్కగుంటుంది
నా మీదా...నాతోటి పూలమీద
అమ్మలక్కలు పాటలు గట్టి ఆడుకుంటుంటే
ఈ తెలంగాణ తల్లినేల రుణం
తీర్సుకోలేని గరీబుదాన్ని అనిపిస్తుంటుంది
సదువుకున్న మా రాజులూ.... ఒక్కమాట
నన్ను "రాష్ట్రంపువ్వు"ని జేసి  మూల్యం అమూల్యం
అనేస్తిరి నన్ను బతుకమ్మ తల్లిని జేసి
మా బతుకుకు మూలం నువ్వే అంటిరి
అయినా నేను పొంగి పొయ్యి పాలుగాలె
గింత గావురంగా నన్ను గుర్తిచ్చినందుకు
మీకు నా నాలుగు కోట్ల దండాలు
అయినా సార్లూ నామన్సుకు తుర్తిలేదు
తెలంగాణ భూతల్లి అద్దంల
నా మొఖం నేను సూసుకుంటుంటే
ఏదో తక్కువైనట్టు అన్పిస్తుంది
నాకు యింకా అత్యాస వుందని
మీరు అనుకోనంటే సెప్తా
గడ్డిపోసల్లెక్క పానాల్దీసుకొని
నాకు గింత గౌరవము దక్కిచ్చిన
ఎయ్యి మంది అమరుల స్థూపాల మీద
ఏటేటా దండలకై దండలనై రాలిపోవాలనే చివరికల
నాలో ఇంకా మిగిలేవుందయ్యా

పర్కపెల్లి యాదగిరి
1-1-97/4ఎ, నెహ్రూ పార్క్ దగ్గర, సిద్దిపేట,
మెదక్ జిల్లా. చరవాణి: 9299909518

318

## నవశిశువు

పిడికిళ్ళ గర్భాన పెరిగిన పిండము
నా తెలంగాణ అడుగడుగున విచ్చుకత్తుల
గండములెన్నో దాటిన విజయ ..నా తెలంగాణ
వీరుల రుధిరపు వరదలో కొట్టుకువచ్చి
పొత్తిల్ల రాలిన నవశిశువు ..నా తెలంగాణ
పుట్టెడు పురిటి దుఃఖంతో
నాలుగుకోట్ల దోసిల్లలో సేదతీరుతున్నది
..నా తెలంగాణ
చూడుచూడరా ..నా తెలంగాణ
అణువణువు అగుపడు అమరుల ముఖకవళికలు
ఇప్పుడిప్పుడే పిడికిలి మొగ్గలు
దోసిళ్ళై విరిసి అంజలి ఘటిస్తున్నది ..నా తెలంగాణ
నిన్న మొన్నటి గాయాలను శుశ్రూషతో
శృతి చేసుకుంటున్న వీణ ..నా తెలంగాణ
ముళ్ళ కంపల్లో దూరి గత వివక్ష కుబుసాన్ని
వీడుతున్న కోడె త్రాచురా ..నా తెలంగాణ
శిశిరాంగములపై వైభోగపు వసంతాన్ని
చిగురింప చేసుకుంటోంది ..నా తెలంగాణ
గిరులు తరులు సరిహద్దులు తరలిపోతు
న్నాయనీ.. గిరిగీయమని యాది చేస్తోంది
..నా తెలంగాణ
అన్నదాతల ఆత్మహత్యల ఆర్తనాదాలు
గతము గతమైపోవాలని అంటోంది ..నా తెలంగాణ
పడావై ఎడారైన చెరువులు మయూరాలై
పురులు విప్పి నర్తించాలంటోంది ..నా తెలంగాణ
అంబరాన్ని చుంబించే సమాధుల
పునాదుల్లోంచి వినవచ్చే చెరువమ్మ
శోకాన్ని ఆలకించమంటోంది ..నా తెలంగాణ
గత అధికారపు లోహపు డెక్కల తొక్కిళ్ళు
కబ్జాసుర కోరల గాయాలు
సలుపుతున్నాయని అంటోంది ..నా తెలంగాణ
శిఖం భూములు మింగిన శిఖండుల
కడుపుల్లోంచి పేగులను లాగేయమంటోంది
..నా తెలంగాణ
నిర్మించిన సౌధాలను నిర్మూలించే
నిష్ఠాగరిష్ఠుడు కావాలంటోంది ..నా తెలంగాణ
చెరువుల హారంలో వజ్రమై భూతల్లి
మెడను అలంకరిస్తానంటోంది ..నా తెలంగాణ
నీచుడు మనవాడైనా పరవాడైనా
వీడొద్దంటోంది ..నా బంగారు తెలంగాణ.



**పలస వెంకటేశ్వర్లు**
గ్రా. పెర్కకొండారం, శాలిగౌరారం,
నల్లగొండ జిల్లా. చరవాణి: 9542315245

# 319

## నా తెలంగాణ

తరాలుగా
కన్నీటి చుక్కలతో తడిసిన
ఈనేలపై కూడుగూడు
నీడలేనివాళ్లకు
ఒక భరోసా నియ్యాలే ఊరూరా
చెరువులు కల్పతరువులై
కరువు కోరలూడదీయాలె
పల్లెను ఎముకలగూడు చేస్తున్న
ధనదాహపు డేగల
రెక్కలు విరియాలె
ఇసుక వాగులు
ప్రకృతి పలకలై
కొత్త ముచ్చటకు
వేదికలవ్వాలె! దివికి-భూమికి
బంధమైన జలఅద్దం
ఇక్కడ వలస బతుకులకు
వన్నె తేవాలె
కష్టాల కంపముండ్లు
కానరాకుండ పోవాలె
విరబూసిన కట్ల పువ్వుల వోలె
వికాసము పొందాలె
నా తెలంగాణ
దళిత, గిరిజన
సకల వాడలన్నీ
కలియదిరుగాలె
ఈ నేలపై శాంతి పావురం!
అసమానతలు
తొలిగి పోవాలె పంతం
ప్రతీకారాలు
అంతం కావాలె
ఈ తల్లి బిడ్డలు
ఐక్య మత్యానికి
చిరునామాలై నిలువాలె!
రైతన్న రోదనలు పోవాలె
పసిడి పంటలతో
పల్లెలు విలసిల్లాలె
కవి పండితులను ఆదరించుటలో
గద్వాల, వనపర్తి సంస్థానమ్ముల
మైమరపించాలె
బంగారు తెలంగాణ
నా తల్లి భారతి శిరస్సున
కీర్తి కిరిటమై మురియాలె
ధగధగ మెరియాలె
నా తెలంగాణ!

పల్లి నల్లనయ్య

## 320

## మంగలోళ్ళు

పురుటాలికి శస్త్ర చికిత్సలు చేసిన
తొలి భారతీయ వైద్యులు
కత్తి శక్తిని ప్రపంచానికి తెలియజేసిన మహాపురుషులు
గోరు, గుండు, కత్తెర్లతో అలంకరణ చేసే
నఖ, శిఖ శిల్పులు
షేవింగ్ చేసి ముఖ సౌందర్యాన్నద్దే వారు
అవాంఛిత రోమాల్ని తొలగించే పరిశుభ్ర పరమాత్మలు
కళ్లొత్తుల్ని, కాలి గోళ్లని ఆవలకు నెట్టే ఆరోగ్య
ప్రదాతలు
శుభాశుభ కార్యాల వివరాలను చేరవేసే
వార్తాహరులు
క్షుర కర్మలతో మైలను పారద్రోలే
మానవతా మూర్తులు
పెండ్లిళ్లలో సారె కావిళ్ళను
మోసుకెళ్ళే మొనగాళ్ళు
కర్ణామృతాన్ని పంచే
మంగళకర సన్నాయి మేళగాళ్ళు
దేవతా మూర్తుల్ని మేల్కొలిపే నాదస్వర విద్వాంసులు
డోలుపైనా, తలపైనా దరువు వేసే వేళ్ళ నృత్య
విన్యాసకులు
సామాజికంగా చాలా వెనకబడిన మహాపురుషులు
పుట్టిన్నించి గిట్టిన్దాక అవసరమయ్యే సేవాతత్పరులు
జనసౌఖ్యం కొరకు....
నిరంతరం శ్రమిస్తున్న ఉత్తమ జన్మలు మంగలోళ్ళు.



**పిట్టల రవీందర్**
హైదరాబాద్.
చరవాణి: 9963062266

# 321

## గోదావరి నదీలోయలో

ఇప్పుడు ఏం మిగిలిందిక్కడ?
నల్లబంగారం జాడలేదు
టబ్బుల నుండి బంకర్‌లోకి
బంకర్‌లో నుండి లారీల్లోకి... ఆపై
రైలు వ్యాగిన్లకు బల్లర బల్లర బొగ్గు పెల్లలరొద
విందామన్నాలేదు
వంగుతట్ట మోపినప్పుడు, సెమ్మాసెత్తి పోసినప్పుడు
గుండె గొంతులై పాడిన పాటలేవీ, ఆ పాటల్లో
ప్రాణమేదీ
డాంబర్ రోడ్డుమీద జారిన ఆరుగిరెల లారీలు
కర్ణభేరిని చీల్చుకుని మెదడు నరాల్లోకి ఇంకిపోతున్నట్టు
దూరమవుతున్న మాల్‌గాడీల సప్పుడు
చీమల బారుల్లాగా గణగణ గంటలు మోగిస్తూ
వడివడిగా రువ్వడిగా సైకిల్ సవ్వారీలు
చినిగిపోతున్న సాక్సులు చీకిపోతున్న కంపెని బూట్లు
మాసిపోయిన నెక్కరు మసిబారిన బనీను
నెత్తిన టోపి పెట్టుకుని తట్టా చెమ్మాసు పట్టుకుని
నడుముకు బాట్రీ చేతికి లైటు
మైసమ్మను మనసున తలచి, నేలమ్మను కండ్లకద్దుకుని
భూమి పొరల సొరంగ మార్గం
అప్పుడదే భూతల స్వర్గం...
బార్డరులోనే కాదు, భూగర్భంలోనూ సైనికులున్నారు
కలగాపులగమైన పడమటి పొద్దులో
తట్టా, సెమ్మాసుల కవాతు సాగిపోతున్నది
టన్నులకొద్దీ నా తండ్రులు తవ్వితీసిన పెల్లలు
పెల్లపెల్లకు నీ ప్రాణమెంత తండ్లాడిందో
బొగ్గు కాలుతున్న వింతవాసన
కార్మిక వాడలను కమ్ముకున్న వీఆర్ఎస్ మేఘాలు
నువు తీసిన రాకాసి బొగ్గు... నీకుకాదు
ప్రాంతేతరునికే నల్ల 'బంగారం'
గని సంపదను దోచుకెళ్లడం, మోసుకెళ్ళడమే
ఆధునిక రాజ్యాధికారంలో అసలైన అభివృద్ధి
గోదావరి నదీలోయలో
యంత్రభూతాలు మరోసారి తలఎత్తిన జాడ
కోరలకింద నలిగిపోతున్న నల్లకలువలు
గుండెకింద తడివున్న వీరుల రాకకోసం
ఎదురుచూపులు

పంజాల ఐలయ్య

## 322

## తంగేడు పూలు నవ్వులు విరజిల్లాయి

ఉద్యమాలు ఉవ్వెత్తున లేచి
స్వరాష్ట్రాన్ని సాధించగా
తెలంగాణ తంగేడు పూలల్లో
నవ్వులు విరజిల్లాయి
దగాపడిన తెలంగాణ తల్లి
ముఖంలో నవ
కాంతులు వెదజల్లాయి
సంస్కృతి, సంప్రదాయాల
సంబురాలు అంబరాన్ని అంటాయి
బతుకమ్మ ఆట కోసం
విరగ బూసిన తంగేడు పూలు
జనులకు బాసటగా నిలచి
ఆసరా ఇమ్మంది
కష్టాలు కడగండ్లు
కనుమరుగు
కావాలంది
రేపటి భావి పౌరుల
బంగారు భవిష్యత్తుకు
భరోసా ఇమ్మంది
నమ్మిన వారిని
వమ్ము చేయకుండ
వడుపుగా పాలించాలి



**పిన్నంశెట్టికిషన్**
ఇన్స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ శాఖ
నిజామాబాద్. చరవాణి: 9700230310

323

# తొలిపొద్దు పొడిచింది! పెనుచీకటి వదిలింది!!

నిన్నటిదే ఈనేలనిన్నటిదే ఈనింగినిన్నటిదే
వీచేగాలినిన్నటిదే ఈరోజుకొత్తగావీస్తున్నది
మబ్బుల్నే పుడమితల్లిపులకరింతను చూశాను
వొళ్ళంతా మంచుబిందువులు
మంచిముత్యాలుఅద్దిన చీరకట్టినట్టు మురిసిపోతున్నది
తెలుపు స్వచ్ఛతతో మెరిసిపోతున్న ఒక్కో బిందువుని
పల్కరించి పరిశీలించా అవికన్నీటి చుక్కలు
నింగికెగసిన తెలంగాణ బిడ్డల ఆనందాశ్రువులు
వీచేగాలిని దోసిట్లోకి తీసుకుని
శంఖాన్ని చెవికానించినట్లు శ్రద్ధగా విన్నాను
అమరులు ఆలపిస్తున్న అజరామరగీతాలు అవి
జీరగాపల్కుతున్న పోరునాదాలు
రాజకీయపు నాటకానికి తెరదించుతూ
గుండెల్లో గూడుకట్టిన గుబులు మేఘాలను తొలగిస్తూ
తెలంగాణ నేలపై తొలిపొద్దు పొడిచింది
దశాబ్దాల దురహంకార సమైక్యవాదం
ఎండిన ఆకై నేలరాలింది విశ్వవిష ప్రయత్నాలు
వీగిపోయిన అస్త్రశస్త్రాలైనయి
సబ్బండవర్ణాల స్వరాష్ట్రకాంక్ష సాకారమైంది
ఆరుదశాబ్దాల ఆకాంక్షని ఆత్మగౌరవపోరాటాన్ని
అఖిలజనులఆరాటాన్ని కడవరకూకొనసాగించినం
బలిదానాలకుబదులేలేదని
కన్నీళ్ళనిదోసిళ్ళల్లోకి తీసుకుని అమరులకు అంజలి
ఘటించనం అమ్మా! తెలంగాణమా!!
అష్టలక్ష్మి దేవతలా అరుదెంచినందుకు
పట్టరానిఆనందమేమరి అసమానతలకు తావులేక
అష్టసంపదలు అందరికీ అందునా?!
ఆకలిచావులు ఆత్మహత్యలు
అసహజమరణాలు ఎన్కౌంటర్లులేని కాలంకాంక్ష
నెరవేరునా? భౌగోళిక తెలగాణతో తృప్తిపడక
బంగారు తెలంగాణకై తపించే తరం మాది
త్యాగాలపునాదులపై ప్రాణాల్ని పణంగా పెట్టి
నవనవోన్మేషంతో నడిచివస్తున్నాం నవనిర్మాణంకై
మీరు నడిచే దారిలో వెలుగుదివిటీలై వెలుగుతాం
మీ చేతుల్లో రెండు వైపులా పదునున్న
ఆయుధాలమౌతాం తెల్లారంగనేతట్టాపారపట్టుకుని
సైకిలెక్కిసద్దికట్టుకుని బతుకుబాటలో
బరువులెత్తబయల్దేరిన బడుగుజీవి భవితమారుస్తం
వరిచేన్లోపురుగు తొలిచిన వరిగింజై
వాలిపోయినరైతన్నకు ఆపన్న హస్తం అందిస్తాం
నూలుదారమే ఉరితాడై నేలరాలిన నేతన్నల
నిరుటి కష్టం నెరవేర నుదిటి రాతను తిరిగి నేస్తం
నూతన ఆర్థిక విధానాన్ని నెత్తినబోనమెత్తుకుంటం
పాతవాసనలు పోయి పాడివాసనలువస్తయి
పచ్చనిపసిరిక నేలంతా పరుచుకుంటుంది
ప్రకృతి ప్రజల పరమౌతుంది



**పి. జగన్మోహనరావు**
నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్.
చరవాణి: 9494885360

324

# తెలంగాణ చంద్రుని వెలుగులు

మన తెలంగాణం నాలుగున్నర కోట్ల గొంతుకల గళం
ప్రకృతి ఇచ్చిన ఆ చంద్రుని వెన్నెల పక్షం రోజులే
ప్రజలు ఇచ్చిన ఈ చంద్రుని పాలన చంద్రుడున్నంత
కాలం
మనిషి సన్నన కాని ఈ చంద్రుని మనస్సు దొడ్డన
చిరంజీవులకు సన్నబియ్యం అన్నంపెట్టి చిరంజీవిగా
మారె మన కెసిఆర్
ఆసరా పథకం పెట్టి వృద్ధుల ఆయుష్ పోసుకున్నారు
కళ్యాణలక్ష్మిని పెట్టి కన్యాదానం చేసి
బడుగువర్గాల గుండెల్లో దేవుడిలా గూడు కట్టుకున్నారు
దళితులకు ధరణిని పంచి దరిద్ర్యాన్ని పారదోలారు
ఆ చంద్రుడు ఇచ్చిన కాంతి పదిహేను రోజులే
ఈ చంద్రుడు ఇచ్చిన కాంతి ఎప్పటికీ ఉంటుందిలే
అన్నదాతలకు రుణమాఫీ చేసి అండగా నిలిచాడు
ఉద్యోగస్తులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి
వారి జీవితాలకు ఫిట్‌నెస్ ఇచ్చారు
మన ఊరిచెరువు - మనకు కల్పతరువు
మనం చెరువును కాపాడితే మనలను చెరువు
కాపాడుతుంది
మన ఊరి చెరువు - మన ప్రజలందరికి బతుకు
తెరువు
పాడిపంటలను ఇస్తుంది మన చెరువు
ఊరునిండా నిండుతుంది రైతుల పరువు
జవంతో నిండిన మన ఊరిచెరువు
మన చెల్కలకు నిండా నీరు ఇస్తుంది మన ఊరి చెరువు
ఇంటింటికి నల్లా ఉండాలి -
ప్రతి ఆడబిడ్డ చల్లగా ఉండాలి
రమణాచారి సలహాతో మన కెసిఆర్ రాంచంద్రుని
పాలన సాగించాలి
యాదాద్రి నరసింహుని ఆశీస్సులతో
ఆయుష్ ఆరోగ్యాలతో పాలన సాగించాలి మన కెసిఆర్
ప్రకృతి కూడ మెచ్చి తెలంగాణ సంబరాలకు వర్షాంజలి
కురిపిస్తుంది
విశ్వకర్మగా మారి మన భాగ్యనగరాన్ని విశ్వనగరంగా
మార్చుతుంది
విశ్వసించండి



**పి. పద్మ**
పరిశోధక విద్యార్థి, ఉ.వి.విద్యాలయం
చరవాణి: 9912147547

325

# ‘కోటి నోముల బతుకమ్మ”

మహోన్నత సంస్కృతికి పెన్నిధి
పల్లెలకూ, పట్టణాలకూ వారధి
ప్రకృతి ఆరాధనకు మారుపేరు
భక్తి సౌందర్యాల హారు
పురాణకాలం నుంచి పుట్టుకొచ్చిన బతుకమ్మ
కష్ట సుఖాలను నెట్టుకొచ్చిన బతుకమ్మ
కాకతి సిగలోని పువ్వు బతుకమ్మ
తంగెడు నెఱజాణ బతుకమ్మ
కులం, వర్ణం, వర్గ బేధాలు లేని
స్వర్గ ధామం బతుకమ్మ

ఐకమత్యాన్ని పెంచే బతుకమ్మ
ఆనందాన్ని పంచే బతుకమ్మ
న్యూయార్కునుండి న్యూజిలాండ్ వరకు
తెలంగాణ నుండి టెక్సాస్ వరకు
పాత పట్నం నుండి పారసీక దేశాల వరకు
అందరి బతుకమ్మ అందాల బతుకమ్మ
గోగుపూల బతుకమ్మ
గుమ్మడి పూల బతుకమ్మ
నూటొక్క పూల బతుకమ్మ
కోటి నోముల బతుకమ్మ

**పున్న అంజయ్య**
చరవాణి: 9396610639

# 326

## చేయూత

ఒక దినంబు నేను శోకసాగరమను
పల్లెటూరుకేగ పయనమైతి
దారియంత వూరి దారిద్ర్యమును జెప్పు
నట్టులుండ కాలి నడకసాగె.
అంతలోన గుడిసెనగుపించె నల్లంత
దూరమందు దుమ్ము ధూళి నిండి
అతని తనువు జూడ అస్థి పంజరమాయె
కూలిపోవు హోరుగాలికైన.
ఖంగుఖంగుమనుచు బొంగురు గొంతుతో
బాధపడుచు నొక్క పద్మశాలి
నేయుచున్నది యబల చేనేత బాల
చేతి వ్రేళ్ళెంత నాజూకొ చెప్పవశమె.
అతని యింటి ప్రక్క నగుపించి రైతన్న
మెదుకు సీమలోన మెతుకు కరువె
బోరులెండిపోయి బోరున విలపించె
చెరువులెండి గుండె చెరువులయ్యె.
ఒక శుభోదయాన వచ్చె తెలంగాణ
పల్లెసీమలందు పండుగాయె
నేత రైతన్న బతుకుల నేలుకొనగ
చంద్రశేఖరన్న సాగెనన్న.



**పులి జమున**
202, శ్రియప్లాజా, అపార్ట్‌మెంట్స్, స్టేషన్ రోడ్,
మహబూబ్‌నగర్. చరవాణి: 8500169682

327

# తెలంగాణ నిత్య వసంతమై నిలవాలి!

అరవై ఏళ్ళ నిరీక్షణం ఫలించి
సాకారమైన సుందర స్వప్నం
పురుటి నొప్పుల నుండి
పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్రం
తెగువతో ప్రాణాలకు ఎదురొడ్డి
సమిష్టిగా తెలంగాణ సాధించుకున్నాం
నెత్తికాలందే జోలె నిండదన్నట్లు
చిక్కుముడులెన్నింటినో విప్పి
ముళ్ళ బాటను ఛేదించాము
మన ఉద్యమ నేతలే
మన పాలకులైన వేళ
పునర్నిర్మాణంలో మనమందరం
భాగస్వాములము కావాల్సిన వేళ
చిగురించిన ఆశావాద దృక్పథంతో
అస్తిత్వంతో అడుగు ముందుకేసి
మన ఆశలు, ఆశయాలతో
ప్రగతి దిశగా పయనిద్దాం
త్రాగునీరు, సాగునీరును సాధించి
కరువు రక్కసి కరాళ నృత్యాన్ని
చిరునామా లేకుండా చేద్దాం
నిరుద్యోగం, వలసలకు వీడ్కోలు పలికి
మనం కలలుగన్న సామాజిక తెలంగాణ
తెలంగాణోద్యమం సాహిత్యాన్ని
వేల వేల సిరాచుక్కలతో అక్షర బద్ధీకరించి
అక్షరాయుధంగా సంధించిన
కవి, గాయక, వైతాళికులు
తమ కలాలు, గళాలతో
అనుభవ సారం నుండి
సరైన మార్గం తెలిపే సరంగులై
నవశకానికి నాంది పలకాలి
పది జిల్లాల పురోభివృద్ధితో
తెలంగాణ పొందికగా రూపొంది
బంగరు భవితవ్యంతో వెలుగొంది
నిత్యవసంతంలా నిలవాలి

పెరుమాళ్ళ ఆనంద్
నల్లగొండ.
చరవాణి: 9985389506

328

# ఇక ఆత్మ నిబ్బరమే

జలమే జీవం
జలమే సిరులు
జలమే బలం
చెరువు గాయాలు మాన్పి
జీవం పోసిన ప్రాణ ప్రదాత
ప్రకృతి ప్రణామమంటూ
ప్రణమిల్లు తుంది
పల్లెతల్లి తలపైన
గంగమ్మ వెలిసింది
వర్షమే హర్షించి
నేలను స్పృశించే
చెరువుతో చెలిమి చేస్తామని
చినుకు చినుకులన్నీ
చెరువులో దునికాయి
వాగులు, వంకలు
పిల్ల సెలయేర్లన్నీ
బిరబిర కదిలాయి
చెరువుతో ముచ్చట్లు అచ్చట్లు
తనివి తీరా చేయాలని
చెరువుకు చేరాయి

చేపల, కప్పల, తాబేళ్ళ
నిలయాలు మన ఊరి చెర్లన్ని
బుడు బుంగల మునుగుడు, తేలుడు
కనుచూపు మేరంతా
హరిత రంగుల్తో హారమైనిలుస్తుంది
చెరువు గట్టుమీద
చెట్ల సందడి చూసి
పక్షుల కిలకిలలు
పల్లెమ్మ ఒడిలోన
తియ్యని రాగాలు
పాడి పంటలతో
పల్లెంత పరవశం
అన్నదాతకు ఇక
అలుపెరుగని పనులోయి
ఆకలన్నది దరిచూపులో ఉండునా!
గరిసెలు, గుమ్ములు
ధాన్యంతో నిండి
అన్నదాతకు ఇక
ఆత్మ నిబ్బరమే....



పెద్దూరి వెంకటదాసు
చరవాణి: 9290910498

329

# బ్రహ్మారథం

అందరూ నడిచేదే
అసలైన దారి ఐతే
కొలంబస్ కొత్త మార్గాన్ని
కనుగొనేవాడా!
అమెరికా మనకు అగుపించేదా!
అన్వేషణ ఎప్పుడూ
కొత్త ఆవిష్కరణలకు ఆలంబనే!
'ఇది ఇలాగే జరగాలి'
తరాలుగా ఈ పరంపర ఇలాగే సాగుతుంది
'ఇది ఇంతే'
ఎంతోకాలం నుంచి ఇసుమంత మార్పులేదు
అనే ఈ ఆనవాయితీ బెడిసికొట్టిందిప్పుడు
తెలంగాణనే దానికి తాజా ఉదాహరణ.

పాలకులు ఆ పేరెత్తితేనే
తప్పున్నట్లు చూసే పరిస్థితి నుంచి
తప్పుచేశామని తెలుసుకునేట్టు చేసిన
వైనం - మార్పుకు తాజా చిహ్నం
మల్లెలు, గులాబీలు, చేమంతి మాలలే
గుడిలోనైనా, మగువల జడలోనైనా
ఆస్థాన పూలుగా అన్ని అలంకరణల్లో వాటిదే స్థానం
ఎగసిపడ్డ దేదీ మనజాలదీ నేలమీద
అనామకంగా ఉన్న బిడ్డలేకాదు గడ్డిపూలకు
కూడా ఘనయశస్సు దక్కుతుందీ గడ్డమీద
అంటూ తంగేడు పూలకు బ్రహ్మారథం -
ఓ ఉదాహరణ.

పెందోట వెంకటేశ్వర్లు
15-90, హనుమాన్‌నగర్, సిద్దిపేట
మెదక్. చరవాణి: 9440524546

330

## ఇక భవిత మనదే

తే.గీ.
కలలు సాకారమౌవేల కలసి రండు
సంస్కరణలతో సంస్కృతి సొరుపెంచి
తెలుగు రాష్ట్రాల యందున తేజమున్న
రాష్ట్రమే తెలంగాణంటు రవియె పలికె.

ఆ.వె.
నాటి ఇడుములన్ని నలిగిపోయెనిపుడె
కొత్త రాష్ట్రమందు కోరికలను
తీర్చు శుభములిచ్చు తీరునే కనుచుండు
చంద్రశేఖరుని సహనము గనుడి

తే.గీ.
ఇగురమే లేనివారంటు ఎందరన్న
స్వార్థ చింతన లేనట్టి సాలు మనది
కష్టమైనను సహనపు కరము కలిగి
ప్రగతి వైపునే నడిచేటి పట్టు మనది.

ఆ.వె.
ఇల్లు సక్క గున్న ఇగురాలు పెరిగేను
రాష్ట్ర వృద్ధి యందు నిష్ట కలిగి
పల్లె పట్న మిపుడు పనులలో నిలువగా
భవిత మనదె యనుచు కవులు అనిరి.



**పొట్లపల్లి శ్రీనివాసరావు**
1-402, రుక్మిణి సదన్, చాణక్యపురి, భీమారం,
హనుమకొండ, వరంగల్-15, చరవాణి: 9849254078
ఇ-మెయిల్: pottapally.poet@yahoo.com

331

# మానవీయ సంబురం

పాలకంకుల పసిడి పూతల జొన్న చేల సింగారం
వాని వరుసలు కలిపి అల్లుకునే ఆత్మీయరాగం
బతుకమ్మని ముద్దాడే తంగేడు పూల బంగారం
దసరనాడు కన్పించే పాలపిట్ట వయ్యారం
మిరప తోటల్లో వెల్లివిరిసే బంతిపూల సోయగం
దిశానిర్దేశం చేసే చారిత్రక వారసత్వం
తరతరాలుగా చెక్కుచెదరని సాంస్కృతిక ఔన్నత్యం
హరితవనాల్లో సేదదీరే జింకపిల్లల కాపాడే సున్నితత్వం
ఇదీ నా తెలంగాణా... మానవీయ సంగీతం.
ఆగమైన తెలంగాణ జనం బాట పట్టింది
సంపూర్ణ తెలంగాణ కొరకు సోయితో ఓటిచ్చింది
కడుపు కోతల తెలంగాణ ఇంటి పాటకే పట్టం కట్టింది
ఉద్యమాల చరితకు కొత్త ఒరవడి సృష్టించింది.
ఇప్పుడీ తెలంగాణ... పునర్‌నిర్మాణం కావాలంటున్నది
మిత్రులారా... అక్షర శిల్పులారా... రాజకీయ శక్తులారా
మూలాల్లోకి వెళ్ళి మనదైన
ఘన చరిత్ర అక్షరీకరించాలని
నెర్రెలు బారిన నేలల్లో ఆరుద్రలు పూయించాలని
నైతిక విలువల విద్యాసుగంధం విరజిమ్మాలని
ఉత్పాదక శక్తుల శ్రమ సంగీతమే మన గీతం కావాలని
పరాయి పాలకుల ప్రయివేటు విధానాలను
ఉప్పు పాతరేయాలని
పురావైభవ ఆనవాళ్ళను మెరుగుపరిచి పదిల పరచాలని
పర్యాటకమై పదుగురిలో తలెత్తుకు తిరగాలని
సమస్త వృత్తుల సబ్బండ వర్ణాలు సమైక్యంగా ఎదగాలని
నిరుద్యోగం అన్న మాటకు అసలెక్కడ తావుండరాదని
బేషజాలు లేని తెలంగాణకు భేషుగ్గా మనమంతా
ఒక్కటిగా స్వప్నించిన తెలంగాణ చేతులెత్తి పిలుస్తున్నది
మన ఆలన మన పాలనలో కలిసి నడవమంటున్నది.

పొద్దుటూరి మాధవీలత
ఎడపల్లి (మం.), బోధన్ (పోస్ట్), నిజామాబాద్ జిల్లా.
చరవాణి: 9030573354

332

# తడియారని జ్ఞాపకం

**నా** తంగేడు పూల వనంలో
తడి యారని జ్ఞాపకాలెన్నో
అస్తిత్వ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి
ఆరని సౌభాగ్యాన్నిచ్చిన పసుపు కొమ్మువు!
పాడి పంటలకు నెలవైన నా తెలంగాణ
వలసవాదం కోరల్లో చిక్కి విలపించిన పూట
మా నుదిటి రాతను మార్చి, అక్కునజేర్చుకున్న
అమ్మవు!
పసివాడే రెక్కలున్నా దిగులు చెందక
వాడవాడలా ఉద్యమ నినాదానివై గర్జించిన వీరమాతవు!
బతుకమ్మలో ఒదిగి మా బతుకు చిత్రాన్ని గీసి
మా తోడువై, నీడవై, ఆడబిడ్డవై
అమరుల త్యాగానికి ప్రతిరూపమై
పోరాడిన వీరుల పౌరుషానికి గుర్తువై
తరతరాల తెలంగాణ చరిత్ర పుటల్లో
చెరిగిపోని శాశ్వత నిధివైనావు!
బంగారు వన్నెతో పెద్దమ్మ మనసుతో
పసుపు వెన్నెలను అడివంతా పరిచేవు!
తెలంగాణ తల్లివై తెగువజూపిన నారివై
బతుకమ్మ పాటవై బంగారు బాటవై
సరికొత్త ఆశల వనవసంతానివై
తరలివచ్చే తంగేడు పువ్వా...
మా తడియారని జ్ఞాపకానివి నువ్వమ్మా.



**పోతన జ్యోతి**
చరవాణి: 9603114896

# 333

## శిరసెత్తిన తెలంగాణం

ఎందరో త్యాగవీరుల ప్రాణబలిదానం
మనం సాధించుకున్న మన ఈ తెలంగాణం
దశాబ్దాలుగా వలసవాద పాదాలకింద
అణచబడిన మన ఆత్మగౌరవం మళ్ళీ తలెత్తుకుంటోంది
దాయాదులచే వెలివేయబడి వెక్కిరించబడిన
మన బాస పత్రికల్లో పతాకస్థాయిలో కాలరెగరేస్తోంది
వాడి ఈసడింపులకు గురై
బిక్కుబిక్కుమంటూ మూలకు పడి ఉన్న
మన కళ, మన సంస్కృతి
ఇప్పుడు కాళ్ళకు గజ్జె కట్టి
రవీంద్రభారతి రంగస్థలంపై వీరంగమాడుతోంది
ఒకనాడు...
అవమానాగ్నిలో దహింపబడి కళాహీనమైన నా
తెలంగాణ
ఈనాడు...
సాధికారతా జ్యోత్స్న కిరణాలతో పునీతమై
కళకళలాడుతూ
తన ఆత్మగౌరవ పతాకాన్ని శిరస్సెత్తి విశ్వాంబరాన
ఎగరేస్తోంది.

పొన్నాల బాలయ్య
# 14-64/9/15 రెడ్డి కాలనీ,
హుస్నాబాద్ మండలం, కరీంనగర్-505 467 చరవాణి : 9908906248
ఇ-మెయిల్: ponnalabaliah@gmail.com

334

## వైద్యం

త్యాగాలతో తరిగిన పెయ్యిల ఏ భాగానికి బాధలేదు
తాంబాలమంతా పుదిచ్చుకున్న తండ్లాటల వరదేహం
స్తూపాలమీద పైరదిరిగే అమరత్వ పౌరుషం
తలదీసి తప్కులవెట్టి బత్కమ్మాడింది
ఆయాలు సాయాలు కార్జాలు కనుగుడ్లు దొప్పల
మిత్తిదీసి
ఉడుకు రక్తం సాకవోసిన ఉద్యమ దామిడి
ఆగమాగం ఆకాశంలో సుక్కలకు తాడేసి
ఉరివెట్టుకుని నిర్రనీల్గి ఊగులాడుతున్న జీవునం
తల్లి పాదాల దగ్గర పంచ ప్రాణం యిత్తార్ల వైద్యం
బెట్టింది పంచలపొంటి పాలినీడ పైతూరుతంది పోటికి
రా! దుఃఖాన్ని జోలెవట్టి అడుక్కుందువు గాని
అవును! మేము భావోద్రేకులం!!
తరతరాల మా నెత్తుటి జలపాతాలతో నేలను పచ్చగా
తడిపినం
తలాతోక లేని భూమండలం మీది సప్త సముద్రాల ఉ
ప్పుతనం
పుక్కిట్ల వడ్తె నాల్క తెగేంత గాథతే మా శ్రమ
సాబూత్ గావాల్నా!
రెక్కల దోసిలి జాపితే కుప్పలు కుప్పలుగా పసీన
పారుతది
రెండు అరిచేతులు నలిస్తే ఆయిష్ పోస్కున్న మట్టి
పంటను వాగ్దానం జేసే పరిమళం
ఇవి మొండి చేతులు! బవుదండి చేతులు!!
దప్పుదడ గులాబించి పోరుజెండ ఎగుర్తాంటె
ఏప్పుసలేని వేళ్ళనుంచే ఉద్భవించింది సృష్టి
ఓ యుద్ధ నైపుణ్యాలు దిద్దుకున్న సిద్ధహస్తాలు
అది గుండె కాదు! రాతి గుండె!!
సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పులు
రాళ్ళూరప్పలూ, బండరాళ్ళు, గుండ్రటి గుండ్లు
ఆయుధాలనెత్తి పోటెత్తి పొంగిన సాగర హారం
కారడ్డమాడా తాటిమట్టనా?
పాటలు కాపుగాసే తోటనే నాలుక!
అగ్గి సెండ్లను విసిరిన పోరాటాల కొలిమి
సుర్రు సుర్రున గాలె ఎర్రటెండ దగడు
ఆధిపత్యాన్నెదిరించే హక్కుల నెగడు
వాతలకు వయ్యలూడి ఉగ్గవట్టి ఊలుతోటే యుద్ధ
నినాదాల హోరు
నాగేటి సాల్లల్ల నడిసిన తీరు పొడిసే పొద్దును పొదిగిన
కాలం
కొంగుకు ముల్లెగట్టుకున్న నమ్మకం తెర్లు తెర్లయింది
ఇంటికొక్క ఇటుకా చేతికొక్క జెండా
సకల జనులు శిరసునెత్తుకున్న లడాయి
శ్మశాన చావుగీతాల గావు కేకలనుంచి
బంతిపూవులా విచ్చుకున్నది తెలంగాణ!

**పొన్నం రాజయ్య (గౌడ్)**
1-7-507/ఎ/2, జమిస్థాన్‌పూర్, రాంనగర్,
ముషీరాబాద్. చరవాణి: 9391286353

# 335

## భాగ్యనగరం

**భా**గ్యమ్మ మీ ఆడపడుచా
ఏరాలా... ఇయ్యపురాలా-
తెలంగాణ చరిత్ర తెలుసుకొండి!
భాగ్యమ్మ తెలంగాణ ఆడబిడ్డ
మా 'బిడ్డపేరు మీద నిజాం రాజు...
నిర్మించినదే 'భాగ్యనగరం' హైదరాబాద్
మొన్నటి వరకు ఐక్యతారాగంతో...
తెలంగాణ అంశం తుంగలో తొక్కి
నేడేమో 'హైద్రాబాద్' సున్నితం అంటున్నారు
సున్నితమో సూక్ష్మమో అదే మాకు మోక్షం
మీ నటనలు పక్కన పెట్టి మీ గుండెళ్ళో
తెలంగాణ ముల్లు దిగకముందే...
విజ్ఞత... విధేయతతో వెళ్ళిపొండి
యూటీ అంటున్నారు అంటే...?
లూటీ చేయాల్సింది ఇంకా ఏం మిగిలిందని!
'యూ' అంటే మీరు వెనుదిరాగాల్సిందే....
'టి' అంటే... మేం తెలంగాణ నిర్మించుకుంటాం
హైదరాబాద్ లేని తెలంగాణా...
బొడ్డురాయిలేని ఊరు ఒక్కటే...
ఇది 'మా భూమి' తెలంగాణ మాగాణి
పది జిల్లాల పిల్లల తల్లి
హైదరాబాద్ తెలంగాణ తల్లి
రవి అస్తమించని (బ్రిటిఘవాడే పారిపోయిండు)....
బందూకులతో రాజ్యమేలిన నవాబులే...
తలవంచుకుని 'భాగ్యనరాన్ని' ఇచ్చింగ్రు !
మా పోరాటాలముందు త్యాగాల ముందు
మీ చాణక్య నీతులు శకుని పాచికలు
రెండు కళ్ల సిద్ధాంతాలు చెల్లవుగాక చెల్లవు!
కాలగమనంలో కలిసి పోతాయి
ప్రాంతాలుగా విడిపోదాం
ప్రాణ స్నేహితులుగా కలిసుందాం!
హైదరాబాద్ తో కూడిన తెలంగాణ సాధించాం
బంగారు తెలంగాణను నిర్మించుకుందాం !
అమరవీరులకు ... కాలన్నకు........ జయశంకర్‌సార్‌కు
విప్లవ వందనాలు జై .... తెలంగాణ

పొన్నం రవిచంద్ర
7-2-990, పొన్నల కాంప్లెక్స్, కరీంనగర్ (పోస్ట్ & జిల్లా)
చరవాణి : 9440077499

336

## దీవించవే దయతో...

ఊరవతల... దారి పొడుగునా...
బీడు భూముల్లో... రాళ్ళల్లో, రప్పల్లో...
ఎక్కడ చుక్క వర్షపు నీరు పడకున్నా
పొదలు పొదలుగా చిగురించి
గుత్తులు గుత్తులుగా పుష్పించి
దారిన వెళ్ళేవాళ్ళ కళ్లని కట్టిపడేస్తాయి
తంగేడు పూలు....
సువాసన లేనివే
అయితేనేం
పల్లె పడుచుల సిగలో తూరి
సిగ్గులు ఒలకబోస్తాయి

కవుల చేతిలో సాహిత్యమై
జానపదుల నోట గీతాలై జాలువారుతాయి
తంగేడు పూలు..
ఓపిగ్గా కోసి దండ గుచ్చేవాళ్లుండకపోవచ్చు...
దేవుడికి అలంకరించి పూజలు చేయకపోవచ్చు
అయితేనేం...
బతుకమ్మలో అలంకారమై...
సాంప్రదాయానికి అపూర్వ ఆకారమయ్యాయి
అందుకే స్వరాష్ట్రంలో....
తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మలో చేరి
రాష్ట్ర పుష్పమై నిలిచింది.

ఆర్. విద్యాసాగర్‌రావు
హైదరాబాద్

# 337

## మీరు పెద్దవారు

మీరు పెద్దవారు - అబద్ధాలు చెప్పరు
యుగపురుషులు మీరు - చరిత్రను సృష్టిస్తారు
పొట్టి శ్రీరాములు ఆంధ్రకోసం కాదు ఆంధ్రప్రదేశ్
కోసమేఅసువులు బాసారు ఆత్మార్పణం చేసుకున్నారు
మీరు ఆనాడూ అన్నారు నిన్న అమరావతి సభలోనూ
సెలవిచ్చారు తుంగభద్ర ఒడ్డున అంగరంగ వైభవంగా
విలసిల్లిన కర్నూలునుత్యాగంచేసి మురికికి నిలయమైన
మూసీఒడ్డున మసకబారిన
మా అభాగ్య నగరాన్ని ఉద్ధరించాలనే మీరు వచ్చారు
అందుకే హైదరాబాదుకు 'హైదరాబాధ'
అంటూ మీ వ్యథను వెళ్ళగక్కారు
మీరడుగెట్టకముందు హైదరాబాద్‌లో ఏముండేవి
రాళ్ళూరప్పలు
మసీదుల, బురుజులపై వేళ్ళాడే గబ్బిలాల గుంపులు
మీరొచ్చాకే హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారు
ప్రపంచపటంలో హైదరాబాదుకు సుస్థిరస్థానాన్ని
కల్పించారు ఇదంతా మీ పుణ్యామే - మీరు తలపెట్టిన
ఘనకార్యమే మీరు విడిపోతే మేం అనాథలమవుతాం
అంధకారంలో కొట్టుమిట్టాడుతాం
మతకలహాలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతుంది
ఎక్స్‌ట్రీమిస్టులు, నక్సలైట్ల గన్‌ల మోతలతో
అగ్నిగుండమవుతుంది
మీరు నిజాలే చెప్పారు - మీరు పెద్దవారు
చరిత్రను వక్రీకరించరు - యుగపురుషులు మీరు
మీ పార్టీలోకి ఎవరొచ్చినా అభివృద్ధికి ఆకర్షితులై వస్తారు
స్వచ్ఛందంగా వస్తారు
ఆప్యాయంగా మీరు ఆలింగనం చేసుకుంటారు
మీ వారెవరైనా వేరే పార్టీలోకి వెడితే గొర్రెలు, పశువులు
చేర్చుకున్నవారు అవినీతిపరులు, చరిత్రహీనులు
మీరు చెప్తే అది వేదం - ఎందుకంటే మీరు దెయ్యం
కాదు దైవం మీరు అపర భగీరథులు, అభినవ
శ్రీకృష్ణదేవరాయలు
అమరావతిని సింగపూర్‌ని తలదన్నే అపురూప
నగరంగా తీర్చిదిద్దగల అమరశిల్పి జక్కనలు మీరు
అనతికాలంలోనే ఆంధ్రరాష్ట్రాన్ని దేశంలోనే కాదు
ప్రపంచంలో అగ్రగామిగా నిలిపే సమర్థులు
మీ రాష్ట్రంలో ప్రతిభావంతులు, అందుకే నీరాజనాలు
అవినీతిని ఏమాత్రం సయించరు, నిప్పుకణికలు మీరు
మరో రిక్వెస్ట్ భౌగోళికంగా విడిపోయాం
మా బ్రతుకులు మమ్మల్ని బ్రతకనివ్వండి
మీ రాష్ట్రాన్ని స్వర్గధామంగా మార్చుకోండి
మా వ్యవహారాల్లో తలదూర్చకండి
మళ్ళీ ఒకటవుతాం - మేమే రాజ్యమేలుతాం
వట్టిమాటలు కట్టిపెట్టండి - ఎడ్డి కలలు కనకండి
మీరు పెద్దవారు - మమ్మల్ని అర్థం చేసుకుంటారు
మీరు యుగపురుషులు - చరిత్రను తిరగరాయ
సమర్థులు.

ఆర్. చెన్నయ్య
పాలమూరు
చరవాణి: 9441615293

338

# బతుకమ్మపాట

బతుకమ్మ బతుకమ్మ-ఉయ్యాలో
మా ఊరి బతుకమ్మ ఉయ్యాలో
పడుచులంతా గలసి ఉయ్యాలో
పండుగజరిపిరే ఉయ్యాలో ॥బతుకమ్మ॥
ఆశ్వయుజమాసాన ఉయ్యాలో
పాఢ్యమి రోజున ఉయ్యాలో
మగువలంతా గలిసి ఉయ్యాలో
బొడ్డెమ్మలేపిరే ఉయ్యాలో ॥బతుకమ్మ॥
గుండ్రటి గంపలో ఉయ్యాలో
గునుగు పూలతోటి ఉయ్యాలో
చేమంతి పూలతో ఉయ్యాలో
తంగేటి పూలతో ఉయ్యాలో ॥బతుకమ్మ॥
పసుపు ముద్దనింపి ఉయ్యాలో
గౌరమ్మజేసిరి ఉయ్యాలో
అబలలంతాకలిసి ఉయ్యాలో
ఆడుతూ జరిపిరే ఉయ్యాలో ॥బతుకమ్మ॥
ఒకటవరోజున ఉయ్యాలో
ఎంగిలి పూల బతుకమ్మ ఉయ్యాలో
రెండవ రోజున ఉయ్యాల్లో
అటుకుల బతుకమ్మ ఉయ్యాలో ॥బతుకమ్మ॥
మూడవ రోజున ఉయ్యాలో
ముద్దపప్పు బతుకమ్మ ఉయ్యాలో
నాల్గవ రోజున ఉయ్యాలో
నానబియ్యం బతుకమ్మ ఉయ్యాలో ॥బతుకమ్మ॥
ఐదోరోజున ఉయ్యాలో
అట్లబతుకమ్మ ఉయ్యాలో
ఆరో రోజున ఉయ్యాలో
అలకలా బతుకమ్మా ఉయ్యాలో ॥బతుకమ్మ॥
ఏడవ రోజున ఉయ్యాలో
వేపకాయల బతుకమ్మ ఉయ్యాలో
ఎనిమిదవ రోజున ఉయ్యాలో
వెన్నముద్దల బతుకమ్మ ఉయ్యాలో ॥బతుకమ్మ॥
తొమ్మిదవ రోజున ఉయ్యాలో
సద్దుల బతుకమ్మ ఉయ్యాలో
అబలలంతా కలిసి ఉయ్యాలో
పువ్వులా దేవుళ్ళ ఉయ్యాలో ॥బతుకమ్మ॥
పూజలు చేస్తారు ఉయ్యాలో
నిమజ్జనం చేస్తారు ఉయ్యాలో
నీటి చెరువుల్లోన ఉయ్యాలో
ప్రకృతి పండుగే ఉయ్యాలో ॥బతుకమ్మ॥
పడుతులంతాగలసి ఉయ్యాలో
పండుగలు జరిపితే ఉయ్యాలో
సకల శుభములు గలుగ ఉయ్యాలో
సర్వజయములు గలుగ ఉయ్యాలో ॥బతుకమ్మ॥

**రమాదేవిదేశ్‌ముఖ్**
నిజామాబాద్.
చరవాణి: 9895284712

339

# రేపటి తెలంగాణ భవిష్యత్

**భ**రతమాత బిడ్డయైన మన తెలంగాణ తల్లిరో
భాగ్యలక్ష్మియై మనలోగిళ్ళకు వచ్చిందిరో
సాగుభూములన్నీ సస్యశ్యామలమ్ములై
సకల జనులందరూ వీర్య శౌర్యవంతులై
రీతెరిగి, నీతెరిగి మన మెదుగుదాం రండిరా
॥భరతమాత॥

పండుగలు, పబ్బాలన్నిటిలో ఆడి పాడి
పరిశ్రమలన్నిటినీ పట్టుగా స్థాపించి
ఉపాధులెన్నో కల్పించి, సంపదలూ పెంచుదాం
॥భరతమాత॥

తోటి వారెవరైన వారి తోడుదీసుకొని
చెలిమి బలిమి పెంచుకొని కలిమిని పొందుదాం
నిషామత్తు వదిలేసి, హుషారుగా ఉరకలేద్దాం
॥భరతమాత॥

చిరకాలపు స్వప్నమైన మన తెలంగాణ తల్లిరో
భాగ్యరేఖతో వచ్చి శ్రీసూక్తిని పలికెరో
అమూల్యాలంకారాలతో తెలంగాణ సౌష్ఠవాన్ని
పెంచుదాం
॥భరతమాత॥

రమావత్ దస్రునాయక్

340

## బంగారు తెలంగాణ అవుతుంది

నిన్న దగాపడ్డ తెలంగాణ
నేడు స్వేచ్ఛయైన నవ తెలంగాణ
రేపటి భవిష్యత్ అంతా అవుతుంది బంగారు
తెలంగాణ
అది కొత్త జంట లక్ష్మీ షాదీతో మొదలౌతుంది
కెజి టు పిజితో రూపుదిద్దుకున్నట్లయితే
పారిశ్రామికంతో ఉపాధి పొందినట్లయితే
పేదల సొంతింటి కల నెరవేరుతుంటే
పెద్దల మంచి పనుల విధానాలు తయారవుతుంటే
చిరునవ్వుల చిన్నారి వసతిలో బాసుమతి కడుపు
నింపుతుంటే
చెరువులు జలకళతో కళకళలాడబోతున్నాయంటే
చేనులు సిరి పంటలతో రైతు సస్యశ్యామలమౌతే
స్త్రీలు స్వయం ఉపాధి హామీతో హాయిగా ఉంటే
సరి, సిరి లేని శరీరాలు సరి అవుతుంటే
సకల కళాకారులిచ్చే కళతో ఆనందంలో ఉన్నట్లయితే
వాటర్ గ్రిడ్‌తో అందరి దాహం తీర్చుకున్నట్లయితే
విద్యుత్ వెలుగులో మరో సూర్యుడు తెలంగాణ
అయితే
భవిష్యత్ తెలంగాణ అవుతుంది బంగారు
తెలంగాణగా ఉంటుంది
అమర వీరులకు జోహార్లు



**రవీణ చవాన్**
బి4, సిల్వర్‌లైన్, ప్లాట్-29, స్ట్రీట్ 191, విమన్‌నగర్,
పూనే-421014

# 341

# దశావతారం మా తెలంగాణా

జర ఇనుకో జగమా ఇనుకో !
బంజరు కాదు బంగరు భూమి
రత్నాలు పుట్టిన రాజ భూమి
దశావతారాల దొరల భూమి
నా తెలంగాణ నా పుణ్యభూమి

ఎడ్లబాదు, ఆదిలాబాదు భూమిపైన వెలుగుతున్న
బాసర అక్షరజ్యోతులు
అందాల కుంతాల, పొచెర జలపాత ఝరులు
సుట్టూ కవాల్ శివరాం అడవుల సిరులు
అందాల ఆటబొమ్మలు నిర్మల్ సిత్రాలు
గోదావరి, పెన్‌గంగా ప్రాణహిత పరవళ్ళు
తెలంగాణ అందాలు

ఎలగందల, కరీంనగర్ల కొమరభీం యాద్గార్లు
ఆ గడ్డ దాసుకుంది సినారే, పీవీ నరసింహుని ఆనవాలు
మండుతున్న రామగుండం వెలుగు నింపి తరిమే
సిక్కటి సీకట్లు
భరతభూమికే తలమానికాలు సింగరేణి
నల్ల బంగారాలు
మేటి గ్రైనైటు రాళ్ల సిరులు
మా తెలంగాణకు గర్వ కారణాలు
ఖమ్మం గాడ్పుల్లో స్వాతంత్ర్యపు ఉద్యమాల శ్రీకారాలు
గొంతు తడిపి మురిపిస్తున్న కిన్నెరసాని
రిజర్వాయర్ హొయలు
లంబాడి కోయల అందెల నృత్యాలు,
కొండ రెడ్ల వెదురు అచ్చెరువుల

మెతుకుసీమ మెదక్ గుల్షనాబాదుగా ఆరబోసే
అందచందాలు
గుళ్ళు గోపురాలు మెదక్ చర్చి అందమైన కట్టడాలు
నర్సాపూర్, మంజీరా అడవుల్లో పశుపక్షుల లయ
విన్యాసాలు
శ్రీ ఉమా నాగలింగేశ్వర గుడి గోపుర గంటా నినాదాలు
ఇవన్ని కావా మా తెలంగాణకు అష్టైశ్వర్యాలు

అగో ఆ నడిమిట్ల నల్లగొండ సుట్టుకుంది పోచంపల్లి,
పుట్టపాక సొగసైన సీరెలు
నాగార్జున సాగరేమో కదం తొక్కి సూపుతుంది
ఉత్తుంగ తరంగాలు
యాదగిరి నరసన్న అభయమిచ్చిండు తెలంగాణమ్మకి
ఆశీస్సులు
భువనగిరి కోట పిలుస్తుంది పదిలంగా ఉంచమని
గత వైభవాల జ్ఞాపకాలు
తెలంగాణ వయ్యారం మేమేనంటు చాటుతున్నాయి
నందికొండ వాగువంకలు



ఇందూరు పేరుతో అలరారే నిజాంబాదు చెబుతుంది
నైజాము సర్కారు కీర్తులు
తన ఒడిలో లాలిస్తున్నవి తియ్య తియ్యని చక్కెర
కర్మాగారాలు
బడా పహాడ్, హనుమాన్ మందిరాలు చెబుతాయి
ఎన్నెన్నో మహత్తులు
మరువజాలమా నిఖత్ జారీన్ బాక్సింగ్, ఎందల
సౌందర్య హాకీ విన్యాసాలు
కరిగిన కాలం తిరగేస్తే చరిత చెప్పే ఎన్నో మరెన్నో
తెలంగాణ కథ కమామీషులు
రుక్మమ్మపేట పాలమూరు మా మహబూబు నగరు
సంగతులు
జోగులాంబ శక్తి పీఠం వినిపిస్తున్నది అమ్మవారి
అష్టకాలు
సురవరం ప్రతాపరెడ్డి రాతల్లో వెలిగిన తెలంగాణ
గొప్పదనాలు
భాగ్యనగర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణుని
నాయకత్వ లక్షణాలు
ఓరుగల్లు వరంగల్లు వేయి స్తంభాలు గొల్పు కనులు
మిరిమిట్లు

రుద్రమదేవి రాజసాల మెరుపు తీగలు మా తెలంగాణా
ఆడబిడ్డలు
ఇవి కావా మా తెలంగాణ చరిత చాటే వింతలూ
విశేషాలు

హైదరాబాదు సుట్టు గోడ రంగారెడ్డిల వెలుగుతున్న
సిరి వన్నెల సింగారాలు
కులమతాలకు అతీతమై అలరారు మా భాగ్యనగరపు
భాగ్యాలు
హైటెక్కు టాలీవుడ్ టెక్కులన్ని ఒలకబోసే వయ్యారాలు
ఎంతని చెప్పేది, ఏమని పొగిడేది మా తెలంగాణ
సిరుల విరులు
అంతం కాదిది ఆరంభం... జయకేతనమెగురేస్తారు
మా తెలంగాణ బిడ్డలు

జర ఇనుకో జగమా ఇనుకో!
బంజరు కాదు బంగరు భూమి
రత్నాలు పుట్టిన రాజ భూమి
దశావతారాల దొరల భూమి
నా తెలంగాణ నా పుణ్యభూమి



**రాజీవ**
4-39/ఎ, ఎల్లమ్మ తోట, మేడ్చల్-501 401
చరవాణి: 9849793914

# 342

## నువ్వొచ్చినావే!

అవ్వ నువ్వొచ్చావే
సంబురాలు తెచ్చావే
దోపిడీని అరికట్టి
దాస్యానికి అడ్డుపెట్టి ॥ అవ్వ ॥

ఏడాది అయ్యిందే
జొన్నరొట్టె హారంవేసి
సంకటి తీర్థంపోసి
నైవేద్యం పెట్టాలని ॥ అవ్వ ॥

కూలన్నకు రైతన్నకు
మహిళలకు ముసలులకు
రెండొద్దులు తిండుంటే
కండకలిగి కష్టిస్తరె ॥ అవ్వ ॥

జర్రంత సూడవ్వ
నీ జాతి ఆడపిల్ల
నింగినేల నీటిలోన
దున్నేసి నిలువగలరే ॥ అవ్వ ॥

సంకెళ్ళు పగలగొట్టి
ఉద్యమించి ఉరికినారే
అయిలమ్మలు సారమ్మల
ఆడోళ్ళ పేరులేనే ॥ అవ్వ ॥

కాల్మొక్తా అవ్వ నీకు
దునియాలో తెలంగాణా
బతుకమ్మ ఆడబిడ్డ
ఏలేలా చేయాలే ॥ అవ్వ ॥

రుద్రారం శ్రీనివాస్‌రెడ్డి
తాండూరు, చరవాణి: 9704743805

343

# తంగేడుపువ్వు

తెలంగాణా ప్రజల గుండెలలోతుల్లో
తళతళమెరుస్తూ
బతుకమ్మ ఉత్సవాల్లో బంగారు కాంతుల్ని నిల్పుతూ
అడవితల్లిని అలరింపజేస్తూ
నయనానంద భరితమై భాసిల్లుతోంది తంగేడు పువ్వు
హృద్యానందపు దీపికయై అలరారుతోంది
ఆ పువ్వుల నవ్వు
రోగాలను నయంజేస్తూ రాగాలను వినిపిస్తూ
ఆత్మీయ విరివనం తంగేడు
అనురాగాల నందనం తంగేడు
అమ్మవారిని ఆనందింపజేస్తూ
అనుగ్రహ వర్షం కురిపించమని అభ్యర్థిస్తూ
భక్తుల జీవితాల్లో సౌభాగ్య రేఖల్ని ప్రసరిస్తూ
తెలుగునాట వెలుగుకిరణం తంగేడు పుష్పం
తెలుగు కళల అలల కెరటం తంగేడు పూవనం
అందుకే! మేటి పుష్పమై మెరుస్తోంది
నేడు తెలంగాణ రాష్ట్ర పుష్పమై పరిమళిస్తోంది
ఈ దీప్తి అమరదీపమై వెలగాలని
మన తెలంగాణ సంస్కృతి
విశ్వమంతా విస్తరించాలని
అఖిల జగత్తుకు ఆదర్శం కావాలని
బతుకమ్మ తల్లిని ప్రార్థిస్తున్నాం
తంగేడు పువ్వుల్లో అభిషేకిస్తున్నాం
జై తెలంగాణ జైజై తెలంగాణ





**రాంచందర్ భీంవంశీ**
ప్లాట్ -10, దత్తగిరికాలనీ, జహీరాబాద్,
మెదక్ జిల్లా. చరవాణి: 995161919

# 344

## చెరసాల విముక్తి

చెరసాల విముక్తి పొందిన తెలంగాణ నేల
చెరువు కుంటలు కళకళలాడుతూ
పూర్వవైభవం పొందుతున్న వేళ
ఊటపొంగుల ఊరచెరువులు
కాకతీయుల గొలుసు చెరువులు
గ్రామసముద్రం గంగజలమును
ఆదరించిరి ఆసఫ్ జాహీలు కుతుబ్ షాహీలు
నిజామునాడు నిండు కుండలు
సీమాంధ్ర కుట్రలో శిథిల బండలు
అరవై ఏండ్ల పరాయీకరణ
చెరువును మింగిన అనకొండలు
రైతు గుండెపై రాతిబండలు ఆయకట్టుల నిరాదరణ
చెరువు కుంటల పునరుద్ధరణ
ఊరికి ప్రభుత్వ ఆదరణ మిషన్ కాకతీయ
ఎవుసం దశను మార్చివేయ చెరువుల్లో పూడిక తీయ
భవితకు పూలబాటవేయ కొంగబావలే ఎగురంగా
ఆకాశ గంగనే పిలవంగా శివగంగ పులకరించగా
పాతాళగంగనే పొంగంగా వజ్రాల వర్షమే కురువంగా
వాగులు వంకలు మర్లంగా గొలుసు చెరువులు నిండగా
ఊరివాడకు పండుగా పొంగి పొరలే చెరువులు
పెరుగుతుంది మన పరువు
సిలకలు జలకము ఆడంగా
రైతులు కిలకిల నవ్వంగా
ఎద్దు ఎవుసము మురువంగా
పశువుల మందలు పెరుగంగా
బంజరు భూమిలో బంగరు పుష్పాలు పూయంగా
ఆనంద బాష్పాలు రాలంగా
పాడు భూములు బీడు భూములు
నిగనిగలాడుతు నిండు గర్భము దాల్చంగా
నవరత్నాలు పండంగా
ముత్యాల రాసులే పొయ్యంగా
తెలంగాణ తల్లి మురువంగా ఇది తిరిగి రాసే చరితం
ధరిత్రి మురిసే తరుణం ఇది ప్రజా జల యుద్ధం
శ్రమదానంకై సిద్ధం ఇది కెసిఆర్ స్వప్నం
హరీష్‌రావు చేసే యత్నం జయశంకర్ సార్ సూత్రం
నిర్మించే నీటిశాస్త్రం నిజమైన ప్రజానేస్తం
అందించే అభయ అస్త్రం (హస్తం)
గళమెత్తి పాడే గాత్రం అమరుల ఆశలు పండగా
స్వర్గం నుండి చూడగా విశ్వానికే ఆదర్శం
మన తెలంగాణా ఎవుసం
మిషన్ కాకతీయతో
ధనవంతమైన రాష్ట్రం
శ్రీమంతమైన రాష్ట్రం
మన తెలంగాణ రాష్ట్రం.



రాజారాం ప్రకాశ్
మహబూబ్‌నగర్
చరవాణి: 9701141102



## 345

## నేడే తెలంగాణ

నేడే ఈ నాడే
జూన్ రెండు నాడే ॥నేడే॥
జనజాగృతి జోరునాడే
జగతిలో 'ఖ్యాతి' పొందెను నేడే
జన సంద్రం 'కాంక్ష' నాడే
జనం తెలంగాణ ఏర్పడే నేడే ॥నేడే॥
అరవై ఏండ్ల ఆరాటం
అలుపెరుగని పోరాటం
అమరవీరుల 'త్యాగఫలం'
ఆవిర్భవించెన్ తెలంగాణం ॥నేడే॥
జయ జయ గానం
జనులకి ధ్యానం
జనని తెలంగాణం ॥నేడే॥
సబ్బండ వర్ణాల సాగరహారం
సకల జనుల సమ్మె బాణం
సహాయ నిరాకరణ గొప్ప తరుణం
సాధించిన నేటి తెలంగాణం ॥నేడే॥

సర్వజనులది తెలంగాణ
స్వర్ణతెలంగాణం మన మాగాణం
స్వరాష్ట్రం సాధించిన వారం
స్వయం పాలన చేస్తున్న తరుణం ॥నేడే॥
నదులున్న ఈ ప్రాంతం
పసిడి జిల్లాల మాగాణం
పది జిల్లాల నేటి తెలంగాణ ॥నేడే॥
భావ సారూప్యం జయ కేతనం
బహురూపుల జనని చేతనం
భవిష్యత్తుకు నీరాజనం
నేటి తెలంగాణ బంగారం ॥నేడే॥



రామాచారి బంగారు

346

# ఆత్మలను అమ్ముకున్న వారు

నగదు రూపాలకు ఆత్మలను అమ్ముకున్న
పసలేని వాదుల కొనుగోలు మాటలు
పదునులేని కత్తులుగా మారి మాజాతి
శిశువుల గుండెల్లో బలవంతంగా దిగబడుతున్నాయి.
కొందరి మాటలు పూటపూటకు రెక్కలు లెక్కలు
కట్టుకుని
కాళరాత్రి దీపం పురుగుల్లా రోజులపాటు విసిగిస్తాయి
జీవితాలను క్షణాల్లో చిందరవందర చేసే చిత్రాల
మాటలు
క్షణికావేశపరులకు ఫలసిద్ధి చితి మంటలే మరి
బంతులెగరెస్తున్నవారు ఉదయభాస్కరులే
ఉజ్వలక్రాంతి రంగంలో బాలచంద్రులే
మండుతున్న ఉద్యమ సూర్యునితో పాటు
అణగారిన జాతి వేదనలకు వారసులు
పాత పాటల బసవన్నల నిలదీసెడివారు
అర్ధరాత్రి ప్రకటనకు సంబరపడ్డవారు
ఉరికొయ్యల ఉయ్యాలకు ఉక్కు గొలుసులకు
తమ తలలను పూసల పురికొసగా పేనుతారు
చెరుకుముక్కకు చేదుకాకరతో తలంటి
మానని పుండుతో ఎత్తుపడ్డ ఎద్దును
పొడుస్తున్న కాకి ముక్కుమార్కు
సిద్ధాంత వారసుల వ్యాకరణాలకు
సాచివేత, సాగదీత పెద్దల సుద్దులకు
మహానగర ప్రవేశ కూడలిలో తల్లడిల్లి
తగలబడి అగ్నికి తనువు అరువుగా
ఇచ్చిన ఉదజని పుత్రులు తారకలేమరి.
వందలాది అమ్మల కడుపు కోతల ఆక్రోశంతో
కన్నీటికడలిలో భాస్వరములు మండి
ఆవిరిగా గూడుకట్టిన శోకం తాను వానను కంటుంది
పంట భూములను చవిటి పర్రలుగా పరిమారుస్తుంది.
గ్లిజరిన్‌తో తెచ్చిపెట్టుకున్న దిగుమతి
ఏడుపుల ఎడారిలో సేద్యం చేస్తామంటూ
సానుభూతి రాబందులు సామూహిక కూటములన్ని
ఆరు నూరు అని పొంతనలేని తీరొక్క రాగాల
మాయాబజారు
విశాల స్వభావము తమదన్నవారు
మరింతగా వేచివుండుమని ప్రకటించిన
ప్రబుద్ధులు మాసిపోయిన రంగుల
విహీన విధ్వంస కలల ప్రపంచంలో
రోతకు పూసిన పూతన ముఖస్తుతి గణంలో
మరకగోడకు రాలుతున్న సున్నాలై ప్రకాశిస్తారు
మా వృత్తాంతంలో చిక్కిన శరణార్థిగతుల బ్రతుక్కు
నిలువ నీడనిచ్చి కాపాడుతున్న సంస్కారం మాది



**రామడుగు నరసింహాచార్యులు**
ఇం.నెం. 5-2-248/డి/33, శ్రీరాంనగర్ 8వ వీధి,
ఖమ్మం. చరవాణి: 9908330125

347

# తెలంగాణ రాష్ట్ర జెండా ప్రార్థన

ప॥ ఎగురు మా జెండా! ఎగురెగురు జెండా!
మన తెలంగాణకు జనజాగృతికి అండ!

చ॥ 1) జయశంకరుని గుండె చాటి చెప్పిన అండ!
చంద్రశేఖర సమరశంఖమూదిన జెండ
శ్రీకాంత త్యాగాలు జేలు బల్కిన జెండ
మేటి దాశరధీశ కోటి వీణల జెండ ॥ఎగురుమా॥

చ॥ 2) దశదిశలు జిల్లాలు! యశము గూర్చిన జెండ
గోదావరీ కృష్ణ గోల్కొండపై జెండ!
యాదగిరీశ భద్రాద్రి క్షేత్రంబులు
మణుగూరు సింగరేణి గనులు అక్షయములు ॥ఎగురుమా॥

చ॥ 3) కాకతి తోరణం మన తెలంగాణదే
జమ్మి వృక్షము పాలపిట్ట మన జాతికే
జింక మన జంతువు - చెంగు చెంగున ఎగుర!
తంగేడు బతకమ్మ తరుణులెత్తిన జెండ ॥ఎగురుమా॥

చ॥ 4) అన్ని జాతుల వారు అన్య సంస్కృతి వారు
ఐకమత్యము గల్గి అలరించు మన జెండ
విద్వత్తు విద్యుత్తు వెలుగు నింపిన జెండ
స్త్రీ బాల వృద్ధులాశ్రయము గూర్చిన జెండ ॥ఎగురుమా॥



**రామానుజం సుజాత**
కరీంనగర్.
చరవాణి: 970114302

# 348
## రేపటి ఆవిష్కరణం

దశాబ్దాల కాలం 'బందీ'
అయిన తెలంగాణ
సంకెళ్లు తెంపుకుని
రెక్కలు విప్పుకుని
తన అస్తిత్వాన్ని సంస్కృతిని
ప్రపంచం ముందు ఆవిష్కరించింది
అదిగో!
చీకటిని చీల్చి
వెలుగు కిరణమై
అంబరాన్ని అంటిన
సంబురాలు జరుపుకున్న
తెలంగాణ
ఇదిగో!
కార్మికుడు, కర్షకుడు
సామాన్యుడు, పాలకుడు
సమన్యాయం, సమహోదా,
సమగౌరవం, సమప్రాతినిద
పొందిన
రేపటి బంగారు తెలంగాణ
అదిగో! సామాన్యుడి ఆకాంక్షల ప్రాతిపదికన
సామాజిక ఆర్థిక ప్రాతిపదికన
ప్రజాస్వామిక విలువల పరిపాలన
నిర్మాణం

అదిగో!
కుల, మత, జాతి, వర్గ విభేదం లేని
అక్షరాస్యత, ఆకలి కేకలు లేని
భాసి తరాలు చిరునవ్వులు చిందిస్తూ
సిరి సంపదలు నిండి
హరిత హారాలైన మన పల్లెటూల్లు
రేపటి తెలంగాణాలో
అదిగో
ఏ భాషజాలు లేని సమిష్టి జనావళి
కృషితో
చేయి చేయి కలిపి పండించిన
అభివృద్ధి ఫలాలు దోసిళ్ల నిండ
అందుకొంటున్న, నువ్వు,నేను
మనందరం కడుపు నిండిన దృశ్యం
రేపటి తెలంగాణ అదిగో !
ఇదిగో ఇదే
ఆనాడి ఉద్యమ ఆరాటం, ఆశయం
మరి, ఆశయం నెరవేరిందా?
సరే సరి !
లేదంటే మరొక్కసారి అనివార్యమవుదాం
రండి
ఒక్క త్రాటిపైకి

రేడియమ్
రిటైర్డ్ తెలుగు లెక్చరర్,
చరవాణి: 9291527757

# 349
# వార్షికాభినందన

జయజయజయహో
వడివడి నిలబడి
జేగంటలు మోగించిన
నా తెలంగాణకు జయహో
అగ్నిధారలు కురిపించి
రుద్రవీణలు మీటి
రక్తార్పణ చేసిన
ధీవరుల తెలంగాణకు జయహో
భూ కామందుల
చేతుల్లో చెరబడ్డ నేల తల్లి
విముక్తి కొరకు
భుక్తి కొరకు... నలిగి కనలి
సై అని పోరుకు కదిలిన
రైతు బిడ్డల తెలంగాణకు జయహో
సాటి తెలుగువారు వచ్చారని
చీకటి బతుకుల్లో వెలుగు నింపుతారని
ఆశతో ఎదురుచూసి
అరవై ఏళ్ళు దాటినా
అదే వెట్టి బతుకులు
అవే వలస బతుకులు
అందుకే మరో పోరాటం
అందుకే మరో ప్రజా చైతన్యం
ఆత్మ బలిదానాలు
జ్వాల జ్వలన గీతం
సకల జనుల డమరుకం
ప్రళయనాదం
జయహో తెలంగాణ
జన సముద్ర ఘోష
భయపడి దిగాలుపడి
దిగివచ్చిన నేతలు
మీ రాష్ట్రం మీదేనని
చట్టాలు చేశారు
తెలంగాణనిచ్చారు
మన రాష్ట్రం... మన ప్రజలు
మన నేతలు... మన సౌఖ్యం
మన దుఃఖం... మనదేనోయి...
సంబురాలు జరుపుకుందాం
జయహో... జయహో...
తెలంగాణ అంటూ
కలిసి సాగుదాం
ప్రగతి వైపు దారని
నిక్కచ్చిగా చెబుదాం.



**రేళ్ళ శ్రీనివాస్**
కై కొండాయి గూడెం, ఖమ్మం జిల్లా.
చరవాణి: 7306773666

# 350

## మన తెలంగాణ

ఇదే మన తెలంగాణ ఇదే మన తరుల కోన
అరవై యేళ్ళ అలుపెరుగని పోరాటంతో
అమరవీరుల పోరు త్యాగాలతో
పది జిల్లాల ప్రజా ఉద్యమాలతో
పది జిల్లాల ప్రజా ఉద్యమాలతో
సిద్ధించిన తెలంగాణ చిరునగవులు వొలకించిన
తెలంగాణ
నాటి వీరుల నుండి నేటి యోధుల వరకు
పోరాడిన తెలంగాణాయే నాలుగు కోట్ల ప్రజలకు
నవ ఆశల సారధిగా సాగింది
నవజీవన ప్రగతివారధిగా నిలిచింది
మన బంగరు భవితకు పునాదిగా నిలుస్తు
మన జీవన మనుగడకు నాందిగా సాగుతు
మల కలల తెలంగాణగా మన సిరుల విహంగంగా
కదలాడుచున్నది కదం త్రొక్కుచున్నది
ఉద్యమాలతో ఉవ్వెత్తున ఎగిసిపడి
మహెూద్యమాలతో మహాప్రభంజనం సృష్టించి
సాగరహారంతో సమరసేనను తలపించి
సకల జనుల సమ్మెతో సర్కారుతో పోరాడి
అమరులను స్మరిస్తు తెలంగాణాకై తెగించి
ఉద్యమ ప్రజలకు ఉపశమనం కలిగించి
నవ తెలంగాణాగా అవతరించింది
మన తెలంగాణా అంబరాన్ని తాకింది
ఇదే మన తెలంగాణా ఇదే మన తరులకోన
జై తెలంగాణ జైజై తెలంగాణ

**ఎస్. వేణుశ్రీ**
క్వార్టర్ నెం. 44-1-99, 5-7-563,
హౌసింగ్ బోర్డ్ కాలనీ, కరీంనగర్- 001
చరవాణి: 9440064033

351

# ఎదురు నిలువు

సీ. నాదు తెలంగాణ నవ్యభావాలతో
నడుపగలుగనేని నాణ్యమొప్పు
వట్టిమాటలు కాదు గట్టి పనులజేయ
ఫలితమ్ము జనముల పంచజేరు
పాలివాళ్ళు మనల వంచన జేయగా
మనవాళ్లతోడనే మంట గల్పు
కలహాలు పెట్టుచు కయ్యమునకు దిగు
పాలన రాదంచు పల్కు చుంద్రు

తే.గీ. అట్టి వారల గుర్తించి మట్టిగలిపి
తెలుగు చరితము జగతిన తేజరిల్లు
కలిసి, పనిజేయ మనమంత కలిసియుండి
ఎల్లకాలము మోసాలకెదురు నిల్వు

సీ. తెలగాణ వంటల దెప్పి పొడిచినారు
భాష రాదంచును పల్కినారు
సంస్కృతి లేదంచు సంకల గుద్దుక
మభ్యపెట్టి మనకు మసినిపూసి
పాలన జేయుచు వనరుల గొనిపోయి
అరువదేండ్లు మనల అణచివేసి
తెలగాణ రాష్ట్రము తెచ్చుకున్ననుగాని
తగవుల బెట్టుచు తగలబెట్టు

ఆ. పాలివాళ్లనిచట పాతర వేయుడు
తెలివితోడ మనము తెగువజూపి
పాలనను జేయు ప్రగతి ఫలములందు
జనము మెత్తురయ్య జగమునందు

సీ. గుట్టల తొలువగ గూడు చెదిరిపోగ
జంతువులన్నియు జనముపంచ
చెట్లన్ని కొట్టగ చేటువచ్చెనుగదా!
ప్రకృతియంతయు నిట పాడు పడగ
జనుల పాణాలన్ని చావుడప్పులలోన
కాటికి దగ్గరై కాలమెల్లె
తెలగాణ జీవుల తేనెమనసులేమో
దానగుణములతో ధరణి నొప్పు

తే.గీ. ప్రభుత పాలనసేయగ ప్రణతికెక్కు
జనుల సంపద పెంచగ పనుల చెయ్యి
మదిని తలుతురు మిమ్ముల మనుషులెల్ల
తెలిసి, మెలిగిన తెలగాణ తేజమౌను



**యస్.పి. అన్నపూర్ణ**
బి2/105, సద్భావన టౌన్‌షిప్, పోచారం,
ఉప్పల్‌రోడ్, ఘటకేసర్.
చరవాణి: 9652932675

352

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**భూ**మి పచ్చదనంతో పులకరిస్తోంది
ఆకాశం బంగారు వర్ణంతో మెరిసిపోతోంది
జీవరాసులు ఈ ప్రకృతి అందాలతో ఉత్సవం
చేసుకుంటున్నాయి
చంద్రుడు మేఘాల మాటున దోబూచులాడుతున్నాడు
ఈ చల్లని రాత్రిలో చెట్లు శీతల పవనాలను
అందిస్తున్నాయి.
మానవ హృదయాలు ఈ ప్రకృతితో
పరవశించిపోతున్నాయి
ఒక స్వర్గం భూమిపై ఆవిష్కృతమైందా అన్నట్లు
తెలంగాణా అంతటా సంబరాలు
విభేదాలు మరిచి అందరూ అన్నదమ్ములవలె
కలిసిపోయారు.
ఈ క్షణంలో అందరి హృదయాల్లో ఉల్లాసం, ఉత్సాహం
గతాన్ని వీడి వర్తమానంలో అందరూ ఆనందంగా ఉ
న్నారు
నూతన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని
ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు
ఎలాంటి అరమరికలు లేకుండా మానవత్వం
వెల్లివిరుస్తోంది
ప్రకృతి పురుషుడు యొక్క మమేకత్వం
ఒక నూతన మనిషికి, నూతన సమాజానికి
జన్మనిచ్చింది
గతం గందరగోళం నుండి విముక్తియై
స్వేచ్ఛావాయువుల్ని తీసుకుంటున్నారు
ఒక నూతన ఉత్సాహంతో తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం
జరిగింది
వలస పాలకుల కబంధ హస్తాలనుండి విముక్తి పొంది
స్వేచ్ఛాసౌధంలోకి అడుగిడిన క్షణం
క్షణక్షణం నూతనత్వంతో తెలంగాణా ఆవిర్భావం
ప్రతిక్షణం పండుగలా, సృజనాత్మకంగా
అభివృద్ధిపథంలో సాగాలి
ఈర్ష్యాద్వేషాలు లేక అందరూ సమానత్వంలో ఎదగాలి
సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
నైపుణ్యంతో ప్రజ్ఞతో ప్రతి ఒక్కరు బ్రతకాలి
భారతదేశంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా నిలవాలి

**శారదా హన్మాండ్లు**
టీచర్, నిజామాబాద్.
చరవాణి: 9912275801
ఇ-మెయిల్: s@gmail.com

# 353

## బతుకు పుస్తకం

కొత్త పుస్తకం వాసన
అచ్చం తొలకరిలాగ
అవును తొలకరే
ఈ అక్షరాలు
ఎన్నేండ్ల కడగండ్లు కరిగి
జాలువారినవే కదా
నా ఘన చరిత
దుమ్ము దులుపుకొని
కాంతి దేహంతో మెరుస్తున్నది
సప్త వర్ణాలుగా చిత్రించాల్సిన
బాధ్యత నాదేగా
బాల స్వేచ్ఛను అనుభవిస్తూ
పేజీల రెక్కలు రెపరెపలాడుతున్నవి
కొన్ని అక్షరాలు
త్యాగాల శాలువాలో
గర్వపడుతున్నవి
మొన్న గుండెలవిసే సంఘటన
నేడు విజయకేతనం
ప్రతి శీర్షిక ఒక జ్ఞాపకం
షడృతువులుగా దాటుకొని
వసంతం చివరి మజిలీ
అప్పుడు యాసైన భాష
ఇప్పుడు నా ఇంటి ముచ్చటేగా
పెద్దర్వాజా నుండి
దేవుడర్ర దాకా అంతా నవరస భరితమే
ప్రతి గుండెలో ఒక ముందుమాట
రాయకుండానే రాసినట్టు
వరుసల్ని తేనెలెక్క సక్కంగ తీర్చుకోవాలె
అక్షరాలను సుక్కబొట్టోలె పేర్చుకోవాలె
కొత్త ఎవుసం లెక్క
కొత్త సంసారం లెక్క
అంతా అంతా కొత్త కొత్తగా గమ్మత్తుగా
కవర్ పేజీ అంతా బంగారు వర్ణమే నా రాష్ట్రం తీర్గ.

శిక గణేష్
2-4-123/9/4ఎఫ్, స్వరూప్‌నగర్, ఉప్పల్
చరవాణి: 9603698962

354

## ఆ గాజులు మాకొద్దు

పాతబస్తి చార్మినార్
రకరకాల గాజులకు ప్రసిద్ధి
తలుక్‌బెలుక్ హంగులతో
కొలువు దీరిన దుకాణాలెన్నో
మగువల మనసులు దోచే
అలంకార వస్తువులెన్నెన్నో
అన్ని అలంకార అందాల వెనుక
అంధకారమైన పసి ప్రాణాలెన్నో
హంగు రంగుల చమక్‌లతో
రాలద్దిన నైపుణ్యం వెనుక
సూర్యరశ్మికి కూడ నోచుకోని
బందీలైన పసిమొగ్గలు ఎన్నో
చీకటి ఇరుకు గదిలో గాలాడక
వాడిపోయిన పసిమొగ్గల మొకాలెన్నో
నవ వధువు నిండు పాలగ్లాసుతో
నిండు గాజులతో శోభన గదిలోకి
అడుగులేస్తుంటే ఆ అడుగులకింద
శోభ లేక అణగారిన పసిమొగ్గల బ్రతుకులెన్నో
మ్యాచింగ్ గాజులతో మురిపాలు
పడుచుల ఆనంద భావాలనంతము
అనంత భావాలకు ఆజ్యం పోసిన
బాలకార్మిక (జీవచ్ఛవాలకు) విమోచన ఎప్పుడో
ఆదిశక్తి కాళికాదేవికి అలంకరించిన
గాజులకు కదలిక వుండనట్లు, బొమ్మకు వేసిన తీరే!
అమ్మ ఒడి నాన్న లాలనకు దూరమై
మూగబోయిన మరబొమ్మలైరి
శ్రమదోపిడీల కార్ఖానాలో
250 పసి ప్రాణాలకు విముక్తినిచ్చిన
ఖాకీలే కలికాల దేవుళ్ళు!
భవితవ్యాన్ని కాలరాసే
చీకటి చెరసాలలింకెన్ని వున్నాయో!
కాకిదేవుడా నీవే వారికి దిక్కు.
దేశ విదేశాల్లో ఖ్యాతి గడించిన చార్మినార్
నీడలోనే మోసాలకు మారుపేరు చీకటి చరిత్ర
కాలరాయాలి ఇకనైనా మన నవ తెలంగాణ!!

శ్రీ పెరంబుదూరు నారాయణ రావు

355

# జై తెలంగాణ శుభమస్తు

మానవత్వానికి అధినేత పుడతాడు
శతాబ్దాల అనంతరం
విషమ పరిస్థితులలో అవతరిస్తుంది మన్వంతరం
తరిస్తుంది మానవత్వం
అవసరమైతే దేవుడు తానే ఎత్తుతాడు మానవావతారం
మానవత్వానికి అధినేత పుడతాడు
శతాబ్దాల అనంతరం
అపరాధాలు, అవరోధాలు రాజ్యమేలగా
పెరుగు ధరిత్రి భారం
ప్రజలవాణి వినిపించదు రాజ్యమేలు వానికి
పారదు ఏ రాయబారం పాలకునికి లేదు
పాలితుడికి ఉండదు తమ తమ నిర్వహణా స్పృహ
సత్యం, మర్మం మటుమాయం - వ్యాపించు అంతటా
నిస్పృహ అహితం, అత్యాచారం వ్యాపించు
తల ఎత్తు రక్తం రుచిమరిగిన శార్దూలం
పీడిత జనార్తనాదం వృథా
ఆకతాయికి తాయిలం, బలోన్మాదం
ఐనా మరచి పోరాదు -
దుష్టకంసుని దునుమాడ జరిగెను కృష్ణావతారం
శత్రువుని సైతం ప్రేమించమని చెప్పే బౌద్ధ బోధ సారం
జనుల మనముల మలినముల
ప్రక్షాళనచేయ నారాయణావతారం
నరుడో, నారాయణుడో తెలియకే
జరిగిపోవు జగతి ఉద్ధారం
విషమ పరిస్థితులలో... మానవత్వానికి అధినేత...
జనం మధ్య నుండి లేచి వచ్చాడు ఒక శ్రామికుడు
అర్థం చెప్పాడు మనకి ఇది శ్రమ.. ఇది కూడు.. అని
మరచిపోరాదు శ్రమతో సమకూరు సర్వం - అని
తీసివేసేదేదీ లేదు, ఒకదానితో ఒకటి కూడు
చక్కటి హైదరాబాదుని “హైదరా బ్యాడ్” అంటారే
ఇంకా ఎంత బ్యాడ్ చేస్తారు మా హైదరాబాదుని
డర్ గయా బ్యాడ్ బాయ్, భాగ్ గయా స్సాలా..
ఆడుకునే వాళ్ళని పరుగులెత్తించి ఆడుకునే వాడు
వచ్చాడు
జై తెలంగాణా తెచ్చినాడు
‘నేను సంపాదించి పెట్టిన జాగ్రత్తగా చూసు’కోండనే
వాడు ఎంతటి వాడో తేలుతుంది
రేవంత్ తేలు కుడుతుంది
వెన్నెలలు కురిపింప చంద్రశేఖరుడే దిగాడు
జై తెలంగాణ తెచ్చాడు - నిత్యకల్యాణం పచ్చతోరణం
ఇచ్చాడు ‘చంద్రశేఖర పాహిమాం’ అన్న వారికి అండగా
నిలుస్తాడు
శెహబాష్ చంద్రన్న అన్నవాళ్ళతో కొండగా నడుస్తాడు.
సర్వేజనాఃసుఖినోభవంతు జై తెలంగాణ శుభమస్తు.





శ్రీనివాసుగద్దపాటి
4-2-151/165/1/సి1, శ్రీనివాస్‌నగర్,
ఖమ్మం - 507 003. చరవాణి: 9951660789
ఇ-మెయిల్: vasu709@gmail.com

356

## కలవడ్డది

ఎనుకటి ఎతలన్ని యాదిజేసుకుంట
కష్టాలు నష్టాలు కన్నీళ్ళు కాలాలు
కలబోసుకుంట నే కూసుంటిని
కూసున్న కంటికి కునుకుబడ్డదొ లేదొ
కలవడ్డది నాకు కలవడ్డది
నిండుసూలాలోలె మా గుండ్ల సెరువు
మత్తడి దుంకేటి పరకపిల్లలతోని
కలకలా నవ్వేటి కలువ పూలాతోని
కతజెప్పుతున్నట్టు కలవడ్డది
కట్టమీదున్నట్టి తంగేళ్ళు జిల్లేళ్లు
తీరొక్కపూలతో తీర్థమాడినట్లు
తుమ్మీస్కలో గండుతుమ్మెదలో
నీల్లల్ల తానాలు ఆడుతూ ఉన్నట్టు
కలవడ్డది నాకు కలవడ్డది
ఊరిడిసిపోయినా బక్కకొంగలబారు
సిత్రంగ తిరిగేటి సీతకోకలగుంపు
తీరొక్క పక్షులు తిరిగొచ్చెటీదారి
మునుగుతూ తేలుతూ బుడుబుంగ గాడొకడు
ఒడుపుగా పట్టినా ఒల్లెంక చేపను
తుమ్మ కొమ్మాలెక్కి తృప్తిగా తిన్నట్లు
కలవడ్డది నాకు కలవడ్డది
ఆలమందలతోని ఈలపాటలతోని
అస్సోయి ఇస్సోయి ఐలేస్సరంగంటు
ఆటలాడుకుంటు పాటబాడుకుంటు
పనిపాటలోల్లంత పానంగ జూసుకునె
ఎండినా సెరువుకు పండుగచ్చినట్లు
ఏదేముడో వచ్చి వరమిచ్చినట్లు
ఎతలన్ని కతలన్ని ఎగిరిపోయినట్లు
కలవడ్డది నాకు కలవడ్డది



**శేషం సుప్రసన్నాచార్యులు**
వట్టెం, మహబూబ్‌నగర్
చరవాణి: 900245963

# 357

## తెలంగాణ రోడ్లు

ఇరువైపులా చెట్లతో వచ్చిపోయే వాహనాల రొదలతో
ప్రమాదాల రక్త కన్నీటితో క్షణం తీరికలేని రహదారి
నేడు ఉద్యమాన్ని ఆభరణంగా చేసుకొని
శోభాయమానంగా విరాజిల్లుతుంది!
జై తెలంగాణ! నినాదాల హోరుతో
కర్ణపేయాన్ని కలిగిస్తుంది
ఉద్యమ వంటావార్పు కోసం రసాలూరే వంటశాలగా
మారింది
సహపంక్తి భోజనాలకు విస్తర్లు పరిచింది?
ఇప్పుడు కర్ణకఠోరాల వాహనాల రణగొణ ధ్వనులు
మాయమయ్యాయి!
గంటెల సవ్వడి, గిన్నెల ధ్వని, పరిమళాల
పలకరింపులతో
తెలంగాణా ప్రజల పులకరింపుకు చేయూతనిచ్చింది
రోడ్!
తెలంగాణా ఆడబిడ్డల బతుకమ్మ ఆటకు తన
హృదయాన్ని
విశాలమైన చెరువుకట్టలా మార్చింది తొవ్వ
లయబద్ధంగా బతుకమ్మ పాట పాడుతుంటే ఆ
రహదారి
లయాత్మకంగా జోలపాట పాడినట్టు నిశ్శబ్దంగా
నిద్రపోయింది
ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు
అతిపెద్ద మానవహారానికి తానే పూలతోటగా మారి
తెలంగాణ జడతో
ఉద్యమహారానికి పల్లె పడుచయింది
క్రీడా ప్రాంగణమైంది, తరగతి గదిగా మారి తన
పిల్లలచే పరీక్షలు కూడా రాయించింది!
గర్జనలు, రణభేరులు, పొలికేకలతో ఒక దట్టమైన
అడవిగా మారి జనారణ్యాన్ని పోషించిన అడవితల్లిలా
అక్కున చేర్చుకుంది తెలంగాణా రహదారి!





శ్రీరామోజు హరగోపాల్
ఆలేరు, నల్లగొండ. చరవాణి: 9949498698
ఇ-మెయిల్: s@gmail.com

358

## ఐదు

నేల నా పొలం
నింగి నా తలరుమాలు
గాలి నా చెమటల ఆవిరి
ఎండ నా వెచ్చని వూపిరి
నా కన్నీళ్ళు ఇంకని సముద్రం
వాడిపోని వసంతాలన్నీ నా పొలంలోనే
మరిగిపోని రాత్రింబవళ్ళు నా కంటిలోనే
ఊపిరులూదే ఆశల సేద్యగాణ్ణి
రేపటి నక్షత్రాల సోపతిగాణ్ణి
పచ్చటి నేల, పచ్చటి నీరు, పచ్చటి ఎండ
పచ్చటి చందమామ, పచ్చటి ఆకాశం
నేనొక పచ్చటి వెలుగురాగాల ఏక్‌తారను
మిన్ను మన్ను నేకం చేసిన పాటను

జైగొట్టని దుక్కం లేదు, కైగట్టని నవ్వులేదు
కైగట్టరాని దేముంది ఈ లోకంలో
ఊకుంచడానియినా, చెప్పరాని బాధలయినా
పట్టరాని సంతోషమయినా, పట్టి దాచుకున్న పచ్చ రెక్క
ముచ్చట్లయినా
కైగట్టరానిదేముంది
పులకరించిపోయే కలలకు ఈ దేహం
పలవరించిపోయే వూహాలకు ఈ మోహం
నేను నాకే చాలని విశ్వాన్ని
నేను నాకే చిక్కని రహదారిని
నా లెక్కనె నా కవిత్వం కూడ
నా పక్కనె నా కవిత్వం నీడ

**సతీష్ అట్ల**
ఇంటి నెం. 18-5-115/1, కాపువాడ,
తోట్లవాడ, కరీంబాద్, వరంగల్-506002.
చరవాణి: 9849391432, 8885901432

# 359

## ప్రగతిబాట పడదాం!

వేరు తెలంగాణ కొరకు పోరు చేసిన
అమరుల ఆత్మ బలిదానాల సాక్షిగా
అరవై ఏళ్ళ కల అచ్చమై నిజమై
ఎదుట నిలిచింది
అయితే పోరాటం ఇంకా పూర్తికాలేదు
కేవలం భౌగోళిక తెలంగాణా
కాదు కదా! మనలక్ష్యం
బహుజన సామాజిక తెలంగాణ నిర్మాణమే
మన నిజమైన గమ్యం

వేరు తెలంగాణను కలగన్న స్వాప్నికులు
స్వప్న సాకారానికై జీవితాలను
ప్రాణాలను అర్పించిన యోధులందరికీ
ఘన నివాళిగా మన తెలంగాణాను
పాడియందు, పంటయందు
చదువు, కొలువుల యందు
సర్వ రంగాల యందు
అగ్రగామిగా నిలపాలి ఇది తథ్యం

సబ్బని లక్ష్మీనారాయణ

# 360

## జయహో తెలంగాణ జయ జయహో తెలంగాణ

నాల్గు కోట్ల ప్రజల కోర్కె - సాకార స్వప్నం
వేనవేల అమరుల - జ్ఞాపకాల పుష్పం
ఆటుపోట్ల బతుకుల్లో - ఒక ఆశాదీపం
సుదీర్ఘ స్వప్నాలు - ఫలించిన తరుణం

కొత్త పొద్దు పొడిచినట్లు - ప్రకృతి పులకించినట్లు
నింగి పొంగి పోయినట్లు - తొలకరి వర్షించినట్లు
కొత్త చిగురు తొడిగినట్లు - తెలంగాణ జననం
కొత్త ఆశ కొత్త వెలుగు - కొత్త బతుకు స్వాగతం

ప్రపంచపటం మీద - తెలంగాణ నవతేజం
స్వేచ్ఛారావానికిది - శాంతి విజయ సందేశం
పోరాట పటిమకిది - సాక్షీభూత సందేశం
వేనవేల అపజయాల - తుది అంతిమ విజయం.

కవులు కన్న కలలు - నిజమయ్యెను నేడు
ఉద్యమకారుల ఆశలు - ఉదయించెను చూడు
పల్లె పల్లె తెలంగాణ - పొంగిపోయె నేడు
బంగారు తెలంగాణ - భవిత ముందు చూడు.

మన స్వప్నం, మన ధ్యేయం - తెలంగాణ సాకారం
స్వాతంత్ర్యం, సమభావం - అడుగడుగున నిలుపుకొని
బడుగు, బలహీనులను - కలుపుకొని సాగుదాం
తెలంగాణ ఘన కీర్తిని - ప్రపంచాన చాటుదాం.

'సమతశ్రీ' వల్లాల పరంధామ్ యాదవ్
6-8-175/ఎ, శివరాంనగర్, నల్లగొండ-508 001
చరవాణి: 9985909046

## 361

# బంగారు తెలంగాణకు...!

ప. స్వాగతం సుస్వాగతం నవ తెలంగాణకు
అమరులా త్యాగాల రతనాల వీణకు ॥స్వా॥
అరువదేండ్ల పోరాట కలలా మాగాణకు
బంగారు తెలంగాణకు మణులా మాగాణకు ॥బం॥ ॥స్వా॥
చ1. ఉద్యమాలు చేసినాం ఊపిరులే వదిలినాం
లాఠీలకు తూటాలకు బలియయ్యిపోయినాం ॥ఉద్య॥
ఆటలే ఆడినాం పాటలే పాడినాం
తెలంగాణను మేలుకొల్పు పాటలే రాసినాం
సీమాంధ్రుల తరిమినాం రాష్ట్రం సాధించినాం ॥సీ॥ ॥స్వా॥
చ2. మన నీళ్ళు మన నిధులు మనకు కావాలనీ
మన కొలువులు మన నెలవులు మనకు దక్కాలని ॥మన॥
మన భాషా మన వేషం గౌరవించబడాలని
మన చరిత్ర మన సంస్కృతి మాన్యమైనదని తెలుప
సీమాంధ్రుల గెలిచినాం రాష్ట్రం సాధించినాం ॥సీ॥ ॥స్వా॥
చ3. బతుకమ్మలె ఆడుకొనా - బోనాలె పెట్టుకొనా
మన జాతరలను మనమే ఘనముగా జరుపుకొనా ॥బతు॥
అసైదూలాలాడుకొనా అలైబలైలందుకొనా
కులమత భేదాలు మరచి తెలంగాణ నిర్మించుకొన్నాం
పోరుబిడ్డలమై మనం రాష్ట్రం సాధించినాం ॥పో॥ ॥స్వా॥
చ4. దాశరథి అగ్నిధార కాళోజి కవిత పిడుగు
జయశంకర్ ప్రణాళిక కెసిఆర్ మన భూమిక ॥దాశ॥
కాకతీయ పథకంతో పరిశ్రమల స్థాపనతో
తెలంగాణ తల్లి నేడు పులకరించె పులకరించె
తొలి వసంత వేడుకతో పరవశించె పరవశించె
బంగారు తెలంగాణగ వెలగాలని ఆశించె ॥బం॥ ॥స్వా॥

సస్యశ్రీ
చరవాణి: 9948280908

# 362

## తెలంగాణ సూర్యుడు

పోరుగడ్డ బిడ్డవాడు
త్యాగానికి పోటుగాడు
తెలంగాణ తల్లికొడుకు
మేఘమల్లె ఉరుకుతాడు
ఉరుమల్లె పిడుగు వాడు
మెరుపల్లె మెరిసెటోడు
తెలంగాణ బిడ్డవాడు
కలం కత్తి చేసి
గళం గన్ను చేసి
గాయాలు చేసినా
గేయమై ఎగసినాడు
లాఠీలు విరిగినా
తూటాగా మారినోడు
నేలరాలి నింగికెగసి
నెత్తుటి జల్లు చల్లినోడు
తెలంగాణ తల్లికొడుకు
తల్లి తల్లడిల్లినా
కడుపు కాలి మాడినా
అడుగడుగున అవమానం
భరించినోడు
క్షణక్షణం నరకం చూసినోడు
నేనెవరి బానిసకాదని
నిగ్గదీసి చరిత్ర గతివి
తిరగరాసి నోడు
గోలుకొండ కోటపై వాడు
సూర్యుడై నిలిచినవాడు

సహచరి (కె. ప్రభాకర్)
చరవాణి: 9440970454

# 363
# స్వేచ్ఛాగీతం

అమరుల అమరత్వంతో తడిసిన నేల...
ఎందరో వీరులు రాలి కాలిపోయిన సందర్భం...
దశాబ్దాల కన్నీటి సాగరాల్లో ఏరులై పారిన తెలంగాణ
తల్లుల దుఖమయ ఆకాంక్షల ప్రతిరూపం..
గర్భశోకపు ఇవాల్టి తెలంగాణ ఆవిర్భావం!
సీమాంధ్ర వలసాధిపత్య సామ్రాజ్యవాద
దురహంకారంపై
టాంక్‌బండ్ విగ్రహ విధ్వంసాల్తో ధ్వంసం చేసి
గోల్కొండ కోటపై ఎగరేసిన ఆత్మగౌరవ పోరాటం మన
తెలంగాణ!
సకల జనులు సాగర హారాలై సమ్మెల్తో మిలియన్
మార్చ్‌ల్లో
నిర్బంధాల్ని ఛేదిస్తే - యూనివర్సిటీలు
పెల్లెట్స్‌ను బుల్లెట్స్‌ను మట్టిలో కలిపిన సమరభేరి మన
తెలంగాణ!
సకల జనుల స్వప్నం...
అమరుల ఆశయాల పతాకం
జయకేతనమై ఎగురుతున్న
మహోజ్వల ఆవిర్భావ సందర్భం!

అమరుడు ఆచార్య జయశంకరుడన్నట్లు
తెలంగాణ ఆవిర్భావం పది శాతం విజయమే!
ప్రజాకాంక్షలు - కష్టాలు, కన్నీళ్ళు, దోపిడి, పీడన
ఆధిపత్యం అంతం కావడమే అంతిమ విజయం!
కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలో
సకల జనుల ఆకాంక్షలు నలిగిపోకూడదన్న
ఆయన స్వప్నం నెరవేరాలి!
విశ్వనగరపు ఆకాశ హర్మ్యాల కింద
పది జిల్లాల ప్రజల ఆకాంక్షలు
ప్రైవేట్ రోడ్‌లు కాకూడదు!
యాదాద్రి ఓం నగర నిర్మాణాల్లో కడివెండులు
రాచకొండలు కనుమరుగై పోకూడదు
స్వేచ్ఛా సమానత్వం స్వయంపాలనలో
నీళ్ళూ నిధులు కొలువులు విద్యా వైద్యం సకల రంగాలు
స్వయం పాలనలో అందరికీ చెందాలి!
బంగరు వెన్నెల వెలుగు జిలుగులకన్నా...
ఈ మట్టిని తడిపిన అమరుల ఆశయాల ఆకాంక్షల
స్వేచ్ఛాగీతాన్ని గానం చేద్దాం!
సకల జనుల సంక్షేమం కోసం బాటలు వేద్దాం!



సామ లక్ష్మారెడ్డి
చరవాణి: 9948357595

# 364

## తెలంగాణ చరిత

ప. తెలంగాణ చరిత - మన
తెలంగాణ ఘనత
ఎంత విన్నను ----- సుంత
వినసొంపగు తెలంగాణ
పరవశించి పాడు - మన
తెలంగాణ పాట,
భయము లేక సాగు - మన
తెలంగాణ బాట. ॥తెలంగాణ॥

చ1. ప్రకృతి అందచందాల్లో
పరవశించు తెలంగాణ
జానపదుల రాగాల్లో
తేనెలొలుకు తెలంగాణ
పల్లె పల్లె గుండెలలో
మల్లె చెండు తెలంగాణ ॥తెలంగాణ॥

చ2. పంట చేల సిరులు తూగు
భాగ్యసీమ తెలంగాణ
తరుల గిరుల సౌందర్యం
తరతరాల తెలంగాణ
సర్వ కళల స్వరూపాలె
సత్సంపద తెలంగాణ ॥తెలంగాణ॥

చ3. తెలుగు పంట పండించిన
మధుర కవుల తెలంగాణ
సంకీర్తన లందించిన
సత్కీర్తుల తెలంగాణ
మంచుకన్న తెల్లనైన
మచ్చలేని తెలంగాణ ॥తెలంగాణ॥

చ4. మెరిసేటి ముగ్గుల్లో
మురిసింది తెలంగాణ
రంగులీను బతుకమ్మల
రమణీయమె తెలంగాణ
సింగరేణి గనుల సిరుల
బంగారమె తెలంగాణ ॥తెలంగాణ॥

చ5. ఆప్యాయత అనురాగం
ఆహ్లాదమె తెలంగాణ
మంచితనమె మించు వరము
మణుల మయము తెలంగాణ
జన్మ భూమి రుణం దీర్చు
జననీ మన తెలంగాణ
జయ జయహో తెలంగాణ
జయ జయహో తెలంగాణ ॥తెలంగాణ॥

శ్రీరాములు

# 365
## వీర కొమరం

నారు పొయ్యనోడు నీరు ఇవ్వనోడు
నోటికాడి బుక్క నేలకేసి కొట్టినోడు
కొలువు ఇవ్వలేనోడు
పండగలకు పబ్బాలకు పన్ను అడిగినోడు
ఇవ్వకుంటె అలిగినోడు
అలిగినా ఇవ్వకుంటే అధికార బలంతో
ఆడపడుచుల మానప్రాణాలతో విచక్షణారహితంగా
వెంటాడుతున్న తరుణంలో
అడవితల్లి బిడ్డలైవుండి క్రూరమృగాలతో లేని భయం
నిజాం దళారి రజాకార్ల దాడులకు
గోనెసంచుల్లో తలదాచుకుంటున్న తరుణంలో
గోండు మల్లెలతో ఎర్రచందనం సిరులతో గుభాళించిన
గులాబి
భయానికే పాలికేక గుబులు పుట్టించే గాంభీర్యంతో
రజాకార్లకు కొన ఊపిరి రుచిచూపించిన వీరుడు
సాయుధ పోరాటానికి శంఖం ఊదిన ఉద్యమకారుడు
అరుణోదయ ఆరంభానికి ఆరాధ్యుడు కొమరం
భీముడు.



సిద్దగౌని సుదర్శన్
చరవాణి: 9701703684

# 366

## బంగారు తంగేడు

తల్లడిల్లిన తెలంగాణకు
తల నిమిరిన తల్లి తంగేడు
చీకటి నిండిన బతుకుల
వెలుగు దివ్వె తంగేడు
తెలంగాణ పూల తల్లి
తంగేడు పాలవెల్లి
ఆకు పచ్చని చీర
పసుపు పచ్చని చీర
పసుపు పచ్చని అంచు
తంగేడు పువ్వు
బంగారు పువ్వు
తొలికరిలో తొలిపొద్దు నువ్వు

బతుకమ్మకు బతుకునిచ్చిన పువ్వు
గౌరమ్మకు గౌరవమిచ్చిన పువ్వు
తెలంగాణ ఆత్మగౌరవం నువ్వు
ఆడపడుచుల ఆరాధ్యదైవం
తెలంగాణ సాంస్కృతిక సౌరభం
పరాయి పాలనలో
పాతబడిన తల్లి
స్వరాష్ట్ర సాధనతో
తేజరిల్లిన తంగేడు
తెలంగాణ వెలుగు నీవు
బంగరు తంగేడు పువ్వునీవు

సిద్ధార్థ
చరవాణి: 9603318460

367

## నిద్ర కాంతి

నెత్తురు కక్కుతున్న గడియలు
రాత్రులు రోజులు గడియారాలు
నెత్తురే పుట్టి నెత్తురే నడిచిపోతుంది
నెత్తురు పడగ పటపటా తెగుతుంది
నమ్మకం పుండై విచ్చుకుని పగులుతుంది
నిద్రకాంతి....
చర్మంతో బుగ్గలూది వదుల్తరేందిరా
ఎగిరెగిరి ఎగిరెగిరి ఎగిరెగిరి టప్‌మని పగిలి
కను గుడ్లొలికి జీవవాకిలి కూలి
తనకోసమే కాక తనను నమ్మినోల్లకోసం
నడుచుకుంటూ...
నెత్తుటి గుండంలోకి నడిచొచ్చినంతా....
సగమాకలి తీరలేదు, సగమెంగిలి ఆరలేదు
దుఃఖం పొలమారనే లేదు, సుఖం కలలొలుచు
దేవుడు దెయ్యం ప్రాంతం
యాసల భాషల కలెగూరల వొంటలు
వొండుకొని తినకనే పోతిమి
పొయిరాళ్ళు వేరే పెట్టకనే పోతిమి
ఊర్నించి ఇంకా సామాన్లు పూరగదిగకనే పాయె
ఉంటున్న గల్లీ పేరు తన నావొల్లకు చెప్పకనే పోతిమి
మొదటి త్యాపకొచ్చిన జీతం అమ్మకు జూపియ్యకనే
పోతిమి

ఎక్కడ్నుంచో... ఎవలో...
సెల్ నొక్కిర్రేందిరా...
నడుస్తున్న రోడ్డే కరుస్తుందేంది
నడిపించే చెయ్యే పొడుస్తుందేంది
పెయ్‌లోకి దిగిన గోలీకి సత్యం తెలిసినా
చెబుతాదానె అమీనక్కా
మనల్ని రోజా నమ్మకాలతో కరిచేకుక్కలు
ప్రచారమంతా రేబిస్ సోకి
బతుకు పిచ్చెక్కి పోతున్నది
ఎవ్వని సిన్మా వానికి, ఎవ్వని పంకా వానికి
చేతులు బ్రిడ్జిలేస్తయ్... రోడ్లేస్తయ్
డ్యాములు కడ్తయ్
ఇండ్లూ... గుండ్లూ శ్మశానాలూ కడ్తయ్
పైసల కోసం ఏమైనా జేస్తయ్
పైసల్ని పైసల్ని విసర్జించే లోకం
అంతా తలరాతలోని రోత
ఈ దీపాన్నెప్పుడు కొండెక్కిస్తమో ఏమో
డప్పు రాజక్కా.... ఎయ్యే దెబ్బా....
ఇక్కడందరూ మొగోల్ల మనుకుంటున్నారు గాని
ఎవలూ లేరిక్కడ
విరాన్ జాగా... హైరాన్ దునియా...

సిద్దినబోయిన వెంకట్ యాదవ్
చరవాణి: 8885525256

# 368

## పాలపిట్ట

బీరాలు పలికి మీసాలు మెలేసినవాడు
పారిపోయిన దగ్గర తంగెళ్లు విరపూస్తున్నాయి
పరిపాలన రాదన్న పరాయోడు
ప్రతి పథకం నకల్‌గొట్టి
అత్తెసరుతో పాసవుతడు
బట్టలెండేసిన విద్యుత్ తీగలు
విద్యుల్లతలై మెరుస్తున్నయి
ముడతలు పడి ముసలివైన
కరెంటు బుగ్గలు
పదారేండ్ల వయసు లెక్క వెలుగుతున్నయి
అపుడు నీరు పల్లమే (ఆంధ్రానే) ఎరుగు
ఇపుడు నీరు తెలంగాణ కెగురు
కాకతీయుల ప్రేమ చెరువు మత్తడై పొంగుతుంది
సంతోషం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది
ఇప్పపువ్వు నిషా లెక్క మనసంతా పాకుతుంది
ఆనందం గజ్జెకట్టి ధూంధాం సింగిడై నిలిచింది
అడిగినోడికి వరాల పంట పండుతుంది

అడగనోడే పాపాత్ముడు
బంతిల అన్ని మూలలను
మంచిగా అరుసుకుంటుండ్రు
ఎందుకంటే వడ్డించే వాళ్ళంతా మనవాళ్ళే
సార్! అందరిని కలుపుకుపోవాలి
నిజమే! కాని, కలుపును పీకేస్తూ పోవాలి
లేకుంటె కలుపే తోటంత
కలె కలుపుకు పోతుంది జాగ్రత్త
అత్యాశ అనుకోక పోతె ఒక్క కోరిక
అవినీతిని అంతం చేస్తేనే
బంగారం ఇంకా నిఖాలస్ అయి మెరుస్తుంది
ఇపుడు కాలం కారెక్క ఉరుకుతుంది
రంగుల కలలు కన్న మా భూమి ఇది
కల కళలుగా వర్ధిల్లుతున్న
తెలంగాణ భూమి ఇది
స్వయంపాలన పలుకుతున్న
పాలపిట్ట ఇది.

**సిద్దెంకి యాదగిరి**
మెదక్.
చరవాణి : 9441244773, 8341884448

369

## గెలిచిన కల

వతందారి నేలను వల్లకాడు జేసిన
ఆరున్నర దశాబ్దాల అక్రమపాలనకి
ప్రజాక్షేత్ర శ్మశానంలో
తల గొరివి  పెట్టింది
బతుకుల్ని చిదిమిన చరిత్రలో
రాలిన వేల పానాల సాక్షిగా
అమరులు అల్లిన సర్వ్యగంప
పరువుతో నెత్తికెత్తుకొంది ప్రజాస్వామ్యం
ప్రజాకంటకం
దుర్మార్గపు ఏలుబడి దురంతం
దురాలోచన పేకమేడల్ని
కన్నతల్లుల కడుపుకోత శోక ప్రవాహం
పోరాట సునామి కెరటాలై
సమైక్యత ఇనుప సింహాసనాన్ని కూలదోసింది
పొద్దుగుంకేయాల్ల సూర్యుడు
కాలం కత్తికొన మీద కాంతిరేఖ నిలుప
అరువైతొమ్మిదిల వీరుల జీవార్పణ వైద్యం
మలిదశలో వినిపించిన మరణ వాంగ్మూలాలు
రణమృదంగ బలియాగాలు
'జై తెలంగాణ' నినాదపు దేహ దహనపు మంటలు
శిథిల చరిత్ర శకలాలై
రక్తాక్షరాలు ముద్రించిన బిల్లు
పార్లమెంటులో ప్రత్యేక రాష్ట్ర శాసనం నెగ్గింది
ఫ్లోరోసిస్ వంకర్లు లేనిబతుకులకై
దప్పిక గొంతుల్ని తడపని నీళ్ళు
దాహార్తి తలరాతల్ని మార్చేందుకు పరవల్లు దొక్కాలి
అమరుల ఆశయసాధనలో
అవినీతి రహిత భవితను
అసమానతలు లేని బహుజన ప్రజాస్వామ్య
తెలంగాణం
గెలిచిన కలను బహుచక్కగ నిర్మించుకోవాలే...





సిరిసిల్లా గఫూర్ శిక్షక్
కామారెడ్డి

370

## గళమెపుడూ

గళమెపుడూ గర్జిస్తూనే ఉంటది
పాటగా మారి పరామర్శిస్తూనే ఉంటది
నీ నీడైన గళం, నీ తోడైన గళం
అభిమానుల గుండెకోటలో
రాజుగా నిన్ను నిలిపిన గళం
డప్పుడోలకు చప్పుడుతో
నీ జతైన గళం ఆ గళానికి ప్రజల బాధ తెలుసు
సమస్యల హోరు తెలుసు సముద్ర అలల శబ్దాలను
గుండెలో దాచిన గళమది మండె బడబాగ్నిగా
పాటగా పోటెత్తిన గళం ఆ గళానికి
కాలిగజ్జెతో నాట్యమాడటం తెలుసు
ఆ గళానికి
ప్రజాచేతన నవ భావమవ్వడం తెలుసు
ఈ గళంలో వీరుడి వ్యూహం
పల్లవిగా మోగుతుంది
ఈ గళంలో భావ స్పష్టత
నిప్పుల ప్రవాహమై సాగుతుంది
ఈ గళం ఓ దరువు ఈ గళం ఓ చెరువు
చిమ్మచీకటి దారిలో
అడవిచెట్ల కొమ్మల నినాదం
పోరాట దారిలో
వీరుడి ధైర్య గర్జననాదం ఈ గళం.

ఆ గళం బాధల, సమస్యల
పరిష్కార స్వరాల శిక్షణ
ఆ గళం సగటు మనిషికి ఇలలో
నిజమైన రక్షణ జన సమూహం నుండి
నువ్వు వీడినప్పుడు
నీ అడుగులు ఒంటరివై నేలపై పాకినపుడు
ఆలోచనల ప్రతిఘట్టం ప్రశ్నగ ఎదురయ్యినప్పుడు
బాధ నిండిన హృదయంలో
ఆ గళం బాధ్యతల జీవమవుతుంది
వేదన మనసుల పోరులో మేధస్సు సంఘర్షణలో
ఆ గళం ప్రశ్నల లక్ష్యం
జవాబవుతుంది.
ఆ గళం ముందెపుడూ...
ఎత్తిన పిడికిళ్ళే...
ఆ గళం ముందెపుడూ...
ఎత్తిన జెండాల జాతర్లే...
అది జీవిత గరళాన్ని దిగమింగిన గళం
అది పోరుపాటకు ప్రాణమిచ్చిన గళం
మనిషి, మనసుకు బలాన్నిచ్చిన గళం.
ఆ గళమెపుడూ అలసిపోదు
కొత్త కొత్త స్వరాలతో సమస్యల పల్లవులతో
గళమెపుడూయ గర్జిస్తూనే ఉంటది.



సీతారాం
చరవాణి: 9866563519

371

## డాక్టర్ బాబు

ఇంత దుఃఖాన్నెలా మోస్తున్నారు
ఇంతటి భారాన్నెందుకు వహిస్తున్నారు
ఇదంతా ఎందుకు రాస్తున్నారు
ఈ ఉపఖండపు చీకటిని
ఏ అక్షరంతో రక్షిస్తున్నారు
ఏ వెలుతురు చీపురుతో ఊడుస్తున్నారు
మీరెందుకిలా నిట్టూరుస్తున్నారు?
మనుషులమే మనమూ మతాలమే మనమూ
మమతలమే మనమూ బాధితులమే మనమూ
బాధితులమే-బోధిసత్వులమే డాక్టర్ బాబూ!
ఏమిటి నేర్పుతున్నారీ జగతికి
మరేమిటి నడుపుతున్నారీ జగతికి
సత్యాన్వేషణలో కడులజ్జతో
దేన్ని దేవులాడుతున్నారు
చీముల్లో చీమల్లో  చేలల్లో చేవల్లో
రకరకాల రక్తాల్లో రక్తాలతో
నెత్తురు సంచుల పగుళ్ళలో
హెచ్ ఐవి వైరస్ వ్యాప్తిలో
సప్తమ అంతర్ధానంలో
యుగాంతంలో-యాగాంతంలో
ఏ తక్షకుల పాంసనులకు ఈ హితవు?
మృత్యువులో జననంలో
జ్వలనంలో ఈ జ్వరంలో
స్వజనంలో ఏమిటి సంభాషిస్తున్నారు
మరేమిటి సృజిస్తున్నారు.
ఈ జన నర్తనంలో
ఈ జన్యు పరివర్తనలో ఉత్పరివర్తనలో
ఏ క్రమాన్ని చూస్తున్నారు
ఈ సంతలో ఏమిటి విక్రయిస్తున్నది మీరు
ఏది అమ్ముతున్నారు దేన్ని నమ్ముతున్నారు
మీరేమవుతున్నారు?
నిజం డాక్టరు బాబు
ప్రజలంతా ఎదురొచ్చి మరీ మరీ తుమ్ముతున్నారు
హితవరులను తరుముతున్నారు
అంతా సంశయమే డాక్టర్
శరీర ఘటనంబంతా
లోనంతా మేనంతా
దుర్వ్యాపారమే దుర్వాణిజ్యమే
దుర్వ్యాజ్యమే అంతా దుస్సహమే దుర్లభమే
ఇప్పుడిక ఏ స్వర్గమూ మరి రాదు
ఉన్నదొకే నరకం మనముందున్నదొక ఉపఖండం
మనమున్నదొక అగ్నిగుండం
మనముందున్నది వెనకున్నది రానున్నది
గండమే...!



**సుజాత ముదిరాజ్**
251/3, సిద్ధార్థ టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్, మేడ్చల్,
రంగారెడ్డి-50-1 407 చరవాణి: 9603549096
ఇ-మెయిల్: siddharthamedchal@gmail.com

372

## ఆకాంక్ష

గాయాల గేయాలతో సాధించుకున్న తెలంగాణ
నాటినుండి నేటివరకు మనం, మనది
అన్న తాపత్రయం నెలకొంది అందరిలో.
తెలంగాణ అవతరణ వేడుకలు వచ్చాయి
అత్యంత వైభవంగా పది జిల్లాల్లో ఉత్సవాలు
ఆకాశాన్నంటాయి
ఈ ఉత్సవాలు అంతర్జాతీయ స్థాయిలో అధిగమించాయి
చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండ
గడిచిన వారం రోజులు ఎన్నడు లేని ఆనందాన్ని
నింపుతు
పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది అందరిలో.
సాధించుకున్న మన తెలంగాణలో గడిచిన
సంవత్సరములో
మిషన్ కాకతీయ, వాటర్‌గ్రిడ్, కల్యాణలక్ష్మి, శాదీ ముబారక్
ఎన్నో మహత్తర కార్యక్రమాలు అందరి కొరకు
అన్నట్లుగా ఉంటే
దొరికినోడికి దోచుకున్నంత అన్నట్లు ఉంది
మరికొందరికి
పైసా మే హై పరమాత్మ అన్నట్లు పైసలు లేనిది పనులు
జరుగవాయే
ప్రభుత్వ ఉద్యోగులే మన ప్రభుత్వం అన్నారు కాని
అందరు చేయి చేయి కలుపుతేనే వచ్చింది
మన తెలంగాణ అని మరిచారు
తెలంగాణ వైభవాన్ని చాటుతూ ప్రతి ఏటా ఇలాగే
సంబరాలు జరుపుకోవాలి "అందరూ"

సుతారపు వెంకట నారాయణ

# 373

## చెరువు

చెరువమ్మా చెరువమ్మా
మా పాలిట నీవు కల్పవల్లివమ్మా
పల్లె పల్లెకు నీవు
ప్రగతి నిచ్చినావు
నీడ ఇచ్చినావు మాకు
నీడ ఇచ్చినావు మాకు
కనులు తెరిచిన వేళ నుండి
కనులు మూసే వరకు
నీదు సహకారంబు మాకు
నిత్యకృత్యంబు
రైతన్నకు ఎరువునిస్తివి
పలు విధాలుగ పంటలనిస్తివి
జీవులెన్నిటికో నీవు
జలము నిచ్చి రక్షిస్తివి
కుమ్మరికి మన్నునిస్తివి
వడ్రంగికి కట్టెనిస్తివి
చాకలికి రేవువైతివి
మంగలికి మనుగడవైతివి
తనువునే చేయూతగ నిచ్చి
తల్లివలె ఆదుకుంటివి
పిల్లల ఆటలు నీ దాపు లోనే
పెద్దల పాటలు నీ దాపు లోనే
తెలంగాణ సంబురాలు
అంబరాన్ని తాకుచున్న వేళ
కలిసి కట్టుగాను మనం
కదం కదం కలిపి సాగుదాం.



సుదర్శన రెడ్డి కట్టా

# 374

## ప్రేమ దీవెన

తల్లిచూపులో మెసలుతుంటే ప్రేమదీవెన అందుతుంది
మంచిదారిన పొసగుతుంటే గొప్ప భావన అందుతుంది.

మానవత్వము వదలకుంటే ఎల్లవేళల జయంవెంటే
రొంపివాడిలో కలువవున్నా పూజచక్కన అందుతుంది

మంచితనము వాడకుంటే ఎక్కడున్నా మనిషి జయమే
కంపపొదలో మల్లెలున్నా మంచివాసన అందుతుంది

సత్యవర్తన మానకుంటే రెండు మనసుల నిండుదనమే
భేదభావం ముసురుకున్నా స్నేహవీవన అందుతుంది

సమ్మతాలు కూడివుంటే హృదులనిండా సుధల బలమే
సామరస్యము చేరుకొనగా మోహవంతెన అందుతుంది

సుప్పని సత్యన్నారాయణ
అధ్యక్షులు - భీమన్న సాహితీ పీఠం, కోనాపూర్ (పోస్ట్)
బాన్సువాడ (మం.) నిజామాబాద్ జిల్లా.
చరవాణి: 9492626910

375

# మాతృవందనం

అమ్మా.. నీ రాకతో
అవని పులకించింది
తెలంగాణ శివమెత్తి
తాండవం ఆడింది.
ఆంధ్ర వలసపీడ అంతరించిన వేళ
గోదావరి, కృష్ణమ్మలు గొంతెత్తు శుభవేళ
అరవయ్యేండ్ల శోకమంతరించిన వేళ
సబ్బండ వర్ణాలు సంతోషపడు వేళ
చెప్పనలవిగాని నొప్పులెన్నో దీసి
వలసవాదుల మెడలు
వంచి నినదించేందు
కెన్ని యాతనలైన రొమ్మిర్సి నిలబడి
ఎన్నెన్నొ త్యాగాలు ఆత్మబలిదానాలు
ఎందరో తల్లుల ఎడతెగని శోకాలు
నిలువెత్తు రాసులై నిన్నే స్మరించెను
గొంతెత్తి నీ నామ మిపుడు నినదించేను
దశనాద సమరమై నల్దెసలు ఉప్పెనై
తనువెల్ల తన్మయత్వమె నిండుకొనగా
తరతరాలకు చరిత తత్వమై వెలుగగా
ఒక పక్క కులవృత్తు లేకమై ప్రతినతో
ఒక పక్క విద్యార్థి
సంఘాలు దీక్షతో
పంటకాల్వలు ఎండి
పాటకాల్వలు పండి
శిరమెత్తి ఉస్మానియా
గర్జించె ప్రతిసారి
సమ్మక్క, సారక్క
సర్వాయి పాపన్న
కాళన్న, దాశరథి కలగన్న దినములు
సామల సదాశివుడు చాకలి ఐలమ్మ
కలగంటు సెలవంటు
కదిలె జయశంకరుడు
పోలీసు కిష్టయ్య, పోరుబిడ్డ శ్రీకాంతు
యాదయ్యలెందరొ
పునాదులై మురిపెముతొ
ఆనంద పరవళ్ళై అమ్మరో నీ కాలి
అందెలే సందడై అమరగానము సేయ
పది జిల్లల నీ పిల్లల మది ఝల్లున పొంగగ
కల సాకారముతోడనె
కర్తవ్యము దెలిసెగా
భరతమాత నుదుటిపైన
పచ్చబొట్టు నీవెగా
తడియారని జ్ఞాపకమిది
తల్లీ నీ సాక్షిగ.

**సుంకర రమేష్**
3-4-845, రాంనివాస్ అపార్ట్‌మెంట్, బర్కత్‌పుర,
హైదరాబాద్. చరవాణి: 9492180764

# 376

# గడప గడపకు గంగమ్మ

గడప గడపకూ బువ్వబెట్టిన గంగమ్మా
గరిసె గరిసెను సిరులు నింపిన గంగమ్మా
గడియ గడియకు మళ్ళు తడిపిన గంగమ్మా
ఓ....
గూడు చెదిరిన పక్షివోలె గంగమ్మా
నీ గుండె సెరువు అయ్యేనా గంగమ్మా
ఓ పాలవెల్లి కల్పవల్లీ...
కల్పవల్లికే కష్టమొచ్చెనా కన్న ఊరికే నష్టమొచ్చెనా
నిను తలుచుకుంటెనే కంటి కుండ కారిపోయెనో
నువ్వు కలలో వస్తేనే నిద్రా పక్షి ఎగిరిపోయెనో
దాచుకోని సంపదె నీది దోషమంటని స్నేహమె నీది
ఆ....
అలుగుబారి అన్నదాతకు ఆశనిచ్చి శ్వాసనింపి
ఊరికే ఊపిరైనావు గంగమ్మా ॥ గడప గడప ॥

చితిమంటల హోరతే అందుకుని
చిరునవ్వుల చిన్నారులతో ఆడుకొనె
సమభావం సమధర్మం నీదమ్మా
వసుధలోన సుధలు చిందు గంగమ్మా
నీ పెయ్యిమీద చెయ్యివేసి గెంతులాడే లేగాదూడ
నీ మెడపైన ముద్దుబెట్టి మురిసిపోయె మేకాపిల్ల
గంగడోలు తాకినంతనే గంగమ్మా
నీ గుండె ఉప్పొంగెనే గంగమ్మా
ఊరికే జడకుచ్చోలే గంగమ్మా
నీవు లేని చోట
అవనిలో అందమేది గంగమ్మా ॥ గడప గడప ॥

నీ బుగ్గమీద నల్లాబొట్టు దిష్టీతీసే తుమ్మాచెట్టు
నీ నుదుటిపై పెద్దాబొట్టు పెట్టేనమ్మా సూరీడు
నీ కాళ్ళ పసుపు పూసేటి తంగేడు
నీ అండా దండా బతుకమ్మ ఆట
నీ వంటిపై కదిలేను బంతీ పూల తోట
మల్లెలాంటిదే నీ మనసు ఊట
మాయ తెల్వని మమతే నీ బతుకు పాట
॥ గడప గడప ॥

ఊరు తలాపున మాయమ్మా
నీవు పెద్ద ముత్తైదువవే నాయమ్మా
నిను గన్నా తల్లికే ఇచ్చెనా పచ్చాని కోక
ఎవరిచ్చారమ్మా ఇంత గొప్ప కానుక
నీ తోబుట్టుకే సారెబోసి దీవెనిచ్చి సాగనంపేవమ్మా
గంగనొదలి తృప్తిపడే గంగమ్మా ॥ గడప గడప ॥

సిటుకు సిటుకు సినుకు సప్పుడు
సొట్టబడ్డ నీ బుగ్గాలందం
నింగి పైటా సింగిడేసి అద్దామంటి

నిన్నూజూసి సిగ్గూ మొగ్గాలయ్యె
సక్కనైనా సెరువు సంటిపిల్లా మోము
ఆత్మగల సెరువు జీవరాసుల పొదరిల్లు
సంటిపిల్లా మోము దేవతలా కొలువు
సిరిమల్లెల వానజల్లు నీ ఎదను రంజిల్లు
మబ్బులమ్మా కొమ్మనుండి జారిపోయిన జాబిలమ్మా
నీ సిగలోన విరిసె విరజాజి పూకొమ్మ
గోరువంకలు గొల్లుమన్నవి
సందమామలు సల్లబడ్డవి
కొరమీనులె కూలబడ్డవి కౌజుపిట్టలు గోసబడ్డవి
ఎండ్రాకాయలు ఎడాబాసి ఏడబోయెనొ కొంగలన్ని
చూడబోతె కానరాని ॥ గడప గడప ॥

నారు తడిపిన నీకు నీళ్ళు విడిచిందెవ్వరు
ప్రాణమల్లె కాచుకున్న కన్న ఊరు
నిను కాటికే బంపేనా కసితీరు
ఈతకొచ్చిన పిలగాండ్లు నీ రూపుచూసి
బావురుమన్నరు
తల్లి బాధ చూడలేక తల్లడిల్లె పక్షులా బారు
గిరికీలు కొట్టికొట్టి కంటి గిన్నె ఒలకబోసే
నిను గాచె తల్లి నిలువెల్ల ఊగిపోయె
ఉసురుతీసిన ఊరు ఉలికి ఉలికి పడె
పాలపిట్టా సొగసు పాలవెల్లి మనసు
కాసుచుట్టూ తిరిగే లోకులకేం తెలుసు
॥ గడప గడప ॥



సూక్తిసాగర్ (సందాపురం బిచ్చయ్య)

# 377
## ప్రార్థన

ప. మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మమ్మేలు తల్లికి మనసార ప్రార్థనలు

చ1. కడుపులో కల్మషము కాల్చివేయుము మాలో
కులమత భేదాలు కూల్చివేయుము తల్లీ
గలగల మా ప్రగతి పెరిగిపోతుంటేను
కలిమి బలిమి వలన కలిసిపోతుంటాము
రాష్ట్ర ప్రగతి కొరకు పార్టీ బలము పెంచు
కరుణతో మమ్మేల్ల కాపాడుమో తల్లీ ॥మా॥

చ2. వృక్ష సంపద పెంచు వర్షాలు కురిపించు
కర్షక కోటిని హర్షింపజేయుము
ప్రాథమిక విద్యలను ప్రాంతీయ భాషలో
తెలుగులో బోధించు, బుద్ధినివ్వుము తల్లీ
పిన్నలకు, పెద్దలకు మానవత నేర్పిస్తూ
నీ చరిత రాయుటకు శక్తినివ్వుము తల్లీ ॥మా॥

చ3. పరిసరాల పరిశుభ్రతయే
పరమేశ్వరుని పూజగా భావించి
తట్టలు పారలు చేతను బట్టియు
ఆడుచు పాడుచు అందరు కలసియు
చెత్తను ఒకచోట కుప్పగజేసియు
విద్యుత్తు నుత్పత్తి జేయుంచుకో తల్లి ॥మా॥

చ4. వికలాంగులకు తగిన వసతులు కల్పించి
వృద్ధులకు తగినంత పించన్లు యిప్పించి
ఆర్థిక హీనుల ఆడపిల్లల పెండ్లి
ఖర్చులకు అరలక్ష డబ్బులను యిప్పించి
ఆర్థిక అభివృద్ధి తరగనీయకు తల్లీ
ప్రగతి పథమున మమ్ము నడిపించుమో తల్లీ
॥మా॥

సూరారం శంకర్
కామారెడ్డి, నిజామాబాద్.
చరవాణి: 9948963141

378

# కొత్త యుద్ధం

క్షమించండి...
ఈలలు...కేరింతలు... కెవ్వులు... కేకలు...
నాకు చేతకావు...
యుద్ధం ఎవ్వరిమీదో తెలిసిన వాణ్ని
ఈ ధనువు...శరస్సంపద దయచేసి
నాతోనే వుండనివ్వండి
ఈ చూపును కూడా నాతోనే ప్రవహించనీయండి
రెప్పవాల్చితే నగరాలనే కాదు
దేశాన్ని ప్రాంతం దిగమ్రింగే మహాకాయులు
ఎందరో వున్నారు
కాసేపు నన్ను ప్రశాంతంగా వుండనీయండి
మీ ప్రదర్శనలు .... మీ పండుగలు
పబ్బాలు ..పబ్బతులు-నావి కూడా
'తెలంగాణ' నా చాన్నాళ్ళ స్వప్నఫలం
ముద్దు ముద్దుగా 29వ రాష్ట్రంగా అందరికన్నా
ఒకింత ముందుగానే సప్రేమగా పిలుచుకున్న వాణ్ని
ఈ పొత్తం నిండా తెలంగాణ తల్లుల వర్ణచిత్రాల
చకచ్చకితలున్నాయి
బంగారు బతుకమ్మల స్వైర విహారాలున్నాయి
పదునాలుగేళ్ళ నిర్విరామ నిరంతర ఉద్యమ కేతనపు
రెప రెపలున్నాయి
ఇదిగో కల ఇప్పటికి సాకారమైంది
కానీ నా యుద్ధం ముగిసిపోలేదు....
రాష్ట్రపు చిట్టచివరి అంచు ప్రజల దాకా
నా స్వప్నఫలాలు చేరినప్పుడే కదా
నాకు శాంతి... శ్రాంతి... విశ్రాంతి
పొరుగువాడి మీద
నాలో మహోగ్ర కోపానల జ్వాలల దీపశిఖలున్నాయి
కనిపిస్తే కాల్చివేసే దావానలముంది
సలసల మరిగే రక్తప్రవాహపు నదులున్నాయి
వేయి సూర్యుళ్ళ శక్తి వుంది
సందర్భం ఏదైనా కానివ్వండి-నేను వీరుణ్ణి...
నా ప్రజల కలలకు కాపలాదారుణ్నీ....
నిఖార్సైన కవికులం ప్రతినిధిని....
సన్నిలావదిలేయండి...
కళ్ళకు ఎక్సరేలు తొడుక్కుంటున్నాను
నడుముకు కరవాలం బిగించుకుంటున్నాను
వెరసి కొత్త యుద్ధానికి సిద్ధమౌతున్నాను
పహరా హుషార్





**సొన్నాయిల కృష్ణవేణి**
ఇంటినెం. 2-72/1, బట్టుపల్లి (గ్రామం),
హన్మకొండ (మం॥), వరంగల్ జిల్లా.
చరవాణి: 9441326246

379

# బంగారు తెలంగాణ

ఏండ్ల కమానం ఎదురు సూడగ
ఆరొక్క తీరు లడాయి జెయ్యంగ
ఆఖరి మోఖల రాష్ట్రం రానే అచ్చె
ఇగ తెలంగాణ అచ్చిందని
నెమలీక దొరికిన బుడ్డ పోల్లోలె
నేను సంబుర పడ్తాంటె
పొయ్యికాడ కూసున్న మా ముసల్ది
పొంగే పాలమీద నీల్లు జల్లుకుంట
పుసుక్కున ఓ మాటన్నది
"ఇల్లలల్‌కంగనే పండుగయిద్దానె బిడ్డా" అని
గంతే నా సంబురం సప్పున సల్లారింది
గా పాలోలిగనే

ఐనా దమాక్ వెట్టి సోంచాయించుండ్లి
ఇల్లల్‌కుడయితె అయింది గదా
ఇగ ముగ్గేసుడాగుతదా
ముంగట వడ్డ ఏనులాగుతయా
అయితే గిక్కడొక మతలబున్నది
మంత్రుల కాన్నుంచి మస్కురోల్ల దాన్క
నాకేం ఫాయిదా అనకుంట
మనందరి బాధ్యత అనుకుంటే
మన తెలంగాణ అవ్వల్దర్జగ
బంగారు తెలంగాణ అయితది
లేకుంటె ఎప్పటి శిప్ప ఎనుగుల్నే
సమజయితందాల్ల....

సంకెపల్లి నాగేంద్రశర్మ
చరవాణి: 9346814782

380

# ఇయ్యాలటి తెలంగాణా!

ఇయ్యాల తెలంగాణా
మూడున్నర కోట్ల బంగారు నేల,
అరవై ఏళ్ళ వలసవాదుల రాక్షస కుబుసం
విడుచుకున్న నవతెలంగాణా
స్వరాజ్య సామ్రాజ్య హేల,
తెలంగాణా పునర్నిర్మాణం
కోసం కసరత్తు చేస్తున్న
సిరివెన్నెల బాల అమరుల రక్తత్యాగాలతో
తడిసిన మహా విప్లవ జ్వాల ఏడాది పాలనలో
బహుముఖంగా విస్తరిస్తున్న
ప్రగతి బాటల నా బతుకమ్మతల్లి
ఎటుచూచినా వాడవాడల్లో
నా తెలంగాణా తల్లుల
ప్రతిరూపాలైన దరువుల బోనాలే
కొమురంభీం దొడ్డి కొమురయ్య
బందగి, చాకలి ఐలమ్మల
పౌరుషాలే బొమ్మలే,
వేయిమంది అమరుల త్యాగాల
విద్యార్థుల బలిదానాల
పావన భాగీరథీ సమానురాలైన
నా గోదావరి భవ్యసీమ ఆదికవి పాల్కురికి
మహాకవి బమ్మెర పోతన్నల
పద్యసౌరభాలు వినవస్తున్నయి
విప్లవ ప్రజాఉద్యమాలే కనబడుతున్నాయి
నాడు బండెనుక బండి కట్టి
నియంత నిజాం కొందాన్ను
మట్టి కరిపించిన మనం
ఆనాటి సాయుధ రైతాంగ ప్రజాపోరాటాల్ని
1969 నాటి వీర తెలంగాణా విద్యార్థుల బలిదానాల
ఉద్యమాల్ని ఎల్లవేళలా నెమరేసుకుంటనే వున్నం
బడి పోరగాళ్ళ పుస్తకాలలో
మన ఉద్యమ చరిత్రల్ని రాసుకొని
ఇహ చదువుకొనబోతున్నం
తెలంగాణా సిద్ధాంతకర్త ఆచార్య జయశంకరుడి
తిరుగుబాటు బాట మన వారసత్వపు
ముల్లెమూట మన తెలంగాణా
సాహితీసారథులు దాశరథి, ప్రజాకవి కాళోజీలు
గాండ్రించిన సింహాలై కదలాడిన నేల ఇది
గుండెలనిండా స్వేచ్ఛావాయువులు
పీల్చుకుంటున్న నా నేలతల్లి ఇహమోసాలకు
స్వార్థపరుల ఎత్తులకు గుంటనక్కల జిత్తులమారి
టక్కరి వేషాలకు కులమతాల కంపులకు
గురికారాదు, పంచన జేరి వంచన చేసే
నమ్మకద్రోహులకు తావివ్వరాదు



ఇహ జనం ముందట నాయకులు కాదు
జనమెంబడి నాయకులుండాలి
అప్పుడే పల్లెలు పట్టుగొమ్మలవుతయ్
గ్రామీణ వృత్తులన్నీ మళ్ళీ చిగురిస్తయి
మన నేలంతా విస్తరించనున్న పూల తంగేడు
వనాలవుతయ్.
బికారులై, ఎడారులై గొంతెండిన దురాక్రమణల
నానేల చెరువులు, కుంటలకు ఇయ్యాళ సిగమొచ్చింది,
కనబడకుండా పోయిన బురికిపిట్టలు,
నీళ్ళలో పొంగిపొర్లే పాలపిట్టలకు నగవొచ్చింది
రుద్రమదేవి, వీరప్రతాపరుద్రు
కత్తులు, కరవాలాలలతో కాకతీయ మిషన్
కదం తొక్కుతోంది నా నేలతల్లి మట్టి వాసనల్ని
మనమంతా కళ్ళారా చూస్తున్నం
నా చెరువుల వాన నీళ్ళ దరువులతో
పొంగి నిండు గర్భిణులై చంద్రన్న పండువెన్నెల
నవ్వుల్లో ప్రతిబింబాలై కనిపించాలా!
సాగునీరు, తాగునీరు
సమృద్ధితో జలజలా పారాల నా నేలతల్లి తోరణాలు
కన్నులపండుగైన గుట్టలు
కనుమరుగు కాకుండా కాపాడుకోవాల,
తెలుగుకు ప్రాచీన హోదా కట్టబెట్టిన
మూడు భాషల కురికాల బొమ్మలమ్మ గుట్టను
ఉనికే లేకుండా బొందపెడుదామనుకున్న
మాయగాళ్ళ, మంత్రగాళ్ళ కుట్రల్ని నేలరాద్దాం
వరంగల్ సోయగాల పాండవుల గుట్టల్ని
వేయి స్తంభాల, రామప్ప గుడుల్ని
సర్దార్ పాపన్న కదం తొక్కిన గుట్టల్ని
సింగారించిన చెరువుల్ని పదిలంగానే కాపాడుకుందం
వెదిరె నెమళ్ళ గుట్ట, కొచ్చె గుట్ట,
నల్లగుట్ట, పళ్ళగుట్ట, పాలగుట్ట,
తెల్లగుట్ట, గుట్టబోరు, పెద్దగుట్ట, చిన్న గుట్టలన్నీ
చల్లగుంచుకుందాం
కొండకోనల నుండి కారే నీటి జలపాతాల్ని
నిలుపుకుందం
మనిషి అవయవాలైన గుండె, కనుగుడ్లు, కిడ్నీలు

అమ్ముకుతినే దగుల్బాజీలను చూస్తున్నం
ఇయ్యాళ నా నేల తల్లికి అంటుపెట్టుకుని ఉన్న
గుట్టల్ని దోసెకాయల్లా కోసి, గుట్టు రట్టు కాకుండా
మట్టుపెడుతున్న మాఫియా మొనగాళ్ళను చూస్తున్నం
ఊటనీళ్ళు ఎండిపోకుండా,
బంకతేనే, సీతఫలక్కాయలు, ఓషధుల వేర్లు
మందు మొక్కలు, జంతుజాలాలు
మాయమవ్వకుండా చూసుకుందాం
కుక్కలెంబడి పడంగనే
అవ్వో నాయనో అన్నట్లుగనే
అదే పరేషాన్‌తో గుట్టలు తొలిచేటోళ్ల దుమ్ముదులిపి
పెట్టని కోటలైన మన కళ్ళ ముంగటి గుట్టల్ని
కాపాడుకుందాం
నేలతల్లిని అంటిపెట్టుకుని వుండే చెలిమె ఊటల
నీళ్ళ తల్లిని కాపాడుకుందాం
ఇసుక పర్రెలు నెర్రెలు పాయకుండా చూసుకుందాం
పోలవరం ప్రాజెక్టు పొంట పోతున్న పాపికొండల
అందాలను
తనలో ఇముడ్చుకున్న ఏడు మండలాల
గిరుల సంస్కృతులను కొట్లాడి తిరిగి వెనక్కి
రప్పించుకుందాం
దిక్కుదివాణం తప్పిపోయి, ఊర్లలో పడి తిరుగుతున్న
గుడ్డెలుగు, చిరుతలు, తోకన్నలను
తిరిగి గుట్టలమీదికే వెనక్కి పంపుదాం
అడవులను పలుచగ చేసి, పీక్క తింటున్న
నరకాసురుల్ని పాతిపెడదాం
అడవుల మంత్రి జోగు రామన్న దయతో
హరిత హారాలతో కోట్ల మొక్కల్ని
పల్లెపల్లెల్లో సరిగనే పెంచుకుందాం
ప్రకృతి, పర్యావరణాన్ని గుర్తెరిగి కాపాడుకుందాం
కోతల్లేని కరెంట్‌తో, చక్కటి సడక్‌లతో
పచ్చటి పరిశ్రమలతో, పేదలు లేని నేలతో,
ఉపాధి ఉద్యోగాల వెల్లువతో
బంగారు తెలంగాణాకై ఈలేద్దాం.
తొలి ఏడాది తెలంగాణ పాలనకి
జై తెలంగాణాయని జైకొడదాం!

**సంతపురి నారాయణరావు**
నల్లగొండ.
చరవాణి: 8712722378

381

## పట్టిందల్లా బంగారం కావాలె!

ఉద్యమాల ఊపిరిలో
పురుడు పోసుకున్న తెలంగాణ
అనేకుల త్యాగాలతో
సుసాధ్యమైన తెలంగాణ
చొక్కం బంగారమోలె
పక్కగా రూపొందాలె
సాగునీరు-తాగునీరుతో
గొంతెండిన జనాలకు
దాహాలు తీరాలె

నదీమ తల్లుల పరవళ్ళతో
పల్లె-పల్లే పరవశించాలే!
ప్రజాకవి కాళోజీ-
ఆచార్య జయశంకర్ సార్-
మరెందరో మహనీయులు-
అమర వీరుల ఆశయాలతో
ఆకాంక్షలన్నీ నిజంగావాలె
బంగారు తెలంగాణ
సాకారం గావాలె!







**సంపటం దుర్గాప్రసాదరావు**
ఇంటినెం. 4-1-194, రోటరీనగర్,
కలెక్టరేట్ (పోస్టు), ఖమ్మం-507002, తెలంగాణ.
చరవాణి: 8466965401

# 382

## జయరథం

ప. కదిలినదీ సాఫల్య తెలంగాణ జయరథం
త్యాగాలే పునాదులై ఈడేరే మనోరథం

అ.ప. చారిత్రక వైభవాల పట్టుగొమ్మ ఈ సౌథం
తెలంగాణ మాగాణం సాగాలీ నవ్యపథం

చ. అడవి తల్లి అందాల ప్రకృతి హరివిల్లు
సంప్రదాయ ఆప్యాయతలకిదీ పెద్దిల్లు
శాతవాహన-కాకతీయ పౌరుషాల పుట్టిల్లు
కళలూ-సంస్కృతులూ విలసిల్లిన నట్టిల్లు

చ. ఒగ్గుకథా-పేరిణీ, శివతాండవ నృత్యాలు
అగ్గి పెట్టెలో ఇమడగల చీరలిచ్చే మగ్గాలు
కలంకారి-అద్దకం, లక్కబొమ్మల అందాలు
కొమ్ముడోలు-కోయదొరల రేలాపదనిసలు

చ. ప్రతి ఎదలో కొలువయ్యి తట్టిలేపి భాగమతి
ప్రేమికులా ప్రతిరూపై చార్మినారు దోచె
ప్రతిమది
రాగి-జొన్న, సజ్జ-మిరప, పత్తి-వేరు శెనగలు
పచ్చ చీరె పావడలై తెచ్చె ఎన్నొ కొత్త
సొబగులు

చ. భక్తరామదాసు-తెలగన్న-కాళోజీలు
పాటకు తొలిపల్లవి కేశవదాసు-దాశరథులు
గోదారి-శబరి, మంజీర ఝురులతో
రతనాల వీణయై రసధ్వనులే విరియించే

చ. పోరుబిడ్డల పొత్తిళ్ళ దాచి దాటె మైలురాళ్ళు
చారిత్రక కర్తవ్యాల వేనోళ్ళ పొగడాల వేల
యేళ్ళు
పోరు మాగాణాన మొలకెత్తిన ఈ కుదుళ్ళు
భవిత ఆసాంతం విరబూయాలిలేలేత
చిగుళ్ళు



సృజామి (వి. సత్యన్నారాయణ)
శ్రీహరికృష్ణ మెడికల్, నలంద ఆటో స్టాండ్
మహబూబ్‌నగర్. చరవాణి: 9550980287

383

## బంగారు బతుకమ్మ

బంగారు తెలంగాణ బాగుకోరుకుందాం
బతుకమ్మ పండుగను ఇంటింటా జరుపుదాం....
మన బతుకులలోన వెలుగు నింపుకొందాం....
మనసులోన ఆనందాన్ని కలకాలం నిలుపుకొందాం....
బంతిపూలు, తంగేడుతోన
బతుకమ్మను తనివితీర సింగారిద్దాం...
ఊరువాడ మురిసేలా ఉత్సవాలు జరుపుదాం....
ధూంధాంలతోన దివ్యమైన ముగింపే ఇస్తాము మేము
ఆడపడుచులకు అండగా ఉండమ్మా నీవు
బతుకుల పండగవై దీవించగా రావమ్మా
దివినుంచి నిను చూసి దేవతలే తరలివచ్చేరు
కొత్త కొత్త పంటలే ఇంటికి తెచ్చేము...
శ్రీలక్ష్మి సమేతమై కొలువు దీరి రావమ్మ
సంతోషాన్ని పంచేటి సందేశమే నీవమ్మ
కన్నీరు దూరం చేసే తల్లివై కదిలిరావమ్మ
బంగారు బతుకమ్మవై మా బతుకుల తీర్చమ్మ

సై్కబాబా
402, ఝాన్సీ రెసిడెన్సీ, ప్లాట్-30, హెచ్ఐజి-6/800,
హుడాకాలనీ, తానీషానగర్, మణికొండ విలేజ్, హైదరాబాద్-89.
చరవాణి: 9885420027

# 384

## ఐ

'సర్వేంద్రియానాం...'
అందమైన చిన్నప్పటి కన్ను పాఠం...
కన్ను బొమ్మ ఎంత ముద్దుగ గీసేటోన్నో
ఇప్పట్కి కళ్లల్ల తిరుగుతున్నది
చిన్నతనం పెన్సిల్ మల్లమల్ల దిద్దిన నెమలి కన్ను
కన్ను అంటె సొలు-అందమైన బొమ్మే మెదిలేది
పెద్దయినంక తెలిసొచ్చింది-
అందమైన కన్నుకు-మాకు శానా దూరమని...
అరెరే... తేరుకునే లోపల్నే
కాలం కన్ను సొన కారిపాయె
ఇప్పుడు కన్ను అంటె-
ఎంతకు నిద్దర పట్టక
జీవం లేనట్లు కదలాడే గరీబు ఖాజామియా....
పంక్చర్లు అతికే ఉస్మాన్ భాయ్ ఢీలాపడ్డ చూపు...
మా అమ్మి కంటి కింద నల్లగా-పగిలిన రేగడి....
ఊర్లె శానా ముస్లిం ఇండ్లల్ల షాదీ కాని చెల్లెలా-
అబ్బాజాన్ పక్షవాతపు రెప్పల మధ్య అడ్డంగా...
కండ్లద్దాలు మసకబారి కుట్టుమిషిన్ సూదిలో
దారం ఎక్కని నానీమా తనుకులాట....

ఇయాల కన్ను అంటె-
కొడుకు గూడలు పట్టుకొని లేవాల్సింది పోయి
చీకటి పడితే గోడలు పట్టుకొని నడిచే మాదిగ ఎంకయ్య
తాత...
ఎద్దు కొమ్ము విదిలిస్తే
కారిపోయిన నాగయ్య మామ కొడుకు ఒంటరి చూపు...
పగిలిన ఒంటి కన్ను అద్దంతో
కనాకష్టాలు పడే పెరిక లచ్చువమ్మ...
చిన్నతనంలో కొడుకుని తడిమి తడిమి చూసుకున్న
యాదిల
వాడు తప్పిపోయిన పట్నం బాటకు అతుక్కొని
చితికిపోయిన ఈదయ్య కక్కయ్య...
అయ్యో... తల్చుకుంటే ఊరంతా పరేశాన్లతోని
కళ్లన్నీ గుంతలు పడి చూపానకుంటయ్యి
కన్ను ఇప్పుడు అందమైన బొమ్మ కాదురా తమ్మి
అగాథపు లోతుల్ని చూపే గుంత...
మా ఊరే ఇప్పుడు
కన్ను ఊడబెరికిన ఖాళీ బొయ్యారం!

**షాజహానా**
402, ఝాన్సీ రెసిడెన్సీ, ప్లాట్-30, హెచ్ఐజి-6/800,
హుడాకాలనీ, తానీషానగర్, మణికొండ విలేజ్, హైదరాబాద్-89.
చరవాణి: 9885420027

## 385

# 'అలీఫ్ బే తే'

పూల రెమ్మల్ని పోగేసి...
'పరీ'లు నాజూకు వేళ్లతో
కాశ్మీరీ ఎంబ్రాయిడరీ ఏదో చేసినట్లు....
లిపి అల్లికల్లో దూరి మనసు వెనక్కు రానంటుంది
నెలవంకల్ని కుప్పేసి
'అలీఫ్ బే తే' ల్ని సృష్టించినట్లు
వెన్నెల సోనలేవో నన్ను
అవ్యక్త పరిమళాల్లోకి లాక్కుపోతాయి
నాజూకు పరీలంతా చేతుల్లో
చేయేసుకుని వనివిహారంలో మునివేళ్లపై
నాట్యం చేస్తున్నట్లు
అక్షరాలు నన్ను కవ్విస్తూ పిలుస్తుంటాయి
అడవిలో తప్పిపోయిన మనసుకు
సేదతీర్చే శయ్యల్లా
చూడగానే దేహమూ హృదయమూ విప్పారుతాయి
కానైతే పల్లెల్లో
మూలమూలా వెదికినా దొరకదు నా భాష
ఏ సర్కారీ బడిని తట్టి చూసినా
నాలుగు ఉర్దూ అక్షరాలు
ఎక్కడా కళ్ళని స్పర్శించడం లేదు!
నాది కాని భాష ఇవాళ నన్ను ఏలుతున్నది!
నా ఇంటిని నా నాలుకను ఆక్రమించింది!
నా భాషకు నాకు
కాంతి సంవత్సరాల దూరాల అగాథాలను సృష్టించింది!
ఏ పనికిరాని పరాయి సంస్కృతాన్నో
అందలం ఎక్కించాలని ప్రయిత్నిస్తున్న నాగరీకులు
కొనపాణంలో ఉన్న నా భాషకు
మంచినీళ్ళు పోసి బతికించాలని మాత్రం
ఎవరూ చూడ్డం లేదు...!
ఎవరికీ అనిపించడం లేదు!
ఉర్దూ లాంగ్వేజ్-
మేడ్ ఇన్ ఇండియా!
అంతరించి పోతున్న వాటిల్లో
నా భాష కూడా...
మ్యూజియంలో...!
ఇప్పుడు అమాంతం చిన్నపిల్లనై
'అలీఫ్ బే తే'లు నేర్చుకోవాలని
మనసు మారాం చేస్తున్నది...!

**టి. నరేష్**
కేరాఫ్ రవీంద్రభారతి, చరవాణి: 8801031866
ఇ-మెయిల్: tnaresh123456@gmail.com

# 386

## తెలంగాణ

కళలకు పుట్టినిల్లు
నదులకు మెట్టినిల్లు
చదువులకు చక్కనిల్లు
పౌరుషంలో ఓరుగల్లు!
మాట మాటలో మనసుజల్లు
పల్లెపల్లెనా మన సంస్కృతిల్లు !
మాయమాటల మోసగాళ్ళు
అందలమెక్కి అన్ని రంగాలు
అణగతొక్కిన ఆనవాళ్ళు
మన బతుకంతా కన్నీళ్ళూ !
ఘనకీర్తి చరితకు వారసులం
మేధావుల బాటలో వారధులం !
ఉవ్వెత్తున ఎగిసిపడే అలలం
చావుకు తలవంచని ధీరులం !
త్యాగాల గురుతులం
తెలంగాణా బిడ్డలం !
తెలుగుజాతి వెలుగులం
బంగారు తెలంగాణాకు పునాదులం!

**టి. లక్ష్మీ నారాయణ**
విశ్రాంత ప్రధానాచార్యులు, కరీంనగర్.
చరవాణి: 9700461243

387

# నేను కోరుకుంటున్న రేపటి తెలంగాణ

మనం కోరుకున్న తెలంగాణ రానే వచ్చింది
అప్పుడే ఏడాది దాటింది
రేపటి ఉజ్జ్వల బంగారు తెలంగాణ
సాధనకు గాను నేనేమి కోరుకుంటున్నానంటే
కాలం చెల్లిన చట్టాలను తప్పించి అందరికి మేలు
చేసే....
నూతన చట్టాల రూపకల్పన జరగాలి
పాత అభద్రతకు, కొత్త భయాలు తోడైతే....
జనజీవనం అస్తవ్యస్తమవుతుందని మరువొద్దు
జనామోదమో.. ప్రభుత్వ మనుగడకు గీటురాయి....
అని అందరూ గుర్తుంచుకోవాలి.
వేగవంతమైన న్యాయవిచారణ నేరానికి తగ్గ శిక్ష
అమలుకు నోచుకోవాలి
హక్కులు కాంక్షించే మనం బాధ్యతలను
విస్మరించవద్దు...
ఎందుకంటే వ్యక్తి కంటే వ్యవస్థ గొప్పది
బంగారుకత్తి అని మెడ కోసుకోలేం కదా...
జలజగడాలు లేని జల విధానాల రూపకల్పన జరగాలి
బానిసత్వం లేని వ్యవస్థలు మన బంగారు తెలంగాణలో
రావాలి
ఆత్మహత్యలు లేని తెలంగాణ రావాలి
వేధింపులు, బెదిరింపులు, కిడ్నాపులు, హత్యలు లేని
తెలంగాణ సమాజ నిర్మాణం జరగాలి
విద్య, వైద్యంపై పెట్టిన ఖర్చు పెట్టుబడిలా కాకుండా....
సంక్షేమంలా భావించి అందరికి అందించాలి
వాతావరణ మార్పుకంటే... వాతావరణ న్యాయం
అందించాలి
ప్రకృతి-మనిషి-అభివృద్ధిల మధ్య సంఘర్షణ
నివారించి.....
ప్రకృతి వనరులు సద్వినియోగం జరగాలి





**టింగిరికార్ వెంకటేష్**
ఇంటి నెం. 9-4-86/50, సాలార్జునా కాలనీ,
హుమ్‌ఫర్‌ద బ్లైండ్, గోల్కొండ, హైదరాబాద్-5000 08

# 388

## జై తెలంగాణ

తేనెపూసిన కత్తుల్లా తెలంగాణ గడ్డపై మదమెక్కిన
ముష్కరులు
మూకుమ్మడిగా దాడిచేస్తే, భారతయుద్ధం ఇక తప్పదని
యువ భీష్మకిశోరులు అంపశయ్యపై పఠించిన సేవ
వేద నినాదవైనం ఎలా మరువగలం?
మాటలతో పబ్బం గడిపే నాటి ప్రతిపక్షాల
యుక్తులను ఎలా విస్మరిస్తాం?
తల్లిపాల విలువ తెలియక అమ్మ శీలాన్నే వేలం వేసి
కాంక్షతో ముసుగులు కప్పుకున్న నాటి మూర్ఖుల
బ్రతుకు బయట పెట్టవేం...!
రాలిపడ్డ కపాలాల గుత్తులు, మంటలలో
పోయిన యువరక్తపు మాంసపు ముద్దలు, తెగిపడి
కన్న తల్లుల పేగు బంధాలు, ఆగిపోయిన కన్న తండ్రి
గుండె చప్పుళ్ళు
మనం సాధించుకున్న తెలంగాణాకు నిలువెత్తు
సాక్ష్యాలు
అమరుల పాదాలకు కన్నీటి తర్పణంగా ప్రతి
తెలంగాణ
పౌరుడు తన ఉఛ్వాస, నిశ్వాసల్లో గళమెత్తి విన్పించే
ఏకైక నినాదం, జై తెలంగాణ,
జైజై తెలంగాణ
జయహో తెలంగాణ

**తాయమ్మ కరుణ (మిర్యాల పద్మ)**
ప్లాట్ 410, విజయరాఘవ రెసిడెన్సీ, విజయబ్యాంక్ బ్యాక్ సైడ్,
చందానగర్, హైదరాబాద్. చరవాణి: 9989206397

389

## బోనమెత్తాలి

అమ్మా!
ఇయ్యాళ నా కొడుకు పాల్తాగలేదే
మనసంతా కల్లం కల్లంగుందే
కొడుకు పాలు తాగలేదనో
భర్తా, తండ్రీ దూరమయ్యిండ్రనో
బిడ్డా!
కన్న ఊరు పొమ్మంది
కాటికైతే పోలేదు
కలో గంజో తాగుదామనే కదా
పచ్చులమైనం
బిడ్డా!
అందరం కలిసుండే రోజొస్తదిలే
తననే ఓదార్చుకుందో
బిడ్డనే ఓదార్చిందో...

అందరం కల్సి
బోనాల పండుగ చేసుకుంటే
మేకను సాకం పెడ్త అని
కండ్ల నీళ్ళు గుండెల్లోకి ఇంకంగ
మొక్కుకుంది
ఎల్లమ్మ తల్లి
ఆ తల్లుల మొర ఆలకించిందేమో...
మిషన్ కాకతీయ
కడుపు నింపెనో లేదో
కానీ
పరాయి దేశంలోని
ఆ తండ్రులు ఇల్లు చేరేదెట్లా?
బోనాల పండుగ చేసుకునేదెట్లా?
ఆ తల్లుల కల నెరవేరుతుందా... మరి.

తాళ్ళూరి రాధ
చరవాణి: 9705408345

390

# నవ తెలంగాణం

అదిగదిగో ఉదయించే నవతెలంగాణ
వేవేల మయూఖమ్ములు
పుడమితల్లిని ముద్దాడి మురిసిమెరిసేరా
పచ్చని పల్లీయులు పరవశించి
మధుర గానమ్ములెన్నో ఆలపించేరా
జానపదులు గజ్జె కట్టి
విజయదరహాసమ్ముతో నాట్యమాడేరా
బతుకమ్మబోనాలు
సమ్మక్క సారక్కలు
బయలెల్లి ఊరువాడ కలియదిరిగి
అమ్మ నుదుటిన సింధూరమ్మే దిద్దేరా
గోదారి కృష్ణమ్మ
తంగభద్ర, కిన్నెరసానులు
మనగడ్డపై పోరాడి పొంగిపోయేరా
.......... కోలాటాలు యక్షగానాలు
హరికథలు బుర్రకథలు
మనతల్లి ఘనతనెంతో కీర్తించేరా
సింగరేణి బొగ్గుగనులు
బంగారు వజ్రమ్ములు
గ్రానైట్ డోలమైట్‌లు
ధరణిమాత గర్భమ్మునదాగి
సిరులెన్నో ఒలికించి చిరునగవు చిందించేరా
భద్రాది రాముడు
యాదాద్రి నారసింహుడు
కొమరెల్లి మల్లిఖార్జునుడు
బాసర సరస్వతి మనలందరిని బాగుండమని దీవించేరా
స్వరాజ్య సాధనమ్ముకై
అసువులబాసి అమరులై
గగనానికెగసి అరుణతారలై నిలిచి
తల్లి రుణమ్మునే దీర్చి నట్టి ముద్దు బిడ్డలందరికి
నవ్వు తెలంగాణ వందనములెన్నో జేసేరా
మన రాష్ట్రాన్ని ప్రగతిపథమ్మున
పయనింపజేయండని జనులందరిని ఆదేశించి
ఆశీర్వదించేరా

**తిరుమల శ్రీనివాస్ ఆర్య**
కేరాఫ్ టి. కిషన్, సాగర్ హెయిర్ కటింగ్ సెలూన్,
పిఎల్ఎమ్ఎస్ పెట్రోల్ బంకు దగ్గర, వీక్లీబజార్
నిజామాబాద్. చరవాణి: 8374002227

391

## పాకురు బండ

గడపదాటి అడుగుపెట్టడం అంటే
అగాథంలో పడిపోకుండా
అప్రమత్తంగా సాగిపోవడమే.
ఒంటరిగా వచ్చి ఒంటరిగా పోవడమే
ప్రపంచం నేర్పిన గొప్ప వైరాగ్యం.
సంస్కారం అనే కవచాన్ని ధరించిన ఆత్మలెన్నో
రాజీలేని పోరాటాలు చేస్తూ...
కుసంస్కారాల దాడిని తట్టుకొనే
ఆత్మస్థైర్యమే వీరికి వెయ్యి ఏనుగుల బలం.
నయవంచకుల పంచన చేరే వంచిన మనస్కులు
ఉన్నారు జాగ్రత్త.

నూతిలో కప్పలవలె
భార్యాపిల్లలు,
అమ్మ నాన్నలు
కూపస్థ మండూకంవలే
ప్రపంచం అదే అనుకుంటే
స్వార్థజీవివి తప్ప అమరజీవివి కాలేవు
జీవించడం అంటే బ్రతుకు పర్వతాన్ని
అధిరోహించడమే కాదు,
నీ బ్రతుకు ఒక హిమ శిఖరం
కరిగిపోకముందే పదిమందికి పంచు.



తిరునగరి దేవకీ దేవి
గంధకుటి అపార్ట్‌మెంట్, ఎఫ్-411, లేన్‌టు-మోర్ సూపర్ మార్కెట్
ఎర్రమంజిల్, హైదరాబాదు-500 082 చరవాణి: 9949636515

392

# అభినవ ప్రసవ వేదన

అరవైయేళ్ళ అభినవ ప్రసవవేదన
ఊపిరి ఉగ్గపట్టిన నిరీక్షణ
రాష్ట్రావిర్భావం
పదిజిల్లాలు పరవశమై మైమరచిన వేళ
అవధులు తెంచుకున్న ఆనందహేల
ఆబాలగోపాలం ఆదమరుపు
అంతలోనే మలివసంత దర్శనం
ఆశ్చర్యం అద్భుతం
ఏడాదిబిడ్డ కామధేనువైంది
ఆఘమేఘాల్లో అంతా వరాలజల్లే
లక్ష్మీకటాక్షంలో ఆడబిడ్డల చెమ్మచెక్కలు
సన్నబియ్యం సయ్యాటలో విద్యార్థుల తీన్మార్
ఆర్థిక ఆలింగనంలో అమరవీరుల కుటుంబాలు
ప్రగతి పథంలో సంక్షేమ పథకాల సరిగమలు
మిషన్ కాకతీయ మిలమిలల్లో తటాకాల తళతళలు
జీతభత్యాల ఉన్నతిలో ఉద్యోగస్తుల
ఉయ్యాలజంపాలలు
కోతలేని విద్యుత్ విరాట్ దర్శనంతో
కల్లుతాగిన కోతి తైతక్కలాటగా బాబుత్రయం
లంగా లఫంగుల లాగులు తడిపే "షీ" టీమ్స్
టుబి వర్క్డ్ ఎనౌన్స్‌మెంట్ అనంతం
బట్
చిట్లించిన నొసళ్ళ సుందర దరహాస వందిమాగధ
కొత్త సీసాలో పాత సారాయి కంపు పోవాలె
వరాల జల్లంతా మహానగరంలో వానకాదు
తెలంగాణ పది జిల్లాల్లో కురవాలె
కాళన్న యాదిలో
ప్రాంతీయ ప్రాంతేతర ద్రోహుల కథా కమామీషు
క్రమం తప్పక జరగాలె.

**తిరునగరి సంధ్య**
ఇంటినెం. 6-36, పాండురంగాపురం (గ్రామం), బల్లేపల్లి (పోస్టు),
ఖమ్మం-507002, తెలంగాణ. చరవాణి: 9347002652

393

## బంగారు తెలంగాణ

ఉద్యమకారులకు ఊపిరిపోసిన మన తెలంగాణ
పోరాట వీరులకు ఉగ్గుపాలు తాపిన తెలంగాణ
చైతన్యం నింపిన మన తెలంగాణ
ఎందరో
మాలాంటి విద్యార్థుల ప్రాణాల త్యాగఫలం మన
తెలంగాణ
స్వేచ్ఛగా నిద్రిస్తున్న ఈ తెలంగాణ సాక్షిగా....
బతుకమ్మ ఆటల్లో తెలంగాణ పాడుకుందాం
మన యాసబాస బాగుందని చాటిచెబుదాం
పొడిసిన తొలిపొద్దును పిలుచుకుందాం
ముంపు పల్లెలను కాపాడుకుందాం
అవినీతి అక్రమాలు లేని రాజ్యంగా మార్చుకుందాం
అన్నింట మేమేనని గుండెబలం మాదేనని
అడుగులేద్దాం
బీడువారిన భూముల్ల పంటలేద్దాం
సిరులతల్లి తెలంగాణని ఎలుగెత్తి కేకలేద్దాం
చీకటి బతుకుల్లో వెలుగొచ్చిందని విందుచేద్దాం
నవ తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకుందాం

**డా॥ బండారి సుజాత**
ఇం.నెం. 2-9-150/3, రోడ్ నెం. 20, వికాస్‌నగర్,
హన్మకొండ - 506001, వరంగల్ జిల్లా (తెలంగాణ)
చరవాణి: 9959771228

394

## స్వప్న సాకారం

**కా**లంతో పరుగెడుతూ
కొలమానం లేని ఉద్యమాలతో
వీరమరణాల చవిచూసి
విశ్వమంత ఖ్యాతి పొంది
సాధించిన తెలంగాణ ఉద్యమాల తెలంగాణ
సమ్మిళిత సంస్కృతిని సాదరంగా కాపాడి
తన సంస్కృతి తనలోనే నిలుపుకున్న తెలంగాణ
మనిషి మనసు కదిలించి
మమతలతో మది మురిపించి
మన భాష, మన యాస తెలంగాణ ప్రతీకయని
పలుకులిచ్చి, పదం పాడి, గజ్జెకట్టి, బోనమెత్తి
బతుకమ్మల భరోసాల బంగారు తెలంగాణ
మన సంపద మనకంటు ఇలంత ఈసు చెందేల
ప్రగతి వైపు నడిచేందుకు పయనమైన తెలంగాణ
కుట్రలకు, కుతంత్రాలకు, లంచాలకు తావులేని
రాష్ట్రంగ తీర్చిదిద్ద రానిస్తున్నదీ నడత
అనాథల, విధివంచితుల అక్కున చేర్చుకుంటు
ఆధారం చూపెట్టి ఆదర్శమవుతున్నది
శ్రమ చేసిన రొక్కమంత అంగడి సరుకులకు చాలక
అడియాశల పాలైన కష్టజీవులందరికి
ఊరటను కలిగించే 'నిధి'ని నిర్ణయించాలి
ఆడపిల్లల బతుకులను అడుగంటనీయకుండ
ఆదరణ చూపెడుతూ ఆదుకొమ్మన్నది
కష్టాలతో, కడగండ్లతో కన్నీటిని చిందించే
కర్షక, కార్మిక వెతలను బాపుటకు ముందున్నది
సంస్కారపు జీవితాలు సాకారమయ్యేట్లు
తరతరాల చరిత్రను సాధించ ముందుండి
ప్రజల హితం కోరుకుంటు, అభివృద్ధికి బాటవేస్తు
వనరుల వ్యర్థం చేయక, ప్రకృతిని కాపాడుతు
తమ స్వార్థం కొంత వీడి, పరులకు సాయం చేస్తు
ప్రతిన బూన ముందుండి ప్రగతిని సాధించాలి

**తుడిమిళ్ళ భీష్మాచారి**
17-57/ఎ, శ్రీనగర్‌కాలనీ, దిల్‌షుక్‌నగర్-500 060
చరవాణి: 9392442755

395

# తల్లీ నీకొందనం!

అమరవీర బిడ్డలను తనివితీర తడుముకొని
కంటనీరు పెట్టుకొని నీలోనే కల్పుకున్న
తల్లీ నీ కొందనం తెలంగాణ తల్లీ నీ కొందనం
పాటలనే ప్రాణంగా ఆశయాలే సాధనగా
అహర్నిశలు కృషిసల్పి
పల్లెల్లో పట్నంలో అందర్నొకటిగ జేసిన
తెలంగాణ నందించిన కళాతప్త హృదయులను
కళాకార్ల బిడ్డలను
కరుణించిన కరుణామయి ॥తల్లీ॥
కాళోజీ, దాశరథి, వట్టికోట
సినారె సాహితీ దిగ్గజాల
సారస్వత సమరభేరి
ఆలకించిన పులకించిన ॥తల్లీ॥
నీతిగ నిలబడి పోరాడిన నేతలకు
స్ఫూర్తిదాత, జాతిని జాగృతపరచిన
జాతిపిత జైశంకర్‌గారి
అంతిమయాత్రను తిలకించిన జగజ్జనని ॥తల్లీ॥
మాటలలో కఠినత్వం మనసులో నవనీతం
అభివృద్ధే తన తత్వం అదే ఆయన మనస్తత్వం
మానవత్వమున్న ముఖ్యమంత్రి
కేసీఆర్ నందించిన ॥తల్లీ॥
రాజముద్ర సృష్టించిన ఏలే లక్ష్మన్న
అమరవీరుల స్థూపాన్ని అంకితమిచ్చిన యాదన్న
తెలంగాణ తల్లి రూపశిల్పి బివిఆర్ చారన్నల
కళాబ్రహ్మలగన్న తల్లీ నీకొందనం ॥తల్లీ॥
రమణీయ కళాకృతి రామప్ప ఆలయం
కొలనుపాక నాగార్జున బౌద్ధారామ శిల్పాలు
కాళేశ్వర, ముక్తేశ్వర, బాసర సరస్వతీ
ధర్మపురి, యాదాద్రి నర్సింహస్వామి
కొండగట్టు అంజన్న, కొమరవెల్లి మల్లన్న
తెలంగాణ క్షేత్ర వైభవాలు, పుష్కరాల నందించిన
గోదావరి, కృష్ణమ్మ ॥తల్లీ॥
బంగరు తెలంగాణకు బహు బాటలు వేయంగా
స్వచ్ఛ హైదరాబాదగును నిశ్చయముగ
భాగ్యనగర శోభ భాసిల్లును ధరలోన
విశ్వనగరముగను విఖ్యాతి నొందును
కాకతీయ మిషను క్రాంతిపథంబైన
నీటికొరత తీరు నిక్కముగను
చెరువు బంకమట్టి ఎరువుగా వాడిన
అధిక పంట పండు ప్రతి రైతు ఇంట
ప్రభుత్వ పథకాలు ప్రశంశనీయము
అమలు చేయవలయు అధికారులంత
తప్పక తమ వంతు ప్రజలెల్ల పాల్గొనిన
ఫలితమివ్వగలదు పరులు మెచ్చ.



తెలంగాణ రమేష్‌బాబు

# 396

## ఉద్యమ చంద్రుడు

ఉద్యమాల ఆర్యుడు
ఉద్యమంలో సూర్యుడు
కదనరంగ విజయుడు
కల్వకుంట్ల చంద్రుడు
అలుపెరుగని యోధుడు
అపర భగీరథుడు
తెలంగాణ తెచ్చినట్టి
తిరుగులేని నాయకుడు
బెట్టు పెట్టిండు
పట్టు పట్టిండు
తెలంగాణ సాధించిండు
తిరుగులేని విజయుడు
తెలంగాణ బోనమై
తిరుగులేని బాణమై
ప్రజాసేవే... ధ్యానమై...
ప్రజాప్రగతి స్థానమై...
మునుముందుకు సాగుతున్న
మురిపాలను పంచుతున్న
కల్వకుంట్ల చంద్రుడు
కరుణామయ హృదయుడు
నిరుపేదల ఆదుకున్న
నిరుపమాన రూపుడు
కల్వకుంట్ల చంద్రుడు
కరుణామయ హృదయుడు
మనసు తెలుసుకున్నవాడు
మానవత్వమున్నవాడు
మా పూర్ణచంద్రుడు
మా కల్వకుంట్ల చంద్రుడు.

తెలిదేవర భానుమూర్తి
చరవాణి: 9959150491

397

## లాపతా

యాడ్కి బోయిందొ యాడున్నదొ గాని
మా వూరి చెర్వు మల్ల గండ్ల బడ లేదు
ఎంతగనం జూసినా అల్గు దుంకలేదు
శిగల కల్వపూల సింగారి చెర్వు
తీరు తీరు పూల బత్కమ్మలతోని తింపుకుంట
నడ్సిన బంగారి చెర్వు
నీడల చింగులతోటి తక్‌థిమ్మి అన్కుంట చిందేసిన
చెర్వు
యాడ్కి బోయిందొ యాడ దాక్కుందొ
మావూరి చెర్వు మల్ల గండ్లబడలేదు
పోరగాండ్ల ఈతల మురిసిపోయిన చెర్వు
తామర పూల కండ్ల సూడ సక్కని చెర్వు
మెడల ముత్యాలొల్లె కొంగల దండేస్కున్న చెర్వు
యాడ్కి బోయిందొ యాడున్నదొ గని
మా ఊరు చెర్వు మల్ల గండ్లబడలేదు
తేపతేపకు దూప పోడగొట్టిన చెర్వు
మా మెత్కు మా బత్కు మా ఊరి చెర్వు
యాడ్కి బోయిందొ ఎందుకలిగిందొ
ఏ బైరూపులోడొ ఏ బద్మాష్‌గాడొ
మావూరి చెర్వు మాయం జేసిండు
మాయమాటలు జెప్పి మా పొట్టగొట్టి
బంగ్లలు గట్టి బొంబై తమాస దేఖ్లొ అంటుండు



తోడిశెట్టి పరమేశ్వర్, హెచ్.ఎం.
బీరవెల్లి, ఆదిలాబాద్.
చరవాణి : 9441288466

# 398

# రాష్ట్ర పునర్నిర్మాణ గీతం

ప. సాకారమయ్యెను తెలంగాణ రాష్ట్రము
మనందరం చేయాలి దాని పునర్నిర్మాణము
కోటి కోటి గొంతుకలు నినదించిన తెలం'గానము'
నడుం బిగించాలి దాని ప్రగతికి అందరము ॥సాకార॥

చ1. యువకులంత ఉద్యమమై ఉరికిండ్రు ఉప్పెనలై
మహిళలంత కాళికలై కదిలిండ్రు నిప్పుకణికలై
తెలంగాణ తేరుకుంది ధూంధూం డప్పులై
మన భూమిని, మన నీటిని కాపలాకాయు కనురెప్పలై ॥సాకార॥

చ2. ఆదిలాబాదు జిల్లాలో వనరులెంతో ఘనం ఘనం
పోలవరం ప్రాజెక్టుతో తల్లడిల్లె గిరిజనం
నల్లగొండ ఫ్లోరైడుతో నలిగిపోయే పసిప్రాణం
నవ్య తెలంగాణమ్ముతో కావాలవి పూలవనం ॥సాకార॥

చ3. పాలమూరు పల్లెల్లో ఎగరాలి మన జెండా
మెతుకు సీమ అభివృద్ధే కావాలి మన ఎజెండా
కరీంనగర్ కళ్ళల్లో అభివృద్ధులే నిండా
భవ్యతెలంగాణమ్ముతో కాకతీయ ప్రభలు పండ ॥సాకార॥

చ4. భాగ్యనగర సౌభాగ్యమే తెలంగాణ హృదయం
రంగారెడ్డి పరిసరాల్లో పారిశ్రామికాలయం
తెలంగాణ తల్లి హృది కావాలి ఆనందమయం
దివ్య తెలంగాణ భవితకు కలగాలి జయం జయం ॥సాకార॥

**తోటపల్లి భూమన్న**
మంచిర్యాల, ఆదిలాబాద్

# 399

## జయహే

ఆకాశం ఒక్కసారే భళ్ళున తెల్లారినట్టు
నెర్రెలు బారిన నేలమీద
కుండ పోతగా వర్షం కురిసినట్టు
కోడి పుంజులన్ని కూడబలుక్కొని
ఒక్కకాడ గూసుండి కొక్కరో కోయని కూసినట్టు
ఊరు వాడ, పల్లె పట్నం జయ జయ ధ్వానాలు
తెలంగాణ మాగాణమంతా సంబురాలు
సిచ్చుబుడ్లు, పటాకలు బాణాసంచ పేలుళ్ళతో
మిరిమిట్లు గొలిపే ఆనందపు అంబరాలు
అమరుల ఆశలు ఆశయాలు నెరవేరిన క్షణాలు
ప్రతి హృదయం ఆనంద డోలికల్లో
తేలియాడిన తన్మయత్వాలు
ఆకాశం నిండి సప్తవర్ణాల సింగిడిలై
విరబూసిన జెండాలు
నాల్గుకోట్ల ప్రజల 60 యేండ్ల స్వప్నం
సాకారమైన సంతోషాలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష
విజయ తీరాలను ముద్దాడిన మురిపాలు
బతుకమ్మ ఆటలై రేలా దూలపాటలై
తెలంగాణ నేలంతా పులకరించి
పరవశించిన సందర్భం
తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వ పునాదులపై
సగర్వంగా తల యెత్తుకు నిలబడిన మధుర క్షణం
కోటి ఆశల తెలంగాణ కళ్ళముందు
సాక్షాత్కరించిన దృశ్యం
ఆనందబాష్పాల తోరణాలతో
ప్రత్యేక తెలంగాణకు స్వాగతాలు
నా మాగాణం బంగరు తెలంగాణై మెరవాలి
నా తెలంగాణ కోటి రతనాలవీణై మ్రోగాలి
జయహే తెలంగాణ
జయ జయహే తెలంగాణ





**తైదల అంజయ్య**
నాగ సముద్రాల (విలేజ్) బస్వాపూర్ (పోస్ట్), వయా శనిగరం
కరీంనగర్-505 473 చరవాణి: 9866862983
ఇ-మెయిల్: thaidalaanjaiah@gmail.com

400

# నీటి గజ్జెల మోత

ప. వానకు దోసిళ్ళు పట్టాలె -
మన వాగువంకలు పొంగిపొర్లాలె
ఊరూరి సెరువులు నిండాలె -
అవి ఊట సెలిమెలయ్యి ఊరాలె.

చ. గొలుసు చెరువులన్ని కలిసి మెలిసి యింక
- వొడువని ముచ్చట్లు పెట్టాలె
మొదలు దుంకె మడిల నీటి సప్పుళ్ళతో
- ఎదలు నిండె పాట పాడాలె
సెప్పక సెయ్యక వచ్చిన కప్పలు
- వానరాగమెత్తుకోవాలె
దర్వాజ కెదురుంగ వరి గొలుసుల మీద
- ఊరపిస్కెలు ఊగులాడాలె
పిరికిగా ఉరికేటి నీరుగట్టెలన్ని
- నీటిమీద నాట్యమాడాలె
ఎన్నీల మెరిసేటి సెరువు నీళ్ళలోన
- సందమామలు సెంగలియ్యాలె ॥వానకు॥

చ. జలజల జారేటి పొర్లుమత్తళ్ళన్ని -
జలతారు మెరుపులు మెరవాలె
పొద్దున వొడిసేటి సూర్యుడు నీళ్ళల్ల
- కుంకుమ్మ తానాలు జెయ్యాలె
నాసుల దాగున్న కొర్రమట్టల జూసి -
పోరగాండ్లు గాలమెయ్యాలె
మునిగి తేలుతున్న బుడువుంగలను నిలిసి
- చిట్టి చేతులు పడవలెయ్యాలె
తుమ్మగజ్జెలు గట్టి సెరువు కట్టమీద
- పిల్లలంత ఆటలాడాలె
అద్దమోలె వున్న సెరువు సెంపమీద
- సుక్కలు ముగ్గులు వెట్టాలె ॥వానకు॥

చ. ఒడ్డున నిలుసుండి గుడ్డి తౌసు జూసె
- కొంగ బావ కడుపు నిండాలె
నల్లతుమ్మ మీద తియ్యటి కలగన్న
- తీతువు పిట్టేదో కుయ్యాలె
కల్లాలు ఊడ్చేటి కూలి తల్లులకు
- కలల పంటలెన్నొ పండాలె
జమ్మి కొమ్మ మీద కూసుండి సూసేటి
- పాలపిట్ట మురిసిపోవాలె
జిగిబిగి గూడులో గజిబిజిగా వున్న
- గిజిగాడు ఉయ్యాలలూగాలె
చెక్కున్న మెరిసేటి సెరువునీటిలోన
- మొగులు మొకము జూసుకోవాలె ॥వానకు॥

చ. ఎండకు వానకు కాకిలగ్గమయ్యి -
తూరుపున సింగిడి పొడువాలె
తీరొక్క దినుసుల్ల తీరిక లేకుంట -
పునాస పంటలు పండాలె

కట్ట కానుగుసెట్లు కష్టజీవులకు -
సల్లటి గాలులు వీచాలె
లొట్టి మీది కాకి సెట్టు కల్లు దాగి -
జానపదములెన్నొ పాడాలె
ఎటువడితె అటునడిసె ఎండ్రికాయలన్ని
- దొంగ కొంగల మెడలు గొరుకాలె
పూడిక తీసిన సెరువు కుంటలల్ల
- కరువు నింక పాతిపెట్టాలె ॥వానకు॥

చ. పారె నీటిలోన తుంగ మొలుక మీద
- శెనిగెపిట్ట ఊగిపోవాలె
తళతళ మెరిసేటి నీటి తడల వోలె
- పల్లె బతుకు సాగిపోవాలె
నిండిన సెరువుల్ల నీటి పడవ మీద
- బంగారి బతుకమ్మ తేలాలె ॥వానకు॥



తంగెళ్ళపల్లి కనకాచారి

# 401

## ఉప్పెన

జై తెలంగాణ జైత్రయాత్ర సాగుతుంది
ఇక్కడ స్వపక్షమో ప్రతిపక్షమో తేడా లేదు
చుట్టూ గులాబీలే పర్చుకున్నాయి
బతుకమ్మలే ఊరేగుతున్నాయి
జైకొట్టాల్సిందే..
మన నేలపై మన పాలన సాగాల్సిందే!
శతాబ్దాల భవితకు
పునాది గట్టిగా వేయాల్సిందే..
వేల హారతులు పట్టండి
నింగీనేలా విస్తరించి
వేల కలల్ని.. శోభల్ని చిందుతూ
ఆవిష్కరించబడిన తెలంగాణ తల్లికి
మొక్కుదాం...
సలాం నమస్తే అని పుష్పవర్షం
కురిపిద్దాం రండి!!
చక..చకా... వేగంగా కదలండి
బంగారు తెలంగాణకై
కవాతు చేద్దాం పదండి.
జన ఉప్పెన సాగుతుంది
తెలంగాణ మురుస్తుంది
జై తెలంగాణ అని
నేలంతా గర్జించండి!!
వేల చిరునగవుల్ని మెరుపుల్ని
పూలపరిమళంలా వెదజల్లండి!!

**ఉదారి నారాయణ**
ప్లాట్ నెం. 18, కెసిబి గార్డెన్స్ ఎదురుగా, రాంనగర్
ఆదిలాబాద్. చరవాణి: 9441413666
ఇ-మెయిల్: udarinarayana@gmail.com

402

## సొంత ఇల్లు

అరవయ్యేండ్లకు నా ఇంటిని చూశాను
కాళ్ళకంటిన మట్టి పరిమళం
నాలో వీరుని ఉత్తేజాన్ని నింపింది నా ఒంటి నిండా
అవ్వపెట్టిన ముద్దుల ముద్రలు పెయినిండా
పానపానంగా బునికిన ఆనవాలు
నా తెలంగాణ దేహమంతా పాలపిట్టల కోలాటాలు
మోదుగు పూల నుమాయిషీలు
ఇప్పుడు నా గుమ్మం పేరు మారి
దర్వాజా అయింది మజ్జిగపోయి సల్లకుండైంది
ఇప్పుడు నా బట్టలు నేనే తొడుక్కొంటున్నాను
పోకబంతి గుండీలని మురిపెంగా ముట్టుకుంటున్నాను
పిల్లలంతా! అవ్వా, అయ్యా చిన్నక్కా, మాటల్ని
దక్కను పీఠభూమి పలకపై
ముద్దుముద్దుగా దిద్దుకుంటున్నారు
మునిపంతులు వేళ్ళనిండా బలపాలు
బడిలో పిల్లల కేరింతలు ఒకప్పుడు ఇదే ఇంట్లో
ఎవడో పూసిన వేషంతో ఎవరో రుద్దిన ఎంగిలి పలుకుల్తో
పెద్దల కుర్చీ కింద కార్పెట్‌నయ్యాను
తెలంగాణ అనే ఒకే ఒక్క మాటకోసం
ఆకాశమంత దోసిలితో అవకాశాన్ని అడుక్కున్నాను
చూరు కింది బల్లిలా జీహుజూర్ నయ్యాను
ఇప్పుడు
ఒక్క ఈ ఇల్లే కాదు లోకమంతా నా వాకిలే
ఇక బాసరనుంచి భద్రాచలం దాక
హాయిగా ఈతాడుతాను గంగతల్లి పాల ధారని
తనివితీరా చప్పరిస్తాను ఈరోజు మంచిరోజే కాదు
ముంచినోడి చేతినుంచి పగ్గాలు అందినరోజు
ముగ్గుల ముంగిళ్ళు ముసిముసిగా నవ్విన రోజు
ఆ ముగ్గుల బుగ్గలమీద లంగా ఓణీలపై
చిలుకలు ఎగిరిన రోజు
అమరులారా! వీరులారా!
ఈ నేలతల్లి విముక్తికోసం
పోయిన ప్రాణాలు ఇంటింటా
వెలుగులీనుతునే ఉన్నాయి
నోరెండిన పైరుకు తల్లుల శోకం
పచ్చదనాన్ని అద్దుతున్నది
యోధులారా!
మీ శవాలుమోసిన భుజాలపైనే
కొత్త నిర్మాణపు రాళ్ళు తరలిస్తాం
శ్రీకాంతాచారి కానిస్టేబుల్ కిష్టయ్యా
మీ పిడికిళ్లనుంచే మీ చివరి నినాదాలు
సాకారమవుతాయి ఆ కలలకోసమే
రెప్పవాల్చని ఆశయాలతో
ఆగని ప్రయాణం
సాగుతునే ఉంటుంది.

**ఉడుగుల వేణు**
చరవాణి: 09390871129, 09059635799
ఇ-మెయిల్: udugulavenu@gmail.com

403

# కేషియా ఆరిక్యులేటా

పుట్టేవాళ్లతో పుడుతూ, పోయేవాళ్లతో పోతూ
నిరంతరం బతికుండే బంజరుదీపాలవి
అవి కేవలం పూలే కదా అనుకోవద్దు
ఒక సంస్కృతికి పహరకాస్తోన్న దేవదూతలవి
మనం పూజించటానికి వాటికి పాదాలు లేకపోవచ్చు
కానీ...
మనతో పాటుగా... మన ప్రగతిశీల స్వప్నాల్లోకి నడుస్తూ
వస్తాయి
చూడ్డానికి వాటికి కళ్లు లేకపోవచ్చు
కానీ....
మనలోని నిగూఢమైన బాధని చూస్తూనే ఉంటాయి
మన కష్టాలని కన్నీళ్లని కళ్లకద్దుకుంటాయి
కరచాలనం చేయటానికి వాటికి చేతుల్లేకపోవచ్చు
కానీ,
నేల తల్లికి అలాయి బలాయి ఇచ్చి
విధ్వంస కారుల శిరస్సులపై గజ్జెల నాట్యమాడుతాయి
కొట్టుకుపోయిన పద్యాలన్నింటినీ తిరిగి తెస్తాయి
వాటికి మాట్లాడ్డానికి నోరులేకపోవచ్చు
గొంతెత్తి నినదించలేకపోవచ్చు....
కానీ,
వాటి గుండెలోని ఆవేదనని గాలి ద్వారా వ్యక్తం
చేస్తూంటాయి
ఇవిగో వినబడుతున్నాయా "కేషియా ఆరిక్యులేటా"
మాటలు
"మనుషులు ప్రశ్నించటంలేదంటే- మరణించినట్లే
లెక్క"

**ఉండ్రాల రాజేశం**
20-105/28, వినాయక్‌నగర్, సిద్ధిపేట
మెదక్ జిల్లా. చరవాణి: 9966946084

404

# తెలంగాణ సంబురాలు

ఆకలి కేకలతో, అతుక్కుపోయిన పేగులతో
సొమ్మసిల్లిన అవ్వ, అయ్యలకు
ఆసరా పించన్లు అండగా నిలిచిన వేళ
తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినాయి.
రైతన్నలందరికి ఋణమాఫీ అందించి
మిషన్ కాకతీయతో చెరువుల్ని తవ్వించి
తెలంగాణ మాగాణి పులకించిన సమయాన
తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినాయి
బీడీ కార్మిక, వికలాంగులకు జీవనభృతి అందించి
నిరుపేద ప్రజలకు భూముల్ని పంచి
కార్మిక, కర్షక, ఉద్యోగులకు వరాలు ప్రకటించిన వేళ
తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినాయి.
ప్రాజెక్టు నిధులు దండిగా మలుగగా
వాటర్‌గ్రిడ్ పనులన్నీ రాష్ట్రమంతా తిరుగగా
పథకాల జాతర ప్రతి పల్లె చేరిన శుభవేళ
తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినాయి
అమరుల ఆశయాలు ఫలిస్తుండగా
చేసిన బాసలు నెరవేరుస్తుండగా
ఉద్యమ పాఠాలు బడిగుడిలో బోధించిన వేళ
తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినాయి.





**వద్దిరాజు నాగేందర్ రావు**
8-15-47, సద్గుర్‌నగర్, ఎల్‌బినగర్,
రంగారెడ్డి-500074 చరవాణి: 9948892681

405

# తెలంగాణ కవి ఆనందబాష్పాలు

**బా**ధపడి కన్నీళ్ళు అప్పుడు
ఆనంద బాష్పాలు ఇప్పుడు
కన్నతల్లి తెలంగాణ ఆనందబాష్పాల్లోన
కవి గుండె పరవశించి కవితలల్లె మనసులోన
వినిపిద్దామనుకుంటే వినేవారు ఇందరా!
అమ్మంటే ప్రేమ అమ్మంటే స్వేచ్ఛ
అమ్మంటే ఆత్మగౌరవం
తెలంగాణ మట్టి పరిమళం
నా జాతికి రత్నాలహారం
ఆ వెలుగుల్లో నా భాష విలసిల్లాలి
మన నేల తల్లి పులకించాలి
యెదయెదనా సంబరం కలకాలం నిలవాలి.



**వఝల శివకుమార్**
శివానందలహరి, 1-20-198/2, గోకుల్‌నగర్, వెంకటాపురం,
సికింద్రాబాద్-15. చరవాణి: 9441883210
ఇ-మెయిల్: shivakumarvajjale@gmail.com

406

# కల సాకారమయ్యే దాకా...

అరవై ఏళ్ళ తాయిమాయిలని మోపిన కళ్ళల్లో
సుళ్ళు తిరిగిన కల
రెప్పల మీంచి సంబురాల కాంతిలా
చెంపల మీదికి మత్తడి దుంకింది.
ఉద్యమ ఋతువుల నిండా
ఆకురాలుకాలాలే ఆరడి పెట్టినంత ఆయకలం
నేలంతా నెత్తుటి చాళ్ళై
కడుపుకోతలు వలపోతైనంతకాలం
తీరాలమీంచి తీర్పాటంగా వినోదం చూస్తూ
ఎవరిగూటిని వాళ్ళు పదిలం
చేసుకున్న వాళ్ళే
నిస్సిగ్గుగా ఈ విజయం మీద
తమ పేర్లు చెక్కుకుంటున్నారు.
పుష్కర కాలంనించీ
మాటకుకట్టుబడ్డ నిర్ణయం
కాగితాల కడప దాటలేనంతకాలం
ఆమొక్కని గుండెగుండెల్లో నాటి
కోట్లాదిప్రాణాల నాదంచేసి
మందారపూల జాతరగా మలిచిన
ఆ ఒక్క జొన్నకర్ర నిబ్బరమూ,
వేలాది ఆత్మబలిదానాల వెల్లువా
గన్ పార్కు స్తూపం ముందు
అసలైన నివాళికి
నిదర్శనాలై మిగిలిపోతాయి.
సాకారమైన కల ఆకారం దాల్చకముందే
ఎవరి ఆటల్లో వాళ్ళు దారి తప్పితే
రేపటి రాలినపూల రెక్కలేం చెబుతాయి
మౌనంగా రోదిస్తాయి తప్ప.
అరవై యేళ్ళుగా ఆవిష్కరణకు నోచుకోని
ఆత్మసమర్పణల సాక్ష్యం ఎవరిని నిలదీస్తుంది
చరిత్ర పేజీలో చెదిరిపోయిన అక్షరాల మధ్య
మిగిలి పోతుంది తప్ప.
ఊహల్లో ఉన్నతంగా కదిలిన స్వప్నం
నిర్ధారణగా నిలదొక్కుకునే దాకా
ఉద్యమం కొనసాగాల్సిందే...
యుద్ధం జరగాల్సిందే...
శత్రువు ఎక్కడికో పోలేదు
మన ఆలోచనలో ఆలోచనగా
ఆచరణల్లో అబద్ధంగా ఎదురౌతుంటాడు
అందరి ఎజెండాలదీ ఒకటే పల్లవి
పాట ఆరాటం వేరు
ఆకర్షణీయంగానే ఉంటుంది.
పురోగతికే పుట్టెడు
యుద్ధం చేయకతప్పదు
గడపదాటినవాడికన్నా



గడపలో ఉండి ద్రోహం చేసేవాడే
నిజమైన శత్రువు పునాదులని సరిచేసుకోవాలి
మనాదులు నిలబెట్టుకోవాలి
పాదులనిండా నమ్మకాలు నాటుకోవాలి
నేలను అమ్మకం సరుకుగాకాక
అమ్మని చూసుకున్నట్టు పవిత్రంగా చూసుకోవాలి
ఘర్షణ అనివార్యం సంఘర్షించాల్సిందే
మనవైరుధ్యాలతో మనం
మనవైషమ్యాలతో మనం
శత్రుశేషాల కుట్రలతో మనం
మనబలహీనలతో మనం
ప్రపంచీకరణజాలంతో మనం
నిరంతరం నిరంతరం యుద్ధం చేయాల్సిందే....
కోటిరతనాల వీణ రాగాలను
జనజీవనాడుల్లో ప్రతిధ్వనింపజేయాలి
బతకమ్మ సోయగం బతుకులనిండా
విరబూసేదాకా
స్వర్ణ తెలంగాణా సిద్ధించేదాకా
ఉద్యమం కొనసాగాల్సిందే.... యుద్ధం జరగాల్సిందే

వడ్డెబోయిన శ్రీనివాస్
కాజీపేట, వరంగల్.
చరవాణి: 9885756071

407

## లాంగ్ లివ్ తెలంగాణ

ఒక దీపోత్సవం
ఒక దీపజాతర
వెలుగులు పంచి
కరిగిన
వెలుగులు నవ్విన రోజు
మరుభూమిని తెరచి
మాయమైన కాగడాలు
మళ్ళీ కళ్ళు తెరచిన రోజు
జూన్ రెండంటే
అమరుల పుట్టిన రోజు
అమరుల పుట్టిన రోజంటే
వీరులు దీపధారులైన
తెలంగాణ పుట్టిన రోజు
తెలంగాణ పుట్టిన రోజంటే
సారాన్ని పీల్చి బల్చిన
ఒక చీకటి మరణించిన రోజు

జూన్ రెండంటే
సూరీడు
తనజన్మస్థలం కనుక్కున్న రోజు
జూన్ రెండంటే
గుడిసె కొప్పుమీద కూర్చున్న చుక్కలు
తమ శాశ్వత పర్యాటక కేంద్రాన్ని
ఖరారు చేసుకున్న రోజు
చిలుం రాలేలా
నాగలి నవ్విన రోజు
చెదలు కూలేలా
ఎడ్లబండి ఎగిరిన రోజు
జూన్ రెండంటే
పొలము పుస్తకము-చెమటచుక్క
కలిసి గెలిచిన గుర్తు
విష్‌యూ హ్యాపీ బర్త్‌డే తెలంగాణ





**వనపట్ల సుబ్బయ్య**
భార్గవీ హెయిర్ స్టయిల్, ఆర్టీసి బస్టాండ్ దగ్గర,
నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్-509 209
ఇ-మెయిల్: subbaiahvanpatla@gmail.com

408

# అమరవీరులకు గంధమెల్లాలి

ఎత్తిన జెండా దించకుండా నిప్పుల మీద బూడిదై
నిలబడి గెలిచినం పట్టిన కూతాపకుండా
వస్తున్న రైలుకెదురురికి మైలురాళ్ళను దాటినం
ముళ్ళ కంచెలు పరిచినా ఇంటికి గిద్దెడు పిండితో
రోడ్లపై రొట్టెల సమ్మెటైనం
వంటా వార్పులతో సడక్ బంద్లైనం
ఊర్లంతా ఒకటే టెంట్ కింద
మానవహారాల మార్చ్‌లైనం
మలుపు మలుపుకో ఆత్మత్యాగంతో
ఉద్యమాన్ని అఖండం చేసినం ఆకాంక్షలు ఫలించి
ఆశయాన్ని ఆవిష్కరించి ఏడాదైంది
మన తల్లికి మనమే బోనం వండుకుంటున్నం
పొయిల కట్టెలు మండక
వోటి ఉడికినట్లు వోటి ఉడకనట్లు
చినుకు చిత్తడిలేక
భూమి నాలుకెల్లబెట్టింది
గుంటుక గొర్రున మిరిచ్చి
సేద్యానికి పలుపులు పేనాలి
పలుకుబడులు, సామెతలు, జాతీయాలు
మాండలికాలకు మండె పెట్టాలి
వైతాళికులు వెండి వెలుగులకు
కళాయిలో పోతలు పోయాలి
పాలకుండ చిల్లులు పడకుండా
సారక్క, బతుకమ్మలు కలిసి నడువాలి
సమైక్య అవశేషాల్ని పెకిలించ
సర్వాయి, సాయన్నలు
పలుగులకు మొనలు పెట్టాలి
బడులకు సున్నమేసి
విద్యార్థులను జయశంకర్‌ల చేయాలి
కొలువులకు కొట్నం పెట్టి
పోషమ్మకు బోనాలెల్లాలి
సంస్కృతి హిమశిఖరమై నిలువాలి
పోరాటం పొద్దులో కలలెన్నో కన్నాం
సాగరహారంలా సాగితేనే
శిలలు శిఖరాలైతవి
అస్తిత్వాన్ని చార్మినార్‌లా నిలబెట్టి
త్యాగాల్ని అమరత్వం చేయాలి
మనది మనకైనా
రేపటికి ఉట్లు కొట్టకపోతే
ఫలించిన కలలు పగిలిన డప్పులైతయి
పాతరాతలకు పాతరేసి
కొత్త రాతలకు పుటలెత్తాలి
తెలంగాణకై తెగించి రాయబడ్డ
కవితా కలాలకే దండలేయాలి
పరిమళించిన నేలపై
అమరవీరులకు గంధమెల్లాలి.



**వల్లందాసు వెంకటేశ్**
నర్సాపూర్, మెదక్ జిల్లా
చరవాణి: 9505555197

409

## సర్వేంద్రియాలు

రెండు కండ్లలో సుడులు తిరుగుతున్న
తెలంగాణ ఆశలు
రెండు చెవులనిండా
జై తెలంగాణ నినాదాలే నిండిపోయినై
నాసికా రంధ్రాలు
తెలంగాణ మట్టి పరిమళాల్నే
ఆస్వాదిస్తున్నాయ్...!

కంఠ స్వరం గంభీరమై
ఇంటింటికి కలల తోరణాల్ని కడుతున్నది
జై తెలంగాణ అంటు గర్జిస్తుంది...!
స్వేదరంధ్రాల చెమట చుక్కలు తైలమై
ఆకాంక్షల జ్యోతిని ఆరిపోకుండ కాపాడుతున్నయి
నా సర్వేంద్రియాలు ఒకే ఒక నినాదం చేస్తున్నై
జై తెలంగాణ అని....!



**వరుకోలు లక్ష్మయ్య**
12-1-156, మోహిన్‌పురా, సిద్దిపేట, మెదక్-502 103

# 410

## చెరువు కల్పతరువు

ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ
నిండు గర్భిణిలా కనబడే చెరువును చూసొద్దామన్న
ఆలోచన
మదిలో తళుక్కుమని మెరిసి నడుచుకుంటు చెరువు
నడికట్టపైకెక్కి చూస్తే నా చెరువుతల్లి అస్థిపంజరమై
అగుపించెను.
చెరువు కుంటలడుగంటి పొయినయి
పొలాలు అన్నీ బీడులయినవి
బావుల ఊటలు ఆగిపోయినయి
దాహం తీర్చని నోళ్ళు తెరిచినయి
మిషను కాకతీయ చెరువుల
ఉద్ధరించ వచ్చె ముందుకు
ఊరువాడలను ఏకమె జేసెను
ప్రజలనందరిని మేలుకొల్పెను
పలుగు పారలు పట్టమన్నది
చెరువుల వైపు నడువమన్నది
చెరువుల ఉన్న పూడిక తీసి
పంట పొలాలలో వేయమన్నది
మిషను కాకతీయ జనుల జాగృత మొనర్చెను చూడు
చెరువే ఊరికి ఆదరువంటు
కరువు రక్కసిని తరుమాలంటు
పల్లెలు వలుసలు వెళ్ళొద్దంటు
ఊరు బడిలో నిదురించాలంటు
జన చైతన్యమే జరగాలంటు
చెరువే కల్పతరువు కావాలని
మిషను కాకతీయ
ఊరి కన్నీళ్ళు తుడువొచ్చె చూడు.
ఊసిల్ల పుట్టల్ల ఊరి జనమంత
ఉద్యమమయ్యి సాగుత ఉంటె
చెరువు తల్లి పులకించి పోయెరా
వరుణుడు మనపై కరుణ జూపితే
చెరువులు నిండి అలుగులు పారుర
హలాలతోనే పొలాలు దున్నితే
మంట్లె మానెడు ఇంట్ల పుట్టెడై
తెలంగాణ బంగారు వర్ణమై
పల్లెలు వెలుగుతో (ప్రగతితో) నిండును గదరా
అప్పుడు...
కరువు తొలగి మనకు
సకల సంపదలు కలుగు ప్రజలకు.

**వరంగల్ శ్రీనివాస్**
ఇంటినెం. 16-5-182, పెరకవాడ, రైల్వేగేట్,
వరంగల్-506002. చరవాణి: 9440691695

# 411

# త్యాగాల పూల బత్కవ్వ

తెలంగాణ కొరకు తెగబడ్డ తనవూలన్ని తంగేడు పువులయ్యినాయో
గుండెలవిసి గుడిశలున్న పిలగ్గాంన్నవ్వ గునుక పూతై బూశినాదో
వలసదోపిడి వీఁన వురిమి చూసిన కండ్లు రుద్రాచ్ఛపువులయ్యినాయో
గోసెల్ల దీశినా గోండు గూడాలన్ని గోరంటలై పూసి నాయో
త్యాగాల తెలంగాణ బతుకవ్వనీదీ
కన్నతల్లిగారీయిల్లు బతుకవ్వనీది
సిగఁ పూగ బొట్టు బోనఁవ్ ఎత్తు కున్న తల్లి సీత జెడకుచ్చుయ్యినాదో
అవమానఁవులు బడ్డ తెలంగాణ బిడ్డలె అల్లిపువ్ లైపూసినారో
కాలన్న కలగన్న తెలంగాణ యెనుగంత కట్లాచ్ఛ పూతేసినాదో
మూగవోయిన కోటిరతనాల వీణిపుడు ముద్దబంతీ తోటయిందో
త్యాగాల తెలంగాణ బతుకవ్వనీది
కన్న, తల్లి గారీయిల్లు బతుకవ్వనీది
గోసి గొంగల్లేషి గర్జించినా గొంతు గన్నేరు పూతయ్యినాదో
శిదిలఁవయ్యా శిన్న బోయినా నా పల్లె బంగారి శిబ్బయ్య నాదో
గుమిగూడినా పోరు జెనమందరీ గునము గుమ్మడీ ఆయ్యినాదో
తుపాకి తూటాలకు, తూట్లు బడ్డా పల్లె తొమ్మిత్రీర్లాపువ్వయిందో
త్యాగాల తెలంగాణ బతుకవ్వనీదీ
కన్నతల్లిగారీయిల్లు బతుకవ్వనీది
బతికి జెడినా పూల్ల బతికిచ్చేతందుకూ బరోస బతుకవ్వయిందో
గౌరవంగా ఆత్మగౌరవాన్ని నిలుప పసుపు గౌరమ్మ నిలిచిందో
గుగ్గిలం, మైసచ్చి, పూదు, బత్తీల పొగ ఉసునెంతల్లదరిమిందో



త్యాగాల తెలంగాణ బతుకవ్వనీదీ
కన్నతల్లిగారీయిల్లు బతుకవ్వనీది
కొట్లాడి తెచ్చుకున్న కోట్ల జనులాకాంక్ష కుంకుమాబొట్టు దిద్దిందో
శృంగారవతులైన తెలంగాణ ఇంటాడి బిడ్డలూ శేతి కెత్తిండ్లో
తొలిరోజు తుల్వాకు, పలారమని బెడితె తొల్గు మీ బాధలన్నావో
రొండొనాడు రొట్టె పంచిపెడితేరేన్లొ వానయ్యి వస్తనన్నావ్
త్యాగాల తెలంగాణ బతుకవ్వనీదీ
కన్నతల్లిగారీయిల్లు బతుకవ్వనీది
మూడోనాడూ ముద్ద మురిపెంగ దినబెడితే ముక్తి గల్గిత్తనన్నావో
నాల్గొనాడూ నాన బియ్యంవూ( బంచునవదనామై వస్తనన్నావో
ఐదొనాడూ అట్టు బించ్చి పెట్టూ అమరవీరులకు ముట్టునన్నావో
ఆరోరోజూ అన్నదాత ఆకలిజూత్తె అ(రెఁవూఁ ఆడనన్నావో
త్యాగాల తెలంగాణ బతుకవ్వనీదీ
కన్నతల్లిగారీయిల్లు బతుకవ్వనీది
ఏడోరోజు ఎన్నముద్ద చేతికిత్తె ఎదుగు సఁవుఁసారఁవఁన్నావో
ఎనిమిదోరోజుల్కు పండు బాట్టూ కత్తె ఎనలేని ప్రేమలన్నావో
తొమ్మిత్రీర్లాసద్ది తొమ్మిదో నాడిస్తె తెలంగాఁల్నె పుడ్తనన్నావో
వాయివరుసలు మరిసివాయునాలిచ్చి వెయ్యేండ్లు వర్ధిల్లామన్నావో

**వారాల ఆనంద్**
కరీంనగర్. చరవాణి: 9440501281
ఇ-మెయిల్: aanandvarala@gmail.com

412

# పాట-పాటగాడు

అవిటి కాళ్ళు
ఆరని ఆర్తి
చెక్కబల్ల
నాలుగు గీరలు
నడకయినా పరుగయినా
చక్రాల బల్ల నే
అరచేతులే
పడవ తెడ్లై
జన ప్రవాహంలో
అతన్ని నడిపిస్తాయి
చక్రాల్లాంటి కళ్లు
తెర చాపలయి దిక్కులు చూపిస్తాయి
అరాచకపు ట్రాఫిక్ రణ గొణల నడుమ
అటూ ఇటూ చూసి
రోడ్డు పక్క లంగరేసుకుని
చక్రాల బండి నిలిచిపోతుంది
దుఃఖంలో తడిసిన
పాటేదో అలలు అలలుగా
అక్కడంతా వ్యాపిస్తుంది
కంఠంలో మాధుర్యం లేదు
రాగంలో సరిగమల్లేవు
గురిచూసి హృదయాన్ని తాకే
గుణమేదో పాటకు
ప్రాణం పోస్తోంది
భాషలు ఒకటో రెండో
రెండూ కలివిడిగానో
పాట ప్రవాహమై పరివ్యాప్తమవుతోంది
ఆర్ద్రతో ఆకలో
జీవనపోరాటపు
కంజీర నాదమో
మనసంతా కలి కలి
ఉరుకులు పరుగుల నడుమ
కాలం నిలవదు
పాటా అంతే
గొంతులోదే కాదు
గుండెలోని తడి ఆరేదాకా
గడియ రికామీ లేని
రోడ్లన్నీ
పరుగులు పెడుతూనే వున్నాయి
పాటకు
అడవిల పొద్దు గూకింది
పాటగాడికి
ఎడారిల తెల్లారింది

**వలస. వెంకటేశ్వర్లు**
గ్రా. పెర్కకొండారం, శాలిగౌరారం మండలం,
నల్లగొండ జిల్లా.
చరవాణి : 9542315245

413

## నా తెలంగాణ

తరాలుగా కన్నీటి చుక్కలతో
తడిసిన
ఈ నేలపై కూడు గూడు
నీడలేని వాళ్లకు
ఒక భరోసా నియ్యాలే
ఊరూరా చెరువులు కల్పతరువులై
కరువు
కోరలూడదీయాలె
పల్లెను
ఎముకల గూడు చేస్తున్న
ధనదాహపు డేగల
రెక్కలు విరియాలె
ఇసుక విరియాలె
ఇసుక వాగులు
ప్రకృతి పలకలై
కొత్త ముచ్చటకు
వేదికలవ్వాలె!
దివికి-భూవికి
బంధమైన జలఅద్దం
ఇక్కడ
వలస బతుకులకు పన్నె తేవాలె
కష్టాల కంపముండ్లు
కానరాకుండ పోవాలె విరబూసిన
కట్లపువ్వులవోలె
వికాసము పొందాలె
నా తెలంగాణ దళిత, గిరిజన
సకల వాడలన్ని
కలియదిరుగాలె
ఈ నేలపై శాంతి పావురం!
అసమానతలు తొలిగిపోవాలె పంతం
ప్రతీకారాలు అంతం కావాలె
ఈ తల్లి బిడ్డలు ఐక్యమత్యానికి
చిరునామాలై నిలువాలె!
రైతన్న రోదనలు పోవాలె
పసిడి పంటలతో
పల్లెలు విల్లసిల్లాలె
కవి పండితులను ఆదరించుటలో
గద్వాల, వనపర్తి సంస్థానమ్ముల
మైమరపించాలె
బంగారు తెలంగాణ
నా తల్లి భారతి శిరస్సున
కీర్తి కిరిటమై మురియాలె
ధగధగ మెరియాలె
నా తెలంగాణ!

**వల్స-పైడి**
ఇంటి.నెం. 15-10-19, పసిడి నిలయం,
రామన్నపేట, వరంగల్-506002.
చరవాణి: 9849459667

414

## ఇది సాధ్యమే....

అందరొక్కటైతే
అవనిపై అసాధ్యమనేది లేదని
మాల్లొక్కసారి తెగేసి చెప్పింది
తెగదెంపులు చేసి చూపింది
తెలివిగల్ల తెలంగాణ...
యుద్ధానంతరం
కకావికలైన జీవితాలను
శిథిలమైన నిర్మాణాలను
మరుగున పడిన మాణిక్యాలను
కూలి కూరుకుపోయిన శాసనాలను
మరమ్మత్తు చేసుకునే
మంచి పని మొదలు పెట్టింది
మా రాజులా ముందుకెళ్తోంది
బంగారు తెలంగాణకు బాట వేస్తోంది
భూమికి బువ్వ పెట్టే రైతన్న
రత్న సింహాసనంపై
రాజులా వెలిగే రోజు రావాలనీ...
గోదావరి కృష్ణమ్మలు
గోల పెడుతూ ఈలలేస్తూ
పసిడి పంటల గొంతులు తడపాలనీ...
ఊరూరి చెరువులు
ఉదక దాహం తీరి
నిండు చూలాల్లుగ మారాలనీ....
పచ్చని వనాలతో
పక్షుల కిలకిల రాగాలతో
ప్రకృతి కాంత పరవశించాలనీ...
చీకటికి చరమ గీతం పాడి
విద్యుల్లతలతో విశ్వతేజంతో
కొత్త రాష్ట్రాన్ని నింపాలనీ...
చదువుకున్న చక్కనయ్యలు
సర్కారు కాలువలు సుక్కలతో
సంబురంగా ఆడాలనీ పాడాలనీ...
మంచి పనులు మొదలు పెట్టింది మన తెలంగాణ
మా రాజులా ముందుకెళ్తోంది మన తెలంగాణ
బంగారు తెలంగాణై భాసిస్తుంది మన తెలంగాణ
జై తెలంగాణ... జై జై తెలంగాణ 2



**వల్లభాపురం జనార్దన**
1-10-85/6/బి/3, భవిత కాలేజ్ ఎదురుగా, షాషాబ్‌గుట్ట,
మహబూబ్‌నగర్-509 001 చరవాణి: 9440163687

415

# జయ జయహే తెలంగాణ తల్లీ

జయజయహే తెలంగాణ తల్లీ జయజయహే
సకల జనుల గుండెలలో కొలువైతివి జయజయహే
తరతరాల పరాధీనతది తొలగెను జయజయహే
నాల్గున్నర కోట్ల ప్రజల కన్నతల్లి జయజయహే ॥ జయ ॥

పాల్కురికీ పోతన్నల జానుతెనుగు తియ్యదనము
పల్లవించి పరిమళించె గుండె భాష ఒరవడిలో
వట్టికోట దాశరథీ కాళోజీ సురవరాల
ప్రజాకవిత సాహిత్యము పొంగిపొరలె నీ బడిలో ॥ జయ ॥

సమ్మక్కా సారలక్క గిరిజన వనితల తెగువా
చక్రవర్తి నెదిరించిన చరిత జాతి పాఠమయ్యే
నియంతనే నిలదీసిన కొమురం భీము సవాళ్ళూ
బందగీ ఐలమ్మల పోరుబాట పిడికిళ్ళూ ॥ జయ ॥

జానపదుల జీవితాలు బతుకమ్మల వెలుగు పూలు
సాహసాలు త్యాగాలూ ప్రజల చేతి కాగడాలు
ఆగడాల అణచివేతపై కురిసిన బాజాలూ
తెలంగాణ పోరుబాట జాతి భవిత పాఠాలూ ॥ జయ ॥

తెలుగుబాస తెలుగుయాస తెలంగాణ సంస్కృతి
తెలంగాణ చరిత్రతో సాహితీ చరిత్ర ప్రగతి
భారత భారతి ఎదలో నెలవౌ గుణమానికమై
నలుదిశలా పాకుతుంది మల్లెపూల పరిమళమై ॥ జయ ॥

తుంగభద్ర గోదావరి కృష్ణ నదుల నీళ్ళమ్మా
పొంగిపొరే ధాన్యరాశి లోగిలి నీ నేలమ్మా
కరువులు పొలిమేర దాటి పారిపోవు నోయమ్మా
కర్షకులా కార్మికులా ప్రజా తెలంగాణమమ్మ ॥ జయ ॥

హితములేని గతము ఘనత మురిసి మురిసి పాడబోము
ఇప్పటికాలపు తప్పుల నిలదీయక ఊరుకోము
సమతకు బంగారుబాట లేసుకుంటు సాగుతాము
జగమంతా తెలంగాణ కీర్తిజండ ఎగరేస్తం ॥ జయ ॥





విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి

# 416

## గానము

ఉ. నేనొక పూవునై విరిసి నిత్య సువాసన లీనుదున్ తెలం
గాణపు దోటలో సుగంధము లద్దెద తెల్గు భాషకున్
గానము చేసి యాడెదను కైతల గుండెలు నిండుగా గనన్
వీణలు మీటి పిల్చెదను వీరుల నందర రాష్ట్రపూజకై.

తే.గీ. స్వర్ణ తెలగాణ ఫలియించి సాగిపోవ
కయికి గుర్తింపు నిచ్చెడి కళల ప్రోవు
చంద్రశేఖరుండు నిలుపు చైత్రదీప్తి
హృదయ స్పందన చందన హేల యిదియె.



**విజయ రాజం**
శ్రీ నిలయం, రోడ్ నం. 49, ప్లాట్ నం. 890,
బిహెండ్ మాన్‌స్టర్ డాట్ కం., జూబ్లీహిల్స్, హైదరాబాద్.
ఇ-మెయిల్: vijayachilappa@gmail.com

## 417

# నువ్వూ-నేను

ఉజ్వల భవిష్యదాకాశంలోకి రివ్వున
దూసుకుపోతున్న తారాజువ్వ నువ్వు!
నీ ఆలంబన కోసం నిన్నూ, నేలను
అంటిపెట్టుకున్న సీసాను నేను!
కీర్తి నిప్పు రాజుకున్న మరుక్షణం నుండి
వేగం పుంజుకొని నాకు దూరమవుతున్నా
నేను చలనం లేని సీసానే కదా?
విరుద్ధమైన మన స్వభావాలను కేవలం
వివాహ బంధంతో ముడివేసినంత మాత్రాన
నేను నీతో ఎగరలేను నన్నే ఆనుకొని నువ్వు ఆగలేవు
నీతోపాటు సమంగా ఎగరాలన్న విపరీతపు
ఆవేశంలో నన్ను నేను చీల్చుకొని వెళ్ళినా
ప్రాంగణం దాటలేని వేగం నాది!
కనీసం, తారాజువ్వలో భాగాలైన
కాగితం, పుల్లల్లాంటి వ్యక్తిత్వం ఉన్నా
గాలివాలులో నీవెంట కొంతదూరం
కలిసి ప్రయాణం చేసే అవకాశం ఉండేది!
సీసాలాంటి నిర్దుష్ట వ్యక్తిత్వం ఉన్నందుకు
ఇది వరకు గర్వంగా ఉండేది
కానీ, నువ్వు పగలగొట్టినా; నిన్ను రాజుకునే
వేడికి తాళలేక నే పగిలినా
ముక్కలుగా చెదిరిపోయే జీవితం నాదని
తెలిసిరావటం ఎంత దుర్భరం?
క్షణంక్షణం నాకు దూరంగా పోతున్న నిన్ను
చూస్తూ ఒంటరిగా ఏకాంతవాసంలో
మిగిలి, రగిలిపోయిన నేను - నేనుగా
మిగిలిపోవటం ఎంత నిక్రృష్టం?
నిన్ను కొట్టి పడవెయ్యటం ఇష్టంలేక
వినీలాకాశంలోని వింతలు విహంగంలా చూసి
రమ్మని పంపితే భూమ్యాకర్షణ పరిధిని
దాటుతున్న నిన్ను ఆకర్షించలేక
కేవలం వివాహ సూత్రాన్ని మాత్రమే ఆధారంగా
నేను లాగితే తప్ప దిగి రావటం ఇష్టం లేక
బిక్క చూపులు చూస్తున్న నువ్వు!
నిరాశపడక, బిత్తరపోతున్నా నీ కోసం
ఎదురుచూస్తున్న నేను! ఎంతో అరుదుగా నా మీద
జాలితో నువ్వు దిగి రావాలనుకున్నా
అనంత విశ్వంలో నుండి నీకు నేను కనబడక
నా వ్యక్తిత్వం వలె ఊరిస్తున్న పృథ్విని కూడా
కౌగలించుకోవాలా? అన్న అయోమయంలో నువ్వు!
నీ సహచర్యంలో ఉత్తేజం పొంది
ప్రాణాధిక ప్రయత్నం చేస్తూ కూడా
ముగ్గుదాటలేని నిర్వీర్యంలో నేను!
నన్నూ నా వ్యక్తిత్వాన్ని, పరమాణువులుగా
విడదీసినా పాదరసంలా సంపూర్ణ వృత్తాకారంలో నేను!
నువ్వు నువ్వే! నేను నేనే!
భిన్నత్వంలో ఏకత్వం మన వారసత్వమైనా
ఒక్కొక్క సందర్భంలో ఇద్దరం
ఒక్క ఉనికి, ఒక్క తత్వాన్ని
ఆశించడం ఎంత హాస్యాస్పదం?

విరజాజి రామిరెడ్డి
చరవాణి: 9440801423

# 418

# పండుగ రోజు

ప్రత్యేక రాష్ట్రం
అవతరించిన రోజు
తెలంగాణ ప్రజలకు
పండుగ రోజు
ఈ పండుగ
అయాచితంగా రాలేదు
ఎందరో తమ ప్రాణాలను
బలిచేసి అమరులైరి
వారి త్యాగం విలువైనది
సదా మరువలేనిది
కళాకారులందరు
ఉత్సాహంగా పరవశించి
కూడి ఆడిరి
ఆడి పాడిరి
నేడు
హైదరాబాదు నగరం
విద్యుద్దీపాలతో
భూతల స్వర్గాన్ని తలపిస్తున్నది
ఇక ముందు
పల్లెసీమలు
పాడిపంటలతో
విలసిల్లాలి
ఇక ముందు
తెలంగాణలో
రైతుల ఆత్మహత్యలు
కనరాదు
వినరాదు
నేడు
తెలంగాణ వంటలు
స్టార్ హోటల్ వంటకాలతో
పోటీపడుతున్నవి
నేడు
వాడిపోయిన
నిరుద్యోగి ముఖంపై
చిరునవ్వులు విరియాలి
పాలకుల
రాజనీతిలో
నీతి పెరగాలి
ప్రజలలో
పౌరనీతి పెరగాలి
అప్పుడే వస్తుంది
బంగారు తెలంగాణం
అదే సుమా
పునర్ నిర్మాణం.





విలాసాగరం రవీందర్
చరవాణి: 9440932934

419

## కృషివీరుల ఖాందాన్

సుదీర్ఘ ఆకాంక్షల మధుర ఫలాన్ని
ఈనగాచి నక్కల పాలు ఎలా చేయగలం?
పసి కూనపై
నెత్తుటి వానను ఎలా కురవనిస్తాం?
పక్కలో విషపు పాలి పాము
దశాబ్ద కాలానికి పట్టిన చీడ
కోరల్ని పీకి దూరంగ విసిరెయ్యాలి
రాజ్యపు చురకత్తికి రెండు వేపులా పదును
నిప్పు రాజేసుకుంట
ఎరేర్రని ఒరలో దిగెయ్యాలి
ప్రజ పిడికిట పిడిని ఒడుపుగ పట్టాలి
గుట్టలను చెదలు దినకుంట
పయిలంగ పావుర మోలె కాపాడాలి
కొండా కోనల్లో తంగేడు వనాలకు
కాపలాకాయాలి
స్వార్థగండు పిల్లుల గొంతు నులుమే
పాశాన్నొకదాన్ని తయారు చేయాలి
గోడదూకే నక్కల గుండెలను చీల్చే
ప్రజాస్వామ్య ఈటెలకు ప్రాణం పోయాలి
తెలంగాణ తల్లి బిడ్డల గొంతు తడిపే
నీటి ధారల్ని దోసిట ఒడిసి పట్టాలి
పత్రహరిత మాలల్ని పల్లె మాత
మెడలో అలంకరింపజెయ్యాలి
నోటి మాట నొసలు చూపు
ఒకటై నడవాలి
రేపటి తెలంగాణ
కృషి వీరుల ఖాందాన్ కావాలి....

వి. రాఘవరావు (రఘుశ్రీ)
చరవాణి: 9247108893

420

## హృద్‌భాష

ఏకాభిప్రాయానికి రాని
సామూహిక చర్చలా - శిశిరం
బాదంచెట్టు ముంగిట్లో
భారంగా సాగుతోన్న కాలం
ఇప్పుడిప్పుడే తన నీడన తానే సేద తీరుతున్న వైనం
ఆకులు ఓ మూలకు
రాలిపడుతున్నాయి
గడచిపోయిన జ్ఞాపకాల
సంకేతంగా...
నూతన చివుళ్ళను ఆవిష్కరిస్తూ...
పండిన తాంబూలంలా
బ్రతుకును పరిమళించుకున్న
శిథిలపత్రాల ఆశీస్సులో ఏమో...?
హరిత తరులకు
నాలుగుకాయలు
కాయాలన్న ఆశలు
చిగురిస్తున్నాయి
ఈ స్వేచ్ఛాధరిత్రిపై
వాటి హృద్‌భాష
మనకర్థం అయితే
మానవ 'వాటి'లో
నిత్యవాసంతమే!
ధరిత్రిని
జలంతో అభిషేకిస్తేనే
కళకళల గలగలలు
తరువులను పెంచి ఆదరిస్తేనే
హరిత తళతళలు
ఈ సంస్కృతీ సంబురాలు
నా గుండెల్లో పదిలాలు.





**వి.పి. చందన్‌రావు**
కేరాఫ్ ఆదిత్య బుక్ సెంటర్, కావ్య మెస్ దగ్గర,
రాష్ట్రపతిరోడ్, నిజామాబాద్-503 01
చరవాణి: 9440038565

421

# లగ్గపిల్లు నా తెలంగాణ...

యాడ్నించో
బత్కడానికొచ్చిండు!

ఏండ్లు ఏండ్ల సంది
ఈడోళ్ళని
బత్కనీకొచ్చిండు!

బత్కడానికొచ్చిండా - బత్కని
ఒడదన్నడె బత్కని!

కని గిదేంది!
ఇసుంట సందిస్తే
ఇల్లంత నాదంటెట్ల?

యాడన్న
గింతన్నాలముంటదా?

ఉన్నంత కాలమున్నవ్
తిన్నంత కాలం తిన్నవ్
సాలదాయె...

నేనేమన్న ఎన్నడన్న
నీ ఇంటికొచ్చి వుంటినా
పిడికెడన్నం తింటినా చెప్పు!
నాకున్నంతల

ఉల్లిగడ్డ కొరికే
ఎల్లిగడ్డ కారమేస్కొనే
ఉంటె - దొడ్డు బియ్యం బువ్వ బుక్కెడు
లేకుంటె
గంటెడు గంజో అంబలో తాగి
మా ఇంట్ల మేం బత్కుతున్నం!

అరె - ఎన్నడన్న
మీ వాకిట్లకొచ్చి
గిది కావాలని అన్నమా నువ్వే చెప్పు!
మరి నువ్వేందే
బిడ్డ సచ్చినా పురిటి కంపుపోనట్లు
ఎప్పుడు ఏదో కిరికిరి పెడ్తవ్!

ఎప్పుడూ నా ఇల్లు నాదె
సుట్టమోలె రాపో ఓల్లద్దంటరు?
అంగట్ల కనపడంగనె ఒకళ్ళనొకళ్ళం
'ఎట్లున్నవ్' అంటూ ముచ్చట్లాడుదాం
సమజైందా బిడ్డా!

శకునం చెప్పే పాలపిట్ట నా తెలంగాణ
చొక్కం బంగారం నా తెలంగాణ
నిత్యం లగ్గపిల్లు నా తెలంగాణ.



**వి.ఆర్. విద్యార్థి**
ఇంటి నెం. 2-7-1083, కనకదుర్గ కాలని,
వడ్డేపల్లి, వరంగల్-506370 చరవాణి: 9989139498

## 422
# స్వాతంత్ర్యం సకల జనుల సంపద

తెలంగాణ చరిత్ర నిండా
పోరాట శిఖరాలు
బాధల అగాధాలు
జీవిత శిథిలాలు
కాలాన్ని అడిగిచూడు
గత పుష్కర మన్మథ ఉగాదుల
చేదుముచ్చట్లు చెవినకాస్తుంది
గత మన్మథ తీరంలో
స్వాతంత్ర్యపు కెరటం మదిలో
ఎన్ని గుబుళ్ళు సందిగ్ధాలు
తెలంగాణ భూమి మీద
సూర్యుడు ఎన్ని మార్లు అర్థాంతరంగానిష్క్రమించాడో
ఎన్ని వెన్నెళ్ళు మసిబారిపోయాయో
ఆరుదశాబ్దాలు
ఆరు శతాబ్దాలంత భారంగా
అహింసనే ఆయుధంగా ధరించి
ప్రపంచానికే ఆదర్శమయింది
ప్రత్యేక తెలంగాణ ఉద్యమం
తెలంగాణరాష్ట్ర ఆవిర్భావం
ఎందరి త్యాగఫలం
ఎన్ని ఆత్మ బలిదానాల ఫలితం
ఓహో!
తొమ్మిది నెలల పసిపాపల నుండి
తొంబయేళ్ళ వృద్ధులవరకు

వెంకట్రామ నర్సయ్య కాజీపేట
1-7-598, సుబేదారి, హనుమకొండ, వరంగల్-506 007

423

## తంగేడు పూలు

నా తెలంగాణ బతుకమ్మ
బతుకమ్మా అని దీవెనలిచ్చే దేవత
ఆ దేవతే నా తల్లి తెలంగాణ
ఆ తల్లిని మనసారా పూజించి ఆరాధించే
క్రతువులో, క్రమంలో ముఖ్యభూమిక పోషించేవి
(మా)పూల తలమానికమైన తంగేడుపూలు
బంగారు సింగారు పసిడి ఛాయ
నా తల్లి తెలంగాణకు ఆపాదమస్తకం
పసుపు మిసిమిని అద్దే తంగేడుపూలు
ముదిమూర నా తల్లి మనసంతా పూచే తంగేడుపూలు
వత్సర కాలానికొకమారు వనమంతా విరయబూసి
భూమాతను నవవధువులా నిండార అలంకరించే!
గాలికి నడయాడ... కిరణ కాంతిని ప్రతిబింబించి...
వర్షపు జల్లులతో... సుతిమెత్తని
పరిహాళాఢ వెదజల్లగా వికసించే -
పూలు తంగేడు, గుత్తులు గుత్తులుగా గమ్మత్తుగా
మత్తుగా మానవ మాత్రులనే కాక
పిపీలికాది పర్యంతమూనూ
ఆకర్షించే అక్కున చేర్చుకునే నా పూలు
తంగేడు పూలు... ప్రకృతి
ప్రసాదించిన ఎన్నో కానుకల్లో...
పసిమి వన్నెగలిగి మేనిని మెరియజేయు
ఆరోగ్య ప్రదాయిని ఆయుర్వేద మాత తంగేడు
పిల్లాపాప, రాజుపేద, జ్ఞానిఅజ్ఞాని, అనే...
తారతమ్యం లేని... మాద్రి సోదరీమణులందించిన
ఆరోగ్యధామం మా తంగేడు
జనసామాన్యంతో సమంగా...
జనమే తన బలంగా... జనమంతా ముక్తకంఠంతో
నినదించిన - నా తల్లి తెలంగాణ...
విముక్త పోరాట నాయకుడు... తెలంగాణ తల్లి
ముద్దుబిడ్డ విముక్త నూతన రాష్ట్ర ముఖ్యమంత్రి
తాను మెచ్చి, పదుగురు మెచ్చు రీతిలో
తల్లి తెలంగాణకు తంగేడు బంగరు మాలలతో
అలంకరించి ప్రణమిల్లి - ఆ తల్లి మెప్పుతో
నా స్వాతంత్ర్య తెలంగాణ
పోరాట యోధుడుగా... తన ప్రాణాలు సైతం
ఫణంగా పెట్టి దాస్యశృంఖాలు ఛేదించి
ముక్తినొందిన తల్లిని తంగేడు పూల నిండు
బతుకమ్మగా
తీర్చి - బంగారు తెలంగాణ నిర్మాణ సారధిగా
గద్దెనెక్కె - కె.సి.ఆర్. గారు
ప్రకృతి పసిడికి రూపమైన
తంగేడుపూలు... రాష్ట్ర అవతరణకు
బంగారు రాష్ట్ర రూపకల్పనకు
తెలంగాణ రాష్ట్రానికే పసిడి చిహ్నము
మా 'తంగేడు పూల' దేవత.

వి. భాస్కర్

424

## అల్లుకున్న బంధం - హైదరాబాద్ !!

దారాల కంటే పలుచనైన
బంధాల మధ్యన... నిటారుగా
నిలబడ్డ నగరం... కోట్లాది ప్రజల
గుండెల్లో ప్రేమతనపు రాగాలను
అద్దుతోంది హైదరాబాద్
మండుతున్న గుండెల్లో
మంచుపూల జల్లులు కురిపించి
మానవత్వమే అంతిమం అంటూ
ఊపిరి పోసింది ఈ నగరమే... !!
చావు బతుకుల మధ్య
కొన ఊపిరితో కొట్టుకుంటున్న
వాళ్లకు గాలినిచ్చింది
ఆకలి కేకలతో అలమటిస్తున్న
వేలాదిమంది బిడ్డల కడుపులు
చల్లంగ ఉండాలని కోరింది
దాహార్తికై తపిస్తున్న జనం
కన్నీళ్లను తుడిచింది
కత్తులు... కటార్లు.... కర్కశత్వపు
మాఫియాలు... గూండాలు
రియల్టర్లు, ఆక్రమణదారులు
ఆధిపత్యం చెలాయిస్తున్నా
తానే భరించింది. తనను నమ్ముకున్న
మనుషులకు భరోసా ఇచ్చింది....!!
హైదరాబాద్
ఇప్పుడు కన్నీటి కల కానే కాదు
ప్రజల బతుకులను
వెలిగించే దీపం
సప్తవర్ణాల సమ్మేళనం
రంగుల కల
జనాన్ని జాగృతం
చేసే ఆయుధం
రాత్రిని వెలిగించే వెన్నెల
హృదయాలను కలిపే గజల్
కోట్లాది గుండెలను మీటే గిటార్...!!

**వి.తేజశ్రీ(మహతి)**
ఇంటి.నెం. 11-8-205, బర్హాన్‌పురం,
బస్‌డిపో ఎదురుగా, ఖమ్మం.
చరవాణి: 7661938945, 9848972455

# 425

## తల్లీ బతుకమ్మ!

తీరుకొక్క పూవు తీరైన బతుకమ్మ
పేరు నీకు పెట్టె పేర్మి జనులు
కూర్మి తోడ నిన్ను కులదేవతనిరి
తెగువ గల్ల తల్లి తెలంగాణ మాతరో!
విజయోత్సవం
వీర శూర జనుల విజయోత్సవమ్మిదే
వెన్ను తట్టి లేపె విశ్వమంత
జన్మ భూమి కొరకు కర్మ శీలురవుతు
కదము దొక్కె నేడు కదన మందు
తెగువ గల సుతులు తెలంగాణ వీరులు
నీదు దాస్యవృత్తి నిలువరించె
ప్రాణ త్యాగమునకు పెట్టింది పేరుగా
వీర మాత నీకు విజయ మమ్మా!
కదన రంగ మందు కాలు మోపినసేన
చిమ్మె రక్త మొక్క చరిత యనగ
తెలుగు జాతిలోన తెలంగాణ మా తల్లి
త్యాగ ధనుల గన్న తెగువ నీదె!
వివిధ జాతి విరుల వింతైన పూరాశి
జాతి వేరు వాటి నీతి వేరు
నమ్మి కొలుచు వారి నిలువెత్తు బతుకమ్మ
ఐకమత్యమునకు ఏక సాక్షి

వీరేంద్ర కాపర్తి



## 426
# నాయనమ్మ కల

తంగేడు పూల పండుగొచ్చిందంటే...
మా పల్లెలు విరబూసిన బతుకమ్మలే...
బతుకమ్మకు రంగులద్దిన బంగారు పూల వాకిళ్లు
తీరొక్క రంగుల ఎరుపెక్కిన చుక్కల చెక్కిళ్లు
మా నల్లచెరువు గట్టు నిండా తెల్లని కొంగల బారులు...
సింగారించుకున్న రంగురంగుల పూలరంగవల్లులు..
మత్తడిఎక్కి దూకుతున్న వరద నీటిలోకి
తొంగి తొంగి చూస్తున్న చందమామలు
జెల్ల పిల్లల చిలిపి చేప కళ్ళు..
గోడకు ఆనించిన మూడు కాళ్ళ గొర్రు...
కడుపునిండా తిని తేన్చిన కరువు తీరిన కర్రు
వానచుక్కను చూసి ఎగిరి గంతేసిన నాగలి నల్లరేగడి
నేలను చీలుస్తూ.. చీలుస్తూ... దుక్కిని పొక్కిలి చేస్తూ...
తూమునుంచి ఉరికొచ్చిన నీటి నురగల
తెలతెల్లని అల్లరిపిల్లకాలువలు...
గొంతు తడారిన నేల దూప తీరుస్తూ...
గుండె లోతుల్లోకి మెలమెల్లగా పరుగులు తీస్తున్న
సందర్భంఆకుపచ్చని రంగును తనివితీరా తనువంతా
పులుముకున్న పసిడి పంట పొలాలు!
మామిడికాయ పచ్చడితో మా అమ్మ కలిపి
పెట్టిన సద్దిబువ్వ ముద్దలు!
అబ్బ! ఎంత అందమైన దృశ్యం... నాయనమ్మా
ఇది నీ పగటికలా?
నిద్రపుచ్చేటపుడు మీ తాత చెప్పిన కలా?
లేదమ్మా... ఇది అరవై ఏండ్ల తండ్లాట
మా ఊరు... మా చెరువు... మా బతుకు దెరువు
చెరువు నిండితే - ఊరు కడుపు నిండినట్టే
కడుపు నిండితే - ఊరు కరువు తీరినట్టే
వయసుతోపాటు చూపు మసక బారుండొచ్చు
కానీ గుండెలోతుల్లో - మెదడు పొరల్లో నిక్షిప్తమైన
నాటి జ్ఞాపకాలు ఇంకా చెవుల్లో సొద పెడుతూనే ఉన్నాయి
చెరువుకు వరదలొచ్చినట్టు, కట్ట దూకి, కట్టు
తెంచుకున్నట్టు
బరువు దించుకున్నట్టు కలల కందిరీగలు
జ్ఞాపకాల తేనెటీగలు గుర్తొచ్చినపుడల్లా
కలవరించమని గుర్తుచేసి మరీ కుట్టిపోతున్నాయి...
బతుకమ్మ పండుగకు పూలకొచ్చినపుడల్లా...
మా చెరువుగట్టు నన్ను చూసి ఎక్కి ఎక్కి ఏడ్చేది...
పాలకోసం డొక్కెండిన పసిపాపలాగా...
అవును నాయనమ్మా... ఆనాడు నువు
చూసింది కలగాని నిజం!
కాని ఇపుడు మా తరానికి కనిపిస్తున్నది నిజమైన స్వప్నం!
మళ్ళీ చెరువుల నిండా నీళ్ళు... ఎగిరే కొంగలు
దూకే చేపలు - ఈదే పిల్లలు
పచ్చని పొలాలు - పనిపాటల్లో సంబురాలు
నిజమైన మా నాయనమ్మ అరవై ఏండ్ల కలలు...
మళ్ళీ మాకోసం విచ్చుకున్న - జల కలువలు!

**పురిమళ్ల సునంద**
'సాహితీ లోగిలి'-11-10-694/5,
బుర్హాన్‌పురం, ఖమ్మం. సెల్ : 9441815722
ఇ-మెయిల్: sunanda.28051965@gmail.com

427

## "గెలుపు కేతనం ఎగిరిన రోజు"

అరవై ఏండ్ల అవమానాలు గాథలు
అనంత కాలనదిలో కలుస్తూ
నవోదయానికి నాంది పలికిన
ఈ రోజంతా కొత్తయాదే....
ఆరని జ్ఞాపకాల తడే ...
అనుభవాలు అనుభూతులు
ఎద ఎదలో అలల రొదలై
కల సాగరంలోకి ఒదిగిపోతుంటే
చెరగని గాయాల మరకలను
మానని భావోద్వేగాల చెమ్మను
తడుచుకుంటున్నా.....
కరిగిన కాలంలో
జరిగిన పరిణామాలను
వలస వాదుల వంకర బుద్ధులను
తూకం వేస్తున్నా....
గుండె గూటిలోకి ఎగిరొచ్చిన
ఆనందాల సీతాకోక చిలుకలను
ఆనంద బాష్పాలతో వీక్షిస్తున్నా....
వెలుగుకోసం తండ్లాడిన
పొక్కిలైన మనసులో
పొంగిన ఆవేశ జ్వాలలు...
ఆధిపత్య చీకటిపై విరుచుకుపడి
అస్తిత్వానికై పోరాడిన వీరులు
అవనిని ముద్దాడిన కర్మయోధులు
ఆకసానికెగిసిన అగ్గిరవ్వలు
ప్రజలను జాగృత పరచిన
ప్రచండ రవి కిరణాలు
మట్టి మనుషులకు మనోధైర్యమిచ్చిన
పట్టు విడవని వజ్ర సంకల్పాలు
కాళోజీ కలలుగన్న తెలంగాణకై
దాశరథి కోరుకున్న కోటి రతనాల వీణకై
జయశంకరు సారు చొరవ
స్ఫూర్తి దీపికయై ఉద్యమాల బాటలోన
విరబూసిన చైతన్యం ఆత్మబలమె ఆజ్యమై
విప్లవమే ఉప్పెనై కళాశాల కాలేజీల్లో
వెరవని బలిదానాలు అమరుల త్యాగాల పూలు
ఆత్మగౌరవ ఫలాలు
ఆర్ద్రంగా అందుకున్న రోజు
పున్నమి వెన్నెల పుష్పించిన ఆశలను
చరిత్ర పుటల్లో లిఖించుకున్న రోజు
ఆకాశమంత ఉన్నతంగ
నవజీవన రాగాలను
రెపరెపలాడే గెలుపుకేతనంలో
ఆశయాలు తొలిపొద్దున
సంబురంగ అంబురాన
ఎగరేసిన రోజు

వెంగలి నాగయ్య
సిరిసిల్ల, చరవాణి: 95509 64085

# 428

## సాప విలాపం

సాపనురా నేను ఈత కమ్మల సాపనురా
సావు బతుకుల్లో గట్టైతిరా
నేడు శవాల గదికాడ నే నైతిరా
సంచార జాతుల్ల సాపనురా నేనేమి జేత్తిని పాపమురా
॥సాపనురా॥
సదువు దూరమైనా సంచార జాతుల
ఏతుల్ల ప్రాణాలునే బోసుకుంటి
అక్షరాలు రాని ఆర్కిటెక్చర్ల అమరికతోనే
పురుడోసుకుంటి
బతుకంతా భారంగా ఊర్లెంట దిరిగేటి బతుకు
నీడ్చెటోల్ల బిడ్డనై ఉంటి
వందల వేలేండ్ల చరితుంది
నాకు గుండెల్లో నేడు దిగెనే బాకు ॥సాపనురా॥
పుట్లకొద్దీ ధాన్యమెండ బెటితీ రాసులైతే
సూసి మురిసి పోతీ
పెండ్లి, పేరంటాల్లో ముందు
నేనైతీ కూకుండ బెట్టుక మర్యాదనైతీ
రాజు, పేద తేడ లేదేమి నాకు ప్రతి ఇంటిలో
నాడు నాకుండ సోటు ॥సాపనురా॥
రజాకార్లు ఊర్లమీద పడుతుంటే
అడ్డు అదుపు లేక చెలరేగుతుంటే
ఇంటిలోన బిడ్డ జ్వరమచ్చి ఉంటే
తల్లి కంటనీరు కారుత ఉంటే
సోదాలు ప్రతి ఇల్లు చేత్తావుంటే
దొరికినోల్ల పాడు జేత్తాఉంటే
కదలలేని బిడ్డ ఒల్లంత సుడితి
రజాకార్ల కన్ను పడకుండ కడితీ ॥సాపనురా॥
ఇంటి దూలాల మీదెక్కిపన్నా
లేకుంటే మూలకు నే నిలుస్తున్నా
కాలాలు, కరువులు నే సూసి ఉన్నా
ఆపద సంపద మనసారా విన్నా
గుమ్ముల నిండా ధాన్యాలు
పండినరైతుల కన్నుల్లో కాంతుల కన్నా
ఆ కాంతులన్నీ కరిగెట్లవాయే రైతుల
శవములనే మోసుడాయె ॥సాపనురా॥
సాపనురా నేను సాపనురా ఈత కమ్మల సాపనురా
సాపనురా నేను సాపనురా నా కెందుకు ఈ శాపమురా
మీ సావులతో నా బతుకుడొద్దుర శవాల మోయుట
నాకేమి ముద్దుర
దండాలు మీకు వెడుతున్నరా దండై మనం నిలువాలిరా
॥సాపనురా॥



**వేంకట రాణాప్రతాప్**
తెలుగు ఉపాధ్యాయులు, ఖమ్మం.
చరవాణి: 9948085164

# 429

# అవతరణ

సీ. పట్టిన పట్టును పగడుగా బిగబట్టి
ఎత్తిన పిడికిలి యెక్కడైన
దించని, సాహసం దృఢమైన నిశ్చయం
బందులు హర్తాళ్ళు ముందు బడగ
సకల జనుల సమ్మె సాగర హోరంబు
సలసల కాగించి చెలగి మెలగి
తెలంగాణ పౌరుషం తేట తెల్లముగాగ
భారతి గళము నాభరణ మయ్యె

తే.గీ. తెగువగల తెలంగాణలో తిరుగుబాటు
అమర వీరుల త్యాగాల ఆశయంబు
అరువదేండ్ల గోసంతయు ఆవిరయ్యె
అవతరించెను రాష్ట్రమై అద్భుతముగ

బతుకమ్మ

సీ. ఆడపడుచు లెల్ల ఆడంబరంబుగా
పొద్దుపొద్దున లేచి పూలు దెచ్చి
తంగేడు గునుగులు దన్నుగా గన్నేరు
చేమంతులును, బంతి చేర్చి కూర్చి
రంగురంగుల పూలు రమ్యంగ అమరించు
బొడ్డెమ్మ తల్లికి పోగు జేసి
తరతరాలుగ తల్లి బతుకమ్మ పర్వంబు
తనివితీరా జేయు తరణులంత

తే.గీ. తొమ్మిది దినాలు నిష్ఠగా తోటి ఆడ
వారితో, పాడుతూ యాట చేరి యాడి
ఏరు, చెరువుల నీళ్ళ కెత్తుకెళ్లి
సద్దుల బతుకమ్మనటుల సాగనంపు

జై తెలంగాణ

**వేణు సంకోజు**
5, ఎల్‌ఐజిహెచ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ,
రాజీవ్ పార్క్, నల్లగొండ. చరవాణి: 9948419881
ఇ-మెయిల్: venusankaju@gmail.com



## 430

## ఇంగితాల సారం!

కాళోజీ అంటే ఒక మాటల పొది
రచనల ఊట
ఉద్యమాల బాట!
తూర్పు-పడమరలనేమిటి?
అన్ని దిక్కులా పరివ్యాప్తమైన
ఇంగితాల సారం!
బుసకొట్టే భుజంగాలనిట్టేపట్టి
కుటిలత్వాలనేలకేసికొట్టి
నిలువగలట్టిదిట్ట
ఎన్నెన్నో మౌలికతలు-
అనుభవాల పుట్ట!
కాళోజీ అంటేనే
కడుపు నిండా నెనరుగల్ల
కన్నతల్లి మనసు
పైకి కఠినం-చేదనిపించినా
అమృతమై అందివచ్చే దినుసు!
రేపూ-మాపూ-హమేషా
ఒక యుగం పొడవునా వీక్షించగల చూపు
జగాన్నంతా జాగృతపరచి
సచేతనావర్తంతో సాగేట్టు చూసే
మరో దిక్సూచి!
ఒక అందమైన ఎరుక-నడతంతా అంగారం
గుణం తెలిసిందే కదా-
అది చొక్కమైన బంగారం!!



**వేముల సత్యనారాయణ**
ప్లాట్ 209, సూర్యటవర్స్ అపార్ట్‌మెంట్, సుదర్శన్ రెడ్డి నగర్,
చింతల్, హైదరాబాద్-54. చరవాణి: 9603255063

# 431

## కదనానికి కాలుదువ్వు

పువ్వమ్మ పువ్వు - అది తంగేడు పువ్వు
అమాయకమైన పువ్వు - అది అపరంజి పువ్వు
ఆర్భాటంలేని పువ్వు - అది అపకారం తెలీని పువ్వు
స్వార్థతత్వంలేని పువ్వు - అది మాయామర్మం ఎరుగని పువ్వు
చెలిమిదనం దాని నవ్వు - అది స్నేహపరిమళం నిత్యం రువ్వు
తంగేడు పువ్వంటే - అది తెలంగాణ హృదయం
తంగేడు పువ్వంటే - అది తెలంగాణ జీవనం
తంగేడు పువ్వంటే - అది తెలంగాణ వారసత్వం
తంగేడు పువ్వంటే - అది తెలంగాణ సాంస్కృతిక నికేతనం
తంగేడు పువ్వంటే
అది తెలంగాణ బతుకమ్మ పర్వపు సంబురాల జయకేతనం
పువ్వమ్మ పువ్వు - అది తంగేడు పువ్వు
పువ్వమ్మ పువ్వు - అది అపరంజి పువ్వు
ఆర్భాటం లేని పువ్వు - అది అపకారం తెలీని పువ్వు
స్వార్థతత్వం లేని పువ్వు - అది మాయామర్మం ఎరుగని పువ్వు
చెలిమిదనం దాని నవ్వు - అది స్నేహ పరిమళం నిత్యం రువ్వు
అయినా...
దాన్ని అణచాలని చూస్తే మాత్రం
అది శతపత్ర సాయుధ దళమై కదనానికి కాలు దువ్వు

**వేముగంటి మురళీకృష్ణ**
చరవాణి: 9676598465

# 432

# జలజాతర

దుఃఖాన్ని గింజల్లా చల్లుకున్న
కొన్ని దశాబ్దాల తర్వాత
మట్టి పసిపోరడై నవ్వుతున్నది పూడిక తీస్తున్నప్పుడు
ఊపిరి సెగల్లన్నీ
చల్లని వనాలై పల్లెమీద పరుచుకుంటున్నై
చిక్కు ముడిపడ్డ బతుకు రేఖలమీద
చినుకుబొట్లురాలి అలుగు హరివిల్లై మెరిసిపోతున్నది
చేతులు చాచి ఆకాశం కమ్మగా కౌగిలించుకుని చెరువు
గుండెలోకి
ప్రవహించిందెన్నడు
ఒక్కొక్క అడుగు చెరువు కట్ట దిక్కు కదులు తుంటే
అలలై ఎగిసిపడుతున్న నీళ్ళు వసంతరాగమాలపిస్తున్నది
గడ్డిపూవులు కొత్తకొత్త వర్ణాల నద్దుకొని
మురిసిపోతున్న
జీవితమంటే పల్లెపచ్చదనమంతా మనిషి కండ్లల్ల
మెదులుడేకదా



వేముల ప్రభాకర్

## 433

# సర్దార్ పాపన్న

సర్దార్ సర్వాయి పాపడు సామాన్యుడు కాడురా
కల్లుగీత కత్తితోనె గోలకొండ కొట్టెరా
పసులుగాసిన పిల్లగాడె ప్రజలనొక్కటి చేసెరా
దోరలపాలిట బంధిపోటై పేదవాళ్ళకు పెట్టెరా
జమీందార్లు జాగీర్దార్లను తరిమి తరిమి కొట్టెరా
సవాల్జేసిన నవాబులను పాతాళానికి తొక్కెరా
షాహాపురము తాటికొండ సర్వాయి కోటలుగట్టెరా

ఓరుగల్లు బోన్గిరులను పోరాడి గెలిచెరా
గోలకొండ ఖిల్లామీద జెండా ఎగరేసెరా
ఐదు గడియలేలికగా చరిత్రలో నిలిచెరా
నెత్తురుతో కొండ తడిపి అమరవీరుడాయెరా
తెలంగాణ పోరుబాట లోకానికి చాటెరా!
సర్దార్ సర్వాయి పాపడు సామాన్యుడు కాడురా
కల్లుగీత కత్తితోనె గోలకొండ కట్టెరా

వై. శివకుమార్

434

# తెలంగాణ - ఘనకీర్తి



అఖండ భారతదేశమందు - తెలంగాణ
రాష్ట్రమునకు గొప్ప చరిత గలదు!
అన్ని భాషలకన్న - తెలంగాణ
రాష్ట్రమునకు - గొప్ప యాసగలదు!
అన్ని రాష్ట్రాల సంస్కృతికన్న - తెలంగాణ
రాష్ట్రమునకు గొప్ప సంప్రదాయము గలదు!
ఆంధ్ర రాష్ట్రముకన్న - తెలంగాణ
రాష్ట్రమునకు గొప్ప సంపద గలదు!
పరమ దుర్మార్గమగు నిజాం పాలనలో
తెలంగాణ ప్రజలను చిత్రహింస పెట్టింద్రు
హైదరాబాద్ రాష్ట్రమునకు
నవాబులుగా వెలుగొందింద్రు
అరువది యేండ్లుగా ఆంధ్రులు పరిపాలన చేసింద్రు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు
చేసింద్రు
తెలంగాణ సంపదను నిండుగా దోచింద్రు
తెలుగు ప్రజలు అందరు ఒక్కటే అని చాటింద్రు
తెలంగాణ ప్రజలు అవినీతి గమనించింద్రు
ఆంధ్ర రాజకీయ నాయకులను నిలదీసింద్రు
తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు
ఉద్యమాలు, బలిదానాలు, ఆత్మత్యాగాలు చేసింద్రు
తెలంగాణ రాష్ట్రంలో అమరులుగా వెలుగొందింద్రు
ఉన్నతాశయములే అభివృద్ధి లక్ష్యంగా
నాడు పురుడు బోసుకొనిన
రాష్ట్రం నేడు తెలంగాణ రాష్ట్రం
బంగారు తెలంగాణగా అలరారు చుండే!
విరామము ఎరుగక తుది శ్వాస విడుచువరకు
జీవితమ్మును తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు
అంకితము చేసినట్టి మహామనీషి
మాన్యశ్రీ జయశంకరునకు
తుదిశ్వాస వరకు రుణపడియున్నది - తెలంగాణజాతి!

వైద్యం భాస్కర్
ప్రాజెక్టు డైరెక్టర్ (గృహ నిర్మాణం)
ఖమ్మం. చరవాణి: 7799721167

# 435

## నా యాస

గుండెల్లోంచి వచ్చే నా మనస్సు భాషకు,
యాస తోడవుతుంది-
దొరతనము, దోపిడి హెచ్చినప్పుడు
యాస సమాజ చైతన్యానికి నడుము బిగిస్తుంది
బాధితులను, ఆనాధలను ఆదుకొనేవేళ,
యాస ప్రేమగా పలకరిస్తుంది -
అయినవాళ్ళను అనురాగంగా,
యాస అక్కున చేర్చుకుంటుంది -
జానపదుల జాతరలలో,
యాస గజ్జెకడుతుంది -
బతుకమ్మ ఆటపాటలతో,
యాస సామూహిక స్నేహగీతం ఆలాపిస్తుంది-
అలాయ్ బలాయ్ వేళ,
యాస ఉర్దూతో మిలాఖత్ అవుతుంది-
భాషకు ఆత్మగౌరము, అస్థిత్వ సమస్య ఎదురయినప్పుడు,
యాస తిరుగబడుతుంది-
ఎక్కడి నుండి వచ్చావని చెప్పక్కర్లేదు,
యాస ఇట్టే పట్టేస్తుంది -
వేషం, భాష, యాస కలగలసిన నా తెలంగాణ నాకు గర్వకారణం

**వంగర నరసింహారెడ్డి**
సముద్రాల (గ్రా.) కోహెడ (మం.)
కరీంనగర్. చరవాణి: 9848261284



436

# పునరంకితం

నిదుర లేచిన బాలసూరీడు
తన ముద్దు మోమును గోదారి నీట చూసుకుంటుండు
ఎర్రబారిన తూర్పమ్మను చూడు
బంగారు వన్నెలు దిద్దుకుంటోంది
చుక్క పొద్దుకు లేచిన కాకతమ్మ
ఎండిన రైతును పన్నీట తడప ఎదురు చూస్తుంది.
ఆవిరైన యువత ఆశ, వర్షపు చినుకై రాలాలని
తన నేల దిక్కుకు చూస్తుంది
కలలు పండే రోజు వచ్చెనని
కళ్యాణ లక్ష్మి బుగ్గన గులాబి రంగు మెరుస్తోంది
తడబడుతూ నడిచే అవ్వకు తోడుగా
'ఆసరా' గట్టిగా అడుగులేస్తుంది
నీళ్ళబడ్డ అమర పీరీలు, దూల ఆడ
మసీదుల మళ్ళీ నిలబడుతున్నయి
ఎక్కిరిచ్చిపోయిన ఎడగారి కొంగలు
చేపలు తిన రెక్కలూపుతూ తిరిగి చెర్ల జేరుతున్నయి
మళ్ళీ నీళ్ళోసుకుంటున్న తల్లి తెలంగాణ
పచ్చపచ్చని పల్లె బిడ్డల కనాలని కలలు కంటోంది
తొలి పండుగ జరుపుకుంటున్న జన సంద్రం
ఆటపాటల మలి సంబరానికి కదిలిపోతుంది
నిండు చంద్రుని పండు వెన్నెలల
తెల్ల చీరకట్టిన నీలి గగనం శాంతి గీతం పాడుతోంది
పుట్టింటికి తిరిగొచ్చిన తెలంగాణ ఆత్మ
బ్రతుకమ్మ ఆడ సింగారించుకుంటోంది
చేత కంకణం ధరించి వీరత్వం లక్ష్యసాధనకు
దసరా చేస్తూ పునరంకితమవుతుంది.

యడవెల్లి సైదులు

# 437

## క్యాన్వాసు

క్యాన్వాసు అంటే ఏది
హృదయం ఒక క్యాన్వాసు
జ్ఞాపకాలన్నీ దానిమీద చిత్రాలు
అన్నాడొకడు భూగోళమో క్యాన్వాసు
సముద్రాలు, అడవులు సహజంగా చిత్రించిన
ప్రకృతి బొమ్మలన్నాడింకొకడు
ప్రతి తెల్ల కాగితమూ క్యాన్వాసే
దానిపై కవి పేర్చే ప్రతి అక్షరం
ఓ కవితా చిత్రమే అంటాడు మరొకడు
నిర్మలమైన నీలిరంగు ఆకాశమూ క్యాన్వాసే
దానిపై విరజిల్లే ఇంద్రధనుస్సు
వర్ణచిత్రమేనని
నదులన్నింటిని తనలో కలుపుకునే
సముద్రమూ ఓ క్యాన్వాసే ఆ నీటిపై ఆటలాడుతూ
చేపపిల్ల గీసే వలయాలన్నీ
జలచిత్రాలే...నంటూ
ఇలా ఇలా ఇంకా ఏవేవో
క్యాన్వాసంటే ఇవేనా  ఖరీదైన కారులా
కొత్త మోడల్ ఫోన్‌లా
క్యాన్వాసుకు ఓ గొప్పంటూ కావాలా?
ఎల్‌కేజీ పిల్లవాడి చేతిలో పలక కాదా క్యాన్వాసు
బలపంతో వాడు గీసే గీతలన్నీ
బాల్యచిత్రాలే కదా!
బిచ్చగాడి గిన్నె కాదా క్యాన్వాసు
దానికున్న సొట్టలన్నీ బతుకు బొమ్మలేగా
పశువులు కాసే జీతగాడి పాదం కాదా క్యాన్వాసు
వాడి కాలికి గుచ్చుకున్న ముళ్ళన్నీ వేసేవి
రక్తచిత్రాలే కదా చెలకనంతా సేనుగమార్చే
రైతుకష్టం కాదా క్యాన్వాసు
అతడు రాల్చే చెమట చుక్కలన్నీ
భూమిపై మొలకెత్తే పైరు బొమ్మలేగా
ఏళ్ళునిండిన ముసలాడి ముఖంకాదా క్యాన్వాసు
ఆ ముఖంమీది ముడతలన్నీ
అనుభవం చిత్రించిన డ్రాయింగ్‌లేకదా
అంతెందుకు... తొమ్మిది నెలలు మోసే
అమ్మ గర్భం కాదా క్యాన్వాసు
ప్రసవ వేదనలో పుట్టే
ప్రతి బిడ్డ ప్రాణమున్న బొమ్మేగా
ఇలా... కొన్ని క్యాన్వాసులు కావ్యమంత కమ్మగా
వేదమంత గొప్పగా ఉండకపోవచ్చు
కానీ...
జీవితమంత లోతుగా
కవిత్వమంత విశాలంగా ఉంటాయి
వెతికి చూసి గీసుకోవడమే
మన పని....

**యడవల్లి శైలజ**
హిందీటీచర్, ఇంటినెం. 6-36,
పాండురంగాపురం (గ్రా),బల్లేపల్లి (పోస్టు), ఖమ్మం.
చరవాణి: 9394171299

438

## సంబరాల తెలంగాణ

ప. అందమైన పాలపిట్ట రాష్ట్రపక్షిగా మారె
తంగేడు పూవు వాసికెక్కి తెలంగాణ సొగసుమారె
జమ్మిచెట్టు పసిడి పంట మన రాత మార్చి పోయెనంట
చార్మినార్ ఘనత పొందె కాకతీయ తోరణం జిలుగులాగ

చ. పొద్దుజాము కళ్ళాపిజల్లి ముగ్గులెట్టి రంగులద్ది
బోనమెత్తి పూనకాలూగి నాటుకోడి ఫలహారమెట్టి
పోరాట వీరులగాథ చెప్పి బతుకమ్మ ఆడిపాడి
ఆడపిల్లల బతుకులకు వెలుగులిచ్చె తెలంగాణమని

చ. నురగతరగల గోదారమ్మ కొన్నెరసాని వలపు పిలుపుల
హైదరాబాద్ విభిన్న మతాల సంస్కృతుల సాంప్రదాయం
వందలాది పరిశ్రమల రంగారెడ్డి సోయంగల
కార్మికుల కర్షకులు కదిలిసాగే కాకతీయ మిషనులా

చ. పది జిల్లాల తెలంగాణ పసిడి వరంలాగ మారె
పురిటి గడ్డ పోరుగడ్డ తెలంగాణ వీరుల త్యాగం
భూమికోసం భుక్తికోసం రజకార్లతో ఒడ్డెసోడు
యాసకోసం భాషకోసం పోరాడె తెలంగాణ

చ. 60 యేండ్లు పోరు సలిపి జీవితాలు జ్వలింపచేసి
గెలుపుబాటకై దారి చూపిన జయకేతనం
దాశరథి సినారెలను కన్నతల్లి తెలంగాణమే
జయ తెలంగాణ జయజయ తెలంగాణ



**యనగందుల దేవయ్య**
ఇంటి నెం. 5-3-26/1, పాకబండ బజార్,
ఖమ్మం-507001 చరవాణి: 9666036288

439

# త్యాగాల పంట

మాదీ తెలంగాణా
మా ఆశ తెలంగాణా
మా శ్వాస తెలంగాణా
మా ఆత్మ తెలంగాణా
అచ్చమైన-స్వచ్ఛమైన తెలంగాణా బిడ్డలం మేం
నిర్మలమైన నిశ్చలమైన నిత్యమైన
ఏరులైన ఎడారులైనా ఊరులైనా మావే... మాస్వంతం
ఈ నదిలో పారే నీరు మా స్వేదం
ఈ మాగాణిలో పంట మా కష్టం
ఈ వాకిలి వెచ్చని గాలి మా ఊపిరి
ఈ విరుల వనాల విశాల ప్రాంతం మా జాగిరి
ఈ సిరుల ఖనిజాల జనావాసం మా లోగిలి
ఈ ఒడ్డున మొదట కన్ను తెరిచింది మేం
ఇక్కడ చివరకూ కన్ను మూసేదీ మేమే
మధ్యలో ఈ సుందర స్వప్నాలను దొంగిలించ
వాడెవ్వడు?
మానవత్వం పునాదిగా
మమతల రాళ్ళను పేర్చి
ఐక్యంగా నిర్మించుకున్న
అందాల సౌధం మా తెలంగాణా
రక్తాలను రంగరించి
కండలన్నీ పిండిచేసి
బండలు బండలుగా పేర్చిన
రాతికొండ, ఈ తెలంగాణా
ఉసూరు మంటున్న వాళ్ళకు
ఊపిరాది,
నిద్రాణమై వున్న జాతిని
జాగృతం చేసి,
విశ్వ అవనికపై చెరగని
సంతకం చేసిన
గడుస్తున్న నాయకులు
జాతీయ జెండాను
రెపరెపలాడించిన
గోలకొండ మా తెలంగాణా

**యేరువ రత్నారెడ్డి**
చరవాణి: 9949869999

440

## జై... తెలంగాణ...జయహో తెలంగాణ...

కోటి కోటి ఆశలు సాకారమైన తరుణాన
కోటానుకోట్ల జనాల గుండె చప్పుళ్లు జయహో
తెలంగాణా...
అమరుల ఆత్మబలిదానాలు,
అమ్మలెందరో కార్చిన కన్నీళ్ళు
విరిగి పడిన లాఠీలు,
కరిగిన చిన్నారి బతుకులు
చరిత్రగా మిగిలిన ఉద్యమ పోరాటాలు,
మరో చరిత్రకి
నాంది పలుకుతున్న విజయోత్సవాలు...
జై తెలంగాణ... జయహో తెలంగాణ...
విజయోత్సవాలు కావివి,
విను వీధికెగసిన ఆనందాల తరంగాలివి
నా తల్లి తెలంగాణ కంటి నుండి
జాలువారుతున్న వెన్నెల కిరణాలివి
విషాదగీతాలన్ని
విజయోత్సవ నినాదాలుగా మారిన క్షణాన,
విలపిస్తున్న నా తల్లి కంటినీరు
పన్నీటి చుక్కలుగా మారిన వైనాన...
గుండెగుండెలో ఆనందాల కోలాటాలు
గడప గడపనా ఆహ్లాదాల రంగవల్లులు
చెరవీడిన దగాపడ్డ తెలంగాణ
చిగురించిన ఆశలు మది మదిలోనా
జై తెలంగాణా... జైజై తెలంగాణ... జయహో
తెలంగాణ...



వై. రుక్మాంగదరెడ్డి
వెల్దంద.
చరవాణి: 9440309087

441

# పేద ప్రేమ

వెదురుబొంగే-కాని దానికి
ఎద ఉంది-సొద ఉంది
మూగదేమి కాదు-కమ్మగా
రాగాలను పాడుతుంది !
పేదదైతే కావొచ్చేమో
లేదెన్నడు దానికి తక్కువ
చద్దులు తినునాడే కృష్ణుడు
ముద్దులతో మురిపించాడు
ఒళ్ళంతా గాయాలున్నా
కళ్ళనిండ కాంతి రేఖలు
అపురూపం దాని స్వరాలు
అవి రస హృదయులకు వరాలు
అది గొంతు విప్పితే చాలు
అవధిలేని ఆనందాలు

ప్రకృతిలోని పశుపక్ష్యాదులు
పరవశించి పులకిస్తాయి
జగమంతా ఆనందం నిండగ
గుండెనిండ అనురాగం పండగ
కోయిలలు తుమ్మెదలు శిష్యులై
పాటల తోటలతో తిరుగాడగ
ఆకులపై పాటలు రాస్తూ
గాలి అలలపై పయనిస్తూ
గగనమంత ప్రేమను మోస్తూ
విశాల విశ్వంలో విహరిస్తూ
మృత జగత్తుకు ప్రాణం పోస్తూ
సాగుతుంది కల్పాంతం వరకు
విరతిలేని అపశ్రుతి లేనిది
పరమాద్భుతమీ మురళీ రవళి!

**జింబో (రాజేందర్)**
305, సౌందర్య రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 8,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-29.
చరవాణి: 9441492737

# 442
# తలమీద గౌరమ్మ

'రామ రామ రామ ఉయ్యాలో
రాముని శ్రీరాముని ఉయ్యాలో...!
మా ఇంటి పందిరి మీది కోట్ల పూలు
మా 'దేవునర్ర'లో ప్రత్యక్షమవుతాయి
మీ పెరడులోని గునగపువ్వు అదృశ్యమై
రంగుల్లో మునిగి తేలుతుంది
తంగేడు పూలు మా ఇంట్లో బంగారమవుతాయి
మా తాంబాళం తళతళ మెరుస్తుంది
ఆడపిల్లలు మిలమిలా మెరుస్తారు
ఉదయం నుంచి ఒకటే సందడి
పగటికి పెళ్ళికూతురిలా బతుకమ్మ
మా ఇంటి ముందు
మా వాడకట్టులో
మా వాగులో
మా బతుకమ్మలు కలిసి ఆడతాయి
అంతరాలు లేకుండా అందరూ
వాగుదగ్గర
చెరువు దగ్గర
ఎన్నో పాటలు
ఎంతో జీవితం
అన్నలని కదిలించే పాట
అమ్మలని కరుణించే పాట
అక్కా చెల్లెళ్ళలని ఊరడించే పాట
వదినెలను నవ్వించే పాట
మా బతుకమ్మ పాట
మా ఆడపడుచులని 'కోలాట'గా మార్చే బతుకమ్మ
అనుభూతులని అనుభవాలని చెప్పుకునే బతుకమ్మ
ఊరందరినీ ఒక్కటి చేసే బతుకమ్మ
అందమైన బతుకమ్మ
అమాయక బతుకమ్మ
ప్రేమైక బతుకమ్మ
బతుకమ్మ తలమీద గౌరమ్మ
అవసరమైతే
ఆగ్రహించే గౌరమ్మ
మా లాగే
నా తెలంగాణ లాగే





హాలహలమును వడబోసి అమృతధార
తేర్చి త్రాగి త్రేన్చెద; యువతీ కపోల
ఫల రాగమ్ముపై బాల భానువులను
రంగరించెద ప్రత్యూషరంగమందు.

- దాశరథి కృష్ణమాచార్య

# రాష్ట్ర అవతరణ ఉత్సవ కవిసమ్మేళన దృశ్య మాలిక

7.06.2015




రవీంద్ర భారతి, హైదారాబాద్

# కవిసమ్మేళన దృశ్య మాలిక







# కవిసమ్మేళన దృశ్య మాలిక








# అనువాదకులకు సత్కారం దృశ్య మాలిక

















# అనువాదకులకు సత్కారం దృశ్య మాలిక

















# కవిసమ్మేళన దృశ్య మాలిక









# కవిసమ్మేళన దృశ్య మాలిక









# కవిసమ్మేళన దృశ్య మాలిక









# కమిటీ మెంబర్ల సత్కార దృశ్య మాలిక



















# కవి సమ్మేళన దృశ్య మాలిక

















# కవిసమ్మేళన దృశ్య మాలిక



















# రాష్ట్ర అవతరణ ఉత్సవ కవిసమ్మేళన దృశ్య మాలిక






## *Our Sincere Thanks to*

**Sri Swamy Goud**
Hon'ble Chairman, Legislative Council

**Sri S. Madhusudana Chary**
Hon'ble Speaker, Legislative Assembly

**Sri Kadiyam Srihari**
Hon'ble Deputy Chief Minister

**Sri Mahamood Ali**
Hon'ble Deputy Chief Minister

**Smt. Kalvakuntla Kavitha**
Hon'ble M.P., Nizamabad

**Sri T. Hareesh Rao**
Hon'ble Minister for Irrigation

**Sri K.T. Rama Rao**
Hon'ble Minister for PR & IT

**Sri C. Narsinga Rao,** IAS
Hon'ble Advisor

**Sri B.V. Paparao,** IAS (Retd.)
Hon'ble Advisor

**Sri B.P. Acharya,** IAS
Prl. Secretary, Planning

**Sri C. Parthasarathi,** IAS
Prl. Secretary Agrl. & Coopn.

**Sri Bhoopal Reddy, IFS (Retd.)**
Spl. Secretary to Hon'ble CM

**Sri Deshapathi Srinivas**
OSD to Hon'ble CM

and

**Sri Yelluri Shiva Reddy**
Vice-Chancellor, Telugu University

**Sri B. Narasinga Rao**
Film Maker

**Prof. Gaddam Bhaskar**
OSD to Hon'ble Speaker

**- Mamidi Harikrishna**
*Director/Editor*
*Dept. of Language & Culture*

